# వేమన్న వెలుగులు




డా.ఎన్.గోపి

# వేమన్న వెలుగులు

వేమన పద్యాలకు
వ్యాఖ్యానం

**డా॥ ఎన్.గోపి**

ప్రచురణ
**శాంతా-వసంతా ట్రస్టు**
హైదరాబాద్
జనవరి 2012

**VEMANNA VELUGULU**
*A Commentary on the Poetry of Vemana*
**by Dr. N. Gopi**


First Edition :
**January, 2012**

Publisher :
**Shantha-Vasantha Trust**



© N. Aruna



Cover Painting :
**Sheela Veerraju**

Cover Design :
**Ramana G.V.**

Price : **Rs. 250/-**

For Copies
**N. Aruna**
13-1/5B, Srinivasapuram,
Ramanthapur,
Hyderabad-500 013
Ph : 040 - 27037585
&
**All Reputed Book Shops**

Printed at
**VIPLA COMPUTER SERVICES**
*(Designers & Multicolour Offset Printers)*
Nallakunta, Hyderabad-500 044.
Phone: 040-27676910, 27677078

# అంకితం



'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అన్నాడు వేమన. డా.వరప్రసాద్ రెడ్డి ఆ పుణ్యపురుషుల కోవకు చెందుతాడు. సమాజానికి ఏదైనా చెయ్యాలనే తపనతో హెపటైటిస్ టీకాను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చాడు. దాని ధరను స్వదేశీపరిజ్ఞానంతో 11 రెట్లు కిందికి దించాడు (రూ.800 నుండి రూ.70కి) దాని కోసం ఆయన రెండు దశాబ్దాలపాటు తపస్సు చేశాడు. చదివింది ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ అయినా అడుగుపెట్టింది జెనటిక్స్ ఇంజనీరింగ్‌లో. ఒకానొక తాత్వికస్థాయిలో అంతా ఒకటే అని గ్రహించడం వల్ల ఆయన బయోఫార్మా రంగానికి వైతాళికుడైనాడు. ఈరకంగా 'పట్టు పట్టరాదు పట్టి విడువరాదు' అనే సంకల్పంతో భారతీయ మేధస్సుకు వన్నె తెచ్చిన తెలుగుతేజం శ్రీ వరప్రసాద్‌రెడ్డి. దేశీయ మూల్యాలతో విశ్వ వీధులను కొలిచి చూపిన వ్యక్తిత్వ సంపన్నుడు. అటువంటి ఈ నిరంతర బాటసారికి వేమన అంటే ఎంతో ఇష్టం! ఆ ఇష్టానికి నా ఈ అక్షర కష్టాన్ని అంకితం చేస్తున్నాను.

అవును! తెలుగు భాషాసాహిత్యాలపై మమకారం తగ్గని ప్రపంచమానవుడు, సంగీతప్రేమికుడు, సౌజన్యమూర్తి. తొలిగురువు అమ్మ పేరిట అంతర్జాతీయ స్థాయిలో శాంతా బయోటెక్నిక్స్ పరిశ్రమను నెలకొల్పిన నిత్యవిద్యార్థి. పాపిరెడ్డి పాళెం నుండి పద్మభూషణుడి దాకా ఎదిగిన ఈ పల్లెబిడ్డకు 'వేమన్న వెలుగులు'ను మనఃపూర్వకంగా సమర్పిస్తున్నాను.

-గోపి

# వేమన్న భావయాత్రలో...

వేమన ఒక తాత్త్విక విజ్ఞాన సర్వస్వం, సకల సామాజికానుభవ స్వారస్యం. వేమన పద్యాలు తెలుగులో ఉండటం వల్ల ఆ తెలుగు మన మాతృభాష అయినందుకు నేనెంతో గర్విస్తున్నాను. రాతిబాటల్లో జాతిరత్నాలు వెదజల్లిన అపురూపమైన మహాకవి వేమన, నీతుల నీరనిధులు పొంగించిన సామాజిక ప్రవక్త. సుదీర్ఘరోగానికి చేదు మందులిచ్చే వైద్యుడిగా, తీరాన్ని గానం చేసే నావికుడిగా వేమన మనకు సాక్షాత్కరిస్తాడు.

నలభైయేళ్ల క్రితం నేను వేమన పైన పరిశోధన ప్రారంభించాను. 35 యేళ్ల క్రితం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి పట్టా పొందాను (1978). అదే కాలంలో **'వేమన్నవాదం'** పేరిట నూటికిపైగా పద్యాలకు సామాజిక దృక్కోణంతో వ్యాఖ్యానం రచించాను. హైదరాబాద్ బుక్‌ట్రస్టువారు దానిని ప్రచురించి పల్లె పల్లెకూ తీసికెళ్లారు. ఆ రోజుల్లో 8 ముద్రణలు పొందడం దాని ప్రాచుర్యానికి గుర్తు. ఈ సందర్భంగా కీ.శే. సి.కె.నారాయణరెడ్డిగారిని స్మరించడం నా కర్తవ్యం.

నేను స్వభావతః కవిని. 1965లో ప్రారంభమైన నా కవితాధార వేమన్నపై పరిశోధన చేస్తున్న రోజుల్లో (1974-78) కాస్త ఆగింది. కాని ఆ నాలుగన్నరయేళ్లలో వేమన్న పట్ల నాకు కలిగిన ఆకర్షణ, ఆయనతో నా అనుబంధం శాశ్వతమైపోయినై.

ఉధృతంగా కాదుగాని అప్పుడప్పుడు వేమనవైపు తొంగి చూస్తూనే వున్నాను. అనంతపురం జిల్లానుంచి క్రీ.శ. 1730లో జెసూట్‌మిషనరీలు ప్యారిస్‌కు పంపించిన వేమన పద్యాల ప్రతిని కింగ్స్ లైబ్రెరీ నుంచి తెప్పించి, సముద్ధరించి, పరిష్కరించి, వేమన పరిశోధన సమయంలో తాళపత్రాల్లోంచి నేను ఎత్తి రాసుకున్న సుమారు

పదిహేను వేల పాఠాంతరాల్తో ఉన్న మూడువేల పద్యాలతో వాటిని సరిపోల్చి చూసి 7 కొత్త పద్యాలను వెలికితీసి చూపాను. ఈ పనికి పదేళ్లు పట్టింది. ఈ చాకిరీలో నా శ్రీమతి అరుణ చేసిన యోగదానం సదా స్మరణీయం. ప్యారిస్ ప్రతిలో వేమనపద్యాల పరిష్కరణకు సంబంధించిన ఒక విధానానికి (Methodology) సంబంధించిన ప్రక్రియపైన కొంత చర్చ జరిగింది. దీనికి ఆరుద్రగారు గొప్ప పీఠిక రాశారు. వేమనపైన నేను చేసిన పనికి **'వేమనగోపి'** అనే ప్రసిద్ధి లభించింది. ఈ పేరుతో నన్ను మొదటిసారి సంబోధించినవాడు దేవిప్రియ.

ఎప్పటికైనా వేమన పద్యాల పాఠాంతరాల ప్రతినీ (Variorium Edition) ఆ తర్వాత పద్యనిర్ణయ ప్రతినీ (Definitive Edition) తయారుచేసి **"వేమన పద్య సర్వస్వం"** అనే బృహద్గ్రంథం తేవాలనేది నా కల. కాని చూస్తుండగానే అరవైయేళ్లు దాటాయి. ఆలోచనలకు బద్ధకం రాలేదు గాని ఒంటిచేతి పరిశ్రమకు కావలసిన శక్తి కాస్త తగ్గుతున్నట్టు తెలిసిపోతూనే వుంది. అయితే నా సిద్ధాంతవ్యాసంలో గాని, ఈ వ్యాఖ్యానగ్రంథంలో గాని ఆ మెథడాలజీకి కావలసిన ప్రాతిపదికకు పునాదులు ఏర్పడ్డాయని మాత్రం చెప్పగలను.

సాక్షి ఫన్‌డే వారు, వేమన పద్యాలను గురించి రాయమని అడిగారు. అధ్యయన తీవ్రత దృష్ట్యా కొంత తటపటాయించాను గాని వారి సామాజిక బాధ్యతను గుర్తించి తలఊపక తప్పలేదు. 10, ఆగస్టు 2008 న ప్రారంభమైన **'వేమన్న వెలుగులు'** శీర్షిక 28 ఆగస్టు 2011 సంచికతో ముగిసింది. అంటే మూడేళ్లపాటు నిర్విరామంగా నడిచింది. వేమన పద్యాలను గురించిన ఏ వ్యాసంగానికైనా ముగింపు ఉంటుందని నేననుకోను. అది అనంతమైన సముద్రం. కడవను బట్టి నీళ్లు. మూడున్నర దశాబ్దాల క్రితం, **వేమన్నవాదం, ప్రజాకవివేమన, వ్యాసనవమి, వేమన పద్యాల ప్యారిస్ ప్రతి,** ఈ గ్రంథాలపైన నా కృషి అంతా 35 యేళ్ల వయస్సులోపే జరిగింది. *(అయితే వ్యాసనవమి 1986లో, ప్యారిస్ ప్రతి 1990లో అచ్చయినాయి)* ఇప్పుడు నా వయస్సు 62. అయినా తాజా ఆలోచనల్తో, వయస్సు వల్ల పెరిగిన కొంత పరిణతితో మళ్లీ పూనుకున్నాను. దాదాపు పదకొండు వందల రోజులు వేమన్న వెలుగులు తెలుగు వాకిళ్లలో ముగ్గులై పూశాయి. వేలాదిమంది పాఠకులను అలరించాయి. ఏ ఊరు వెళ్లినా వేమన్న వెలుగుల ఊసే. విద్యాలయాల్లో తెలుగుకు వెలుగు తగ్గుతున్నదని

ఎందరో వాపోతున్న రోజుల్లో ఆ శీర్షికకోసం ఉపాధ్యాయులూ, విద్యార్థులూ ప్రతివారం ఎదురుచూస్తున్నారని తెలిసి ఎంతో ఉత్సాహం పొందాను. దానికి కారణం వేమన్న గొప్పతనమే. నాలుగు దశాబ్దాలుగా వేమన్నను వ్యాసంగంగా చేసుకున్న క్రమంలో నాకర్థమైందేమిటంటే వేమన్నలాంటి కవి ప్రపంచసాహిత్యంలోనే అరుదని. నేటి వ్యాపార ప్రపంచంలో ఇట్లాంటి సాహిత్య, తాత్త్విక, సామాజిక శీర్షికను మూడేళ్లపాటు నడపడం అంత సులభం కాదు. అందుకు సాక్షి ఫన్‌డే సంపాదకుల ధైర్యాన్ని మెచ్చుకుంటున్నాను. ముఖ్యంగా, ప్రియదర్శిని రామ్‌రెడ్డికీ మరీ ముఖ్యంగా ఫన్‌డే ఇన్‌చార్జ్ పూడూరి రాజిరెడ్డికీ నా అభినందనలూ ఆశీస్సులు అందజేస్తున్నాను.

వేమన్న ఆశుకవి, ఆయన పద్యాలు ఆయన నోటి నుంచి ఆయన అభిమానుల లేదా శిష్యుల చెవుల్లోకి, వారి హృదయాల్లోంచి తాటాకుల్లోకి ప్రవహించాయి, ఇదొక దశ.

సి.పి. బ్రౌన్ తాళపత్ర గ్రంథాలను సేకరించి వాటికి కాగితం ప్రతులను పత్రికలుగా రాయించాడు. ఈ ప్రక్రియలో వేమన పద్యాలు కొన్ని మార్పులకు లోనయి ఉంటాయి. బ్రౌన్ పర్యవేక్షణ ఉంది కాబట్టి అవి స్వల్ప సంఖ్యకు పరిమితమై ఉంటాయి. అది రెండో దశ.

ఇక మూడోదశ. ఇది అచ్చు పుస్తకాల దశ. ఈ దశలోనే వేమన పద్యాల్లో పలు ఇతర పాఠాలు చొరబడి ఉంటాయి. భారతదేశంలాంటి సంక్లిష్టమైన దేశంలో లేఖకులు, ముద్రాపకులు తమ సొంత భావాలతో చేయి చేసుకోవడం సర్వసాధారణం. నేను ఆనాడే నా సిద్ధాంతవ్యాసంలో కొన్నింటిని ఎత్తి చూపించాను కూడా. కాబట్టి ఈ పద్యాలకోసం బ్రౌన్ సేకరణలమీదే ఎక్కువగా ఆధారపడ్డాను. నకిలీపద్యాల వాతావరణంలో 'చొక్కపు' పద్యాలను యేరటానికి వాటి ప్రాచీనతను కూడా ఒక ప్రాతిపదికగా చేసుకున్నాను. (ప్రాచీన ప్రతి క్రీ.శ. 1691). అలాగే 1829, 1839లలో బ్రౌన్ ఆంగ్లంలోకి అనువాదం చేసి ప్రచురించిన సంకలనాలు కూడా నాకెంతో ఉపకరించాయి. నా పరిశోధన కాలంలో ఆ రోజుల్లో మద్రాసు ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్టు లైబ్రేరీలో కూచొని 15వేల పాఠాంతరాల్తో 3 వేల పై చిలుకు పద్యాలను ప్రతిరోజూ 6 నెలలపాటు చేత్తో ఎత్తిరాసుకున్నాను. ఇప్పటిలాగా జెరాక్స్‌గానీ,

మైక్రోఫిల్మ్ సౌకర్యంగాని అంతగా అందుబాటులో లేని రోజులవి. మూడువేల వేమన పద్యాలను మూడువేల కార్డుల మీదికెక్కించినప్పుడు కలిగిన తృప్తి అంతా ఇంతా కాదు. ఆ కార్డులు పేర్చిపెట్టిన అమూల్యమైన దారుపేటిక ఇప్పటికీ మా ఇంట్లో భద్రంగా ఉంది. మా ఆవిడతో సరదాగా అంటుంటాను 'నేను నీకు మిగిల్చే ఆస్తి ఇదే' అని.

ఈ గ్రంథంలో 428 పద్యాలకు వ్యాఖ్యానం రాశాను. ఇవి జాగ్రత్తగా ఎంపిక చేసిన పద్యాలు. వేమన్న మూడువేల పద్యాలలోని ముఖ్యమైన భావాలన్నింటికీ ప్రాతినిధ్యం వహించే పద్యాలు వీటిలో ఉన్నాయి. ఆ రకంగా వేమన్న భావజాల సమగ్రతను దృష్టిలో పెట్టుకున్న సంకలనమిది. ఇన్ని పద్యాలకు రాయాలని అనుకోలేదు. మూడు సంవత్సరాలు కాగానే ఆపేశాను.

వేమన పద్యాలను తొలిసారి వర్గీకరించింది (classification) సి.పి.బ్రౌనే. **'వేమన జ్ఞానమార్గపద్యములు, చిల్లర పద్యములు'** ఇట్లాగ. (కాకినాడలో దొరికిన 185/9 నెంబరు తాళపత్ర గ్రంథంలో **"వేమన విరక్త పద్యాలు, లోకనీతి పద్యాలు"** అని ఉంది కాని అది బ్రౌన్ కన్న ముందటి ప్రతి అనే దాఖలాలు లేవు). వావిళ్ల వారి సంపుటిలో భర్తృహరి సుభాషితములులోలాగ **మూర్ఖపద్ధతి, దాంభికపద్ధతి** అంటూ 16 పద్ధతులుగా విభజించారు. నేను సేకరించిన దాదాపు నూరు అచ్చుపుస్తకాల్లో కూడా దాదాపు ఇటువంటి వర్గీకరణలే వుంటాయి. మరికొందరు **కూట వేదాంతపద్ధతిని** కూడా చేర్చారు. వావిళ్లవారు **సంకీర్ణ పద్ధతి** అని అనడానికి ముందే బ్రౌన్ **చిల్లర పద్యాలు** అన్నాడు. అంతేకాదు వెంటనే అర్థంకాని **తాత్త్విక పద్యాలను మార్మిక పద్యాలు** అని పిలిచాడు. విషయమేమిటంటే వేమనపద్యాలు వర్గీకరణకు అంత తొందరగా లొంగవు. కారణం వాటి అర్థాలు బహుముఖీనంగా పరుగులు తీస్తాయి.

అపారమైన వేమన పద్యసంచయంలో వేమన పద్యాలేవి? కానివేవి? అనే చర్చ మొదటి నుంచీ వుంది. వాటి నిరూపణకు నా సిద్ధాంత వ్యాసంలో కొన్ని ప్రమాణాలను పేర్కొన్నాను. తదనుగుణమైన పద్యాలను మాత్రమే ఈ గ్రంథంలో స్వీకరించడం జరిగింది. ఆ కారణంగానే వేమన పద్యాల్లోని 'వేమ' మకుటంతో వున్న కందపద్యాలను ఈ సంకలనంలో గ్రహించడం జరగలేదు.

అలాగే కొన్ని పద్యాలకు దొరికినకాడికి పాఠాంతరాలను పేర్కొన్నాను. దానివల్ల ముందు ముందు కొంత పాఠ నిర్ణయచర్చకు ఆస్కారం కలుగుతుందని నా ఉద్దేశం.

వేమన తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా నేటి తమిళ, కర్ణాటక ప్రాంతాల్లో కూడా పర్యటించాడని పద్యాల్లోని అంతరంగ సాక్ష్యాలనుబట్టి తెలుస్తుంది. అందుకని వేమన్న వాడిన తెలుగు మాటలకు అర్థాలు చెప్పే సందర్భంలో సమానార్థకాలైన ఇతర ద్రావిడభాషా పదాల ప్రసక్తిని తేవడం జరిగింది. దానికి ఆంధ్రాయూనివర్సిటీ వారు వెలువరించిన 'తెలుగు వ్యుత్పత్తిపదకోశం' ఎంతో ఉపయోగపడింది. అలాగే సందర్భానుసారంగా ఆయా కావ్యాల్లోంచి పేర్కొన్న ప్రయోగాలకు రెఫరెన్సులు ఇవ్వడం జరగలేదు. కారణం స్థలవిస్తరణ నిరోధ దృష్టి కొంత, వాటి మూలాలు కనుక్కోవడానికి యువతలో కొంత ఆసక్తి జనిస్తుందనే ఆశ కొంత.

ఈ పద్యాలను అచ్చువెయ్యటంలో అకారాదిక్రమాన్ని పాటించాను. అంతకుముందే పద్యాలు తెలిసిన వారికి వాటిని వెతుక్కోవటం సులభమౌతుంది. ఇక గ్రంథం చివర పేజీనెంబర్లతో సహా విషయసూచిని ఇచ్చాను. పద్య సమూహాలతో విషయ విభజన కంటే ప్రతిపద్యంలో ఏముందో ఇవ్వడం బాగుంటుందని నాకనిపించింది.

నా అదృష్టమేమిటంటే సుమారు నాలుగు దశాబ్దాల్లో ఒకే విషయంపైన నేను రెండు తరాల పాఠకులను ఉద్దేశించి రాశాను. ఈ వ్యాఖ్యానానికి ఎక్కువగా నేటి యువతరాన్ని దృష్టిలో పెట్టుకున్నాను. కాబట్టి మొదటినుంచి నా వ్యాసంగాన్ని శ్రద్ధగా గమనిస్తున్నవారు నా చూపులోని పరిణామాన్ని పరికించవచ్చు.

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ప్రకాశమాన ఘట్టం ఏమిటంటే మహాకవి సినారె ప్రతివారం ఈ శీర్షికలోని పద్యాలను చదివి ఫోన్‌చేసి ఉత్సాహపరచడం, అంతేకాదు నేను కొత్తగా చెప్పాననుకున్న విషయాలను గుర్తుపట్టి వెన్నుతట్టడం. ఇది నేనెప్పటికీ మర్చిపోలేని ఆశీఃపూర్వక సందర్భం.

నా స్ఫూర్తిని అర్థం చేసుకొని నిండుమనస్సుతో అంకితానికి అంగీకరించిన డా॥ వరప్రసాద్‌రెడ్డి గారికి నా నమస్కారాలు.

అట్లనే సంప్రదాయాలకు సంబంధించి సందేహాలు ఎదురైనప్పుడు వెంటనే ఫోన్‌లో స్పందించి వాటిని తీర్చిన విద్వాంసులు నలుగురున్నారు. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, డా॥ శ్రీరంగాచార్య, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య భాగ్యనారాయణ (ఉస్మానియాలో వృక్షశాస్త్ర ఆచార్యుడు) వారికి నా కృతజ్ఞతలు.

మా ఇంటి రెండో అంతస్థులో పన్నెండు వేల పుస్తకాలతో నేను నెలకొల్పిన 'వేమన విజ్ఞాన మందిరం' లైబ్రెరీలో పెట్టుకోడానికి ఆత్మీయులు శీలా వీర్రాజు గారు వేమన పెయింటింగ్‌ను వేసిచ్చారు. దానినే ఈ గ్రంథానికి ముఖచిత్రంగా వాడుకోవటం జరిగింది. వారికి నా ధన్యవాదాలు. అలాగే డిజైనింగ్ చేయి వేసిన ప్రియమిత్రుడు రమణజీవి గారికి శుభాకాంక్షలు.

గ్రంథ ముద్రణలో చేదోడుగా నిలిచిన చిరంజీవి ఎం. నారాయణశర్మకు నా ఆశీస్సులు.

ఇంకా ఈ మొత్తం ప్రయాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రేరణగా నిలిచిన వారందరికి నా కృతజ్ఞతలు.

**– గోపి**

**అంకిలెరిగి మాటలాడ నేర్చినపుడె**
**పిన్న పెద్ద తనములెన్న నేల?**
**పిన్నచేతిదివ్వె పెద్దగా వెలగదా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సందర్భమెరిగి మాట్లాడగలిగినపుడు వయస్సులో చిన్నవాడా పెద్దవాడా అని చూడకూడదు. చిన్నవాడయినా కొట్టిపారెయ్యగూడదు. ఎందుకంటే కుర్రవాడి చేతిలోని దీపం కురుచగా వెలుగుతుందా? పెద్దగా వెలగదా? అని ఎదురు ప్రశ్నిస్తున్నాడు వేమన. జ్ఞానానికి వయస్సుల తారతమ్యంతో పని లేదు. జ్ఞానం జ్ఞానమే.

అంకిలి అంటే అర్థాలకు కొదువలేదు. శోకం, దుఃఖం అని ఒకచోట, అంకిలి తేరటం అంటే దుఃఖోపశమనం అని మరోచోట. ఈ పద్యంలో ఈ అర్థాలు పొసగవు. ఆపద, ఆటంకం, భంగం అంటూ మరికొన్ని అర్థాలున్నాయి. వీటిని అటూ ఇటూగా వర్తింపజెయ్యొచ్చు గాని వీటిని పరాస్తం చేస్తూ సరిపొయ్యే మరో అర్థముంది చూడండి. ఇక్కడ అంకిలి అంటే కిటుకు, కీలు, మర్మం. సన్నివేశం యొక్క సారాంశం తెలుసుకొని మాట్లాడేవాడు పసివాడయితేనేం ముసలివాడయితేనేం, విషయం కదా ముఖ్యం! అంటున్నాడు వేమన.

ఇక పిన్న అంటే ఏమిటి? చిన్న అనే. పిన్నటి అంటే చిన్న అని. పిన్నతనం అంటే బాల్యం. 'పిన్నాపెద్దా విచారించి మాట్లాడండి' అంటే యోగ్యతా యోగ్యతలను గమనించండి అని. పెద్దదంతా యోగ్యమనీ, పిన్న అయోగ్యమని తోసిపారెయ్యొద్దంటున్నాడు. తెలివికీ, తెలియజెప్పటానికీ చిన్నాపెద్దా లెక్కకు రావలిసిన అవసరం లేదు. అనువెరిగి మాట్లాడేవాడు మెరుపులా ఆలోచించేవాడు యువకుడైనా వృద్ధుడైనా ఒకటే.

ఇక దివ్వె అంటే దీపం. దివి అంటే కూడా దీపమే. దివి నుండే దివాలి, అంటే దీపావళి వచ్చింది. దీపాలవరుస అన్నమాట. ఇక చేతిలో దీపం అంటే కరదీపిక. కాగడా అని కూడా అనుకోవచ్చు.

సందర్భమెరిగి మాట్లాడే నేర్పు కేవలం వయస్సుతోనే రాకపోవొచ్చు. తెలివితేటల వల్ల వస్తుంది. ఎవరు చెప్పారనేది కాదు ఏం చెప్పారనేది ముఖ్యం. అంతేకాదు ఎలా చెప్పారనేది కూడా. చిన్నవాడి చేతిలో జ్ఞానదీపం ఉన్నట్టయితే వాడు పెద్ద వాడి కిందే లెక్క అని వేమన ఈ పద్యంలో కొత్తవెలుగును ప్రసరిస్తున్నాడు.

**అండదప్పి నరుడు అతి దీన నరునొద్ద**
**చేరరాదు గాక చేరెనేని**
**పూరిపుడకనైన బూది పాలుగ జేసు**
**విశ్వదాభిరామ వినురవేమ**

మానవుడు కష్టకాలంలో తన నెలవును వదులుకొని ఎవరో పరమ దరిద్రుని పంచన చేరగూడదు. చేరితే ఏమవుతుంది? గడ్డిపోచపోయి కాలుతున్న బూడిదలో పడ్డట్టవుతుంది అంటున్నాడు వేమన.

అతడు ఆసరాలేకుండా వున్నాడు, ఆదరువు తప్పి ఉన్నాడు. అతడికి ఆశ్రయం కావాలి, ప్రాపు కావాలి. ఎవరి సహాయం కోరాలి? ఎక్కడి కెళ్లాలి? ఎక్కడికైనా వెళ్లొచ్చు గాని *'అతి దీనుని'* వద్దకు మాత్రం వెళ్లొద్దు. దీనుడంటే దుఃఖితుడు, దయనీయంగా వున్నవాడు. తన పరిస్థితులవల్ల వాడు నీచుడు కూడా కావొచ్చు. ఎదుటివాడి విలువ తెలిసినవాడు కాకపోవచ్చు. అతడు అండదప్పి అల్లల్లాడుతున్నాడు, తృణప్రాయంగా వున్నాడు. అట్లాంటప్పుడు వాడి పొందు కోరితే గడ్డిపోచ వెళ్ళి కాలుతున్న బూడిదలో పడ్డట్టు దగ్ధమైపోతాడు అని తాత్పర్యం.

పూరి అంటే గడ్డి, పుడక అంటే పుల్ల లేక పోచ. *"పుట్టుకతో వచ్చింది పుడకలతో గాని పోదు'* అని సామెత.

కష్టకాలంలో ధార్మికులను చేరితే ఫలం, సజ్జనులను ఆశ్రయిస్తే ప్రయోజనం. గొప్పవాడిని యాచించటమనేది వరం లాంటిది. అధమున్ని యాచించటం అధమత్వం. *'తంతే బూరెల బుట్టలో పడ్డట్టు'* అంటారు. అంటే అది అదృష్టం. ఇక్కడ మరీ దురదృష్టమని సారాంశం. బూది అంటే బూడిద. *"బూది పాలుగ జేయు"* అంటే కాల్చేస్తుంది అని అర్థం.

**అంత కొరత దీరి అతిశయకాముడై**
**నిన్ను నమ్మి చాల నిష్ఠతోడ**
**నిన్ను గొల్వముక్తి నిశ్చయముగ కల్గు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు అప్పటివరకు గల తప్పులన్నీ తెలుసుకున్నాడు. నీపట్ల నిండైన కోరికతో ఉన్నాడు. సంపూర్ణమైన విశ్వాసంతో వున్నాడు. అంకితభావంతో నిన్ను కొలుస్తున్నాడు. అటువంటప్పుడు అతనికి ముక్తి లభించకుండా ఎట్లా వుంటుంది? తప్పకుండా లభిస్తుంది అంటూ ఆత్మ సాక్షాత్కారానికి కావలసిన గుణాల గురించి చెప్తున్నాడు వేమన.

కొరత అంటే వెలితి, లోటుపాట్లు. ఎటువంటి లోపాలూ, పాపాలూ లేకుండా, ఉన్నా తొలగించుకొని అని అర్థం. 'అతిశయకాముడై' అంటే అతిశయించిన, అంటే ఎక్కువైన కోరికతో అని. నిష్ఠ అంటే నియమపాలన. నిష్ఠ అంటే యోగనిష్ఠ కావచ్చు లేదా బ్రహ్మమును తప్ప ఇతరాలను ఉపాసించగూడదనే నిబద్ధతా కావొచ్చు. ముక్తి అంటే ఇంద్రియాలనుండి ఆత్మ విడిపడిపోవటం, భయము లేని స్థితి. ఇంత సాధనా సంపత్తి ఉన్నప్పుడు అతనికి ముక్తి తథ్యం అంటున్నాడు వేమన.

**అంతరంగమందు అద్వైతియై యుండు**
**బాహ్యమందు ద్వైత భావియగును**
**అట్లుగాక తత్త్వమలవడ నేరదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మన దేశంలో చాలాకాలంగా వ్యాప్తిలో వున్న సిద్ధాంతాలు రెండు. ఒకటి ద్వైతం రెండోది అద్వైతం. ద్వైతం అంటే రెండు. అద్వైతం ఒకటి.

బ్రహ్మ ఒక్కటే సత్యం. అతడే సృష్టికర్త. గుణాలతో నిండివుంటాడు. రక్షిస్తాడు, ఇష్టం వస్తే ధ్వంసిస్తాడు కూడా. అతని దయ వల్లనే బంధవిముక్తి కలుగుతుంది. అదే మోక్షం. ద్వైతులు సగుణవాదులు వీరిని బ్రహ్మవాదులని కూడా అంటారు.

ఇక అద్వైతం. చరాచర ప్రపంచమంతా మిథ్య. బ్రహ్మకు కూడా ఒక్కోసారి మాయ అవరించడం వల్ల వేరువేరు గుణాలు కలిగినట్లు అనిపిస్తుంది. అందువల్ల అది సగుణం కాదు నిర్గుణమే. నేనే బ్రహ్మను అనే జ్ఞానంతో ధ్యానం చేస్తే కలిగే అనుభవమే మోక్షం.

అతడు 'నేను అద్వైతిని అద్వైతిని' అని అంటూంటాడు. కాని అది 'అంతరంగం' వరకే. అంటే సిద్ధాంతం వరకే. బాహ్యమందు అంటే ఆచరణలో అని అర్థం. భావి అంటే తరువాత అని. అనుకోడానికి అద్వైతియే అయినా అనంతరం అంటే ఆచరణలో అతడు ద్వైతుడే అని సారాంశం.

అనుకోవడం ఒకటి ఆచరించడం మరొకటి అయితే అది తప్పుకదా! నిజానికి అది తప్పుకాదు, పరిస్థితి అట్లా వుంది. అట్లా అయితేనే తత్త్వం సిద్ధిస్తుంది కదా! అంటున్నాడు వేమన.

అద్వైతాన్ని అనుభవపూర్వకంగా సంపాదించడం సామాన్యులకు సాధ్య మయ్యేపని కాదు. సగుణోపాసన వల్లనే దానికి కావలసిన ఓర్పు, దృఢత్వం లభిస్తాయి. సగుణోపాసన నిర్గుణోపాసనకు దారితీస్తుంది. సగుణం లేకుండా ముందే నిర్గుణాన్ని ఆశ్రయిస్తే అది ఎట్లా వుంటుందంటే అడుగుపోయిన కుండలో నీళ్లు గుమ్మరిస్తే ఎట్లా వుంటుంది? అట్లా.

కాబట్టి ఆచరణలో అద్వైతులున్నారా అనేది అనుమానమే, ఒకవేళ ఉన్నా వారు కూడా ద్వైతులు పాటించే పూజలు, ఉత్సవాలు మొదలైనవన్నీ చేస్తున్నారు. సగుణోపాసన

అంటే ఇదే. నిర్గుణం దాని పై స్థాయి.  ఈ మెట్టు దొరకనిదే ఆ మెట్టు అందదు అని తాత్పర్యం.

ఎంతో గహనమైన విషయాలను కూడా వేమన్న ఆలవోకగా చెప్తాడనడానికి ఈ పద్యం నిదర్శనం. ఇట్లాంటివి వివరించడానికి కేవలం శాస్త్ర పాండిత్యం చాలదు. లోనికి వెళ్లిన అనుభవయోగులకే అది సాధ్యం. అందుకే వేమన్న ఒక విశిష్టమైన యోగి. సామాన్య ప్రజల యోగి.

*తలప తలప ముక్తి తగులుగాక/బాహ్యరంగమందు భాషింప నేలయా (డి. 1723, 600); బాహ్యమందు శివుని పాటించి నిలుచురా (డి. 1725, 281); అంతరంగమందు అభవునుద్యోగించి... బాహ్యరంగమందు బాధింప నిలుచునా (డి. 1769, 932) నిలుప నిలుపచూడ్కి నిలుచుగాక (డి. 1727, 18) అనేవి పాఠాంతరాలు.*

**అట్టి కష్టు బతుకు అగ్నిపాలైపోవు**
**నిర్దయాత్ము బతుకు నీటగలియు**
**క్రూరకర్ము బతుకు చోరుల పాలౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చెడ్డవారికి చెడ్డ ఫలితాలే వస్తాయి. వారికి పర్యవసానం దారుణంగా వుంటుంది సుమా! అని శపిస్తున్నాడు వేమన.

అతడు నీచుడు, ఆస్తి సంపాదనకోసం ఎంతటి నీచానికైనా పాల్పడతాడు. చివరికేమవుతుంది? అది పరశురామ ప్రీతిగా మారుతుంది; అతనికి దయలేదు, దానగుణమసలే లేదు. పిల్లికి కూడా బిచ్చం పెట్టడు. చివరికేం మిగుల్తుంది? ఉన్నదంతా వరద పాలవుతుంది; అతడు క్రూరుడు, అతని కర్మలూ క్రౌర్యపూరితములే. ఆఖరికెట్లా పరిణమిస్తుందంటే దౌర్జన్యంగా ఆర్జించిన సొమ్మును దొంగలు కొల్లగొట్టి తీరుతారు అని వేమన్నవాక్కు.

*'అట్టి కష్టు(డు)'*, అని ఎత్తుకోవటంలోనే వుంది. అట్టి అంటే వర్ణింపశక్యం కాని అని. కష్టుడు అంటే నీచుడు. వేమన్న ఈ పదాన్ని ఈ అర్థంలో తరచుగా వాడతాడు. కష్టుడు అంటే కష్టపడే వాడు అని కాదు. వేమనే మరోచోట ఓ పద్యంలో ఇలా ప్రయోగించాడు.

*'మంచి వారు లేరు మహిమీద వెదకిన*
*కష్టులెందరైన కలరు భువిని*
*పసిడి లేదు గాని పదడెంత లేదయా!'* అని

మంచి వాళ్లెంత స్థిరమైన వారో కష్టులంత చంచలమైన వారు. వారు పదడుతో సమానం. పదడు అంటే దుమ్ము, చెత్త అని అర్థం.

నీచత్వం, దయాహీనత, క్రూరత్వం వంటి దుర్గుణాలకు ఎదురయ్యేవి దుష్ట ఫలితాలే. సత్ఫలితాలు రావాలంటే సత్కార్యాలు చెయ్యాలనేది సారాంశం.

**అడవి తిరుగ లేదు ఆకసమున లేదు**
**అవని తీర్థయాత్రలందు లేదు**
**ఒడలు శుద్ధి జేసి ఒడయుని చూడరా**
**విశ్వదాభి రామ వినురవేమ.**

పవిత్రత ఎక్కడుంది? దుర్గమమైన అరణ్యంలో తిరిగితే దొరకదు. అత్యున్నతమైన ఆకాశానికి ఎగబాకితే అందదు. పలు తీర్థస్థలాలకు వెళ్లివస్తే ఒనగూడదు. ముందు శరీరాన్ని శుద్ధిచేసుకుంటే మనసు శుద్ధి కదే ప్రారంభమౌతుంది.

అడవిలో సిద్ధులుంటారు, గురువులుంటారు. వారు కరుణిస్తే మోక్షమార్గం తెలియవచ్చు. అది అడవి ప్రభావమేకాదు గురువు ప్రభావం కూడా. ఊరికి దూరంగా వున్నంత మాత్రాన అడవి గొప్పది కాదు. అడవిలో పశు పక్ష్యాదులు కూడా వున్నాయి కదా! మరి వాటికి పవిత్రత సిద్ధించలేదేమి?

ఇక్కడ ఆకాశమంటే ఎత్తైన ప్రదేశం. హిమాలయాలు కావొచ్చు. ఆకాశంలో వుండే చుక్కలు పావనమైనాయా? పక్షి రాజైన గరుత్మంతుడు ఆకాశానికి అంటే స్వర్గానికెగిరి అమృతం పట్టుకొచ్చాడు. మోక్షమంటే చావులేక పోవడమే కాదు, బంధవిముక్తిని పొందడం కూడా.

ఇక తీర్థస్థలాల్లో స్నానాలు చేస్తే ఒడలి మురికిపోవచ్చు గాని మనసు సంగతేమిటి? నీటి ఒడ్డున ఉండేవి తీర్థాలు, కొండలపై ఉండేవి క్షేత్రాలు. ఎంతటి నేరం చేసినవాడయినా పుణ్యస్థలంలో దొరికితే పట్టుకోగూడదని క్యాథలిక్ సిద్ధాంతం.

ఇదంతా వొట్టిదంటున్నాడు వేమన. ఇటువంటి నానా అవస్థలవల్ల ప్రయోజనం లేదు. ముందు శరీరశోధన చెయ్యి. ఆపైన సమాధిమగ్నుడవుకా. అప్పుడు జరుగుతుంది ఆత్మసాక్షాత్కారం. ఇక్కడ ఒడయుడు అంటే పరబ్రహ్మం, ఆత్మే పరమాత్మ. “ఒడలి సమత విడిచి ఒడయుని చూడరా” (డి.1723, 445) అనేది పాఠాంతరం.

**అదనెరిగిన మగువ అనువెర్గు చనువెర్గు**
**ముదముతోడ మగని మోహమెరుగు**
**విభుని శ్రేష్ఠగుణము వేశ్యతానెర్గునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యుక్త సమయం తెలిసిన భార్యకు భర్తతో సన్నిహితంగా గడపడానికి అనుకూలమైన తరుణమేదో తెలుస్తుంది. ఉల్లాసంతో అతనిలో మొలకలెత్తే శృంగారకాంక్షను పసికడుతుంది. వేశ్యది ధనదృష్టికదా విభున్ని కూడా విటుడిగానే చూస్తుంది. అతనిలోని మంచి లక్షణాలు ఆమెకు అనవసరం అంటున్నాడు వేమన.

వేమన్న జీవితం వేశ్యాలోలత్వంతో ముడివడిన ఐతిహ్యాలు లోకంలో ఉన్నాయి. వాటిలోని నిజానిజాలు చరిత్రకందినా అందకపోయినా వేమనపద్యాల్లోని వేశ్యల ప్రసక్తి ఆయన లోకజ్ఞతకు నిదర్శనంగా నిలుస్తుంది. కులకాంతకు భర్త స్వభావం స్పందనలు తెలిసి వుంటాయి. అతని వలపువేళలు కూడా ఆమెకవగతమే. అవి ఆమెకు ఇష్టం కూడా. అందుకే అదనెరిగి సమయాన్ని గమనించి అనుకూలంగా ప్రవర్తిస్తుంది. అనువు అంటే ఆనుకూల్యం. 'అనువుగానిచోట' అని వాడాడు వేమన్నే మరోచోట. 'మీకుగాక *జలసంచారంబనువగునే మముబోలిన వనచరులకు'* అని ప్రయోగం. చనువు అంటే ఎక్కువ సాన్నిహిత్యం. ప్రేమ, అనురాగం అని కూడా. 'చనువెరుగు' అంటే సమయాసమయాలు తెలుసుకోవడమనే.

మగువ అంటే స్త్రీ, ప్రియురాలు అని కూడా. ఇది అచ్చమైన ద్రావిడపదం– కన్నడంలో 'మగళ్‌మా' అంటే భర్తకు నమ్మకస్తురాలైన భార్య. తమిళంలో 'మకటు, మకటావు' అంటే స్త్రీ లేదా భార్య.

ముదం అంటే సంతోషం, హర్షం. ముదశ్రులు (ముత్+అశ్రులు) అంటే ఆనందబాష్పాలు. 'ముదముతోడ' అనటం వల్ల భర్తమోహం ఆమెకెంతో ఇష్టమైనది అని. వెలయాలి లాగ ఆమెకు ధనదృష్టి ఉండదు. ఉంటే గింటే అది నిజమైన దాంపత్యం కాదు, అదీ వ్యభిచారమే. ఇష్టమనేది కీలకమైన మాట.

మగడు అంటే భర్త, పెనిమిటి అనే కాదు పురుషుడు అని కూడా. కర్మధారయం లో ఉత్తరపదంగా వచ్చేటప్పుడు శ్రేష్ఠవాచకమవుతుంది. ఉదాహరణకు *దండిమగడు.*

విభుడు అంటే ప్రభువు, యజమాని. అందుకే బ్రౌన్ Lord అనే మాట వాడాడు.

పణ్యాంగనలను నిబాయించగలిగిన శక్తి ధనవంతులకే వుంటుందని తాత్పర్యం. వేశ్య వారి డబ్బునే చూస్తుంది గాని వారి సుగుణాలను (ఒకవేళ ఉంటే) పట్టించుకోదు అనేది లోకసాధారణం. వేమన్న అదను, మగువ, అనువు, చనువు, ముదము, మగడు వంటి దేశీయపదాలను విరివిగా వాడాడు. చిన్నగా కనిపించే పదాలే. అర్థం దృష్టిలో మాత్రం చిన్నవికాదు. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ముఖ్యం, డబ్బు కాదని ఈ పద్యంలోని సారాంశం.

**అధికమైన యజ్ఞమల్పుండు తాజేసి**
**మొనసి శాస్త్రము విడి మురువు దక్కు**
**దొబ్బ నేర్చు కుక్క దుత్తలు మోసునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శాస్త్రాలు విధించిన దీక్షలూ నియమాలను పాటించక విశేషమైన యజ్ఞానికి పూనుకునేవాడు నిజంగా అల్పుడే. దానివల్ల ఉద్దేశించిన ఫలితం రాదు. పైగా ఉన్న సంతోషం కూడా పోతుంది. ఇదెట్లా వుంటుందంటే పాలకుండలను పడదోసిన కుక్క వాటిని జాగ్రత్తగా ఎత్తుకొని తీసికెళ్లలేనట్టు. ఎవరు చెయ్యగలిగిన పనిని వారు చేస్తే మంచిదని సారాంశం.

యజ్ఞమంటే ఏమిటి? ఏమిటంటే వైదికకర్మల నిర్వాహకులు సంఘ శ్రేయస్సుకోసం జరిపే ఒక క్రియ. వర్షాలు పడటం కోసం వారుణయజ్ఞమనీ, రక్షణకోసం సుదర్శన యజ్ఞమనీ, ఇంకా శాంతియజ్ఞాలని ఇలా ఎన్నో యజ్ఞాలున్నాయి. వీటిని విద్యుక్తంగా చేస్తారు. యజ్ఞం చేసే వారిని యజ్వ అంటారు. వృత్తిధర్మంగా ఉన్న వాళ్లయితే పద్ధతిగా చేసే వీలుంటుంది. ఇవేవీ తెలియని అల్పజ్ఞుడు చేస్తే ఆ యజ్ఞఫలం రాకపోగా యజ్ఞానికి కూడా అల్పత్వం వస్తుంది.

అధికమైన అంటే విలువైన, సమర్థమైన అని. అంటే మామూలు యజ్ఞం కాదని. మొనసి అంటే పూనుకొని. మురువు అంటే చక్కదనం, విలాసం, కాంతి అని అర్థాలు. తెలియని దానిలో వేలు పెట్టకపోతే మురువన్నా దక్కుతుంది, చేస్తే అదీ పోతుంది అని. మురువు అంటే సంతోషం.

దొబ్బు – అంటే తోయటం. తెలంగాణా రాయలసీమ భాషల్లో ఎక్కువగా వాడేమాట. పడదొబ్బటం అంటే పడదోయటం. దొబ్బులు అంటే తిట్లుకూడా. *'వాడికేమన్నా దొబ్బుడాయా'* అంటారు అంటే గర్వమని.

ఇక దుత్త, ఇది దేశీయపదం. తమిళంలో తూతై, మలయాళంలో తూత అంటారు. దుత్త అంటే చిన్నమూతిగల చిన్న మట్టి కుండ, పాలకుండ, చిన్నబుంగ. *'అత్త మీద కోపం దుత్తమీద'* అనేది సామెత.

నిపుణుడు చెయ్యాల్సిన పనిని నికృష్టుడు చెయ్యరాదని వేమన్న సందేశం.

*'చెప్పనోపదేని తప్పు బట్టి* (డి. 1727–59) అనేది పాఠాంతరం.

**అధికుడైన రాజు అల్పుని చేపట్ట**
**వాని మాట చెల్లు వసుధలోన**
**గణకులొప్పియున్న గవ్వల చెల్లవా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

బలవంతుడైన రాజు తక్కువస్థాయి గలవాణ్ని దగ్గరికి తీస్తే ఏమవుతుంది? ఏమవుతుందంటే రాజ్యంలో వాడి మాటే చెల్లుతుంది. అదెట్లాగంటే దుకాణాదారుడు ఒప్పుకుంటే తక్కువ విలువ గల గవ్వలకు కూడా మంచి చెల్లుబాటు ఉన్నట్లు.

దొడ్డవాడైన రాజు నీచునికి సాన్నిహిత్యం ప్రసాదించినట్టయితే వాడు లోకంలో సమాంతర అధికారం చెలాయిస్తాడు. రాజంతటి వాడుగా చెలామణి అవుతాడు. అధికుడు అంటే గొప్పవాడు, అల్పుడు అంటే చిన్నవాడు లేదా క్షుద్రుడు. వసుధ అంటే భూమి. వసు అంటే ధనం, రత్నం, కిరణం, జలం అనే అర్థాలున్నాయి. వాటిని ధరించేది వసుధ.

గణకుడు అంటే కరణం, గ్రామ లెక్కలు రాసేవాడు, జోస్యుడు అనే అర్థాలున్నాయి. దివాణంలో రూకల కొట్టు మీద ఉండేవాణ్ని కూడా గణకుడంటారు. ఖజానాలో డబ్బుల మారకపు వెలను కట్టే షరాబు కూడా గణకుడే. ఇతడిని కజాంచి అని కూడా అంటారు. వ్యాపారస్తుడు గానీ షరాబుగానీ ఒప్పుకుంటే అల్ప నాణాలకు కూడా విలువ పెరుగుతుంది. ఎట్లా? ఎట్లాగంటే తెచ్చినవాడు సామాన్యుడు కాదు, రాజుకు దగ్గరి వాడు. వాడి ద్వారా వచ్చే గవ్వలు కూడా మంచి నాణాల విలువను పొందుతాయి. గవ్వ కూడా ఆ కాలంలో కనిష్టమూల్యం గల నాణెంగా ఉండేది. ఇంగ్లీషులో పెన్నీ లాంటిది. గవ్వను గుల్లకాసు, బోలు నాణెం అని కూడా వ్యవహరించేవారు.

ఆధునిక కాలంలో గుర్రం జాషువా *'గవ్వకు సాటిరాని పలుగాకుల మూక లసూయచేత నన్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే'* అన్నాడు.

*'గజపతింట నెన్న గవ్వలు చెల్లవా'* (డి.1723, 352) అనే పాఠాంతరం కూడా వుంది.

అల్పుణ్ని దరిజేరనివ్వరాదు అనేది ఈ పద్యసారాంశం.

**అనగననగ రాగమతిశయిల్లుచునుండు**
**తినగతినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వదాభిరామ వినురవేమ**

పాడేవారికి నిరంతర సాధన ఉంటే రాగాలాపనకు మరింత మాధుర్యం చేకూరుతుంది. చేదుగా ఉండే వేపకాయను రోజూ తింటుంటే తియ్యగా ఉంటుంది. తియ్యగా అంటే తియ్యగా అనికాదు అలవాటైపోతుంది అని అర్థం. అంటే సయిస్తుంది. నిరంతర సాధన ఉంటే ఏకార్యమైనా సానుకూలమవుతుంది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నమాట. సాధనం అంటే నిష్పాదనం. ఉపకరణం, సామగ్రి, ఉపాయం, హేతువు అనే అర్థాలున్నాయి.

ఈ పద్యంలోని మొదటి పాదానికి మరో అర్థం కూడా చెప్పవచ్చు. సంగీతపరంగా చెప్పినప్పుడు పాడగా పాడగా రాగాతిశయం కలుగుతుందన్నాడు గాని స్వతహాగా మంచి కంఠస్వరం లేనివాడు ఎంత సాధన చేసినా గాయకుడు కాలేడు. మరి దీని అర్థమేమి? 17వ శతాబ్దంనాటి సామాజిక పరిస్థితుల్లోకి వెళ్ళి దీనిని ఇలా వ్యాఖ్యానించవచ్చు. ప్రాచీన గ్రామవ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల కట్టుబాట్లు ఉండేవి. భార్యాభర్తలు ఇప్పటిలాగ అందరిముందు మాట్లాడుకునేవారు కాదు. ఇద్దరూ తమ పాత్రలు నిర్వహించేవారేకాని వారి మధ్య పరస్పర ప్రేమానురాగాల సంగతేమిటి? అందుకే వేమన ఆలుమగల మధ్య సంభాషణ ఉంటే ఒకరికొకరు అర్థమై ప్రేమ పెరుగుతుంది అంటున్నాడు. రాగం అంటే అనురాగం, ప్రేమ అనే అర్థాలు కూడా వున్నాయి. నువ్వోమాట అనగ, తనూ ఒకమాట అనగ కలుపుగోలుతనం వల్ల ఆప్యాయత పెరుగుతుందంటున్నాడు. ఆనాటికే కుటుంబ సంబంధాల గురించి వేమన ప్రగతిశీలంగా ఆలోచించాడనటానికి ఈ పద్యం తార్కాణం.

**అన్నమదము వలన అతివలు నరులట్లు**
**ఏపురేగి మదను దేచెనంద్రు**
**అన్న ముడుగు వెనుక నతడెందుబోయెరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'అదేమిటి వాళ్లట్లా చేశారు?' అని లోకులు ఆశ్చర్యపడితే 'తిండెక్కువై' అనేది సమాధానం. స్త్రీలుగాని పురుషులు గాని చెలరేగిపోయి కామపరవశులౌతున్నారు. అదేమిటి అని అడిగితే 'మమ్మల్నేం చెయ్యమంటారు మన్మథుడు మమ్మల్నిలా బాధిస్తున్నాడంటారు. సరే ఒప్పుకున్నాం. మరిప్పుడు మీకు తిండికే కష్టంగా వుందే, బాధించటానికి మన్మథుడు కనపడడేమి? ఎక్కడికి పారిపొయ్యాడో చెప్తారా అని నిలదీస్తున్నాడు వేమన.

మనుషులకు మదమెక్కటానికి రెండు కారణాలు చెప్తారు. ఒకటి తిండికి లోటు లేకపోతే కలిగే భోగచింతన. రెండోది కామ మోహాలు ప్రకృతి సహజం, తిండికి దానికి సంబంధం లేదు అని. వేమన మొదటి దాన్నే సమర్థిస్తున్నాడు. ఇట్లాంటిదే మరోపద్యం చెప్పాడు వేమన. "కూటికి వగలేక కూర్చున్న వాడికి ఆడుదాని మీద యాసగలదె! అన్న మదము చేత అన్ని మదంబులౌ" అని.

బ్రౌన్ 1929 నాటి ముద్రణంలో 'అతివలు నరులట్లు' అనే పాఠముంటే తరువాత కొన్ని అచ్చు ప్రతుల్లో 'అతివలు మతిచెడి' అన్న విడ్డూరమైన పాఠముంది. దీనివల్ల కామభావం కేవలం స్త్రీలకే ప్రత్యేకమైనదనే అర్థం వస్తుంది. పైగా తిండి ఎక్కువగా పెడితే స్త్రీలు ఏపురేగిపోతారు అనే అన్యాయమైన అసహజమైన అర్థం వస్తుంది. ఒకవేళ ఉంటే గింటే మదమనేద స్త్రీ పురుషులిద్దరికీ సమానం బ్రౌన్ ఈ అర్థంలోనే అనువదించారు.

ఏపు అంటే ఎక్కువకావటం, అతిశయించడం అని అర్థాలు. బాధించు అని కూడా. 'మారునేపుల బాల్వడ దాననైతినే' అని ప్రయోగం. వానయేపు అంటే అధికవర్షం. ఏచు అంటే కూడా అదే అర్థం. 'మారు సాయకముల్ తను చిత్తవృత్తు లేచిన' అని ప్రయోగం.

**అన్నమధికమైన నదియు తాజంపును**
**అన్నమంటకున్న ఆత్మనొచ్చు**
**చంపనొంప బువ్వ చాలదా వెయ్యేల!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తిండి లేక ఒకడు చస్తే, తిండెక్కువై మరొకరు చచ్చాడు అని సామెత.

కాలవ్యవధి నివ్వక, పరిమితి లేక అస్తమానం తినేవాడికి జీర్ణకోశాది వ్యాధుల్తో ఆరోగ్యం దెబ్బతిని చావుకు దారితియ్యొచ్చు. అన్నం లేనివాడేమో పోషణ లేక బాధపడతాడు. చంపటానికైనా కృంగదీయటానికైనా తిండే కారణమంటున్నాడు వేమన.

అధికమైన అంటే అవసరం కంటే ఎక్కువైన అని అర్థం. ఆత్మ అంటే శరీరం అనే అర్థం కూడా వుంది. ఆకలికి బాధపడేది శరీరమే కదా! ఒంపుట అంటే అణచుట అని అర్థం.

డబ్బున్నవాడు బంగారం తింటాడా? ఉందికదా అని హితాహితాలు గమనించక తెగతినే వాడు రోగాల పుట్టగా మారుతాడు. అన్నం దొరకని వాడి ఆకలిమంట వాడి పేగుల్నీ తద్వారా వాడిబతుకునీ కాల్చేస్తుంది. ఎవడికి కావలిసిందయినా పిడికెడు బువ్వేనంటున్నాడు వేమన.

ఒకే వస్తువు (ఉపకరణం) మంచికీ చెడుకూ కూడా ఉపయోగపడుతుంది అనే పద్ధతిలో కూడా ఈ పద్యానికి వ్యాఖ్యానం చెప్పుకోవచ్చు.

వీరశైవంలో అన్నదానానికి ప్రాధాన్యముండేది. అన్నపూర్ణను సృష్టించింది శైవమేనంటారు.

**అన్నమరుగ నతని కన్నంబు పెట్టిన**
**పారవేసు దాని ఫలితమేమి?**
**ధనికునకు నొసంగు దానములటువలె**
**విశ్వదాభిరామ వినురవేమ**

అతని జీర్ణశక్తి బలహీనం. అతనికి బలవంతంగా అన్నం వడ్డించావనుకో అప్పుడేమవుతుంది? అతడా అన్నాన్ని తినడు, తినకపోగా పారేస్తాడు. చూశావా ఎంతో విలువైన అన్నం ఎలా వ్యర్థమయ్యిందో! ధనవంతుడికి దానం చేస్తే ఎలా వుంటుంది? అది అతనికి ఆనదు. ఎందుకంటే అతనికా అవసరం లేదు. అవసరమున్న చోట దానం చాలా గొప్పది! దానం చెయ్యండిరో! అని వేమన్న ఎన్నో పద్యాల్లో మొత్తుకున్నాడు. దానగుణాన్ని మేల్కొల్పటం కోసం పిసినారితనాన్ని దుయ్యబట్టాడు. ఆవశ్యకత లేని చోట, అపాత్రత ఉన్నచోట మంచి పనులు వ్యర్థమౌతాయి అని ఈ పద్యం సారాంశం.

మొదటి భాగంలో అతడు అన్నం గ్రహించటానికి అశక్తుడు. రెండోభాగంలోని వాడు ధనవంతుడు, నీ దానం కన్నా శక్తిమంతుడు. ఇద్దరి పట్లా నీ దానం విఫలమయ్యింది. విచక్షణ లేకపోవటం వల్లే ఇలా జరిగిందంటున్నాడు వేమన.

అన్నం అంటే సాధారణంగా ఆహారం. దక్షిణ భారతదేశంలో ఉడికించిన బియ్యంతో తయారైన వంటకం. ఉత్తరభారతంలో రోటీ. అన్నరసం అంటే అన్నం యొక్క సారం, రుచి. గంజిని కూడా అన్నరసం అంటారు. జీర్ణమయ్యే తిత్తిని అన్నకోశం అంటారు. జీర్ణశక్తి లేనివాడిలో అన్నభేది ఉండదు. అన్నభేది అంటే అన్నాన్ని జీర్ణం చేసే పదార్థం. బహుశా సల్ఫేట్ ఐరన్ అయివుంటుంది. ఇది ఒక మందు కూడా.

జొన్నలు, గోధుమలు, నూకలతో వండినపదార్థం కూడా అన్నమే. అన్నాన్ని కూడు, బువ్వ అని కూడా అంటారు. అన్నం పరబ్రహ్మంతో సమానం అన్నారు పెద్దలు. అన్నం ఎంతో కష్టపడితేగాని రాదు. కాబట్టి దానిని నిరుపయోగపర్చవద్దు అని హితవు చెప్తున్నాడు వేమన.

**అన్నిజాడలుడిగి ఆనందకాముడై**
**నిన్ను నమ్మజాలు నిష్ఠతోడ**
**నిన్ను నమ్మముక్తి నిక్కంబు నీయాన!**
**విశ్వదాభిరామ వినురవేమ!**

అన్ని మార్గాలనూ నశింప జేసుకొని కేవలం ఆనందాన్ని మాత్రమే కాంక్షిస్తాడు. అప్పుడే ధర్మాచరణంలో నీ మీద భారం వేసే స్థితికి చేరుకుంటాడు. నిజంగా చెప్తున్నాను ఓ ప్రభూ! నిన్ను పూర్తిగా విశ్వసించినప్పుడే ముక్తి నిశ్చయంగా లభిస్తుంది అని భరోసా ప్రకటిస్తున్నాడు వేమన.

అన్ని జాడలు అంటే మార్గాలు, అంటే అనేక సంప్రదాయాలు. షణ్మతాలు కావొచ్చు, ఇంకా చిన్నాచితకా పలుపంథాలు కావొచ్చు. వీటన్నింటితో తలబద్దలు కొట్టుకోకుండా ఆనందమార్గంలో వెళ్లమంటున్నాడు వేమన. ఇంతకూ ఆనందమంటే ఏమిటి? అతిశయ సుఖస్వరూపమైన ప్రేమకు నెలవైంది ఆనందం అని పెద్దలు చెప్తున్నారు. ఇంగ్లీషులో దీనిని bliss అంటారు. Bliss అంటే పరమసుఖం, బ్రహ్మానందమని అర్థాలు. ఆనందానికి అనేక సూక్ష్మ భేదాలున్నాయి. వాటిలో బ్రహ్మానందం, విషయానందాలు ప్రస్తుతానికి తెలుసుకోతగ్గవి. బ్రహ్మానందమంటే సుషుప్తి యందు అనుభవించబడే ఆనందం. దీనికి స్వయం ప్రకాశం వుంటుంది. విషయానందాలు అంటే ఇవి అంతఃకరణ వృత్తి విశేషాలు. అంటే ఇష్టప్రాప్తి వల్ల అంతర్ముఖమైన మనస్సులో ప్రతిఫలించేవి విషయానందాలు. ఆనందకాముడు అంటే ఆనందాన్ని కోరుకునేవాడు. ఇక్కడ ఆనందమంటే పరబ్రహ్మమే.

నిష్ఠ అంటే నియమపాలన. బ్రహ్మమును తప్ప ఇతరాలను ఉపాసించరాదనే నియమం. జాడ అంటే దారి, రీతి, విధం, వైపు, గతి, వృత్తాంతం అని అర్థాలు. ఇక్కడ మార్గం. నిక్కం అంటే నిజం, నిశ్చయం, వాస్తవం, శాశ్వతత్వం అని అర్థాలు.

ఆన అంటే ఒట్టు, తోడు, ఆజ్ఞ, ప్రమాణం అని అర్థాలు. 'నీయాన' అనేది చక్కని తెలుగు నుడికారం. బహుశా 'అనుట' నుంచి వచ్చి ఉంటుంది. నిక్కచ్చి తనానికి వాడుతారు. 'నీయాన' అంటే నీమీద ఒట్టు అని. 'నాయాన' అంటే నాపై ఒట్టు అని. ఇంగ్లీషులో "Upon my word upon my honor" అంటారు. తెలుగులో 'నా ధర్మంగా' అనేది ఇట్లాంటిదే.

అన్ని ధర్మాలను వదిలేసి నన్ను శరణు జొచ్చాలనే గీతావాక్యం ఇట్లాంటిదే. ఉడుగు అంటే నశించు అని, "రోగాపమృత్యు వార్తాగంధమెడలెను జారచోరాదుల పేరు నుడిగె" అని ప్రయోగం.

**అప్పులేని వాడు అధిక సంపన్నుండు**
**తప్పులేని వాడు ధరణి లేడు**
**గొప్పలేని బుద్ధి కొంచెమైపోవురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నిజమైన ధనవంతుడెవరయా అంటే అప్పులేని వాడే. తప్పు చేశావని ఊరికే కుమిలిపోరాదు. ఒక్క తప్పైనా చెయ్యనివారు లోకంలో వుండరు. విశాలంగా ఆలోచించని బుద్ధి అల్పత్వాన్ని పొందుతుంది, తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

పై మూడు పాదాలు వేటికవే విడివిడి పాదాలు. వాటి మధ్య పరస్పర సంబంధం లేదు. దేనికదే విలువైన లోకసత్యం.

అప్పు అంటే రుణం అని అందరికి తెలిసిందే. అప్పు మూడురకాలు. అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం, అప్పు పడడం. ధనమున్నవాడు మరింత ధనాశతో అప్పు ఇస్తాడు, అదీ చికాకే. తీసుకున్నవాడు ఇస్తాడో లేదో అనే బెంగ. ఎగ్గొట్టి పారిపోవచ్చు. అప్పు తీసుకోవడం రెండోది. దీనిలో వాయిదాలు కట్టాలి, వడ్డీ చెల్లించాలి. మూడోది మరీ ఘోరం. తాహతుకు మించి అప్పుచేసి నప్పుడు కలిగే బాధ వర్ణనాతీతం. దీనివల్ల పరువుపోవొచ్చు. భరించలేక ఆత్మహత్యలకు పాల్పడవచ్చు. వర్తమానకాలంలో జరుగుతున్న రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు అప్పుల చావులే. అప్పు ఇచ్చినా తీసుకున్నా మనశ్శాంతి పోతుంది, ముఖ్యంగా తీసుకున్నప్పుడు. అందుకే వేమన అప్పులేని వాడు ధనవంతుడి కన్న ఎక్కువ సంతోషంగా వుంటాడు అంటున్నాడు. అందుకే అధిక సంపన్నుడయ్యాడు.

తప్పు అంటే పొరపాటే కాని దీనిలో కూడా పలురకాలు. తెలిసీ, తెలియకచేసే తప్పులు కొన్ని. ఇతరులకు హాని, చెడు చేసేవి మరి కొన్ని. అయితే తెలియక చేసే తప్పులకు నిరంతరం కుమిలిపోక ముందు ముందు జరగకుండా జాగ్రత్త వహించాలి. ప్రపంచంలో అసలే తప్పు చేయని వారు ఉండరు కదా అని వేమన సాంత్వన.

గొప్ప ఆలోచనల వల్ల కీర్తి ప్రతిష్టలబ్బుతాయి. అల్పంగా ప్రవర్తించి వాటిని పాడుచేసుకోవటం అజ్ఞానం అంటున్నాడు.

**అరయ తరచుకల్ల లాడెడు వారిండ్ల**
**వెడలకేల లక్ష్మి విశ్రమించు**
**ఓటికుండ నీరువోసిన చందాన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అదేపనిగా మోసం చేసేవారి ఇళ్లల్లో సంపద ఎక్కువకాలం నిలువదు, వెళ్లిపోతుంది. పగులువారిన కుండలో నీళ్లుపోస్తే అవి ఎంతసేపు నిలుస్తాయి? కారిపోతాయి.

కల్ల అంటే అబద్ధమాడటం, కపటంగా ప్రవర్తించటం, అపకారం చేయటం. దొంగస్వభావమనికూడ. కళ్ అంటే దొంగలించడం. ఇవన్నీ మోసం కిందికే వస్తాయి. లక్ష్మి అంటే సంపద. విష్ణువు భార్య లక్ష్మి. ఆమె సంపదకు ప్రతీక. సంపద అంటే కేవలం ధనమే కాదు. ఐశ్వర్యం, ధాన్యం, సంతానం, విద్య, గజబలం, విజయం, ధైర్యం ఇవన్నీ సంపదలే. అష్టలక్ష్ములంటారు. మోసం చేసే వాడికి ధైర్యం సడలుతుంది. ఐశ్వర్యం కూడా లక్ష్మే. ఐశ్వర్యం అంటే ఈశ్వర స్వభావం అన్నమాట. వీటిలో ఏ ఒక్కటి లోపించినా అది దారిద్ర్యానికి నాంది పలుకుతుంది.

'అరయ' అంటే విచారించగా, చూడగా, పరీక్షించగా, నిరీక్షించగా అని అర్థాలు. 'జాగ్రత్తగా పరిశీలిస్తే' అని ఇక్కడ చెప్పుకోవాలి.

ఓటి కుండ అంటే బీటలు వారిన కుండ, పర్రె బట్టిన కుండ. ఓడు అంటే రంధ్రం, పగులు. ఓడు యొక్క ఔపవిభక్తిక రూపమే ఓటి. ఓటిధ్వని అంటే కుండను కొట్టినప్పుడు వచ్చే బోలు శబ్దం.

వేమన అసత్యపరుడిని ఓటికుండతో పోల్చడం అద్భుతం. ఓటిపలుకు అంటే పసలేని ఉత్తమాట, పరపతి లేని మాట అని అర్థాలు. నమ్మకం కోల్పోయిన వాడి చెంత డబ్బు నిలుస్తుందా? 'వెడలక–ఏల' అంటున్నాడు. అంటే వెడలుతుందని, వెళ్లిపోతుందని.

మానసిక దారిద్ర్యమే, శీల దారిద్ర్యమే ధన దారిద్ర్యానికి దారితీస్తుందని వేమన్న ఉవాచ.

**అరుదుగా నడిగిన అతడర్థి కాబోడు**
**తరచుగా నొసగక దాతగాడు**
**దాతకర్థికింత తారతమ్యము గల్గు**
**విశ్వదాభిరామ వినురవేమ**

సాధారణంగా అతడు జాగ్రత్తగానే ఉంటాడు. కాని అనుకోని అవసరం వచ్చి నిన్నడిగాడు. అతణ్ని యాచకుడని భావిస్తే ఎలా? అలాగే ఎప్పుడో ఓ సారి ఎంతో కొంత ఇచ్చేవాడు దానపరుడెట్లవుతాడు? అడిగేవాడికి ఇచ్చేవాడికి హెచ్చుతగ్గులింతేనని గ్రహించమంటున్నాడు వేమన.

అతడు ఎప్పుడోగాని అడగడు అయినా ఇతడు అతన్ని తక్కువగా చూస్తాడు. మరి ఇతడేమన్నా గొప్పదాతా? అప్పుడప్పుడు అక్కడక్కడ కొంత విదిలిస్తాడనుకోండి. అవును అప్పుడప్పుడే, తరచుగాకాదు. తరచుగా కాదనటం వల్ల దానగుణం అతని స్వభావం కాదని అర్థం. ఆ చేసేది కూడా ఏదో అవసరాన్ని దృష్టితో పెట్టుకొని చేస్తాడు. అతడు మంచి అర్థియే, ఇతడే మంచిదాతకాడు. అర్థి అంటే అర్థించేవాడు. దాత అంటే దానమిచ్చేవాడు. వీరిద్దరి మధ్య తారతమ్యాలున్నాయి తెలుసుకొమ్మంటున్నాడు వేమన. తారతమ్యాలు అంటే న్యూనాధిక్యాలు. తర, తమ అనేవి సంస్కృత ప్రత్యాయాలు: ఇంగ్లీషులోని కంప్యారిటివ్ అంటే 'తర', సూపర్‌లేటివ్ అంటే 'తమ' తరతమాలు కలిస్తే తారతమ్యాలు. వ్యత్యాసాలు అన్నమాట.

పాత్రత ఎరిగి ఇచ్చినప్పుడు నిజంగా దానం గొప్పదే. ధర్మం అనే అర్థముంది దానిలో. అందుకే దానధర్మాలు అంటారు. అంటే మంచి పనులకోసం ఇవ్వడం అన్నమాట.

దానాలు పదిరకాలు. దశదానాలంటారు. గోదానం, భూదానం ఇంకా తిలా, హిరణ్య, ఆజ్య, వస్త్ర, ధాన్య, గుడ, రౌప్య, లవణ దానాలు. షోడశదానాలు కూడా ఉంటాయి. దాతగా పేరు తెచ్చుకోవాలనుకునే వాడు ఆలోచించాలి, తానెటువంటి దాతో!?

"అర్థి దాతలందు అంతరమున్నదో" (డి.1727–100) అనేది పాఠాంతరం.

**అర్థవంతు సొమ్ము నాసింతు రర్థులు**
**అర్థికీని సొమ్ము వ్యర్థమౌను**
**వ్యర్థమైన సొమ్ము వ్యర్థుల చేరురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యాచకులు శ్రీమంతుని ధనసహాయాన్ని కోరటం సహజం. అర్థించిన వారికి ఒక్క పైసా విదిలించని పిసినారి యొక్క డబ్బు అతని మరణానంతరం సద్వినియోగం కాకపోవొచ్చు. పైగా అది పనికిమాలిన వారికి చెంది పనికి రాకుండా పోవచ్చు. కాబట్టి దానగుణం మంచిదని వేమన్న ప్రబోధం. దాతృత్వాన్ని అలవర్చుకోవాలంటూ వేమన ఎన్నో పద్యాలు చెప్పాడు. 'అర్థికీని సొమ్ము' అనేది తాళపత్రాల్లోని పాఠం. బ్రౌన్ పాఠం కూడా ఇదే. దీనికి బదులుగా వావిళ్ల ప్రతిలో 'అర్థికీయ సొమ్ము' అనే పాఠం వచ్చి చేరింది. దీనివల్ల అర్థించిన వాడికిచ్చే సొమ్ము వ్యర్థమౌతుందనే అర్థం వస్తుంది. వేమన పద్ధతికిది పూర్తిగా విరుద్ధం.

అర్థవంతుడు అంటే అర్థం గలవాడు అంటే ధనవంతుడు. సొమ్ము వ్యర్థం కావడమంటే సత్కార్యాలకు వినియోగపడకపోవటమటుంచి దుష్కార్యాలకు ఉపయోగపడుతుందని. వ్యర్థులు అంటే అప్రయోజకులు. నీ తర్వాత నీ వారసుడు వ్యసన సంపన్నుడైతే నీ సంపద అంతా నిరుపయోగంగా కరిగిపోతుందని వేమన్న హెచ్చరిక.

'వ్యర్థికీని సొమ్ము వ్యర్థమగును' (డి.1773-III-1508) అనేది పాఠాంతరం అర్థవంతంగా లేదు.

**అలయజేసి మలచి అడిగండ్లు మలిగండ్లు**
**తిరిపెమిడెడు కటిక దేబెలెల్ల**
**ఎలమి మన్ను దినెడు ఎఱ్ఱలౌదురు సుమీ!**
**విశ్వవిదాభిరామ వినురవేమ**

వాళ్లు కఠినాత్ములు, దౌర్భాగ్యులు యాచించి వచ్చినవాడు దీనంగా వేడుకున్నా కరగరు. అతడు అరిచీ అరిచీ అలసి సొమ్మసిల్లిన తరువాత అతని ముఖాన కొన్ని వడ్లు పారేస్తారు. ఎట్లాంటి వడ్లు? మట్టీ మశానం కలిసిన పొల్లు గింజలు. ఏం మనుష్యులండీ వీళ్లు! వీళ్లు వచ్చే జన్మలో తప్పకుండా వానపాములై పుడతారు. అదే మన్ను తిని బతుకుతారు అని పరమ లోభులను శపిస్తున్నాడు వేమన.

అలయజేసి అంటే అలసిపోయే దాకా సతాయించి. అలయుట అంటే బడలటం, గాసిపడటం అని అర్థాలు. "అలయక చదివిన నర్థితో వినిన; అలయవొకింతయైన' అని ప్రయోగాలు. మలయుట అంటే గింజలను చేటలోపోసి నేమటాన్ని మలవటం అంటారు. (చేటను అడ్డంగా అటు ఇటు ఊపటం) నేమటం వల్ల బియ్యాన్నీ, రాళ్లనూ వేరుచేసే ప్రక్రియ జరుగుతుంది.

అడిగండ్లు మలిగండ్లు అంటే మట్టిపెళ్లలు కలిసిన తరక గింజలు. తరకలు అంటే తప్పలు. తప్పలు అంటే కొంతగింజ పట్టిన ధాన్యం పొట్టు. చెరిగేటప్పుడు ఇవి వేరుగా పడతాయి. గింజలేని ధాన్యాన్ని అడిగండ్లు మలిగండ్లు అంటారు. తబకలు అని కూడా అంటారు. బీజం లేని నిస్సారమైనవన్నమాట! తిరిపెం అంటే బిచ్చం.

కటిక దేబెలు; కటిక అంటే క్రూరమైన ఛాయలు కూడా ఉన్నాయి. కటికపని అంటే జంతువులను కోసే వృత్తి, కటిక చీకటి అంటే దట్టమైన చీకటి, కటిక పస్తు అంటే కఠోరమైన ఉపవాసం అని. దేబె అంటే దీనుడు, యాచకుడు, దౌర్భాగ్యుడు, మూర్ఖుడు, చవట అధముడు అని అర్థాలు.

ఎలమి అంటే ఆనందం, సంతోషం, కృప, ప్రేమ, పెంపు, ధైర్యం, వివేకం, వికాసం, అతిశయం, ఉత్సాహం అనే అర్థాలున్నాయి. తరచుగా పాదపూరణంగా వాడుతారు. వేమన ఉత్సాహం అనే అర్థంలో వాడాడు. ఎఱ్ఱ అంటే వానపాము.

పెట్టేదేదో మంచిది పెట్టాలి గాని పనికిరానిది పెట్టగూడదని సారాంశం.

**అల్ప సుఖములెల్ల నాశించి మనుజుండు**
**బహుళ దుఃఖములను బాధపడును**
**పరసుఖంబునొంది బతుకంగ నేరడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

స్వల్పమైన ఇంద్రియ సుఖాలను ఆశించిన మానవుడు అవి తీరక అనేకరకాలైన దుఃఖాలను కొనితెచ్చుకొని అవస్థలు పడుతుంటాడు. మోక్షం వంటి ఉదాత్తమైన సుఖాలతో జీవించవచ్చు కదా! దానికోసం ప్రయత్నమే చెయ్యడు అని జాలిపడుతున్నాడు వేమన.

అల్పసుఖాలు అంటే చిన్న చిన్న ఆనందాలు. సుఖం అంటే ఆనందాన్ని చేకూర్చేది. నిజంగా ఆది ఆనందాన్ని చేకూరుస్తుందా? ఏమో! ఒకవేళ అది నిజమే అయితే ఆ క్షణం వరకే. జిహ్వాచాపల్యం లాంటివి అల్పసుఖాలు. అలాంటివెన్నో! అవి తీరకపోతే ఆశాభంగం, బాధ; దుఃఖం అంటే బాధే. దుఃఖం రెండు రకాలు ఒకటి ప్రాప్త దుఃఖం, రెండోది స్వీయ దుఃఖం. రెండోది కొని తెచ్చుకునేది. మొదటిది భాగ్యవశాన ప్రాప్తించేది.

ఇంతకూ దుఃఖమంటే ఏమిటి? వేదాంతపరంగా ఇది చాలా పెద్దమాట. శోకం దానికి ఒక మాధ్యమం మాత్రమే. దుఃఖాన్ని గురించి బుద్ధుడు ఎంతో ఆలోచించాడు. దాని పునాదులపైన తన 36వ యేట బుద్ధి పొందాడు. మరో 44 సంవత్సరాలపాటు బౌద్ధమతాన్ని ప్రచారం చేశాడు. ఇంతకూ దుఃఖాన్ని గురించి ఏమన్నాడు బుద్ధుడు? దుఃఖానికి హేతువు కోరిక అన్నాడు. కోరిక ఎలా పుడుతుంది? ఎలాగంటే ఇంద్రియాలకు ఇష్టమైన విషయాలతో ఉండే సంపర్కం నుండి కోరిక పుడుతుంది.

దుఃఖం అంటే ఒక మానసిక స్థితి. జన్మం, మృత్యువు, వార్ధక్యం, మనస్సు విచలితమై పోవడం, ఇష్టంలేని వారితో కలయిక, ఇష్టమైన వారితో ఎడబాటు, కోరింది రాకపోవడం ఇవన్నీ దుఃఖాలే. వేమన చెప్తున్న బహుళ దుఃఖాలంటే ఇవే. మరి దుఃఖమెలా పోతుంది? అదేం ప్రశ్న? కోరిక నశిస్తే దుఃఖాన్ని నిరోధించవచ్చు. బౌద్ధంలో దుఃఖాంతాన్ని నిర్వాణం అంటారు. నిర్వాణమంటే ఆరిపోవటం అని అర్థం. నిర్వాణమంటే దుఃఖనాశం, విరాగం, రాగక్షయం అని అర్థాలు. వేదన యొక్క అభావమే నిర్వాణం.

వేమన్నపైన బౌద్ధమత ప్రభావం ప్రత్యక్షంగా ఉండకపోవచ్చుగాని అక్కడక్కడ ఆ ఛాయలు కనపడతాయి. శూన్యవాద ఛాయలు కూడా అంతే.

ఈ పద్యం చిన్నదే గాని పరమ గంభీరమైంది. దీనివల్ల సుఖదుఃఖాలు అనే రెండు భావాలే మానవాళిని పాలిస్తున్నాయని అర్థమౌతుంది. వీటికి లోబడి మాత్రమే మనుషులు జీవిస్తున్నారు. సుఖమంటే భౌతిక సుఖమే అనుకుంటారు. ఒకరకంగా ఇది ఆభాసం. నిజానికి చిన్నసుఖాల్లో దుఃఖమెక్కువగా ఉంటుందని సారాంశం.

**అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను**
**సజ్జనుండు పల్కు చల్లగాను**
**కంచుమోగునట్లు కనకంబు మోగునా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీచుడెప్పుడూ పటాటోపంగానే మాట్లాడుతాడు. మంచివాడు హాయి గొలిపేట్లుగా పలుకుతాడు. బంగారం కంచువాద్యం లాగ దద్దరిల్లజేస్తుందా గమనించమంటున్నాడు వేమన.

ఆడంబరం అంటే ప్రదర్శనహడావిడి, దర్పం. మేఘాడంబరం అనే మాటవుంది. అంటే ఆకాశంలో మబ్బులు దట్టంగా అలముకున్నాయని. కాని కురియవేమి? అది ఒట్టి మేఘాడంబరమన్నమాట! అల్పుని ఆడంబర వచనాల్లో పసలేదు. మంచివాడెప్పుడూ మంచిగానే మాట్లాడుతాడు. చల్లగా అంటే హాయిగా, క్షేమంగా, సుఖంగా, ఆరోగ్యంగా అని అర్థాలు. *'చల్లగా బ్రతుకు'* అంటే చిరాయుష్కుడివి కమ్మని. 'వాడి చెయ్యి చల్లనిది' అంటే దానహస్తుడని. కంచు అనేది ధ్వనించే లోహం. Bell Metal అంటారు ఇంగ్లీషులో. కంచుగంట, కంచువాద్దెం అంటారు. కంచు చెవులను దద్దరిల్లజేసేట్టుగా మోగుతుంది. పాపం మరి బంగారం!? బంగారం కంచులా మోగదు. సున్నితంగా ధ్వనిస్తుంది. స్థిరంగా, తళతళా ప్రకాశిస్తుంది. తుప్పు పట్టదు. కవులకు తనివితీరక బంగారానికి తావి అబ్బినట్టు అని అంటుంటారు. వేమనే మరోపద్యంలో ఇలా అన్నాడు.

*'భూతిగడ్డికేల పుట్టించె వాసన*
*కనకము తనకేమి కల్లజేసె*
*బ్రహ్మయాలితాడు బండిరేవునదెంప'*

విభూతి ఉండకు ఇంత పరిమళముందే! మరి బంగారం ఏం తప్పు చేసింది అని ప్రశ్నిస్తున్నాడు వేమన. ఈ పద్యానికి ఆసక్తికరమైన పాఠాంతరాలు కొన్ని కనిపిస్తున్నాయి. *"సత్యవ్రతుడు పల్కు సమముగాను (డి.1725; 326); అధికుడూరకుండు అడిశిపడక* (డి.1735; 347); కాకి కూసునట్లు కోకిల కూసునా" (డి.1727; 109).

నిజాయితీగా ఉండాలి అనవసరమైన హడావిడివద్దు అని వేమన్న ప్రబోధం.

**ఆకటికి తొలంగు ఆచార విధులెల్ల**
**చీకటికి తొలంగు చిత్తశుద్ధి**
**వేకటికి తొలంగు వెనుకటి బిగువెల్ల**
**విశ్వదాభిరామ వినురవేమ**

ఆకలి మంటల్లో ఆచారాలు కాలిపోతాయి. ఎవరికీ కనబడని చీకటిలో చిత్తశుద్ధి ప్రశ్నార్థకమౌతుంది. ప్రసవించిన స్త్రీ శరీరంలో మునుపటి బిగువు సడలిపోతుంది. ప్రాస సౌందర్యంతో భాసించే మూడుమాటలను తీసుకొని వాటిలోంచి విభిన్న లోకసత్యాలను పిండుతున్నాడు వేమన.

విధి అంటే ఇక్కడ విధానం. అర్థచ్ఛాయల్లోకి వెళ్తే విధిలేక అంటే గత్యంతరం లేక అని. ఇది నా విధి అంటే అదృష్టమని. యథావిధి అంటే పద్ధతి ప్రకారం. వేకటి అంటే గర్భం. వేకటిమనిషి అంటే గర్భిణీ స్త్రీ. గ్రామీణ ప్రాంతాల్లో యాకటి అంటారు వేగు+కటి, బరువైన కడుపు. బిడ్డను మోస్తున్న గర్భం అన్నమాట.

దుర్భరమైన ఆకలి ముందు నియమాలు గాలికెగిరిపోవడం, చీకట్లో కోరికలు నిద్రలేవటం, ప్రసవించిన స్త్రీ మేనిలో మార్పులు రావటం ఇవన్నీ ప్రకృతి సహజాలు. మరి వీటి చుట్టూ అల్లబడిన ఆచారాలు? సగటు మనుష్యులు వీటిని ఉల్లంఘిస్తారు. అప్పుడు వీటి డొల్లతనం బయటపడుతుంది. ఆకలితో బాధపడుతున్న వాడికి ఆచారాల గురించి ప్రవచించి ప్రయోజనం లేదు. ఆకలి చావులను ఉపరి కారణాలతో విశ్లేషిస్తారు. మూలకారణం యొక్క వాస్తవికతను పట్టించుకోవాలి గదా!

కడుపులో ఆకలి దహించివేస్తుంటే శుచీశుభ్రతలు పాటిస్తున్నామా, ఇష్టమైన వంటకాలేనా, మనకులం వారిల్లేనా ఇట్లాంటి ప్రశ్నల ప్రసక్తేరాదు. వచ్చినా ఆకలి కెగిరిపోతాయి. ఇక చీకటి, ఎవరూ చూడరనుకున్నప్పుడు మనసు పిచ్చి ఆలోచనలు చేస్తుంది. నేరాలు ఎక్కువగా చీకట్లోనే జరుగుతాయి. మనిషి ఎంత బలహీనుడు అని జాలిపడుతున్నాడు వేమన.

తన సౌందర్యం శాశ్వతమనే భ్రమిసే వనితను మరోజీవికి జన్మనివ్వటం వల్ల కలిగే జీవన పుష్టిని గమనించమంటున్నాడు వేమన. పిల్లల్ని కనటం న్యూసెన్స్ అనుకునే కొందరు దీనినెలా తీసుకుంటారో!?

**ఆకు మీది వ్రాత అందరికి తెలియు**
**చేతిలోని వ్రాత చెప్పవచ్చు**
**తోలుకింది వ్రాత దొడ్డవాడెరుగును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తాటాకు మీద రాసిన గ్రంథాలను అధ్యయనం చేసి ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. అట్లాగే అరచేతిలో రేఖలను శాస్త్రం సాయంతో తెలుసుకోవచ్చు. కాని నుదుటి వెనక బ్రహ్మ రాసిన రాత అర్థం కావటానికి అతడెంతో గొప్ప వాడై వుండాలి.

మూడూ రాతలే. మొదటివి అక్షరాలు, రెండు సాముద్రికరేఖలు, మూడోది పైకి కనపడని విధిరాత. *"నుదుట వ్రాయు రాత నుసిలితే పోవునా"* అన్నాడు వేమనే మరోచోట.

ప్రాచీన గ్రంథాలను తాళపత్రాలపైన రాసేవారు. కరక్కాయ సిరాతో రాసిన ఈ ప్రతులు వందలాది యేళ్లుగా చెక్కుచెదరకుండా ఉండేవి. కాగితం వచ్చిన తర్వాత వాటి వాడకం పోయింది. అలాగే చేతిలోని రేఖలనుబట్టి ఆయుస్సు, అదృష్టంలాంటివి చెప్తారు. కాని తలరాతను చదివి చెప్పడం అందరికీ సాధ్యం కాదు. ఎంతో జ్ఞాని అయితేగాని బ్రహ్మరాతను చెప్పలేడు. చెప్పగలిగితే అతడు ద్రష్ట అయివుంటాడు.

**ఆకులెల్ల దిన్న మేకపోతులకెల్ల**
**కాకపోయెనయ్య కాయ సిద్ధి**
**లోకులెల్ల వెఱ్ఱిపోకిళ్లుపోదురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మీరు కాయసిద్ధి పొందదలచుకున్నారా? అయితే మేం చెప్పిన ఆకులలములు, మూలికలు తినండి అంటూ పనీపాటా లేనివాళ్లు చెప్తుంటారు వారికి సమాధానమే ఈ వేమనపద్యం.

వీరు చెప్పిందే నిజమైతే మేకలు చెట్టూ పుట్టా గట్టూ తిరుగుతూ ఆకులూ, మూలికలు మేస్తాయి గదా! మరి వాటికి కాలేదేం కాయసిద్ధి? ఇవన్నీ పిచ్చివాళ్లు చెప్పే మోసపు మాటలు అంటున్నాడు వేమన.

కాయసిద్ధి అంటే ఏమిటి? కాయం అంటే శరీరం. సిద్ధి అంటే నశించకుండా చేసుకోవటం. కాయం సిద్ధి పొందితే ఆ తర్వాతి దశ మోక్షమే. కాయం మోక్షోన్ముఖంగా సాగటానికి కావలిసింది ఆకులలమలు తినటం కాదు. యోగసాధన అని వేమన్న ఉవాచ.

వెఱ్ఱిలోకులు ఇలా వేమన్నస్థాయిలో చెప్పివుంటారా? వారు చెప్పింది మోక్షాన్ని గురించి అయివుండదు. కాయసిద్ధి అంటే నిత్యయౌవనం అనే అర్థం కూడా ఉంది. చిరకాలం యౌవనంతో ఉండటానికి ఉవ్విళ్లురే వారిని మోసం చేసే పద్ధతి ఇది. ఈ కాలంలో కూడా కృత్రిమ యౌవనం కోసం మందులు వాడే వారిని గురించి వింటూంటాం.

'మేకపోతు' అంటున్నాడు వేమన. అంటే మగమేక. పెంటి మేక అనటం లేదు. ఈ మోసగాళ్లు నాటుమందులకోసం మగవాళ్లనే ఎంచుకుంటారనేది స్పష్టం. అన్నట్టు మేకమేయని ఆకులు కూడా ఉంటాయి. అంటే అవి తప్పకుండా విషపు ఆకులైవుంటాయి. మరి మనుష్యులో!? స్వార్థం కోసం దేనికైనా సిద్ధం.

లోకంలో గోసాయి చిట్కాలతో తిరుగుతూ సామాన్యజనులను వంచించే వారిపట్ల జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు వేమన.

**ఆడి తప్పు వారలభిమాన హీనులు**
**గోడెరుగని వాడు కొద్దికాడు**
**కూడి కీడు సేయ క్రూరుండు తలపోయ**
**విశ్వదాభి రామ వినురవేమ.**

మాటయిచ్చి తప్పేవాడు సిగ్గులేని వాడేకదా! ఇతరుల బాధను అర్థం చేసుకోనివాడు అల్పుడు కాక మరేమిటి? స్నేహం చేసి నమ్మించి హాని చేసేవాడున్నాడే అమ్మో! వీడు నిజంగా క్రూరుడే అంటున్నాడు వేమన.

అభిమానం అంటే ఆత్మగౌరవం, గర్వం, ప్రణయకోపం అని అర్థాలు. సుయోధనుడు అభిమానధనుడు అన్నప్పుడు అహంకారం, దర్పం కలవాడని. ఇక్కడ సిగ్గు ప్రసక్తి ఎందుకు? తన పట్ల తనకు గౌరవం లేని వాడికి సిగ్గు లేనట్టే. ఎవరేమనుకున్నా పరవాలేదనుకునే దళసరి చర్మధారి అన్నమాట.

గోడు అంటే ఏడుపు, దుఃఖం, బాధ, ఉసురు, ఓటమి, అపజయం అని అర్థాలు

*'పరమ మునీంద్ర సమరమృత*
*కురువీరుల మా మనముల గోడుడుగ భవ*
*త్కరుణ వెలయ లోకంబ*
*చ్చెరువందగ జూపవె విచిత్ర మహిమన్'*

అని ప్రయోగం. కొద్దికాడు అంటే అల్పుడు. కొలదే కొద్ది. కొలతకు సంబంధించిన నిష్పత్తి. కొద్దిమంది అంటే తక్కువ మంది అని. కూడి అంటే జతకట్టి అని. హీనుడు అంటే నీచుడు, అంటే లేనివాడు. ఏమిలేనివాడు? సిగ్గులేని వాడు. లజ్జావిహీనుడన్నమాట.

తియ్యగా మాట్లాడటం కాదు అందులో సత్యముండాలి. ఎదుటివారి బాధకు జాలి చూపించడం కాదు అర్థం చేసుకొని సాయపడాలి. అనుబంధం నటించి హాని చెయ్యటం కాదు. దానిని నిర్మలంగా కొనసాగించాలి అని సారాంశం.

*ఆడి తప్పువాడు అభిమాన హీనుడు*
*గోడెరుగని వాడు కోలుకాడు* (డి.1727, 149) అనేది పాఠాంతరం

**ఆడువారి గన్న అర్థంబు పొడగన్న**
**సారమైన రుచుల చవులుగన్న**
**అయ్యగాళ్లకైన ఆశలు పుట్టవా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అందమైన స్త్రీలను చూసినప్పుడు, ఘనమైన సంపద కనిపించినప్పుడు, శ్రేష్ఠమైన కోరికలను తృప్తిపరిచే తీపి పదార్థాలను తిలకించినప్పుడు గురువులంతటి వారికి కూడా వ్యామోహం కలుగుతుంది కదా! అంటున్నాడు వేమన.

అర్థం అంటే ధనం, పొడ అంటే కనిపించడం. పొడగట్టడమన్నా అదే. రూపం, ఆకృతి అని కూడా అర్థాలు. ధనసంబంధమైన ఏ వస్తువు కనపడ్డా అని ఇక్కడ. *"పొడగంటి మయ్యా నిన్ను పురుషోత్తమా!"* అన్నాడు అన్నమయ్య ఆ సందర్భం వేరు.

సారం అంటే రసం, చేవ, బలం, సత్త, ఫలం, విత్తం, అర్థం అని పలు అర్థాలు. రుచి అంటే ప్రభ, జిహ్వారుచితోపాటు ఇష్టం, కోరిక అని కూడా. ఇక్కడ కోరికే.

చవి అంటే రుచితోపాటు తియ్యదనం కూడా. ఇక్కడ తియ్యదనమే. అయ్యవారు అంటే బ్రాహ్మణుడు, ఉపాధ్యాయుడు అంటే గురువు అన్నమాట. ఆ కాలంలో అంతే కదా!

స్త్రీలు, ధనం, తిండి వీటి వైపు సామాన్యులు ఆకర్షింపబడటం లోకంలో చూస్తుంటాము. కాని కోరికలను అదుపు చేసుకోవలసిన గురువులకేం పుట్టింది అని ఆశ్చర్యపోతున్నాడు వేమన.

ఎంతటి వారైనా కోరికలకు లొంగిపోతారని వేమన్న ఆరోపణ. అది కూడదు అని ప్రబోధం.

**ఆత్మలోన శివుని అనువుగా శోధించి**
**నిశ్చలముగ భక్తి నిలిపె నేని**
**సర్వముక్తుడౌను సర్వంబు తానౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇది వీరశైవంలోని శివవిశిష్టా ద్వైతానికి సంబంధించిన పద్యం.

శివుని యందే భక్తితో మనసు నిలిపి తపస్సు చేస్తే ముక్తి లభిస్తుంది. ఆ ముక్తి శివుడికీ తనకూ అభేదస్థితిలో వుంటుంది. అప్పుడు అంతా తానే అవుతాడని వేమన్న ఉవాచ.

వేమన్న శైవుడా, అద్వైతా, లోకాయతికుడా అనే చర్చకంటే సామాన్యజనంలో ఆచరణలో వున్న పలు సంప్రదాయాలను వేమన్న పరిశీలించాడు అనడం సబబు. దానిలో ఇదొకటి.

శోధించడం మంటే మనస్సు నిర్మలం చేసుకోవడం. వెతకడమని కూడా. "సొమ్ము వున్న చోట *శోధింపగలుగును*" అన్నాడు వేమనే మరోచోట. మనస్సును పవిత్రం చేసుకుంటే ఏకాగ్రత సిద్ధిస్తుంది. ఆ ఏకాగ్రతతో భక్తిముఖంగా ఉపాసిస్తే ముక్తి లభిస్తుంది. వీరశైవంలో శివుడు, జీవుడు రెండూ రెండు తత్త్వాలు. ఒకటి ఆరాధ్యభావం. రెండోది ఆరాధక భావం. వ్యవహారంలో వీటిని లింగం, అంగం అని అంటారు.

అంగ రూపంలో ఉన్న జీవుడు సంసారిక దుఃఖం నుండి ముక్తి సాధించడానికి తపస్సు చెయ్యాలి. ఇంతకు ముక్తి అంటే ఏమిటి? ఏమిటంటే నిజానికి ఆత్మ స్వతంత్రమైంది, అజ్ఞానం వల్ల (దీనినే అవిద్య అని కూడా అంటారు) అది మనశ్శరీరాలతో తాదాత్మ్యం చెందుతుంది. ఆ రకంగా వాటి సుఖదుఃఖాలను తానూ అనుభవిస్తుంది. ఆత్మకు విముక్తి కలగాలంటే ముందు మనశ్శరీరాల కంటే ఆత్మ వేరని తెలుసుకోవాలి. అలా తెలుసుకున్నప్పుడే సుఖదుఃఖాల నుండి ముక్తి. సర్వముక్తుడంటున్నాడే వేమన, అంటే శివుడితో అభిన్నమైపోవాలి, తానే శివుడనే గ్రహింపు కలగాలి అదే సర్వముక్తి అని తాత్పర్యం.

'సర్వ సిద్ధుడౌను' (డి.1727-155) అనేది పాఠాంతరం. ముక్తుడన్నా సిద్ధుడన్నా ఒకటే, అర్థంలో తేడాలేదు.

**ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల**
**భాండశుద్ధి లేని పాకమేల**
**చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనసులో పవిత్రతలేని ఆచారం వ్యర్థం. పాత్ర శుభ్రత లేని వంటకం ప్రమాదకరం. భావంలో నిర్మలత్వం లేని శివపూజలు నిరర్థకం అని నిర్ద్వంద్వంగా తేల్చి చెప్తున్నాడు వేమన.

ఆత్మ అంటే జీవుడు, ఈశ్వరుడు, బుద్ధి, మనస్సు, స్వభావం అని అర్థాలు. అలాగే ఆత్మ అంటే అంతఃకరణం, అంతరంగం, అంతరింద్రియం అని కూడా. ఆత్మ అంటే ఒక ఆధ్మాత్మికస్థాయిలోని పవిత్రత. అలాగే ఆత్మ అంటే తన, స్వీయ అనే భౌతికార్థం కూడా వుంది. ఆత్మకథ అంటే స్వీయచరిత్ర కదా! ఆచారం అంటే ఆచరణ. పరంపరగా వస్తూ ఆచరించే సంప్రదాయం. వేమన్న ఏమంటున్నాడంటే ఆచారాలు సంప్రదాయంగా వచ్చేవి. వాటిని గుడ్డిగా అనుసరించటం కాదు, అవి ఏ పరమార్థంతో ఉద్దేశించబడ్డాయో తెలుసుకొని నడవాలి. అలాగే పాత్రలను తోమడం ఎందుకు? తళతళా మెరవటానికా? కాదు, లోపల పరిశుభ్రంగా ఉండటానికి. చిత్తశుద్ధి అంటే మనఃపూర్వకంగా అని భావం. *'చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద'* అనే సామెతలా కాదు. భక్తికైనా దేనికైనా చిత్తశుద్ధి ప్రాణం అని వేమన నొక్కి వక్కాణిస్తున్నాడు.

ఈ పద్యంలో ఉన్నదంతా శుద్ధి. ఈ మాటను మూడుసార్లు ప్రయోగించటం లోనే దీని ప్రాధాన్యం కనపడుతుంది. శుద్ధి అంటే నిర్మలత్వం, సూనృతం, నిజాయితి. మాట్లాడేటప్పుడు వాక్శుద్ధి ఉండాలి. అంటే ఆ మాటలు త్రికరణ శుద్ధిగా ఉండాలి. అలా కానప్పుడు దేహశుద్ధి కూడా ఎదురుకావొచ్చు. శాబ్దికంగా దేహశుద్ధి మంచి అర్థమే. అంటే శరీరాన్ని శుభ్రంగా, అమలినంగా వుంచుకోవడం. కాని కాలక్రమంలో అర్థవిపరిణామం చెంది మరో అర్థంలో స్థిరపడింది.

రెండోపాదానికి *'ద్రవ్యశుద్ధిలేని దానమేల'* అనే పాఠాంతరం కనపడుతుంది. (డి. 1725, 497). ఇదీ అర్థవంతంగానే వుంది గాని ప్రస్తుతానికి ప్రసిద్ధపాఠాన్నే ఉంచుదాం.

**ఆనుకూల్యము గల అంగనకలిగిన**
**సతికి పతికి పరమ సౌఖ్యమమరు**
**ప్రాతికూల్యమైన పరిహరింప సుఖంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒద్దిక కలిగిన భార్య ఉన్నట్టయితే ఆమెకూ ఆమె భర్తకూ సుఖ సంతోషాలు సమకూరి ఆ కాపురం ఒడిదుడుకులు లేకుండా నడుస్తుంది. విరుద్ధమైతే మాత్రం ఆ దాంపత్యం నిలువదు. అట్లాంటి ఆమెను వదిలెయ్యటం తప్ప గత్యంతరం లేదు అంటున్నాడు వేమన.

ఇది 17వ శతాబ్దంలో చెప్పిన పద్యం. మూడున్నర శతాబ్దాలు గడిచిపొయ్యాయి. భార్యాభర్తలిద్దరికి అసలే పడకపోతే ఇద్దరూ విడిపోవడం ఇద్దరికీ మంచిది. ఇక్కడ ఇద్దరూ ఒకరినొకరు వదిలేస్తారన్న మాట. కాని ఈ పద్యంలో అతడు ఆమెను వదిలెయ్యాలని ఉంది. అంటే ఇక్కడ పురుషాధిపత్యం ఉంది. ఇది ఒక్క వేమన్న పద్ధతే కాదు. వ్యష్టి ప్రత్యేకతకూ సమిష్టి ప్రయోజనానికి సంఘర్షణ ఈనాటిది కాదు. ఒకప్పటి నిరక్షరాస్య స్త్రీకీ, నేటి చదువుకున్న మహిళకూ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. అప్పటి ఉమ్మడి కుటుంబాలు కూడా నేడు నామమాత్ర మయ్యాయి. కాని విడిపోవడం ఆనాడూ ఈనాడూ అంత సులభం కాదు. సంఘవ్యవస్థలన్నీ దీనిచుట్టే తిరుగుతున్నాయి. వేదాంతాలన్నీ దీనిగురించే చింతన చేస్తున్నాయి. అలాగే సి.పి.బ్రౌన్ "But if she be disagreeable, the only happiness is in quitting her" అనటాన్ని కేవల పాశ్చాత్య వ్యాఖ్యగానే కొట్టిపారెయ్యాలి.

ఆధిపత్యాన్ని కాసేపు పక్కన పెడితే ఇద్దరి మధ్య ఇష్టం బలంగా ఉంటే కష్టం ప్రసక్తి రాకపోవచ్చు. ఇది స్వభావాలకు సంబంధించిన సమస్య కూడా. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా భారతీయ సమాజంలో, భారతీయ సమాజం లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఇతర సమాజాల్లో కూడా అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాబట్టి ఇటువంటి వేమన పద్యాలు మంచి చర్చకు దారితీసి మరింత అర్థవంతమైన మానవ సంబంధాలను, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలను బేరీజు వేసుకోడానికి వీలు కల్పించవచ్చు.

ఆనుకూల్యం అంటే అనుకూలమైన భావం. హితమైన, అరోగ్యకరమైన ప్రవర్తన. అనుగుణమైన ఆలోచన. ప్రతికూలం కానిది అనుకూలం. మొత్తానికి ఇష్టంగా ఉండేదని. అనుకూలుడు అనేది ఒక నాయక భేదం కూడా. అనుకూలుడు అంటే ఒకే స్త్రీయందు

అనురాగం గల నాయకుడు. సహచరుడు, మిత్రుడు అనే అర్థాలు కూడా ఉన్నాయి. ప్రకృతిలో కూడా సస్యానుకూల వర్షం, స్పర్శానుకూలం అనే అభివ్యక్తులున్నాయి. అనుకూల వాయువులు సరేసరి. "అనుకూలపవన మోహనమ్ములే ఈ దినమ్ములు?" అని రాయప్రోలు వారి తృణకంకణంలో ఓ ప్రయోగం. ఆనుకూల్యానికి వ్యతిరేకమైంది ప్రాతికూల్యం. సౌఖ్యము + అమరు. అమరు అంటే కుదరటం, ఒప్పటం.

ఆ కాలంలో ఎదురు తిరిగే భార్యను భర్త పరిహరించాలన్నాడు వేమన. మరి ఈనాడు భర్త భార్యను పరిహరిస్తాడా? భార్య భర్తను పరిహరిస్తుందా లేక ఇద్దరూ ఒకరినొకరు పరిహరిస్తారా అనేది ఇప్పటి దాకా గడిచిన వారి జీవితం నిర్ణయిస్తుంది. వారిని కలిపి ఉంచే బలం వారి కాపురానికి లేకపోతే వారిని పట్టివుంచే శక్తి ఏ బాహ్యశక్తులకూ ఉండదనేది లోకసత్యం.

**ఆపగాలి వెంట అడవుల వెంటను**
**కొండరాళ్ల వెంట గొడవ నేల**
**ఉల్ల మందె శివుడటుండుట తెలియరు.**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పుణ్యతీర్థాలంటూ క్షేత్రాలంటూ నదీ తీరాలకు తరలి వెళ్లడమెందుకు? అరణ్యాల్లో సంచరించడమెందుకు? కొండల్లో ఆయాసపడడమెందుకు? శివుడు నీ శరీరం లేదా హృదయంలోనే ఉన్నాడు కదా! బయట వెతికి గందరగోళానికి గురికావటమెందుకు అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

ఒక తాత్త్వికస్థాయిలో తీర్థయాత్రలను నిరుత్సాహపరుస్తూ వేమన అనేక పద్యాలు చెప్పాడు. వాటిలో ఇది మరొక మంచి రత్నం.

ఆపగాలి అంటే (ఆపగ+ఆలి) నదుల సమూహం అంటే వేణీ సంగమం. ఆలి (ఆళి) అంటే వరుస లేదా సమూహం. ఆపగ అంటే నది కావొచ్చు, యేరు కావొచ్చు. అప్ అంటే నీరు. ఆపగ అంటే నీటితో గమించేది, అంటే వెళ్లేది అని అర్థం, ప్రవాహమన్నమాట! ఆపగాలి అనే సమాసం నాకు తెలిసి నంతవరకు ఎవరూ వాడినట్టు లేదు. కొత్త సమాసాలు కూర్చటం మహాకవుల లక్షణం. Un involved construnctions అంటారు ఇట్లాంటి వాటిని.

'గొడవనేల' అంటున్నాడు వేమన. గొడవ అంటే మనకు తెలిసిందే. ఇబ్బంది, అలజడి అంటూ ఇంకా సందర్భాన్ని బట్టి ఎన్నో ఛాయలు. కన్నడంలో 'గొడవె' అంటే గందరగోళం.

*"నీవు చదివింతువనుచు నన్నియును విడిచి*
*బిచ్చమెత్తంగరాదు గా బేల తపసి*
*కడవ నాడకు చాలు నీ గొడవ యేల*
*వెజ్జుదనమేల యని మది లజ్జవొడమి"* అనేది ప్రయోగం.
ఉల్లమంటే హృదయం.

తీర్థాలు సాధారణంగా నదుల, యేరుల దగ్గర వెలిసి ఉంటాయి. త్రివేణీ సంగమం, ఏడుపాయల దుర్గ ఇట్లాంటివి. కొండలపైన అరణ్యాల్లో వెలసిన శ్రీశైలం, తిరుమల, సింహాచలం, అహోబిలం లాంటివి క్షేత్రాలు. లోపల భక్తి లేనప్పుడు వీటి సందర్శనం వల్ల అంత ప్రయోజనం లేదంటున్నాడు వేమన. "చిత్త శుద్ధిలేని శివపూజలేలరా!" అన్నాడు గతంలో. ఈ పద్యంలో శివుడంటే శివుడే కానక్కరలేదు, దేవుడు, పరమేశ్వరుడన్నమాట! అంతా నీలోనే వుంది, బయట దొరికేది స్వల్పం. అంతా తిరిగి మళ్లీ నువ్వు నీలోకి రాకతప్పదు అని సారాంశం.

**ఆపదందు చూడు మారయ బంధుల**
**భయము వేళ చూడు బంటు గుణము**
**పేదపడ్డ వెనుక పెండ్లాము గతి చూడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నువ్వు ఆపదలో ఉన్నప్పుడే నీ చుట్టపక్కాల అసలు రంగు బయటపడుతుంది. నీకు ప్రాణభయం ఉన్నప్పుడే నీ అంగరక్షకుని సాహసం తేటతెల్లమవుతుంది. నీకు పేదరికం దాపురించినప్పుడే నీ అర్ధాంగి నడతకది పరీక్ష అవుతుంది. ఏదయినా సమయం వచ్చినప్పుడే తెలిసివస్తుంది. పరిస్థితులే నీ చుట్టూ వున్న వారి ప్రవర్తనకు నికషో పలమౌతాయి అని తాత్పర్యం.

బంధువు అంటే జ్ఞాతి, మిత్రుడు అని అర్థాలు. మనిషి జీవితంలో మూడు రకాల బంధువులుంటారు. వేమనే మరోపద్యంలో చెప్పినట్టు ఆలివంకవారు, తల్లివంకవారు, తండ్రివంకవారు. తనకు కష్టకాలం వచ్చినప్పుడు వారి ప్రవర్తనలో మార్పు వస్తుందా? వస్తే మంచి బంధువులు కారన్నమాట. అలాగే రక్షణ కోసం కదా సైనికుడిని పెట్టుకునేది. ఇక వాడే భయపడిపోతే ఇక అతని బంటుగుణం నిరర్థకమే కదా!. బంటు గుణం అంటే సాహసం. ఇక బాగా స్థితిమంతుడుగా ఉన్నప్పుడూ భార్య అతన్ని ప్రేమిస్తూ పేదరికం వచ్చినప్పుడు తన్నితగలేసేది అదేమి భార్య! కష్టసుఖాలను పంచుకునేదే నిజమైన సహచరి అవుతుంది.

లోకాన్ని కాచి వడబోసిన వేమన్న ఇట్లాంటి లోకరీతులెన్నింటినో లోకుల కోసం వెదజల్లాడు.

'పేదరికమునగను పెండ్లాము జాడల (డి.1773, 28) అనేది పాఠాంతరం.

**ఆరు రుచులు వేరు సారంబు ఒక్కటి**
**సత్యనిష్ఠ వేరు, సత్యమొకటి;**
**పరమ ఋషులు వేరు భావ్యుండు ఒక్కడు**
**విశ్వదాభిరామ వినురవేమ**

చురుకైన నిర్మాణం దృష్ట్యా ప్రత్యేకత కలిగిన వేమన పద్యాల్లో ఇదొకటి. పైకి అనేకంగా కనిపించే వాటి లక్ష్యం ఒక్కటే అని దీనిలోని భావం.

నాలిక కోసం ఆరురుచులున్నా ఆహారం కడుపులోకి వెళ్లిన తర్వాత దాని ఫలితం శరీరానికి బలమివ్వడమే. ఒక్కొక్కరికి ఒక్కో సత్యం పట్ల శ్రద్ధ, కాని అవన్నీ ఒకే మూల సత్యంలో లీనమవుతాయి. అలాగే ఋషిపుంగవుల విభిన్న దర్శనాలన్నీ ఒక పరమాత్మ దిశగానే ఉంటాయి.

ఆరురుచులు అంటే ఒగరు, తీపి, ఉప్పు, కారం, చేదు, పులుపు; షడ్రుచులు అంటే ఇవే. ఇవన్నీ ఉన్నదే షడ్రసోపేత భోజనం. సారం అంటే రసం, బలం, ఫలం లాంటి అర్థాలున్నా దీనిలో ఆయుర్వేద అంశముంది. 'రసాత్‌రక్తమ్ తతో మాంసః' అంటే తిన్నదాని సారం వల్ల రక్తమాంసాలకు బలం చేకూరుతుందని. అసలేమవుతుందంటే భోజనం తర్వాత జఠరాగ్ని క్రియ జరుగుతుంది. ఆ తర్వాత పదార్థం సార, కిట్ట అనే భాగాలుగా విడిపోతుంది. (కిట్ట–మలం) సార శరీరానికి పనికొస్తుంది. రుచులన్నీ నాలికకే. నాలిక కొసనుంచి గొంతువరకే. గొంతు తర్వాత రుచులుండవు. జానెడు కూడా లేని ఈ నాలిక దూరం కోసం వేలయేండ్ల పాకశాస్త్ర ప్రస్థానం జరిగిందన్న మాట.

నిష్ఠ అంటే తదేకత. ఇక్కడ సత్యమంటే సంప్రదాయం. ఎవరు దేనిని నమ్మినా అవి ఒక ప్రాక్తన సత్యం గమ్యంగానే. ఋషి అంటే వాడుకలో ముని, తపస్వి అనే మాటలున్నా 'ఇంద్రియాలను నిగ్రహించేవాడు' అని అర్థం. ఋ అనే ధాతువుకు ఇంద్రియ సమూహమని. వాటిని వశపర్చుకున్న వాడు ఋషి అని. కొంచెం పై స్థాయిలో చూస్తే 'ఋ గతౌ' అంటే జ్ఞానం యొక్క ఆవలి ఒడ్డును పొందినవాడని. ఇక్కడ పరమజ్ఞానం అవగతమైనవాడని. పరమజ్ఞానమంటే మోక్షమే.

భావ్యుడు అంటే ఎవరి గురించి భావిస్తూ ధ్యానిస్తాడో అతడు భావ్యుడు.

ఇలా లౌకికమైన అంశాలద్వారా లోకాతీతమైన సత్యాలను ఆవిష్కరించడం వేమన్నకు వెన్నతో పెట్టినవిద్య.

**ఆర్తవిద్యలెల్ల అపకీర్తి పాలాయె**
**వార్తకెక్కునెంత వారికైన**
**ఆర్తవిద్యలెల్ల ధూర్తుల పాలాయె**
**విశ్వదాభి రామ వినురవేమ**

దుఃఖితులైన పేదవారి విద్యకు లోకంలో మంచి పేరు రాదు, చెడ్డపేరే వస్తుంది. గొప్పవారి విషయంలో కూడా అంతే. నలుగురికి తెలుస్తుంది గాని, ప్రయోజన ముండదు. ఆర్తుల ఆక్రోశమంతా దుష్టులకే చెందుతుంది కాని వారికెలాంటి ప్రతిఫలం రాదు.

ఆర్త విద్యలంటే ఏమిటి? ఇంతకు ఆర్తి అంటే ఏమిటి. ఆర్తి అంటే దుఃఖం. ఆర్తుడు అంటే దుఃఖితుడు. దుఃఖితుల విద్యలంటూ ప్రత్యేకంగా వున్నాయా? కాదు. ఆర్తవిద్యలంటే ఆర్తులకు సంబంధించిన విద్యలని. ఇది ఆర్తభక్తులకు సంబంధించిన పద్యం. ఇక్కడ విద్య అంటే భక్తి అని చెప్పుకోవాలి. భగవద్గీతలో ఓ శ్లోకముంది చూడండి.

*చతుర్విధా భజంతేమాం*
*జనా స్సుకృతినోஉర్జున*
*ఆర్తోజిజ్ఞాసురర్థార్థీ*
*జ్ఞానీచ భరతర్షభ*
(జ్ఞాన విజ్ఞానయోగం ఏడో అధ్యాయం, పదహారో శ్లోకం)

దీనిలో నాలుగు రకాల భక్తులున్నారు. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని. మొదటి వాడైన ఆర్తుడు అంటే అనేకరకాల బాధల్లో ఉన్నవాడని అర్థం. ఏమిటా బాధలు? శత్రుభయం, అవమానం, దొంగల లేదా దుష్టుల బాధ, క్రూరమృగాల బెడద ఇలాంటివి. వాటి నుంచి రక్షించుకోవటానికి భక్తితో భగవంతుణ్ని భజించేవాడు ఆర్తభక్తుడు. ఆర్తభక్తే ఆర్తవిద్య. గజేంద్రుడు, ద్రౌపది, జరాసంధుని చేత బంధింపబడ్డ రాజులు వీరందరూ ఆర్తభక్తులు. ఇట్లాంటి తమ భక్తితో ఆర్తత్రాణ పరాయణున్ని ధ్యానించి పీడనుంచి బయటపడ్డవారు. కాని కపటులైన వారి దొంగభక్తి వల్ల ఆర్త విద్యలు అపకీర్తిపాలయ్యాయని వేమన్న సారాంశం.

**ఆలిరంకు దెలుప నఖిల యజ్ఞంబులు**
**తల్లిరంకు దెలుప తద్దినములు**
**కాని తెరువు కర్మకాండ కల్పితమాయె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ప్రాచీనకాలంలో ఉత్తర భారతదేశంలో యజ్ఞయాగాదులకు ఎక్కువ ప్రాధాన్యముండేది. దక్షిణాదిన పూజావిధానం అగ్రస్థాన మాక్రమించింది. ఉత్తరాదిన తీర్థాలు దక్షిణాన ఆలయాలు ప్రాచుర్యం వహించాయి. కాలక్రమంలో యజ్ఞాది క్రతువులు విపరీతమైన ఆచారాలతో వికార రూపాలను ధరించినప్పుడు మత సంస్కర్తలు వాటిని ఖండించవలిసి వచ్చింది. వాటిలో భాగమే ఈ వేమన ఖండన.

యజ్ఞాల్లో భార్య రంకు ప్రస్తావన, తద్దినాల్లో తల్లి రంకు ప్రస్తావన వస్తుంది. ఒకవేళ వారు అనువ్రతలు కాకపోతే వారికి పుణ్యఫలం చెందగూడదనే అర్థంలో మంత్రాలున్నాయి.

'అఖిల యజ్ఞంబులు' అంటే అన్నిరకాల యజ్ఞాలని. 'కాని తెరువు' అంటే కర్మకాండలు కల్పించిన తగని విధానం. ఈ ఆచారాలు ఎప్పుడు ఎందుకు ఎలా పుట్టాయో తెలియదు గాని ఆధునిక సమాజంలో ఇవి హైందవ సభ్యతకు తలవంపులు కలిగిస్తాయి. ముఖ్యంగా స్త్రీలపట్ల ఇది అపచారంగా పరిణమించింది. మానవతావాదీ. సంఘసంస్కర్త అయిన వేమన స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరిచే ఇలాంటి అనాచారాలను ఆ రోజుల్లోనే ధైర్యంగా ఖండించటం గమనార్హం.

*"ఆలి సిగ్గు చెరుచు అఖిల యజ్ఞంబుల*
*తల్లి సిగ్గు చెరుచు తద్దినముల*
*కాపు సేయ కర్మకాండంబు కల్పించె"*

(డి. 1723,210) అనేది పాఠాంతర పద్యం.

**ఆలివంక వారు ఆత్మబంధువులైరి**
**తల్లివంకవారు తగినపాటి**
**తండ్రివంకవారు దాయాది పగవారు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

భార్య తరఫు బంధువులు ఎంతో సన్నిహితులయ్యారు. తల్లి తరఫువారైన మేనమామ వగయిరాలు పరవాలేదు. ఇక తండ్రివంకవారా? అబ్బో! వీరు శత్రువులతో సమానం. నిత్యజీవితంలోని మన సంబంధ బాంధవ్యాలన్నీ అంతర్గతంగా ఆర్థిక సూత్రాలను బట్టే నడుస్తున్నాయని వేమన వాటి ముసుగులు లాగి చూపెడుతున్నాడు.

ఆలి అంటే ఇక్కడ భార్య. పేదరాలు, ప్రియురాలు అన్నప్పుడు స్త్రీవాచక మన్నమాట. ఆలి అనేది ఇప్పుడు అంత నాగరికమైన మాటకాదు. వేమనే మరోచోట *"బ్రహ్మయాలి తాడు బండిరేవున తెంప"* అన్నాడు. ఆత్మ అంటే తనయొక్క అని. ఆత్మకథలాగ. తగినపాటి అంటే తగినంతవరకు అని చెప్పుకోవచ్చు. ఇక దాయాది; దాయ అనే అర్థంలో పాలివాడు, జ్ఞాతి, సగోత్రుడు, పగవాడు అనే మాటలున్నాయి. దాయం అంటే తాతతండ్రులు సంపాదించి పెట్టిపోయిన ఆస్తి. అన్నదమ్ములు పంచుకోదగిన ఆస్తి అన్నమాట. దాయభాగం అంటే పంచుకోదగిన సొమ్ములోని పాలు. మరి ఈ దాయాదులు ఎవరు? దాయాన్ని అనుభవించేవారు దాయాదులు. కొడుకూ, ఆస్తిలో పాలు పంచుకునే హక్కు ఉన్న స్త్రీ వీళ్లు దాయాదులు.

అత్తగారిల్లంటే అల్లుడికెప్పుడూ ఆశే. అత్తింటి నుంచి ఎవరొచ్చినా మర్యాదే మర్యాద! కట్నకానుకలిచ్చేవాళ్లు కదా! మేనమామలు పరవాలేదు. కాని అత్తింటి తర్వాతే. పాటి అంటే ఇక్కడ విలువ. ఇక తండ్రివైపువారా! నాయనోయ్! వీరు పాలుపంచుక పొయ్యేవారు, కాబట్టి స్పష్టంగా శత్రువులు. ఇవీ మన బంధుత్వాల వెనుక ఉన్న రక్త ప్రేమల రహస్యాలు.

వేమనను ఒక నిఖార్సయిన సామాజిక శాస్త్రవేత్తగా సాక్షాత్కరింపజేస్తుందీ పద్యం.

**ఆలు బిడ్డలనుచు అతి మోహమున నున్న**
**ధనము మీది వాంఛ తగిలియున్న**
**అట్టివాని ముక్తి అవనిలో లేదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పెళ్లాం పిల్లలపైన పిచ్చిప్రేమ ఉన్నవాడికీ, డబ్బుపట్ల హద్దులు లేని కోరికల్లో చిక్కుకున్నవాడికీ ముక్తి లేదు. చచ్చిన తరువాతి సంగతి తెలియదుగాని ఈ భూమిపైన బతికున్నంతకాలం మాత్రం లేదు.

ముక్తి అంటే సంసారబంధాలనుండి విముక్తం కావడం. అంటే వదిలించు కోవడం. తాత్విక భాషలో చెప్పాలంటే ఇంద్రియాలనుండి ఆత్మ విడువబడే స్థితిని ముక్తి అంటారు. ఆత్మకు తాపత్రయాలూ, భయం ఉండవు. భయంలేని స్థితినే ముక్తి అంటారు.

అతనికి ఆలుబిడ్డలే సర్వస్వం. మరేమీ పట్టదు. తనవారిపట్ల కొద్దో గొప్పో మోహం అందరికి ఉంటుంది. కాని ఇక్కడ అతి మోహం. మోహం అంటే వలపు, దుఃఖం, అజ్ఞానం అని అర్థాలు. చిత్తవైకల్యాన్నీ కలవరపాటునూ, నివ్వెరపాటును కూడా మోహమంటారు. వేదాంత పరిభాషలోని అవిద్య, మాయ కూడా మోహమే. అజ్ఞానమంటే మిథ్యాజ్ఞానమని. అంటే వస్తువు యొక్క యధార్థస్వభావాన్ని ఎరుగకపోవటమే మోహం.

వాంఛ అంటే కోరిక, ఇచ్ఛ, అపేక్ష అని అర్థాలు. నిష్కాముడికే మోక్షం లభిస్తుంది. ధనం పైన తీరనికోరిక ఉంటే లాభం లేదు. ధనశృంఖలాలు తెంపుకుంటే తప్ప సుఖం లేదు అని సారాంశం.

**ఆశచేత మనుజులాయువు గలనాళ్ళు**
**తిరుగుచుందురు భ్రమ తిప్పుదాక**
**మురికి భాండమందు ముసురు నీగలభంగి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మురికి కుండపైన ఈగలు ముసురునట్లుగా మనిషి భౌతిక సుఖాల చుట్టూ జీవితాంతం తిరుగుతూనే వుంటాడు. ఎన్నాళ్లు తిరుగుతాడు? ఎన్నాళ్లంటే భ్రమ తొలిగేదాక. భ్రమ తొలిగేదిలేదు, ఇక్కడ ఆశ చచ్చేది లేదు అని సారాంశం.

బతకడానికి ఆశ అవసరమే కాని ఇక్కడ నిరంతర అత్యాశ. అందుకే ఆశాపాశం, ఆశాబంధం అనే మాటలు పుట్టాయి. ఆశలో చిక్కుబడిపోతే అంతే సంగతులు! అంటున్నాడు వేమన. ఆశను వదులుకుందామన్న భ్రమ వదలనివ్వదు.

ఆశ అంటే కోరికే. తెలియని సుఖాల పైన ఆసక్తే ఆశ. భ్రమ అంటే ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా తోపింపజేసేది. "ఆయువు గలనాళ్లు" అంటే బతికి ఉన్నంతవరకు. ఆయువు అంటే వయస్సు, జీవితాన్ని పెంచేదని కూడ. ఆయుష్యం అంటే సుదీర్ఘజీవితం. భ్రమ పరిభ్రమానికి హేతువు. భ్రమవల్లనే ఆశకు అంతటి ఆరాటం. ఉన్నదాన్ని స్పష్టంగా చూడగలిగితే తప్ప భ్రమతొలగదు. భ్రమను తొలగించుకోవాలనేది సందేశం. మురికి భాండమంటే మురికి కుండ. శుభ్రపరచని వంటపాత్ర కావొచ్చు. వ్యవసాయ కుటుంబాల్లోనైతే కుడితిపాత్ర కావొచ్చు. వాటికి అంటుకొని ఉన్న మురికి పదార్థం కోసం ఈగలు ముసురుకుంటాయి. భాండం అంటే కుండ, మురికి అంటే మాలిన్యం.

బ్రౌన్ flies settle on wine అని అనువాదం చేశాడు. పాశ్చాత్య సన్నివేశంలో అది వారి అనుభవం. బ్రౌన్ వేమన పద్యాలను ఆంగ్లేయుల నుద్దేశించి అనువదిస్తున్నానని చెప్పుకున్నాడు. తెలుగురాని ఇంగ్లీషువారు వేమన పద్యాలద్వారా తెలుగు నేర్చుకోవడం సులభమౌతుందని బ్రౌన్ అభిప్రాయం.

"తిరుగుచుందురు భ్రమ తిప్పలేక (డి.1773-493)" అనేది పాఠాంతరం.

**ఆశల తెగగోసి అనలంబు చల్లార్చి**
**గోచి బిగియ బెట్టి కోపమడచి**
**గుట్టు మీరువాడు గురువుకు గురువురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కోరికలను మొదలంటా నరికేసుకోవాలి. మనసులో చెలరేగే మోహమనే నిప్పును ఉపశమింపజేసుకోవాలి. కామప్రక్రియతో పనిలేకుండా అంటే గోచిని విప్పే పని లేకుండా చేసుకోవాలి. అయినదానికీ కానిదానికీ వచ్చే కోపాన్ని నిర్మూలించుకోవాలి. అప్పుడే బ్రహ్మ రహస్యం తెలుస్తుంది. అలా తెలుసుకున్నవాడే గురువౌతాడు. గురువుకాదు, పరమ గురువౌతాడు అని సెలవిస్తున్నాడు వేమన.

ఇక్కడ గురువంటే యోగే. గురువులకు గురువంటే పరమాత్మ. తనకూ పరమాత్మకూ మధ్య ఉన్న అభేదాన్ని తెలుసుకొని దానిలో లీనమైన వాడే పరమగురువు అని సారాంశం.

ఆశ అంటే కోరిక, అపేక్ష, ఇచ్ఛ. ఆశాపాశం అంటారు సంస్కృతంలో. ఆశ అనేది తాడు. మనిషి ఆ తాడుతో కట్టబడి ఉంటాడు. ఆశకు దేశీయరూపం ఆస. కన్నడంలో ఆసె, ఆశె అంటారు. తమిళంలో ఆచై. తెగగోసి అంటే తెగేటట్టుగా నరికి అని అర్థం. పైపైన నరకటం కాదు వేరుదగ్గరినుంచి నరుక్కుంటూ రావాలి, లేకుంటే మళ్లీ మొలకలు వేస్తుంది. అందుకే విడాకులను తెగతెంపులు చేసుకోవడం అంటారు. తరువాత ఏమాత్రం సంబంధం లేకుండా చేసుకోవడమన్నమాట!

అనలం అంటే అగ్ని. జఠరాగ్ని కూడా అనలమే కాని ఇక్కడది కాదు. ఇక్కడ కామ సంబంధమైన వేడి. చల్లార్చి (చల్ల+ఆర్చి) అంటే శాంతింపజేయటం, ఆర్పటం. బహుశా చల్లటం అంటే నీళ్లు చల్లటం వల్ల ఈ మాట వచ్చిందేమో.

'గోచి బిగియగట్టి' అనేది గుహ్యేంద్రియాలకు పని లేకుండా ఉండటానికి ప్రతీక. గుహ్యం అంటే రహస్య ప్రదేశం. 'గోచి'కి అర్థం చెప్పాలా? ఏమో! నగరాల్లోని పిల్లలకోసం కాస్త వివరిద్దాం. వెనకకు దోపుకునే ధోవతి కొంగును గోచి అంటారు. సంస్కృతంలో కౌపీనం అంటారు. కచ్ఛడం అంటే కూడా గోచే. గోచి మనిషికుండే కనీస వస్త్రం. గోచిగాడు అంటే గోచి మాత్రం మిగిలిన దరిద్రుడన్నమాట. పాశ్చాత్యుడైన సి.పి.బ్రౌన్ గోచిని గురించి ఆంగ్లేయులకు వివరించటానికి ఇలా ప్రయత్నించాడు వినండి సరదాకి. To draw the skirt of the petticoat between the thighs; tuck it into the waist behind. బిగియబెట్టి అంటే మళ్లీ విప్పేపని లేకుండా అని.

'గుట్టు మీరు వాడు' అంటే గుట్టును అతిక్రమించినవాడు అంటే తెలుసుకున్న వాడు అని.

యోగి అనేవాడు కర్మలకు అతీతుడై ఉండాలి. కామక్రోధాదులను జయించాలి. పంచేంద్రియాలకు బద్ధుడై ఉండకూడదు. ఒక్కమాటలో చెప్పాలంటే నిరీహుడై ఉండాలి. నిరీహ అంటే కోరికలు లేకపోవడం.

*'ఆశ కోసి వేసి, ఆశ విడుచువాడె అతడెపో యోగిరా!'* (డి. 1769, 232); *గోచి తీసివేసి గుణము తెలిసి, జోగులెల్ల పరమయోగులు అందులో* (డి. 1769, 233) అనేవి పాఠాంతరాలు.

**ఆశలనెడి తాళ్ల నమరకోయగ జేసి**
**పారవైవగాని పరము లేదు**
**కొక్కు తిండియాస చిక్కి చచ్చినయట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నువ్వు కోరికలనే తాళ్లలో బంధితుడవు. వాటిని ఒడుపుగా కోసివేసుకుంటే గాని పరలోకం సిద్ధించదు. పందికొక్కు తిండిమీద యావతో మనుషులు పెట్టిన బోనులో చిక్కిచావదా. దాన్ని చూసి అయినా నువ్వు క్రమంగా భవబంధాలను వదుల్చుకోవాలి అని వేమన్న ప్రబోధం.

భౌతికమైన ఆశల్లోనే చిక్కువడితే ఒకనాటికి విముక్తి ఉండదు. ఆశలు పరచింతనకు అడ్డు. కనిపించని ఆశలనే తాళ్లను జ్ఞానఖడ్గంతో నరికేసుకున్నవాడే ఘనుడు. లేదా ఇహ, పరనాశనం తప్పదు. పందికొక్కును చూడరాదూ తిండిమీద గుడ్డి ఆశతో బోనులో చిక్కి చస్తుంది. పందికొక్కు అంటే పెద్ద ఎలుక. పిగ్ ర్యాట్ అంటారు ఇంగ్లీషులో. అమర అంటే ఒప్పునట్లుగా అని. 'అనుచు నర్మోక్తి చాతుర్యమమరనపుడు' అని ప్రయోగం. 'పడ్ల గాదెలో పందికొక్కులను పెట్టినట్లు' అని సామెత. ఆశ చాలా చెడ్డది. వదుల్చుకోవడమే ఉత్తమం.

*ఆశయనెడు పాశ మమరగా తెగగోసి* (డి.1773-1, 471); *కుక్కపిల్లలాస జిక్కిచచ్చిన రీతి* (డి.1727, 211) అనేవి పాఠాంతరాలు.

**ఆసనముల పన్ని అంగంబు బిగియించి**
**ఒడలు విరుచుకొనెడు యోగమెల్ల**
**జెట్టి సాముకన్న చింతాకు తక్కువ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శరీరాన్ని కష్టపెడుతూ ఆసనాలు మాత్రమే వేస్తే అవి యోగాసనాలవుతాయా? వాటి దగ్గరే ఆగిపోతే వారు యోగులవుతారా? ధ్యానప్రసక్తి లేని ఇటువంటి శారీరక ప్రక్రియ వస్తాదుల వ్యాయామ విద్యలాంటిది కూడా కాదు. దానికంటె కూడ కాస్త తక్కువ స్థాయిలోనే వుంటుందని వేమన యోగి ఈసడిస్తున్నాడు.

కూర్మాది ఆసనాలు, ముద్రలు, ప్రాణాయామాది క్రియలు చేసేవారు తాము యోగమార్గంలో ఉన్నట్టు భ్రమిస్తారు. వారు వొట్టి దాంభికులు. ఆసనాలు ఆరోగ్యాన్నివ్వవచ్చు. కాని నిలకడకు సంబంధించిన ధ్యానం వైపు వారి మనస్సు పోదు. యోగనిష్ఠ అంటే వారికి తెలియదు. యోగమంటే మనస్సు నిలపాలి. దానిద్వారా అది నిర్మలం కావాలి. ధ్యానానికీ జ్ఞానానికీ అవి సహకారులే కాని అంతిమం కావు. మనస్సు నిర్మలం కావడానికి మన సంప్రదాయంలో కొన్ని నైతిక, ఆధ్యాత్మిక నియమాలు ఉన్నాయి. వాటిని పాటించాలి. నిర్మలమైన మనస్సే మోక్షోన్ముఖ సాధనం. కైవల్యాశ్రమానికి ఎనిమిది గుణాలున్నాయి. అవి శాంతి, శమం, శౌచం, సంతోషం, సత్యం, ఆర్జవం, అదీనత్వం, అదంభత్వం. వేరు వేరు సంప్రదాయాల్లో వీటి పేర్లూ వరస కూడా మారుతాయి.

అంగం అంటే శరీరం. అవయవం అని కూడా, ఇక్కడ శరీరమే. ఒకదానిలో కొంత భాగాన్ని కూడా అంగం అంటారు. వేదాంగాలు, పంచాంగం వగయిరా. చింతాకంత తక్కువ అన్నాడు వేమన. చింతాకే ఎందుకు? చిన్నది కాబట్టి. తుమ్మాకు ఇంకా చిన్నది కదా! అట్లా కాదు. చింతాకు మనకు నిత్య జీవితంలో పనికొచ్చేది చింత చిగురును తింటాం. ఎదుట కనిపిస్తుంది కాబట్టి చింతాకు ప్రసక్తి. తుమ్మాకును మేకలు తింటాయనుకోండి. అది వేరు.

జగత్సృష్టి విషయంలో అభిప్రాయ భేదాలున్నా దర్శనాలన్నీ యోగ మార్గాన్ని మోక్షసాధనంగా అంగీకరిస్తాయి. జైన, బౌద్ధాల్లో యోగ సాధనకు గొప్ప స్థానాన్నిచ్చారు. బౌద్ధ యోగమార్గంలో ధ్యానమనేది ప్రధానమైన అంగం. 'జెన్' మొదలైన పేర్లతో ఇది చైనా, జపాన్ దేశాల్లో ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది.

యోగానికి ధ్యానాన్ని జోడించమని వేమన్న సారాంశం. అన్నట్టు వేమన కూర్చొని వున్న భంగిమ సుఖాసనం.

'ఆసనములు పన్ని'కి బదులుగా '*ఆసనములు బట్టి*' (డి 1723, 868) అని పాఠాంతరం. 'అంగంబు బిగియించి'కి బదులుగా 'అంగంబు బడలించి' (డి.1727, 680) అని ఉంది. దేహాన్ని బిగించి చేసేది వ్యాయామం. దానివల్ల శరీరం అలిసిపోతుంది. ఆసనాలు హాయిగా చెయ్యాలి. రెండింటి తాత్పర్యం ఒకటే. 'జెట్టి'కి ఝట్టి (డి.1723–863) అని మరో పాఠం. ఝట్టిని మాట్లాడేటప్పుడు జెట్టి అంటారు. రెండింటి అర్థం ఒకటే. "జెట్టిసాముకన్న..."కు బదులుగా "*గరిడి సాము కన్న కాసింత తక్కువ*" (డి.1727, 217) అని పాఠాంతరం. గరిడీ విద్య అంటే ఖడ్గ విద్య. ఇక్కడ కత్తి ప్రసక్తి సరిపోదు.

**ఇంగలంబు తోడ ఇలనల్పుతోడను**
**పరుని యాలుతోడ పతితుతోడ**
**సరసమాడుటెల్ల చావుకు మూలంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొందరితో హాస్యమాడితే అది వికటించి ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు రావొచ్చు. వేటితో లేదా ఎవ్వరితో హాస్యమాడకూడదు? నిప్పుతో, నీచునితో, పరాయివాడి భార్యతో, పాపితో.

సరసం అంటే పరిహాసం, వినోదం స్వారస్యం అనే అర్థాలున్నాయి. కాని స్థలం, సమయం, సందర్భం వికటించినప్పుడు ఆ సరసం విరసంగా మారొచ్చు. సరసుడు అంటే రసికుడు, రసజ్ఞుడు అని అర్థాలు. అలాగే సరసత అంటే మాధుర్యం, లాలిత్యం అని. అయితే వీటి సమయ సందర్భాలు వేరు.

నిప్పుతో చెలగాటమాడితే ప్రాణాలకే ముప్పు రావొచ్చు. నీచుడు నీహాస్యాన్ని చవకబారు స్థాయిలోనే అర్థం చేసుకోవొచ్చు. పరాయివాడి భార్యతో హాస్యం అపార్థాలకు దారితీసి కాపురాలు కూల్చెయ్యొచు, లోకచ్యుతుడితో సరసం నీ ప్రతిష్టకు పెను సవాలు కావొచ్చు. కాబట్టి అనువుగాని చోట వినోదాలు హద్దులు దాటకుండా చూసుకుంటే మంచిది. "*ఇంగలంబుతోడ ఏలిన పతితోడ* (డి.1727, 218) అనేది పాఠాంతరం. ఇలా చెలగాటమాడ గూడని వారి పట్టిక పెరిగిపోతూనే వుంటుంది.

**ఇంచుకంతబోన మీశ్వరార్పణ మన్న**
**పుణ్యలోకమునకు పోవునతడు**
**అన్నదానమునకు నధిక దానము లేదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొంచెమైనా సరే ఆ అన్నం తనది కాదనుకొని, ఈశ్వరునికి భావసమర్పణం చేస్తే నరుడు జీవన్ముక్తుడవుతాడని వేమన్న ప్రబోధం. ఈ కారణం వల్లనే అన్నదానం అన్నిదానాలను మించినట్టిది అని ఉద్ఘోషిస్తున్నాడు.

ఇంచుక అంటే అణుమాత్రమైంది, కించిత్ అని అర్థాలు. 'ఇంచుకయేని పాపమున కెన్నడు రోయక' అని ప్రయోగం. దీనికి ఇంచుకించుక అని ఆమ్రేడిత రూపం కూడా వుంది. బోనం అంటే అన్నమే. భోజనమే బోనం. బోనం సేయక అంటే తిండి తినక అని. బోన కావిళ్లు, బోనపుటిక అంటారు. అంటే అన్నం బుట్ట అని అర్థం. తెలంగాణాలో బోనాలపండుగ ఎంతో ఘనమైంది. అమ్మవారికి అలంకరించిన కుండలో నైవేద్యంగా పెట్టే అన్నమే బోనం.

ఇక ఈశ్వరుడు. ఈశ్వరుడంటే బ్రహ్మ. బ్రహ్మ అంటే ఎవరు? జగత్తును సృష్టించి నడుపుతున్న ఒక మహాశక్తి. జగత్కారకుడైన వాడు, అతడు అన్నానికి కూడా కర్తే కదా! మరి అతనికే మళ్లీ అన్నం అర్పించటమెందుకు? ఎందుకంటే అతని ద్వారా ఆకలి గొన్నవానికి చేరేటందుకు అనేది విశ్వాసం.

ఈశ్వరుని పేర ఇచ్చేదే అన్నదానం. దీనికి స్వలాభాపేక్ష ఉండదు. ఇది అన్ని దానాల కన్న మిన్న. ఎలా? మనవారు పది దానాల గురించి చెప్పారు. అవి 1.గోవు, 2.భూమి, 3.నువ్వులు, 4.బంగారం, 5. నెయ్యి, 6.వస్త్రాలు, 7.ధాన్యం, 8.బెల్లం, 9.వెండి, 10. ఉప్పు. ఈ పదింటిలో అన్నం లేదు. వీటికంటే అన్నం గొప్పదంటున్నాడు వేమన. ఎందుకు? ఎందుకంటే అన్నానికి తక్షణ ప్రయోజనముంది. ఆకలిని తీరిస్తే పోయే ప్రాణాలను నిలుపుతుంది. భోంచేస్తూ ఎవరైనా అన్నాన్ని ఒలకబోస్తే పెద్దవారు దానిని తప్పుగా భావించి కళ్లకద్దుకుంటారు. అంత విలువైంది అన్నం.

బోనమునకు బదులుగా అన్నం (డి.1723, 583) బలియు (డి.1769, 730) అనే పాఠాలున్నాయి గాని ఈ మూడింటి అర్థం ఒకటే. కాని బలి సందర్భం లేదు. బలి అంటే శాంతికోసం క్షుద్ర దేవతలకు సమర్పించే నెత్తురుకూడు. బోనం, అన్నంలలో బోనమే పద్యధారలో చక్కగా ఇమిడిపోయింది. 'పోవునతడుకు *బదులుగా* 'పోవునరుడు' (డి.1735, 583) అని ఉంది గాని అదో పెద్ద పాఠభేదం కాదు.

**ఇంటియాలి విడిచి ఇనపకచ్చులు గట్టి**
**వంటకంబు రుచుల వాంఛలుడిగి**
**ఒంటినున్నయంత అంటునా తత్వంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు యోగి కావాలనుకున్నాడు. భార్యకు దూరంగా ఉండి బ్రహ్మచర్యం పాటించి, ఇష్టమైన తిండిపదార్థాలపైన కోరికను చంపుకొని ఎక్కడో ఒంటరిగా ఉంటే యోగివవుతావని ఎవరో చెప్పి ఉంటారు. ఇక అంతే! ఇనపకచ్చడం కట్టుకొని బయలుదేరాడు. అతని పిచ్చి కాకపోతే ధ్యానం వల్ల, సాధనవల్ల యోగులవుతారుగాని దానికి సంబంధించిన బాహ్య చేష్టలవల్ల పరమాత్మ సంబంధమైన జ్ఞానం కలుగుతుందా అని వేమన్న ఉవాచ.

ఇక్కడి మనవాడు దొంగ యోగి కాదు గానీ అమాయకపు పక్షి. ఈ పద్యంలో ఇనపకచ్చులు అనేది ముఖ్యమైన మాట. ఇది ప్రాచీనకాలంలో కొన్ని సందర్భాల్లో ఉంది. తాపి ధర్మారావు, వేటూరి ప్రభాకరశాస్త్రి గార్లు దీని గురించి మంచి పరిశోధక చర్చ చేశారు. ఇనుపకచ్చడం అంటే ఇనుపగోచి, బిగుతుగా ఉండేది. బ్రౌన్ An iron girdle అని అర్థం చెప్పాడు. ఇంద్రియ నిగ్రహంతో బ్రహ్మచర్యం పాటించడానికి కొందరు దీనిని పాటించేవారని ఒక వాడుక. కాని గ్రీకు, ఈజిప్టు రాజుల కాలంలో స్త్రీల పరంగా దీని వాడకం ఉంది. రాజులు దండయాత్రలకు వెళ్లేముందు తమ రాణులకు ఇనుపకచ్చడాలు కట్టి తాళం వేసి దాని చెవిని తమ దగ్గర ఉంచుకునేవారు. అది వారి శీల సంరక్షణ కోసం అని వారి భావన. కాని వంశసాంకర్యం జరగకుండా అదొక జాగ్రత్త అని ఎవరికైనా అర్థమౌతుంది. అందుకే దీనిని chastity belt అనేవారు.

అయితే ఇక్కడ పురుషపరంగా చెప్తున్నాడు వేమన. యోగి కావాలనుకునేవాడు తనకు తాను కట్టుకునే కచ్చడమిది. ఇనుప అంటే దృఢమైన అని అర్థం చెప్పుకోవాలి. మనుచరిత్రలో వరూధిని ప్రవరుడితో *"ఇనుపకచ్చడాలు తాల్చిన మునివరులు తామరస నేత్రవిండ్ల బంధాలు కారె"* అంటుంది. కట్టుకునే వాడికి విప్పుకునే అధికారం కూడా ఉంటుందికదా! కాని దీనివల్ల ప్రయోజనం ఎంతవరకు అనేది చింత్యం. నిజానికి దీనివల్ల నష్టం కూడా, ఎందుకంటే మనస్సెప్పుడూ దాని మీదే వుంటుంది కాబట్టి. ఇంద్రియ నిగ్రహమనేది లోపలి నుంచి రావాలనేది సారాంశం.

వంటకం అంటే వండిన ఆహార పదార్థం. వాంఛ అంటే కోరిక; వాంఛలుడిగి అంటే కోరికలను అణచుకొని అని అర్థం. ఒంటినున్నయంత అంటే అయినవారికి దూరంగా ఏకాంతంగా ఉన్నంతమాత్రాన అని.

**ఇంటియాలి విడిచి ఇల జారకాంతల**
**వెంట దిరుగువాడు వెఱ్ఱివాడు**
**పంటచేను విడిచి పరిగె యేరిన యట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కట్టుకున్న భార్యను విడిచి వ్యభిచారిణుల వెంట పడటం పిచ్చితనం కాక మరేమిటి? ఇదెట్లా వుంటుందంటే నిండుగా పండిన చేనును విడిచిపెట్టి పంటకోసిన చేనులో పడి రాలిన గింజలను ఏరుకున్నట్టు.

'ఇంటియాలి' అన్నాడు వేమన. అంటే ఇల్లాలు. 'ఆలు' అంటే మామూలుగా స్త్రీ అనే అర్థముంది. పేదరాలు, గుణవంతురాలు ఇలా. కాని ఈ పద్యం లోని ఆలు ఆలుమగలు లోని ఆలు, అంటే భార్య. జారకాంత అంటే జారస్త్రీ, అంటే వ్యభిచారిణి. వ్యభిచారం అంటే కుటుంబ వ్యవస్థకు వెలుపల అభిచరించటం. Deviation from the common rule అన్నమాట. కాంత అంటే అందమైన వనిత. ఒట్టి స్త్రీ కాదు. అందుకే అంత ఆకర్షణ! పంటచేను అంటే పండినచేను. పరిగె చేను అంటే పంటను కోసిన చేను. పంటను కోసిన తర్వాత మడిలో రాలిన వెన్నులను పరిగెలంటారు. ప్రాచీన కవులు భూమిని 'పంట వలంతి, పంటతొయ్యలి' అని వర్ణించారు. "వలపుల పంటను విడిచి" వలపు లేనిరిక్త సస్యం వైపు వెళ్లడం వెఱ్ఱితనం అని వేమన భావన. పైగా జారకాంతవైపు వెళ్లినవాడు జారుడవుతాడు. విటుడవుతాడని గుర్తుంచుకోవాలి. కేవలం స్త్రీని నిందించటం న్యాయం కాదు.

వేమన 'కామికాక మోక్షకామిగాడు' లాంటి ఇత్యాది పద్యాల వల్ల అతడు తొలి దశలో భోగి అనీ తరువాత యోగి అయ్యాడనీ లోక వాడుక. కాని అతడు రచించిన వేలాది పద్యాలు చూస్తే విటజీవితాన్ని సమర్థించే పద్యం ఒక్కటి కూడా కనిపించదు. పైగా అనేక పద్యాల్లో వేశ్యాలోలత్వాన్ని నిరసించాడు.

పరిగెలు ఏరటమంటే చేనిలో కోసిన పైరును మోపులు కట్టి తీసికెళ్లిన తర్వాత రాలిన వెన్నుల నేరుకోవడం. పూర్ణానుభవాన్ని కాదని భ్రమల వెంట పరిగెత్తడమన్నమాట: ధర్మార్థ కామ మోక్షాల్లో వేమన కామాన్ని ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. "సతిని పెనగువాడు సంసారయోగిరా" అన్నాడు. కాని ప్రేమ, వలపు లేనప్పుడు వివాహవ్యవస్థ కూడా డొల్ల అవుతుంది. కాబట్టి దేనికైనా ప్రేమ ముఖ్యం అనేది సారాంశం.

**ఇంటిలోని ధనము ఇది నాదియనుచును**
**మంటిలోన దాచు మంకు జీవి**
**కొంచబోదు వెంట గుల్లకాసైనను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కూడబెట్టిన డబ్బును (ఎలా కూడబెట్టాడనేది తరువాత సంగతి) మట్టిలో పాతిపెట్టి దాచుకునే వాడు మూర్ఖుడు. చచ్చిపోయేటప్పుడు గుల్లకాసును కూడా వెంటతీసి కెళ్తాడా అంటున్నాడు వేమన. గుల్ల కాసు అంటే గవ్వ. ప్రాచీన కాలంలో, వేమన కాలానికి కూడా నాణాలతో పాటు గవ్వలకు కూడా మారకపు విలువ ఉండేది. *'గజపతింట నెన్న గవ్వలు చెల్లవా; గణకులొప్పియున్న గవ్వలు చెల్లవా'* అని వేమనే మరో చోట ప్రయోగించాడు. ద్రవ్యవ్యాప్తిలో గవ్వది కనీస విలువ. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీ యాత్ర చరిత్రనాటికి చెన్నపట్నం నుంచి హైదరాబాద్ దాకా ఇవి వ్యాప్తిలో ఉన్నట్టు తెలుస్తుంది. ఆయన వాటి విలువను కూడా తెలిపాడు. చూడండి. *"వారికి కొన్ని గవ్వలయినా ఇచ్చిపోకపోతే అవమానము తోచుచున్నది. చెన్నపట్టణపు రూపాయికి అకడి పయిసాలు 50. పయిసా 1కి 20 పుంజీల గవ్వలు. పుంజీ 1కి 4 గవ్వలు"* (కాశీయాత్ర చరిత్ర పేజీ–34) గవ్వది కనిష్ట విలువ అన్నమాట. అందుకే వాడు *'చిల్లి గవ్వకు కూడా కొరగాడు'* అనే సామెత పుట్టింది.

'మంటిలోన దాచు' మంటి మన్నుకు సంబంధ షష్ఠీ విభక్తి. Genitive case అంటారు ఇంగ్లీషులో. మన్ను సంబంధమైనది మన్నే. 'మంట బెట్టుట' అంటే మట్టిలో పాతుట అని. అగ్నిసంబంధం కాదిక్కడ. ఇక 'మంకు జీవి' అంటే మొండివాడు. గడుసువాడు, దుర్జనుడు అనే అర్థాలు కూడా ఉన్నాయి కాని అవి సందర్భాన్ని బట్టి. 'కొంచబోవు' అంటే మోసుకొని పోవు, తీసుకొని పోవు అని. కొనుచుపోవు అనేది కొంచబోవు అయ్యింది. to buy అనే అర్థంలో 'కొనుట' ఉంది. అంటే పైసలిచ్చి తీసుకొని పోవటమే కొంచబోవు, కొంటబోవు రూపాలు ఇప్పటికీ రాయలసీమ, తెలంగాణా వ్యవహారంలో ఉన్నాయి.

డబ్బును మట్టిలో పాతిపెట్టిన వాడు మట్టిలోనే కలిసిపోతాడు. ఆ డబ్బు ఎవరికీ చెందదు. బతికి ఉన్నప్పుడే నలుగురికి ఉపయోగపడే పని చెయ్యాలి. అలా చెయ్యనివాడు మంకుజీవి, కమ్యూనిస్టు వ్యవస్థలో శ్రమతో వచ్చిన ధనాన్ని నలుగురికి పంచుతారు. క్యాపిటలిస్టు వ్యవస్థలో తాము అనుభవిస్తూ నలుగురి అనుభవంలోకి తెస్తారు. వ్యవస్థలో తేడా ఉన్నా డబ్బును స్థిరంగా ఉండనివ్వరు. నలుగురికి పనికిరాని డబ్బు ఉన్నా లేనట్టే అని వేమన్న ప్రబోధం.

**ఇంతి కనులు చనులు యెంత లెస్సను చూచి**
**మోహపడును బుద్ధి మోసపోయి**
**గరిసెలోని వాని కానలేడాయెరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మగువ వెడల్పాటి కళ్లలోకి చూసి, ఒద్దికయైన వక్షోజాలను గమనించి, భ్రమలపాలై మోహిస్తాడు గాని తన దేహంలోనే సకల సౌందర్యంతో అలరారే పరబ్రహ్మాన్ని చూడలేడు అదేమి చిత్రమో! అని జాలిపడుతున్నాడు వేమన.

పై పై మెరుగులకే సర్వమూ మరిచిపోతాడుగాని తనలోనే సర్వం ఉందని తెలుసుకుంటే ఎంత బాగుండేది అని సారాంశం.

ఇంతి అంటే భార్య, స్త్రీ, పెండ్లికూతురు, చెలికత్తె అనే అర్థాలున్నాయి గాని ఇన్ అంటే మాధుర్యం. ఇంతి దేశీయపదం. ఇన్‌కు స్త్రీ ప్రత్యయమైన – తి చేరిస్తే ఇంతి శబ్దం ఏర్పడిందని గతంలో చెప్పుకున్నాం. గుర్తుందా సినారె రాసిన *'ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి'* అనే సినీ గీతం!

లెస్స అంటే బాగు. లెస్సదనం అంటే యోగ్యత. 'దేశ భాష లందు తెలుగు లెస్స' అన్నాడు శ్రీకృష్ణదేవరాయలు. ఉత్తమమైనదని. లెస్స అంటే తెలంగాణాలో చాలా అని. *'ఆ సభకు లెస్సమంది వచ్చిండ్రు'* అంటే ఎక్కువమంది అని. ఇక్కడ 'లెస్సను చూచి' అంటే పరిశీలించి చూచి అని. *'అమ్మ కుశలంబె, సాధ్వియ నామయంబె, దేవి భద్రంబె, లెస్సలా పువ్వుబోణి'* అని ప్రయోగం. 'బుద్ధి మోసపోయి' అంటే భ్రమించడం.

గరిసె అంటే వడ్లగాదె. ఇక్కడ శరీరానికి సంకేతం. రైతు నేపథ్యం నుంచి వచ్చినవారు మాత్రమే రాయగలిగిన పంక్తి యిది. సాధారణంగా వేదాంతానికి సంకేతంగా వాడే ఘటాన్ని వేమన్న గరిసె అన్నాడు. ధాన్యం నిలవచేసే గదిని కూడా గరిసె అంటారు. అలాగే ఒక ధాన్యపు కొలత. ఆరువందల కుంచాల వడ్లు పట్టేది గరిసె అన్నాడు బ్రౌన్. అప్పటికి కుంచం అంటే నాలుగుముంతలు అంటే నాలుగు మానికలు. దేశ, కాలభేదాల వల్ల ఈ కొలతల్లో మార్పులుండవచ్చు.

బహిర్ముఖుడివై భ్రమల పాలుకావడం కంటే లోపలికి చూసుకొని పరబ్రహ్మాన్ని దర్శించడం మేలు అంటున్నాడు వేమన. దేహాన్ని వడ్లగరిసెతో పోల్చడానికి అందులో అన్నం (వడ్లు) ఉండటమే కారణం. అన్నం పరబ్రహ్మం అన్నది ధ్వని.

*'ఇంతి కన్నుచన్ను లెంతలేసని చూచి'* (డి.1723, 89; డి.1735, 89) అనేది పాఠాంతరం.

**ఇంతి జూచె నేని ఇంతంత యనరాదు**
**కాలవహ్ని లక్కకరగినట్లు**
**వట్టి మోహమిట్లు రట్టుల జేసెరా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అతడో అందగత్తెను చూశాడు. అంతే! అతని విచక్షణాజ్ఞానం కరిగిపోయింది. ఎట్లా? ఎట్లాగంటే నిప్పుకు దగ్గరగా వుంచిన లక్కలాగ. చూశారా! స్త్రీ వ్యామోహం ఎలా అల్లరి పెడుతుందో అంటున్నాడు వేమన.

ఇంతి అంటే స్త్రీ. భార్య కూడ 'ఇంతంత' ఇంత, అంత అంటే అల్పం కాదని, చాలా ఎక్కువని.... వహ్ని అంటే అగ్ని, మోహం వల్ల అతడు నిప్పు సమీపంలోని లక్కలా కరిగిపోయాడు అంటే ఢీలా పడిపోయాడు. పైగా అది వట్టి వహ్ని కాదు. కాలవహ్ని. కాలవహ్ని అంటే ప్రళయాగ్ని. కార్చిచ్చు, దావానలం ఇట్లాంటివే. మోహం కలగకముందు అతడు బలవంతుడే. మోహం వల్ల బలహీనుడయ్యాడు. లక్క చిన్నమంటకే ఆగదు. ఇక పెనుమంటకేం ఆగుతుంది అని వేమన్న సారాంశం.

లక్క ఒక చెట్టు బంక. లాక్ష అనే ఓ జాతి కీటకాలు కుసుమ, రేగు లాంటి చెట్ల పై గూళ్లు ఏర్పరచుకుంటాయి. ఆ గూళ్లలోంచే లక్క ఉత్పత్తి అవుతుంది. దీని ల్యాటిన్ పేరు ల్యాక్ కాక్యుస్ లాకా. బహుశా లక్క అనే పేరు దీని నుంచే వచ్చివుంటుంది. గుర్తుందా కృష్ణశాస్త్రి గారు ఓ పాటలో 'లాక్షారుణ పదయుగళా' అన్నాడు.

వహ్నికి బదులుగా అగ్ని అని వాడొచ్చు కదా. వహ్నిని సాభిప్రాయంగా వాడాడు వేమన. వహ్ని అంటే యజ్ఞంలో హవిస్సులను వహించి దేవతల కోసం తీసికెళ్లేది అని అర్థం. ఇక్కడ మోహం అతడి స్థైర్యాన్ని ఎత్తుకపోయిందన్నమాట! ఇక్కడి మోహం వట్టి మోహం, రిక్తమైనది. పనికిమాలిందని. దాని కోసం కలవరపాటు వల్ల బతుకు అల్లరి పాలయ్యింది. అవస్థలు కొని తెచ్చుకున్నట్లైంది. రట్టుల జేసెరా అంటే రచ్చకెక్కించిందని అర్థం.

మోహభ్రాంతి వల్ల మొదటికే మోసం వస్తుందని వేమన్న ఉవాచ.

'ఇంతి జూడు చిత్తమింతింత గరకును

ఇట్టినట్టి మోహ మెంతైన జేసురా' (డి. 1727, 234) అని పాఠాంతరం

**ఇంతి తనదు పేరు నెల్ల కాలంబును**
**ప్రజలు తలచునట్లు ప్రతిభ గాంచె**
**ఇంతికి పతిభక్తి యెంతన వచ్చును?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒక స్త్రీ తన శక్తి వల్లా, స్ఫూర్తి వల్లా, దీప్తి వల్లా సంతానాన్ని కని లోకంలో తన కీర్తి కలకాలం ఉండేట్టుగా చూసుకుంటుంది. ఇందులో ఆమె ప్రజ్ఞ పాలు ఎంత? పతిభక్తి పాలెంత? అని ప్రశ్నించుకొని ఆలోచించమంటున్నాడు వేమన.

ఇల్లాలు సంతానసాఫల్యం వల్ల కుటుంబంలో తన ఉనికిని శాశ్వతం చేసుకుంటుంది. కన్నపిల్లలకు తన శక్తినీ వన్నెనూ ధారబోసి తన ముద్రను స్థాపిస్తుంది. అదే ఆమె ప్రతిభ. ప్రతిభ అంటే సమయస్ఫూర్తితో వికసించే బుద్ధి. ఆమె సమయస్ఫూర్తి ఆమె భర్తతో వ్యవహరించే తీరులో వుంటుంది. అందుకే ఆమె ఇంతి. ఇంతి అంటే స్త్రీ; ఇల్లాలు, పెండ్లికూతురు అని కూడా. ఇది అచ్చమైన దేశీయ పదం. మూలద్రావిడధాతువైన 'ఇన్'కు తియ్యనైన అని అర్థం. దానికి స్త్రీ ప్రత్యయమైన 'తి' చేరి ఇంతి శబ్దం ఏర్పడి వుంటుంది. కన్నడంలో 'ఇని, ఇనె' అంటే మాధుర్యం, లావణ్యం అని అర్థాలు. తమిళంలో 'ఇనియర్' అంటే ఇష్టమైనవారని.

సంతానం విషయంలో స్త్రీ త్యాగమయి. అదే ఆమె ప్రతిభ. పిల్లలకు తల్లిపక్కన తండ్రిది రెండోస్థానమే. తండ్రి కారకుడు, తల్లి కార్యం. సామాజికరంగంలో ఆమె స్థానం ఎలాంటిదైనా సృష్టిలో ఆమె హోదా మహోన్నతమైంది. మరి ఆమెకీ గొప్ప పదవి పతిభక్తి వల్ల వచ్చిందా? వచ్చిందంటే వచ్చింది. ఆ మాట ఇష్టం లేకపోతే వారిద్దరి అన్యోన్యత వల్ల వచ్చిందనడం లోకానుభవసత్యం. పరస్పర అవసరం కూడా దీనికి మూలం. స్త్రీ పురుష సంబంధాలు పునర్ మూల్యాంకణానికి గురవుతున్న నేటి తరుణంలో ఈ వేమన పద్యం కొత్త ఆలోచనలను ప్రేరేపిస్తుందనడంలో సందేహం లేదు.

**ఇంద్రియములచేత ఎగ్గొందుచుండెడు**
**వెర్రి మనుజుడేల వెదకు శివుని?**
**ఇంద్రియములరోసి యీశుని చూడుడీ!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు ఇంద్రియాల బారినపడి బాధపడుతున్నాడు. అట్లాంటివాడు శివుడికోసం వెతుకుతాడా? వెతికితే మాత్రం అతడు పిచ్చివాడే. ఎందుకంటే ఇంద్రియ లోలత్వాన్ని వదిలేస్తే గదా ఈశ్వరుడు కనిపించేది. కాబట్టి ఇంద్రియ సుఖాలను ఏవగించుకొని వదిలేస్తే తప్ప ఈశ్వర దర్శనం కాదంటున్నాడు వేమన.

ఇంద్రియబద్ధుడై నానా అవస్థలు పడేకంటే ఇంద్రియ విజయం సాధించడం మంచిది. అప్పుడే యోగసాధనకు యోగ్యత లభిస్తుంది. యోగసాధకుడికే శమదమాదులు సాధ్యపడతాయి అని సారాంశం.

ఇంద్రియాలంటే అందరికి తెలిసినవే. ఇవి ఐదు. పంచేంద్రియాలంటారు. చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు. వీటికి జ్ఞానేంద్రియాలని పేరు. వీటి ద్వారానే మనిషికి అన్నీ అనుభవంలోకి వస్తాయి. అనుభవం వ్యామోహంగా మారితే వాటికి లొంగిపోవడం ఖాయం. ఇంద్రియాలకు లోబడినవాడికి ఆధ్యాత్మిక మార్గం దొరకడం కష్టం. మరో ఐదు ఇంద్రియాలున్నాయి. అవి వాక్కు, చెయ్యి, పాదం, పాయువు, ఉపస్థం. జ్ఞానేంద్రియాలు దేన్నైనా గుర్తించే సామర్థ్యాన్నిస్తే ఇవి పనిచేసే సామర్థ్యాన్ని కలిగి వుంటాయి. అంటే ఇంద్రియాలు పది. వీటికి మనసు కలిస్తే ఆ సంఖ్య పదకొండుకు చేరుతుంది. దీనిని అంతరింద్రియమంటారు. ఆలోచించి నిర్ణయించే సామర్థ్యం దీనికుంటుంది. మనసును మరికొన్ని విభాగాలు చేసి బుద్ధి, అహంకారం, చిత్తం అన్నారు. ఆలోచించడం, అనుమానించడం, స్వార్థంగా ఉండడం, అనుభూతి చెందడం వీటి పని. ఇన్నిగొడవల్లోపడి కొట్టుమిట్టాడేవాడికి దైవ సాక్షాత్కారం ఎంతకష్టం! అందుకే వీటితో ఎగ్గొందక అంటే కలతపడక (ఎగ్గు అంటే హాని, కీడు) వాటిపట్ల అసహ్యం (రోయు) పెంచుకొమ్మంటున్నాడు వేమన. అప్పుడు గాని దైవ సాన్నిధ్యానికి మార్గం సుగమం కాదు అని వేమన్న ఉవాచ.

**ఇచ్చిపుచ్చుకొన్న హితులును, మనుమను**
**తగ్గులేక యిల్లు తామరవలె**
**కాచిపూచి పండి కడురమ్యమై యుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రెండు కుటుంబాల మధ్య జరిగే వివాహ సంబంధాలవల్ల కొత్త చుట్ట పక్కాలు, మిత్రులు ఎక్కువౌతారు. ఇల్లు వృద్ధి చెందుతుంది. కొలనులో తామరల గుంపు లాగ మొగ్గలేసి, పుష్పించి, ఫలించి బాగా విస్తరిస్తుంది. ఇక అది చూడచక్కని దృశ్యం కదూ! అంటున్నాడు వేమన.

ప్రాచీన స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థలో దేనికైనా కుటుంబమే ఆధారం. కుటుంబం బాగుంటే గ్రామం బాగున్నట్టు. ఒకప్పుడు భూసంబంధాలు బాంధవ్యాలుగా పరిణమించేవి. రాయలసీమలో నేటి ముఠాకక్షలకు పునాదులు పాలెగార్ల కాలంలోనే పడ్డాయి. ఒకే గ్రామంలో కుటుంబాల మధ్య శత్రుత్వాలు స్థిరపడ్డాయి. వివాహ సంబంధాలతో అవి రూపుమాసిపోవాలని బహుశా వేమన్న ఆకాంక్ష! అప్పుడు ఆ రెండు కుటుంబాలు సరస్సులోని సరసిజాలలాగ అభివృద్ధి చెందుతాయి. 'తామరతంపర' లాగ వృద్ధి చెందాలని దీవిస్తారు. తంపర అంటే సమూహం. "తామరతంపరైన చెలులు జుట్టలు *గలసి*" అని ప్రయోగం.

తామర అనేది దేశిపదం. కన్నడంలో తామరె, తావరె, తమిళంలో తామరై. మనుములు అంటే సన్నిహితుల మధ్య జరిగే వివాహ సంబంధాలు. 'తగ్గు లేక నర్లు తామరవలె' (డి. 1727, 247) అనేది పాఠాంతరం.

**ఇచ్చువాని వద్ద ఈని వాడుండిన**
**చచ్చుగాని ఈవి సాగనీడు**
**కల్పతరువుకింద గచ్చ చెట్టున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దానమిచ్చేవాడి పక్కన దానగుణంలేని వాడు గనక వుంటే చావనన్నా చస్తాడు గాని ఆ దాన ప్రక్రియకు అడ్డుపడి దానిని సాగనివ్వడు. ఇదెట్లా వుంటుందంటే ముండ్లతో కూడిన గచ్చచెట్టు కల్పవృక్షం చుట్టూ ఆవరించుకొని దాని ఫలాస్వాదనకు అవరోధంగా నిలిచినట్టు.

ఈవి అంటే దానం, త్యాగం, బహుమానం అనే అర్థాలున్నాయి. ఈవికాడు అంటే దాత. అన్నట్టు కల్పతరువుకు ఈవిమాను అనే పేరుంది. అంటే కోరికలు తీర్చే చెట్టని. ఇది స్వర్గలోకంలో వుంటుంది.

గచ్చచెట్టు అంటే ముండ్లచెట్టు. వీటికి గచ్చకాయలు కాస్తాయి. పిల్లలు గచ్చనకాయలు అంటూ వీటితో ఆడుకుంటారు. వీటిలో గింజలుండి గలగల శబ్దం చేస్తాయి. ఇవి ఆకాశం రంగులో ఉంటాయి. ఇవ్వనివాడిని వేమన గచ్చ చెట్టుతో ఎందుకు పోలుస్తున్నాడు? ముండ్లుండటం వల్ల. 'గచ్చమీద ఇసుక వేసి కయ్యానికి పిలుస్తున్నది' అని సామెత. ఈనివాడు తాను ఇవ్వకపోతే పాయె ఇచ్చేవాడికి అడ్డుపడటమెందుకు? ఎందుకంటే వాడు కుత్సితుడు కాబట్టి, కపటి కాబట్టి, ఈర్ష్యాళువు కాబట్టి, లోభి కాబట్టి, చాడీకోర్ కాబట్టి; ఇన్ని దుర్గుణాలు ఉన్నాయి కాబట్టే వాడు చెడగొట్టేవాడయ్యాడు.

ప్రపంచంలో ధనానికి సాంఘిక మూల్యమే గాని ఆధ్యాత్మిక దృష్టితో దానికి విలువ లేదు. వేమన జీవితం యొక్క క్షణికత్వాన్ని అస్థిరత్వాన్ని గురించి చెప్తూ విరక్తిని ప్రబోధిస్తూ దానగుణాన్ని ప్రోత్సహిస్తున్నాడు.

'ఈని వాడుండిన'కు బదులుగా, *ఇయ్యని వాడుండ'* (డి.1725, 428) అని పాఠాంతరముంది గాని పద్యంలోని పాఠమే హాయిగా వుంది.

**ఇనుము విరిగెనేని ఇనుమారు ముమ్మారు**
**కాచి యతుక నేర్చు కమ్మరీడు**
**మనసు విరిగెనేని మరియంట నేర్చునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఇనుమే కాదు మరెన్నో లోహాలు విరిగినట్టయితే రెండోసారి మూడోసారి కూడా వేడి చేసి కరిగించి అతకొచ్చు. కాని మనసు విరిగిందా అతకటం దాకా ఎందుకు, అంటగట్టడం కూడా సాధ్యం కాదంటున్నాడు వేమన.

ఇనుమారు అంటే రెండు పర్యాయాలు. ఇరు నుంచి ఇనుగా మారింది. ఇన్నూరు అంటే రెండునూర్లు. ఇట్లాంటిమాటలు మన పల్లెల్లోంచి క్రమంగా చెవిమరుగైపోతున్నాయి. ముమ్మారు కూడా ఇట్లాంటిదే. అంటే మూడు తడవలు 'మూ' అనేది మూల పదం, అంటే మూడు అని. కాచి అంటే వేడిచేసి, కరిగించి, ద్రవమైతే మరిగించి అని అర్థాలు. కాచి వడబోశాడు అంటే ఛాయ మారిపోతుంది. సాధికారత సాధించాడు అని అర్థం.

అతుకు, అంటు అనే మాటలు వాడటంలో వేమన్న సామర్థ్యం కనిపిస్తుంది. ఇనుము విరిగితే అతకొచ్చు. పైగా ఆనవాలు లేకుండా అతకొచ్చు. కమ్మరికి ఆ నైపుణ్యం వుంది. కాని మనసు విరిగితే ఆ మనసు ముక్కలను కనీసం దగ్గరకు చేర్చి అంటగట్టటం కూడా వీలుకాదు. చెట్లను అంటగట్టటం ఇట్లాంటిదే. అంటు మామిడి చెట్టు అనరూ అలాగ. మనసు మెత్తనిదే, కరిగేదే కాని ఒక్కసారి విరిగితే అతుక్కోని విచిత్రపదార్థమది. అసలు మనసు విరగడమంటే ఏమిటి? మనసు విరగడమంటే మనస్తాపం కలగడం. ఈ తాపం ఎప్పటికీ తీరేది కాదంటున్నాడు వేమన. ఇంగ్లీషులో చెప్పాలంటే spirit పోవడం అని చెప్పుకోవచ్చు.

వేమన కోమలమైన కవి హృదయానికి ఈ పద్యం పరాకాష్ట. వేమన్న పెళుసు మాటల వాడనే పేరున్నప్పటికీ ఆ మాటల వెనుక ఒక సున్నితమైన సంస్కారం కూడా వుంది. ఆయన కోపం అవ్యవస్థ పైన, వంచనపైన. దేనిపైనా కోపం లేని వాడు గొప్పకవి కాలేడు.

**ఇమ్ముదప్పువేళ ఎమ్మెలన్నియు దప్పి**
**కాలమొక్కరీతి గడుపవలయు**
**విజయుడనుగు దప్పి విరటుని గొలువడా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఇంటికి దూరమైనప్పుడు పూర్వపు విలాసాలన్ని కట్టిపెట్టి అప్పటి సమయానికి అనుగుణంగా ప్రవర్తించవలసి వుంటుంది. అజ్ఞాతవాస సమయంలో అర్జునుడు విరాటరాజు కొలువులో గత శౌర్యాన్ని మరిచిపోయి సామాన్యుడిలా సేవించాడు గదా!

ఇమ్ము అంటే స్థానం, వీలు, అనుకూలం, ఇంపు, ప్రీతి, విరివి, ప్రాపు, పదిలం అనే అర్థాలున్నాయి. ఇక్కడ స్థానమే. *'నెలవు దప్పు వేళ నేర్పరి కొరగాడు'* అన్నాడు వేమన్నే మరోచోట.

ఎమ్మె అంటే చక్కదనం, గర్వం, ప్రీతి, ఒయ్యారం అని అర్థాలు.

'కాలమొక్క రీతి గడుపవలయు' అంటే వేరు వేరు అనుకూల, ప్రతికూల పరిస్థితులను కూడా ఒకే రకంగా స్వీకరించాలని సారాంశం. చూడండి ఒక భర్తృహరి సుభాషితానికి ఏనుగు లక్షణకవి అనువాదం *(క్వచిత్ పృథ్వీ శయ్యః.... 73వ శ్లోకం)*

*ఒకచో నేలను పవ్వళించు నొకచో నొప్పారు పూసెజ్జపై*
*ఒకచో శాకము లారగించు నొకచో ఉత్కృష్ట శాల్యోదనం*
*బొకచో బొంతధరించు నొక్కొకతరిన్ యోగ్యాంబరశ్రేణి లె*
*క్కకు రానీయడు కార్యసాధకుడు దుఃఖంబు సుఖంబున్ మదిన్*

విజయుడు అర్జునుని మరోపేరు. ఇదేకాక అర్జునుని అనేక పేర్లలో ఫల్గునుడు, పార్థుడు, కిరీటి, కవ్రి, కవ్వడి, వివ్వచ్చుడు అనేవి కొన్ని.

*"ఒదిగి ఒక్క వంక నుండ వలయు"* (డి.1727, 260) అనేది పాఠాంతరం. పద్యంలో ఉన్నదే మెరుగు.

**ఇహము నందు బాధ లెన్నైన పడవచ్చు**
**యముని బాధలేక నమరవలెను**
**పరులబాధ లేక బ్రతుకుడీ నరులార!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓ నా ప్రియమైన మనుష్యులారా! పరిస్థితుల ప్రభావం వల్ల ఈ లోకంలో ఎన్ని కష్టాలైనా భరించవచ్చు. కాని చనిపోయిన తర్వాత నరకలోకంలో శిక్షలు లేకుండా జాగ్రత్త పడండి. దానికొక్కటే మార్గం తోటివారిని బాధించకుండా జీవించండి అంతే చాలు అని ప్రబోధిస్తున్నాడు వేమన.

బతికి ఉన్నప్పుడు చెడ్డ పనులు చేస్తే ఆ కర్మఫలాలు పరలోకం దాకా వెంటాడతాయి అని ఒక విశ్వాసం. ఆ పరలోకం పేరు నరకం. దానికి యముడు రాజు. అతన్ని కాలుడు అని కూడా అంటారు. సంయమని ఇతని పట్టణం పేరు, అతని భార్య ధూమవర్ణ, అతని కరణం పేరు చిత్రగుప్తుడు. చనిపోయినవారి ఆత్మలకు భూలోకంలో వారి కుచేష్టలను బట్టి నరకంలో శిక్షలు అమలవుతాయి. యమున్ని సమవర్తి అంటారు. అంటే వారి వారి కర్మలను బట్టి అందరికీ సమానంగా శిక్షలు వేస్తాడు, పక్షపాతం ఉండదు.

నరకం ఒక్కటి కాదు. ఒక్క యాజ్ఞ వల్క్య స్మృతిలోనే 21 నరకాలను పేర్కొన్నారు. మరోచోట వాటి పట్టిక ఇచ్చాను. అలాగే గరుడ పురాణంలో, భాగవతంలో ఇంకెన్నో నరకాలున్నాయి. ఏ తప్పు చేస్తే ఏ నరకం ప్రాప్తిస్తుంది అనడానికి మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలు. కూటసాక్ష్యం చెప్పేవాడు రౌరవ నరకానికి వెళ్తాడు. అసత్యవాది అన్నమాట! అలాగే గురుపత్నితో సంబంధం పెట్టుకున్నవాడికి తప్తలోహం; పరదూషణా, వేదనింద చేసేవాడికి శబలం; మర్యాద లేకుండా ప్రవర్తించేవాడికి విమోహం; పితృద్వేషికి కృమిభక్ష్య; రంధ్రాన్వేషకుడికి విషసన ఇలా.

ఇవన్నీ మూఢనమ్మకాలని కొందరు కొట్టి పారెయ్యొచ్చు. కాని వీటి భయంతో నైనా లోకంలో కొన్ని అకృత్యాలు తగ్గే అవకాశముంది. చైతన్యవంతుల సంగతి సరే పామరుల కోసం ఇలాంటివి కల్పితమై ఉంటాయి. ఒకరకంగా చూస్తే ఈ లోకంలోనే ఈ జీవితంలోనే నరకాలు ఉన్నాయి. “అబ్బ! నరకబాధ’ అనుభవించాం అంటాం. బాధే నరకం, అది శారీరకం కావొచ్చు, మానసికం కావొచ్చు. కాబట్టి బాధానుభవం తెలిసినవాడు ఇతరులకు బాధ కలిగించవద్దు అని వేమన్న ఉద్బోధ.

'ఇహం' అంటే ఈ లోకం 'అమరవలెను' అంటే జాగ్రత్తగా ఒక పద్ధతిగా మెలగాలి అని. 'బతుకుడీ నరులారా!' అంటే కలకాలం సుఖశాంతులతో జీవించండి అని వేమన్న ఆశీర్వాదం.

*'పరుల హవనం లేక బ్రతుకుడీ నరులార'* (డి.1727, 270) అనేది పాఠాంతరం.

**ఇహమున సుఖియింప హేమతారక విద్య**
**పరమున సుఖియింప బ్రహ్మ విద్య**
**కడమ విద్యలెల్ల కల్లమూఢులకురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఉన్నవి రెండే లోకాలు. ఒకటి ఇహము, రెండోది పరము. ఈ లోకంలో భోగభాగ్యాలతో సుఖించాలంటే రసవాద విద్య తెలియాలి. పరమార్థం పొందాలంటే ఆధ్యాత్మిక విద్యను ఆశ్రయించాలి. ఈ రెండూ కాని ఇతర విద్యలు మూర్ఖుల కోసమే గాని జ్ఞానుల కోసం కాదు అని తేల్చేస్తున్నాడు వేమన.

రసవాదం గురించి వేమన అనేక పద్యాలు చెప్పాడు. రసవాదం అంటే తక్కువ జాతి లోహాలను బంగారంగా మార్చటం. 'హేమ తారక విద్య' అంటున్నాడు వేమన ఈ పద్యంలో. అంటే నీచలోహాలను బంగారం దాకాతరింపజేయటం, దాటించడం, చేర్చడం అన్నమాట. హేమం అంటే బంగారం. ఇంగ్లీషులో Alchemy అదో పెద్ద విద్య. ఎంత పెద్దదంటే దాన్ని బ్రహ్మవిద్య సరసన కూచోపెడుతున్నాడు. బ్రహ్మవిద్యకు ఎంత సుదీర్ఘ ప్రక్రియ వుందో దీనికీ అంతే అని సారాంశం.

రసవాద విద్య గురించి ఎక్కడైనా గ్రంథాలున్నాయా? ఎందుకులేవు రసార్ణవం, రసరత్నాకరం, రసవాదశైవాగమం, మంథాన భైరవం ఇవన్నీ రసవాదాన్ని గురించి చెప్పాయి. రసవాదాన్ని నమ్మనివారు కూడా వుంటారు. కాని రసవాదం ప్రసక్తి ప్రాచీనకాలం నుంచీ వుంది. ఇతరులకు చెప్పకూడదు' అనేది దీని ప్రధాననియమం' అందుకే ఇది గుప్తవిద్య. ఈ కారణం వల్లనే వశిష్టుడు విశ్వామిత్రునికి ఈ విద్యను చెప్పలేదు. విశ్వామిత్రుడు ఊరుకుంటాడా అసాధ్యుడు ఏదోరకంగా దానిని సాధించి వశిష్టుని ముందు ప్రదర్శించి ఆయనమెప్పు పొందాడు. గాయత్రీమంత్రంలో కూడా దీనికి సంబంధించిన రహస్యాలున్నాయంటారు. 'పరుసవేది' అనేది కూడా ఈ విద్యలో మరో పార్శ్వం. ఓరుగల్లు రాజులు, రెడ్డి రాజులు దీనివల్ల మరింత ధనవంతులైనారని ప్రతీతి.

వేమన రసవాదంలో వాడే పదార్థాలను పేర్కొంటూ పలు పద్యాలు చెప్పాడు. 'తులసి క్షారాన్నీ తూమునుండి ప్రవహిస్తున్న నీటినీ కలిపి, దుష్టపు పాలలో పోసి, రెంటినీ కలిపి ఆ సమ్మేళనాన్ని కరిగిన రాగిపైన లేపనం చేస్తే బంగారమౌతుందని ఓ పద్యంలో చెప్పాడు. ఇంకెన్నో పదార్థాలను వేమన పేర్కొన్నాడు. అయితే ఈ ప్రక్రియలో ముఖ్యమైనది నిష్పత్తి.

అంటే ఏ పదార్థం ఎన్నిపాళ్లు అని. రహస్యమంతా ఈ నిష్పత్తిలో దాగివుంటుంది. ఆధునిక రసాయనిక శాస్త్రంలో కూడా Ratio దే ప్రధానపాత్ర.

రసవాదంలో వాడే పదార్థాల పేర్లు సంకేత భాషలో అంటే Code language లో వుంటాయి. ఉదాహరణకు సీసానికి (lead) యోగేష్ట, వప్ర అనిపేర్లు. అలాగే నాగశబ్దం పాముకూ సీసానికీ వర్తిస్తుంది. ఒక పద్యంలో 'శుద్ధి చేసిన నాగం' అనడానికి 'శుద్ధి చేసిన కుబుసం' అంటాడు వేమన. నిఘంటువుల్లో వీటికి అర్థాలు దొరకవు. వేమన రసవాద పద్యాల వల్ల ప్రభావితులై ఎందరో ఆయా దినుసుల కోసం అడవుల్లో వెతికేవారట. ఆస్తులు పోగొట్టుకొని పిచ్చిబట్టి బజార్లపాలైనవారు కూడా ఉన్నారట.

వేమన్న బంగారం చేసినా చెయ్యకపోయినా ఆయన ముట్టుకోవటం వల్ల తెలుగు మాటలు మాత్రం బంగారు కణికలయ్యాయని చెప్పవచ్చు.

**ఈ కనులను మిమ్ము నెట్లు చూడగవచ్చు**
**చూచు కనులు వేరు చూపు వేరు**
**చూపులోన నుంచి చూడంగ వలవదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓ దేవా! భౌతికమైన ఈ కండ్లతో భౌతికాతీతుడవైన నిన్ను దర్శించడం సాధ్యమయ్యే పనేనా? ఇటువైపు నుంచి చూస్తున్న కనులకు అటువైపున కనిపించే దృశ్యం వివిధరూపాల్లో కనిపించవచ్చు. ఒకే రూపం గోచరం కాకపోవచ్చు. కాబట్టి ఈ చూడటం అనేది బయటి నుంచి కాక మనసులోపలి నుంచి కదా చూడాలి, అప్పుడు కదా నువ్వు కనిపించేది అంటూ అంతర్ముఖత్వాన్ని సూచిస్తున్నాడు వేమన ఈ పద్యంలో.

కనులు ఒక దృశ్యాన్ని చూస్తాయి. వెంటనే ఆ దృశ్యం కంటి నరాల ద్వారా మెదడుకు చేరుతుంది. అక్కడ మెదడు దానిని విశ్లేషించి అదేమిటో తెలియ జేస్తుంది. అంటే దాని ఆకారమెటువంటిది? పరిమాణం ఎంత? రంగు ఏమిటి? కంటికీ ఆ వస్తువుకు దూరమెంత? దాని పక్కన మరో వస్తువుంటే వాటి మధ్య వ్యత్యాసమేమిటి? ఇట్లాంటి వాటిని తెలియజేస్తుంది. ఇంతటి అద్భుతమైన కండ్లు కూడా భగవత్స్వరూపం దగ్గరికొచ్చేసరికి పరిమితికి లోనవుతాయి. కేవలం చర్మచక్షువులౌతాయి. తోలుకళ్లుగా మారి కళ్లు తేలేస్తాయి. కాబట్టి భగవద్దర్శనం కోసం ఈ చూపు చాలదు. దానికి లోచూపు కావాలి. అంతర్దర్శన సామర్థ్యం కావాలి తెలుసుకొమ్మంటున్నాడు వేమన. 'ఈ కనులు' అంటున్నాడు వేమన. 'ఈ' అనడంలో చమత్కారం ఉంది. నాటకీయత ఉంది. "ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూ సురేంద్ర!" అంటుంది ప్రవరుడితో వరూధిని మనుచరిత్రలో. 'ఇంతలు' అంటే ఎంతలు? అట్లా అనేటప్పుడు ఆమె అభినయించిన తీరు ఏమిటి? ఇట్లాంటి సొగసులన్నీ ఊహైక వేద్యములు. తోడుకున్న వారికి తోడుకున్నంత.

బాహ్యనేత్రాలతో కాదు అంతర్నేత్రాలకే భగవంతుడు కనపడతాడు అనేది వేమన్న ఉవాచ. అంతర్నేత్రాలంటే మనసు. అంతెందుకు ప్రేమనే తీసుకొండి. ఇది చూపున్నవాడికీ లేని వాడికీ ఒక్కలాగే తెలుస్తుంది. మాట, స్పర్శా అనేవి మాధ్యమాలే. గ్రహించే శక్తి మాత్రం మనసుది.

హెలెన్ కిల్లర్ అని ఒకామె ఉండేవారు. ఆమె గుడ్డీ, చెవిటి కూడా. ఆమె రెండు రోజుల పాటు తాజ్‌మహల్‌ను చూసి వర్ణించి చెప్పింది. ఎలా? స్పర్శద్వారా, అంతర్దృష్టి

ద్వారా. ఆమే నేటి లయన్ ఇంటర్నేషనల్ వారిని అంధత్వ నివారణ కోసం పాటుపడమని ప్రేరేపించిన గొప్ప వ్యక్తి. అందుకే మనవారన్నారు విగ్రహారాధన కొంతవరకే. కనులవరకే. కనులు దాటి మనసుదాకా వెళ్ళి ధ్యానం ద్వారా ఆత్మదాకా వెళ్ళి దర్శించగలిగితే అదే పరమాత్మ అంటున్నాడు వేమన.

**ఉండియుండు జ్ఞాని యుగములు చనిపోవ**
**ప్రాణహాని లేదు ప్రళయమునను**
**ప్రాణహానియైన పరమాత్మ కలియురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యుగాలు గడిచినా, ప్రళయం వచ్చినా జ్ఞానానికి మరణం లేదు. ఒకవేళ మరణం ఉంది అంటే అతని ఆత్మ విశ్వాత్మలో కలిసిందన్నమాట, తెలుసు కొమ్మంటున్నాడు వేమన.

జ్ఞాని ఎప్పటికీ ఉంటాడు. అంటే జ్ఞానం శాశ్వతం అని సారాంశం. జ్ఞాని అంటే అనుభవించబడేదీ అనుభవించేవాడూ రెండూ తానే అని తెలుసుకున్నవాడు. భోజ్యమూ తానే భోక్తా తానే అన్నమాట.

యుగం అంటే ఒకరకమైన కాలప్రమాణం. చాలా సంవత్సరాల కాలాన్ని యుగం అంటారు. కృత, త్రేత, ద్వాపర, కలి అనేవి యుగాలు.

ప్రాణం అంటే గాలి, ఊపిరి అనేవి లౌకికార్థాలు. ఆత్మనుండి ఉద్భవించే శక్తిని ప్రాణమంటారు. ఇది శరీరాన్ని నీడలా వ్యాపించి ఉంటుంది గాని రూపం ఉండదు. ప్రళయం అంటే సర్వనాశనం. కల్పాంతం అని కూడా అంటారు. ప్రళయకాలంలో ఏదీ కదలని స్థితి ఉంటుంది. "ప్రళయ స్సుఖ దుఃఖాద్యైశ్చేష్టా జ్ఞాన నిరాకృతిః" అన్నారు. ప్రళయానికి బ్రౌన్ "Final destruction of the world" అంటూ చక్కని అనువాదమిచ్చాడు.

వేమన ఈ పద్యంలో ప్రాణాన్ని ఆత్మకు పర్యాయంగానే వాడాడనిపిస్తుంది. ప్రాణం పోయినా ఆత్మ నశించదు. ఆ ఆత్మ పరమాత్మలో లీనమై అభేదాన్ని పొందుతుంది. పరమాత్మ అంటే ఏమిటి? సర్వత్రా వ్యాపించి ఉండే మూలతత్వాన్ని పరమాత్మ అంటారు. పరబ్రహ్మం అన్నా ఇదే. దీనికి ఆద్యంతాలుండవు. నామరూపాలు లేవు, స్వయం ప్రకాశమైంది పరమాత్మ.

కర్మఫలాలను అనుభవించడానికి మనిషి శరీరాలతో మళ్లీ మళ్లీ పుడుతుంటాడు అనేది భారతీయ విశ్వాసం. పరాత్పరునిలో కలిసిపోయినప్పుడు పుట్టుకలు ఆగిపోతాయి. "ప్రళయకాలమొచ్చి పరమాత్మ తెలియురా! (డి.1725-449)" అనేది పాఠాంతరం.

**ఉచితవంతుడైన ఉద్యోగపరుడైన**
**సంపద మరి యున్న సమయముననె**
**పరులకుపకరించి పరగ రక్షించును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు ఏదో ఉద్యోగం చేసుకుంటున్నాడు పైగా వివేకవంతుడు. నాలుగురాళ్లు సంపాదించుకుంటున్నప్పుడే నలుగురికి సాయం చెయ్యగలడు, ఆపదలో ఆదుకోగలడు, కాబట్టి పరోపకారానికి ధనార్జన తప్పనిసరి అని సూచిస్తున్నాడు వేమన.

అతడు ఉచితవంతుడు అంటే దూరదృష్టి గలవాడు, జాగరూకుడు, మంచి అంటే తెలిసినవాడు. అతనికి పరోపకారగుణముంది. కాని ఏం లాభం అతని చేతిలో డబ్బు లేనప్పుడు ఎటువంటి పవిత్రకార్యాలకూ ఉద్యమించలేడు. అతనికే ఉద్యోగముంటే అతని ఆదర్శభావాలను ఆచరణలో పెట్టడం కొంత సులువవుతుంది అంటున్నాడు వేమన.

ఎన్ని కబుర్లు చెప్పినా అవి వొట్టి మాటలే. పూని ఏదైనా గట్టి మేల్ చెయ్యాలంటే డబ్బు అనివార్యం. మొదట నువ్వు నిలబడితే కదా పక్కవాణ్ని నిలబెట్టేది. కాబట్టి కష్టపడి డబ్బు సంపాదించు, దానికేదైనా ఉద్యోగం చెయ్యి అని వేమన్న సలహా. ఉచితవంతుడు అనేది అందరూ తరచుగా వాడేమాట కాదు. ఉచితజ్ఞుడు అంటారు. ఔచిత్యం తెలిసినవాడని. వేమన భాగ్యవంతుడు లాగ ఉచితవంతుడు అని వాడాడు. అదే ఆయన ప్రత్యేకత.

**ఉత్తముని కడుపున ఓగు జన్మించిన**
**వాడు చెరుచు వాని వంశమెల్ల**
**చెరుకు వెన్నుపుట్టి చెరచదా తీపెల్ల**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పాపం! అతడు మంచివాడే, కాని అతనికి చెడ్డకుమారుడు జన్మించాడు. దానివల్ల వారి వంశప్రశస్తి తగ్గిపోయింది. అదెట్లాగంటే చెరుకు గడకు వెన్ను పుట్టి దాని తీపి తగ్గిపోయినట్టు.

కొడుకు పుడితే పున్నామ నరకం నుంచి తప్పిస్తాడంటారు. కాని కొందరు కొడుకులు తల్లిదండ్రులకు ఈ లోకంలోనే నరకం చవి చూపిస్తారు. ఎలా? కుటుంబానికి అపకీర్తి తేవటం ద్వారా. ఓగు అంటే చెడ్డవాడు, దుష్టుడు, హాని కారకుడు, మూర్ఖుడు, బలహీనుడు అనే అర్థాలున్నాయి. 'బాగోగులు' అనే మాటలో ఉన్న ఓగు ఇదే. బాగోగులు అంటే మంచిచెడ్డలన్నమాట.

ఇక చెరుకు సంగతికి వద్దాం. మనపట్నం కుర్రాళ్లకు చెరుకురసం తెలుసుగాని చెరుకు పంట గురించి ఎంతతెలుసునో నాకు తెలియదు. అయినా చెప్తాను. తెలిసిన వాళ్లు నవ్వుకోండి, తెలియని వాళ్లు తెలుసుకోండి. తియ్యటిరసమూరుతూ గడలుగా పెరిగే పొడుగాటి ఒకరకం పైరు మొక్క చెరుకు. వెన్ను అంటే వీపు, మేను వెనుక భాగం అని అర్థాలున్నాయి. గ్రామీణ భాషలో ఎన్ను అని కూడా అంటారు. ఇక్కడ వెన్ను అంటే చెరుకుగడ పైన పూచే పుష్ప విన్యాసం. కంకిలాగ వుంటుంది. చెరుకును కొయ్యకుండా పువ్వొచ్చేదాకా ఆగితే చెరుకుతీపి తగ్గుతుందని ఒక నమ్మకం. అంటే ఆ తీపిని పువ్వే వాడుకుంటుందని. చెరుకు పువ్వునుంచి కాయలు రావు. అందుకే మళ్లీ కొమ్మనే నాటుతారు. మరి వేమన వెన్నుపుట్టి 'చెరుస్తుందం'టున్నాడే! చెరుకుకు కాటుక తెగులు అని వస్తుంది. అది వెన్నుకే వస్తుంది. అది కొరడా ఆకారంలో ఉండి లోపలంతా నల్లగా వుంటుంది. వేమన బహుశా దానిని కూడా ఉద్దేశించి వుంటాడు. సుమతి శతకకారుడు కూడా ఇటువంటి అర్థంతో ఓ పద్యం చెప్పాడు.

*"కొరగాని కొడుకు పుట్టిన*
*కొరగామియె కాదు, తండ్రి గుణముల చెరచున్*
*చెరుకు తుద వెన్ను పుట్టిన*
*చెరకున తీపెల్ల చెరచు సిద్ధము సుమతీ"*

మరి వేమన బద్దెనను అనుకరించినట్టా! కాదు ఇద్దరూ లోకోక్తుల నుంచే తీసుకున్నారు. లోకోక్తులు ఎక్కడి నుంచి వచ్చాయి? లోకుల అనుభవాల్లోంచే. అట్టడుగు జనుల అనుభవాలను వడబోసినవారే అసలైన ప్రజాకవులు, వేమన వారిలో అగ్రగణ్యుడు.

**ఉత్తమోత్తముండు తత్త్వజ్ఞుడిల మీద**
**మహిమ జూపువాడు మధ్యముండు**
**వేషధారి యుదర పోషకుండధముండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తారతమ్యాన్ని బట్టి లోకంలో మూడు రకాల గురువులుంటారు. మొదటివాడు పరమాత్మ సంబంధమైన జ్ఞాని. ఇతడు శిష్యులకు తత్త్వ జ్ఞానం బోధిస్తాడు. ఉత్తమశ్రేణికి చెందిన గురువంటే ఇతడే. రెండోవాడు మధ్యరకం వాడు. ఇతడు జనులను ఆకట్టుకోడానికి మహిమలు చేసి చూపిస్తాడు. ఇక మూడోరకం వాడున్నాడే ఇతడు పొట్టకూటికోసం గురువు వేషం వేసుకొని ప్రజలను మోసం చేస్తాడు. ఇతనిది అతి తక్కువ స్థాయి. ఇటువంటివారిని నమ్మకూడదంటున్నాడు వేమన.

ఉత్తమోత్తముడు అంటే ఉత్తముల్లో ఉత్తముడు. బహుశ్రేష్ఠుడన్నమాట. ఈయన ఆత్మజ్ఞాని, కోరికలు లేనివాడు, నిర్వికారస్థితికి చేరుకున్నవాడు. సద్గురువు అనేమాట ఇతనికి సరిపోతుంది. తత్త్వజ్ఞుడనేమాట పెద్దది.

మధ్యముడంటే పై వాడికంటె తక్కువవాడు. ఇతడు జనుల్లో విశ్వాసం కల్పించటానికి మహిమలు (Miracles) చేసి చూపిస్తాడు. యోగసాధనలో సమకూరే చమత్కారాలు ఇతని సొత్తు. మహిమ అంటే గొప్పతనం. అంతేకాక అణిమ, మహిమ, గరిమ అంటూ అష్టసిద్ధుల్లోని మహిమ కూడా కావొచ్చు. ఇతనికి కీర్తి ప్రతిష్ఠలపైన భోగభాగ్యాలపైన దృష్టి వుంటుంది. ఇటువంటి వారి వల్ల సమాజానికి నష్టం ఉండకపోవచ్చుగాని తాత్త్వికయోగికంటే కిందిస్థాయి.

ఇక మన మూడోవాడు మహానుభావుడు! పరమలౌకికుడు. వేషానికే గురువు, బోధించేవన్నీ కల్లలు. ఉదరం అంటే కడుపు కుక్షింభరుడన్నమాట. ఇటువంటి వారివల్ల లోకానికి నష్టం ఉంది. కాబట్టి ఓ కంటకనిపెట్టి ఉండాలని వేమన్న హెచ్చరిక. "ఉత్తమోత్తముండు ఊరకె యుండును (డి. 1723-223)" అనేది పాఠాంతరం.

**ఉదధిలోన నీళ్లు ఉప్పులుగా జేసి**
**పసిడిగలుగువాని పిసిని జేసె**
**బ్రహ్మదేవుసేత పదడైన సేతరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

బ్రహ్మదేవుడు అపారమైన సముద్రాన్ని సృష్టించాడు. కాని దాని జలాన్ని తాగడానికి వీలులేకుండా ఉప్పగా మార్చిపెట్టాడు. అలాగే ఈ లోకంలో ఒక సంపన్నున్ని పుట్టించాడు కాని అతనికి దానగుణం ఇవ్వలేదు. పిసినిగొట్టుగా మార్చి పారేశాడు. ఏమిటండీ ఈ వైరుధ్యాలు? బ్రహ్మసృష్టికి ఏమన్నా అర్థం వుందా? అతడు చేసిన పని వొట్టి బూడిదతో సమానం అంటే పనికిమాలినది అంటున్నాడు వేమన.

భూమ్మీద లభ్యమౌతున్న మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్ర జలముంది. అది ప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచు రూపంలో వుంది. మిగిలిన ఒక్క శాతం కన్న తక్కువే ప్రాణులకు పనికొచ్చేది. మంచినీరన్నమాట. ఆంగ్ల కవి కాలరిడ్డ్ ఏమన్నాడంటే "Water Water Everywhere, but no single drop to drink". ఇదేమిటి విశ్వకర్మ విశ్వాన్ని ఇలా సృష్టించాడేమిటి అని ఆశ్చర్యపోతున్నాడు వేమన. అలాగే ఒకడికి ధనం ఇచ్చాడు గాని దాతృత్వం ఇవ్వలేదు. ఆ ధనం బీదప్రజల అనుభవంలోకి రాకపోతే ఏమిటి దానివల్ల ప్రయోజనం? అని ప్రశ్నిస్తున్నాడు.

ఉదధి అంటే సముద్రం. ఉదకం అంటే నీరు. పసిడి అంటే బంగారం, అంటే సంపద. పిసిని అంటే పిసినారి, పిసిడి యొక్క రూపాంతరం. పదడు అంటే బూడిద, భస్మం, దుమ్ము, పొడి, చూర్ణం అని అర్థాలు. ఇక్కడ బూడిద. పదడు పదరు అనే తమిళపదం నుంచి వచ్చింది. "పదడు చేబట్టెడు పసిడియై వెలుగ" అనేది ప్రయోగం.

సృష్టి వైరుధ్యాలను గురించి అలవోకగా చెప్పగలిగిన నేర్పు వేమన్నకు వెన్నతో పెట్టిన విద్య అని ఇట్లాంటి పద్యాల వల్ల తెలుస్తుంది.

**ఉప్పు కప్పురంబు ఒక్కపోలికనుండు**
**చూడ చూడ రుచుల జాడవేరు**
**పురుషులందు పుణ్యపురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీకు ఒక్క తెలుగు పద్యం కూడా రాదా? కనీసం ఉప్పుకప్పురమైనా సరే! అని తెలుగువాళ్ళు మాట్లాడుకోవటం అలవాటు. అంటే ఈ పద్యం పండితులకే కాదు పామరులకూ కొట్టినపిండి. ఎందువల్ల? దీనిలోని లోకసత్యంవల్ల. ఏమిటా సత్యం? ఉప్పు కర్పూరం రెండూ ఒక్కలాగే ఉంటాయి. రుచులు మాత్రం వేరుగా ఉంటాయి. ఇద్దరు వ్యక్తులు పైకి చూడటానికి ఒక్కలాగే కనిపించవచ్చు. కాని వారి గుణగణాల్లో తేడా ఉండవచ్చు. ఉప్పు, కర్పూరం ఒక్కలాగే అంటే తెల్లగా ఉంటాయి. రుచులు వేరుగా అంటే ఉప్పు ఉప్పగా ఉంటుంది. కర్పూరం చేదుగా, ఘాటుగా ఉంటుంది. ఇద్దరు వ్యక్తులతో కలిసి మెలిసి తిరిగితే తెలుస్తుంది. వారితో సాధారణ పురుషుడెవడో పుణ్యపురుషుడెవడో.

ఉప్పు కప్పురంలో కర్పూరంలో కర్పూరం ఏ కర్పూరం అని ఎవరినైనా అడగండి. టక్కున చెప్పేస్తారు. హారతి కర్పూరమని. మరి 'రుచుల జాడవేరు' అన్నాడే వేమన. హారతి కర్పూరాన్ని ఎవరైనా తింటారా? తినరు మరి అది వేరే కర్పూరమై ఉండాలి. పచ్చకర్పూరాన్ని తాంబూలంలో వేసుకుంటారు. పేరే పచ్చకర్పూరం గాని అది తెల్లగా వుంటుంది. పైకి తేలిగ్గా కనిపించే ఈ పద్యంలో ఇంత అంతరార్థముంది.

పైపై వేషాలు చూసి మోసపోవద్దు. మనిషిని లోపలి నుండి అర్థం చేసుకోవాలి అనేది సారాంశం.

ఒకరకంగా ఈ కాలం పరిభాషలో చెప్పాలంటే ఈ పద్యం వేమన్న Signature Poem. కన్నడంలో సర్వజ్ఞుడనే కవి ఉన్నాడు. అతడు అచ్చంగా వేమన లాంటివాడే. వేమన చతుష్పాదులైన పద్యాలు చెప్తే అతడు 'త్రిపదులు' చెప్పాడు. 'సర్వజ్ఞ–వేమన సంవాద' అనే ఓ పుస్తకంలో ఇద్దరూ సంభాషించుకున్నట్లున్న పద్యాలున్నాయి. 'ఉప్పుకప్పురంబు' పద్యం లాంటిది సర్వజ్ఞుని పద్యాల్లో కూడ కనిపిస్తుంది చూడండి.

*'కల్లుప్పు కర్పురవు సొల్లెరడు ధాతొందు*
*ఖుల్ల నొళ్ళిదన రూపొందు గుణదొళగె*
*ఎల్ల అంతరవు సర్వజ్ఞ.'*

(ఉప్పురాయీ, కర్పూరం అనేవి రెండు మాటలు కాని వాటి రూపం ఒక్కటి. అలాగే నీచుడూ మంచివాడు పైకి ఒకేలా వుంటారు. కాని గుణాల్లోనే వైరుధ్యం. అన్ని వ్యత్యాసాలు ఇలాగే సర్వజ్ఞ)

ఇక్కడ వేమన సర్వజ్ఞుణ్ని అనుసరించాడా లేక సర్వజ్ఞుడు వేమనను అనుసరించాడా అనే మీమాంస అనవసరం. ఎందుకంటే ఇద్దరి కాలాలు వేరువేరు (సర్వజ్ఞ-16వ శతాబ్దం; వేమన 17, రెండూ ఉజ్జాయింపే) సర్వజ్ఞుణ్ని అనుసరించే అగత్యం వేమనకెందుకుంటుంది? పైగా తెలుగు పద్యంలోని సౌందర్యం కన్నడంలో కనిపించదు. కాదంటే ఇద్దరు మహానుభావులకు ఒకేరకం ఆలోచనలు రాకూడదా అనుకోవచ్చు. లేదా ఇలాంటి భావాలు ఆనాటి జనపదుల వాడుకలో ఉంటే వీరిద్దరూ తలకెత్తుకొని ఉండొచ్చు. ప్రజాకవుల పద్ధతి అది.

ఏమైనా ఈ పద్యం కన్నడ తెలుగు భాషల సాన్నిహిత్యాన్ని తెలుపుతుంది. కొందరీ కన్నడ పద్యం సర్వజ్ఞుని రచన కాదు అర్వాచీనులెవరో చేర్చిందని భావిస్తున్నారు.

**ఉప్పు చింతపండు ఊరిలో నుండగా**
**కరువదేల వచ్చె కాపులార!**
**తాళకంబెరుగరొ తగరంబు నెరుగరో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఉప్పు, చింతపండు లాంటి కనీసపు తిండి పదార్థాలు ఊళ్ళో సంపన్నులు, రైతుల ఇళ్ళల్లో ఉన్నాయి గదా. మరి కరువెట్లా వచ్చింది? అని ప్రశ్నిస్తూనే తానే అందుకు పరిష్కారం చూపిస్తున్నాడు వేమన. ఎట్లా? తాళకం, తగరాలతో బంగారం తయారుచేసి వాళ్ల మొహాన కొట్టండి. వాళ్ల ధనదాహం తీరుతుంది. జనం యాతన తగ్గుతుంది అని.

చరిత్రలో రాయలసీమలో వచ్చిన కరువులను గమనిస్తే అదో పెద్ద గ్రంథమవుతుంది. కరువులను తట్టుకోలేని రైతుల కోసం రసవాద విద్యను రంగం మీదికి తెచ్చాడు వేమన.

తగరం అంటే మెత్తనిలోహం. ఇంగ్లీషులో Tin అంటాము. దీనిని వంగ, సత్తు, తమరము అని కూడా అంటారు. *'తగరము వాడి చేసి వెడతాపసి నాకడ బీరగాడుగా బొగడెదు'* అని ప్రయోగం. తగరాన్ని తీక్ష్ణపరిచినట్టుగా పనికిమాలిన బైరాగిని నా ముందర పరాక్రమవంతుడిగా ప్రశంసిస్తున్నావు అని అర్థం. తగరం బలహీనంగా ఉంటుందని. తాళకాన్ని గైరికము, హరిదళం (yellow orpiment) అంటారు. రసాయనిక శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే Arsenic Sulphide అంటారు. తగరం, తాళకం రసవాద ద్రవ్యాలన్నమాట. ఈ రెండింటి రసాయనిక సంయోగం వల్ల బంగారు రంగుతో ఓ తేలికపాటి లోహం తయారౌతుంది. Fools Gold అంటారు దీన్ని.

కొన్ని తక్కువ రకం లోహాలను రసాయనికచర్య ద్వారా బంగారంగా మార్చవచ్చుననే నమ్మకం భారతదేశంలోనేకాదు ఇతర దేశాల్లోనూ వుండేది. దీనిని తెలుగులో రసవాదమనీ, ఇంగ్లీషులో 'ఆల్కెమీ' (Alchemy) అని అంటారు. 17వ శతాబ్దంలో కూడా దొంగ సన్యాసులు, గోసాయిలు బంగారం తయారు చేస్తామని ప్రజలను ప్రలోభపెట్టి మోసం చేసేవారు.

వేమన దృష్టి బంగారం మీదికంటే ప్రజల కరువు తొలగించడం పైనే వుంది. సంపన్నులు తిండిదినుసుల్ని అక్రమంగా నిల్వచేసి ప్రజల ఉసురు పోసుకుంటున్నారు. వారి మోసాన్ని మోసంతోనే కొట్టాలి. దానికి కృత్రిమ బంగారమే సాధనం. అప్పటికి వేమనకు తట్టిందది. వారి ఇళ్లమీద దాడి చెయ్యండి అని పిలుపునివ్వలేదు. అది వేమన తత్వంలో లేదు.

**ఉర్విజనులు పరమ యోగీశ్వరుని జూచి**
**తెగడువారెగాని తెలియలేరు**
**అమృత మాది రుచుల హస్తమేమెరుగును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలోని సామాన్యులు ఉత్కృష్టమైన యోగి శ్రేష్టుణ్ని గుర్తించలేక అతని వింత ప్రవర్తనను పరిహసిస్తారు కూడా. అతని మహత్తు వారికెలా అర్థమౌతుంది? గొప్పరుచికీ ఇతర రుచులకూ తేడా తెడ్డుకు తెలుస్తుందా? అలా.

అతడు గొప్ప జ్ఞాని, ధర్మపరుడు, విశ్వోపకారి, పరతత్త్వం తెలిసినవాడు అతడే యోగి, పైగా పరమయోగి. అటువంటి వాడి స్థాయిని అందుకోలేక అజ్ఞానులు అతన్ని నిందిస్తారు, ఆట పట్టిస్తారు. మహోన్నతమైన అతని ఘనతను తెలుసుకోలేరు. పరమాన్నం రుచి విశిష్టత గంటెకు తెలియనట్టే ఇదికూడా అని అంటున్నాడు వేమన.

ఉర్వి అంటే భూమి. విరివిగలిగిన దానిని ఉర్వి అంటారు. పెద్దదని. ఉర్విజనులు అంటే లోకులు. తెగడు అంటే నిందిచడం.

అమృతమంటే ఇక్కడ దేవతలు తాగేదని కాదు. పీయూషం, సుధ, నీళ్లు, నెయ్యి, ముక్తి, పాలు, రుచిగల పదార్థం, బంగారం, మృతంకానిది, అందమైనది ఇవన్నీ అమృతానికర్థాలే. ఇక్కడ వంటకం ప్రసక్తి కాబట్టి పంచామృతాలనుకోవచ్చు. ఉదకం, పాలు, పెరుగు, నెయ్యి, తేనె అనేవి పంచామృతాలు. ఇవన్నీ మధురమైనవే. కాని వీటి మధ్య రుచుల తేడా వుంటుంది. కలియబెట్టే గంటె ఆ తేడాను కనిపెట్టగలదా? దానికి సున్నితమైన నాలుక లేదు కదా!

హస్తం అంటే చెయ్యికాదు. చెయ్యి ఆకారంలో ఉండే గంటె. ఇక్కడ తెడ్డు.

పవిత్రుడైన పరమయోగిని అర్థం చేసుకోకుండా పరిహసించడం కంటె, అర్థం చేసుకోడానికి ప్రయత్నించి అనుసరించడం మంచిది అని సారాంశం. 'హస్తమే మెరుంగు నమృతాన్నరుచులను' (డి.1727, 319) అనేది పాఠాంతరం.

**ఉసురులేని తిత్తి యిసుమంత వూదిన**
**పంచలోహములును భస్మమౌను**
**పెద్దలుసురుమంటె పెనుమంట లెగయవా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గాలిలేని తోలు తిత్తిలోనికి కొంచెం గాలి ఊదినా ఆ గాలి తీవ్రతకు పంచలోహాలు కూడా కరిగి బూడిదైపోతాయి. అట్లాగే ఉత్తములైన వారి మనస్సును నొప్పిస్తే వారి నిట్టూర్పుగాడ్పు ధాటికి విధ్వంస జ్వాలలెగుస్తాయి జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు వేమన.

నీకేం తెలుసు? వారు మహాత్ములు కావొచ్చు. ఆత్మజ్ఞాన సంపన్నులు కావొచ్చు, అనుభవ చరిత్రులు కావొచ్చు, చివరికి వయోవృద్ధులైనా కావొచ్చు. వారిని క్షోభ పెట్టరాదు సుమా! అలా పెట్టినందువల్ల వచ్చే ఉసురు ఊరికే పోదు. ఉసురు అంటే దాని శాపం, ప్రతిఫలం. అవి నీకు హానికలిగించి తీరుతాయి. పెద్దలు నిరర్థకులు కాదు. పండిన కాలవృక్షాల లాంటి వారు. వయస్సు మదంతో వారిని మానసికంగా బాధించవద్దు అని తాత్పర్యం.

మొదటిపాదంలో ఉసురు అంటే ప్రాణం. ప్రాణమంటే గాలే. ప్రాణం లేని తిత్తిని ఊదితేనే ఇంతటి తీక్ష్ణమైతే ప్రాణమున్న పెద్దలను దుఃఖింపజేస్తే ఎంత అనర్థమో ఆలోచించు అని సాభిప్రాయం. ఇసుమంత అంటే కొంచెమైనా అని. తిత్తిరంధ్ర మార్గం ఇరుగ్గా వుంటుంది కాబట్టి దాని ద్వారా వెళ్లే గాలికి శక్తి ఎక్కువ. తిత్తి అంటే కొలిమి ఊదడం కోసం వాడే తోలు పనిముట్టు. ద్రవపదార్థాలను తీసికెళ్లడానికి ఉపయోగించే తోలుపాత్రను కూడా తిత్తి అంటారు. అలాగే శ్వాస కోశమంటే ఊపిరితిత్తి.

పంచలోహాలంటే బంగారం, వెండి, ఇత్తడి, రాగి, ఇనుము అని కొందరు. రాగికి బదులుగా కంచును చేర్చేవారు మరికొందరు. అదేం కాదు రాగి, తుత్తునాగం, తగరం, సీసం, ఇనుము అనేవి పంచలోహాలని ఇంకొందరు. ఎందుకిట్లా? మరేం లేదు. ఫలానా ఐదు లోహాలే పంచలోహాలని కాదు. సమత కలిగి జతకట్టుగలిగిన ఏ ఐదు లోహాలైనా పంచలోహాలే. తిత్తిలోంచి వెళ్లేగాలి ఏ లోహాన్నైనా కరిగిస్తుంది. కరిగించగా కరిగించగా అది బూడిదౌతుంది. వేమన్న అంటున్న భస్మమదే. విగ్రహాలు, యంత్రాలు పంచ లోహాలతోనే తయారు చేస్తారు. వాటివల్ల పవిత్రతే కాదు గట్టితనం కూడా సిద్ధిస్తుందన్న మాట! 'పెద్దలుసురుమంటె' – ఉసురు, అంటే ప్రాణం, ఆయువు, పాపం అని అర్థాలు.

ఉస్సురు అంటే నిట్టూర్పు. 'ఉసురుమంటే' అంటే దుఃఖించు అని. అప్పుడు పెనుమంటలు లేస్తాయి. పెను అంటే పెద్ద. ఎంత పెద్దవి అంటే అవి ఈ లోకంలోనే కాదు పరలోకం దాకా వ్యాపిస్తాయి అని ధ్వని.

పెద్దలను నొప్పిస్తే నీకు మంచి జరగదు అని వేమన్న సారాంశం.

**ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి**
**మూగచింతపల్లె మొదటి ఇల్లు**
**అరసి చూడ బయలు ఆడనే శివుడుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇంటి నెంబరు, పిన్‌కోడ్ లేదు గాని ఒకరకంగా ఇది వేమన తన చిరునామా గురించి చెప్పుకున్న పద్యం. 360 యేళ్లు గడిచి పోయాయిగాని ఈ కార్డుముక్క ఇంకా గమ్యం చేరలేదు. చేరలేదా? చేరిందిగాని భౌతికంగా కాదు. ఆధ్యాత్మికంగా పాఠక హృదయాలను చేరింది. ప్రతి తెలుగువాడి హృదయం వేమన్న విలాసంగా మారింది. అయినా ఈ పద్యాన్ని ఓ పట్టుబట్టి చూద్దాం.

వేమన్నది ఏ ఊరు? కొండవీడు. కొండవీటిలో ఎక్కడ? పడమటి వీధిలో. అంతకు ముందు ఎక్కడన్నా ఉండేవాడా? అవును మూగచింత పల్లెలో. మూగచింత పల్లెలో ఎక్కడ? శివాలయం దగ్గర. దీనినిబట్టి కచ్చితంగా ఏమైనా చెప్పగలమా? ప్రయత్నించడంలో తప్పేముంది. రండి చూద్దాం.

కొండవీడు అంటే రెడ్డిరాజులు 14-15 శతాబ్దాల్లో పరిపాలించిన కొండవీడా? అదిప్పుడు గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకాలో ఉంది. కొండవీటిని అన వేమారెడ్డి, కొమర గిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి వంటి గొప్ప రాజులు పాలించారు. వారికీ మన వేమనకూ 'వేమ' శబ్ద సంబంధమే తప్ప 17వ శతాబ్దానికి చెందిన వేమన అప్పుడుండే అవకాశం లేదు. కాని కొండవీటి రాజుల కుటుంబం వాడనే వాడుక కథలున్నాయి కదా! అవును కె.వి.రెడ్డి తీసిన వాహినీ వారి 'యోగి వేమన' సినిమావల్ల ఇవి మరింత స్థిరపడ్డాయి ('వేమ' అనేది సంస్కృత పదం. దీని అర్థం మగ్గం అని విల్సన్స్ సంస్కృత నిఘంటువులో వుంది) కొండవీడు అంటే శ్రీశైలం కూడా కావొచ్చునని దిగవల్లి శివరావు గారన్నారు. (వీడు-నగరం, శ్రీశైలాన్ని కొండగా వేమన్న అనేకచోట్ల వ్యవహరించాడు) అంతే కాక వేమన్న కర్నూల్ జిల్లా క్రిష్టిపాడు వాడనీ, గుంటూరుకు చెందిన ఇనుకొండవాడనీ, కడపజిల్లాలోని చిట్వేల్ వాడనీ బ్రౌన్ తాను విన్న మూడు పేర్లను నమోదు చేశాడు.

ఇక మూగచింతపల్లె ఏమిటి? ఎక్కడుంది? నెల్లూరు జిల్లాలో పొదిలి తాలూకాలో ఒక 'మూగచింతల' ఉందట. అప్పుడు నెల్లూరు కొండవీటి రాజ్యంలో ఉండేదా? కొండవీటి దగ్గర్లోనే ఒక మూగచింతల ఉందని కొందరు, కడపజిల్లాలో ఉందని మరికొందరు

అన్నారు గాని అది దొరకలేదు. చంద్రగిరి తాలూకాలో ఉందని ఆరుద్రగారు అన్నా అక్కడి తహసిల్‌దారు దానిని ధృవీకరించలేదు.

ఇంతకు మూగ అంటే ఏమిటి? మామూలుగా అయితే మాట్లాడలేని వ్యక్తిని మూగ అంటారు. ఇక్కడ అదికాదు మూగపరంగా అర్థం చెప్పాలంటే చింతచెట్టు ఆకులు చిన్నవి కాబట్టి అవి కదిలినా కదలనట్టు కన్పిస్తాయి కాబట్టి మూగచింత (Silent tree)అని కవిత్వం చెప్పాలి. అలాగే మబ్బుపట్టిన ఎండను మూగ ఎండ అంటారు. ఇక్కడి మూగచింత చింతల్లో ఒక రకం. పోతుచింత, చీమచింత, మూగచింత అని ఉంటాయి. ఎక్కువగా పూత, కాత లేని దాన్ని మూగచింత అంటారు. ఫల పుష్పరహితమైందన్నమాట! దీనికి బెరడు ఉండదంటారు. మావైపు 'చెట్టు మూగబోయింది కొట్టెయ్యండి' అంటారు.

బ్రౌన్ ఈ పద్యానికి వేదాంతపరంగా అర్థమిచ్చాడు. ఆయన మాటల్లోనే, "This village of our body in which the deity dwells is Hill town (The Head)? His house is in back street (The Spine). There in silence is the first house. We gaze and continually view it, this is the road of beatitude" (1829)

ఈ పద్యానికున్నన్ని పాఠాంతరాలు మరి దేనికిలేవు. అవధరించండి కొన్ని. *మూగచింతపల్లి మొదటి ఇల్లు* (డి. 1723, 504); *మూగసేత కెల్ల మొదటి వీడు* (డి. 1773-5-900); *మూలచింతకడకు ముందరిల్లు* (డి 1727, 324); *ఆత్మ రాకపోక అదియెపోతత్వంబు* (డి. 1725-646); *ఎడ్డె రెడ్డి కులమదేమని తెల్పుదు* (వావిళ్లప్రతి);.... *ఊరు పంచమ వీధి* (ప్యారిస్ ప్రతి కీ.శ. 1730); వేమన్నా! వేమన్నా!! ఎక్కడున్నావ్? అంటే మీ అందరి నాలుకలపైన అనేది సమాధానం. ఇప్పటికింతే!

**ఊరునూరు తిరిగి ఉద్యోగధారియై**
**వాడ వాడ దిరుగు వనిత కొరకు**
**ఏడనేడ దిరిగి ఏమేమి కనెనయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సంచారం లేని జీవితానికి చైతన్యం లేదు. వేమన సంచార జీవితాన్ని ప్రదర్శించే పద్యాలు కొల్లలుగా లభిస్తున్నాయి. కొండవీడు, గండికోట, తిరుమల, గోదావరి, నందిదుర్గం, శ్రీశైలం, తమిళ, కర్ణాటక ప్రాంతాలు ఇలా ఎన్నో!

ఉద్యోగవశాన ఊరూరు తిరగటం కొంతకాలం, పడతికోసం సందుగొందులు వెదుకుతూ మరికొంతకాలం, ఎక్కడెక్కడ తిరిగి ఎలాంటి అనుభవాలు సంపాదించాడో కదా అంటున్నాడు వేమన.

ఉద్యోగం అంటే వేమన్ననాటికి ఇప్పటి అర్థమే. భారతంలోని ఉద్యోగపర్వం లోని అర్థం కాదు. ఉద్యోగం అంటే వ్యాపారం అని కూడ. అనుభవాలు అందరికీ తటస్థిస్తాయి. కాని ఆ అనుభవాలనుంచి గ్రహించే జ్ఞానమెంత?

ఉద్యోగంతో ఉరుకులు కొన్నాళ్లు. వనితకోసం పరుగులు కొన్నాళ్లు, ఎక్కడ తిరిగినా ఎంత తిరిగినా ఏం కనిపించింది? ఏమి మిగిలింది? అని ప్రశ్నిస్తున్నాడు. తనకు తెలిసిందెంత? తెలిసి ప్రపంచాన్ని మార్చగలిగిందెంత?

లోకమంతా తిరిగి ఊరు చేరుకున్న వాడికి ఊరిలో లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇన్నాళ్లు ఈ లోపాల్లో భాగస్వామిని కదా అనిపిస్తుంది. ఉర్వి తిరిగొచ్చినవాడికి ఊరు కనిపించాలి, ఉన్నచోటనే జ్ఞానోదయం కలగాలి అని వేమన్న ప్రబోధం.

**ఊరివారు బావి యుదకము నిందించి**
**పాదతీర్థమునకు భ్రమసి నారు**
**పాదతీర్థమునకు ఫలమేమి కద్దురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకులు ఊరిలోని బావి నీటిని తక్కువగా భావిస్తూ గురువుల కాళ్లు కడిగిన నీటిని పవిత్రంగా భ్రమపడుతున్నారేమిటి? అట్లాంటి నీటివల్ల వొరిగేదేమిటి? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

వేమన్న కాలానికి శైవ, వైష్ణవాలు బహుళ ప్రాచుర్యంలో వున్నాయి. వాటిమధ్య పోటీ వాతావరణం కూడా వుంది. పరస్పర ధూషణలూ ఉన్నాయి. దానివల్ల సంఘ శాంతికి కొంత యిబ్బంది కూడా వుండేది. అట్లాంటి సమయంలో రెండు సంప్రదాయాల్లోని కల్ల గురువులకు కొదువ లేదు. వారి ఆగడాలు కూడా మితిమీరి ఉండేవి. అటువంటి సందర్భంలో పుట్టిన పద్యమిది.

నలుగురికి ఉపయోగపడే బావినీటిని చులకనగా చూస్తూ గురువుల పాదతీర్థం గొప్పదనుకోవడం వొట్టి భ్రాంతి అంటున్నాడు వేమన.

సంప్రదాయం ప్రకారం గురువు గారి పాదాలకు సుగంధద్రవ్యాలను అలది ఆ పాదముద్రలను ఓ వస్త్రం పైన ముద్రించి ధరిస్తారు, తలపైన కప్పుకుంటారు. ఆ పాదముద్రల్లోని లవలేషం మట్టిని నీటిలో కలుపుకొని తాగుతారు. దీనినే పాదతీర్థ మంటారు. అయితే పాదతీర్థాన్ని సేవించే అర్హత పంచ సంస్కారాలు పొందిన వారికే వుంటుంది. వారు కొద్ది సంఖ్యలోనే ఉంటారు. కాని వేమన కాలానికి ఇది పక్కదారి పట్టినట్టుంది. గురువుల ఆశీస్సులు లేకుంటే పాపాలు పోవనీ వారిచేత 'ప్రసాదం' పొందడమే మహాభాగ్యమని ప్రచారం చేసేవారు. పూజాపుష్పాలు, వారి ఎంగిలి కూడు, వారు పుక్కిలించిన లేక ముఖం, కాళ్లు కడుక్కున్న నీరు ఒక్కటేమిటి వారి పవిత్ర హస్తాలతో ఏది ఇచ్చినా ప్రజల దేహాత్మలలోని కల్మషాలు క్షాళితమౌతాయని నమ్మించేవారు. ఇదంతా అబేదుబాయ్ అనే ఫ్రెంచి మిషనరీ "హిందువుల పండుగలు, ఆచారాలు" అనే గ్రంథంలో ప్రత్యక్షంగా చూసి రాశాడు. అతడు రాసింది 18వ శతాబ్దం చివర్లో, 17వ శతాబ్దం వాడైనా వేమన్న కాలానికీ ఇవే పరిస్థితులు ఉండటంలో ఆశ్చర్యం లేదు.

బ్రౌన్‌కు వర్యం వాసుదేవ బ్రహ్మయ్యశాస్త్రి వంటి పలు పండితుల సాహచర్యం ఉంది. కాబట్టి మతసంప్రదాయాల గురించి వారి ద్వారా తెలుసుకొని ఉంటాడు. బయటివాడు కాబట్టి పాక్షికదృష్టి ఉండే అవకాశం తక్కువ.

ఈ పద్యంలో వేమన్న మానవీయ కోణం వుంది. బావినీళ్ళు అందరికి ఉపయోగపడతాయి. పాదతీర్థంలోని పవిత్రీకరణ కొందరికే సంబంధించింది. నిజానికి తీర్థం అంటే నీరే. దైవ సన్నిధిలో గాని గురు సన్నిధిలో గాని ఇస్తే తీర్థం. పూజారినే విష్ణువుగా భావించే రోజులవి.

ఉదకము అంటే నీరు. బావియుదకం మిశ్ర సమాసమే కావొచ్చు గాని ప్రజాకవిత్వ సంప్రదాయంలో ఇట్లాంటివి గులకరాళ్లు. 'భ్రమసినారు' అంటున్నాడు వేమన. భ్రమ అంటే భ్రాంతి అనేకాక ఇష్టం, కోరిక, వాంఛ అనే అర్థాలు కూడా ఉన్నాయి. "వాడంటే నాకు చాలా భ్రమ" అంటే ఇక్కడ ఇష్టమని. ఇక్కడ రెండర్థాలూ సరిపోతాయి. "ఊరివారు బావి యుదకమంచెరుగక (డి.1727-323) అనేది పాఠాంతరం.

**ఋషులదెట్టి జాతి ఇంపుగా వెలసిన**
**బ్రహ్మకిష్టులైరి బ్రహ్మలైరి**
**తుదిని ఎవ్వరైన సొదమున్గుటేనయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఋషులకు కూడా కులభేదాలు అంటగడితే ఎలా? అంటున్నాడు వేమన ఈ పద్యంలో. ఋషుల కులం, వంశం, తెగ, వర్గం, పుట్టుక లాంటివాటిని గురించి ఆలోచించడం శుద్ధ అనవసరం. వారు తపఃసంపన్నులు కాబట్టి సృష్టికర్త మెప్పును పొందారు. ఉత్తమస్థాయిని పొందిన వారి గురించి కులం గిలం అనే మీమాంస ఎందుకు? ఏ కులం వారైనా చివరకు చితిని చేరుకోవడమే కదా! గ్రహించమంటున్నాడు వేమన.

ఋషి అంటే ద్రష్ట అంటే సత్యాన్ని దర్శించినవాడు. (ఋషి దర్శనాత్). ఇంద్రియాలను జయించి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందినవాడు ఋషి. కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠుడు వీరు సప్త ఋషులు. మరో క్రమంలో మరి కొందరుంటారు.

ఇంపు అంటే ఆనందం, ఇష్టం. బ్రహ్మ జ్ఞానం అంటే తత్త్వజ్ఞానం పొందారు కాబట్టి, వేదకర్మలను ఆకళించుకున్నారు కాబట్టి, చిత్ స్వరూపాన్ని గ్రహించారు కాబట్టి వారు బ్రహ్మకు ఇష్టులయ్యారు. ఇక్కడ బ్రహ్మ శబ్దంతో ఆడుకున్నాడు వేమన. బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ కావొచ్చు, బ్రహ్మ వేత్త కావొచ్చు, చివరకు బ్రాహ్మణుడు కావొచ్చు. జ్ఞానం ప్రధానం కాని కులం కాదు అంటున్నాడు వేమన.

ఎంతటి ఋషులైనా, ఏ కులం వారైనా ఒకనాటికి మరణించక తప్పదు కదా! తుది అంటే చరమదశ, సొద అంటే మామూలుగా అయితే గోడు. తమ కష్టాలను ఇతరులకు చెప్పుకోవడం. కాని సొద అంటే చితి. శవాన్ని కాల్చడానికి పేర్చిన కట్టెలను సొద అంటారు. "సుదతీ యేటికి సొద చొచ్చెదు" అని ప్రయోగం. సొద జొచ్చు అంటే అగ్నిప్రవేశం చెయ్యడం అని అర్థం.

**ఎండ చీకటులకు ఇమ్మయి యుండెడు**
**నిండు కుండలోన నిద్రమరచి**
**దండియైన పరమ తత్వంబు తెలియదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈ దేహం ఒక నిండుకుండ. దీనిలో వెలుగు చీకటులు సామరస్యంగా కలిసి ఉంటాయి. సుఖదుఃఖాలకు లోనవుతూ కూచోక యోగ నిద్రవైపు పయనించడం వల్ల పరమార్థం బోధపడుతుంది అంటున్నాడు వేమన.

ఎండ అంటే వెలుగు, సూర్యరశ్మి. వెలుగు చీకటులు జ్ఞాన, అజ్ఞానాలకు ప్రతీకలు. ఇమ్ము అంటే అనుకూలం. దేహం అనే కుండలో, (వొట్టి కుండ కాదు నీళ్లతో నిండిన నిండుకుండ). వెలుగు నీడలు కలిసే వుంటాయి. నీటిపైన వెలుగు లోతుల్లోకి వెళ్తే చీకటి. మానవ జీవితంలోని సుఖదుఃఖాలు కూడా అంతే. స్థితప్రజ్ఞతతో వాటిని సమానంగా స్వీకరించేవాడే జ్ఞాని.

నిద్ర ఏమిటి? ఏమిటంటే మనిషికి జాగ్రదవస్థ, అంటే మెలుకువ, స్వప్నావస్థ, సుషుప్త్యావస్థ అని మూడు అవస్థలుంటాయి. వాటిని దాటి వెళ్తే లభించేది యోగ నిద్రావస్థ అన్న మాట. వేమన ఉద్దేశించింది యోగ నిద్ర. నిజానికి లౌకికమైన మెలుకువ కూడా ఒక రకమైన నిద్రావస్థే. దానిని వదిలించుకోవాలంటే దేహం కుండలాగ అస్థిరమైందని తెలుసుకోవాలి. అజ్ఞానమనే నిద్రను వదిలించుకోవాలంటే ఆత్మనిష్ట కావాలి. ఆత్మనిష్ట గలవాడు జ్ఞానపథంలో పయనించి యోగనిద్రను పొందుతాడు. యోగ నిద్ర లౌకికమైన మెలుకువలాంటిదికాదు. అది నిత్య జాగృతికి నిలయం. నిత్య జాగృతిలోకి మారటమే పరమార్థాన్ని పొందటమంటే అని వేమన్న సారాంశం.

చిన్న చిన్న మాటలే కాని తవ్వినకొద్దీ ఖనిజాలు లభించే అద్భుతమైన ఆధ్యాత్మికపు గనులు వేమన పద్యాలు. బయట తవ్వి లాభం లేదు. నిన్ను నువ్వు తవ్వుకుంటేనే తప్ప ముక్తి లభించదు అని వేమన్న ఉవాచ.

*ఎండవేళ చీకటేకమైయున్నట్లు / నిండుకుండ నీరు నిలిచినట్లు/* (డి.1721–136); *ఎండనీడ రెండు ఏకమైయుండగా / నిండుకుండలందు నిద్రజేసి/ దండితత్వమెల్ల తలపోసి చూడరా* (డి.1723–906); అనేవి పాఠాంతరాలు.

**ఎండవేళ చీకటేకమై యున్నట్లు**
**నిండుకుండ నీరు నిలిచినట్లు**
**దండిగ పరమాత్మ తత్వంబు తెలియరో**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

వెలుగు నీడా కలిసే వుంటాయి, కష్టసుఖాలలాగ. నిండుకుండలోని తొణకని నీరులాగ స్థిరచిత్తంతో రెంటినీ సమానంగా స్వీకరించాలి. అప్పుడే పరిపూర్ణమైన పరమాత్మతత్వం తెలుస్తుంది. తెలుసుకోండి అంటున్నాడు వేమన.

పైకి ఎండలా కనిపిస్తుంది గాని అంతర్గతంగా దానిలో ఉన్నది చీకటే. నిజానికి విశ్వాంతరాళమంతా చీకటే. స్వయంప్రకాశ నక్షత్రాలవల్ల వెలుగు. సూర్యుడు అట్లాంటివాడే.

వెలుగునీడలు, కష్టసుఖాలు వీటిని ద్వంద్వాలంటారు. రెండింటినీ ఒకేలాగ చూడగలిగినవాడు పరమసత్యానికి చేరువౌతాడని సారాంశం. అనవరత ధ్యాన తత్పురునికీ, ఉపాసన చేసే వాడికీ తత్వజ్ఞానం కలుగుతుందన్న మాట.

కుండలో నీరు నిండుగా ఉంటే ఆ నీరు తొణకదు. వేమన దీనిని స్థైర్యానికి ప్రతీకగా తీసుకున్నాడు. దండిగా అంటే సంపూర్ణమైన, పుష్కలమైన, సమృద్ధిగా గొప్పదైన, అధికమైన అని అర్థాలున్నాయి. రాయలసీమ వాడుక భాసలో ఈ మాటను దండిగా వాడుతారు. *నిండుకుండలందు నిద్రజేసి* (డి.1723-906) అనేది పాఠాంతరం.

**ఎంత కష్టముండు అంత పాపపు చింత**
**చింత చేత మిగుల చివుకుమనును**
**చింత లేక నున్న చెడని సంపద జూచు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనిషికి కష్టం వచ్చినప్పుడు బాధపడడంతోపాటు దానిని తొలగించుకోడానికి ఎన్నోరకాల ఆలోచనలు చేస్తాడు. అసహనంతో కుమిలిపోతాడు. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతాడు. తన బాధకు ఎదుటివారు కారణమనుకొని వారిపట్ల ద్వేషాన్ని నింపుకుంటాడు. వేమన్న దృష్టిలో ఇవన్నీ పాపపు చింతలు. ఇలా ఆలోచనలు చెయ్యటం వల్ల మనస్సు శిథిలమైపోతుంది, అంటే బలహీనపడుతుంది. అంటే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతుంది. కాబట్టి చింతకు మూలకారణాన్ని తెలుసుకున్నప్పుడే చింత తొలిగిపోతుంది. చింతలేక పోయినప్పుడు కలిగే చిత్త ప్రశాంతతను మించిన శాశ్వత సంపద లేదు అని సారాంశం. ఆ సంపద ఆధ్యాత్మిక సంపద కావొచ్చు, మోక్షమార్గం కావొచ్చు. దేహారోగ్యమే కాదు చిత్త స్వాస్థ్యం కూడా మహాభాగ్యమే అని సారాంశం.

చింత అంటే మామూలుగా అయితే విచారం, ఆలోచన అని అర్థాలు. ఇక్కడ ఎడతెగని వగపు, మనోవేదన, రంధి. చితి చనిపోయిన శరీరాన్ని దహనం చేస్తే చింత జీవితాన్నే దహిస్తుంది అని లోకంలో వాడుక. అరిషడ్వార్గాలు కూడా అంతే, పుట్టిన చోటునే కాల్చి పారేస్తాయి.

మనిషికి కష్టాలు రెండురకాలుగా వస్తాయి. ఒకటి తన కర్మవశాన దాపురించేవి. రెండు ఇతరులవల్ల కలిగేవి. ఆత్మ విమర్శ చేసుకోకుండా అన్నీ ఇతరులపైకి నెట్టే పద్ధతి సరికాదంటున్నాడు వేమన. ద్వేషంతో కూడిన చింతవల్ల మనసు చితికిపోతుంది అంటే కుళ్లిపోతుంది. మనసు చివుక్కుమంది అంటారు. ఒక్కసారిగా మనస్సు బాధపడటాన్ని సూచించే అనుకరణం శబ్దం యిది. మిగుల అంటే చాలా అని.

ఈ పద్యంలో మనసు అనే మాట లేకుండానే దానిని ధ్వనించడం విశేషం.

**ఎంత చదువు చదివి ఎన్ని విన్ననుగాని**
**హీనుడవ గుణంబు మానలేడు**
**బొగ్గుపాలగడుగ పోవునా మలినంబు!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎన్ని ఉద్గ్రంథాలు చదివినా ఎన్ని పురాణ శ్రవణాల్లో పాల్గొన్నా అధముడు తన దుర్గుణాన్ని వదిలించుకోలేడు. ఇదెట్లా ఉంటుందంటే బొగ్గును పాలతో కడిగినంతమాత్రాన దాని నలుపు పోయి తెలుపు అవుతుందా అంటున్నాడు వేమన.

'స్వభావోదురతి క్రమః' అని సామెత. స్వాభావికంగా అంటే పుట్టుకతో వచ్చిన గుణాన్ని ఎవడూ అతిక్రమించలేడు అని. పుట్టుకతో వచ్చింది పుడకల్తో గాని పోదు అని మరో సామెత. చెడ్డగుణాలు సాధారణంగా ఇతరులకు హానికారకంగా వుంటాయి. తక్కువస్థాయిలో వుంటాయి. అందుకే నీచత్వం, తుచ్ఛత్వం అనే మాటలు దీనికి సరిపోతాయి. ఈ గుణాన్ని ఇతరులెలాగూ మార్చలేరు. ఒకవేళ సద్గ్రంథపఠనం సజ్జనగోష్ఠుల ప్రభావంతో తానే తొలగించుకుందామన్నా సాధ్యం కాదంటున్నాడు వేమన.

దీనికోసం అద్భుతమైన దృష్టాంతాన్ని తీసుకున్నాడు కవి. అది బొగ్గు. రసాయనిక శాస్త్ర పరిభాషలో కార్బన్ అంటారు దీన్ని. కార్బన్‌ను ఎంత శుద్ధి చేసినా మిగిలేది కార్బనే. ఒక గ్రాము పదార్థంలో కోటానుకోట్ల అణువులుంటాయి. ప్రక్షాళన కార్యక్రమంలో ఒక్కొక్కదాన్ని తగ్గిస్తూ పోయినా చివరికి మిగిలే అణుస్వభావం మొదటిదే. బొగ్గు స్వభావాన్ని మార్చే ప్రయత్నం చేద్దామంటున్నాడు. ఎలా? పాలతో కడుగుదాం. కడిగితే నలుపుపోయి తెలుపు వస్తుందా? "పోవునా మలినంబు" అన్నప్పుడు ఇక్కడ మలినం అంటే మురికి కాదు నలుపే. తెల్లటి పాలతో కడిగినా తెలుపురాదని భావం. అదే వజ్రాన్ని తీసుకోండి. మరోరకంగా అదీ బొగ్గే. కాని దానిని దేనితో కడిగినా తెలుపే అంటే ప్రకాశమే.

మానవ స్వభావ ప్రదర్శనకు ఈ పద్యం నిలువెత్తు దర్పణం.

**ఎంత భూమి దిరిగి యే పాటు పడుచున్న**
**అంటనీక ప్రాప్తి వెంటదిరుగు**
**భూమి కొత్తయైన భోక్తలు కొత్తలా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ధన సంపాదనకోసం ఎన్ని ప్రాంతాలు తిరుగుతూ ఎన్ని కష్టాలు పడ్డా నీ ప్రాప్తంలో ఎంత ఉందో అదే నీ వెంట వుంటుంది. ప్రదేశాలు కొత్తవైనంత మాత్రాన అనుభవించే నువ్వు పాతవాడివే కదా!

కొత్త భాగ్యాల కోసం వెతుకుతున్నావు. నీ పాత దౌర్భాగ్యం నీ వెంటే వుందికదా నీ సంచారం వెర్రి సంచారం కాదా అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

'పాటు' అంటే బాధ, శ్రమ, విధం ఇక్కడ శ్రమ సరిపోతుంది. పాటును సమయానికి కూడా వాడతారు. 'రెప్పపాటు' అంటే రెప్ప మూసి తెరిచేంత సేపట్లో అని. విధం అనే అర్థంలో 'దిద్దుబాటు' అనే మాట వుంది. దిద్దుకునే విధానం అన్నమాట.

అంటనీక అంటే అంటనివ్వక అని. అంటుట అంటే తాకుట, ముట్టుట, తగులుట అని అర్థాలు. ఇక్కడ అంటనీక అంటే లభించక అని. అంటు అంటే అంటురోగమని కాదు. ప్రాప్తి అంటే అదృష్టం లేదా దురదృష్టం. ప్రాప్తి అంటే పొందతగిన అనేది ఇక్కడ సరిపోతుంది. వైకుంఠప్రాప్తి అంటారు. అంటే మరణం.

'భూమి కొత్తయైన' అంటే నువ్వు వెళ్లిన ప్రదేశం నీకు కొత్తదే. కాని నీకు నువ్వు కొత్తవాడివి కాదు గదా. నువ్వు భోక్తవు అంటే అనుభవించేవాడివి. కర్తవు కావు. నిజానికి 'కర్తా భోక్తా జనార్ధనః' అంటే సృష్టికర్త, రక్షణకర్తా రెండూ జనార్ధనుడే. భోక్త అంటే విష్ణువని కూడా.

పూర్వ కృతాన్ని విస్మరించి కొత్త దారుల వెంట వెళ్తే పాతదంతా కొత్తదైపోతుందా? అది సదా నిన్ను వెన్నంటే ఉంటుంది. కర్మఫలాన్ని ఎవరూ అనుభవించక తప్పదంటున్నాడు వేమన.

**ఎక్కుడైన ఆశ లినుమడి యుండగా**
**తిక్కబట్టి నరుడు తిరుగుచుండు**
**కుక్కవంటి ఆశ కూర్చుండనివ్వదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అసలే అతనికి కోరికలెక్కువ. పైగా అవి రెట్టింపయ్యాయి. అవి తీరనప్పుడు పిచ్చిపట్టదా? ఆ పిచ్చితోనే అశాంతితో తిరుగుతుంటాడు. అత్యాశ కుక్కలాగ చంచలమైంది. ఒకచోట ప్రశాంతంగా ఉండనివ్వదు. కోరికలు హద్దుల్లో వుంటే మంచిది అని వేమన్న హితవు.

ఎక్కుడైన ఆశ అంటే దురాశగా, అత్యాశగా మారిన ఆశ. దానిలో చిక్కుకుపోతే ప్రమాదమే. ఆశాపాశం అన్నారు అందుకే. ఆశ యొక్క తత్వమేమిటంటే తెలియని సుఖాలపైనే దాని లగ్నమంతా. తెలిస్తే ఏముంది? వేదాంతం కలుగుతుంది. ఇక్కడ కోరిక ద్విగుణీకృతమయ్యింది అంటే రెండు రెట్లయ్యింది. ఇనుమడి అంటే రెట్టింపు ఇన్మడి, ఇబ్బడి, ఇమ్మడి అనేవి రూపాలు. కన్నడంలో కూడా ఇమ్మడి, ఇర్మడి అంటారు. ఇను అంటే రెండు, ఇరు అంటేకూడా. ఇరు+నూరు=ఇన్నూరు.

ఆశ అంటే కామం, మోహం, లోభం అనే అర్థాలు కూడా వున్నాయి. ఆశాబంధంలో బిగుసుకున్న వాడికి పిచ్చిబట్టక ఏం చేస్తుంది? ఇది ఒట్టి కోరిక కాదు. విషయభ్రాంతి. దిశానిర్దేశం లేని పరిభ్రమణానికి గురిచేస్తుంది. నిద్రపట్టని కుక్కలాగ ఒక చోట నిలువనీయకుండ అశాంతిపాలు చేస్తుంది. అందుకే ఆశ కుక్క వంటిది అంటున్నాడు వేమన.

పెంపుడుకుక్క విశ్వాసం కలదే కావొచ్చు గాని వేదాంతులు కుక్కను అల్పత్వానికి, నీచత్వానికి ప్రతీకగా భావించారు. ఒక మాటకు పూర్వపద విశేషణంగా కుక్కవస్తే దానికి నీచార్థం వస్తుంది. కుక్కబుద్ధి మొ॥వి. కుక్కమూతి పిందె అంటే పనికిమాలిన పిందె అని. అతికోరిక మనసులో కుక్కలాగ మొరుగుతుంటుంది. దానికి కుక్కలకట్టు అవసరం. కుక్కలకట్టు అంటే కుక్కలు మొరగకుండా చేసే సాధనం. చోరులు వాడుతారు. అయితే కోరికను మొరగకుండా అణచివేయడం కంటే అది లేకుండా చేసుకోవడం ఉత్తమం కదా అని సారాంశం.

**ఎడ్డె దెలుపవచ్చు నేడాది కైనను**
**మౌని దెలుపవచ్చు మాసమందు**
**మొప్పె దెలుపరాదు ముప్పదేండ్లకునైన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకజ్ఞానం లేనివాడిని కనీసం ఒక సంవత్సరకాలంలో జ్ఞానిగా మార్చవచ్చు. తెలిసినా తెలియనట్టు నటిస్తూ నోరు మూసుకొని ఉండేవాడిని ఒక్క నెలలో దారికి తెచ్చుకోవచ్చు. ఇక మూర్ఖుడున్నాడే వీడికి ముప్పది సంత్సరాల పాటు బోధించినా ప్రవర్తనలో మార్పురాదు.

మూర్ఖత్వంలో తారతమ్యాలు చెప్పబడ్డాయి ఈ పద్యంలో. ఒకడిని మించి మరొకరు. మొదటివాడు ఎడ్డె. ఎడ్డె అంటే మొరటువాడు, అజ్ఞాని. ఎడ్డెతనం అంటే మూర్ఖత్వం. తెలంగాణాలో ఎడ్డోడు అంటారు. రెండోవాడు మౌని. ఇక్కడ ముని, సన్యాసి, రుషి అనే అర్థాలు పొసగవు. మౌనంగా ఉండేవాడు మౌని. మాట్లాడక పోవడాన్ని వ్రతంగా చేసుకున్నవాడు మౌని. 'మౌనం సర్వాః సాధనం' అంటారు గాని ఇది అన్ని వేళలా కాదు. 'విభూషణం మౌనమపండితానాం' అనే సామెత ఉంది కాని ఇది కూడా అంతే. తెలియని వాడికి మౌనమే అలంకారమన్నమాట. ఇక మూడవవాడు మొప్పె అంటే ముష్కరుడు. "మొప్పెకు మూరెడు నోరు" అని సామెత. ఎడ్డె, మౌని, మొప్పె వీరిలో ఒకరికంటె ఒకరు మూర్ఖులు. ఎడ్డెపని అంటే ఏహ్యమైన పని అని. ఎడ్డె మాట అంటే అసందర్భ ప్రసంగం. "అత్యనభిజ్ఞుడగు నెడ్డెకున్ మదన *తంత్ర ప్రౌఢయౌ* దాని భార్యగా జేయు" అని ప్రయోగం. మౌని తర్కించి విశ్లేషించగలవాడే కాని మాట్లాడవలసి మాట్లాడడు. బెల్లంకొట్టిన రాయిలా ఉంటాడు.

ఈ పద్యంలో మూడు కాలవాచకాలు వాడాడు వేమన. యేడాది, మాసం, ముప్పదియేండ్లు. ముప్పదియేండ్లు అంటే ఒక తరం. అంటే మొప్పెను ఎప్పటికీ సరిదిద్ద లేమని సారాంశం.

ఇక 'తెలుపు' అనే క్రియ మూడు పాదాల్లోనూ వుంది. ఎరిగించు, చెప్పు, వివరించు, స్పష్టం చేయు, బోధించు, నేర్పు అని అర్థాలు. సందర్భాన్ని బట్టి అన్వయించుకోవాలి.

*'మౌని దెలుపవచ్చు మార్గమును'* (డి.1727, 457) అనే పాఠముందిగాని 'మాసమందు' అనే పాఠమే సరిపోతుంది. ఎందుకంటే మూడు పాదాల్లో ఉన్నది కాలం నిడివి ప్రసక్తేగాని మార్గానికి సందర్భం లేదు.

**ఎదుటి తన బలంబు నెంచుకోనేరక**
**దీ కొని చలముననె దీర్చనేని**
**ఎలుగు పంజు సేవకేర్పడు చందమో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యుద్ధం చెయ్యదల్చుకున్నప్పుడు తన బలాన్నీ ఎదుటివాడి బలాన్నీ బేరీజు వేసుకోకుండా దిగితే ఎలా వుంటుంది? ఎలా వుంటుందంటే నిప్పును చూసి భయపడే ఎలుగుబంటి తగుదునమ్మా అంటూ దివిటి సేవకు బయల్దేరినట్టు.

పోట్లాడేటప్పుడు బలహీనుడెవరు? బలశాలి ఎవరు? అనే అంచనా లేకుండా గోదాలోకి దిగటం అవివేకం. ముఖ్యంగా తన పరిమితి తెలుసుకున్నవాడే తెలివిమంతుడు. ఎలుగుబంటికి మంటను చూస్తే మహాభయం. అటువంటిది కాగడాలను పట్టుకునేపనికి ముందుకురకడం ఆశ్చర్యకరం!

ఎంచుకొనక అంటే సరిచూసుకొనక. దీకొనుట అంటే ఢీకొనడం, పూనుకోవడం, సిద్ధపడడం అని అర్థాలు. పంజు అంటే దివిటీ, కాగడా. పంజుసేవ అంటే కాగడాలు చేత ధరించేపని. "దివిటీలుఁ దిర్వాళికలుం బంజుల్, మహోజ్యోతులున్" అని ప్రయోగం. చలం అంటే కపటం, దుర్బుద్ధి, అంటే ఇక్కడ అజ్ఞానమే.

**ఎన్ని తనువులైన మృతికి అడ్డము కావు**
**మృతిని గెలువలేని ఎరుకలేల?**
**దొంగరీతి గాక దొరుకునా మోక్షంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎన్ని జన్మలెత్తినా అవి మృత్యువును తప్పించుకోలేవు. చావు నిన్ను కబళించక మానదు. చావుని జయించడానికి వ్యవహార జ్ఞానం చాలదు, పరిపూర్ణ జ్ఞానం కావాలి. అప్పటిదాకా మృతి బారిన పడకుండా దొంగలాగ పరుగెత్తుతుంటావు. అదంతా ఎందుకు? చావు రాకుండా జన్మరాహిత్యాన్ని కోరుకోరాదూ! అదే మోక్షం అంటున్నాడు వేమన.

పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం జీవుడు జన్మలెత్తుతూనే వుంటాడు. ఈ జన్మలో మంచి పనులు చేస్తే మళ్లీ మనిషి జన్మ, చెడ్డ పనులు చేస్తే జంతువో, కీటకమో; ఇది హిందువుల విశ్వాసం. ఏదో జన్మ ఎత్తాలనే మమకారం కంటే అసలు జన్మలేకుండా చేసుకోవచ్చుగదా! జన్మలేకుండా చేసుకోవడమంటే మోక్షస్థితిని పొందడం. దానిని పొందాలంటే విద్య కావాలి. విద్య అంటే పరమార్థ జ్ఞానం. కాని దీనికి అవిద్య అడ్డుపడుతుంటుంది. అవిద్య అంటే వ్యవహారజ్ఞానం. ఇదంతా వేదాంత పరిభాష. ఇంతకూ మోక్షమంటే ఏమిటి? మోక్షమంటే అవిద్యారాహిత్యం. ఇంకాస్త సులువుగా చెప్పొచ్చుగదా! చెప్పొచ్చు. అయితే విను. ఉత్తమ జ్ఞానం వల్ల కలిగే నిర్మల చిత్తమే మోక్షం, అర్థమైందా? అర్థమైనట్టే వుంటుంది. మరి కొంత మాట్లాడదాం. సమస్త కర్మల క్షయమే మోక్షమంటే. మోక్షస్థితిలో జీవులు అనంతజ్ఞానాన్ని పొందుతారు. అనంత సుఖాలచేత దేదీప్యమానులౌతారు. జీవులు తమ నిజస్వరూపాన్ని అనుభవిస్తారు. దీనినే కేవలావస్థ లేదా కైవల్యం అంటారు. సంసారులైన సామాన్యులు చనిపోతూ, తిరిగి పుడుతూ వుంటారు. వీరు కర్మ అనే అవరణతో కప్పబడి వుంటారు. తపస్సు, శమం, యమాదులవల్ల కర్మావరణాన్ని ఎవరు ఛేదిస్తారో వారే ముక్తులు అని సారాంశం. ముక్తులు సర్వప్రాణికోటి శ్రేయస్సును కోరుతారు. అందుకే వారు గొప్పవారు. ఎరుక అంటే జ్ఞానమే. దీనిని అచల మతంలో ఎక్కువగా వాడుతారు. పరిపూర్ణజ్ఞానం అంటారు దీన్ని. పరిపూర్ణ అంటే అన్నీ కలిసిన అని.

"ఎన్ని తనువులైన యముని కడ్డముగావు (డి. 1723-675), అనేది పాఠాంతరం.

**ఎరిగిన శివపూజ ఎన్నడు చెడిపోదు**
**మొదలపట్టుబట్టి వదలరాదు**
**మొదలు విడిచి గోడ తుదిబెట్టగల్గునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

విధానం తెలుసుకొని తాత్త్విక స్థాయిలో చేసే శివపూజ నిష్ఫలం కాదు. మొదలుపెట్టిన ఏ పని అయినా పట్టుబట్టి సాధించుకునే దాకా వదిలిపెట్టగూడదు. అట్లాగే గోడ కట్టాలంటే అడుగు దగ్గరనుంచి కట్టుకుంటూ రావాలి గాని పై నుంచి కట్టడం ప్రారంభిస్తే అది కూలిపోతుంది. కాబట్టి ఏ కార్యమైనా పద్ధతిగా చెయ్యాలని వేమన్న సారాంశం.

ఒకరకంగా శివపూజా విధానాన్ని తెలిపే పద్యమిది. శ్రీనాథుని హరవిలాసం లోని కొన్ని పంక్తులు గుర్తుకొస్తున్నాయి. *"పంచబ్రహ్మ షడంగబీజ సహిత ప్రాసాద పంచాక్షరీ/ చంచన్మంత్ర ప్రాసాద పరంపరా సహిత..."* పంచబ్రహ్మలంటే పంచబ్రహ్మ మంత్రాలు. షడంగాలు అంటే శరీరంలోని ఆరు అవయవాలు. (రెండుచేతులు, రెండు కాళ్లు, తల, నడుము) పూజాసమయంలో మంత్రోచ్చారణ పూర్వకంగా వీటిని స్పృశిస్తారు. బీజం అంటే మంత్రానికి మూలాక్షరం, అంటే ఓంకారం. ప్రాసాద పంచాక్షరీ అంటే ఓం, హ్రీం ఇత్యాదులతో కలిపి జపించే నమశ్శివాయ. 'ఎరిగిన శివపూజ' అంటే ఇంతవుంది. నిజానికి చంచలమైన మనస్సును నిలపడం కోసమే శివపూజ.

భక్తి అంటే అంకితభావం. దానికి ముందు ఉండవలసింది ఏకాగ్రత. ఏకాగ్రత అనే పునాదిపైన ఉండే భక్తి మంచి ఫలితాన్నిస్తుంది. వేమన్నే "చిత్తశుద్ధిలేని శివపూజలేలరా!" అన్నాడు మరోచోట. చిత్తశుద్ధి అంటే మానసిక పవిత్రత. అది ఏకాగ్రత వల్లనే సాధ్యమౌతుంది. భక్తియోగం నుండి జ్ఞానయోగం దాకా చేరాలంటే తొలుతగా ఉండాల్సింది ఏకాగ్రతే. "చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద" అని ఓ సామెత ఉంది. ఇక్కడ చిత్తం అంటే శుద్ధిలేని చిత్తమని. ఏకాగ్రత లేనప్పుడు అది శివుని పైన నిలవదు, చెప్పుల దగ్గరే ఆగిపోతుంది.

చెడిపోదు అంటే వ్యర్థంకాదని. రెండోపాదంలో 'పట్టుపట్టడం' అంటే ఏకాగ్రత కోసం నిరంతరం ప్రయత్నించాలని. ఇక్కడ 'మొదల' అంటే తొలుత, ప్రారంభం అని. మొదలు అంటే అడుగు. అడుగునుంచి ఒక్కొక్కరాయిని పేర్చుకుంటూ వస్తే గోడ ఏర్పడుతుంది. అది క్రమానుగత పూర్తి అయినప్పుడు కూలిపోవడానికి ఆస్కారముండదు. గోడను కింది నుంచి కట్టుకుంటూ పోవాలి గాని పైన కట్టడం ప్రారంభిస్తే అది అవివేకమౌతుంది. గహనమైన వేదాంత విషయాలకు నిత్యజీవితంలోని తెలిసిన పోలికలు వాడటం వేమన్న ప్రత్యేకత.

**ఎరుక కన్నను సుఖ మేలోకమున లేదు**
**ఎరుక నెరుగ నెవని కెరుకలేదు**
**ఎరుకసాటి ఎరుక ఎరుకయే తత్వంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జ్ఞానం కన్న ఆనందమిచ్చే అంశం మరోటి లేదు. జ్ఞాన స్వరూపాన్ని అర్థం చేసుకునే జ్ఞానం చాలామంది కుండదు. జ్ఞానాన్ని దేనితో పోలుస్తాము? తరచి చూస్తే జ్ఞానమే జ్ఞానంతో సమానం. అటువంటి జ్ఞానమే పరమగమ్యం. అదే తత్త్వం.

యోగులకే అనుభూతమయ్యే తాత్త్విక విషయాల గురించి లౌకికమైన బాహ్య పాండిత్యంతో ముచ్చటించడం కష్టం. కాని ప్రయత్నించి ముఖద్వారం దాకా వెళ్లొచ్చు. లోపలి సంగతి తర్వాత.

ఎరుక అంటే తెలియడం. ఎరుగునుంచి ఎరుక. *'ఎరుక గలవారి చరితము గరచుచు'* అని ప్రయోగం. ఎరుక అంటే మెలకువ, గుర్తు, స్నేహం, పరిచయం, సోది, జోస్యం అనే అర్థాలున్నాయి.

ఈ పద్యంలోని ఎరుక లౌకికమైన ఎరుక కాదు. అచల సంప్రదాయంలోని ఎరుక. ఇది ఒక రకంగా అద్వైతమే. కాని అద్వైత బ్రహ్మంకంటే అచలబ్రహ్మం పరిపూర్ణమైనదని అచలవాదుల భావన. అచలవాదాన్ని శివరామ దీక్షితులు (18వ శతాబ్దం) ప్రతిపాదించినా ఇది ఎక్కువగా బ్రాహ్మణేతర వర్గాల్లో వ్యాపించింది.

అచలం ప్రకారం జగత్తు మిథ్యకాదు బ్రహ్మమయం. భేదాన్ని అంగీకరించిన విశిష్టాద్వైతమూ కాదు అచలం. ఎందుకంటే దానికి అతీతమైన పరిపూర్ణ బ్రహ్మాన్ని ఇది బోధిస్తుంది. అచల సిద్ధాంతంలో ముఖ్యంగా మూడు వాక్యాలున్నాయి. ఒకటి అచల పరిపూర్ణ బ్రహ్మం. రెండు ఎరుక. అంటే సగుణ నిర్గుణరూపమైన అధిష్ఠాన చేతన బ్రహ్మం. మూడు ఎరుకను విడిచే విధానం. మూడోదాని గురించి ముందు ముందు సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాను. దేనికైనా బ్రహ్మం మూలవస్తువు. దానిని అర్థం చేసుకోవాలంటే పరంపరగా వెళ్లాల్సిందే. ఉదాహరణకు ఒక ఇనుప డబ్బాను తీసుకుంటే డబ్బాకు మూలం ఇనుము. ఇనుముకు మూలం భూమి, భూమికి మూలం నీరు, నీటికి మూలం గాలి, గాలికి మూలం ఆకాశం, ఆకాశానికి మూలం ఆత్మ అంటే ఎరుక.

వేమన్న ఏమంటున్నాడంటే బ్రహ్మజ్ఞానం తెలియడం కన్న గొప్ప సుఖం ఏముంటుంది

అని. కాని ఇది చాలామంది అనుభవంలోకి రాదు. అదే చరమగమ్యం. దానికదే సాటి.

వేమనకు పలు సంప్రదాయాలతో పరిచయముందని దీనివల్ల తెలుస్తుంది. వాటిని హేతుబుద్ధితో తరచిచూశాడు. ధర్మం, న్యాయం అనే ఈ రెండు అంశాల్లో వేమన న్యాయం పునాదిగా ధర్మాన్ని చూశాడనిపిస్తుంది. లోకాన్ని బుద్ధితోకాక హృదయంతో దర్శించిన మానవీయ సామాజిక యోగిగా వేమన మనకు దర్శనమిస్తాడు.

'ఎరుక గలుగు వారికెదురు లేదు, (డి. 1727-388); ఎరుక చచ్చునాడు ఎరుగుట బ్రహ్మంబు (డి. 1725, 531) అనేవి పాఠాంతరాలు.

**ఎరుకమాలువాడు ఏమేమి చదివిన**
**చదివినంత సేపు సద్గుణియగు**
**కదిసి తామరందు కప్పగూర్చున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జ్ఞానం లేనివాడు ఎన్ని గొప్ప గ్రంథాలు చదివినా చదువుతున్నంతసేపే సచ్ఛీలుడిగా భావించుకుంటాడు ఎలా? తామరపువ్వులో కప్ప కూర్చొని తాత్కాలిక గౌరవాన్ని పొందినట్టు.

ఎరుక అంటే అంతరాత్మ, సమాచారం, హెచ్చరిక, స్పృహ అనే అర్థా లున్నాయి. ఎరుక చెప్పడం అంటే చెయ్యిచూచి అదృష్టాన్ని చెప్పడం అని. ఎరుక జెయ్యి అంటే తెలియజెయ్యి అని. తెలంగాణాలో నీకు ఎరికేనా? అంటే తెలుసునా అని. ఆధ్యాత్మికంగా ఎరుక అంటే స్థూలంగా బ్రహ్మజ్ఞానమని. ఈ పద్యంలో 'ఎరుకమాలువాడు' అంటే మతివిహీనుడని, మూర్ఖుడని. పనికిమాలినవాడు, కొరమాలినవాడు, సిగ్గుమాలిన వాడు, కరుణమాలినవాడు, దిక్కుమాలినవాడు ఇట్లాంటివే. కదిసి అంటే తగులు, తాకు, అంటు, ముట్టుకొను అని అర్థాలు.

కుక్క దాలిగుంటలో పడుకొని ఇంకెప్పుడూ దొంగతనంగా ఇళ్లల్లో దూరి చాటు తిండి తినొద్దనుకుంటుంది. బయటికి వచ్చినతర్వాత మళ్లీపాతబుద్ధులే. జ్ఞానం మీద గురిలేనివాడు ఉత్తమగ్రంథాలు చదువుతున్నప్పుడు వాటి మాహాత్మ్యం చేత కొంత స్ఫూర్తి కలిగినట్టు అనిపించవచ్చుగాని అది ఎంతోసేపు నిలవదు. సద్గుణాలు అనేవి స్వతహాగా కొంత ఉండాలిగాని పూర్తిగా బయటినుంచి తెచ్చుకొని అంటించుకునేవి కాదంటున్నాడు వేమన.

మూర్ఖుని సంగతిని చెప్పడానికి వేమన అద్భుతమైన పోలికను వాడుతున్నాడు. అది ఆయన లోకజ్ఞతకు నిదర్శనం. మనోహరమైన కొలనులోని తామరపువ్వులో కప్పకూర్చున్నట్టు అన్నది ఆ పోలిక. తామరపువ్వు అనగానే మనకు బ్రహ్మ, లక్ష్మి గుర్తుకొస్తారు. బ్రహ్మ అంబుజాసనుడు, లక్ష్మి పద్మాసన. అట్లాంటి పద్మపీఠిపైకి కప్ప ఎగిరి గంతేసి కూర్చుందనుకోండి. అంతమాత్రాన దానికి దేవతాగౌరవం లభిస్తుందా? అంతేకాదు, దాని కప్పగంతులెంతసేపు? నిలకడ ఉండదు కదా, మళ్లీ నీటిలోకి దూకేస్తుంది. మూర్ఖుడూ అంతే అని వేమన్న పరిశీలన.

**ఎరుకలేని దొరల నెన్నాళ్లు గొలిచిన**
**బతుకులేదు వట్టి భ్రాంతి గాని**
**గొడ్డుటావు పాలు గోకితె చేపునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎదుటివారి కష్టసుఖాలను పట్టించుకోని యజమాని దగ్గర ఎంతకాలం పనిచేసినా మెరుగైన బతుకు తెరువు రాదు. అలా వస్తుందనుకోవడం భ్రమ. ఇదెలా వుంటుందంటే ఎన్నడూ ఈనని ఆవును పట్టుకొని పాలుపిండే ప్రయత్నం చేసినట్టు.

వేమన్న రైతుబిడ్డ. వ్యవసాయ జీవితంలోని లోతుపాతులు ఆయనకు తెలిసినంతగా చాలా తక్కువమంది కవులకు తెలుసు. పాలు పిండటానికి గొడ్డుటావును గోకడమేమిటి? అసలు ఆవునుగాని గేదెను గాని పాలుపిండటానికి ముందు కొంత మచ్చిక చేసుకుంటారు. ఎలా? పొదుగును దువ్వుతారు. వీపుపై చరుస్తారు. అలా చేస్తే ఏమవుతుంది? ఏమవుతుందంటే వాటికి పాలు చేపుతాయి. చేపడం అంటే పాలు పిండుకోడానికి లేదా జాలు వారడానికి సిద్ధంగా వుంటాయి. ఈ పద్యంలో వేమన గొడ్డుటావు ప్రసక్తి తెస్తున్నాడు. మామూలు ఆవు అయితే దువ్వితే సరిపోతుంది. ఇక్కడట్లా కాదు. దువ్వడాన్ని పక్కన బెట్టు, గోకినా పాలు చేపవు. గొడ్డుటావు కాబట్టి; గోకడం కొంత మొరటుపనే. దీనివల్ల గిలిగింతలు కలగొచ్చు. మరీ ఎక్కువైతే గాయాలు కూడా. నిష్ప్రయోజనమని తెలిసి కూడా ప్రయత్నించటం వ్యర్థమంటున్నాడు వేమన.

ఎరుక అంటే తెలివి. ఇక్కడ ఎరుకలేని వాడంటే తనకింది ఉద్యోగుల గురించి అవగాహన లేని వాడని. తెలంగాణాలో ఎరుక అంటే సమాచారసంబంధమైనది. ఇక దొరలు. ఎవరీ దొరలు? దొర అంటే అధికారి. ఆకాలంలో దొర అంటే రాజు కావొచ్చు, దళవాయి కావొచ్చు, సేనాధిపతి కావొచ్చు, పెద్ద ఉద్యోగి కావొచ్చు. ఆంగ్లదొర మాత్రం కాదు. వేమన కాలానికి తెలుగు ప్రాంతంలో అక్కడక్కడ ఇంగ్లీషువారి కదలికలు ఉన్నాయి గాని చెప్పుకోదగ్గంతగా కాదు. దొరల్లో మంచివాళ్లు కూడా ఉండొచ్చు అది వేరే సంగతి.

శ్రమకు తగిన ఫలితమివ్వని సంపన్నుడు గొడ్డుటావు లాంటి వాడు. గొడ్డుటావు అంటే సంతతిలేని ఆవు. ఈనని ఆవుకు పాలుపుట్టే ప్రసక్తే లేదు. గొడ్డుటావు వల్ల ప్రయోజనం శూన్యం. గొడ్డు చెట్టు అనే మాట కూడా వుంది అంటే కాయలు కాయని చెట్టు అని.

వేమన పాలకులను ఎక్కడా సమర్థించడు. ప్రతిపక్ష పాత్ర వహిస్తూ సామాన్య ప్రజలకోసం తన అక్షరాలను ధారబోసిన కవియోగి వేమన.

**ఎరుగువాని దెలుప నెవ్వడైనను చాలు**
**ఒరుల వశము కాదు ఓగు దెల్ప**
**యేటి వంక దీర్ప నెవ్వరి తరమయా**
**విశ్వదాభిరామ వినురవేమ**

విషయాన్ని అర్థం చేసుకునే శక్తి ఉన్న వారికి ఎవరైనా చెప్పొచ్చు. గొప్పవాడైనా సామాన్యుడైనా. దుష్టుడికి అర్థం చేయించాలంటే పక్కింటి వాడికి కూడా సాధ్యం కాదు. ముందే వంకరగా వున్న వాగును చక్కబరిచే శక్తి ఎవరి కుంటుంది?

వాని కన్నా తెలియాలి, లేక ఇతరులు చెప్పిందైనా వినాలి. తెలిసినవాడు ఇతరులు చెప్పిందికూడా వింటాడు. చెడ్డవాడితోనే పేచీ. వాడికి తెలియదు, ఇతరులు చెప్పింది వినడు.

ఎరుగువాడు అంటే తెలిసినవాడు. ఏం తెలిసినవాడు? విషయం తెలిసినవాడు, ఉద్దేశం తెలిసినవాడు, కీలకం తెలిసినవాడు, సత్యాసత్యాలు తెలిసినవాడు. ఇటువంటి వాడికి చెప్పడం ఒప్పించడం సులభం.

ఒరుడు అంటే ఇతరుడు, అపరిచితుడు పొరుగువాడు అని అర్థాలు. మూర్ఖుడు తెలిసిన పక్కింటివాడు చెప్పినా వినడు ఇక అపరిచితుడు చెప్తే ఏం వింటాడు?

వంక అంటే నది, వాగు, పక్క, పొరపాటు, అని అర్థాలు. ఆ వంక అంటే ఆ పక్క అని. ఆమెకు వంక లేదు అంటే ఆమెలో ఏ తప్పులేదని. ఈ పద్యంలో వాగు అనే. వాగు సహజం గానే వంకరటింకరగా ఉన్నప్పుడు దానిని చక్కదిద్దడం ఎవ్వరితరం? తరం అంటే శక్తి. పరంపర అనికూడా (Generation) కాని అది ఇక్కడ పొసగదు.

ఎప్పటిదో ఓ తత్వచరణం గుర్తుకొస్తున్నది. “యేటీకీ వంక వుంటే యేటి నీటీకీ వంకవుండునా?” అని. యేరు వంకరగా వుంటే దానిలోని నీరు కూడా వంకరగానే ప్రవహిస్తుంది. వంకరగా ప్రవహిస్తుంది గాని ఆ వంకర యేటిదే, నీటిది కాదు. యేటి వంకర తీరితే నీటి వంకర అదే తీరుతుందని భావం.

**ఎఱ్ఱనాడు దాని ఏపార చూచిన**
**వేకి పుట్టి చాల వెఱ్ఱి పట్టు**
**పల్లు తెరిచి నగిన పట్టు పెనుభూతంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అందమైన స్త్రీని చూసి తట్టుకోవడం అంత సులభం కాదంటున్నాడు వేమన. ఆమె అందం ఎట్లాంటిది? ఎట్లాంటిదంటే ఆమె ఎఱ్ఱని చర్మకాంతితో నిగనిగ లాడుతుంది. అంతేకాదు అతిశయించిన శరీర సౌష్టవంతో కదిలే లావణ్యవతి. అటువంటి సొగసు కత్తెను చూసి అతనికేదో అయ్యింది. ఏమయ్యింది? వెంటనే జ్వరం వచ్చేసింది. ఆ వెంటనే పిచ్చి పట్టుకుంది. వేకి అంటే జ్వరం. జ్వరం అంటే వ్యవహారార్థంలోని వైద్యజ్వరం కాదు. పులకరం. ఆయుర్వేదంలో పులకరం అంటే లోజ్వరం.

ఇంతవరకు పరవాలేదు. ఇక తరువాత ఆలకించండి. ఆమె ఎఱ్ఱగావుంది, పుష్టిగా వుంది సరే, ఇప్పుడామె ఒక చేష్టను వదిలింది. అంటే నవ్వింది. ఎలా? ముత్యాల్లాంటి పలువరుస కనడేట్టుగా హసితకాంతులు వెదజల్లింది. ఇక చూస్కోండి అతన్ని పెద్దభూతమే పట్టుకుంది.

ఒక స్త్రీ సౌందర్యాన్ని వ్యంగ్యంగా క్రమవికాసితం చేసిన పద్యమిది. ఆమె అందచందాలూ వాటికి ఒక రసికుడి సద్యఃస్పందనలు ఆరోహణ పద్ధతిలో వర్ణితమైనాయి.

ఇదంతా బాగానే వుంది గాని ఇక్కడ వేమన చెప్పదల్చుకున్నదేమిటి? ఏమిటంటే స్త్రీ సౌందర్యాన్ని చూసి దానికి లోబడిపోకు, పిచ్చివాడివైపోకు దానిని మించిన జీవన పరమార్థం మరోటి వుంది మరిచిపోకు అని. అందుకే రసికుని దృష్టిలో మోహకారకమైన ఆమె అందం వేమనదృష్టిలో మోక్షమార్గ విఘాతంగా పరిణమించే ఉపద్రవం అని సారాంశం.

'ఎఱ్ఱనాడు దాని ఎట్టెట్టు చూచిన / వెఱ్ఱిబుట్ట మిగుల వేకి వచ్చు / పల్లువిచ్చి నవ్వపట్టు రా భూతంబు (డి.1769, 593) అనేది పాఠాంతరం.

**ఎలుగుతోలు దెచ్చి ఎందాక ఉతికిన**
**నలుపు నలుపెగాక తెలుపుగాదు**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టితె గుణియౌనె?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎలుగుబంటి చర్మం తీసుకొని ఎంత శుభ్రపరిచినా పుట్టుకతో వచ్చిన దాని నలుపురంగు పోతుందా? అది తెలుపుగా మారుతుందా? పిచ్చిగాని కొయ్యబొమ్మను తీసుకొని రంగులు వేస్తే కొత్త రంగులు పుట్టుకొస్తాయా అని అంటున్నాడు వేమన.

తాటాకు ప్రతుల్లోంచి ఎత్తి రాసుకునేటప్పుడు 'ఎలుగుతోలు'కు బదులుగా 'ఎలుకతోలు' అని తప్పుగా రాసుకోవడం వల్ల ఎన్నో తరాలుగా ఆ పాఠాన్నే నేర్చుకుంటున్నారు. నేనూ అంతే. ప్రాచీనప్రతులు తిరగేస్తుంటే ఇది బయటపడింది.

ఎలుగుతోలును ఎందుకు ఉతకాలి?

శుద్ధిచేసి విలాసవస్తువులు తయారు చెయ్యడానికి. పాము, మొసలి వగయిరా జంతువుల చర్మాలతో ఆడవారి పర్సులు, మగవారి బెల్టులు చేసి ఎక్కువ ధరలకు అమ్ముతుంటారు. ఇదీ అంతే. 'ఎందాక ఉతికినా' అంటే ఎంత సుదీర్ఘకాలం ఉతికినా అని. పైపై ప్రయత్నాలకు నిజరూపం లొంగదు. ఎలుగు అంటే ధ్వని అనే అర్థం కూడా వుంది. 'ఎలుగెత్తి ఏడ్చాడు' అంటే ఇదే. వెలుగుకు వికృతిగా ఎలుగు వ్యవహారంలో ఉంది గాని ఈ రెండూ ఇక్కడ అప్రస్తుతం.

కొయ్యబొమ్మను తీసుకొచ్చి కొడితే గుణి అవుతుందా అంటున్నాడు. 'కొడితే, గుణి' అనే మాటలు వేమన లోకజ్ఞతకు నిదర్శనాలు. కొయ్యబొమ్మను ఎవరైనా కొడతారా? కొడితే ఏం ప్రయోజనం? అది కాదిక్కడ అర్థం. కొట్టుట అంటే రంగు కొట్టడం, సున్నం కొట్టడం లాగ. ఇంగ్లీషులో డైయింగ్ అంటామే అది. పల్లెటూర్లలో గమనిస్తే కొట్టడానికి లెక్కలేనన్ని ఛాయలున్నాయి. కొయ్యబొమ్మకు రంగు వేస్తే దాని కట్టెగుణం, దాని చెట్టు నేపథ్యం పోతుందా? రంగుమార్చి ప్రవృత్తిని మార్చలేం అనేది సారాంశం.

గుణి అంటే గుణములు గలది అని గుణం అంటే తాడు, దారం, అల్లెతాడు అనే అర్థాలున్నా ఇక్కడ గుణి అంటే మంచి గుణములు కలదనే. మనకు సత్త్వరజస్తమో గుణాలు లేవా? సత్త్వం సత్య ప్రభాభాసురం కదా అట్లా.

వేమనపద్యం వినగానే ఓస్ ఇంతేనా అనిపిస్తుంది. మెల్లగా దిగిచూస్తే తెలుస్తుంది దాని లోతెంతో! వేమన పద్యాల్లో భాషాకాఠిన్యం కంటె భావగాంభీర్యం ఎక్కువ అనటానికి ఇటువంటి పద్యాలు తార్కాణం.

**ఏమి గొంచు వచ్చె ఏమితాగొనిపోవు**
**పుట్టు వేళ నరుడు గిట్టువేళ**
**ధనము లెచటికేగు తానేగు నెచటికి?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనిషి పుట్టినప్పుడు వెంట ఏం తెచ్చుకున్నాడు? మరణించి వెంట ఏం తీసుకుపోయాడు? ఇంతకాలం తాను సంపాదించిన ధనం ఎక్కడికెళ్లింది? ఇంతకూ తాను ఎక్కడికి చేరుకుంటాడు? అంటూ లోభికి వైరాగ్యాన్ని బోధిస్తున్నాడు వేమన.

నువ్వు సంపాదించిన డబ్బే, కాని మరణ సమయంలో నీకూ దానికీ సంబంధం లేదు. నువ్వెక్కడికెళ్తావో నీకే తెలియదు. నీదనుకున్న ద్రవ్యం ఎవరి పాలవుతుందో చెప్పలేం. బతికి ఉన్నప్పుడు దానధర్మాలు చేసి వుంటే ఆ సత్కర్మ వల్ల లభించిన కీర్తి అయినా దక్కివుండేది కదా! చనిపోయిన తర్వాత పుణ్యలోకాలు ప్రాప్తించి వుండేవి కదా!

కొంచువచ్చె, కొనుచు వచ్చె అనే మాటలకు తెచ్చుకొనడం అని అర్థం. కొను అంటే స్వంతం కోసం అన్నమాట. వ్యాకరణ పరిభాషలో చెప్పాలంటే దీనిని స్వార్థక క్రియ అంటారు. అంటే తెచ్చుకొను, కట్టించుకొను, రాయించుకొను ఇట్లా ఇవి “కొను’ అనే ఆదేశంగల క్రియలన్నమాట. కొంచు, కొనుచు అనేవి గ్రాంథిక రూపాలు. కొంచువచ్చె, కొంచబోవు వంటి ప్రాచీన రూపాలు తెలంగాణా భాషలో ఇంకా మిగిలే ఉన్నాయి. కొంటుబోవు లాంటివి ఆధునిక రూపాలు. నరుడు అంటే మానవుడు. గిట్టుట అంటే చనిపోవడం. *“పుట్టుట నిజము, పోవుట నిజము. నట్టనడిమిదే నాటకము”* అన్నాడు అన్నమయ్య. నట్టనడుమ చేసిన పుణ్యకర్మలే నీ వెంటవస్తాయి గాని మరేమీ రావు అని వేమన్న ప్రబోధం.

**ఒకటి క్రింద నొక్క టొనర లబ్ధము పెట్టి**
**వలనుగ గుణియింప వరస బెరుగు**
**అట్టి రీతి నుండు నౌదార్యఫలములు,**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గణిత పరిభాషలో జీవితసత్యాలను చెప్తున్నాడు వేమన ఈ పద్యంలో. ఒక అంకె కింద మరో అంకెను పెట్టి హెచ్చువేస్తే పెద్ద సంఖ్య వచ్చినట్టు, మంచివాడు నేటి తన సత్కార్యాలకు పూర్వ పుణ్యాలను పెట్టి గుణకారం చేస్తే గొప్ప ఫలితాలు వస్తాయంటున్నాడు వేమన. గుణించేటప్పుడు కిందా మీదా ఉండే అంకెల్లో కింది అంకెను గుణకం అంటారు. గుణించేది గుణకం. ఆ గుణకం పూర్వాశ్రమంలో లబ్ధంగా వచ్చింది. లబ్ధమంటే భాగహారంలో కుడివైపు వచ్చేది. లెక్కలో అదే జవాబు. కింద మిగిల్తే అది శేషం. లబ్ధమంటే పొందబడిందని అర్థం. లబ్ధి అంటే ప్రాప్తి, కలిమి. అది ఈ జన్మలో చేసుకున్న పుణ్యం కావొచ్చు, లేదా పూర్వజన్మ సుకృతం కావొచ్చు, సంచితం అంటారు దాన్ని.

నీకు కొంత పుణ్యం ఇదివరకే జమపడి ఉంది. దానితోనే తృప్తిపడి, దానినే ఖర్చు పెడుతూ ఉండకూడదు. ఇప్పుడు చేసే మంచి పనులను దానితో హెచ్చిస్తే అవి ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతాయి అని వేమన్న సందేశం.

ఒకటి కింద అంటే ఇక్కడ 'ఒకటి' అని కాదు. ఒక అంకె అన్నమాట. ఒనర అంటే పొసిగేటట్టుగా అంటే పద్ధతి ప్రకారమని. వలనుగ అంటే నైపుణ్యంతో, వరుస అంటే క్రమం.

**ఒడ్డు పొడుగు గలిగి గడ్డంబు పొడుగైన**
**దానగుణము లేక దాతయగునె?**
**ఎనుము గొప్పదైన ఏనుగు పోలునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లావు, ఎత్తు ఉన్నంత మాత్రాన, బారెడు గడ్డం పెంచినంత మాత్రాన కేవలం వేషధారణ వల్ల ఎవడైనా గొప్పవాడవుతాడా? దాతృత్వం లేకుండా దాతగా పేరు తెచ్చుకోవడం సాధ్యమౌతుందా? దున్నపోతు బలిసి ఉన్నంతమాత్రాన గజరాజుతో సమానమౌతుందా అంటున్నాడు వేమన.

నాలుగుకాళ్లు, మందపాటి చర్మం నిడుపాటి వక్రదంతాలు కలిగిన బృహజ్జంతువు ఏనుగు. దానికుండే ఠీవి, విలువ ఎనుముకెక్కడిది? '*ఏనుగు పడుకొన్నా గుర్రమంత ఎత్తు; ఏనుగుని చూసి కుక్కలు మొరిగినట్లు*' లాంటి సామెతలున్నాయి.

ఒడ్డు అంటే తీరం, వ్యూహం అని అర్థాలున్నా ఇక్కడ లావు, వెడల్పైన, అడ్డంగా బలిసిన అని అర్థాలు. ఒడ్డూ పొడుగు అంటే పొడవుకు తగ్గలావు అన్నమాట. ఒడ్డెన అంటే పెద్ద అని. ఒడ్డోలగం అంటే పెద్ద సభ.

'*ఒడ్డును బొడవును రూపును*
*దొడ్డతనము గలిగి ప్రజ్ఞతో మెలగనియా*
*బిడ్డను గనుకంటెను సతి*
*గొడ్డైనను మేలు*' అని ప్రయోగం.

ఎనుము అంటే గేదె, బర్రె అని అర్థమున్నా ఇక్కడ ఎనుబోతు అంటే దున్నపోతు అనడమే సరిపోతుంది.

బయటికి కనిపించడానికి కాదు ఏ సద్గుణమైనా స్వతహాగా ఉండాలనేది సారాంశం. '*..... గడ్డంబు నిడుపైన /.....ఎనుబోతు ఘనమైన* (డి.1723–307); *ఒడ్డు పొడుగు గలిగి అడ్డంగ బలిసిన* (డి.1735, 307) అనేవి పాఠాంతరాలు.

**ఒడల భూతి పూసి జడల ధరించిన**
**ఒడయడయిన ముక్తి బడయలేడు**
**తడికె బిఱ్ఱుపెట్ట తలుపుతో సరియౌనె**
**విశ్వదాభిరామ వినురవేమ**

అతడు ముక్తికోసం ప్రయత్నిస్తున్నాడు. దానికోసం ఒంటినిండా శైవచిహ్నాలైన బూడిద పూతలు పూసుకొని, పొడవాటి వెంట్రుకలు పెంచుకొని గురువులాగ ఊరేగుతున్నాడు. పైపై వేషాలవల్ల ముక్తిని సాధించాలనుకోవటం ఎట్లా వుంటుందంటే ఇంటి రక్షణకోసం తలుపుకు బదులుగా తడిక పెట్టినట్టు అని కపట శివయోగులను వెక్కిరిస్తున్నాడు వేమన ఈ పద్యంలో.

మూడోపాదంలోని పోలికను ఒక గంభీరమైన ఆధ్యాత్మిక ప్రక్రియకు వాడటం వేమన్నకు మాత్రమే చెల్లింది. పూర్వకాలంలో, (పూర్వకాలంలో ఎందుకు ఇప్పుడు కూడా) గుడిసె ఇండ్లకు తడకలు అడ్డంగా పెట్టేవారు. తలుపులకు బదులుగా అన్నమాట. ఇంటిలో దొంగలు పడకుండా కాపాడుకోటానికే తలుపులు పెడతారు. కాని ఇక్కడ తడక పెట్టడం వల్ల తలుపంత బలంగా ఉండదు కదా, కాబట్టి దానివల్ల ప్రయోజనం లేదు అంటున్నాడు వేమన. తడిక/తడికె అంటే ఆకులు వెదురుబద్దలు మొదలైన వాటితో చాపలాగ అల్లి తలుపులాగ ఉపయోగించే సాధనం. 'బిఱ్ఱుపెట్ట' అంటే దృఢంగ అని. వేమన గొప్పతనం ఎక్కడుందంటే తడక ప్రసక్తి సాభిప్రాయంగా తేవడం. గురువేషధారి బాహ్యచిహ్నాలు తడికెలాంటివి. అవి అరిషడ్వర్గాలలాంటి దొంగలనుంచి రక్షించలేవు. తలుపులాంటి యోగ సాధనే దానికి మార్గం. చిత్త శుద్ధిలేని వేషాలు దండగ. "చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా" అన్నాడు వేమనే మరోచోట. "శివపూజ" అంటే భోజనం అనే అర్థం కూడా ఉంది. బోజనమే ప్రధానమైతే ముక్తిపని గోవింద! ఒడలు అంటే దేహం. భూతి అంటే బూడిద, భస్మం. సంపద అని కూడా. ఒడయడు అంటే రాజు, యజమాని అని. ఇక్కడ గురువు.

ముక్తిపేరిట ఎందుకీ తిప్పలు అంటున్నాడు వేమన.

"తలుపుతో ధీటౌనె (డి. 1727-452)" అనేది పాఠాంతరం.

**ఓగు బాగెరుగని వొట్టి మూఢ జనంబు**
**ఇల సుధీజనముల నెంచుటెల్ల**
**మృగము తోడ కుక్క మొరిగిన సామ్యమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో చెడ్డకు మంచికి తేడా తెలియని మూర్ఖులు మేధోవంతులైన సత్పురుషులను తప్పు బట్టజూస్తారు. ఇదెట్లా వుంటుందంటే సింహాన్ని చూచి కుక్కలు మొరగవా? అట్లా వుంటుందన్నమాట.

ఓగు బాగుల కంటే బాగోగులు అనేది బాగా వాడుకలో ఉన్న సమాసం. మంచిచెడ్డలన్నమాట! ధీ అంటే మేధస్సు. ధీజనం అంటే తెలివైనవారు. మృగము అంటే ఇక్కడ మృగరాజు, అంటే సింహం. జింక అని కాదు. జంతు సామాన్య వాచకమూ కాదు.

సాధారణంగా ఏనుగును చూసి కుక్కలు మొరిగినట్లు అంటారు. ఇక్కడ సింహంతో పోలుస్తున్నాడు వేమన. వావిళ్ల ప్రతిలో 'కరినిజూచి కుక్క మొరిగిన సామ్యమౌ' (29) అన్నారు. కాని తాళపత్ర గ్రంథాల్లో గాని (డి. 1721-120), వాటికి దగ్గరిదైన బ్రౌన్ ప్రతిలో (క్రీ.శ. 1829) గాని పై పాఠమే వుంది.

ఇక మూడోపాదంలో మృ కి మొ కి యతికలిపాడు వేమన. ఇక్కడ సామాన్యజనంలో జరిగే ఉచ్చారణ పద్ధతిని ప్రమాణీకరించాడు. మృగంను పల్లెల్లో మురుగం అంటారు. కాబట్టి రేఫ ఉచ్చారణకు యతిని పాటించాడనుకోవాలి. లేదా మృ (మ్రు)-మొ లకు సామ్యయతి చేశాడనుకోవచ్చు. ఆశు సంప్రదాయానికి చెందిన వేమన పద్యాల్లో ఇలాంటివి కొల్లలుగా కనిపిస్తాయి. శివకవుల్లో కూడా ఇట్లాంటి యతులు అనేకం. అంతెందుకు అనంతుడు తన ఛందోదర్పణంలో ఇటువంటి యతులను సమర్థించాడు. చూడండి కొన్ని ఉదాహరణలు : మ్రొక్కె సౌరాష్ట్ర భూభృత్ కులాధీశుండు (కవికర్ణరసాయనం 2-86); పుండరీకనే/త్రుని నిజధామ వైభవ సమృద్ధికి (భాగవతం, దశమ స్కంధం); గృహధర్మనిరతులు కొనివచ్చి (భోజరాజీయమ్ 3-27). సింహగర్జనల ముందు కుక్క మొరుగుడు ఎంత? పెద్దవాళ్లను విమర్శించేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలనేది సారాంశం.

'ఇలను పండితులను ఎంచుటెల్ల? (డి. 1727-464) అనేది పాఠాంతరం.

**ఓజమాలు పొలతి ఓలి మాడల చేటు**
**పోటు కెడలు బంటు కూటి చేటు**
**పనికి మాలు తొొత్తు బత్తెంబు చేటురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పద్ధతిలేని పెండ్లాం వల్ల ఏం లాభం? పెండ్లి ఖర్చులు దండుగైపొయ్యాయి. సమర్థతలేని అంగరక్షకు డెందుకు? అతనికి పెట్టిన గ్రాసం వ్యర్థమై పొయ్యింది. పని చేతగాని సేవకుని వల్ల ప్రయోజనముందా? భత్యం వృథాకాకపోతే! అంటున్నాడు వేమన.

లోకరీతిని తెలియజెప్పే పద్యమిది. చారిత్రకంగా విలువైన పద్యం. ఓలి అంటే కన్యాశుల్కం. కన్యాశుల్కం అంటే కన్నెకు వెలనిచ్చి కొనుక్కునే దురాచారం. వేమన్నకాలం నాటికే ఇది వుందని దీనివల్ల అర్థమౌతుంది. పాపం! గురజాడ దీనిగురించి ఎంతో తపనపడి 20వ శతాబ్దంలో 'కన్యాశుల్కం' అని ఒక మహానాటకమే రచించాడు. ఇతర భాషా ప్రాంతాల్లో కూడా ఈ ఆచారం వుండేది. కన్నడంలో ఇది ఓళి, ఓణి, తమిళంలో కూడా ఓళి. ఓలి అనేమాట వాక్యాలంకారంగా ఉపయోగించబడి కొన్నిచోట్ల సందర్భానుసారంగా బొగ్గు, సంపూర్ణత మొదలైన అర్థాలనిస్తుంది. ఓలి అంటే వరుస, క్రమము అనే అర్థాలు కూడా ఉన్నాయి.

ఇక ఓజ. ఓజ అంటే విధం, సన్మార్గం, నీతి అని అర్థాలు :"*రాజోచిత ధర్మంబుల యోజ విశదభంగి జెప్పితి*" అని ప్రయోగం. పొలతి అంటే స్త్రీ. "*చారు మనస్సున్మదరస, పూర్ణము వెలివేర్చునట్లు పొలతికి విగళత్ భూరిస్తన జీవిత పయో, ధారలు*' అని ప్రయోగం. నీతి దప్పిన భార్య దొరికిందేమిటి? కన్యాశుల్కానికి పెట్టిన మాడల ధనం వ్యర్థమైపోయిందే. మాడ అంటే ఒక నాణెం. ఆ రోజుల్లో దీని విలువ నాలుగు రూపాయలు. దీనారంలో సగం. ఒక మాడకు పది రూకలు. ఇది 32 గురిగింజల బరువుండేదట!

పోటు అంటే యుద్ధం, పొడవటం, పోటుబంటు అంటే పొడిచే బంటువు. పోటుమాటలు అంటే ఎత్తి పొడుపు మాటలు. పోటుకెడలు బంటు అంటే రణోద్యోగి. ఎడలు అంటే వెళ్లటం. అంటే యుద్ధం నుంచి పారిరావటం. రక్షించవలసినవాడు చేతగాని వాడయితే వాడికి తిండి దండగ అంటున్నాడు వేమన. రాయలసీమలోని కిరాయిసైన్యాల పునాదులు అప్పటికే ఉన్నాయా!?

తొొత్తు అంటే బానిస; వేశ్య అని కూడా. బత్తెం అంటే జీతం కాకుండా అదనంగా ఖర్చుల నిమిత్తం ప్రతి రోజూ భోజనానికి ఇచ్చే డబ్బు. అందుకే జీతబత్యాలు అంటారు. జీతం వేరు, బత్తెం వేరు. బత్తెం అరబిక్ పదం బత్తా నుంచి వచ్చి వుంటుంది. పని చాతగాని సేవకునికి జీతమే కాదు బత్యం కూడా దండగే అంటున్నాడు వేమన. "ఓజ మాలుయాలు ఓలి మాడల చేటు (డి.1723-393); అనేది పాఠాంతరం.

**కండకావరమున కానడు మరణంబు**
**తను మదమున కనడు తత్వమిట్లు**
**భోగవాంఛ చేత పుణ్యంబు కానడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వొల్లు కొవ్వెక్కి రాబోయే మరణాన్ని గురించి ఆలోచించడు. యౌవనం మత్తులో పరమసత్యం వైపు దృష్టి సారించడు. దైహిక అనుభవాల కాంక్షలో పాపపుణ్యాలను లెక్కచెయ్యడు. పూర్తిగా శరీరబంధితుడైన ఈ మూర్ఖునికి ముక్తి ఎలా ప్రాప్తిస్తుంది అని జాలి పడుతున్నాడు వేమన.

శరీరం అస్థిరమని తెలుసుకోడు. యవ్వనమదం, ధనమదం, అధికారమదం ముప్పిరిగొన్న అహంకారంతో మరణం ధ్యాసే రాదు. భోగలాలసుడై విషయవాంఛలతో పాపకృత్యాలతో కాలం గడుపుతుంటాడు. ఇక పుణ్యం తలంపు ఎలా వస్తుంది?

మదం అరిషడ్వర్గాల్లో ఒకటి. దీనివల్ల హింసాప్రవృత్తి పెరుగుతుంది. అది నాశనానికే అని గుర్తించడు. తన దుర్మరణం ఎక్కడ పొంచి వుందో గమనించడు. తత్వాన్ని గురించి ఆలోచించివుంటే ధర్మమంటే ఏమిటో తెలిసేది. ప్రేమ అంటే ఏమిటో తెలిసేది. త్యాగమంటే ఏమిటో తెలిసేది. దుష్కృత్యాల వల్ల ఇహానికే కాదు పరానికీ దూరమౌతున్నాడు. కండ అంటే మాంసం, కండకావరం అంటే తీవ్రమైన గర్వం, '*గగనతలంబు నెత్తురులు గండలు నెమ్ములు....కురిసె, కానిమ్ము నీ కండకావరమ్మడతు*' అనేవి ప్రయోగాలు. కండకొవ్వున కన్నుగానకున్నాడు అని లోక వాడుక. కండకన్నులు అంటే దుర్మాంసం పెరిగిన నేత్రాలు. తను అంటే శరీరం. మదం అంటే మత్తు, అహంకారం. తనుమదం అంటే దేహానికి సంబంధించిన పొగరు. భోగం అంటే తిండి, మైథునం లాంటి సుఖాలు. భోగి అంటే అనుభవించేవాడు.

సుఖించేవాడు తాను సుఖపడుతున్నా ననుకొని ఇతరులను దుఃఖపెడతాడు గాని అవి తనకే దుఃఖహేతువులౌతాయని వేమన్న హెచ్చరిక! మానుకోవాలని హితబోధ.

**కండలెల్ల గోయ కాసియ్య జాలని**
**బండలోభి కాసపడిన గలదె**
**కొండకింది పసిడి కోరిన చందమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వాడిని ముక్కలు ముక్కలుగా కోసినా సరే అడిగినవారికి ఒక్క పైసా విదిల్చడు. వాడు రాయిలాంటి పిసినారి. వాడి మీద ఆశపెట్టుకోవడం ఎట్లా వుంటుందంటే కొండకింద పాతిపెట్టిన బంగారం కోసం అంగలార్చినట్టు అని అంటున్నాడు వేమన.

పరమలోభి లక్షణమేమిటంటే ప్రాణం పోవడానికైనా సిద్ధపడతాడు గాని పైసా పోవటానికి ఇష్టపడడు. వాడు బండలోభి. అంటే బండలాగ కఠిన హృదయుడు, కరగడు. బండకు అనేక ఛాయలున్నాయి. సామాన్యార్థమైతే విశాలశిల. వాడి కూటిలో బండబడ్డది అంటే వాడి తిండికే మోసం వచ్చిందని. బండవ్యాజ్యం అంటే ఎంతకూ తెగని కోర్టు కేసు. భారతం బండ పురాణం అనే సామెత కూడా వుంది. బండకత్తి అంటే మొండికత్తి అని, ఎంతకీ తెగదు. బండకెత్తు అంటే మొండికెత్తు. బండతల అంటే బట్టతల, రాయిలాగ నున్నగా వుంటుందని కాబోలు. బండ సంస్కృతంలో భండః, కన్నడంలో బణ్ణ, తమిళంలో వండన్. అన్నట్టు బండ అనే ఒక జాతికూడా వుంది. ఘోరకృత్యాలు చేసి బిచ్చమెత్తుకునే ఒక నీచజాతి. బిచ్చం వెయ్యక పోతే బూతులు తిడతారు. అవే బండబూతులు.

కొండ కింద బంగారాన్ని దాస్తారా? ఎందుకు దాయరు? కొండకింద అంటే కొండ అడుగున అని కాదు. కొండకోనల్లో అని, ఎవరికీ దొరకకుండా అని. తవ్వకాల్లో లంకెబిందెలు బయటపడవూ అవి ఇట్లా పాతిపెట్టినవే.

కొద్దోగొప్పో మానవత్వం ఉన్నవాడికి ఆశపడితే అర్థముందిగాని కర్కోటకుడైన వాన్ని అర్థించడం వ్యర్థం అంటున్నాడు వేమన.

**కట్టెపేరు లోడ గట్టి చెప్పగరాదు**
**కానరాదులోని కలితనంబు**
**జంగమైన పిదప జాతినెంచగ రాదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓడను నిర్మించి దానికి వాడిన చెక్కను పూర్వపు చెట్లపేర్లతో గుర్తించడమెందుకు? దాని మొత్తం గట్టితనం వల్ల వాటి భిన్నత్వం కనిపించదు. అలాగే కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన వీరశైవంలో మళ్లీ కులాల గోల ఎందుకు? అని విసుక్కుంటున్నాడు వేమన.

ఓడను నిర్మించిన తర్వాత ఇది వేప, ఇది చింత, ఇది టేకు అంటూ కట్టెల పేర్లు వేరు వేరుగా చెప్పరాదు. వాటి మొత్తాన్ని చెక్కగా గుర్తించాలి. అలాగే శైవాన్ని స్వీకరించినప్పుడే కులాలు నశించాయి. అందరూ జంగాలుగా, లింగాయతులుగా మారిపోయారు. ఇప్పుడిక పూర్వకులస్మరణ శుద్ధ అనవసరం.

అర్థం పర్థం లేని ఆచారాలు, మూఢ నమ్మకాలు కులతత్త్వాలు ప్రబలిన కాలంలో వాటికి తిరుగుబాటుగా వీర శైవం పుట్టింది. 12వ శతాబ్దంలోని బసవేశ్వరుడు దీని స్థాపకుడు. ఆ రోజుల్లో అదొక శక్తిమంతమైన సంస్కరణ సాధనం. శివపారమ్య కీర్తనం, వేదవిహితమైన యజ్ఞయాగాదుల నిరసన, కులభేదాల నిరాకరణ, స్త్రీపురుష అసమానతల తిరస్కరణ, అస్పృశ్యతపైన ధ్వజమెత్తడం వంటి సిద్ధాంతాలతో వీర శైవం దేశంలో కాలూనివుంది. కుల విభేదాలకు వ్యతిరేకంగా వివాహాలు జరిపించారు వీరశైవులు. మానవతావాదాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించారు.

ఈ మతం కార్చిచ్చువలె దేశంలో వ్యాపించింది. శ్రీపతి పండితుడు, మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు వీరశైవాన్ని కన్నడ ప్రాంతం నుంచి ఆంధ్రదేశానికి తెచ్చి తీవ్ర ప్రచారం చేశారు. వీరశైవంలో అన్ని కులాలవారికి ప్రవేశముండేది. అత్యున్నత స్థానంలోని బ్రాహ్మణులూ, అట్టడుగున ఉన్న అస్పృశ్యులూ అందరూ వీరశైవంలో సమానులైనారు. ఒకరకంగా బ్రాహ్మణాధిక్యతను తగ్గించడానికే వీరశైవం విజృంభించిందని చెప్పవచ్చు.

కాని కాలం విచిత్రమైంది. ఉదాత్తమైన ఆశయాలతో పైకెగసిన వీరశైవం తొందరలోనే నిస్తేజమై పోయి 'చిత్తశుద్ధిలేని శివపూజలేలరా' అనే స్థితికి దిగజారింది. కులాలే వద్దని

తిరస్కరించిన శైవులు 'లింగాయతులు' అనే మరో కొత్తకులం ఏర్పడటానికి కారకులైనారు. వీరశైవులలో అనేక వర్గాలేర్పడి సంఘంలోని వర్ణవ్యవస్థ మార్గంలోనే అనేక కులాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా బ్రాహ్మణ, అబ్రాహ్మణ భేదం ఆధారంగా ఆరాధ్యులు, జంగాలు వెలిశారు. భారతదేశంలో కులం విచిత్రమైందే. ఒకరకంగా ఆక్టోపస్‌లాంటిది. చంపినకొద్దీ మరోరూపంలో బతుకుతుంది.

అప్పటి చారిత్రక సందర్భాన్ని వేమన్న ఎంత సొగసుగా చెప్పాడో! ఓడ అంటే సముద్రంలో సాగే పెద్ద నావ. వాడుకలో వాడ అంటారు. వాడ్రేవు అనే ఇంటిపేరు అట్లా వచ్చిందే. హోడః అనే సంస్కృతీకరణ దీనికి శుద్ధ అనవసరం. "*ఓడ దాటుదాక ఓడమల్లయ్య, ఓడదాటి నంక బోడమల్లయ్య*" అని సామెత. ఓడగట్టి అంటే ఓడను నిర్మించి అని, 'కలితనం' అంటే గట్టితనం. అంటే దృఢత్వం. గట్టింపు అంటే కుమ్మరి కుండరూపాన్ని తీర్చిన తర్వాత గట్టిగా నున్నగా రావటానికి పలుసార్లు నునుపు సలపతో కొడతాడు, అది. కలి అంటే కలియుగంతో ఎట్టి సంబంధం లేదు. గట్టిపడి నునుపెక్కిన కుండను విడివిడిగా చూడటం అజ్ఞానం అంటున్నాడు వేమన. ఓడ పోలిక వేమన సాభిప్రాయ నిపుణతకు మంచి గుర్తు. అజ్ఞాన జలధిని దాటడానికి నిర్మించిన ఓడలోనే భేదాలు ఎన్ననేల అని సారాంశం. దృష్టాంతాలను లోక రమణీయంగా వాడటంలో వేమనను మించినవారు లేరు. స్వభావోక్తి స్పర్శవల్ల అవి మరింత సొగసుదేరాయని చెప్పొచ్చు.

**కడక నఖిలమునకు నడి నాళమందున్న**
**వేగుచుక్క వంటి వెలుగుదిక్కు**
**వెల్గుకన్నదిక్కు వేరెవ్వరున్నారు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యోగి మాత్రమే యోగానుభవంతో చెప్పగలిగిన పద్యమిది. వేమన యోగసిద్ధి పొందాడంటారా? అని కొందరు అడుగుతుంటారు. అలా పొంది ఉంటాడని చెప్పడానికి ఉదాహరణగా ఉన్నపద్యాలు కొల్లలు, 'వేమన జ్ఞానమార్గ పద్యాలు' చాలావరకు ఇట్లాంటివే.

ఆయన సమస్త ప్రపంచానికి ఆధారమైన బ్రహ్మనాడిని అంటుకొని ఉన్నాడు. తెల్లవారు జామున పొడిచే నక్షత్రంలా వెలుగుతున్నాడు. ఆ వెలుగే మనకు దిక్కు. ఎంత ఆలోచించినా ఆ వెలుగు కన్న దిక్కు మనకెవ్వరూ లేరు అని తాత్పర్యం.

కడక అంటే పూనిక, ప్రయత్నం, కోరిక అనే అర్థాలున్నా ఇక్కడ సాధన. అఖిలం అంటే ప్రపంచం మొత్తం.

ఇక 'నడినాళం'. నడినాళం అంటే వెన్నెముకలోని ఇడ, పింగళ అనే నాడులకు మధ్యనుండే నాడి. సుషుమ్న అని దానిపేరు. ఇది మూలాధారం నుండి సహస్రారం వరకు వెన్నెముకలో వ్యాపించి ఉంటుంది. దీనిని బ్రహ్మనాడి అనికూడా అంటారు. ఇడ అనేది మనస్సంబంధమైన నాడి. ఇది ఎడమవైపునుండి ప్రసరిస్తుంది. పింగళ కూడ నాడే, ఇది ఎడమవైపుకు ప్రవహిస్తుంది.

ఇక మూలాధారం. మూలాధారమంటే అన్నిటికి ఆధారమైంది. షట్చక్రాల్లో మొదటిది. షట్చక్రాలు శరీరంలోని ప్రధానశక్తి కేంద్రాలు. ఇవి స్థూలదృష్టికి కనిపించవు. సుషుమ్నదారిలో ఆరోహణక్రమంలో మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞ అని ఆరుచక్రాలుంటాయి. వీటినే షట్చక్రాలంటారు. మూలాధారం కుండలినీ శక్తి స్థానం, సుషుమ్నకాధారం, సృష్టికి మూలం కావటం వల్ల మూలాధారం అంటారు. ఇది వెన్నెముక చివర, విసర్జకావయవానికి సమీపంలో ఉండే నాలుగు దళాల యౌగికపద్మం. సహస్రారం అంటే వెయ్యి ఆకులు గల చక్రం. అరములు అంటే ఆకులు.

సాధనవల్ల మూలాధారం నుండి పుట్టిన కుండలినీ శక్తి సుషుమ్నద్వారా ఎగబాకి, చక్రాలనే గ్రంథులను దాటి సహస్రారాన్ని చేరుతుంది. సహస్రారమంటే లౌకికంగా మెదడు. దీని వెలుగు గాలిరూపంలో వేగుచుక్కలాగ జ్ఞానాన్ని సూచిస్తున్నదని సారాంశం.

ఇదే యోగుల అనుభవం. కుండలిని అంటే మూలాధారంలో ఉండే బిందురూపమైన చైతన్యశక్తి. ఇది ప్రాణాధారమైన తేజోరూపం. బిందువు అంటే విభజనకందని సూక్ష్మాతి సూక్ష్మమైన గుర్తు (చుక్క, point):

జ్ఞానయోగంలో పరబ్రహ్మాన్ని అర్థం చేసుకోడానికి అనుసరించదగ్గ విధానం ఈ పద్యంలో వివరించబడింది. ఆత్మ సాక్షాత్కారాన్ని సాధించేమార్గమన్నమాట. జ్ఞానమంటే యధార్థాన్ని తెలుసుకోవటానికి జాగృతమైన చైతన్యం, ఇది స్వయం ప్రకాశకం. వేమన చెప్తున్న వెలుగు ఇదే. దీనిని వేగుచుక్కతో పోలుస్తున్నాడు. వేగుచుక్క అంటే వేగు జామున వచ్చే నక్షత్రం. శుక్రగ్రహం.

జ్ఞానానికి తెలివి, అనుభవం అనేవి లౌకికార్థాలు. వెలుగు అనేది యౌగికార్థం.

**కడగి వట్టి యాస కడతేరనివ్వదు**
**యిడుములందు బెట్టి యీడ్చుగాని**
**పుడమి జనుల భక్తి పొడమంగ నియ్యదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతిశయించిన ఆశ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. పైగా అది నువ్వనుకున్న దానిని నెరవేరనివ్వదు. అంతేకాదు నిన్ను కష్టాలపాలు చేస్తుంది. అట్లా కష్టాల్లో ఉన్నప్పుడు నిన్ను అటులాగి ఇటులాగి ఎటూ కాకుండా చేస్తుంది. కాబట్టి దీనివల్ల గ్రహించవలసిందేమిటంటే ఆశ అనేది నీకే కాదు లోకంలోని జనుల్లో కూడా భక్తి పుట్టడానికి ఆటంకంగా పరిణమిస్తుంది అంటున్నాడు వేమన.

బాహ్యసుఖాలకోసం అతిగా ఆశపడకు, కర్మబద్ధుడివౌతావ్, దుఃఖాల పాలవుతావ్. జన్మల్లో చిక్కుకపోతావ్, ఆశ నిన్ను భక్తివైపు పోనివ్వదు. భక్తి మార్గం లేకపోతే నీకు ముక్తి గమ్యం అందదు అని సారాంశం.

కడగి అంటే ఉద్యమించడం. ఇక్కడ ఇది పాదపూరణ శబ్దం కాదు. వట్టి అంటే ఉత్త అని అర్థం. దీనికి అనేక ఛాయలు. వట్టి ఆవు అంటే పాలింకిన ఆవు అని, వట్టి వాడు అంటే పనికిరాని వాడని, వట్టికాళ్లు అంటే చెప్పులు లేకుండా అని, వట్టిగాలి అంటే వానపడని గాలి అని. ఇంకెన్నో! ఆశ అంటే కోరిక. కడ అంటే దరి, ఒడ్డు. కడతేరు అంటే సిద్ధించు. ఇడుము అంటే క్లేశం, ఆయాసం.

పుడమి అంటే భూమి, పృథివి, భూలోకమన్నమాట. పొడముట అంటే జనించడం, ఉదయించడం. "*విభీషణుడున్ గైకసి గర్భవార్ధిబొడమెన్ సంపూర్ణ చంద్రాకృతిన్*" అనేది ప్రయోగం.

ఒక్క ఆశ తప్ప కడగి, కడ, ఇడుము, పుడమి, పొడము వంటివన్నీ దేశీయపదాలే కావడం గమనార్హం.

**కడుపుకేల మనస! కళవళపడియెదు**
**కడుపుకేల తృప్తి కలుగుచుండు**
**కడుపు రాతిలోని కప్పకుగలుగదా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓ పాడు మనసా! రాత్రింబవళ్లు ఈ పొట్టకోసం ఇంతగా కలవరపడి పోతావెందుకు? ఈ చిన్న కడుపుకు ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒకచోట కాస్త తిండి దొరక్కపోదు. రాతిలో ఉన్న కప్పను ఎవరు కాపాడుతున్నారు? దానికి కడుపు లేదా అని ఆలోచించమంటున్నాడు వేమన.

రాతి లోని కప్పను దైవం ఏవిధంగా బతికించుకుంటూ పోషిస్తున్నాడో అట్లాగే జీవులన్నింటినీ ఆయనే చూసుకుంటున్నాడు. దిగులు వద్దు నారు పోసినవాడు నీరు పొయ్యడా! ముందు నువ్వు చెయ్యవలసిన పనిచూడు అనేది సారాంశం.

కళవళం అంటే కలత, కళవళపాటు అంటే తొట్రుపాటు. తిండిలేదు తిండిలేదు అంటూ ఊరికే క్షోభపడనక్కరలేదు. దానికోసం ఏదైనా చెయ్యి, లేదా భగవంతునిపైన భారం వెయ్యి, కడుపుకోసం ఏం చెయ్యాలో తోచని బలహీన మనస్కుడికి ఆలోచిస్తే ఏదో ఒక మార్గం స్ఫురించకపోదని వేమన్న సూచన. ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా బతికే అవకాశముంది అని ఆశాప్రబోధం.

ఉదాహరణకు రాతిలో కప్ప ఉంది అంటారు. దానిని కొందరు విశ్వాసమనీ, కొందరు సృష్టిలోని చమత్కారమనీ భావిస్తారు. ద్రవ పదార్థం ఘనీభవించి కదా రాళ్లు ఏర్పడ్డాయి. కొన్ని రాళ్లలో నీళ్లు ఇంకా మిగిలే వుంటాయి. వాటిలో కప్పలాంటి జలచరాలు ఉంటే ఉండొచ్చు. వాటికి కావలసిన జీవవస్తువులను భగవంతుడే ఏర్పాటు చేశాడు. రాయి పగిలి నప్పుడు ఆ కప్ప బయటికి వచ్చేస్తుంది. అంతెందుకు? చీమలు భూమిలో ఎంతో లోతుదాకా వెళ్తాయి. వాటికి ప్రాణవాయువును ఎవరు అందిస్తున్నారు? శిశువుకు కూడా తల్లి గర్భంలో ఎంతో గొప్ప ఏర్పాటు వుంది. కాబట్టి వ్యర్థాలోచనలు మాని దేవుడు చూపిన మార్గంలో మానవప్రయత్నం చెయ్యి, సోమరిపోతువై బాధపడితే లాభం లేదు అని వేమన్న సందేశం.

**కడుపు చిచ్చుచేత కామానలము చేత**
**క్రోధ వహ్ని చేత కుటిల పడక**
**ఒక్కమనసు తోడ నుండినప్పుడె ముక్తి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కడుపులో ఆకలిమంట, మనసులో కోరికల తాపం, అసహనంతో ఆగ్రహజ్వాల మనిషి ఈ మూడు నిప్పుల్లో పడి చావడమెందుకు? అరిషడ్వర్గాలకు లొంగిపోక మనసును ఏకాగ్రత వైపు మళ్లించినప్పుడే మనశ్శాంతి లభిస్తుంది. అదే ముక్తికి మార్గం అంటున్నాడు వేమన.

చిచ్చు అంటే వేడి. ఆకలి కాబట్టి ఇక్కడ జఠరాగ్ని. కామం అంటే ఇష్టం. అది కూడా అగ్నే. అనలం అంటే అగ్ని. క్రోధం అంటే కోపం. ఇది రౌద్రరస స్థాయి భావం. వహ్ని అంటే నిప్పు. వహ్నిజాతం అంటే మంట.

ఆకలిని జయించటం కష్టమే. కాని దానిని జయించిన రుషులున్నారు. కామాన్ని గానీ క్రోధాన్నిగానీ నిగ్రహంతో నిలువరించుకోవచ్చు. అగ్నిలక్షణమేమిటంటే అది ఏ చోట పుడితే ముందు ఆ చోటును కాల్చేస్తుంది. ఆకలి వల్ల కడుపు కాలిపోతుంది. కామం వల్ల మనసు దహించబడుతుంది. క్రోధం వల్ల బ్రతుకు పరశు రామప్రీతి అవుతుంది. కాబట్టి మనస్సును చిక్కబట్టుకొని ముక్తి గురించి ప్రయత్నించడం ఉత్తమం అని సారాంశం.

**కడుపునిండ సుధను క్రమముతో త్రావిన**
**పాలమీద నేల పారుమనసు?**
**తత్వమెరుగ వెనుక తత్వంబు లేటికో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అమరత్వాన్ని ప్రసాదించే అమృతం తాగిన వాడికి పాలు తాగాలనిపిస్తుందా? పరమతత్వాన్ని పట్టుకున్న వాడికి మళ్లీ ప్రాపంచిక యథార్థాల అవసరం ఉంటుందా? ఉండదు అంటున్నాడు వేమన.

చావు లేని యోగానుభవ స్థితికి వెళ్లినవాడు మళ్లీ వెనక్కి వచ్చి భోగాల్లో చిక్కుకుంటాడా? చిక్కుకోడు అని సారాంశం.

సుధ అంటే అమృతం. పాలు, సున్నం అని కూడా. శరీరానికి పాలుకూడా అమృతతుల్యమే కదా! ఇక్కడి అర్థం అదికాదు. సుధాకరుడు అంటే చంద్రుడు. చంద్రుడిలో అమృతముంటుందని కవిసమయం. ఇటీవల చంద్రునిలో నీళ్లున్నాయంటున్నారు. అది అమృతమేనేమో!

అతడు అమృతాన్ని కడుపార తృప్తిగా గ్రోలాడు. క్రమముతో తాగాడు. ఒక్కఊపున గటగటా తాగెయ్యలేదు. యోగసాధన కూడా అంతే ఒక్కొక్క మెట్టుగా ఆచరించి తురీయస్థితికి చేరుకున్నాడు. ఇంక అతడు పుష్టిదాయకమైన పాలనెందుకు కోరుతాడు?

తత్వం అంటే బ్రహ్మానుభవ తత్వం అనే మాటను రెండుసార్లు వాడాడు వేమన. రెండోది లౌకికతత్వం.

*కడుపునిండ సుధను కడువేడ్కతోద్రావ* (డి. 1723–551); *తత్వమెరిగెనేని తగులునా గృహచింత* (డి. 1727–504) అనేవి పాఠాంతరాలు.

**కనకమృగము భువిని కలదు లేదనడయ్యె**
**రామునంత వెర్రి రాజుగలడె**
**పురము దప్పిపోవ బుద్ధులు నిలువవు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ప్రపంచంలో బంగారు లేడి అనేది ఉంటుందా అని ఆలోచించకపాయె. నిజంగా రాముడిలాంటి పిచ్చిమారాజు ఎక్కడన్నా ఉన్నాడా? ఊరువిడిచి అడవి దారిపట్టినవాడికి సాధ్యాసాధ్యాలను గురించి ఆలోచించే విచక్షణ పోతుందా ఏమి అని అంటున్నాడు వేమన. బుద్ధి అంటే will, inclination, mind, advice, sense, judgement అని బ్రౌన్ అర్థాలిచ్చాడు. Judgement అనేది ఇక్కడ సరిపోతుంది. పురము దప్పి పోవటమంటే పురం విడిచిపోవటమే. రామునివెర్రి విచక్షణ లేకపోవటంలోనే కాదు, యౌవనవతియైన సీతను ఒంటరిగా వదిలి కల్ల కనకం వెంట పడ్డాడు. నిజాన్ని వదిలి భ్రమల వెంటపడటం పిచ్చి అని సూత్రీకరిస్తున్నాడు వేమన.

తాత్త్వికంగా అద్వైత సిద్ధాంతం మీద తిరుగుబాటుగా అనేక ధోరణలు తలెత్తాయి. వాటిలో ముఖ్యమైనవి రామానుజుని విశిష్టాద్వైతం, మధ్వాచార్యుని ద్వైతం. ఈ రెండుకూడ కొంత భేదంతో శంకరుని మాయావాదాన్ని ఖండించి ప్రపంచం యొక్క వాస్తవికతను అంగీకరించాయి. ఇవి అగాధమైన తాత్త్విక చర్చలను నిరాకరించి వేర్వేరు మోతాదుల్లో భక్తిమార్గాన్ని ప్రచారం చేశాయి. ముఖ్యంగా భేదానికి ప్రాధాన్యమిచ్చిన ద్వైతం సహజంగానే కులవిభేదాలకు, కర్మకాండకు తావిచ్చింది. మాధ్వమతం ఎక్కువగా పురాణాదులపైన ఆధారపడిందంటారు. తత్వపిపాసిగా మారిన వేమన పురాణపాత్రలను తర్కంతో అవహేళన చేశాడు.

ఈ పద్యానికి పాఠాంతరాల కొదవ లేదు. మూడవపాదంలో 'తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా" అనే ముద్రిత పాఠం. ఏ అముద్రిత ప్రతిలోనూ కనిపించదు. మరి కొన్ని పాఠాంతరాలు:

*రాముడెరుక గల్గు రాజు గాడొ / చేటు కాలమైన చెడుబుద్ధి పుట్టురా* (డి.1723; 468) *తలపు కొలదిగాదు దైవికమే గాని* (డి.1773; 95) వెర్రిరాజు అనే ప్రయోగం జానపద రామాయణాల్లో "వెర్రిరాముడ"నే వాడుకను జ్ఞాపకం చేస్తున్నది.

**కనియు కానలేడు కదిలింపడానోరు**
**వినియు వినగలేడు విస్మయమున**
**సంపదగలవాని సన్నిపాతకమిది**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పేదవాడిని చూసి కూడా చూడనట్టు నటిస్తాడు. వాడి మొర వినికూడా వినిపించుకోడు. ఇంత జరుగుతున్నా నోరు మెదపడు. ఎంత పొగరు? డబ్బుగల వాడికేమన్నా సంధిరోగమా ఇన్ని చేష్టలకు పాల్పడుతున్నారు?

చూస్తే చూసినట్టుండాలి. వింటే వినగానే స్పందించాలి. నోరు విప్పి ఏదో ఒకటి మాట్లాడాలి. కాని ఇదేమిటి మూర్ఛరోగిలాగ అస్తవ్యస్తంగా ప్రవర్తిస్తున్నాడు? ఇతనిలో డబ్బా, అహంకారం, లోభం ముప్పేటగా అల్లుకుపోయి విస్మయం కలిగేట్టుగా అంటే వింతగా వ్యవహరిస్తున్నాడు. ఈ దోష గుణం తొలిగిపోతే గాని ఇతడు మామూలు మనిషిగా మారేటట్టులేడు అంటున్నాడు వేమన.

సన్నిపాతం అంటే దోషగుణం. కలయిక అని అర్థాలు. 'దోషాణాం చాయుతానాం చసన్నిపాతా ఇమా స్మృతాః' (వాత, పిత్త, కఫం అనే మూడు దోషాలు కలిసి ప్రకోపించడం వల్ల ఏర్పడినది సన్నిపాతమని పేర్కొనబడింది); అలాగే 'ధూమ, జ్యోతిస్సలిలమరుతాం సన్నిపాతఃక్వ మేఘః' (పొగ, నిప్పు, జలం కలవడం ద్వారా ఏర్పడిన మేఘం ఎక్కడ?) ఇక్కడ కలయిక అని అర్థం.

సన్నిపాతం అనే మాటవాడటం వల్ల వేమన ధనాహంకారి పిచ్చి చేష్టలను కళ్లకు కట్టేటట్టుగా వర్ణిస్తున్నాడు. ఆధునిక కాలంలో మూకాభినయం (ఇంగ్లీషులో మైమ్) అనే కళారూపం ప్రచారంలో వుంది. దానికి ప్రతిరూపంలా ఉన్నాడితడు. ఇటువంటి పోలికలు వేమన కవితాశక్తికి నిదర్శనంగా ఉంటాయి.

సంపద ఉన్నంతమాత్రాన చాలదు. దానగుణం కూడా ఉండాలి అనేది వేమన్న ఉవాచ.

**కన్నపుత్రునాస కనకంబు మీ దాస**
**స్త్రీల మీద యాస చిత్తమెడలి**
**భ్రమలు విడువకున్న బ్రహ్మంబు గానరో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మితిమీరిన పుత్రవ్యామోహం, అలవిమాలిన ధన లోభం, మిక్కుటమైన స్త్రీలోలత్వం వీటిపైనుంచి మనసును వదిలించుకుంటే మంచిది. అప్పుడుగాని భ్రమలు తొలగిపోవు. భ్రమలు తొలగిపోతే తప్ప బ్రహ్మసాక్షాత్కారం జరగదు. గ్రహించమంటున్నాడు వేమన.

కన్నసంతానం పట్ల మమకారం సహజమే కాని ఒక దశలో అది తగ్గాలి. కాంతాకనకాలు కూడా అంతే! ఒక వయస్సులో వాటి పట్ల ఆకర్షణ పోవాలి ఎంతకాలమీ భ్రమలు, ఇవి పరమార్థ సాధనకు అడ్డువస్తాయి కదా!

చిత్తం అంటే వ్యవహారంలో మనస్సే. తాత్విక భాషలో చెప్పాలంటే సంస్కారాలను దాచి ఉండే మనఃప్రవృత్తిని చిత్తమంటారు. మరి మనస్సంటే? మననధర్మం కలది మనస్సు. దీనికి సంకల్ప వికల్పాలుంటాయి. ఇది దేహంలోంచి బయటికి వెళ్లలేదు అది ఇంద్రియాల ద్వారా వ్యక్తమౌతుంది. ఎడలి అంటే వదిలించుకొని, తొలగించుకొని అని అర్థాలు. భ్రమకు అర్థం, ఎన్నోసార్లు చెప్పుకున్నదే. అంటే భ్రాంతి. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు అనిపించేట్టు చేసేది భ్రమ.

**కన్నులందు మదము కప్పి కానరు గాని**
**నిరుడు ముందటేడు నిన్న మొన్న**
**దగ్ధులైన వారు తమకంటె తక్కువా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మేమే అంతా పొడిచేస్తున్నాం వెనుకటి వాళ్లు చేసిందేమి లేదు అనుకోవటం అజ్ఞానం అంటున్నాడు వేమన.

చూడలేని పరిస్థితి వస్తే కళ్లన్నా పొయ్యుండాలి. ఉంటే వాటికి మదం పొరలన్నా కప్పి ఉండాలి. నువ్విప్పుడు చేసే ప్రయత్నాన్ని గతంలో ఎందరో మొదలుపెట్టి కొనసాగించారు. వాళ్ల భుజాల మీద నిలబడి వాళ్లు నీ కంటె తక్కువ అనుకోవటం దురహంకారం.

'గతకాలము మేలు వచ్చుకాలం కంటెన్' అని కొన్ని సందర్భాల్లో అనుకోవడం సహజమే కాని గతాన్ని పూర్తిగా విస్మరించేవాడికి చరిత్ర లేదు. ముందుకు సాగటానికి అనుభవ పాఠాలు లేవు. మదం అంటే అహంకారం. ఏనుగు కొవ్వు, పురుష వీర్యం అనే అర్థాలు కూడా వున్నాయి. మదం అరిషడ్వర్గాల్లో ఒకటి. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలు అరిషడ్వర్గాలు. ఇవి ఎవడిలో ఉంటాయో అవి వాడికే శత్రువులుగా మారుతాయి. మదాంధత వల్ల గతంలోని మంచిని చూడలేక పోతున్నాడు అంటున్నాడు వేమన. మదాంధత అంటే మదంవల్ల ప్రాప్తించిన గుడ్డితనం అన్నమాట.

దగ్ధులైనవారు అంటే దహనమైనవారు అంటే చనిపోయినవారని అర్థం. వారు ఎప్పుడో పిడికెడు బూడిదయ్యారు సరే, అంతమాత్రాన వారు సాధించిన సత్ఫలితాలను చూడలేకపోవటం గుడ్డితనంతో సమానం లని సారాంశం.

**కప్పురంబు మనసు కాంక్షించు యోగికి**
**జ్ఞానదీప శిఖయు తానటించు**
**కానవచ్చు నాత్మ క్రమమాణమైనిచ్ఛ**
**విశ్వదాభి రామ వినురవేమ.**

కర్పూరం లాంటి స్వచ్ఛమైన మనసును అలవరచుకునే పవిత్రుడిలో జ్ఞానజ్యోతి వెలిగి ఒకానొక ఆత్మస్ఫురణ కలుగుతుంది. ఆ ఆత్మ క్రమంగా అతని అనుభవం లోకి వస్తుంది. అతడు కోరుకున్నదదే అంటున్నాడు వేమన.

కప్పురము అంటే కర్పూరమే. ఘనసారం అని కూడా అంటారు. 'కప్పురవిడెము' అని అల్లసాని వారన్నారు. కప్పురము అనే రూపానికి 'వృత్తియందు హల్లు పరమగుచో 'ము' వర్ణలోపము వికల్పము' అనేది వ్యాకరణ సూత్రం. కర్పూరమంటే ఇక్కడ కర్పూరతైలం. ఇది సువాసనాభరితం. ఇక జ్ఞానదీపం. జ్ఞానమంటే ఎరుకే, తత్వజ్ఞానమన్నమాట. యధార్థాన్ని తెలుసుకోవటానికి జాగృతమయ్యే చైతన్యాన్ని జ్ఞానమంటారు. ఇది స్వయంగా ప్రకాశించటమే కాకుండా ఇతరాలను కూడా ప్రకాశింపజేస్తుంది. కాబట్టి కర్పూరం లాంటి శుభ్రమైన మనస్సును అది వెలిగించటం సహజం. ఆ వెలుగులో ఆత్మానుభూతికి దారి ఏర్పడుతుందనేది సారాంశం. అయితే ఆత్మజ్ఞానం ఒక్కసారిగా కలిగేది కాదు. క్రమంగా కలుగుతుంది. అంటే ఒకదానివెంట మరొకస్థితిని అందుకుంటూ ముక్తిని పొందటమన్నమాట.

దీపశిఖ అంటే దీపం యొక్క కొన, అగ్నిజ్వాల. నటించు అంటే ప్రవర్తించడం. ఇచ్ఛ అంటే కోరిక. అలభ్యవస్తువును సంపాదించడంకోసం కలిగే సంకల్పాన్ని ఇచ్ఛ అంటారు. ఇక్కడ ఇచ్ఛకు పర్యవసానం ముక్తి అని అంతరార్థం.

**కరక కాయలు తిని కాషాయ వస్త్రముల్**
**బోడినెత్తి గలిగి పొరయు చుంద్రు**
**తలలు బోడులైన తలపులు బోడులా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కపట సన్యాసులు కామవృద్ధి కోసం కరక్కాయలు తింటారు. పైకి కావిరంగు బట్టలు ధరిస్తారు. పైకి బోడిగుండుతో దర్శనమిస్తారు. లోపలమాత్రం కోరికలతో వేగిపోతుంటారు. ఇలాంటివారిని ఓ కంట కనిపెట్టి ఉండాలనేది వేమన్న హెచ్చరిక.

వైద్యగ్రంథాల ప్రకారం కరక్కాయ తల్లి వంటిది. హితం కలిగించేది. దీనికి అభయ, కాలకూణిక, చేతకి, నందిని, రుద్రప్రియ, శుక్రసృష్ట, సుధోద్భవ, హారీతకి అనే పర్యాయపదాలున్నాయి. యోగులు కామోపశమనానికి కరక్కాయలు తినేవారని ఒక వాడుక. శుద్ధి చేయకుండా వట్టి కరక్కాయ తింటే వీర్యం చెడిపోతుందని వైద్యులు చెప్తారు. కాని ఇక్కడి అర్థం వీర్యవృద్ధి కోసమే కరక్కాయ. ఇది పసుపు నలుపు మిశ్రమ వర్ణంలో వుంటుంది. ద్రవంలో నలుపుగా మారుతుంది. దీనితో కరక్కాయ సిరా తయారు చేసేవారు. ఇప్పటికీ వస్త్రాలకు రంగులద్దటం (Dying) లో వీటిని వాడతారు. కాషాయం అంటే కావిరంగుబట్ట ఇటుకఎరుపులో వుంటుంది. కాషాయధారణ వ్యాసుడి కాలం నుంచీ వుందట. కాషాయం రంగు త్యాగానికి చిహ్నం. సూర్యోదయ, అస్తమయాల్లో ఒక త్రుటి కాలం ఈ రంగు కనిపిస్తూ తెలుపుగా మారిపోతుంది. యజ్ఞజ్వాలలో కూడా ఈ వర్ణం కనిపిస్తుంది. పొరయు అంటే ఉండటం. *'కామాతురులకు భయమును, లజ్జయు బొరయవనన్ వినమె'* అన్నది ప్రయోగం.

అబేదుబాయ్ అనే ఒక ఫ్రెంచిఫాదర్ హిందువుల ఆచారాలపై ఓ గొప్పగ్రంథం రాశాడు. ఆయన తన కాలంలోని శైవ గురువులను గురించి ఇలా రాశాడు. ఒక గురువు యాత్రకు బయలుదేరి ఆతిథ్యానికి ఓ భక్తుని ఇల్లు ఎన్నుకునే వాడు. ఆ యింటి యజమాని భార్య తప్ప ఆ యింటి వాళ్లందరూ ఇల్లు ఖాళీచేసి గురువు బస చేసినన్ని రోజులు వేరేచోట నివసించేవారు. ఇంటి యజమాని భార్య అతనికి సేవలు చేసేది. అయితే ఆ గురువర్యుడు తరచుగా పడుచుభార్య ఉన్న ఇంటినే బసకు ఎన్నుకునే వాడట, అదీ సంగతి!

తలపైన వెంట్రుకలు కొరిగించుకున్నాడుగాని మనస్సులో కాంక్షారోమాలను మాత్రం అలాగే వుంచుకున్నాడని వేమన్న చమత్కారం.

**కరక కాయలు దిని కాసెల బిగియించి**
**కాంత విడుచుటెల్ల కాని గుణము**
**ఎలమి తీగగట్ట ఏనుగు నిల్చునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యౌవనంలో ఉన్నప్పుడు బలవంతపు బ్రహ్మచర్యం వల్ల ప్రయోజనం లేదు అంటున్నాడు వేమన. దానికోసం వగరుగా ఉండే కరక్కాయలు తిని, బిర్రుగా లంగోటి ధరించి స్త్రీని దూరంగా పెట్టి కామభావాన్ని అణచుకోవడం కృత్రిమమైన పని. ఇదెట్లా వుంటుందంటే పెద్ద ఏనుగును చిన్న తీగతో కట్టివేసినట్టు. అయితే ఏనుగు బలం ముందు తీగ గట్టితనం నిలుస్తుందా అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

కరక చెట్టును సంస్కృతంలో హరీతకీ అంటారు. ఆయుర్వేదవైద్యంలో ఉసిరికాయ, తానికాయ, కరక్కాయ అని మూడు రకాల ఫలాల ప్రమేయం తరచుగా వుంటుంది. త్రిఫలాలు అంటారు వీటిని.

*"ఆది వైద్యుడతడు దుగ్ధాబ్ధి బుట్టె*
*అమృత పూర్ణ కుంభంబొక హస్తమునను*
*నంబు చరమును గరక కాయయును నొకట*
*దాల్చి" అని ప్రయోగం.*

కామ నిగ్రహానికి కరక్కాయలెందుకు? కరక్కాయ వీర్యవర్ధకమే గాని క్షీణతకు ఉపకరించేది కాదు. పైగా దీనితో చేసిన మందు ఊపిరితిత్తుల వ్యాధులకు, చర్మవ్యాధులకు పనికొస్తుంది. తీపి పదార్థాలు కూడా వీర్యవృద్ధికి తోడ్పడతాయి. కాబట్టి ఇక్కడ కరక్కాయ ప్రసక్తిని దాని రుచి అంటే వగరు వరకే పరిమితం చెయ్యడం మంచిది. మరులు పుట్టించే మధుర పదార్థాలు కాకుండా తద్విరుద్ధమైనవి తినడమన్నమాట! అలాగే కాసె బిగించుకోవడం. కాసె అంటే గోచి. గట్టిగా బిగిస్తే లంగోటి. కామ నివారణకు అదో కృత్రిమ ప్రతిక అయి వుంటుంది. బ్రౌన్ దీనిని "severe chastity langoti" ' అన్నాడు. ఇది మడి గుడ్డ కాకపోవచ్చు.

'కాని గుణము' అంటే చెయ్యగూడని పని, అసాధ్య కార్యమని. కామ నిగ్రహానికి మనో నిగ్రహం కావాలి గాని బాహ్యప్రయత్నాలు నిష్ప్రయోజనాలని సారాంశం. అన్నట్టు కరక్కాయలతో సిరా (Ink) కూడా తయారు చేస్తారు. ఇది నల్లగా ఉండి, ఎప్పటికీ చెరగదని. శ్రీశ్రీ 'కవిత కరక్కాయ సుమీ' అన్నాడు. దాని సందర్భం వేరు.

ఎలమి అంటే సంతోషం. తరచుగా పాదపూరణ పదం. ఇక్కడ 'ఎలమి' అంటే అలవోకగా, హాయిగా అనే అర్థంలో క్రియావిశేషణం. "కరకకాయలు నమిలి వెంపలందు గట్ట ఏనుగు నిలుచునా" (డి.1724-391) అనేవి పాఠాంతరాలు.

**కరగ కరగ పుట్టు కనకంబునకు వన్నె**
**పెనగ పెనగ పుట్టు ప్రేమ సతికి**
**ముదియ ముదియ పుట్టు మోహంబు లోభంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎంత కరిగితే బంగారానికి అంత వన్నె పెరుగుతుంది. ఎంత లాలన చేస్తే సహచరికి అంత వలపు జనిస్తుంది. కాని విచిత్రం! ముసలి వారికి వయస్సు పెరిగిన కొద్ది మోహం పెరుగుతుంది. లోభం కూడా అని ఆశ్చర్యపడుతున్నాడు వేమన.

కాచగా, కాచగా బంగారానికి వన్నె పెరుగుతుంది. దీన్నే పుటం పెట్టడమంటారు. పుటం పెట్టడమంటే ఏమిటి? స్వర్ణకారుడు మట్టి, ఉప్పు తదితర లవణాల చూర్ణంలో బంగారాన్ని వుంచి వేడి చేస్తాడు. చేయగా చేయగా మలినాలు లేదా దానిలోని రాగి, వెండి లాంటి ఇతర లోహాలు వేరుబడి పల్చబడిన పసిడి రేకు మిగుల్తుంది. (బంగారం పూర్తిగా కరిగిపోదన్నమాట!) ఆ రేకు మరింత కాంతితో ధగధగలాడుతుంది. అప్పుడు దానికి పన్నెండో వన్నె వచ్చిందన్నమాట. పన్నెండో వన్నెతో ఉన్నదే చొక్కమైన బంగారం. పన్నెండో వన్నెను నేటికాలంలో 24 క్యారెట్లు అంటున్నారు. క్యారెట్లను ఎలా గుర్తిస్తారు? వొరగల్లు రాయి పైన రాచిచూసి. ఈ రాయిని సాన అని కూడా అంటారు. శ్రేష్టమైన రాయి. పరీక్షించే రాయిని నికషం అంటారు సంస్కృతంలో. రాయిపై రాచి చూస్తే తేలిన వన్నెను బట్టి బంగారం వెలకడతారు. 'కర్షక, కార్మిక వీరుల ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్' అన్నాడు శ్రీశ్రీ. షరాబు అంటే స్వర్ణకారుడే. కనకం అంటే దీపించేది అని అర్థం. (కనతి ఇతి కనకమ్).

ఇక పెనగ అంటే కూడు, చుట్టుకొను, మెలిగొను, సంభోగించు అని అర్థాలు. పెనగ పెనగ అని రెండుసార్లు వాడటం ఆధిక్యం కోసం. నిరంతరంగా అని అర్థం. ఆమె సిగ్గరి అయినా, బిడియస్తురాలయినా అతని అనవరత ప్రేమ వల్ల కరిగిపోతుంది. ఇది బంగారంలా కనపడే ప్రేమ కాదు. తెలిసిపోయే ప్రేమ.

కాని వయస్సు మళ్లుతున్న కొద్దీ మగువపైన వలపూ, ధనంపైన ఆశా తగ్గాలి కదా మరి పెరుగుతాయంటున్నాడేమిటి వేమన? అవును ఇది లోకంలో చూస్తున్నదే. ఇది సహజ ధర్మము కాదు గాని అన్నీ ఉడిగిపోతున్నప్పుడు ఆశ ఎక్కువ కావడం స్వాభావికమేమో. అందుకే వార్ధక్యంలో వైరాగ్యం శోభిస్తుందనే ధ్వని కూడా ఉందీ పద్యంలో. ముదిమి వయస్సులో దైహికవాంఛలు తగ్గించుకొని దానిని చుట్టూ వున్న పిల్లాపాపలపట్ల వాత్సల్య రసంగా మార్చుకుంటే అదో పద్ధతి. అందుకే మనవాళ్లు చతుర్విధాశ్రమాలను సూచించారు.

'*కదియ కదియ పుట్టుకాంత ప్రేమ* (డి. 1773, 120); *కరగ కరగ పుట్టు కనకంబు కొకవన్నె*' (డి. 1724, 1-41) అనేవి పాఠాంతరాలు.

**కరములందు నమరు గంగాధరుని బట్టి**
**తీర్థములకు బోయి తిరుగుచుంద్రు**
**వెన్నబట్టి నెయ్యి వెదికిన చందంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చేతిలో ఇమిడిపోయే లింగరూపంలో ఉన్న శివుడే అధీనంలో ఉండగా అతనికోసం ఎక్కడోవున్న తీర్థ స్థలాలకు యాత్రలు చేస్తుంటారు. ఇదెట్లా వుంటుందంటే అరచేతిలో వెన్నను పెట్టుకొని నెయ్యికోసం వెదికినట్టు అంటున్నాడు వేమన. ఇది అజ్ఞానం కాదా అని ప్రశ్న.

తీర్థం అంటే పవిత్రజలం. కొండలపై వెలిసినవి క్షేత్రాలైతే నదీతీరాల్లో వెలిసినవి తీర్థాలు. పుణ్యతీర్థాలను దర్శించడానికి చేసేది తీర్థయాత్ర. ఈ పద్యంలో వేమన చేసిన చమత్కార మేమిటంటే గంగాధరుడు అనేమాట వాడటం. గంగాధరుడు అంటే శివుడు, అంటే గంగను తలపైన ధరించినవాడు. గంగను ధరించిన వాడే లింగరూపంలో నీ చేతిలో వున్నాడు, అంటే గంగయే నీ చేతిలో వుంది; అటువంటప్పుడు సుదూరాల్లో వున్న పవిత్ర జలాల్లో స్నానమాడటానికి వెళ్లాల్సిన అవసరం ఉందా? అంటూ మెత్తగా మందలిస్తున్నాడు వేమన.

తీర్థం అంటే రేవు, ఘట్టం అని అర్థాలు. మోక్షమని కూడా. ప్రయాగను తీర్థరాజం అంటారు. తీర్థాలలో మేలైనదని.

వీరశైవ దర్శనంలో స్థలం, లింగం, అంగం అని మూడు ముఖ్యమైన మాట లున్నాయి. శివుడు జీవుల యెడ జాలితో లింగరూపం దాల్చి ఉపాస్య దేవతగా మారిపోయాడు. శివలింగం మూడు విధాలు. 1.భావలింగం 2.ప్రాణలింగం 3.ఇష్టలింగం. మొదటిది ఆంతర సమ్యగ్ దృష్టికి మాత్రమే గ్రాహ్యం. రెండోది సాధారణ భావగమ్యం. మూడోది దేశకాలాతీతుడైన భగవంతున్ని అర్చించుకునే సౌకర్యాన్ని కలిగించేది. ఈ పద్యంలో వున్నది మూడోదాని ప్రసక్తే.

చేతిలో వెన్నపెట్టుకొని నెయ్యికోసం వేరేచోట వెతకనవసరం లేదు. వెన్నను కరిగిస్తే నెయ్యి లభిస్తుంది కదా అంటూ ఒక ఆధ్యాత్మిక సత్యాన్ని ఒక భౌతిక పదార్థం యొక్క రూపాంతర ధర్మంతో అన్వయించి చెప్తున్నాడు వేమన.

**కర్మగుణములన్ని కడబెట్టి నడవక**
**తత్వమేల తనకు తగులుకొనును**
**నూనెలేని దివ్వె నువ్వుల మండునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సత్త్వ రజస్తమో గుణాలను త్రిగుణాలంటారు. వీటిలో రెండూ మూడూ కర్మగుణాలు. అంటే దుష్ఫలితాల నిచ్చే పనులు. కాబట్టి వీటిని చివరి లేశం దాకా తరిమేస్తే గాని శుద్ధమైన సాత్త్విక గుణం మిగలదు. సాత్త్వికమే తత్వజ్ఞానానికి అనువైన స్థితి. అప్పుడే తత్వం బోధపడుతుంది. అంటే ప్రకాశిస్తుంది. ఎట్లాగంటే దీపాన్ని వెలిగించాలంటే ప్రమిదలో నూనె పొయ్యాలి గానీ దానికి మూలమైన నువ్వులు పోస్తే ప్రజ్వలనం జరగదు కదా అని అంటున్నాడు వేమన. అవును అని సమాధానం.

నువ్వుల్లో నూనె వుంటుంది. కాని నువ్వులను గానుగలో వేసి నలగ్గొట్టి పిండితే తప్ప వాటినుంచి నూనె వేరుపడదు. ఆ నూనె వల్లనే జ్యోతి మండుతుంది గాని నువ్వులు వేస్తే మండదు. నువ్వులు అంటే తిలలు. తైలం అనే మాట దీని నుంచే వచ్చింది. ఇది దేశిపదం. తమిళంలో నూ, నూవు అంటారు. నువ్వు గింజ చిన్న గింజ. నువ్వు గింజ యెత్తు అంటే దాని బరువును చెప్పేది. నువ్వు గింజ వెయ్యడానికి చోటు లేదు అంటే అంత జనసమ్మర్థమని.

నువ్వు గింజలను పిండి పిప్పి చేస్తే నూనె వచ్చినట్టే రాజసిక తామసిక గుణాలను నిర్మూలించుకుంటే తప్ప ఆత్మజ్యోతి వెలగదు. ఆత్మజ్యోతి వెలగడమంటే మోక్షమే.

నువ్వుల్లో నూనె వుంది కదా! అవి వేసినా దీపం వెలగాలి కదా! కాదు నువ్వులు తిలత్వాన్ని కోల్పోయి తైలంగా మారాలి. అప్పుడే దానికి మండించే శక్తి వస్తుంది. అలాగే చెడు పర్యవసానాలకు దారితీసే కర్మగుణాలను కష్టపడి తీసెయ్యాలి. అప్పుడే తత్వజ్ఞానానికి గల అడ్డులన్నీ తొలగిపోతాయి అని సారాంశం. ఒక సామాన్యమైన వస్తుతత్వాన్ని తీసుకొని సాధారణ జనానికి గహనమైన ఆధ్యాత్మిక ప్రక్రియతో పోల్చి చెప్పడం వేమనకే చెల్లింది. కర్మల సారం తెలిసినవారు అంటే కర్మలకు అతీతమైన జ్ఞానాన్ని దర్శించినవారు లోకంలో కొందరు ఉండవచ్చు. కాని అంతటి ఉదాత్తమైన మార్మికచింతనను పిల్లలకూ వృద్ధులకూ అర్థమయ్యేంత ఆశ్చర్యసరళంగా, ఆనందసుందరంగా చెప్పడం వల్ల యావత్ ప్రపంచంలో వేమన ప్రజాయోగిగా అవతరించాడని చెప్పడానికి సందేహించవలసిన అవసరం లేదు. *నూనె లేని దివ్వె నుప్పుల (నిప్పుల) మండునా?* (డి.1773-1-405) అనేది పాఠాంతరం.

**కలిగినట్లు బతుకు కలుగక యుండును**
**కలుగనట్లు బతుకు కలిగియుండు**
**బ్రహ్మదేవు వ్రాత బానిసె వ్రాతరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సంపదకు నిలకడ లేదు. అది వచ్చినట్టే వస్తుంది లేదా రాదు. ఎందుకు రాదో వచ్చి ఎందుకుంటుందో తెలియదు. ఈ రకంగా జీవితం పరాధీనమైపోయింది. ధనం చేసే గారడీకి లొంగిపోయేటట్టుగా నుదుట రాశాడేమిటి బ్రహ్మ? ఇది బానిస రాత కాదా అని గొణుక్కుంటున్నాడు వేమన.

*'సిరిదా వచ్చిన వచ్చును*
*సలలితముగా నారికేళ సలిలము భంగిన్*
*సిరిదా పోయిన పోవును*
*కరిమింగిన వెలగపండు కరణిని సుమతీ!'*

అన్నాడు సుమతి శతకకారుడు.

కలుగుట అంటే ఒనగూడటం, ఉండటం. పిల్లలు కలుగుతారు. కలిగిన వాడు అంటే సంపన్నుడు. ఇది చక్కటి తెలుగు నుడికారం. *"కలికీ మాటలు వేయునేటికిక యీా కాయంబుతో వానితో గలుగన్ భాగ్యము కల్గకున్న విభునింగా జేయుమీ వీని రా గల జన్మంబున"* అని ప్రయోగం.

బతుకు అంటే జీవితం, జీవనస్థితి. 'మాకు బతుకులేదు' అంటే జీవించే సాధనం లేదని.

కలిమిలేములు పూర్తిగా అనుభవించేవాడి చేతిలో వుండవు. అస్థిరత్వం వాటి నైజం. అదృష్టమంటారు అందుకే. అదృష్టమంటే కనపడనిది అని అర్థం. అంటే దైవనిర్ణయం. సృష్టికర్త చేసే లలాట లిఖితం.

*'కలిమిలేమి రెండు కావడికుండలు'* (డి.1723-316) అనేది పాఠాంతరం.

**కలిగిన మనుజుండు కాముడు సోముడు**
**మిగుల తేజమునను మెరయుచుండు**
**విత్తహీనుడెంత రిత్తమై పోవును**
**విశ్వదాభి రామ వినురవేమ.**

ధనం కలవాడిని మన్మథుడిలా అందగాడంటారు. చంద్రుడిలా కాంతి మంతుడంటారు. అటువంటివాడే ఎంతో గౌరవంతో ప్రకాశిస్తాడు. కాని చేతిలో డబ్బులేని వాడు ఎందుకూ పనికిరాని వాడుగా పరిగణించబడుతాడు. అయ్యో! ఇదండీ లోకరీతి.

కాముడు అంటే మన్మథుడు అని సాధారణార్థం. అంటే కోరికలు కలిగించేవాడు. ఇతరత్రా కాముడు అంటే కోరికలు కలవాడని. కీర్తికాముడు అంటే కీర్తిని కోరుకునే వాడు. హోళిని కాముని పండుగ అంటారు, శివుడు మూడోకన్నుతో కాముని దహించిన రోజన్నమాట. సోముడు అంటే చంద్రుడు. మిగుల అంటే మిక్కిలి, ఎక్కువ. తేజం అంటే కీర్తి, శక్తి అని మరిన్ని అర్థాలు. విత్తం అంటే ధనం.

రిత్త అంటే శూన్యం, వట్టిది, ఉత్తది అని అర్థాలు. రిత్త రిక్తకు రూపాంతరం. రిక్తహస్తుడు అంటే చేతిలో చిల్లిపైస కూడా లేనివాడు, పరమదరిద్రుడు. రిత్తమాటలు అంటే పసలేని మాటలు. *“రిత్త విచార మేటికిన్, రిత్తనోరే చప్పరించినట్లుండు”* అని ప్రయోగాలు.

‘విత్త హీనుడెంత ఉత్త సన్యాసి రా’ అన్నాడు వేమనే మరోచోట.

ధనమున్న వాడినే లోకం గుర్తిస్తుంది. కీర్తిస్తుంది అది తప్పు అంటున్నాడు వేమన. ధనం కంటే గుణం ప్రధానమనేది ధ్వని.

**కలిమిగల్గ నేమి కరుణ లేకుండెనా**
**కలిమి యేల నిలుచు కర్మలకును**
**తేనె గూర్చి యీగ తెరువున బోవదా?**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

ఎంత ధనం సంపాదించినా ఉదార గుణం లేకపోతే అది వ్యర్థం. అటువంటి సంపద పూర్వ జన్మదుష్కృతం వల్ల కరిగిపోతుంది కూడా. తేనెటీగను చూడండి. అది పువ్వు పువ్వుపై వాలి మకరందాన్ని అంటే తేనెను సేకరించి తేనె పెరలో పెట్టి ఇతరులకు వదిలేసి తనదారిన తాను వెళ్లిపోతుంది. సమస్త జన శ్రేయస్సు అంటే దానిదే.

ఎలా సంపాదించాడో సంపాదించాడు, కాని కరుణ లేదు. అంటే ఎదుటివారి కష్టాలకు కరిగిపోయే గుణం లేదు. దానివల్ల ఫలితమేమిటి? తన తదనంతరం అది ఎవడికి చెందుతుందో!? లేదా తన కాలంలోనే గత, ప్రస్తుత కర్మలవల్ల నశించిపోతుందో!? ఇటువంటి వారు తేనెటీగను చూసి నేర్చుకోవాలంటున్నాడు వేమన.

తేనెటీగ ఏం చేస్తుంది? పూలపై వాలి మకరందాన్ని తీసుకుంటుంది. పుప్పొడి రేణువులను ఆహారంగా స్వీకరిస్తుంది. పరపరాగ సంపర్కానికి తోడ్పడుతుంది. సేకరించిన తేనెను తుట్టెలో భద్రపరిచి తన దారిన తాను వెళ్లిపోతుంది. బాటసారులెవరో (అంటే ఘనత వహించిన మనుషులే!) దానిని సంగ్రహించి తీసికెళ్తారు. సీతాకోకచిలుక కూడా ఆహార సేకరణలో భాగంగా మకరందాన్ని తీసుకుంటుంది గాని ఇవ్వదు. తుమ్మెద పరభక్షి. పరపరాగ సంపర్కానికి ఉపయోగిస్తుంది గాని ప్రధానంగా దాని ఆహారం చిన్న కీటకాలు.

తెరువరి అంటే బాటసారి, తెరువు అంటే దారి. దారిన పొయ్యేవాడని.

సంపన్నుడు కూడా ఈ జనవ్యవస్థలోంచే సంపాదిస్తాడు. ఆస్తి పన్ను కట్టకుండా ఉండటానికి కూడా ప్రయత్నిస్తాడు. జనానికి ఏమీ చెయ్యడు. కాని తేనెటీగ అట్లాకాదు. దాని పాట్లన్నీ పరార్థానికే. దాని తేనెతోపాటు దాని పని కూడా తియ్యనిదే.

**కలిమి జూచి యివ్వ క్రయమిచ్చినట్లుండు**
**సమున కివ్వ మంచి సరస గుణము**
**పేదకివ్వ మనువు పెనవేసి నట్లుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కయ్యమైనా వియ్యమైనా సమానమైన వాడితో చెయ్యాలని సామెత. వియ్యం మాత్రం ధనవంతుడికంటే పేదవాడితోనే బలంగా వుంటుందని వేమన్న అవగాహన.

సంపదను చూసి పిల్లనిస్తే ఆమెను అమ్ముకున్నట్టే. అది ఏమాత్రం మంచి పద్ధతి కాదు. సమానమైన వాడికివ్వటంలో కొంత ఔచిత్యముంది. అది పరవాలేదు. అయితే పేదకిస్తే మాత్రం ఆ బంధం బలంగా వుంటుంది.

క్రయం అంటే వెల యిచ్చి కొనడమే అయినా ఇక్కడ డబ్బుకు బదులుగా ఇవ్వటం అంటే అమ్మటం అని అర్థం. పెనవేయుట అంటే ముడివేయటం పెన అంటే బంధం.

కన్యాశుల్క దురాచారం గురజాడ కాలంలో లాగ బ్రాహ్మణుల్లో మాత్రమే కాక కింది వర్గాల్లో కూడ ఉన్నదని దీనివల్ల తెలుస్తుంది. ఓలి అంటారు దీన్ని. ఓలి అంటే పెండ్లికూతురికి మామ యిచ్చేది. ఈ పద్ధతి వల్ల పేద యువకులకు పెండ్లవడం కష్టమయ్యేది. అలాగే యువతులు శ్రీమంతుల భార్యలయ్యేవారు. వృద్ధులైనా సరే. వేమన్న బాల్య వివాహాల్ని కూడా ఖండించాడు. ఈ అనాచారానికి వ్యతిరేకంగా గురజాడ పెద్ద అక్షర యుద్ధమే చేశాడు. సముడు అంటే సమానమైన ఆర్థిక స్థోమత గలవాడు అనే అర్థమే కాక ఈడైన వాడు అనికూడా చెప్పుకోవచ్చు. ఎందుకంటే డబ్బుకోసం కాటికి కాళ్లుచాపిన ముసలి వాడికి కూడా ఇవ్వడానికి సిద్ధపడేవారు.

పేదవాడికెందుకివ్వాలి? పేదకు కష్టాలు తెలుసు. ప్రేమ తెలుసు. నీ పిల్లను పువ్వుల్లో పెట్టుకొని చూసుకుంటాడంటున్నాడు వేమన. మేనరికం లాంటి రక్తసంబంధాన్ని కాదని ఓలికోసం జరిగే 'ఆలి అమ్మకం' దారుణమనీ, డబ్బుముఖం చూడక సమాన స్థాయిలో చేసే వివాహం బలవత్తరమని సారాంశం. ఇట్లాంటి పద్యాల్లో పేదలపట్ల వేమన పక్షపాతం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

**కలిమి తనదు పాలి కర్మాను కూలంబు**
**బలిమి తనదు పాలి బంధకంబు**
**కలిమి బలిమి రెండు తెలివికి హానిరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతని పుట్టుక అతని విహిత కర్మలకు అనుగుణంగా సంభవించిందే. అతని బలం అతనికి అవరోధంగా పరిణమించిందే. అతని అస్తిత్వ గరిమ, అతని పరాక్రమ ధ్రుతీ ఈ రెండూ అతని జ్ఞాన మార్గానికి అడ్డుగా నిలిచాయి గమనించమంటున్నాడు వేమన.

మామూలుగా అయితే కలిమి అంటే సంపద. అస్తిత్వమని కూడా అర్థముంది. సంపద అస్తిత్వంలో భాగమే. ఇది కర్మానుసారమని సమర్థించుకోవచ్చుగాని దీనివల్ల సంక్రమించిన ఆధిక్యభావం మంచిది కాదు. కర్మ అంటే పాపపుణ్యాలకు ఫలంగా వచ్చేది. కర్మ మూడు రకాలు, కాయకం, వాచకం, మానసికం అని.

అలాగే బలిమి అంటే అధికార బలమూ కావచ్చు. దాని బలం వల్ల చుట్టూ శృంఖలాలు ఏర్పడతాయి. బంధకం అంటే కట్టుతాడు, కారాగారం అని అర్థాలు. బంధకరణం అంటే సంకెళ్లు వేయటం.

కలిమి అంటే నిజానికి ఉండటం అని భావం. చెలిమి కలిమి, శ్రద్ధ కలిమి, శాప కలిమి అని ప్రయోగాలున్నాయి. కలిమి పూర్వజన్మ సుకృతం అని కులికితే ప్రయోజనం లేదు. పైగా కలిమికి బలిమి తోడైతే అది తెలివికి పెనుభారంగా మారుతుంది. తెలివి అంటే మెలకువ, ఎరుక, గ్రహణశక్తి అని అర్థాలు.

కర్మను గురించి వేమనే ఓ పద్యం చెప్పాడు మరోచోట, వినండి.

చేటు వచ్చెనేని చెడనాడు దైవంబు
మేలు వచ్చెనేని మెచ్చుతన్ను
చేటు మేలు తలపచేసిన కర్మంబు

నువ్వు చేసిన సత్, దుష్ కార్యాల వల్లే ఆయా ఫలితాలుంటాయి. దుష్ఫలితాలు లోకాన్ని సరిగ్గా చూడనివ్వవు. సత్యానికి అడ్డుగా నిలుస్తాయి అంటున్నాడు వేమన. ఇంతమంచి పద్యాన్ని గురించి రాస్తూ బ్రౌన్ loose గా ఉందని భావించాడు. మొదటి రెండుపాదాల్లో ఆయనకు వైరుధ్యం కనిపించి ఉండవచ్చు. కాని అది వ్యాఖ్యాన సాపేక్షకమే అని గమనించాలి.

**కలుషమెల్ల తెలియ తలవంపులకు మూల**
**మరయ తత్వమెల్ల నాత్మబుట్టు**
**తెలిసినందుకు మరి ధీరుండు గావలె!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఆలోచించి చూస్తే ఈ లోకంలో నువ్వు చేసే పాపాలు అవమానాలకు కారణ మౌతాయి. తెలుసుకుంటే పరమాత్మ సంబంధమైన జ్ఞానం నీలోంచే పుడుతుందని బోధపడుతుంది. తెలిసింది గదా! ఇప్పటికైనా లోపలి శత్రువులను జయించి ధీరుడవైపో! అని సెలవిస్తున్నాడు వేమన.

కలుషాలంటే కల్మషాలే, అంటే పాపాలు. కామక్రోధాదుల వల్ల కలిగే తప్పులే కలుషాలంటే. యమలోకంలో చిత్రగుప్తుడు లెక్కలు కట్టేది వీటినే అని లోకవాడుక. 'తెలియ' అంటే తెలుసుకుంటే అని. అంటే లోతుగా యోచన చేసినట్టుంటే అని. తలను వంచుకోవలిసిన అగత్యం ఎప్పుడు వస్తుంది? చేసిన చెడ్డపనికి చెడ్డఫలితమే దాపురించి నప్పుడు.

తత్వం అంటే లౌకికదృష్టితో స్వభావం అని అర్థం. 'అది వాడి తత్వం' అంటాం. అంటే వాడి మూలగుణం. ఇక్కడ బ్రహ్మ సంబంధమైన జ్ఞానం. ఆత్మజ్ఞానమంటే ఇదే. అంటే తన నిజతత్వాన్ని ఎరిగినవాడు కావటం. 'అరయ' అనే మాటను ఇంతలోతైన అర్థంలో వాడాడు వేమన. అంటే తెలియటం.

ఆత్మజ్ఞానం లేనివాడు అరిషడ్వర్గాలకు లొంగిపోతాడు. ఇది ఆరుగురు శత్రువుల సమూహం. ఈ శత్రువులు మరెవరో కాదు. మనకు నిత్యం తెలిసిన వారే, మన అనుభవంలో ఉన్నవారే. కోరిక, కోపం, పిసినారితనం, అజ్ఞానం, అహంకారం, ఓర్పులేక పోవడం. వీటికే అంతశ్శత్రువులని పేరు.

ధీరుడు అంటే ధైర్యవంతుడనే అర్థంగాని ఇక్కడ చిత్తవృత్తులను నిలువరించి సదా బ్రహ్మనిష్టయందుండే జ్ఞాని అని తాత్పర్యం. అరిషడ్వర్గాలను జయించడం అంత సులభం కాదు. సులభమైతే ఇంక చెప్పేదేముంది? యోగులకు మరింత ధ్యానానికీ మౌనానికీ సమయమిచ్చిన వాళ్లమై వుండే వాళ్లం కదా. పై వాటిని జయించాలంటే ఆత్మకు ఎనిమిది రకాల గుణాలుండాలని వాళ్లే చెప్పారు. అవేమిటంటే దయ ఉండాలి. కోపం ఉండకూడదు. అసూయ కలగకూడదు, శుచిత్వం ఉండాలి (ఇది బాహ్యం, ఆంతరం అని రెండు రకాలు);

అనాయాసం, మాంగల్యం, అకార్పణ్యం, కార్పణ్యం అంటే కృపణత్వం అంటే నీచత్వం ఉండకూడదు, అస్పృహ అంటే విషభోగాల పట్ల ఆసక్తి ఉండకూడదు. ఇన్ని 'ఉండాలి, ఉండకూడదు'లతో శుభ్రపరుచుకుంటే తప్ప శత్రువులను జయించే బలం ఆత్మకు సమకూరదు. అని వేమన్న సారాంశం. దీనివల్ల మనిషి నిర్వికార చిత్తుడౌతాడు. నిర్వికారచిత్తుడే చిదాత్మకు దగ్గరౌతాడు, ఇక్కడ రాస్తున్నవన్నీ ఈ వ్యాఖ్యాతకు పూర్తిగా అర్థమయ్యాయన్న భ్రమకు తావులేదు. ఇదొక ప్రకాశచింతన (Loud thinking), ఇదొక తాత్విక ప్రయత్నం, ఇదొక సమన్వయ భావన, అంతర్ముఖీన సాధన. అంతవరకు బయటివారికి (outsiders of Yogic Experience) మార్గాంతరం ఉండదు, ఆత్మజ్ఞాన స్థాయికి చేరినవారు ఎట్లాగూ ధన్యులే.

'*కలుషకృతము లెల్ల, అరయతత్వమెల్ల ఆత్మగుట్టు* (డి. 1727–593); ..... *స్థిరుడు* కావలయురా (డి. 1773(4)–1876) అనేవి పాఠాంతరాలు.

**కల్లనిజము రెండు కఱకంఠుడెరుగును**
**నీరు పల్లమెరుగు నిజము గాను**
**తనయుని జననంబు తల్లి తానెరుగును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సత్యమేదో అసత్యమేదో ఆ పరమ శివుడికే ఎరుక. ఎత్తు ఎటువైపో పల్లం ఏ వైపో నీటికే తెలుస్తుంది. అలాగే తనకు పుట్టిన సంతానానికి తండ్రి ఎవరో తల్లి మాత్రమే చెప్పగలుగుతుంది. తండ్రికి కూడా తెలియదు అంటున్నాడు వేమన.

ఏది సత్యం ఏదసత్యం అనేది నిర్ణయించడం అంత సులభం కాదు. పైకి కనిపించేదంతా సత్యం కాదు. అబద్ధంలా కనిపించే దానిలో అంతర్గతంగా సత్యం దాగి ఉండొచ్చు. కొన్ని ధర్మ సంకట పరిస్థితుల్లో సత్య నిర్ధారణ అసాధ్యమనిపిస్తుంది. అటువంటప్పుడు ఆ దేవుడే దిగివచ్చి చెప్పాలి అంటారు. కఱకంఠుడు అంటే నీలకంఠుడు, శివుడు. *"మఱి రామేశ్వర తీర్థము కఱకంఠున కాటపట్టు"* అనేది ప్రయోగం. కల్ల అంటే మోసం, అసత్యం, తప్పు, అపకారం, మాయాకల్పితమైన అని అర్థాలు. కల్లబొల్లి మాటలు అంటే మాయమాటలు.

ఇక నీరు, ఇది ద్రవం, ద్రవమెప్పుడూ పల్లానికే ప్రవహిస్తుంది. పల్లం అంటే నిమ్నస్థలం, గుంట, లోతట్టు, వాటం, 'నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు' అని సామెత. ఒక పెద్ద నది ఒడ్డున నిలబడి చూస్తే ఆ నీరెటు ప్రవహిస్తుందో మన చర్మచక్షువులకు అందకపోవచ్చు. కాని నీరు కిందివైపే ప్రవహిస్తుందనేది అనుభవ సత్యం. 'పల్లపు పంట' అని అంటారు. అంటే మాగాణి పంట కాలువలు మొదలైన వాటి నుంచి పారే నీటివల్ల పండే పంట అన్నమాట. పల్లపు నేలను అవుకు నేల అని కూడా అంటారు. *"మిట్టపల్లంబులు సరిగా నంపజాలంబు పగిది గురిసి"* అని ప్రయోగం.

అలాగే కుమారుని జన్మరహస్యం తల్లికే తెలుస్తుందంటున్నాడు వేమన. నిజం! గుర్తుందా ఛాందోగ్యోపనిషత్తులోని సత్యకామ జాబాలుని కథ? (నాలుగోఖండం).

జాబాలి కొడుకు జాబాలుడు. అతడు గౌతముని శిష్యరికం చెయ్యాలనుకుంటాడు. గౌతముడు అతని గోత్రం ఏమిటని ప్రశ్నిస్తాడు. అంటే తండ్రి ఎవరని? జాబాలుడికి తెలియదు. గౌతముని ఆదేశానుసారం తల్లి దగ్గరికి వచ్చి తన తండ్రి ఎవరని అడుగుతాడు. అందుకు జాబాలి 'ఆశ్రమంలో ఎందరితోనోచరించాను. నువ్వు దొరికావు. నీ తండ్రి

ఎవరని చెప్పేది' అంటుంది. జాబాలుడు మళ్లీ వచ్చి గౌతముడికి అదే చెప్తాడు. అతని సత్యసంధతను మెచ్చి గౌతముడతన్ని శిష్యుడిగా స్వీకరిస్తాడు. ఇక్కడ జాబాలి నిజాయితి కూడా గొప్పదే. జాబాలి విషయంలోనే కాదు అసలు మానవజాతి లోనే తన పిల్లలు ఎవరికి పుట్టారో తల్లికి మాత్రమే తెలుస్తుందనేది సారాంశం.

మూడు గహనమైన లోకసత్యాలను తీసుకొని వింగడించి చూపుతున్నాడీ పద్యంలో వేమన.

'తనయుని జన్మంబు' (డి.1725-388) అనేది పాఠాంతరం.

**కల్లలాడువాని గ్రామకర్త యెరుంగు**
**సత్యమాడువాని సామి యెరుగు**
**పెక్కు తిండిపోతు పెండ్లామెరుంగురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆయా వ్యక్తుల అసలు స్వరూపాలు వారితో సన్నిహితంగా ఉండే వారికే తెలుస్తాయి అనేది లోకవిదితం. ఎట్లా? తన గ్రామంలో ఎవడు అబద్ధాల కోరో గ్రామాధికారికి తెలుస్తుంది. ఎవడు సత్యసంధుడో యజమాని గ్రహించలేడా?అట్లాగే చీటికిమాటికి ఏదో ఒకటి తినే తిండిపోతు సంగతి  అతని భార్యకు నిత్యానుభవమే కదా!

ప్రాచీన గ్రామ వ్యవస్థలోని పౌరసంబంధాలు, కుటుంబ సంబంధాలను తెలిపే పద్యమిది.

కల్ల అంటే దొంగ స్వభావం. ఇది దేశీయ పదం. కన్నడంలో కళ్ అంటే దొంగిలించు. తమిళంలో కళ్ళన్ అంటే దొంగ, మలయాళంలో కళ్లమ్ అంటే దొంగతనం.

గ్రామకర్త అంటే గ్రామాధికారి. తెలంగాణాలో అయితే పట్వారి. కోస్తా రాయల సీమల్లో కరణం. శాతవాహనుల కాలంలో ఇతణ్ని గ్రామభోక్త అనేవారని శాసనాలవల్ల తెలుస్తుంది. భోక్తకు ఇక్కడ భోజన సంబంధమని కాదు. మాలి పటేల్, పోలీస్ పటేల్, పట్వారి అనేవి తెలంగాణాలోని గ్రామయంత్రాంగం. మొదటివాడు రెవిన్యూ వ్యవహారాలు చూస్తే రెండవవాడు భద్రతావ్యవహారాలు. ఒక రకంగా పట్వారి వీరిద్దరి మధ్య అనుసంధానకర్త. జమాబంది, పన్నుల వసూలు ఎక్కువగా చూసేవాడు. చూసేవాడు అంటే ఇప్పుడు చూడటం లేదని. ఆంధ్రదేశంలో ఈ వ్యవస్థ 1985లో రద్దయ్యింది. కోస్తా రాయలసీమల్లో మాలీ పటేల్, పోలీస్ పటేల్‌లపని మునసబు చేసేవాడు, సామి అంటే రాజు, యజమాని. “ప్రభు, గృహోఖ్య సామినాబరగు”

ఇక తిండిపోతు సంగతి. ఆకలి అయినా కాకున్నా ఎప్పుడూ ఏదో ఒకటి తినేవాడు తిండిపోతు. తెలంగాణాలో ‘భూఖరోడు’ అంటారు. “తిండికి తిమ్మరాజు, పనికి పోతరాజు” అనేది సామెత. తిమ్మరాజు అంటే కోతి. పోతరాజు అంటే దున్నపోతు. కోతికి తినాలనే ఆశ ఎక్కువ, దున్నపోతు సోమరి అని ఇక్కడి సారాంశం.

పెండ్లాం అంటే భార్య. ఇదీ దేశియపదమే తమిళంలో పెణ్డు అంటే స్త్రీ లేదా భార్య. భార్య వండి పెట్టేది కాబట్టి భర్త తిండిపోతుతనం ఆమెకే తెలుస్తుంది.

నా చిన్నతనంలో 'గొల్లసుద్దులు' అనే జానపద కళారూపాన్ని తరచుగా వినేవాణ్ని. కొన్ని పంక్తులు మీరూ వినండి.

*"గొౢరెల గోత్రాలు గొల్లన్నకెరుక*
*గొల్లన్న గోత్రాలు గొౢరెల కెరుక*
*వారి వీరి గోత్రాలు కటికన్న కెరుక"*

వీటిలో పాఠాంతరాలుండొచ్చు. కాని నిర్మాణం మాత్రం ఇదే. ఈ వేమనపద్యం కూడా దాదాపు ఇలాంటిదే.

**కల్మషంబు పోక కనుపించదెందును**
**రూపమెవ్వరికిని రూఢితోడ**
**తామసంబుడిగిన తగగల్గు జ్ఞానంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చేసిన పాపం పోకుండా ఎవ్వరికైనా దేవుని దివ్యరూపం స్పష్టంగా కనిపించదు. అట్లాగే అజ్ఞాన జనితమైన తామసగుణాలు నశిస్తే తప్ప నిజమైన జ్ఞానం నీ సొత్తుకాదు అంటున్నాడు వేమన.

కల్మషం అంటే పాపం. క్రౌర్యం, కోపం, మూర్ఖత్వం వంటి వాటి వలన పాపాలు జరుగుతాయి. పాపంతో కలుషితమైన మనస్సుకు నిర్మలమైన దైవస్ఫురణ కలగదు. రూపం అంటే ఆకారం. ఇది కంటికి కనిపించే స్థూల రూపం కాదు. ఆత్మస్వరూపం. రూఢి అంటే నిశ్చయంగా అని అర్థం. వ్యుత్పత్తి అర్థంలోకాక వేరే అర్థంలో ఉన్నదాన్ని రూఢి అంటారు. ఉదాహరణకు పంకజం ఉందనుకోండి. ఇది పద్మంగా లోక రూఢికెక్కింది. కాని అసలర్థం బురదలో పుట్టిందని. నిశ్చయంగా తెలియటమంటే ఇదే. అట్లాగే తామసగుణమంటే తమోగుణం. క్రియాహీనం, ఎరుకలేమి, నిద్ర, మాంద్యం లాంటివి తామసగుణాలు.

'కల్మషంబు పోక' అంటున్నాడు వేమన. పోక అంటే పోకుండా అని అర్థం. పోవడానికి వ్యతిరేకార్థకమిది. రాక రాకుండా లాగ. పాపం జరగడానికి కోరికలు, అహంకారం, కామక్రోధాలు, భ్రాంతులు, మమతల లాంటివి కారణమౌతాయి. వాటిని తొలగించుకోవడం అంత సులభం కాదు. ధ్యానంతో, యోగాచరణంతో వీటిని తొలగించుకోవలసి ఉంటుంది. అప్పుడే శుద్ధమైన జ్ఞానం అనుభవంలో కొస్తుందని వేమన్న ఉవాచ.

**కల్లు నీళ్లు త్రాగి కడుపెద్ద వారిలో**
**చీరవిడిచి తిరుగు సిద్ధురాలు**
**పనులు తీరు వెనుక పాతలు గట్టురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆమె సిద్ధురాలే, కాని ఏం లాభం? అణిమ, గరిమ వంటి అష్టసిద్ధులను పొంది ఒక స్థాయికి చేరి కూడా భౌతిక సుఖాలకోసం కిందికి జారిపొయ్యింది. పంచమకారాల్లోని మత్తుకు బానిసై సమాజంలోని పెద్దవాళ్లమధ్య విశృంఖలంగా సంచరిస్తుంది. సాధించినదంతా పోగొట్టుకొని మళ్లీ పూర్వపుదైన్యంలోకి పతనమయ్యింది. ఎంతో కష్టపడి ఒక దశకు ఎదిగినప్పుడు దానిని నిలబెట్టుకోవడం ముఖ్యం అంటున్నాడు వేమన.

యోగబలం చేత అతిమానుష శక్తిని పొందడం సిద్ధి. అట్లా సిద్ధి పొందిన వారు సిద్ధులు. రుషులు, యోగులు, మునులు సిద్ధిపొందినవారె. ఇక స్త్రీలయితే సిద్ధురాండ్రు. అణిమ మొదలైన అష్టసిద్ధులను సంపాదించినవారు సిద్ధులు. ఈ సిద్ధులను అష్ట విభూతులనీ, ఐశ్వర్యాలని అంటారు. అవి 1.అణిమ 2.మహిమ 3.గరిమ 4.లఘిమ 5.ప్రాప్తి 6.ప్రాకామ్యం 7.ఈశత్వం 8.వశిత్వం. ఒకరకంగా ఇవి తపస్సంపదలే.

అణిమాదులంటే ఏమిటో చూద్దాం. అణిమ అంటే అణుత్వం, సూక్ష్మత్వం, అంటే కనపడనంత చిన్న రూపంలో ఉండే శక్తి; మహిమ అంటే మహత్యం, అంటే గొప్పదైన తత్వాన్ని వ్యక్తీకరించే అంతఃశక్తి; గరిమ అంటే గురుత్వం, నిండుదనం, విద్యవల్ల నిండుకున్న జ్ఞానతృష్ణ పరిపూర్ణంగా ఉండటం; లఘిమ అంటే వ్యక్తిత్వం. ప్రాప్తి అంటే ఇష్టప్రాప్తి. యోగంతో సాధించదలుచుకున్న జలస్తంభన, అగ్నిస్తంభన, వాయుస్తంభన వగయిరా విద్యలు; ప్రాకామ్యం అంటే ఇచ్ఛాశక్తుల చేత పొందేది, ఇచ్ఛ అంటే ఇక్కడ తపస్సు; ఈశత్వం అంటే అన్నింటిలో నిండుకొని ఉండటం. వశత్వం అంటే ఇంద్రియాలను వశం చేసుకోవటం.

ఇంతా చేసి అపురూపమైన ఇంతటి శక్తులను సాధించి క్షుద్రమైన దైహిక లౌల్యంతో అంతా పోగొట్టుకోవడం ఎంత అవివేకం! కల్లు అంటే మద్యం. తాటి చెట్టునుంచి గానీ ఈత చెట్టునుంచిగానీ తీసిన ద్రవం. పాతలు–అంటే పాతబట్టలు, జీర్ణవస్త్రాలు. బండి మళ్లీ వెనక్కొచ్చిందన్నమాట!

**కసవు పసికి జేసె గాలి ఫణికి జేసె**
**మన్నెరలకు జేసె మరవకెట్లు**
**భూమి జనుల కెల్ల బువ్వట్లు చేసెరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేవుడు పశువు కోసం గడ్డిని సృష్టించాడు. పాముకోసం గాలిని, వానపాములకోసం మట్టిని ఏర్పాటు చేశాడు. అదేవిధంగా సృష్టిలో విస్మరించకుండా మనుష్యులకు కూడా అన్నం సమకూర్చాడు కదా మరి ఇతర జంతు జాలానికి దొరుకుతూ మనుష్యులందరికీ తిండెందుకు దొరకదు? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

జంతువులు వేటి ఆహారాన్ని అవి కష్టపడి సంపాదించుకుంటాయి. మనుష్యులే ఒకరినోరు కొట్టి మరొకరు తింటారు. ప్రకృతిలో అందరి తిండికీ అవకాశముంది. అందరూ కష్టపడి సంపాదించుకోవాలనేది సారాంశం.

కసవు అంటే గడ్డి. పసి అంటే పశు సమూహం. పసి అంటే పసికట్టేది. కుక్క, నక్క ముక్కుతో పసిగడతాయి. చీమలు చక్కెరను అలాగే పసిగడతాయి. ఫణి అంటే పాము. పామును పవనభుక్, గాలిమేత అని అంటారు. గాలి తిని బతుకుతుందని అర్థం. ఇది నిజమేనా? పాము సూక్ష్మజీవుల్నీ ఎలుకల్నీ తింటుందే. మరి గాలిని భోంచేసి ఎలా బతుకుతుంది? ఎలాగంటే కొన్ని రకాల పాములు గాలిని స్వీకరించి కొన్ని రోజుల దాకా గాలి లేకుండా వుండగలవు. రక్తపింజర లాంటిపాములు గాలిని ముఖ్య ఆహారంగా తీసుకొని దాన్ని విషంగా మార్చుకుంటాయి. విచిత్రమేమిటంటే వీటి విషాన్ని తాగితే ఏమీ కాదు. కాని రక్తంలో కలిస్తే మాత్రం చావు తథ్యం. తెల్లపొడల పాము అని వుంటుంది. దీని గాలే విషం. అది సోకితేనే విషమెక్కుతుంది. దీనిని విషక్రిమి న్యాయం అంటారు. పవనభుక్ అనటానికి మరో కారణం కూడ చెప్తారు. మొగిలి పొత్తిని ఆశ్రయించుకొని పాము వుంటుంది. ఆ పరిమళానికి అది బలుస్తుంది. గొప్ప సర్పమన్నమాట! పాములవాళ్లు దీన్ని పట్టుకోడానికి చాలా ప్రయత్నిస్తారు. తంజావూరు సరస్వతీ మహల్‌లో 'సర్పశాస్త్రం' అని ఓ గ్రంథముంది. దానిలో 800 రకాల పాముల గురించి చెప్పబడింది. దానిని ఇంకా ఎవరూ ముద్రించినట్టులేదు.

ఎర, లేక ఎర్ర అంటే వానపాము. వానపాము మట్టిని తినటమంటే మట్టిని తొలుస్తూ మట్టిలోని సూక్ష్మజీవులను తింటూ లోపలికి వెళ్తుందన్న మాట! ఇది పొరలను తవ్వుతూ గుల్లగా చేస్తుంది. వీటి విసర్జక పదార్థాలు ఎరువుగా కూడా పనికొస్తాయి.

బువ్వ అంటే అన్నమే. పిల్లల్ని 'బువ్వతినుమ'ని ముద్దుగా బతిమిలాడుతారు. ఇప్పటికీ పేదవారి ఇళ్లలో దీనిని వాడుతారు. ఒకప్పుడు అన్నివర్గాలు వాడేవారు. 'బువ్వకడుపు' అంటే అన్నప్రాశనం. బువ్వమ్మ అంటే అన్నపూర్ణ.

ఇటీవలి ప్రతుల్లోని మూడోపాదానికి 'కుంభినీ జనులకు కూడట్లు చేసెరా' అనే పాఠాంతరం కంటే డి1727 ప్రతిలోని పై పాఠమే (609) మిగతా పద్యం శైలికి దగ్గరగా వుంది.

**కస్తురి యది చూడ కాంతి నల్లగనుండు**
**పరిమళించు దాని పరిమళంబు**
**గురువులైనవారి గుణము లీలాగురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కస్తూరి అనే సుగంధ ద్రవ్యం చూడటానికి పైకి నల్లగా వుంటుంది. కాని దానిలో అంతర్గతంగా ఉన్న సువాసన గుప్పున పరిమళిస్తుంది. అలాగే పైకి సామాన్యులుగా కనిపించే ఆత్మజ్ఞులైన గురువుల్లో జ్ఞాన పరిమళముంటుంది. తెలుసుకొని తరించమంటున్నాడు వేమన.

పై పై రూపాన్ని చూసి మోసపోకు అంతస్సూతంగా వున్న గుణం ముఖ్యం అని సారాంశం.

కస్తూరి అంటే జింకబొడ్డుకు ఏర్పడే  ఒక సువాసనద్రవ్యం. జింక బొడ్డు దగ్గర ఏర్పడ్డ చిన్నగడ్డను వేటగాళ్లు ఛేదిస్తారు. దాని నుంచి వచ్చేదే కస్తూరి. అందుకే దానిని మృగమదం అంటారు. మృగం అంటే లేడి. అయితే కస్తూరి నల్లగా వుంటుంది. '*సద్యో వినిర్భిన్న సారంగ నాభికా / హృతమై పిసాళించు మృగమదంబు*' అని మనుచరిత్రములో అల్లసాని పెద్దన. కస్తూరి కడిగిన మృగమన్నమాట! కాని దాని పరిమళం హాయిగా వుంటుంది. మాధ్వులు కస్తూరీ తిలకాన్ని ధరిస్తారు. చొక్కమైన కస్తూరి ఇప్పుడు దొరుకుతుందా? ఆటవికుల దగ్గర దొరుకుతుంది. శ్రీశైలం, సింహాచలం అడవుల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందట! ఇప్పుడు అన్నివిషయాల్లో కృత్రిమత్వం చోటు చేసుకున్నట్టే ఎర్రమన్నుకు రంగుపూసి కస్తూరి అనే పరిస్థితి కూడా వుంది.

'కాంతి నల్లగ నుండు' ఇక్కడ కాంతి అంటే జిగి. మనం నలుపు అందం కాదనుకుంటాం గాని దానిలో కూడా ఒక కళ వుంది చూడగలిగితే. 'పరిమళించు దాని పరిమళంబు' అంటే ఆ పరిమళం ఆ ద్రవ్యానికే పరిమితం కాక దశదిశలా వ్యాపిస్తుందని తాత్పర్యం. అలాగే ఆత్మజ్ఞానమూ అంతే లోకాన్ని ఆధ్యాత్మిక సౌరభంతో నింపుతుంది.

**కాంతకుంకయైన కానికులంబైన**
**పాయలేక విటుడు భ్రమసియుండు**
**మరగి గుడ్డికుక్క మాంసంబు గన్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

విటుడికి ఉచ్చనీచాలుండవు. తాను వలచిన పరాయి స్త్రీ విధవరాలనీ చూడడు తన కులం కాకున్నా, తనకన్నా తక్కువ కులమైనా పరవాలేదు. ఆ స్త్రీ వెంటబడి చిక్కులు కొని తెచ్చుకుంటాడు. తేరగా దొరుకుతుందని మాంసానికి అలవాటుపడిన గుడ్డి కుక్క ఉండదా ఇతడూ అలాంటివాడే అంటున్నాడు వేమన.

గుడ్డి కుక్కకు చుట్టూ ఏం జరుగుతుందో తెలియదు. అది మాంసానికి మరిగింది. మరగు అంటే ఆశపడు, అలవాటుపడు అని అర్థాలు. ఎప్పుడో ఒకప్పుడు యజమానికి దొరికిపోతుంది. గుడ్డిది కాబట్టి అది తథ్యం కూడా. విటున్ని గుడ్డికుక్కతో పోల్చటమే ఇక్కడి స్వారస్యం. వలపూ మోహం కూడా గుడ్డివే. ఒకే లక్ష్యం వల్ల పరిసర స్పృహ ప్రాధాన్యాన్ని కోల్పోతుంది. అసలేం కనపడదు కామవాంఛ తప్ప.

కాంత అంటే స్త్రీయే గాని వొట్టి స్త్రీ కాదు అందమైన స్త్రీ. కుంక అంటే విధవ అనే అర్థంలో వేమన్న వాడాడు గాని కుంక అంటే బాలవితంతువు. నిందాపూర్వకమైన సంబోధనగా కూడా వాడుతారు. "కుర్రకుంకా!" మొ॥వి. కాని కులం అంటే నిమ్నకులమని. కాని అనేది పెద్దమాటే. కాని అంటే ఇక్కడ చెయ్యకూడని అని. కొరగాని అంటే పనికిరాని. చేతగాని అంటే అసాధ్యం. పాయ లేక అంటే విడిచిపెట్టలేక. భ్రమసి అంటే ఎక్కువగా కోరుకోవడం. భ్రమ నుంచి ఏర్పడిన ఛాయే. "వాడు అంటే నాకెంతో భ్రమ" అంటే ఎంతో ఇష్టమని.

**కాగల పనులెల్ల కాకెటు బోవును**
**కాని పనులు కానెకావు భువిని**
**మహిమ వేరెయుండ మనతోడ నున్నదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో అదృష్టవంతుడికి కావడానికి అవకాశమున్న పనులన్నీ అయి తీరుతాయి. అదే దురదృష్టవంతుడికైతే ఏ పని తలపెట్టినా ఒక్కపనీ కాదు. కాబట్టి ఈ కావడం, కాకపోవడం మన మీద మాత్రమే ఆధారపడి లేదు, దానికి మూలం వేరే వుంది అంటున్నాడు వేమన.

కాగల అంటే జరుగబొయ్యేది అని అర్థం. 'కాగల కార్యం గంధర్యులు తీర్చారు' అని మహాభారతం, 'కానున్నది కాకపోదు గదరా సుమతీ' అని బద్దెన. కాకెటు (కాక+ఎటు) బోవును అంటే కాకుండా ఎందుకుంటాయి అని. మహిమ అంటే గొప్పతనం. అంతేకాదు మహిమ, అణిమ, మహిమ, గరిమ వంటి అష్టసిద్ధుల్లో ఒకటి. అష్టసిద్ధులు యోగసాధనలో సమకూడే చమత్కారాలు. ఇక్కడ మహిమ అంటే రూపాన్ని పెద్దదిగా చెయ్యడం. స్థూలపరచడం, స్ఫుటం చెయ్యడం. అంటే ఒక పనియొక్క సాఫల్యాన్ని స్పష్టపరచడం. ఒక పనిని నువ్వు చేస్తావు. అది నీ చేతిలోనే వుంది. ఆ పని అవుతుంది కూడా. ఒకప్పుడు కాదు. ఎందుకు కాదు? ఎందుకంటే దానికి వేరే కారణముంది. దాని పేరే మహిమ. మహిమను అంతా దైవాధీనం అంటూ ఒక్కమాటలో తేల్చిపారెయ్యలేం. మహిమ అంటే అద్భుతాలు చేసే శక్తి, మాహాత్మ్యం అన్నమాట. మన చేతిలో ఏమీ లేదు అంటే నిరాశ కలగదా? పురుష ప్రయత్నం పైన నమ్మకం పోదా? అందుకే పనికావడం, కాకపోవడానికి కీలకమేమిటి అని ఆలోచించమంటున్నాడు వేమన. ఏమిటా కీలకం? కాలజ్ఞత. మానవపద్ధతిలో నువ్వు చేశావు నిజమే, అప్పుడు సమయాసమయాలను గమనించావా? నీ పనులపైన కాలపురుషుని ప్రభావం నిర్దేశం ఉందో లేదో ఆలోచించావా? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

ఇంతకూ పని అంటే ఏమిటి? చేసేదిపని. పని అంటే కార్యం. కారణం వల్ల ఏర్పడేది కార్యం. పని అంటే అవసరం (నీతో నాకేం పని), జీవితం (వాడి పని అయిపోయింది) వంటి ఛాయలెన్నో వున్నాయి.

ఈ పద్యం లాంటిదే పంచతంత్రంలో ఓ శ్లోకముంది.

'నహిభవతియన్న భావ్యం
భవతి చ భావ్యం వినాపియత్నేన
కరతలగతమపి నశ్యతి
యస్యహి భవితవ్య తానాస్తి'

(ఒకడికి జరగవలసిన పని ఒకప్పుడు కాదు. ఒకడికి అనుకోకుండా అవుతుంది. ఒకడికి కావలిసిన వస్తువు అరచేతిలో కనిపిస్తూ కూడా చిక్కకుండా పోతుంది. కాబట్టి ఎవడికి భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియదు.)

కార్యసాధనలో నీ ప్రయత్నానికి దైవ సహాయం కూడా వుంటే అది సఫలరూపం దరిస్తుంది. దైవ సహాయమంటే కాలమే. కాలం నిరంతరం చలిస్తూ వుంటుంది. విశాలమైన ఈ భూమిపైన ఎన్నో శక్తుల ప్రమేయం కూడా నీ సాఫల్యానికి చోదకశక్తిగా ఉపయోగపడవచ్చు అనేది సారాంశం.

అలతి అలతి పదాలతో సాధారణంగా కనిపించే ఈ పద్యంలో వేమన ఎంతటి అనంతార్థాన్ని నిక్షేపించాడో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

'మహిమ వెన్నంటికిని మనతోడ నున్నదా' (డి. 1727-621) అనేది పాఠాంతరం.

**కానలేదు నుదురు కర్ణముల్ వీపును**
**నెరులు గానలేదు నెత్తిమీద**
**తన్నుగానలేదు తత్వమే మెరుగును?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతని నుదురు అతనికి కనపడుతుందా? లేదు. చెవులు? లేదు, వీపు? లేదు. తలమీది వెంట్రుకలు? లేదు. తన దేహంలోని శరీరభాగాలనే చూడలేకపోతున్నాడే, ఇక శరీరాతీతమైన సత్యాన్ని ఎలా చూడగలడు? నిజమే.

'అతి పరిచయాదవజ్ఞా' అని లోకోక్తి. అంటే మనకు అత్యంత సన్నిహితమైనదాని గురించి అతి తక్కువగా తెలుస్తుంది. లేదా తెలియదు. తెలియదా అంటే తెలియదని కాదు దానిపై దృష్టిపోదు. మనకంటికి అతిసన్నిహితంగా ఉండేది కనురెప్ప. కన్ను తన జన్మలో దాన్ని చూడలేదు. సాన్నిహిత్యం ఎంత దగ్గరో అంత దూరం కూడా. ఇదంతా ఎవరికి? సామాన్యులకు. చర్మచక్షువులను మాత్రమే నమ్ముకున్నవారికి. బాహ్యనేత్రాలే కాదు లోపలి నయనాలు కూడా వుంటాయి. వాటితో చూడగలిగితే అంతా స్పష్టం, అదే సత్యం అంటున్నాడు వేమన.

వేమన్న ఉపయోగించే మాటలన్నీ రోజూ మనం వాడేవే. వీటికి కూడా అర్థం చెప్పాలా అనిపిస్తుంది. తెలిసిన మాటలే అయినప్పటికీ ఏదో మౌలిక చింతనలోకి తీసికెళ్లే శక్తి వాటికుంటుంది.

నుదురు అంటే తెలియనిదెవరికి? నొసలు, ఫాలం అని చెప్పాలా? అయితే తలకూ కనుబొమలకు మధ్యన ఉండే ఈ భాగానికీ మానవ జీవితానికీ గల అద్భుత సంబంధం ఈ నాటిది కాదు. "నుదుట వ్రాసిన వ్రాత నుసిలితే పోవునా" అన్నాడు వేమనే మరోచోట. అంటే కర్మఫలాన్ని అనుభవించక తప్పదని. 'నుదురంటట' మంటే నమస్కరించడమని. కర్ణముల్ అంటే చెవులు. వీపు సరే. నెరులు అంటే వెంట్రుకలు. నెరి అంటే కుటిలమైనది, వక్రంగా ఉండేది అన్నమాట. వెంట్రుకలకు ఆ అందమైన గుణముంది కదా! తలపై భాగాన్ని నెత్తి అంటారనీ చెప్పనక్కర్లేదు. కాని అనేక నుడికారాలు నెత్తి చుట్టే తిరుగుతాయి. తల ఉత్తమాంగం కదా! నెత్తికి కళ్లొచ్చాయి అంటే పొగరెక్కిందని. నెత్తికి చేతులు వచ్చాయంటే నిర్వీర్యుడయ్యాడని. నెత్తిపై చేతులు పెట్టుకొని చెప్తున్నాడంటే ప్రమాణం చేసి చెప్తున్నాడని, నెత్తిన గుడ్డ వేసుకొని పోతున్నాడంటే దిక్కులు బట్టి పోతున్నాడని. నెత్తిన ఎక్కించుకోవడమంటే అలుసివ్వడమని. నెత్తిన పెట్టుకోవడమంటే అమితంగా గౌరవించడమని. ఈ వేమన పద్యం కూడా నిజంగా నెత్తిన పెట్టుకోదగిందే.

పైపైన చూస్తే పక్కలకు చూస్తే తత్వం బోధపడదు. తనలోకి చూడాలి. ఆ పరాత్మ నీ ఆత్మ ఈ రెంటి సంబంధాన్ని గురించిన అనుభవమే తత్వమంటే!

**కాని వానితోటి కలసి వర్తించెనా**
**హానివచ్చు నెంత వానికైన**
**తాటికింద పాలు తాగిన చందమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీ స్థాయికి తగని నీచునితో కలిసి మెలిసి తిరిగితే నీ గుణం మంచిదైనా లోకంలో నీ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఎట్లాగంటే తాటిచెట్టు కింద కూర్చొని పాలు తాగినా కల్లు తాగావనే లోకులు భావిస్తారు. నువ్వు మంచి వాడివే కావొచ్చు కాని మంచివాడిగా కనిపించవలసిన బాధ్యత కూడా నీ పైనే వుంది అంటున్నాడు వేమన.

కానివాడు అంటే అయోగ్యుడు. శత్రువు కూడా. అయినవాడు కాదన్నమాట. కానితనం అంటే శత్రుత్వమని కూడా. కానిగుణం నీచగుణం, కానిపని అంటే చెడ్డపని, కానినడక అంటే చెడు ప్రవర్తన.

సాధారణంగా తాటి చెట్టుకింద కూర్చునేవారు నీడకోసం కూర్చోరు కదా. కల్లుతాగడానికే కూర్చుంటారు. కల్లు అంటే తాటిచెట్టు లేదా ఈతచెట్టునుంచి తీసే ద్రవం. ఇది మత్తు పదార్థం కాబట్టి లోకంలో దీనిపట్ల మంచి అభిప్రాయం వుండదు. అట్లాంటప్పుడు తాటిచెట్టు కింద కూర్చొని నేను పాలు తాగుతున్నాను మొర్రో అన్నా ఎవరూ నమ్మరు. కాబట్టి చేసేపనికి స్థలశుద్ధి కూడా అవసరం అన్నది సారాంశం.

**కాపులేని ఊరు కరణానికే కీడు**
**కరణము పగచేత కాపుకీడు**
**కాపు కరణములును కావడికుండలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గ్రామాధికారి సరిగ్గా లేకపోతే కరణానికి రక్షణ కరువవుతుంది. కరణం అనుకూలంగా లేకపోతే కాపుకు పన్నుల లెక్కల్లో చిక్కులొస్తాయి. కాబట్టి కాపు కరణాల సంబంధం కావడికుండల్లా సమతూకంగా ఉంటేనే గ్రామానికి మంచిది, వారిద్దరికీ మంచిది అంటున్నాడు వేమన.

వేమన్నకాలంలో రైతు వ్యవహారాల్లో కరణాల ప్రమేయం అనివార్యంగా ఉండేది. కాకతీయుల కాలం నాటికి కరణాలు విశ్వబ్రాహ్మణ కులానికి చెంది ఉండేవారు. గణపతి దేవుని కాలంలో బ్రాహ్మణుల నియామకం మొదలైంది. వీరినే నియోగులంటారు. కాపు కరణాల పరస్పర సంబంధాల్లో వైషమ్యాలు ఏర్పడుతున్నకాలంలో ఈ పద్యం చెప్పివుంటాడు వేమన.

కాపు అంటే కర్షకుడు, ఆకాలంలో సాధారణంగా రెడ్డి. కరణం అంటే భూమి శిస్తులు లెక్కలు రాసేవాడు. "గ్రామ కరణమేతెంచి రెడ్డి చెంగట వసించ" అని ప్రయోగం. సరదాగా చెప్పాలంటే చావు లెక్కలు రాసే చిత్రగుప్తుడూ కరణమే.

కరణంతో పగతెచ్చుకుంటే కాపు బతుకు మొలకెత్తదు. నిన్న మొన్నటిదాకా 'కరణం పగ' అనే వ్యవహారం ఉంది. స్వభావాన్ని బట్టి వేమన రెండురకాల కరణాల గురించి చెప్పాడు. ఒకటి అధమ కరణం, రెండు బిరుసుకరణం. కాపులు అధమ కరణాన్ని లెక్క చేసేవారు కాదు. అధికారం చెలాయించే కరణానికి భయపడేవారు. చూడండి వేమనదే మరో పద్యం.

**కరణమధముడైన కాపులందరు గూడి**
**వంగుమంద్రుమనసు వచ్చినపుడు**
**బిరుసుకరణమైన బిడ్డల మందురు ॥విశ్వ॥**

కాపుల పంటలెక్కలు తేల్చేపని కరణం చేతిలో వుంటుంది. అందువల్ల కరణం అంటే లోపల కోపమున్నా పైకి భయభక్తులను ప్రదర్శిస్తారు. అదే కరణం గట్టివాడయితే 'అయ్యా' అని ఒదిగి ఉంటారు. ఇలా అయితే ఎలా? కాపులు కరణాలు కావడికుండల్లా కలిసి ఉంటే గ్రామానికి శ్రేయస్సు కదా! అంటున్నాడు వేమన.

కావడి అంటే సాధారణంగా కుండలు అమర్చిన వెడల్పాటి గట్టి వెదురుబద్ద. దీనిని భుజాల మీద మోస్తారు. నీళ్లు మోస్తారు, ఇతర బరువులు కూడా. ఇంగ్లండులో పాల అమ్మాయిలు కావళ్లు మోసుకొస్తారు అని బ్రౌన్ రాశాడు. కావడిబద్దకు రెండుకొనల్లో సమానమైన బరువుంటే దానిని మొయ్యడం సులభం. 'కలిమిలేములు కావడి కుండలు' అని సామెత.

ఒకప్పటి స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థలో ఎవరు తమ కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించకపోయినా అది దాని విచ్ఛిన్నానికి దారి తీసేదని సారాంశం.

**కామిగాని వాడు కవిగాడు రవిగాడు**
**కామిగాక మోక్షకామిగాడు**
**కామియైన వాడు కవియగు, రవియగు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కోరికలు తీరితేనే కోరికలు నశిస్తాయని చెప్పే పద్యమిది.

కాంక్ష లేకపోతే కవిలా భావుకుడు కాలేడు. సూర్యుడిలా తేజస్వీ కాలేడు. కామమే కామరాహిత్యానికి దారితీస్తుంది. అంటే మోక్షానికి అని తాత్పర్యం.

కామి అంటే కాముకుడు, కోరిక గలవాడు, మరులు గొనువాడు. ఎవరిపట్ల? స్త్రీ పట్ల. ఆ స్త్రీ భార్యా, ప్రియురాలా అనేది తరువాతి సంగతి. భార్య ప్రియురాలు కాకూడదని ఎక్కడా లేదు. కవి అంటే కవిత్వం అల్లేవాడు. స్పందించే గుణం కలవాడు, రసికుడు, సౌందర్యతత్త్వం తెలిసినవాడు, పండితుడు. కవి అంటే నీటికాకి అని మరో అర్థముంది గాని పాపం! దానినెందుకు ఇక్కడికి లాక్కు రావడం? మరిక్కడ రవి ప్రసక్తి ఎందుకు? కవికి ప్రాసగా వుంటాడనా? కాదు. వేమనకు శబ్దలౌల్యం తక్కువ. ఇక్కడ 'రవి' సాభిప్రాయమే. రవికాడు అంటే తానుగా వెలగలేని వాడని, స్వయం ప్రకాశకుడు కాడని. కవి లోక వ్యవహారాలను వీక్షించే నేర్పు గలవాడు. రవి కూడా అంతే కర్మసాక్షి. తాను వెలుగుతాడు ఇతరులనూ వెలిగిస్తాడు అని వేమన్న సారాంశం.

మనకు నాలుగు పురుషార్థాలున్నాయి. ధర్మం, అర్థం, కామం, మోక్షం అని. కామశాస్త్రం రచించిన వాత్స్యాయనుడి కాలానికి పురుషార్థాలు మూడే. మోక్షం లేదు. భౌతికవాదులైన లోకాయతికుల దృష్టిలో రెండే. అర్థకామాలు. వేమనకు చాలా ముందే మోక్షం వచ్చి చేరింది. ఇంతకు మోక్షమంటే ఏమిటి? ముక్తి. అంటే సంసారబంధాల నుంచి విముక్తం కావడం. బ్రహ్మాన్ని చేరుకొని జీవుడు నిజస్వరూపాన్ని పొందడం. కైవల్యమని కూడా అంటారు దీన్ని. నదులు సముద్రంలో కలసి తమ నామరూపాలను కోల్పోయినట్టే జీవుడు మోక్షాన్ని పొందుతాడు.

కావడం నుంచి వచ్చింది కామి. వ్యతిరేక నామవాచక మన్నమాట. ఔగాములు అంటారు అంటే సాధ్యాసాధ్యాలు (అవును+కామి), కొరగామి అంటే పనికిమాలిన అని.

ప్రాపంచిక సుఖాలు అనుభవించినవాడు కడకు వైరాగ్యం వైపు వెళ్తాడు. వైరాగ్యం మోక్షం వైపు ఆసక్తిని కలిగిస్తుంది. 'మోక్షకామి' అంటే మోక్షం పట్ల జిజ్ఞాసువుగా మారుతాడని. కోర్కెగల వాడవుతాడు. యోగి అవుతాడు. ఇదొక సహజ పరిణామం. మహా రచయిత గుడిపాటి వెంకటచలాన్ని మనం చూడలేదూ? పుట్టు యోగుల సంగతి వేరు, ఇది మెట్టుయోగుల గురించి.

**కాలచక్ర మెరుగగా లేక ఎప్పుడు**
**సంధ్యజపము సేయు జాణలార!**
**సంధ్యజపము లోని జాడలెట్లుండును?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కాలం యొక్క భ్రమణంలోని అంతరార్థం తెలుసుకోకుండా మూడుపూటలా సంధ్యావందనం ఆచరించే నేర్పరులారా! ఒక్కసారి ఆలోచించి చూడండికాలం దిశ ఎటువైపు వెళ్తుందో అని హెచ్చరిస్తున్నాడు వేమన.

కాలచక్రం అంటే చక్రాకారంగా తిరిగే కాలం. చక్రం అంటే ఇక్కడ గ్లోబు కాదు. భూమండలం. కాలం రోజులు, నెలలు, సంవత్సరాలు, రాశులుగా విభజించబడింది. అవి గడిచిపోయి మళ్లీ తిరిగి వస్తాయి. అందుకే చక్రం. ఇంతకూ కాలమంటే ఏమిటి? కాలమంటే సమయం. దీనిని సూర్యుడు ఏర్పరుస్తాడు. స్థూలంగా అయితే కాలానికి భూత భవిష్యత్ వర్తమానాలుంటాయి. వాటికే కాలత్రయమని పేరు. అలాగే ఒకరోజును (అంటే 12 గంటలు) ఐదు భాగాలు చేసి ప్రాతఃకాలం, సంగవకాలం, మధ్యాహ్నం, అపరాహ్ణం, సాయంకాలాలు అన్నారు. వీటిమధ్య సుమారుగా 2 గంటల 24 నిమిషాలు వ్యవధానముంటుంది. వీటిలో ప్రాతః, మధ్యాహ్న, సాయంకాలాలు సంధ్యలు. త్రిసంధ్యల్లో నమస్కారం చేసి గాయత్రీమంత్రాన్ని జపిస్తారు. పద్యంలో 'ఎప్పుడు' అనే మాటకు రోజూ మూడుపూటలా అని అర్థం.

ఇంతకూ సంధ్య అంటే ఏమిటి? సూర్యమండల స్థిత చైతన్యంతో జీవచైతన్యాన్ని సంధించే శక్తిని సంధ్య అంటారు. సూర్యోదయానికి ఐదు గడియల ముందుండేది ప్రాతః సంధ్య. సూర్యాస్తమయానికి ముందు మూడు గడియల వరకు వ్యాపించి ఉండేది సాయం సంధ్య. సంగవం అంటే కాలపంచకంలో రెండోది. ఈ సమయాన్ని లౌకికమైన కోరికల కోసం ఉపయోగిస్తారు.

ఇవన్నీ బాగానే ఉన్నాయి. కాని ఇంతకూ కాలం అంటే ఏమిటో తెలుసా? యాంత్రికమైన జపత పాదులతోనే ఆగిపోక కాస్త పైకెదిగి ఆలోచించమంటున్నాడు వేమన.

కాలాతీతం అయిందంటాం. అంటే యుక్త సమయం దాటిపోవటం అంటే ఏమిటి? కాలధర్మం చెందడమంటే చనిపోవడం. చనిపోవడం కాలం యొక్క లక్షణమన్న మాట! పుట్టడం కూడా కాలధర్మమే కాని అలా అనం. బ్రౌన్ కాలధర్మానికి అర్థం చెప్తూ The

debit of Nature అన్నాడు. ప్రకృతికి చెల్లించవలసిన బాకీ. ఇక్కడ ఈ అర్థం సరిపోదుగాని బ్రౌన్ లోకవ్యవహారంలోంచి ఈ అర్థాన్ని తీసుకొని ఉంటాడు. "వాడికి బాకీ తీరిపోయింది" అంటారు. అలాగే కాలజ్ఞానం అంటే ఏమిటి? విద్యారణ్యుడు, సర్వజ్ఞుడు, చెన్నబసవడు, పోతులూరి వీరబ్రహ్మం వీరు భవిష్యత్తును గురించిఎలా చెప్పగలిగారు?

కాలం యొక్క ప్రభావం తెలియని జపతపాలు వ్యర్థమేకదా అని సారాంశం. కాలమాహాత్మ్యం ఎట్లాంటిది? దానిని ఎలా ఆరాధించాలి? కాలం ఎంతో బలమైనది, దురతిక్రమమైంది. జపతపాలు దానిని అడ్డుకోగలవా? ఇంతకూ కాలమంటే ఏమిటి? కాలమంటే క్రియ. గడిచిపోయేది నీకాలం కాదు, గడిపేదే నీ కాలం. కాబట్టి కాలాన్ని తెలుసుకుంటే నీకూ పరమాత్మకూ గల సంబంధం కొంత అవగతం కావొచ్చునంటున్నాడు వేమన.

జాణ అంటే సమర్థుడు, రసికుడు; జాణతనం అంటే చాతుర్యం, ప్రౌఢత్వం అంటే అనేక అర్థాలున్నాయి. తెలంగాణాలో "శానతనం చేస్తున్నాడు" అంటారు. అది జాణతనమే, ఎక్కువగా మాట్లాడుతున్నాడని.

ఒక స్థాయికి వెళ్లగలిగితే కాలమే సృష్టి రహస్యం. కాలమే దైవం.

**కాలవశము బట్టి కర్మజీవుల పిండు**
**మత్తులగుచును మదమత్తులైరి**
**మత్తులైన జనుల మనసేటి మనసయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జీవులు కాలానికి వశులై చచ్చిపోతూ పుడుతూ వుంటారు. వారు ఆయా జన్మల్లో చేసిన మంచి, చెడు పనులను బట్టి ఆయా ఫలితాలను అనుభవిస్తారు. చెడ్డపనులు రజో, తమో గుణాల వల్ల జరుగుతాయి. ఈ గుణాలకు మూలమైన మనసూ ఒక మనసేనా? దానివల్ల ఉపయోగమేమీ లేదు అని చిరాకుపడుతున్నాడు వేమన.

జీవులందరూ కాలప్రవాహంలో కొట్టుకపోతుంటారు. నిత్యకర్మల పాలౌతుంటారు. ఈ ప్రక్రియలో ఆశాభ్రాంతులకు లోనయ్యే మనస్సు అనర్థదాయకంగా మారుతుందనేది సారాంశం. అట్లా కాకుండా మనస్సును అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం అని వేమన్న సందేశం.

కాలం అంటే సమయం. దీనిని నిర్ణయించేవాడు సూర్యుడు. కర్మ అంటే పని. నిరంతరం పని చేసుకుంటూ పొయ్యే వ్యక్తిని కర్మజీవి అంటారు. కాని ఇక్కడ కర్మఫలాలు అనుభవించేవాడని. మత్తు అంటే వాస్తవ స్పృహ లేకుండా చేసే మాదకగుణం. మదం అరిషడ్వర్గాల్లో ఒకటి. మద్యపానం వల్ల కలిగే మత్తు కూడా అంతే, విచక్షణా జ్ఞానాన్ని హరిస్తుంది. కాబట్టి మనసును దుర్గుణదూషితం కాకుండా కాపాడుకుంటే మంచిది అంటున్నాడు వేమన.

“మత్తుగలిగి వికలచిత్తులైరి (డి.1727-664)” అనేది పాఠాంతరం.

**కాశిబోదుననుచు కడకట్టగా నేల**
**వాసి తీర్థములను వగవనేల**
**దోషకారికెట్లు దొరుకురా యాకాశి?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కాశిలో తనువు చాలిస్తే మోక్షం వస్తుందనే నమ్మకంతో కాశీకి వెళ్లాలని ఎప్పటి నుండో ఏర్పాట్లు చేసుకుంటున్నావు. అలాగే ప్రసిద్ధమైన పుణ్య నదీతీర్థాల్లో సంచరిస్తూ అవస్థలు పడుతున్నావు. ఎందుకివన్ని? తప్పుడు పనులు చేసేవాడికి బాహ్యమైన కాశీక్షేత్రం కనపడుతుందేమోగాని దాని పరమార్థమైన స్వర్గం లభిస్తుందా? ఆలోచించమంటున్నాడు వేమన.

సంప్రదాయపరంగా ఏర్పడే విశ్వాసాలకూ తాత్త్విక స్థాయిలో ప్రవచించే దర్శనాలకూ వ్యత్యాసం ఉంటుంది. లౌకికులకు రెండోది నచ్చదు. నచ్చునంత మాత్రాన లోకశ్రేయస్సును కోరే యోగులు చెప్పకుండా వుండరు. అలాంటి వారిలో వేమన ప్రప్రథముడు.

కాశీ ఉత్తరభారతదేశంలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రాచీన శివక్షేత్రం. కాశీ అనేది ఒక గ్రామ దేవత పేరు. అక్కడ ఆమె గుడికూడా వుంది. కాశీ అనే మాటకు ప్రకాశించేది (కాశృదీప్తౌ) అని అర్థం. శివుడి యొక్క వెలుగువల్ల ప్రకాశించేది అని తాత్పర్యం. కాశీలో ఉన్నది జ్యోతిర్లింగం అని కదా ప్రసిద్ధి, అలాగే కాశీ ఒక మహా స్మశానం. అక్కడ ఎప్పుడూ చితులు మండుతుంటాయి. ఆ చితుల వెలుగు ఒకరకంగా తాత్త్విక ప్రకాశమే.

కాశీకి వారణాసి అని కూడా పేరు. వరుణా, అస్సీ అనే రెండు నదుల మధ్య ఉండేది వారణాసి. ఇంగ్లీషువారు పలకలేక బనారస్ అన్నారు. కోల్కతాను కలకత్తా అన్నట్టు. ముంబయిని బొంబాయి అన్నట్టు. కాశీపట్టణం ఎనిమిది ఆమడల విస్తీర్ణం కలది. వారణాశి దానిలోని ఒక భాగం.

కడకట్టు అంటే ఏర్పాటు, నిర్ణయం. కడ అంటే ఇక్కడ చివరిదశ, అంటే మరణం. కడ మూలద్రావిడంలో కట్; కన్నడంలో కడె, తమిళంలో కట్టై, మలయాళంలో కడెచ్. *"నిడుపున దూరపు బడమర మై రెండు కడలు నంబోనిధింగదిసియుండు"* అని ప్రయోగం. కడగట్టు అని కూడా వాడుక (కడ+కట్టు).

*“మును పెన్నకాదెయార్యులు*
*వినుత నిజ జ్ఞానదృష్టి దిరముగ గ*
*న్గొని కడగట్టిన వారీ*
*తని యీ దృశ భావ చేష్టితములఖిలముల్”* అని ప్రయోగం.

దోషం అంటే తప్పు, పాపం. వైద్య పరిభాషలో వాత, పిత్త, కఫాలలో ఒకదాన్ని కూడా దోషమంటారు. అన్నట్టు రాగద్వేషాలు, మోహం వగయిరాలు కూడా దోషాలే. దోషకారి అంటే అపరాధి.

కాశీక్షేత్రం లాంటి గొప్పక్షేత్రాలకు వెళ్లిస్నానాలు, జపాలు చెయ్యటం వల్ల కొంత సాంత్వన చేకూరవచ్చుగాని అంతకన్న ఉన్నతమైన చిత్ ప్రకాశస్థితికి చేరడానికి మాత్రం ఇదిచాలదు. బాహ్యమైన వాటిని త్యజించి జ్ఞాన సిద్ధి పొందినవాడికే మోక్షం లభిస్తుంది. అదే నిజమైన కాశి అని వేమన్న ఉవాచ.

**కుండకుంభమండ్రు కొండ పర్వతమండ్రు**
**ఉప్పు లవణమండ్రు ఒకటిగాదె**
**భాషలింతె వేరు పరతత్త్వ మొక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తెలుగులో అన్నా సంస్కృతంలో అన్నా పదార్థమొక్కటే, పరమార్థమొక్కటే, ప్రయోజనం కూడా ఒక్కటే అని కుండబద్దలు కొట్టినట్టు చెప్తున్నాడు వేమన్న.

కుండ అన్నా కుంభమన్నా నీళ్లకోసం ఉపయోగించే గుండ్రని మట్టిపాత్రే. కొండ అన్నా పర్వతమన్నా రాతితో ఏర్పడిన పెద్దగుట్టే, ఉప్పు అన్నా లవణమన్నా ఉప్పుగా ఉండే ఒక పదార్థమే. భాషల్లో ఎక్కువ భాష, తక్కువ భాష, మంచి భాష, చెడ్డ భాష అంటూ వుండవు. భాషలన్నీ మానవ బావ వ్యక్తీకరణకు వాహికలే అనేది శాస్త్రీయ దృక్పథం.

ఏ భాషలో చెప్పినా మూలతత్త్వం ఒక్కటే. సంస్కృతంలో చెప్పినంత మాత్రాన అది ఎక్కువ సత్యమై, తెలుగులో చెప్పినంత మాత్రాన అది తక్కువ సత్యమౌతుందా? సామాన్యుల భాషలో చెపితే చిన్న చూపు చూసేవారు ఆనాడు కూడా ఉన్నారేమో. అదీగాక వేమన్న ప్రజల తాత్త్వికుడు. కొందరికి మాత్రమే అందుబాటులో ఉన్న తత్త్వ రహస్యాలను ప్రజల భాషలో చెప్పాలన్న ప్రయత్నమాయనది. అటువంటి ప్రయత్నాన్ని తేలిగ్గా చూసేవారికి ఈ పద్యం సమాధానం. పరతత్త్వం అంటే పరమ సత్యమని. భాషలెన్నైనా భావమొక్కటే అని వేమన్న సారాంశం.

**కుండ పగిలె నేని కొత్తది కొనవచ్చు**
**భూతలంబు నందు పొందుగాను**
**కూలబడిన నరుడు కుదురుట అరుదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కుండ పగిల్తే అతుక్కోదు. అప్పుడు కొత్త కుండ కొనుక్కోక తప్పదు. అప్పుడది పాతదానిలాగే పనికొస్తుంది. కాని మనిషి ఆరోగ్యం ఒక్కసారి దెబ్బతిన్నదా కోలుకోవటం కష్టం అంటున్నాడు వేమన.

కుండ అంటే ఏమిటి? కుండకు కూడా అర్థం చెప్తున్నారా ఏమిటి కొంపతీసి అని అనుకోకండి. ఏమో! నీటి నిల్వల కోసం కొత్త కొత్త రూపాల్లో పాత్రలు వస్తున్న నేటి కాలంలో రేపు జానపద మ్యూజియంలో కుండ గురించి చెప్పడానికి గైడ్ నవుతానేమో, ఇప్పటినుంచే అభ్యాసమన్న మాట. కుండ అంటే వర్తులమైన భాండం. నవ్వకండి. కుండ అంటే మట్టికుండే. కొన్ని సందర్భాల్లో లోహకుంభాన్ని కంచుకుండ అనేవారు. ఇప్పుడు బిందె అనే మాట స్థిరపడిందనుకోండి. ఇప్పుడు ప్లాస్టిక్‌వి వచ్చేశాయి. అయినా బిందెలే. భాషా శాస్త్రంలో దానిని విస్తరణ (Extension) అంటారు. ఒకప్పుడు స్త్రీలు చెవులకు తాటాకులను సొమ్ములుగా ధరించేవారు. వాటిని కమ్మలు అనేవారు. ఇప్పుడు బంగారువైనా కమ్మలే, అట్లా.

పొందుగా అంటే ఒద్దికగా 'కూలబడిన' అంటే సందర్భాన్ని బట్టి అర్థం చెప్పుకోవచ్చు. జారిపడి కూలబడితే అదొక ఆట పట్టించే సరదా. ఇక్కడ అనారోగ్యంతో మంచాన పడటమనేదే ప్రస్తుతార్థం. 'కుదురుట' అంటే కోలుకోవటం. ఒక పెద్ద వ్యాధితో అడ్డం పడితే మళ్లీ లేచి తిరగడం అంత సులభం కాదు. పైగా ఆ రోజుల్లో! అందుకే అరుదు అంటున్నాడు వేమన.

ఈ పద్యంలోని మొదటి పాదానికి పాఠాంతరమిట్లా వుంది. *"కుండ చిల్లిపడిన గుడ్డ దోపగ వచ్చు"* గుడ్డ దోపటంలో పేదరికముంది. కొత్తది కొనలేదు.

ఈ పద్యభావాన్ని 17వ శతాబ్దంలోని పరిస్థితులకు అన్వయించవచ్చు. మధ్యయుగాల్లో కులవృత్తులు దెబ్బతిని చేతివృత్తుల వాళ్లు చావు దెబ్బతిన్నారు. అలా కూలబడినవాళ్లు ఇప్పటికీ కుదురుకోలేదు. 'కొత్తది కొనవచ్చు' అనటంలో పాతవృత్తులను వదులుకోలేరు. కొత్తవాటిని అవలంబించలేరు. మరెలా? కాలమే చెప్పాలి.

దేనికైనా అన్వయించగలిగే సార్వకాలికత, దార్శనికత వేమన పద్యాల సొత్తు.

**కుక్క గోవు గాదు కుందేలు పులిగాదు**
**దోమ గజము గాదు దొడ్డదైన**
**లోభిదాతగాడు లోకంబులోపల**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

జంతువుల్లో దేని స్థాయి దానిదే. మనుషులు కూడా అంతే గుణాన్ని బట్టే విలువ.

ఊరు తిరిగే కుక్కను పాలిచ్చే ఆవుతో పోల్చడం కుదరదు. ఆకు కదిలితే పారిపొయ్యే పిరికి గొడ్డు కుందేలుకు అల్ప ప్రాణులను వేటాడే పెద్దపులితో సాపత్యమా? పెద్ద దోమే కావొచ్చు మహా స్థూలకాయమైన ఏనుగు ముందు అదెంత? అలాగే పరోపకారి అయిన దానగుణశీలికి దక్కే గౌరవం పరమలోభికి దక్కుతుందా?

గోవుతో పోలిస్తే కుక్క తక్కువది. పులితో పోలిస్తే కుందేలు పిరికిది. ఏనుగుతోపోలిస్తే దోమ చిన్నది. అలాగే 'దొడ్డదైన' అంటున్నాడు వేమన. ఒకవేళ పెద్దరకం దోమ అయినా ఏనుగు ముందు బలాదూరే. అలాగే ఉదాత్తమైన దాతతో పోలిస్తే లోభి నీచుడే అవుతాడు కదా!

గజం అని వాడటంలో చమత్కారముంది. గజ అంటే మహా, గొప్ప అనే అర్థాలున్నాయి. గజనిమ్మ అంటే పెద్ద పరిమాణంలో ఉండే నిమ్మ. గజదొంగ అంటే పేరుమోసిన పెద్ద దొంగ అని. గజబొంకు అంటే పచ్చి అబద్ధమని.

మంచి ప్రవర్తన వల్లనే లోకంలో ప్రశస్తి కలుగుతుందని సారాంశం.

**కుక్కదిన్నవాడు గురులింగ జంగంబు**
**పంది దిన్నవాడు పరమయోగి**
**యేన్గుదిన్నవాడు ఎంత సుజ్ఞానిరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నిజమైన జంగమ గురువు ఎవరయ్యా అంటే కుక్కలాంటి కామక్రోధాలను అణచివేసినవాడు. అలాగే పందిలాంటి దైహికమైన కాంక్షలను వదిలేసినవాడు పరమయోగి స్థితికి చేరుకుంటాడు. ఇక ఏనుగులా సాధుశీలియై పరోపకారాన్ని ఆవాహన చేసుకున్నవాడు నిజంగా గొప్పజ్ఞాని అంటున్నాడు వేమన.

బసవేశ్వరుణ్ని అనుసరించే వీరశైవులను జంగాలంటారు. ఎక్కువగా నిమ్నకులాలవారు దీనిలో వుంటారు. లింగం వీరి గుర్తు. అందుకే వీరిని లింగధారులంటారు. బసవపురాణం, ప్రభులింగలీల, పండితారాధ్య చరిత్రము, చెన్న బసవపురాణం అనేవి పఠనీయ గ్రంథాలు. వీరిలో స్త్రీలపట్ల గౌరవానికి పెద్దపీట. సి.పి.బ్రౌన్ జంగమ సాహిత్యంపైన ప్రత్యేకమైన కృషి చేశాడు. జంగాలపైన వ్యాసాలు రాశాడు. ఈ పద్యానికి ఇప్పుడు మనం చెప్పుకుంటున్న అర్థం బ్రౌన్ పద్ధతిలోనిదే.

లింగం అంటే శివమూర్తి విశేషం. శివుడు లింగశరీరుడు. మనోబుద్ధి దశేంద్రియ పంచప్రాణాలు కలిగిన సూక్ష్మ దేహమే లింగం. గురులింగం అంటే వీరశైవమతావలంబి, గురువు జంగమం అనే మాటకు చరించేది అని అర్థం. చరిష్ణువు అన్నమాట. కొత్తగా వీరశైవం పుచ్చుకున్న వారికి వారి సాధన దశలు దీనిలో ధ్వనించబడ్డాయి. కుక్క, పంది, ఏనుగు అనేవి ఆయా గుణాలకు ప్రతీకలు.

జంగాలంటే చిన్నచూపు గలవారు ఈ పద్యాన్ని వారిపట్ల హేళనపూర్వకంగా వ్యాఖ్యానిస్తారు. జంగాలు ఏది పడితే అది తినే మాంసాహారులనీ వారు కుక్కలను కూడా తింటారని గిట్టని వారు ఛీత్కరించేవారు. కుక్కను తినే జంగమయ్య గురువైతే దానికంటే పెద్దదైన పందిని తినేవాణ్ని పరమయోగి అనాలి కదా. అలాంటప్పుడు ఇంకా పెద్దదైన ఏనుగును పీక్కుతినేవాణ్ని ఎంత సుజ్ఞాని అనాలో అని వ్యంగ్యం.

పైన పేర్కొన్న జంతువులకు మంచి, చెడు రెండు రకాల గుణాలుంటాయి. కుక్కబుద్ధి కొన్నిసార్లు దుర్భరమే కాని దాని విశ్వాసం!? పందిని చూస్తే రోత పుట్టొచ్చుకాని దాని ఉదార స్వభావం!? అలాగే మదం పట్టిన ఏనుగుకు అడ్డూ ఆపు లేకపోవచ్చు కాని స్వభావతః అది సాధు స్వభావి. ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు, చూడటంలో వుంటుంది.

ఈ పద్యంలో తినటం అంటే జీర్ణం చేసుకోవటమనే, అంటే అణచివేయటం. మళ్లీ మొదటికొస్తే అరిషడ్వర్గాలపై ఆధిపత్యం సాధించేవాడే నిజమైన గురువు అనేది సారాంశం.

**కుక్క యేకతంబు, కొక్కెర ధ్యానంబు**
**గాడ్దె రాగమెన్న, కప్పమునుగు**
**ఆత్మనెరుగు భావమది యేల జేయరో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కుక్క సన్యాసం స్వీకరించిందా? కొంగజపం చేస్తుందా? గాడిద రాగాలు తీస్తుందా? కప్ప స్నానమాడుతుందా? ఎందుకొచ్చిన నటనలివన్ని? ఆత్మను తెలుసుకునే ఆలోచన చేయకుండా అని వేషధారులను చూసి జాలిపడుతున్నాడు వేమన.

ఏకతము అంటే ఏకాంతం. ఏకాంతవాసం అంటే మునివృత్తి. కుక్క అన్నీ విసర్జించి సన్యసించిందంటే ఎవరు నమ్ముతారు? అలాగే కొక్కెర ధ్యానం. కొక్కెర అంటే కొంగ. కొంగ దొంగ జపం చేస్తుంటే నమ్మివచ్చిన చేపను చటుక్కున పట్టుకొని గుటుక్కున మింగుతుంది. గాడిద ఓండ్రపెడుతుంది. దానిని సంగీతంగా భ్రమింపజేస్తే ఎలా? అలాగే కప్పమునుగు. మునుగు అంటే ఇక్కడ మునక. కప్ప ఉండేదే నీటిలో. ఇది స్నానం చేస్తుందంటే అర్థమేమిటి?

పైన చెప్పిన భూచరాలు, జలచరాల్లా, వాయుచరాల్లా మనిషి నటిస్తున్నాడు. ఇతరులనూ తననూ భ్రమింపజేస్తున్నాడు. దానికి బదులుగా ఆత్మను నమ్ముకొని ముక్తి భావనలలో తేలిపోవడం ఉత్తమమని వేమన్న సారాంశం.

**కుడువ ముడువలేక కూడు బెట్టగలేక**
**విడువ నుడువలేక విద్యలేక**
**నడువ నేరనపుడు నడపీనుగందురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కుడువటానికి లేదు అంటే తినటానికి తిండిలేదు. తలకు లేదా కొప్పు ముడుచుకోటానికి చమురులేదు. తనకే కాదు ఇంట్లో నోళ్లు తెరిచి కూచున్న పెండ్లాం బిడ్డలకు పెట్టుకోడానికి కూడు లేదు, కట్ట విడువ మారుబట్టల్లేవు. నోరు పెట్టుకొని బతుకుదామంటే మాటకారితనం లేదు. అమ్ముకోటానికి విద్య లేదు. ఇటువంటి వాణ్ని చూసి జనులేమంటారు? 'నడపీనుగ' అంటారంటున్నాడు వేమన.

నడపీనుగ అంటే నడిచేపీనుగ అని అర్థం. జీవచ్ఛవం అన్నమాట. బతుకుతున్నాడన్నమాటే గాని అది చావుతో సమానం. ఇంటిముందు సజీవమాత్రుడిగా ఉన్నవాడని అర్థం చెప్పుకోవచ్చు. తిక్కన నడమోదువులు, నడదివియలు అని ప్రయోగించాడు. రాజులకు గౌరవసూచకంగా నడదివియలు పట్టుకునేవారు. నడదివియలు అంటే నడవ నడవకు అంటే మెట్టు మెట్టుకీ లేదా అడుగడుక్కీ ఒక దీపం అని అర్థం. ఊరేగింపులో పట్టే దివిటీలను నడదివియలంటారు. సామంత రాజుల కిరీటకాంతులే నడదివియలుగా ధర్మరాజుకు ఉన్నాయని భారతంలో వర్ణన. సుమతికారుడు కూడా 'నడపీనుగ వచ్చెననుచు నగుదురు' అన్నాడు. నడవ నేరనపుడు అంటే బతకలేనప్పుడు అని అర్థం.

ఇంతకు ఈ పద్యంలో వేమన ఏమంటున్నాడు? పేదవాడిని తక్కువ చేస్తున్నాడా? లేదు. పేదరికాన్నీ, పేదవాడి లోకువతనాన్నీ కళ్లకు కట్టినట్టు వర్ణిస్తూనే ఆర్థికస్థోమత లేనివానిని గురించి లోకులు లేదా కడుపు నిండినవారు అనుకునే పద్ధతిని చూపిస్తున్నాడు. అది తప్పు అని వేమన్న భావన. చేతనైతే సాయం చెయ్యాలి గాని చులకనగా చూడగూడదని తాత్పర్యం.

**కులము గల్గువారు గోత్రము గలవారు**
**విద్యచేత విఱ్ఱవీగువారు**
**పసిడి గల్గువాని బానిస కొడుకులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తమది ఎక్కువ కులం అనుకునేవారు, తమదే గొప్పగోత్రం అని భావించేవారు, తామే మహాజ్ఞానులమని గర్వించేవారు వీరందరూ తామసగుణ సంపన్నులే. కాని ఒక్కచోట మాత్రం కాదు. ఎక్కడ? డబ్బున్నవాడి ముందర. అంతేకాదు, వాడి దాసిదాని ముందర. అంతేకాదు, ఆ దాసి దాని కొడుకుల్తో సమానంగా వొంగిపోతారు. ఎంత విడ్డూరం! అని కుండబద్దలు కొడ్తున్నాడు వేమన.

ఇక్కడ కులం అంటే అగ్రవర్ణం. గోత్రం అంటే వంశ మూలం. జాతి పరంపర, తెగ, వర్గం, శాఖ, సంతతి ఇట్లా అనేక ఛాయలు. అన్నట్టు సగోత్రికులను పెళ్లి చేసుకోరు. విద్య అంటే తెలుసుకునేది, చదువు. శాస్త్రం, బాష, కళలు, ఇంద్రజాలం ఇవన్నీ విద్యలో భాగాలే. నేను అందరికన్న జ్ఞానిని అవి విఱ్ఱవీగితే అది అజ్ఞానమే. నిజమైన జ్ఞానికి అహంకారముండదు. విఱ్ఱవీగుట అంటే గర్వించుట, ఉబ్బుట అని అర్థాలు. పసిడి అంటే బంగారం, అంటే సంపద. బానిస అంటే అస్వతంత్రుడు, పరాధీనుడు. అనుచరుడు, అనుజీవి, ఉపజీవి, జీతగాడు అని నానార్థాలున్నా ఇక్కడ బానిస అంటే దాసి, A female servant, maid servant అని బ్రౌన్. ఇంటిపాప, ఊడిగపుకత్తె, పనికత్తె అని కూడా అంటారు.

తెలంగాణాలో దొరల గడీల్లో ఆడపాపలని ఉండేవారు. వారూ బానిసలే. పై మూడు రకాలుగా అహంకరించే వాళ్లందరూ డబ్బున్నవాడి దాసి కొడుకుల్తో సమానం. డబ్బున్నవాడికి వీళ్లంతా లోకువే. ఇది గమనించక జబ్బ చరుచుకోవడం వెర్రితనం అని వేమన్న ఉవాచ.

మనదేశంలో వర్ణం, వర్గం కలగాపులగమైపోయాయి. వీటి ద్వారా జరిగే సత్యసాక్షాత్కారం తుమ్మకొమ్మల్లో సూర్యోదయంలాంటిది. కార్ల్‌మార్క్స్ మానవాళిని రెండువర్గాలుగా విభజించాడు గాని భారతదేశాన్ని గురించి ఆయనకు స్పష్టత ఉన్నట్టు లేదు. నేనొక నానీలో ఇలా రాశాను. సందర్భం కాబట్టి చెప్తున్నాను.

కులాన్ని చూసి
*వర్గం భయపడింది*
*వర్గం లేక*
కులం మలినమయ్యింది.

మేధోమథనంతో సత్యాన్ని వెలికితీయాలి గాని పొరలు గప్పిన దృష్టితో మదమాత్సర్యాలకు లోనుకాకూడదని వేమన్న ప్రబోధం.

**కులుకు గుబ్బ చూసి గొబ్బున కరగించి**
**చేతికాసులెల్ల చేరదీసు**
**అతను చేతి కత్తు లమరంగ కాంతలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అందమైన తమ స్తన సంపదను విలాసంగా కదలించి నీ మనస్సును వెంటనే వివశం చేసి పారేస్తారు. నీ చేతిలో వున్న ధనాన్ని దోచి పారేస్తారు. ఎవరు? కాంతలు. అంటే భోగకాంతలు, వేశ్యలు. వీరు మన్మథుని చేతిలో కత్తులలాంటివారు. వీరితో పొత్తు ప్రమాదకరం. తస్మాత్ జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు వేమన.

వేమన యవ్వనంలో వేశ్యాలోలుడని చెప్పే వాడుక కథలు చాలానే వున్నాయి. కాని వేశ్యరికాన్ని ఆయన సమర్థించిన దాఖలాలు కనపడవు. అంతేకాదు వేశ్యాసంగమాన్ని ఖండించిన వేమన పద్యాలే ఎక్కువ. కామి దశను దాటి మోక్షగామిగా మారే తరుణంలో వాటిని చెప్పి వుంటాడు.

కులుకు ఒక శృంగారపు కదలిక, త్రుళ్లటం, మనోజ్ఞమైన, ఇంపైన అని అర్థాలు. *"గుబ్బ చన్నులు గుల్కించు మెలంతలున్"* అని ప్రయోగం. గుబ్బ అంటే కుచము. గొబ్బున అంటే శ్రీఘ్రంగా, ఆకస్మికంగా అని అర్థాలు. *"గొబ్బున పయ్యెద కొంగు సడల"* అని ప్రయోగం. కాసు అంటే దమ్మిడీలో ఐదో భాగం. నాలుగో భాగమని కొందరు. *"చల్లగా చేతి కాసెల్ల దుల్లి"* అని ప్రయోగం. ఈ పద్యంలో కాసు అంటే ధనసామాన్య వాచకమే.

అతనుడు అంటే తనువు లేనివాడు. మన్మథుడు, అనంగుడన్నమాట! శివుడు మూడోకన్నుతో మన్మథుని దహించిన తరువాత అతడు రతీదేవికి తప్ప ఎవరికీ కనపడడు. లోకానికి రూపం లేనివాడే, మన్మథుడు కనపడకున్నా పడుచువారి పైన అతని ప్రభావం అపారం. ఈ భోగకాంతలున్నారే వారు అతని చేతిలో కత్తుల్లాంటివారు. అవి జీవితాన్ని గాయపరుస్తాయి. నిజానికి మన్మథుని చేతిలో ఐదు పూల బాణాలున్నాయి. అందుకే పంచబాణుడంటారు. అవి అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం. పూల బాణాలతోనే కొంపలు మునుగుతుంటే ఇక కత్తుల సంగతి చెప్పాలా అని వేమన్న చమత్కారం. అమరుట అంటే పొసగుట అని. ప్రేమ చాలా సున్నితమైనది. ప్రేమించకుంటే చంపేస్తాం అనే ప్రేమ నిజానికి ప్రేమ కాదు. వ్యామోహం! ప్రేమకు అసూయ ఉండకూడదు. ద్వేషం ఉండకూడదు. ప్రేమకు ఆశాభంగమే వుంటుంది. యువకులు దీన్ని అర్థం చేసుకోవాలి. యువతులు కూడా తమ ప్రమేయాన్ని ఆలోచించుకోవాలి. ఒక మధ్యయుగం నాటి వేమనయోగి నుంచి మనం నేర్చుకోవాల్సిందిదే! *'చేతికాసులెల్ల చెల్లదీసు, అలుక నతని విడుతు రమరంగ కాంతలు'* (డి.1725, 615)

**కులము నీరు జేసె గురువును జంపించె**
**పొసగ యేనుగంత బొంకు బొంకె**
**పేరు ధర్మరాజు పెనువేప విత్తయా**
**విశ్వదాభి రామ వినురవేమ.**

కురువంశం దగ్ధం కావడానికి కారణమయ్యాడు. గురువు ద్రోణాచార్యుడి మరణానికి హేతువయ్యాడు. ఎట్లా? ఏనుగంత పెద్ద అబద్ధమాడటం వల్ల. అబ్బే! అతని పేరే ధర్మరాజు కాని అతనిలో వున్నదంతా అసత్యపు చేదు.

వేమన పద్యాల్లో అనేకం రత్నాలైతే వాటిలో తరళరత్నం లాంటిదీ పద్యం. ఎంత చరిత్ర! ఎంత కవిత్వం!! కుండలో సముద్రాన్ని నింపినట్టు ఎంత క్లుప్తత!!!

కురుక్షేత్ర యుద్ధంలో ద్రోణుడి కెదురు లేకుండాపోయింది. ఆయన్ని ఎదురుపడి వధించడం అసాధ్యం. అందుకని మోసంతో చంపాలి. దానికి ధర్మరాజు పూనుకుంటాడు. ఒకరోజు యుద్ధంలో ఆశ్వత్థామ అనే పేరుగల ఏనుగు హతమౌతుంది. అప్పుడు ధర్మరాజు 'అశ్వత్థామ హతః' అని గట్టిగా అరుస్తాడు. ఆ వెంటనే 'కుంజరః' అంటే ఏనుగు అని మెల్లగా అంటాడు. ఏనుగు అనేది ద్రోణుడికి వినపడదు. తన కుమారుడైన అశ్వత్థామ చచ్చాడనుకొని పుత్రశోకంతో అస్త్రసన్యాసం చేస్తాడు. ఇదే అదునుగా నిరాయుధుడైన గురువును అర్జునుడు చంపేస్తాడు. కులం అంటే ఇక్కడ కురువంశం. నీరు అంటే బూడిద, భస్మం. జలం కాదు. నివురు నుంచి నీరు వచ్చింది. నివురు అంటే కాలిన బొగ్గుపై కప్పిన బూడిద పొర. మోము-మొగం అయినట్టు, చివుకు-చీకు అయినట్టు, దనుక-దాక అయినట్టు నివురు నీరు అయ్యిందన్నమాట.

పొసగ అంటే ఇమిడినట్టుగా, అతికినట్టుగా అని అర్థాలు. ఇక్కడ రెండోదే అతికినట్టుగా వుంది. బొంకు అంటే అబద్ధం.

ధర్మరాజు అని పెద్ద పేరు పెట్టుకున్నాడు గాని చేసిన పనేమిటి? అన్ని ధర్మాలు తెలిసినవాడు, గొప్పవంశంలో పుట్టినవాడు. విద్య నేర్పించిన గురువునే చంపిస్తాడా? ఎలా? అబద్ధమాడి. ఎలాంటి అబద్ధమది? 'ఏనుగు' అని మెల్లగా అనటం వల్ల సాంకేతికంగా నిజమే కావచ్చు గాని అది ఏనుగంత పరిమాణంలో అబద్ధంగా పరిణమించింది. 'ఏనుగంత' అనటంలో వేమన చూపిన కవితాస్వారస్యం ఎంతచక్కగా కుదిరిందో చూడండి.

ధర్మరాజును పెనువేపవిత్తు అని ఎందుకంటున్నాడు. వేపవిత్తు మంచిది కాదా? ఎందుకు కాదు. వేప విత్తులతో తీసిన వేపనూనె కీటకనాశనిగా పనికొస్తుంది. నూనె తీసిన తర్వాత మిగిలిన పిండిని ఎరువుగా వాడొచ్చు. ఎన్ని సుగుణాలున్నా ఒక్క చేదువల్ల దానికా చెడ్డపేరు వచ్చింది. వేపపండు పైకి కొంచెం తియ్యగా ఉన్నా చేదు విత్తువల్ల దాని పైకి దృష్టిపోదు. వేమనే కాదు తిక్కన అంతటివాడు కూడా *"మెత్తని పులి ధర్మసూతి; అంతర్మద దుష్టుడు ధర్మ సూతి"* అని సంజయునితో అనిపిస్తాడు. ఎంతగొప్పవాడైనా ఒక్క మచ్చవల్ల ధర్మరాజు వివాదాస్పదుడయ్యాడు.

**కులము లేనివాడు కలిమిచే వెలయును**
**కలిమి లేని వాని కులము దిగును**
**కులము కన్న మిగుల ధనము ప్రధానము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కులము లేని వాడంటే ఇక్కడ కులంతక్కువ వాడని అర్థం. డబ్బుంటే ఎంత చిన్న కులం వాడైనా గౌరవింపబడతాడు. అట్లాగే డబ్బులేని వాడి అగ్రవర్ణం వివర్ణమే. దీనివల్ల ధనం కులం కన్న ముఖ్యమైన విలువగా మారిపోతున్నదని సూచిస్తున్నాడు వేమన. కలిమి అంటే అస్తిత్వం, సంపద అని అర్థాలు. అస్తిత్వం కులం వల్ల కాక కలిమివల్ల గుర్తింపబడే రోజులు వేమన్ననాటికే వచ్చేశాయన్నమాట!

ఒకప్పుడు వృత్తుల మూలంగా ఏర్పడిన కులాలు తర్వాత్తర్వాత ఘనీభవించి మనుష్యుల మధ్య భేదాలను శాశ్వతం చేశాయి. 17వ శతాబ్దంలో పరరాజుల దండయాత్రలు, మహమ్మదీయమత ప్రభావం, వ్యాపారసంస్కృతి ప్రవేశం మొదలైన అనేక కారణాలవల్ల వర్ణవ్యవస్థ పునాదుల్లో ప్రకంపనాలు మొదలైనాయి. కులవృత్తులను త్యజించి ఇతర వృత్తులను చేపట్టే ధోరణి ప్రారంభమైంది. ఎక్కువ అదాయం వచ్చే వృత్తులవైపు మొగ్గు చూపుతున్నారు. కులానికి కర్మను నిర్ణయించే శక్తి సన్నగిల్లింది. ప్రాపంచికసుఖాలకోసం కులం గోడలను కూలదోసి మళ్లీ ఆ శిథిలాలకు కాపలాకాసే ద్వంద్వాన్ని పరిహసిస్తున్నాడు వేమన.

కులాన్ని ఖండించిన వేమన్నే మరోచోట కులాన్ని పాటించే పద్యాలు చెప్పాడని, తన మాటలను తానే వ్యతిరేకించుకున్నాడని కొందరు ఒక ప్రసిద్ధ పద్యాన్ని ఉదాహరిస్తారు, చూడండి; "*కులము లోన నొక్క గుణవంతుడుండెనా / కులము వెలయు వాని గుణము చేత / వెలయ వనములోన మలయజంబున్నట్లు*". కాని వారి వాదం ఎంతోసేపు నిలవదు. ఎందుకంటే ఇక్కడ కులం అంటే కుటుంబం అనే వ్యవహారార్థమే. కులానికి కుటుంబం, వంశం అనే అర్థాలున్నాయి. తెలుగు సాహిత్యంలో కులవ్యవస్థను వేమన ఖండించినంత విస్తృత స్థాయిలో వేరొకరు కనిపించరు.

**కులము వలన కొంత బలము వలన కొంత**
**కలిమి వలన కొంత గర్వమునను**
**రంకు చదువు చదివి రంకున బడుదురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గర్వం దేనివల్ల వస్తుంది? పెద్దకులంలో పుట్టడంవల్ల కొంత, అధికార బలం వల్ల కొంత, ఐశ్వర్యం వల్ల కొంత, వీటి మూలంగా మదమెక్కిన కొందరు నీతి బాహ్యమైన కామశాస్త్రాలు చదివి పాపకూపంలో పడిపోతారు. భ్రష్టులౌతారు. తస్మాత్ జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు వేమన.

మంచి వస్తువులు కూడా దుర్మార్గునిలో చెడ్డవైపోతాయనటానికి పైన చెప్పిన కులం, బలం, కలిమి తార్కాణాలు. దీనివల్ల ఏం జరుగుతుంది? యుక్తాయుక్త విచక్షణ నశిస్తుంది. చెడ్డ కాలక్షేపాలు మొదలవుతాయి. దుర్నీతి గ్రంథపఠనం నిత్య పారాయణ మౌతుంది. వేశ్యాలోలత్వం రసికతకు చిహ్నమౌతుంది. అని వేమన్న వివరణ.

రంకు అంటే జారత్వం. రంకుతనం అని కూడా. వ్యభిచారానికి దూషణగా ఉపయోగించే ఒక తిట్టు రంకు. రంకుబోతు అంటే విటుడు, రంకులాడి అంటే విటకత్తె, రంకుతెవులు అంటే మేహరోగం. *"నూరునోములు ఒక్కరంకుతో పోయినవి"* అని సామెత. *"నా కెటుబోయినా రంకే"* అని ఒకామె వాపోయింది. అంటే అంటగట్టారన్నమాట'. రంకువల్ల అబద్ధాలు కూడా పుడతాయి. *'రంకాడ నేర్చినమ్మ బొంకాడ నేరదా'* అనే మాట అందుకే పుట్టింది. అన్నట్టు వ్యభిచారవృత్తిపైన వేసే సుంకాన్ని కూడా రంకు అనేవారు.

ఆధిక్య గర్వం పైకి ఎత్తుగా కనిపిస్తుంది గాని అది అధఃపాతాళంలోకి తోసేస్తుంది దాన్ని తెలుసుకోమంటున్నాడు వేమన.

**కులము హెచ్చు తగ్గు గొడవలు పని లేదు**
**సానుజాతమయ్యె సకల కులము**
**హెచ్చుతగ్గు మాట లెట్లెరుంగగ వచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నాది పెద్ద కులం, నీది చిన్న కులం అనే గొడవల వల్ల ఫలితం లేదు. అన్ని కులాలు ఒక కులం నుంచే పుట్టాయి. అదే మానవకులం. హెచ్చుతగ్గులనే మాట చచ్చుమాట.

హెచ్చు అంటే ఆధిక్యం. నన్ను హెచ్చుతక్కువగా మాట్లాడాడు అంటే కించపరిచాడు అని అర్థం. హెచ్చుతగ్గులు ఉండే భూమి అంటే ఎగుడుదిగుడు భూమి అని అర్థం. అనుజాతం అంటే అనుసరించి పుట్టినది. అంటే తర్వాత పుట్టినది అని. అనుజాతుడు అంటే తమ్ముడు అని. సకల కులం అంటే ఒక కులం కాదు, కులాలన్ని ఒక కులమే, అదే మనిషికులం అని. గొడవ అంటే అల్లరి, ఆగడం, రభస, జగడం, తగవు, రచ్చ, సంవాదం అనే అర్థాలున్నాయి.

కులం అనేది ఈ భూప్రపంచకంలో భారతదేశంలో తప్ప ఎక్కడా వుండదు. కులానికి అర్థమేమిటా అని ఆంగ్లనిఘంటువులు చూస్తే A social class in India అని వుంటుంది. కులం ఎలా పుట్టిందో అనే చారిత్రక చర్చ అనవసరం. గతంలో కులవృత్తులున్నపుడు దాని మంచి చెడులెలా వున్నాయో గాని ఇప్పుడు కులం సృష్టిస్తున్న సంక్షోభం సంక్లిష్టమైనది. అసలు పక్కవాడు మనకంటె తక్కువ అని అనుకోవటంలోనే బోలెడంత అంతర్గర్భిత మానసిక హింస వుంది. అది అనుభవించే వారికే తెలుస్తుంది.

మానవున్ని ఒక కులం చట్రంలో బిగించి ఉంచటం వేమన్నకు నచ్చలేదు. మనిషి తన సాంఘికవర్ణం ఏదో ఒక దానిలోనే సభ్యుడై ఉంటున్నాడు గాని తన జాతి మొత్తంలో ఒక స్వతంత్ర సభ్యుడిగా లేడు. ప్రాథమికంగా మానవుడనే గుర్తును కోల్పోయాడు. నైతిక ప్రమాణాల దృష్టితోనే కాదు ఏ ప్రకారంగా చూసినా వర్ణవ్యవస్థ సమర్థనీయం కాదని వేమన తేల్చిచెప్తున్నాడు. హెచ్చు తగ్గుల వల్ల జాతి ఐక్యతకు మొదటి నుంచి ముప్పులే. బీటలు వారిన భారతజాతికి దీనివల్ల ఒక సమష్టి సంస్కృతి లేకుండా పోయింది. ఒక కులరహిత సమాజం కోసం వేమన ఆనాడే కలలు గన్నాడు. కులవ్యవస్థను ఇంతగా ఖండించిన కవి తెలుగులోనే కాదు యావద్భారత దేశంలోనే లేడు.

**కూటికి నెడబాసి కూర్చున్న మనుజుడు**
**వెలదుల కనుగొన్న వెతలజిక్కు**
**చెలగి అగ్ని చూచు శలభంబు చాడ్పున**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తినటానికి తిండి లేక సొమ్మసిల్లినవాడు అందమైన ఆడదాన్ని చూస్తే ఆ ఆకర్షణకు లోనై మన్మథ బాధను పొందుతాడు. అలాగే రాత్రిపూట మొక్కల్ని అమితంగా మెక్కి విశ్రాంతి తీసుకునే మిడత కూడా దీపకాంతి వైపు ఆకర్షింపబడి దాని ముందు వాలుతుంది.

అహో! స్త్రీ ఆకర్షణ ఎంత బలమైందో కదా అని ఆశ్చర్యపడుతున్నాడు వేమన.

అతడు తినటానికి తిండిలేని నిరుపేద. ఆకలితో నిస్సత్తువ ఆవరించినవాడు. ఆ స్థితిలో అతడు అతిలోకసుందరి అయిన మగువను చూశాడు. ఇక అంతే! ఇంతవరకున్న ఆకలి ఎటుపోయిందో! కొత్త ఆకలి పుట్టుకొచ్చింది. అది వెతగా మారింది. వెత అంటే వ్యథ. ఆ వెతలో చిక్కుకొని విలవిల్లాడుతున్నాడు. ఇంత ఎందుకు అంటే అతడు చూసింది వెలదిని, సామాన్య స్త్రీని కాదు. వెలది అంటే నిర్మలమైనది, తెల్లనిది, మేలైనది, ప్రసన్నమైనది అనే అర్థాలున్నాయి. అందుకే నిర్మలం అనే అర్థంలో వెలదివెన్నెల, వెలది ముత్యాలు, వెలది నవ్వు వంటి మాటలు కవుల ప్రయోగాల్లో కనిపిస్తాయి. అతని పరిస్థితి ఇప్పుడు మంట చెంతకు చేరిన మిడతలాగ మారింది అంటున్నాడు వేమన.

దీపం చుట్టు మిడతలే కాక దీపం పురుగులూ చేరుతాయి. పర్షియన్ సాహిత్యంలో ఇదో ప్రసిద్ధ కవి సమయం. సుందరిని వరించిన ప్రియుడు షమా (దీపం) చుట్టూ చేరిన పర్వానా (దీపం పురుగు) లాంటివాడు అని.

**కూడదేమి జేసె కులమేమి జేసెను**
**భూమి యేమి జేసె బొందికట్టె**
**నరుడు పడెడు పాట్లు నగుబాట్లు చూడగా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కర్మలు నశించాలంటే ఉపవాసంతో శరీరాన్ని కృశింప జేయాలా? కులం కర్మవశాన ఏర్పడిందా? స్థలప్రమేయముందా? దేహం కోసం మనిషి పడే కష్టాలు చూస్తుంటే నవ్వు రాకుండా వుంటుందా?

కూడు + అదేమి; బొందికట్టె = బొందికి+అట్టె; అంటే శరీరం కొరకు. వాడుక భాషలో సంధులు ఇలా వుంటాయి.

తత్త్వ దృష్టి ఉండాలి గాని శరీరాన్ని క్లేశానికి గురిచేసినంత మాత్రాన మోక్షం రాదని తాత్పర్యం.

కూడు అంటే అన్నం, వండినదాన్ని కూడు అంటారు. బొంది అంటే మానవదేహం. నగుబాటు అంటే పరిహాసాస్పదం.

**కూడు వడ్డికిచ్చి కూర్మితోడుత గంజి**
**తాగునట్టి వోగు తారమైన**
**పేదసాదలకును పెండ్లికి యిచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

వ్యవసాయ సంస్కృతిలోనికి మెల్లమెల్లగా వ్యాపార వాతావరణం ప్రవేశిస్తున్న రోజులవి. స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ పగుళ్లు వారుతున్న తొలిదశ. గ్రామ సమష్టి జీవనంలోని సత్యకాలం క్రమంగా పోతున్నది. ఈవి (దానధర్మాలు) నశించిన లేమి రోజుల్లో గడవని వారికి అప్పులే శరణ్యమైనాయి. ఆ అప్పులు కూడా అందరికి లభించేవి కావు. ('పరగలేమి చేత పరపతి తప్పురా' అన్నాడు మరోచోట) మధ్యయుగంలో ఉన్న అప్పులు, వడ్డీలు ఎంత దారుణంగా వుండేవో, హిందువుల ఆచారాలు, పండుగలు' అనే గ్రంథంలో అబేదుబాయ్ అనే ఫ్రెంచి మత గురువు విపులంగా వర్ణించాడు.

చిత్రమేమిటంటే కలిగినవారే కాక కడుపు కట్టుకొని వడ్డికిచ్చే పేదలు కూడా తయారైనారు, తినబోయే కూడును వడికిచ్చుకొని గంజిమీద మమకారం పెంచుకొనే వాడు మూర్ఖుడు. అటువంటి వాడు పేదలకు పెండ్లిలాంటి మంచి కార్యాలకు కూడా సాయం చెయ్యడు. ఓగు అంటే కీడు అని అర్థం. మూర్ఖుడనే అర్థంలో వాడాడు వేమన.

తారం అంటే నాలుగు కాసుల వెండి నాణెం. అతి తక్కువ విలువ గల చిన్న రాగినాణెం. బహుశా ఇప్పటి పైస వంటిది కావొచ్చును. 'కాసు తీర్చలేక మోసపోరె' 'చేతి కాసులెల్ల చేరదీసు' అని వేమన్న వాడాడు. కాసు, తారం విజయనగర కాలంలో వాడుకలో వుండేవి.

**కూలి నాలి జేసి  గుల్లాము పని జేసి**
**తెచ్చి పెట్ట నాలు మెచ్చు నేర్చు**
**లేమి జిక్కు విభుని వేమారు తిట్టును**
**విశ్వదాభిరామ  వినురవేమ.**

దరిద్రంతో విసిగిపోయిన వాడి ఆక్రోశం ఈ పద్యంలో వుంది.

నువ్వు ఏం చేశావనేది కాదు ముఖ్యం. తక్కువ ప్రతిఫలానికి కాయకష్టమన్నా చెయ్యి, లేదా ఒకడికి దాసుడిగా నైనా వుండు ఏం చేసినా ఆ వచ్చిన డబ్బేదో భార్య చేతిలో పెట్టు. ఆమె మెచ్చుకుంటుంది. ఇవేవీ లేక అలసత్వం వల్లనో, అనివార్య దారిద్ర్యం వల్లనో దైన్యానికి చిక్కావా ఇక చూసుకో ఆమె నిన్ను తిట్టని తిట్టు ఉండదు.

ఇది ఆనాటి లోకరీతి. సంపాదించిపెట్ట లేని భర్తను ఏ భార్యా గౌరవించదు. ఈనాడు కూడా భార్యాభర్తల మధ్య చిచ్చుపెట్టేది ప్రధానంగా డబ్బే. నా చిన్నతనంలో పల్లెలో ఆలుమగలు పెద్దగా అరుచుకుంటుంటే లోకులు 'ఎందుకలా?' అని ప్రశ్నిస్తే 'ఎల్లక' అని సమాధానం, అంటే వెళ్లక అంటే గడవక అని. గడవకపోవటానికి అనేక కారణాలు. ఇది అప్పటిదే కాదు ఇప్పటి లోకరీతి కూడా.

కూలి అంటే రోజువారీ పనికి లభించే వేతనం. కూలినాలిలో నాలి అంటే కొంచెమని. కూలి అంటే జీతం కాదన్నమాట. 'కూలికి నూనెలం'ట అని ప్రయోగం. కూలియాలు అంటే వెలయాలు, సెక్స్‌వర్కర్.

గులాం అంటే బానిస. ఉచ్ఛారణలో ఘులామ్. ఇది పర్షియన్ మాట.

'ఇత్తడి పుత్తడి యగునే/తొత్తుకు నగలెన్ని యిడిన దొరసానగునే / యుత్తమ కులుడౌనా దౌ/లత్తుకు సరిజేరినను గులాముగులామే' (అడిదము సూరకవి చాటువు).

లేమి అంటే లేకపోవడం, పేదరికం. విభుడు అంటే యజమాని, బలవంతుడు, ఘనుడు, శివుడు, బ్రహ్మ. ఇక్కడ భర్త.

అశక్తుడైన భర్తను చూసి భార్య పనికిమాలిన వాడంటుంది. కష్టసుఖాల్లో పాలు పంచుకోవాల్సిన భార్య అలా అనడం భావ్యమా అంటే 'ఎల్లక' అనేది సమాధానం.

'గుల్లాపు పాటడి; చిక్కుపడ్డనాడు చీకాకు పరచురా' (డి.1723-38) 'కూలినాలి జేసి గుల్లపంచలబడి/తెచ్చి పెట్ట మెచ్చు దేవురాలు / చిక్కుపడ్డ వెనుక చీయని రోయునో (డి.1769-670) అనేవి పాఠాంతరాలు.

**కూళ కూళ మెచ్చు గుణవంతు విడనాడి**
**ఎట్టివారు మెత్తురట్టివాని**
**మ్రాను దూలములకు జ్ఞానంబు తెలుపునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒక చెడ్డవాడూ మంచివాడూ ఉన్నారనుకోండి. వారిద్దరిలో ఒకరిని ఎంచుకొమ్మంటే చెడ్డవాడు చెడ్డవాన్నే ఎంచుకుంటాడు. మంచివాన్ని వదిలేస్తాడు. అంటే ఎటువంటి వారైనా తమలాంటివారినే ఇష్టపడతారు, పైగా మెచ్చుకుంటారు. ఇదెట్లా ఉంటుందంటే చెట్టు తనలోని భాగమైన దూలానికి తన గుణాన్నే ఇస్తుంది గాని, అదనంగా జ్ఞానాన్ని ప్రసాదించలేదు కదా! అంటున్నాడు వేమన.

'స్వభావోదురతిక్రమః' అంటారు. అంటే ఎవరూ తమ సహజగుణానికి విరుద్ధంగా ప్రవర్తించరు అని. కూళ అంటే నీచుడు, మూఢుడు, అవివేకి, దుర్జనుడు అని అర్థాలు. ఇది దేశీయపదం. కన్నడంలో కూడ కూళ, తమిళంలో కూళై. వేమన్నే మరోచోట

*తలకునెరలు వచ్చి తనువెంత వడలిన*
*కూళ విటుడు యువతి కూడుటెల్ల*
*పండ్లు వడ్డ కుక్క పసరము చీకదా!* అన్నాడు

ఇంటిగోడలపై అడ్డంగా వేసే కట్టె. లేదా ఇంటికి కప్పు వేసేటప్పుడు వాసాలకు ఆధారంగా వేసే దొడ్డు కట్టెను దూలమంటారు. చెట్టుకుగానీ దూలానికిగాని కట్టెతనం సమానం, అంతవరకే పోలికను తీసుకుంటే దృష్టాంతం కుదురుతుంది.

నువ్వు సజ్జనుడివై ఎదుటి సజ్జనున్ని ఆదరించటం మంచిది అని వేమన్న సారాంశం. 'పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా (డి.1723-167)' అనేది.

**కొండరేడు మామ కొండకూతురు ఆలు**
**కొండయిల్లు పసిడి కొండవిల్లు**
**కొండవంటి దొరవు కుంటెన నడతురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓ శివా! నీ మామ అంటావా పర్వతరాజైన హిమవంతుడు; నీ భార్య అంటావా హిమవత్పర్వత పుత్రి అయిన పార్వతి; నీ నివాసమంటావా అది కైలాస పర్వతం, నువ్వు బాణాలు ఎక్కుపెట్టే ధనుస్సు అంటావా అది బంగారుదైన మేరుపర్వతం. ఇన్ని రకాల కొండ సంబంధాలతో నువ్వే ఓ కొండంత గొప్పదైవానివి, అట్లాంటిది నువ్వు తార్పుడు పనికి పాల్పడ్డావేం అని అవహేళన చేస్తున్నాడు వేమన.

రసవత్తరమైన ఎగతాళిలో వేమనకు ఎవరూ సాటిరారు. ఆయన వ్యంగ్యశైలి పరమ ఆహ్లాదకరం, చమత్కార జనకం.

నువ్వు గొప్పవాడివే, మహిమాన్వితుడివే, కొండలా నిశ్చలుడివే, లింగ స్వరూపుడివే కాని దైవబలాన్ని తప్పించుకోవడం నీకూ సాధ్యం కాలేదు. ఆఖరికి నీపని నాయికా నాయకుల మధ్య దౌత్యం నెరిపే స్థాయికి దిగజారింది. దాసుడివైపోయావు. ఏమిటీ వైపరీత్యం అంటున్నాడు వేమన.

కుంటెన అంటే ప్రేమికులను కూర్చే పని. పురుషుడైతే కుంటెన కాడు, స్త్రీ అయితే కుంటెనకత్తె.

శివుని అవతార గాథలకు సంబంధించిన వృత్తాంతాల ఆధారంగా ఈ పద్యం పుట్టింది. బసవ పురాణం, సానందోపాఖ్యానంలో, ఇట్లాంటి జంగమ కథలున్నాయి. భల్లాణ చరిత్రలో భక్తులు యజమానులైతే శివుడు వారి దాసుడుగా చిత్రించబడ్డాడు. కుంటెన కాడుగా కూడ. *"కుంటెన నిన్నంపె గోర్కినొకడు; మనసిజుడిద్దరకును గుంటెన కానితనంబు చేసెడింగను గొనగన్"* శివుడికీ గతి ఎందుకు పట్టిందంటే శివుడు భక్తజన సులభుడు, భక్తాభీష్ట ప్రదాయకుడు, బోళాశంకరుడు. భక్తులకోసం దేన్నైనా ఆచరించే గొప్ప దైవం శివుడు. ఒకరకంగా అవహేళన ద్వారా శివుడి ప్రశంసనే ధ్వనిస్తున్నాడు వేమన. వ్యాజనిందాస్తుతి అంటారు దీన్ని.

'*కొండవంటి దొరయుకుంటెన నడుచునా*' (డి.1723–878) అనేది పాఠాంతరం.

**కొండెగాడు చావ కొంపదనుకబోవు**
**వంతుకింతెగాని వగపు లేదు**
**కొంకినక్కచావ గొ[్రె లేమిటి కేడ్చు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొండ్యాలు చెప్పేవాడు చచ్చిపోతే ఎవరూ దుఃఖించరు. మహా అయితే ఇంటిదాకా వెళ్లి శవాన్ని చూసి వస్తారు. అది కూడా లోకరీతి కోసమే తప్ప మనస్ఫూర్తిగా కాదు. కుటిల మనస్సుగల నక్క చస్తే గొ[్రె లెక్కడన్నా ఏడుస్తాయా?!

లోకులు గొప్పవాడు మరణిస్తే బాధపడతారు గాని మోసగాడు, ఇతరులకు హానిచేసేవాడు చచ్చిపోతే చలించరని సారాంశం.

కొండెకాడు అంటే లేని నేరాలను కల్పించి చెప్పేవాడు. కొండ్యాలు అంటే చాడీలు. వంతు అంటే భాగం వరుస అని అర్థాలు. కాని లోకం కోసం తప్పనిసరై వెళ్లటం అనే. వగపు అంటే విచారం, దుఃఖం అని అర్థాలు. కొంకనక్క అంటే భయపడే నక్క. కొంక కొంకు నుంచి వచ్చిందని బ్రౌన్ అభిప్రాయం. కొంకు అంటే జంకు. 'జంకు గొంకు'ల్లోని కొంకు ఇదే. భయపడే నక్క అంటే ఇక్కడెలా పొసగుతుంది? 'కొంకి' అనే పాఠాంతరాన్ని కొందరు ముందుకు తెచ్చారు. కొంకి అంటే కుటిలమైన వక్రమైన అని అర్థాలు. పద్యవాతావరణంలో ఈ అర్థం సరిపోతుంది.

**కొంత నల్లగుండు కొంత ఎఱ్ఱగనుండు**
**కొంత తెల్లగుండు కుతలమెరుగ**
**ఒక్కరీతి నుండ నొగి కారణంబేమి?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆలోచించి చూస్తే ఈ ప్రపంచం మూడు రంగుల్లో కనిపిస్తుంది. కొంత నల్లగా, కొంత ఎఱ్ఱగా, కొంత తెల్లగా. మరి మూడు రంగులూ ఒక్కటిగా కనిపిస్తున్నాయేమిటి? కారణం తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

పైన చెప్పిన మూడురంగులను సత్త్వరజస్తమో గుణాలకు ప్రతీకలుగా సూచిస్తున్నాడు వేమన. నలుపు తమోగుణానికీ, ఎరుపు రజోగుణానికీ తెలుపు సత్త్వగుణానికీ చిహ్నాలు. నాలుగోగుణం కూడా ఉందని తత్వజ్ఞులు చెప్తారు. అదే శుద్ధసత్త్వం. సిద్ధి పొందిన వాడు, బ్రహ్మసాక్షాత్కారం పొందినవాడు చేరుకునే దశ అది అక్కడ. బ్రహ్మం తప్ప మరేమీ ఉండదు. ఏకమేవా ద్వితీయమ్ బ్రహ్మ. అంటే ఉన్నది బ్రహ్మమొక్కటే రెండోది లేదు అని అర్థం. దీనిని అద్వైతాన్ని గురించి చెప్పే మహావాక్యమని కూడా అంటారు.

శుద్ధసత్త్వంలో జీవుని వాసన ఉండదు. శుద్ధలౌకికంలో రంగులుంటాయి. నిజానికి ఇవి ఆభాసాలు. ఒకరకంగా ఇది జీవుని స్వప్నావస్థ.

స్థూలంగా సత్త్వరజస్తమో గుణాలను గురించి తెలుసుకుందాం. సత్త్వం పూర్ణమైన శాంత వృత్తి కలిగినట్టిది. రజస్సుకు దృశ్యాదృశ్యాల పట్ల ఆసక్తి వుంటుంది. కర్మాచరణానికి ప్రేరేపించి దానిలో జీవున్ని బంధించేగుణం రజస్సుది. ఇక తమోగుణం, ఇది నిజంగా చీకటే. క్రియాహీనత, అజ్ఞానం, లాలస, మతిమరుపు, నిద్ర, మాంద్యం ఇవన్నీ తమోగుణాలు. త్రిగుణాలను పోగొట్టుకొని నిర్వికారమైన, చైతన్య రూపమైన, విశ్వసృష్టికి కారణమైన, బిందురూపంలోని పరమాత్మను తెలుసుకున్నప్పుడు అంతా ఒకే రంగులో ఉంటుందనేది వేమన్న సారాంశం.

కుతలం అంటే భూమి, ప్రపంచం అని అర్థం. "కుతలములోనైన దానితో సరిలేరు" అని ప్రయోగం. అతలాకుతలముగా అంటే తలకిందులుగా అని. బ్రౌన్ అన్నట్టు 'ఒగి' అనేది పాదపూరణం కాదు. ఇక్కడ క్రమమైన లేదా నిజమైన అని అర్థం.

**కొమ్మదిమ్మరైన దిమ్మరులనె వలచు**
**సరసవిటుల కేల సమ్మతించు**
**పేడదిన్న పురుగు బెల్లమే మెరుగురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

వివిధ ప్రదేశాలు తిరుగనేర్చిన యువతి అటువంటి సహయాత్రికులనే కోరుకుంటుంది గాని ఫలానా వాడు అభిరుచి శేఖరుడు వాడితో సరసం చేద్దాం అని అనుకోదు. పేడ తినటానికి అలవాటుపడ్డ పురుగులకు బెల్లం రుచి సయిస్తుందా అంటున్నాడు వేమన.

ఈ పద్యం ఒక విటుడి మనోరథం అయివుండవచ్చు. ఎప్పుడూ ఎవడెవడి తోనో తిరుగుతుంది నా వైపు కన్నెత్తి చూడదేం అనే అక్రోశం కూడా కావొచ్చు. దిమ్మరి అయితే నదిలాగ రోజుకో కొత్త ప్రదేశం చూపిస్తాడు. వీడిదేముంది సరస్సు లాగ ఒకేచోట పడివుంటాడు అని ఆమె అనుకొని ఉండొచ్చు. ఏది ఏమైనా మూడోపాదంలో అభిరుచీ, అవసరానికీ సంబంధించిన చక్కటి పోలికను పొదిగాడు ఈ పద్యంలో వేమన.

కొమ్మ అంటే చెట్టుకొమ్మ, స్త్రీ అని కూడా. స్త్రీని కొమ్మ అని ఎందుకంటారు? కొమ్మ అంటే చిగురు. చిగురు కలది కాబట్టి కొమ్మ. మరి ఈ కొమ్మ? కొమరు అంటే అందం, యౌవనం కూడా. కొమరుకలది కాబట్టి కొమ్మ అయివుంటుంది.

దిమ్మరి అంటే స్వైరిణి, ఇష్టం వచ్చిన చోట్లల్లా తిరిగేది. ద్రిమ్మరి, త్రిమ్మరి అని కూడా రూపాలు. త్రిమ్మరుట అంటే సంచరించడం.

*"అమ్ముది తగునుపాయము*
*పొమ్మనపుడు నూరు వెడలి పోయి నిజేచ్ఛన్*
*ద్రిమ్మరు తెరుగున తత్సతి*
*ద్రిమ్మరి యని యెల్లవారు తెగడెడునటుగాన్"* అని ప్రయోగం.

విటుడు అంటే జారపురుషుడు. వేమన ఉద్దేశించినవాడు విటరాయుడు అయివుంటాడు. అంటే విటశ్రేష్టుడు. పల్లవిక శిఖామణి.

ఆమె చంచల, విషయ లాలస, పైగా తిరుగుబోతు. ఆమె అలాంటివారినే కామిస్తుంది, సరసత్వంతో పనిలేదు. ఆమె అలవాటే ఆమెకు ఇష్టం. పేడ తినటానికి అలవాటుపడ్డ పురుగులు తియ్యని బెల్లాన్ని తింటాయా అని వేమన వెక్కిరింత. వాటిని పేడపురుగులనే అంటారు. Dung beetles అంటారు ఇంగ్లీషులో.

'పెండదిన్న పురుగు బెల్లమే మెరుగురా' (డి.1773-74) అనేది పాఠాంతరం.

**కోపమునను ఘనత కొంచెమై పోవును**
**కోపమునను మిగుల గోడు చెందు**
**కోపమడచె నేని కోరిక లీడేరు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'తనకోపమె తన శత్రువు' అన్నాడు సుమతి శతకకారుడు. శత్రువు ఏం చేస్తాడు? నష్టపరుస్తాడు, హాని కలిగిస్తాడు. కోపమూ అంతే కోపించినవాడినే నష్టపరుస్తుంది. ఎట్లా?

కోపం వల్ల నీ గౌరవం తక్కువై పోతుంది అంటే దిగిపోతుంది. కోపం వల్ల నీకే అమితమైన బాధ కలుగుతుంది. అందుకే మరి! కోపాన్ని అణచుకున్నావా ఆ కాస్త ఓపికతో నీ కోరికలన్నీ నెరవేరుతాయి.

అసలు కోపం అంటే ఏమిటి? ఎందుకు కలుగుతుంది? కోపం అంటే కోరిక తీరకపోవటం వల్ల కలిగే చిత్తవృత్తి. అనుకున్నది అనుకున్నట్టు జరగకపోతే కూడా కోపం వస్తుంది. అతడు కుపితుడవుతాడు అంటే కోపించిన వాడవుతాడు.

కోపం వల్ల ఆధిక్యం అల్పత్వంగా పరిణమిస్తుంది. ఘనత అంటే గొప్పతనం, ఉదాత్తత ఒక్కక్షణంలో ఎదుటివారిదృష్టిలో ఇవన్నీ కొట్టుకపోతాయి. గోడు అంటే? దుఃఖం, పీడ, బాధ, ఏడ్చేటప్పుడు కలిగే ధ్వని. గోడు గోడున ఏడ్చారంటారు అందుకే. గోడు అంటే సన్నదనం, అల్పత్వం, న్యూనపడటం అనే అర్థాలు కూడా వున్నాయి. అలాగే, 'కోరిక లేడేరు'; ఈడేరు అంటే నెరవేరటం, పొందటం, తీరటం, పండటం అని అర్థాలు.

పట్టుదలకు పోకు, ఓపికపట్టు, తీరలేదనుకున్న కోరికలు తీరిపోవచ్చు.

కొందరికి ఓ పట్టాన కోపం రాదు. వస్తే ప్రళయమే. 'అలుగటయే ఎరుంగని మహా మహితాత్ముడజాత శత్రువే అలిగిననాడు సాగరము లన్నియు ఏకముగాక పోవునే' అని భారతంలో.

కోపం రెండు రకాలు. ఆగ్రహం, ధర్మాగ్రహం అని, ఆగ్రహంలో స్వార్థముంది. అది తనకే చేటు చేస్తుంది. ధర్మాగ్రహంలో పరార్థముంది. అది ఒక శక్తిగా ఆవిర్భవిస్తుంది. వేమనది ధర్మాగ్రహమే అందుకే అతని మాటల్లో అంతటి తేజస్సు.

**గంగపారుచుండు కదలని గతితోడ**
**మురికి పారుచుండు మోతతోడ**
**దాతయోర్చినటులధముడోర్వగా లేడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నిండుగా విశాలంగా పారేనది హుందాగా గమనం తెలియకుండా సాగిపోతుంది. ఇరుకు కాలువలో ప్రవహించే కుళ్లు నీళ్లు చప్పుడు చేసుకుంటూ పరుగెడుతాయి. అలాగే దానగుణ సంపన్నుడు కూడా. హుందాగా వుంటాడు. అల్పుడికే ఆర్భాటమెక్కువ.

గంగ అంటే నీరు. శుభ్రమైన నీరు. 'పచ్చి గంగ కూడా ముట్టలేదు' అని సామెత. గంగ అంటే గంగానది అనేది జగత్ప్రసిద్ధం. గంగ ప్రవహించినంతమేరా భూమిని సస్యశ్యామలం చేస్తుంది. ప్రాణికోటికి తిండి పెడుతుంది.

మరి మురికినీరు? వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. రోగాలకు కారణభూత మౌతుంది. పైగా మోత.

కదలని గతి తోడ అంటే పెద్దనది పారుతున్నా కంటికి కదలనట్టే కనపడుతుంది. ఒక్కోసారి ఎటువైపు పారుతుందో కూడ తెలియదు.

దాత అంటే ఇచ్చేవాడు. పరోపకారి. అతని వ్యక్తిత్వంలో హడావిడి లేదు. అధముడికి సహనం లేదు. దేన్నీ ఓర్చుకోలేడు. "పరుల కలిమికి పొర్లి ఏడ్చే పాపికెక్కడ సుఖము కద్దోయ్" అన్నాడు గురజాడ.

*'అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది. ఏమీ లేని అకు ఎగిరెగిరి పడుతుంది'* అని సామెత. 'ఒట్టి గొడ్డుకు అరుపు లెక్కువ' అని పల్లెల్లో వాడే మరో సామెతకు ఇదే అర్థం.

**గంగిగోవుపాలు గంటెడైనను చాలు**
**కడివెడైన నేమి ఖరము పాలు**
**భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సాధువైన ఆవుపాలు ఇంత గరిటెడే కావొచ్చు కాని అంత పెద్దకుండలో నింపినా గాడిద పాలు వాటికి సాటివస్తాయా? భక్తిభావంతో పెట్టిన అన్నం చేతినిండ పెట్టినా కడుపునిండ పెట్టినట్టే. గంగి అంటే సాధువైన అని అర్థం. గోవు అంటే ఆవు. గంగికుట్టి అని కూడా అంటారు, గంగిరెద్దు కాదు. అది వేరు. చిరుగంటల్తో అలంకరించి ఇళ్లముందు ఆడించి బిచ్చమడుక్కుంటారు. ఖరము అంటే గాడిద, కంచరగాడిద కూడ. పట్టెడు అంటే చేతిలో పట్టేంత. భక్తి అంటే ప్రేమ, శ్రద్ధ. 'పూజ్యేష్వనురాగోభక్తిః' అంటే పూజింపదగిన వారి విషయంలో చూపే అనురాగమన్నమాట. 'భావము నందు బాహ్యమునందు' అన్నాడు అన్నమాచార్యులు. ఇష్టమైన భావంతో పెట్టినప్పుడు అది కొంచెమైనా సమృద్ధిగా పెట్టినట్టే. స్వీకరించిన వాడికది సంతృప్తిని కలిగిస్తుంది.

ఆకలితో ఉన్నవాడికి ఆదరంగా పెట్టేది కొంచెమైనా అది షడ్రసోపేతమైన భోజనంతో సమానం, ఎంత పెట్టావని కాదు ఎంత నిస్సంకోచంగా పెట్టావనేది ముఖ్యం అంటున్నాడు వేమన. కస్సుబుస్సులతో కడుపునిండా పెడితే చాలదు. మనసుకూడా నిండాలి. అందుకే 'కూడు' అంటున్నాడు వేమన. పంచభక్ష్య పరమాన్నాలు కాకున్నా ఫరవాలేదు అని భావం.

వేమన్న నాటికే సమష్టి గ్రామీణ వ్యవస్థలో పల్లెకు బయటివారెవరైనా వస్తే తిండిపెట్టే రోజులు అంతరిస్తున్నాయి. *"ఆకలి గొనివచ్చినపుడు పరదేశికి /పట్టెడన్నమైన పెట్టలేడు"* అన్నాడు వేమనే మరో సందర్భంలో. వ్యాపార వ్యవస్థ ప్రబలమైన నేటికాలం సంగతి చెప్పనే అక్కర్లేదు. ఎవరికి వారే అయినారు. 'గాడ్దెపాలు' అనే పాఠం ఒక్క ప్రతిలోనే కనిపిస్తుంది (డి 1725, 701) దీనికన్న ఖరమే బాగుంది.

**గండికోటలోన కత్తి పట్టినయంత**
**రాజుగాని దొడ్డరౌతుగాడు**
**ఎంతవారినైన నెత్తిన గొట్టునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అది గండికోటేకావచ్చు. కాని దానిని పాలించేరాజు శూరుడు కావాలి గదా! అతడు ఆక్రమణ వశంగా వచ్చిన రాజమాత్రుడు. అతడు లాంఛనంగా ఖడ్గధారి అయినంత మాత్రాన గొప్ప ఆశ్వికుడు కాగలడా? బలవంతులు దండెత్తి వస్తే కత్తిలేపుతాడేమో కాని వారిని జయించగలడా? జయించలేడు అని తాత్పర్యం.

గండికోట వేమన కాలానికి విజయనగర రాజ్యం నుండి చేజారి మీర్‌జుమ్లా (1687 వరకు) పాలనలోనికి వచ్చి వుంటుంది. ఇది చాలా బలమైన కోట. చాళుక్యులు కట్టి ఉంటారని వాడుక. సాక్ష్యాలు కాకతీయ కాలం నుంచి ఉన్నాయి. దీన్ని కాకతీయుల సామంతుడు అంబదేవుడు (13వ శతాబ్దం) పాలించాడు. తరువాత 1578 దాకా నంద్యాల ప్రభువులు 1622 నుండి పెమ్మసాని తిమ్మనాయుడు పరిపాలించారు. నాయుడికి గొప్ప వీరుడుగా పేరుంది. ఇతడు బాణం ప్రయోగిస్తే గుర్రం ఛాతిని చీల్చుకొని వెనకభాగం నుంచి బయటకొచ్చేదని చెప్పుకునేవారు. ఇతని తర్వాత గండికోట గోలకొండ నవాబుల కిందికి వెళ్లిపోయింది. బహుశా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ పద్యం పుట్టి వుంటుంది.

గండికోట ప్రస్తుతం కడపకు 74 కిలోమీటర్ల దూరంలో జమ్మలమడుగుకు 10 కిలోమీటర్ల సమీపంలో ఉంది. ఇక్కడ పెన్నానది ఓ కొండను చీలుస్తూ ప్రవహిస్తుంది. గండిలోంచి ప్రవహిస్తుందన్నమాట. అందుకే గండికోట అనే పేరు వచ్చిందని ఐతిహ్యం. “గండికోటలోన కస్తూరి మృగముండు/రాజుగాడు, గొప్పరౌతుగాడు” అనేది పాఠాంతరం.

**గతము చేసినట్టి కర్మబంధములన్ని**
**పరిసిపోవు సత్యగురుని వలన**
**కుమ్మరి కొక యేడు గుదియకు నొకనాడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇన్నాళ్లూ అతడెన్నో పనులు చేశాడు. వాటితో మమకారాలు పెంచుకొని సతమతమౌతున్నాడు. ఇప్పుడు వాటిని వదుల్చుకోవలసిన సమయమాసన్నమైంది. కాని సుదీర్ఘకాలంగా ఏర్పరచుకున్న బంధాలు అంత తేలిగ్గా వదుల్తాయా? ఎందుకు వదలవు సత్యసాక్షాత్కారం గావించే సద్గురుడు దొరికితే!? యేడాది పొడుగునా కుమ్మరి తీర్చిదిద్దిన మట్టిపాత్రలు ఒక్క దుడ్డుకర్ర దెబ్బతో పగిలిపోవా? ఇదీ అంతే అంటున్నాడు వేమన.

కర్మబంధాలు అంటే చేసిన పనులపట్ల పెనవేసుకున్న మమతల శృంఖలలు. వాటిని తెంచుకోవడం అంత సులభం కాదు. కాని వైరాగ్యశోభితుడైన గురు పుంగవుడు ఆ కర్మల అశాశ్వతత్వాన్ని గురించి బోధిస్తే ఆ సంకెళ్లు పరిసిపోతాయి. అంటే నశించిపోతాయి. తెగిపోతాయన్నమాట!

20వ శతాబ్దంలో పరాయీకరణ (Alianation) అనే ఓ తాత్త్విక భావన. ఇటీవల బాగా ప్రచారంలోకి వచ్చింది. మనిషికి తాను తయారు చేసిన వస్తువుతో సహజమైన, సజీవమైన సంబంధం తెగిపోయినప్పుడు దానితో తనకు పరాయితనం వస్తుంది. నిరాశ జనిస్తుంది. ఫ్రెంచి తాత్త్వికుడు రూసో (1712-78) దీనిని ప్రతిపాదించాడు. మన ప్రాచీన వైరాగ్య శతకాల్లో కూడా ఈ పరాయీకరణ కనిపిస్తుంది. నరసింహ శతకమంతా ఇదే. "*అంతా సంశయమే, శరీర ఘటనంబంతా విచారంబె, లోనంతా దుఃఖ పరంపరార్జితమె*" అన్నాడు ధూర్జటి. గుదియ అంటే బడితె, కొట్టడానికి వాడే కట్టె.

బంధాలవల్ల దుఃఖంతప్ప మరేమీ లేదు. తెలిసి తెలిసీ వాటిని మరింత దృఢపరుచుకోవడం వల్ల సుఖం లేదు తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

'*గుడియకు నొకనాడు*' (డి.1770-4) అనేది పాఠాంతరం. గుడి అంటే చుట్టు. "కుమ్మరి *సారె గుడి దిరుగుకొనెడి విధమునన్*" అనేది ప్రయోగం, కాని ఈ అర్థం ఇక్కడ పొసగదు.

**గతము జూతమంటె కలగన్నయర్థంబు**
**నడుచుకాలమేమి నమ్మగాదు**
**క్షణములోని బ్రతుకు సంసార విభ్రాంతి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆలోచించిచూస్తే గడిచిపోయిన కాలం ఒక కలలోని ధనంలా మాయమైపోతుంది. నడుస్తున్న వర్తమానం స్థిరంగా బోధపడదు. సంసారం వల్ల కలిగే భ్రమ ఉందే ఇది క్షణకాలమే. కాబట్టి పరాన్ని నమ్ముకో అని వేమన్న ప్రబోధం.

గతం స్వప్నంలాంటిది. అదిప్పుడు సత్యం కాదు. కరిగిపోతుంది. అనవరతం మారుతున్న వర్తమానం పై ఆధారపడి ఏ నిర్ణయమూ చెయ్యలేము. భవిష్యత్తు గురించి అసలే తెలియదు. భవిష్యత్తు గురించి వేమన్న వాచ్యంగా చెప్పలేదు గాని అది ధ్వని.

అర్థం అంటే అభిప్రాయం, ధనం, వస్తువు అనే అర్థాలున్నాయి. ధనంతోపాటు ఇక్కడ 'కలగన్న' చందాన అని కూడా చెప్పుకోవచ్చు. 'అతడు రెండర్థాలుగా చెడిపోయాడు' అంటే రెండు రకాలుగా అని అర్థం.

సంసారం అంటే ప్రపంచం, కుటుంబం అని అర్థాలు. పెండ్లాం బిడ్డలతో కూడినది సంసారం. సంసార తాపత్రయంతో నిండి వుంటుంది. తాపత్రయం అంటే మూడు తాపాలు. వీటిని ఈషణత్రయం అని కూడా అంటారు. అవి ధనేషణ, దారేషణ, పుత్రేషణ. ఈ సంసారం మనకు అర్థమయ్యిందనుకోవడం కేవలం భ్రమ.

*అనాదా విహసంసారే, దుర్వారే మకరధ్వజే ।*
*కులే చ కామినీ మూలే కా జాతి పరికల్పనా ॥*

(ఈ జగత్తు సృష్టి లేదా సంసారం అనాది నుంచి ఉన్నది. అది మన్మథుని శక్తి నివారించడానికి శక్యమైంది కాదు. కాబట్టి వర్ణభేదం స్త్రీ పైనే ఆధారపడి వుంటుంది. అటువంటప్పుడు జాతిని ఎలా నిర్ణయిస్తావు) కాబట్టి సంసారంలో స్పష్టత లేదు.

విభ్రాంతి అంటే భ్రమ, ఆతురత. సంసార విభ్రాంతి అంటే సంసారం వల్ల కలిగే తొందరపాటు కారణంగా ఏర్పడిన భ్రమ.

ఉమర్‌ఖయ్యాం "గతంబు గతంబె, భవిష్యత్తు సంశయాంధవృతం, వర్తమానమొక్కటే అనుభావ్యంబు" (పానశాల–దువ్వూరి రామిరెడ్డి) అన్నాడు. వేమన్న వర్తమానం భ్రమ అంటున్నాడు. సందిగ్ధభరితమైన వర్తమానం అనుభావ్యం కాదని సారాంశం. రెండు రకాల తత్త్వాల్లో ఎంత తేడా వుందో గమనించండి. మొదటిదానిలో పరలోకచింతన లేదు. రెండోదానికి అదే పరమం.

**గాజు కుప్పెలోన కడగుచు దీపంబు**
**ఎట్టులుండు జ్ఞాన మట్టులుండు**
**తెలిసినట్టివారి దేహంబులందుల**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గాజు కుప్పెలో జ్యోతి ఎలా నిలకడగా వుంటుందో మనుష్యుల శరీరాల్లో జ్ఞానం అట్లాగే వెలుగుతుంది. శరీరాల్లో అంటే మనస్సుల్లో అనే. శరీరమూ మనసూ వేరుగా వుండవు కదా!

గాజుకుప్పె అంటే గాజుతో చేసిన దీపం వెలిగించే పాత్ర. దీని మెడ నిలువుగా వుంటుంది. విద్యుద్దీపాలు వచ్చి ఇప్పుడిలాంటివి మ్యూజియంలోకి వెళ్లిపోతున్నాయి. జడకుప్పెలు కూడా వుంటాయి. సవరానికి మొదట్లో గ్రంథిని జడకుప్పె అంటారు. 'కడగుచు దీపంబు' అంటున్నాడు వేమన. కడగుట అంటే యత్నించు, సాహసించు, అతిశయించు అనే అర్థాలున్నా ఇక్కడ నిలుచు, దృఢంగా వుండు, నిండుగా వుండు అనే అర్థాలు సరిపోతాయి. 'తెలిసినట్టి వారి' అంటే ఇది తెలివికి సంబంధించింది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలివికి వెలుగులోకి రావటం అనేది పిండితార్థం. ఇదికాక దీనికి అనేక ఛాయలున్నాయి. తెలివి అంటే జ్ఞానం, గ్రహణశక్తి, కాంతి, స్పృహరావటం, నిర్మలత్వం, అంగీకారం, నున్నదనం, సంతోషం, జాగ్రత్త మొదలైనవి. ఈ మాటల్ని పిల్లల్తో వాక్యాల్లో ప్రయోగించమంటే రకరకాల అర్థ విన్యాసాలు పుట్టుకొస్తాయి.

ఈ పద్యంలో వేమన జ్ఞానస్థైర్యాన్ని కడు రమ్యంగా వర్ణిస్తున్నాడు. దీపం బుడ్డికి గాజుబుగ్గను అమరుస్తారు. మనిషిలోని జ్ఞానం లేదా చైతన్యం దీపం లాంటిదే. ఈతిబాధల, వ్యామోహాల నిత్యజీవితంలో అవి ఏ క్షణంలోనైనా ఆరిపోవచ్చు. గుండెను చేతులు అడ్డుపెట్టి కాపాడుకోవాలి. ఇక్కడ 'దేహం' ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే మానసికారోగ్యానికి దేహస్వాస్థ్యం ముఖ్యం. రుజాగ్రస్తమైన శరీరంలో మానసిక చైతన్యం నిస్తేజమైపోతుంది. కాని ఎప్పటికీ ఆరిపోని జ్ఞానదీపం తాను నిలిచి వెలుగుతూ ఇతరులకు వెలుగునిస్తుంది. వేమన పద్యాలు కూడా జ్ఞాన దీపాల్లాంటివే.

**గాడ్దె మేను నిండ గంధంబు పూసిన**
**ఏమి ఎరుగలేక ఎగసి తన్ను**
**ఈడు కాని దాని కిష్ట మీలాగురా!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

గాడిదకు ఒంటినిండా చందనం పూసినా దాని సువాసనను ఆస్వాదించక వెనకకాళ్లపై లేచి ఒక్కతన్ను తంతుంది. అది దాని స్వభావం. దాని అసలు తత్వాన్నీ, ఇష్టాయిష్టాల్నీ తెలుసుకోకుండా గౌరవిస్తున్నామనుకుంటే ఇలాగే జరుగు తుందంటున్నాడు వేమన.

మూర్ఖుణ్ని ఎంత ఆదరించినా అది అతనికి సహ్యం కాదు. ఎవరికి ఏది స్వాభావికమో అదే వారికి సంతోషాన్ని కలిగిస్తుంది. స్వారస్యం తెలిసిన రసికులకు అందాల్సిన గంధలేపనం గాడిదకు పూస్తే దానికి చిర్రెత్తుక రాదా! తన్నటమే కాదు వెంటనే బూడిదలోనో బురదలోనో పొర్లాడతుంది. అది దాని మౌలిక గుణం. అలాగే మూర్ఖునికి ఎంత జ్ఞానసీతి బోధించినా ఎక్కదు అని సారాంశం. మేను అంటే శరీరం. మేనరికం అంటే స్త్రీకి తోడబుట్టిన వాని యొక్క అని అర్థం. ఇది మేను నుంచే వచ్చిందా ఆలోచించాలి. గంధం అంటే చందనాది లేపన ద్రవ్యం. వాసన, సువాసన అని కూడా. *'కట్టువర్గంబున గంధంబు నలది'* అని ప్రయోగం. కొత్తబట్టలకు పసుపుగాని, గంధంగాని పూస్తారు శుభంకోసం.

ఈడు అంటే సమానం. సరిపోయే వయస్సని. ఈడు రాలేదు అంటే పెళ్లిఈడు రాలేదని. మూడోపాదానికి పెళ్లీడు రాని అమ్మాయిపరంగా అర్థం చెప్పాడు బ్రౌన్. అదిక్కడ పొసగదు. ఇక్కడ ఈడు అంటే స్వారస్యమనే.

''*గాడిద మెయినిండ గంధంబు పూయగా* (డి. 1723–364); *ఈడుగాని ఇష్ట మేలాగు కీడయా* (డి. 1725–844); *గాడిద పెయి కడిగి గంధంబు పూసెనా*" (డి. 1769–814) అనేవి పాఠాంతరాలు.

**గాలి గాలి కలిసె గగనంబు గగనంబు**
**మన్ను మన్ను గలిసె మంట మంట**
**నీరు నీట గలిసె నిర్మలంబై యుండె**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ప్రాణం పోగానే పంచభూతాత్మకమైన శరీరంలోని పంచభూతాలు బయటి పంచభూతాల్లో కలిసిపోతాయి. ఎలా? గాలిగాలిలో కలిసిపోతుంది. ఆకాశం ఆకాశంలో కలుస్తుంది. అలాగే నిప్పులో నిప్పు, నీటిలో నీరు కలిసిపోతాయి. జీవుడు మాత్రమే నిర్మలంగా మిగిలిపోతాడు.

పంచభూతాలంటే భూమి, అగ్ని, జలం, వాయువు, ఆకాశం. శరీరం పంచభూతాలతోనే ఏర్పడింది. జీవం పోయినప్పుడు మళ్లీ పంచభూతాల్లోకి వెళ్లిపోతుంది. భూతం అంటే మూలవస్తువు, ప్రధాన ద్రవ్యం. పంచభూతాలు పుట్టిన చోటుకే మరలిపోతాయన్నమాట! ఎలా? ఏ భూతం ఆ భూతంలోకి. పాంచభౌతికమైన దేహం నశిస్తుంది గాని భౌతిక వాసనారహితమైన ఆత్మనశించదు. సూక్ష్మరూపంలో వుంటుంది. స్వచ్ఛంగా వెలుగుతుంది అంటున్నాడు వేమన. చనిపోయినవాడు జీవన్ముక్తిని పొందుతాడు. జన్మరాహిత్యాన్ని చేరుకుంటాడు అని సారాంశం.

చార్వాకుల మతంలో నాలుగే భూతాలు. భూమి, నీరు, అగ్ని, వాయువు అని. చైతన్యానికి కారణం ఇవే అని వారి ఉద్దేశం. మరి ఆకాశం ఏ దార్శనికుల కాలంలో వచ్చి చేరిందో చూడాలి. వేమన గగనాన్ని నమ్మాడు. గగనం అంటే ఆకాశం, శూన్యం అని అర్థాలు. గగనాన్ని వొట్టి శూన్యంగా కొట్టిపారెయ్యలేం. జీవకోటికి అదో గొప్ప ప్రయోగశాల. దుర్లభం అనే అర్థంలో గగనాన్ని వాడతారు గాని అది గహనమై వుంటుంది. ఆలోచించాలి. గగనకుసుమం అంటే అందనిదని. గగనరత్నం అంటే సూర్యుడు. బాగుంది కదూ!

పద్యరచనలో వేమన్న ఆటవెలది అందరిలాంటిది కాదు. చురుగా పద్యాన్ని నడిపించడంలో ఆయన దిట్ట. మంచి నడక వల్లనే పద్యం జిగేలుమంటుంది. సూర్య, ఇంద్ర గణాలు మాత్రాగణాలు, అక్షరగణాలు కాదు మాత్రాగణాల్లో గురులఘువులను మార్పుచేసే వీలుంది. అదే వెసులుబాటు అంటే. వేమన్న తరచుగా మొదటి పాదం చివరిగణంగా 'సలము' (IIUI) ను వాడతాడు. ఇది సగణానికి తర్వాత లఘువు చేరిస్తే ఏర్పడిందని మన ఛందోవేత్తలు చెప్తారు. సి.పి.బ్రౌన్ జగణానికి ముందు లఘువు చేరిస్తే

సలము ఏర్పడిందని భావించాడు. అందుకే దీనికి 'లజం' (IIUI) అని పేరు పెట్టాడు. ఒకరకంగా చదివితే దీనిలో జగణస్ఫూర్తిని సాధించవచ్చు. ఈ పద్యంలోని 'గగనంబు' అలాంటిదే. ఉన్న కాస్త పద్య చట్రంలో వేమన ఎంత క్లుప్తత సాధిస్తాడంటే 'గాలి గాలి గలిసె' అన్న తర్వాత 'గగనంబు గగనంబు గలిసె' అని అనడు. అనకున్నా అన్నట్టుగా ధ్వనిస్తుంది. అదీ వేమన ప్రత్యేకత.

'*జ్యోతి జ్యోతి గలసె జోడు వేమ*' (డి.1725, 168) '*జిడ్డు జిడ్డు గూడి జీవంబు లాయెరా* (డి.1723, 479) '*జీలు జీలు గూడి జీవాత్ముడాయెరా* (డి.1735, 479) అనేవి కొన్ని పాఠాంతరాలు.

గ్రాసమింతలేక కడు కష్టపడుచున్న
విద్యయేల నిలుచు వెడలుగాక
పచ్చికుండ నీళ్లు పట్టిన నిలుచునా
విశ్వదాభిరామ వినురవేమ.

కనీసం నోటికింత కూడు లేక ఎంతో బాధపడుతున్నవారిని చేతిలో వున్న విద్యలాంటి నైపుణ్యాలు ఆదుకుంటాయా? కుమ్మరి వాములో కాల్చని పచ్చికుండలో నీళ్లు నింపితే అది విచ్చుకపోయి దానిలో నీళ్లు నిలుస్తాయా?

గ్రాసం అంటే భోజనం కాదు. ప్రాణాలు నిలవడానికి కావలిసిన తిండి. మనుషులకే కాదు పశువులక్కూడ. కనీసం పశువులకు దొంగతనంగా ఎత్తుకొచ్చిన మేత కూడా లేదు. ఇక అదెంత కష్టమో ఆలోచించండి. ఇది సామాన్యంగా అందరూ అనుకునే కష్టం కాదు. బక్క రైతు కష్టం. కష్టానికి బాధ, హింస, సంకటం, పీడ, ఈతి అనే అర్థాలున్నా ఇక్కడ సన్నివేశమది కాదు. ఇక్కడ కష్టమంటే తెగులు, చీడ, పంటలకు దోమల బెడద.

ఇంత కష్టంలో ఉన్నవాడు తన ఇతర చేతి విద్యలను ఉపయోగించి పొట్ట పోసుకోవచ్చుగా? ఎంత సులభంగా అన్నారు? కులవృత్తులు దెబ్బ తింటుంటే ఇతరవృత్తులకు ఆశ్రయించవచ్చుగదా అని మేధావులు ప్రవచించినట్టు. విద్య అంటే ఈనాటి అర్థంలో కాదు. జ్ఞానం, భాష అనే సాధారణార్థాలు కాదు. శాస్త్రం, కళలు, గారడీలు కూడా చేతివిద్యల్లోనివే. కోటి విద్యలు కూటి కొరకే' అని అంటామే అవి.

భూమిని నమ్ముకొని దెబ్బతినడం వల్ల ఆ విద్యలు కూడా నైపుణ్యాన్ని కోల్పోయాయి. కష్టాల్లో కన్నీళ్లలో తడిసిన బతుకులు భట్టిలో కాల్చని కుమ్మరి కుండల్లా పచ్చివైపొయ్యాయి. వీటికి నీళ్లను నిలుపుకునే శక్తి లేనట్టే వాటికి విద్యాప్రదర్శన సామర్థ్యమూ తగ్గిపోయింది.

మేధావులు వృత్తుల్ని మార్చుకోమంటున్నారు. గోరటి వెంకన్న కూడా ప్రత్యామ్నాయం చూపమంటున్నాడు. రాజకీయనేతలు ఉన్న వృత్తులకు సాయం చేస్తామంటున్నారు. వీరికి వృత్తికారులంటే ఓటర్లే. ప్రతివారూ ప్రపంచీకరణ బూచిని చూపెడుతున్నారు. క్రమంగా దాని బండారం బయటపడుతున్నా అట్టడుగు జీవితాల్లోని అంతర్గత సంబంధాలపైన దృష్టి పెట్టటం లేదు.

వేమన్న నాటికీ, నేటికీ మౌలికాంశాల్లో మార్పులు వచ్చినట్టు కనపడదు.

**గుణయుతునకు మేలు గోరంత చేసినా**
**కొండయౌను వాని గుణము చేత**
**కొండ కొద్ది మేలు గుణహీను డెరుగునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మంచి స్వభావం కలవానికి ఏ కొంచెం సాయం చేసినా ఎంతో ఘనంగా గుర్తు పెట్టుకుంటాడు. అదే దుస్స్వభావికి ఎంత పెద్ద ఉపకారం చేసినా దాని విలువ తెలిసి వర్తించడు.

సజ్జనుడికీ, దుర్జనునికీ మధ్య తారతమ్యం తెలిపే పద్యమిది. గుణయుతుడు అంటే సద్గుణవంతుడు. గుణం అంటే వస్తుధర్మం. అంటే సహజ స్వభావం. నాణ్యం, ప్రవత్తి, శీలం అని కూడా. గుణం అంటే అల్లెత్రాడు, ఇక్కడ అప్రస్తుతం.

మేలు అంటే మంచి, లాభం, ప్రయోజనం, శుభం, క్షేమం అని అర్థాలు. మేలు చెయ్యడం అంటే సందర్భాన్ని బట్టి దయ చూపించడం. మేలెరుగుట అంటే కృతజ్ఞత చూపడం. "గోరంత చేసినా గోరు" అంటే వేళ్ల చివర గట్టిగా ఉండే చిన్న అవయవ భాగం అని చెప్తే మీకు నవ్వు రావచ్చు కాని ఇక్కడ గోరంత అని వాడటానికి అది చిన్నది కావటమే కారణం. తెలుగులో ఇది మంచి నుడికారం. గోరంతదీపం కొండంత వెలుగు అనేది సామెత. గోరుముద్దలు గుర్తున్నాయా? అమ్మ చేతిలో అన్నం ముద్దపెట్టుకొని గోరుతో తోస్తూ కాస్త కాస్త నోటి కందిస్తే అవి గోరు ముద్దలు. 'గోరంత' కొంచెమునకు గుర్తు అయితే 'కొండ' పెద్ద ఎత్తునకు గుర్తు. చెడ్డవాడికి ఎంత ఎక్కువ సాయం చేసినా పెద్ద సాయం చేసినా, గొప్ప సాయంచేసినా మర్చిపోతాడు. గుణహీనుడు అంటే గుణం లేనివాడని కాదు, తక్కువస్థాయి గుణం కలవాడని.

ఎవరికైనా సాయం చేసేటప్పుడు వారి యోగ్యత, అయోగ్యతలను దృష్టిలో వుంచుకోవాలని వేమన్న సలహా. 'గుణవంతునకు మేలు' (డి.1724-129) అనే పాఠముందిగాని. దీనిలో గణదోషముంది.

**గుణవతియగు యువతి గృహము చక్కగనుండు**
**చీకటింట దివ్వె చెలగురీతి**
**దేవి యున్న యిల్లు దివ్యార్చన గృహంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గుణవంతురాలైన ఇల్లాలు ఉంటే ఆ ఇల్లు సుఖశాంతులతో హాయిగా ఉంటుంది. ఆమె ఆ ఇంటిలో చీకటిలో దీపంలా ప్రకాశిస్తుంది. దేవత వున్న ఇల్లు దేవాలయంగా మారినట్టే ఇది కూడా.

గుణవంతురాలు అంటే బుద్ధిమంతురాలు అని అర్థం. అప్పటి పరిస్థితుల్లో ఉమ్మడి కుటుంబానికి అనుకూలమైనది అని. దివ్వె అంటే దీపం, చెలగు అంటే ఒప్పు, విప్పారు, వికసించు, వ్యాపించు, అతిశయించు అనే అర్థాలున్నాయి.

దేవి అంటే సాధారణంగా దేవత. పార్వతి, పట్టపురాణి అని కూడా.

వ్యష్టిస్వార్థం వల్ల ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం కావటం వేమనకు నచ్చలేదు. అందుకే స్త్రీల ప్రసక్తి వచ్చినప్పుడు వేమన ఇప్పటి అర్థంలో ఉదాత్తమైన అభిప్రాయాలు చెప్పడు. దీనివల్లే అతడు స్త్రీ పక్షపాతి కాదనే అభిప్రాయం నెలకొంది. దీనిని ఒకానొక చారిత్రక సంధ్యలో ఒక వ్యక్తి ప్రతిస్పందనలు గానే పరిగణించాలి తప్ప అప్పటి సమాజం నుంచి వేరుచేసి చూడటం కష్టం. 1829 నాటి బ్రౌన్ ముద్రణంలో “గుణవతియగు యువతి గురము చక్కగనుండు” అనే పాఠం వుంది. వేమన గురము అనే మాటను గృహమునకు బదులుగా వాడాడని బ్రౌన్ రాశాడు. ఇది పొరపాటు. తాటాకు ప్రతుల్లో గృహమే ఉంది. మరి గురము ఎందుకొచ్చింది? ఎందుకంటే ఛందః శాస్త్రం ప్రకాశం గుణవతికీ గృహానికీ యతి మైత్రి కుదరదు. ఈ పద్యాన్ని ఎత్తి రాసుకునేటప్పుడు పండితులు గృహమును గురముగా దిద్దారు. నిజానికి ఋత్వ ఉచ్ఛారణ ఎ ఇకార ఉకారాలకు మధ్యస్థంగా ఉంటుంది. కాని వాడుకలో గ్రుహము అని పలుకుతారు. జానపదులే కాదు శిష్టులు కూడా. ఎందుకో మరి కృష్ణశబ్దంలో క్రిష్ణ అని పలుకుతారు. క్రుష్ణ అనరు. శంకరాభరణం సినిమాలో చంద్రమోహన్ ‘రిషభం’నకు బదులుగా ‘ఋషభం’ అని శంకరశాస్త్రి ఆగ్రహానికి గురవుతాడు. ప్రజలవాడుక ఒక స్వేచ్ఛావిహారిణి, బలమైనది. ఇక్కడ ప్రజల ఉచ్ఛారణకే పట్టం గట్టవలసి వుంది.

**గుణ విహీన జనుని గుణమెంచగా నేల**
**బుద్ధిలేనివాని పూజయేమి**
**మనసు లేనివాని మంత్రంబు లేమయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒక్క సద్గుణం కూడా లేని వాని స్వభావాన్ని గురించి చర్చించి ఏం ప్రయోజనం? అల్పబుద్ధి గలవాడిని గౌరవించడం శుద్ధ దండగ. అలాగే మనసు నిలకడ లేనివాడి వద్ద మంత్రోపదేశం పొందడం వల్ల కలిసి వచ్చేదేమీ లేదు. పైగా కీడు కూడా జరగొచ్చు. ఏదైనా ఆలోచించి చెయ్యాలంటున్నాడు వేమన.

గుణం అంటే వస్తుధర్మం. స్వతహాగా ఉండేది. మానవస్వభావంలో సత్వరజస్తమోగుణాలు ముఖ్యమైనవి. ఇవి విడగొట్టినట్టుగా విడివిడిగా ఉండవు. కలిసే ఉంటాయి. ప్రతిగుణంలో ఆరు భాగాలుంటాయనుకుంటే మూడు భాగాలు ఆ గుణానికి సంబంధించినవీ రెండు భాగాలు రెండో గుణానికి సంబంధించినవీ, ఒక భాగం మూడో గుణానికి సంబంధించి ఉంటాయి. వీటి నిష్పత్తిని బట్టి, సంతులనాన్ని బట్టి జీవనగతి సాగుతూవుంటుంది. వీటిలో ఏది ఎక్కువైనా మిగతావి లేనట్టుగానే లెక్కకొస్తుంది. అందుకే 'గుణ విహీన జనుడు' అంటున్నాడు వేమన.

బుద్ధి అంటే బోధ చేత ప్రకాశించేది. బోధ అంటే తెలియడం. దేనిగురించీ అవగాహన లేని మూర్ఖుడిని పూజించడం, అంటే అతిగా గౌరవించడం వల్ల అనర్హుడిని అందలమెక్కించినట్టవుతుంది.

ఇక మనసు. మనసు అంటే మననధర్మంకలది అనిఅర్థం. ఇది శరీరంలోంచి బయటికిపోదు. ఇంద్రియాల ద్వారా వ్యక్తమౌతుంటుంది.

మంత్రం అంటే దేవతల అనుగ్రహం పొందటానికి చేసే జపం. మననం చేసేవాడిని కాపాడేది జపం. వాక్కురూపంలో ఉండే దేవతను మంత్రం అంటారు. గాయత్రి, పంచాక్షరి, అష్టాక్షరి లాంటివన్నీ మంత్రాలు. ఏకాగ్రత, చిత్తశుద్ధి, సదాచారం లేని గురువు వద్ద మంత్రోపదేశం పొందకూడదు. పొందినా ఆత్మశక్తి కలిసిరాదు. కొండొకచో హానికూడా జరగొచ్చు అని వేమన్న హెచ్చరిక.

**గురుచరణము బట్ట కుక్కలు కరుచునా?**
**గురుచరణము విడువ కుక్క కరుచు**
**కుక్కకున్న గుణము గురునకు లేదురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

గురువు పాదాలను ఆశ్రయించే వారిని రజోగుణ సంబంధమైన కుక్కలు కరవవు. గురువు సహాయం లేకపోతే కరుస్తాయి. ఎందుకంటే ఈ గుణాలను ప్రేరేపించే గుణం కుక్కకే వుంటుంది. గురువు గుణాలకు అతీతమైన వాడు కాబట్టి వాటిని నివారిస్తాడు అని తాత్పర్యం.

ఇది అచల సంప్రదాయానికి సంబంధించిన పద్యం. వేమన పలురకాల సంప్రదాయాలను పరిశీలించి స్పందించాడనడానికి ఇట్లాంటివి నిదర్శనంగా ఉన్నాయి. అచలం అంటే స్థిరమైంది అని అర్థం. దీనిని శివరామ దీక్షితుల వారు ప్రచారం చేశారు (18వ శతాబ్దం) అయితే అచల తత్త్వానికి మూల బీజాలు వేదోపనిషత్తులోనే ఉన్నాయని చెప్తారు. బెంగాల్‌లో కూడా సహజీయ, నాథ, శ్రీ చైతన్య సంప్రదాయాలున్నాయి. అచల గురువులను రాజయోగులంటారు. ఆంధ్రదేశంలో వీరికి సంబంధించిన మఠాలు అనేకం వున్నాయి.

ఇంతకూ అచలతత్వం అంటే ఏమిటి? అచలతత్త్వంలో మూడు అంశాలున్నాయి. ఒకటి అచల పరిపూర్ణ పరబ్రహ్మం. రెండు ఎరుక, మూడు ఎరుకను విడిచే విధానం. అచలం ప్రకారం బ్రహ్మమునకు ఒకే లక్షణం లేదు. అది నిర్గుణం మాత్రమే కాదు ఆకృతి కూడా. అయితే ఆకృతులు మారిపోతుంటాయి. పాతవి పోయి కొత్తవి పుడుతుంటాయి. ఒక ఆకృతిని విడిచి మరో ఆకృతికి వెళ్లడమే ఎరుకను విడవటమంటే. పరిపూర్ణం అంటే ఒకటిగా కాదు అన్నీ కలిసిన సమగ్రస్థితి. పరిపూర్ణ బ్రహ్మాన్ని బయలు, బట్ట బయలు అని కూడా అంటారు. వేమన పద్యాల్లో ఈ మాటలు అనేకసార్లు వస్తాయి.

అచలం ఒక జనసంప్రదాయం. దీనిలో గురువునకు ప్రాధాన్యం వుంటుంది. అచలవాదులు ప్రచారం చేసుకోరు. గోప్యంగా వుంటారు. ఆశ్రయించిన వారికే తత్వబోధ చేస్తారు. అందువల్లనే లోకంలో కొన్ని అపోహలు ఏర్పడి ఉంటాయనుకుంటాను. నిజానికి వాటికి ఆస్కారం కనపడదు.

'గురుచరణం' అంటే ఒక్క పాదమని కాదు. రెండు. ఇది ద్వంద్వరూప ఏ కత. అన్నమయ్య 'బ్రహ్మకడిగిన పాదము' అని అనలేదూ అట్లా. రజోగుణాన్ని కుక్కతో ఎందుకు పోల్చాడు వేమన? ఎందుకంటే కుక్క మాంసాహారి. మాంసాహారం వల్ల రజోగుణాలైన రాగాదులు పుడతాయని కాబోలు! గురుముఖతః తెలుసుకున్న తత్త్వం వల్ల మేలు చేకూరుతుందని వేమన్న భావన.

**గురువు తానయినను హరుని దాజూపును**
**బ్రహ్మలోకమతడు పారజూపు**
**శిష్యునరసి పట్టి చీకటి బాపురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు నిజమైన గురువే కాబట్టి శిష్యుడికి శివతత్త్వాన్ని విశదీకరించి శివ సాక్షాత్కారం చేయిస్తాడు. బ్రహ్మజ్ఞానాన్ని బోధించి బ్రహ్మలోకాన్ని గురించి వివరిస్తాడు. శిష్యుణ్ని చేరదీసి, చేయిపట్టుకొని అజ్ఞానాన్ని తొలగిస్తాడు. అటువంటి గురువును ఆశ్రయించటం ఉత్తమం అంటున్నాడు వేమన.

గురువంటే ఆధ్యాత్మిక విషయబోధకుడు మాత్రమే కాదు, జ్ఞానికూడా. తన అనుభవం వల్ల శిష్యుని సందేహాలను తొలగించగలిగిన సమర్థుడాయన. కామక్రోధాదులను జయించినవాడు, పాపరహితుడే నిజమైన గురువు. ఈ గురువు ఒకరకంగా యోగికూడా.

హరుడు అంటే శివుడు. త్రిగుణాలకు అతీతమైన వాడు, పరిశుద్ధ స్వరూపుడు శివుడు. అంతేకాదు శాంతిస్వరూపుడు, రుద్రుడు కాదు. తాత్వికంగా చెప్పాలంటే శివుడు స్వతఃప్రకాశకుడైన పరమాత్మ. చిత్తు యొక్క స్థిరమైన రూపమే శివుడు. చిత్తు అంటే జ్ఞానం. శిష్యుడికి శివతత్త్వాన్ని చెప్పాలంటే గురువుకు ఇదంతా అనుభవపూర్వకంగా తెలిసి ఉండాలి. ఏవో కొన్ని బాహ్య సంప్రదాయాలు చెప్తే సరిపోదు.

బ్రహ్మలోకం అంటే బ్రహ్మ ఉండే లోకం. చిదాకాశం. చిత్ అంటే సర్వ స్వతంత్రమైన స్వయం ప్రకాశమని అర్థం. జ్ఞాన మయ చైతన్య శక్తి అని కూడ. మాయాసంబంధం లేని భౌతికేతరమైన శూన్యమే చిదాకాశం. సత్యరూపమైన బుద్ధిలో భాసించే సూక్ష్మాకాశమే చిదాకాశం. (Spiritual space);

శిష్యుడు అంటే విద్యకోసం గురువును ఆశ్రయించి శిక్షణ పొందేవాడు. పారజూపు అంటే కలయచూపించటం, సాంతం అని. చీకటి అంటే ఇక్కడ అజ్ఞానం. పారు అంటే పారిపోతుంది, తొలగిపోతుంది అని అర్థాలు.

**గుహలలోన జొచ్చి గురువుల వెదుకంగ**
**క్రూరమృగ మొకండు తారసిలిన**
**ముక్తిమార్గమదియె ముందుగా జూపురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొండగుహలలో తిరుగుతున్నావా ఎందుకు? గురువులకోసం. గురువు లెందుకు? ముక్తిమార్గం చూపెడతారని. గురువులు దొరుకుతారో లేదో గాని వారికన్న ముందే పులో, సింహమో ఎదురుపడ్డాయనుకో అప్పుడు నీ పని గోవిందా! ముందుగానే ముక్తి ప్రాప్తిస్తుంది అని ఎగతాళి చేస్తున్నాడు వేమన. ఈ ఎగతాళిలో సున్నితమైన హాస్యముంది.

గురువు అంటే ఉపదేశకుడు. ప్రత్యక్షదైవం లాంటి వాడు. దేవతల గురువు బృహస్పతి (venus). తారభర్త. అలాగే మనుషులకు వారి వారి స్థోమతను బట్టి చిన్నా పెద్ద గురువులుంటారు. వారెక్కడ దొరుకుతారు? వారు అన్నిచోట్లా దొరకరు. గుహల్లో ఉంటారు. వేమన ఉద్దేశించిన గుహలు పశ్చిమ కనుమల్లోని (Estern Ghats) గుహలే అయి ఉంటాయి. పశ్చిమ కనుమలు అవిచ్ఛిన్నంగా లేవు. కృష్ణా, గోదావరి, పెన్నా, కావేరీ నదులు వీటిని విభజించాయి. పలితంగా వాటికి వేరు వేరు పేర్లు ప్రాప్తించాయి. కర్నూలు కడప జిల్లాల్లో వ్యాపించినవి నల్లమలలు. మల అంటే కొండ. చిత్తూరు జిల్లాలో ఉన్నవి శేషాచలం కొండలు. మన తిరుపతి వెంకన్న అక్కడే వెలిశాడు. అలాగే ఎర్రమలలు. వేమన చివరి దశలో నల్లమల కొండల్లో ప్రవేశించి మళ్లీ రాలేదని ప్రతీతి. తారసిల్లుట అంటే తటస్థపడుట. తారసించి ఊరుకోవు, సంఘర్షిస్తాయి. "పూర్వ పశ్చిమ సముద్రములవలె తారసిల్లినన్" అనేది కవి ప్రయోగం. అయితే 'ముక్తి' అంటే ఏమిటి? శరీరం నుండి ఆత్మను విడిపించి దానికి మళ్లీ జన్మ లేకుండా చెయ్యడం ముక్తి. సంసారముక్తి, భవముక్తి అంటారు. అంటే ఇహలోక బంధాలు లేకుండా చెయ్యడం. ముక్తుడు అంటే మోక్షం పొందిన వాడని అర్థం.

అడవుల్లో గుహల్లో మునీశ్వరులూ, సిద్ధులూ తపస్సు చేసుకుంటూ ఉంటారనీ, వారికి మహిమలుంటాయని ఒక నమ్మకం. ముక్తికోసం ఎక్కడెక్కడో తిరగనవసరం లేదని తనకు తాను అనుభవించి ప్రపంచాన్ని గానీ, ప్రపంచాతీత జ్ఞానాన్ని గానీ అర్థం చేసుకోవాలని వేమన్న ప్రబోధిస్తున్నాడు. గురువెక్కడో లేడు. నీకు నువ్వే గురువ్వి. బయట కాదు. నీలోనే ముక్తిని వెతుక్కో అంటున్నాడు వేమన.

వేమన్న ఎంత గంభీరమైన విషయాన్నైనా హాయిగా, సరళసుందరంగా, హాస్యరసస్ఫోరకంగా చెప్పటంలో దిట్ట. విశ్వకవి అంటే వేమన వంటి వారే తప్ప బిరుదులు పొందినవారు కాదు.

**గొడ్డుటావు పితుక కుండ గొంపోయిన**
**పండ్లనూడదన్ను పాలు లేవు**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

ఒక్కసారయినా ఈనని ఆవు దగ్గరికి పాలు పిండటానికి కుండ తీసికెళ్లావనుకో, పాలు ఇవ్వదు సరికదా వెనుక కాళ్లతో ఒక్క తన్ను తంతుంది. దానితో నీ పళ్లు ఊడిపోవచ్చు. లోభివాడు కూడా అంతే ఎంత వేడినా ఇవ్వడు. పైగా హాని కూడా చెయ్యొచ్చు.

గొడ్డు అంటే ఏమిటి? 'గొడ్డన వంజ నా గొంజ నా వంధ్యయౌ' వంజ, గొంజ, వంధ్య అనేవి గొడ్డుకు పర్యాయపదాలు. గొడ్డు అంటే సాధారణ పశువనే కాదు. సంతతి లేని పశువని. మనుషుల్లోని గొడ్రాలితనం ఇదే. గొడ్డు అంటే వట్టిపోయిన, శూన్యమైన, వ్యర్థమైన, ఫలించని, ప్రయోజనం లేని అనే అర్థాలు కూడా వున్నాయి. గొడ్డుటావు అంటే సంతతి లేని ఆవు అని. ఎన్నడూ ఈనని ఆవుకు పాలు ఉండవు. పితుకుట అంటే పిండటం, అంటే దోహదక్రియలతో పాలు చేపేటట్టు చేసి పాలను స్రమింపచేయడమన్నమాట.

పాలుపడని ఆవుకు పాలుపిండటానికి వెళ్తే దానికి కోపంరాదా? అందుకే అది వెనక కాళ్లతో తంతుంది. వెనకకాళ్లతో ఎందుకు? ఎందుకంటే పాలు పిండాలంటే ఆవు వెనుక పక్కన కూర్చొని దాని పొదుగు పట్టుకోవాలి గదా! అందుకే దాని తన్ను సరిగ్గా పండ్లకు తగుల్తుంది.

గొడ్డుటావు పాలివ్వదు. పైగా గాయపరుస్తుంది. లోభి కూడా అంతే తాను పెట్టడు, మరొకరి దగ్గర పైసా పుట్టనివ్వడు. గొడ్డుటావు అప్పుడప్పుడు కాదు ఎప్పటికీ పాలివ్వదు. లోభికూడా అంతే శాశ్వతంగా ఒకరికి మెతుకు విదిల్చడు.

లోభి, లాభం ప్రాస ఇంత హాయిగా కుదరాలి. వేమన్నకిది వెన్నతో పెట్టిన విద్య.

**గొప్ప పిరుదు గన్న కుచకుంభముల గన్న**
**చెప్పరాని చోట చేవగన్న**
**ముప్పిరి గొనునయ్య మునికైన మోహంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

పుష్టికరములైన పిరుదుల్ని చూసినప్పుడు, బింకంగా వున్న చనుగవను చూసినప్పుడు, శృంగార స్థానమైన గుప్త ప్రదేశాన్ని ఊహించుకున్నప్పుడు సామాన్యుని సంగతి సరే! ముని ప్రవరుడికి కూడా వలపు అతిశయిస్తుంది.

'బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు' అని అన్నాడు వేమనే మరోచోట. స్త్రీ సౌందర్యం ఎంతటి తపస్సంపన్నుడినైనా చలింపజేస్తుంది జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు. అయితే స్త్రీ సౌందర్య వర్ణన చేసేటప్పుడు వేమన్నలోని కవి హృదయం ఒక్కసారి లేచినిలబడి కళ్లు నులుపుకొని చూసింది.

'గొప్ప పిరుదు' అన్నాడు. నడుము కింది వెనక భాగాన్ని పిరుదు అంటారనీ, నితంబం అంటే కూడా అదేనని ఇప్పటి యువతకు చెప్పనక్కరలేదనుకుంటాను. గొప్ప పిరుదు ఏమిటి? లావుగా ఉండే, బలిసిన, కొవ్విన, స్థూలమైన అనే విశేషణాలు వాడొచ్చుగాని వేమన్నకు ఈ విశేషణాలు చాల లేదు. గొప్ప అన్నాడంతే. ఈ గొప్ప ఏ రకంగా? అన్ని రకాలుగా. పరిమాణంలో కావొచ్చు. సౌష్ఠవంలో కావొచ్చు, విలక్షణమైన కదలికలో కావొచ్చు. ఒకరకంగా ఇక్కడ ఇది బాగా సరిపోయిన గొప్ప విశేషణం.

కుంభములు అంటే కుండలు. పొంకమైన వక్షోజాలని. చెప్పరాని చోటు గురించి చెప్పకుండడమే మేలు. అది ఎవరికి వారికి అనుభవైక వేద్యం. చేవ అంటే బలం, పొగరు. 'అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అన్నాడు అల్లసాని పెద్దన.

ముప్పిరిగొనుట అంటే మూడుపురులు (దారాలు) ఒక్కటిగా పెనవేసు కోవడం. మూడు అంటే పైన చెప్పిన మూడు రకాల అందాలు. ఒక్కొక్కటే ప్రాణాంతకమైనప్పుడు ఇక మూడు ఒక్కటై పెనవేస్తే ఇక ఆ మోహ తీవ్రత ఎంతటిదో ఊహించవలిసిందే. అవి ఒట్టి దారాలు కాదు పురెక్కిన దారాలు! మోహం అంటే కలవరపాటు, మూర్ఛ, మాయ, నివ్వెరపాటు అనే అర్థాలున్నాయి.

‘ఆడదాని బలము ఆడనే చూడరా’ అన్నాడు వేమనే మరోచోట. దేహ సౌందర్యమే కాదు దాని హావభావాదులు కూడా తోడయితే! ‘యోని జూచి  పరమ యోగంబు మరచిన’ యోగుల గురించి కూడా చాలా చోట్ల  చెప్పాడు.

కాబట్టి పై మెరుగులను చూసి మోసపోకుండా ఆత్మసౌందర్యాన్ని వాటికి పణంగా పెట్టకుండా వుంటేనే క్షేమం అని వేమన్న ప్రబోధం ‘కొప్పు చెలువుగన్న; కొప్పు బిరుదుగన్న, చెలిమిగన్న’ అనే పాఠాంతరాలున్నాయి గాని ప్రస్తుతానికి పై పాఠమే హాయిగా వుంది.

**గోపురములు, చుట్టుకోనేర్లు తేరులు**
**ఆకువనులు గుడులు అలరగాను**
**దేవరంట బోతె దిగబెట్టుకొనెనయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పుణ్యక్షేత్రాలకు వెళ్లేది దేవుడి కోసం కదా! అక్కడేముంటాయి? అందరికి తెలిసిందే. దేవాలయం ముఖద్వారం పైన ఎత్తుగా కట్టిన గోపురాలుంటాయి. చుట్టూ మెట్లున్న నలుచదరపు కొలనులుంటాయి. దేవుడిని ఊరేగించే రథాలుంటాయి. అవి ఊరేగే పెద్ద వీథులుంటాయి. చక్కని ఉద్యానవనాలుంటాయి. ఆ ఆవరణలో ఇతరత్రా చిన్న చిన్న గుడులుంటాయి. ఇవన్నీ ఎంతో మనోహరంగా ఉండి మనస్సును ఆహ్లాదపరుస్తాయి. ఇదంతా బాగానే వుంది. దేవుడి కోసం కదా వెళ్లింది, వీటి వల్ల ఏకాగ్రత చెడిపోయింది కదా దాని సంగతేమిటి? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

నిజానికి దేవాలయ ప్రాంగణాలు ఒక పవిత్ర వాతావరణం కోసం తీర్చిదిద్దుతారు. దైవభావనకు ఉన్ముఖంగా ఎన్నో ప్రతిమలను ఏర్పాటు చేస్తారు. వాటిలో పురాణగాథలు ఉండొచ్చు, మానవతాసందేశాలూ ఉండొచ్చు. ఉదాహరణకు రథం కింది భాగాన దాన్ని మోస్తున్నట్టుగా కొన్ని బొమ్మలుంటాయి. నిజానికి ఆ బొమ్మలు ఆ రథాన్ని మొయ్యటంలేదు నువ్వూ అంతే! సంసార బారాన్ని నువ్వే మోస్తున్నట్టు అహంకరిస్తావు. దైవం కోసం ఏమాత్రం వదిలిపెట్టవు అనే సందేశం ఉంది. దాన్ని గ్రహించవు. 'తేరుకింది ప్రతిమ తెరగు న్యాయం' అంటారు దీన్ని. సౌందర్యం ఏకాగ్రతకు అవరోధం. అంతర్ముఖుడివైతే తప్ప దైవం నీకు కనిపించడు అని సారాంశం. దిగబెట్టుకోవడం అంటే వదిలిపెట్టడం. మరిచిపోవడం అని అర్థాలు.

**జ్ఞానులమని యెంచి చపలాత్ములగువారు**
**తెలివిలేక తమ్ము తెలియలేరు**
**కష్టగహన మందు కాడ్పడియున్నారు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

స్థిరమైన చిత్తం లేనివారు తామే పెద్ద జ్ఞానులమనుకుంటారు. ఆధ్యాత్మిక అవగాహన లేకపోవడం వల్ల తమ గురించి తామే తెలుసుకోలేక కొట్టుమిట్టాడుతుంటారు. వీరెలాంటి వారంటే దట్టమైన అరణ్యంలో దారితప్పిన బాటసారుల్లాంటి వారు తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

వారికి దైవస్వరూపం ఎలాగూ తెలియదు. కనీసం తమగురించైనా తెలుసుకుంటే తద్వారా దైవం తెలుస్తుందన్న జ్ఞానమైనా లేదు. పైగా తాము జ్ఞానులమనుకునే అజ్ఞానం ఒకటి. ఇంతకు జ్ఞాని అంటే ఎవరు? మామూలుగా అయితే బుద్ధి గలవాడు. తాత్త్వికంగా అయితే అనుభవించబడేదీ, అనుభవించే వాడూ రెండూ తానే అని తెలుసుకున్నవాడు జ్ఞాని. చపలాత్ముడంటే మనసు నిలకడ లేనివాడు, ఏకాగ్రత చాతగానివాడు. ఒకదానిపైన మనసు నిలపలేని వాడు తెలివిలేని వాడవుతాడు. తెలివి అంటే ఏమిటి? లౌకికంగా అయితే మెలకువ, గ్రహణశక్తి అని అర్థాలు. ఆధ్యాత్మికంగా అయితే ఎరుక. ఈ ఎరుక గురించి గతంలో చాలాచోట్ల చెప్పడం జరిగింది.

తమ గురించీ తెలియదు, దైవం గురించీ తెలియదు. ఇద్దరి మధ్య సంబంధం గురించీ తెలియదు. ఇలా గందరగోళంలో పడిన వీరు దుర్గమమైన అడవిలో దారితప్పినవారిలా ఉన్నారే అని జాలిపడుతున్నాడు వేమన.

తాత్త్విక సంక్షోభానికి గహనారణ్యం పోలిక మహాకవియోగి వేమనకే చెల్లింది. ఇది మామూలు అడవి కాదు. కష్ట గహనం. కష్టమనే మాట వేమనకు ఇష్టం. చాలాచోట్ల వాడతాడు. కష్ట అంటే ఇక్కడ దట్టమైనదనే. గహనమన్నా అడివే. చొరరాని అనికూడా.

'కాడ్పడి యున్నారు' అనేది ఈ పద్యంలో కీలకమైన వాక్యం. కాడు అంటే అడవి. ఇది దేశీయపదం. కన్నడంలో కూడా కాడే. తమిళంలో కాటు. శ్మశానమని మరో అర్థం. ఇక్కడ అడివే. కాడ్పడి (కాడు+పడి) ఉన్నారు అంటే అడవిలో దారి తప్పారని. తెలంగాణాలో 'కాటగలిసిందు' అంటారు. ఈ సందర్భంగా ఓ సంగతి చెప్పాలి వినండి. అనంతపురం జిల్లాలో కదిరి పట్టణంలో ఓ గొప్ప నరసింహస్వామి దేవాలయం ఉంది.

కదిరికి 6 మైళ్ల దూరంలో కటారుపల్లె (కాట్రాయపల్లె) అనే గ్రామంలో వేమన్న పేర ఓ సమాధి ఉంది. అక్కడ నేను విన్న జానపద గీతం మీరూ వినండి. "బేట్రాయ్ సామి దేవుడా - నన్నేలు వాడ- బేట్రాయ్ సామి దేవుడా; కదిరీ నరసింహుడా - కాట్రాయివేముడా - యేటైన వేటకాడ - నిన్నే నమ్మితిరా". ఈ పాటలో కదిరి నరసింహుని సరసన 'కాట్రాయ వేముడు' (కాడు+రాయ + అడవి రాజు; 'బేట్రాయ' అంటే పెద్దరాయి రాజు). ఎవరీ వేముడు నరసింహునికే ఆ కాలంలో ఈ పేరుండేదా? మరింత పరిశోధనలో ఈ సంగతి తేలాలి. 'కాడు' అనే మాటకోసం ఈ ఉదంతం చెప్పాలనిపించింది.

*"జాణలమని యెంచి చపలాత్ములగు వారు, .... కాటబడి యున్నారు"* అనేవి పాఠాంతరాలు (డి. 1726-677).

**జ్ఞానమెన్న గురువు జ్ఞానహీనము బుద్ధి**
**రెంటి సందు రిమ్మ రేచునపుడు**
**రిమ్మ తెలిసె నేని రెండొక రూపురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జ్ఞానమే గురువు. జ్ఞానం లేని ఎరుకే అజ్ఞానం. జ్ఞానాజ్ఞానాల మధ్య చంచలమైన హృదయాన్ని తెలుసుకొని కట్టడి చేయగలిగితే జ్ఞానాజ్ఞానాలు ఒక్కటై మోక్షానికి దారి ఏర్పడుతుంది.

జ్ఞానంఅంటే తెలివి అని అనేకసార్లు చెప్పుకున్నాం. అది గురువుతో సమానం. ఇక అజ్ఞానం, అజ్ఞానం అంటే జ్ఞానం లేకపోవడం కాదు. నైసర్గికమైన అవిద్యాశక్తే అజ్ఞానం. అవిద్య అంటే జీవాత్మ పరమాత్మ ఒకటే అని తెలుసుకోలేని మూఢత్వం. దీని వల్లనే భ్రాంతి ఏర్పడుతుంది. బ్రౌన్ దీనిని "a giddy state of Fluctuation on between these two principles" అన్నాడు. అలాగే అజ్ఞానం అంటే బుద్ధి లేక పోవడం కాదు. బుద్ధి యొక్క జడాంశమే అజ్ఞానం దీనికి స్వయం స్ఫూర్తి ఉండదు. అంటే తనంతట తాను తనను తెలుసుకోజాలనిది అని భావం.

రిమ్మ అంటే ఉన్మాదం. వెర్రితనం, మోహం, కామం, గర్వం, ఇవన్నీ రిమ్మలో భాగాలే. ఇక్కడ రిమ్మ అంటే భ్రాంతి అని అర్థం చెప్పుకోవాలి. *'బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు'* అన్నాడు వేమన్నే మరోచోట. రిమ్మతెగులు అంటే దుర్బుద్ధి. రేచునప్పుడు (రేచున్ + అప్పుడు) అంటే లేపుతుంది, పురికొల్పుతుంది, అతిశయింపజేస్తుంది అని అర్థాలు. *"వలపులు రేచి గోలయని వల్లభుడల్లన కేళి సల్పుచో"* అనేది ప్రయోగం.

**చక్కదనము లేల సంపత్కరములేల**
**విద్యలేల, భూమి విరివి యేల**
**పుత్ర పదవి కన్న పుట్టునా పదవులు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పుత్రుడు కలగటం కంటే పెద్ద భాగ్యం ప్రపంచంలో మరేదైనా ఉందా?. దానిముందు దైహికమైన అందాలెందుకు? ధనసంపద లెందుకు? గొప్ప చదువులెందుకు? విశాలమైన భూభాగమెందుకు? అన్నీ పుత్రసంపద ముందు దిగదుడుపే అంటున్నాడు వేమన.

బ్రౌన్ 'పుత్ర పదవి'కి సంతానపరంగా (off spring) అర్థంచెప్పాడు. యూరోపియన్లలో పుత్రుడే ప్రధానమనే సంప్రదాయం లేదుగదా! మనకు పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడు. అంటే పిండ ప్రదానాది కర్మకాండల వల్ల ఆ నరకం బారిన పడకుండా తల్లిదండ్రులు తేజోమూర్తులై సంచరిస్తారని ఒక నమ్మకం. పుత్రుడు లేకుంటే ఆ నరకం తప్పదు. పుత్రులు 12 రకాలు. ఔరసుడు, క్షేత్రజుడు, దత్తుడు, కృత్రిముడు, గూఢోత్పన్నుడు, అపవిద్ధుడు, కానీనుడు, సహోఢజుడు, క్రీతుడు. పౌనర్భవుడు, స్వయంభవుడు, శౌద్రుడు. ఔరసుడు, దత్తుడు అందరికి తెలిసినవే గదా! మిగతావాటి గురించి మీరు ప్రయత్నించి తెలుసుకోండి. ఈ సందర్భంగా సుమతికారుడేమన్నాడో వినండి.

*"పుత్రోత్సాహము తండ్రికి*
*పుత్రుడు జన్మించినపుడె పుట్టదు జనులా*
*పుత్రుని కనుగొని పొగడగ*
*పుత్రోత్సాహమును తండ్రి పొందుర సుమతీ!"*

'పుత్రోత్సాహము' అనేది మంచి మాట. పుత్రికోత్సాహం ఉండదా? ఎందుకంటే సంతానమేదయినా కలిగినప్పుడు కన్నవారికి తప్పకుండా ఒకేవిధమైన సంతోషం కలుగుతుంది. అయితే సామాజిక లాభనష్ట భావదూషితులైన వారికే పుత్ర, పుత్రికా వివక్ష అనే జాడ్యం దాపురిస్తుంది. అబ్బాయి వంశోద్ధారకుడనీ, అమ్మాయి వల్ల వంశ విస్తృతి మాత్రమే జరుగుతుందని భావించేవారు ఇప్పటికీ వున్నారు. ఈ పద్యాన్ని ఇప్పుడు రాస్తే వేమన మరోరకంగా రాసేవాడేమో!

చక్కదనము అంటే సౌందర్యం, సంపత్కరము అంటే సంపదను కలిగించేది అని (కరోతి); *"సంపత్కరాణి సకలేంద్రియ మోహానాని"* అన్నప్పుడు కనులు ఇంద్రియాలన్నింటి

కన్న ఎక్కువ అందమైనవని. ఇక్కడ సంపద ధనవాచకం కాదు. పరమానందాన్ని కలిగించడమే ఇక్కడి సంపద. విద్యలంటే ఎన్నో!! విద్య అంటే ఆధ్యాత్మిక దృష్టితో తత్వ సాక్షాత్కారం. లౌకికమయితే చతుర్విధ విద్యలు, షడ్విద్యలు, చతుర్దశ విద్యలు, అష్టాదశ విద్యలు ఇలా ఎన్నో ఉన్నాయి. విరివి అంటే విశాలమైన, విస్తారమైన అని అర్థాలు. భూమిపరంగా అయితే పెద్దదని. 'చాలా' అనే అర్థంలో సౌందర్య ప్రతిపాదకాలైన రెండు ప్రయోగాలున్నాయి చూడండి. *"అట్లైన విరివియగు మీ సొబగుల్; విరివియకాని పై పొదవు వెల్వడకుండెడు పూబచన్నులన్".*

ఆడ, మగల గురించిన దృక్కోణాలు, విలువలు మారిపోతున్నాయి. ఈ వేమనపద్యం సమకాలీన పునర్వివేచనకు తోడ్పడుతుందనడంలో సందేహం లేదు.

**చచ్చువారలెవరు? చావని వారేరి?**
**చచ్చి బ్రతికి యుండు జనములెవరు**
**విచ్చలవిడిగాను వివరించి చూడరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనుషులు రెండు రకాలు. మరణించేవారు, మరణించనివారు. మరణించని వారు కూడా వుంటారా? అవును! భౌతికంగా మరణించినా ఆత్మపరంగా జీవించేవుంటారు. వారెవరో ఎట్లాంటివారో అరలు పొరలు లేకుండా స్వేచ్ఛగా ఆలోచిస్తే సత్యం తెలుస్తుంది అంటున్నాడు వేమన.

చావడం, చావకపోవడం కేవలం శారీరకమేకాదు. అజ్ఞాని, మాయలో చిక్కినవాడు, వ్యామోహపరుడు, అహంకారి, భ్రాంతుడు ఇటువంటి లక్షణాలున్నవాడు బతికి ఉన్నా చచ్చినవాడికిందే లెక్క. మరి చావని వాడెవరు? జ్ఞాని, యోగి, నిర్మలుడు, నిరహంకారి, నిర్భ్రాంతుడు; ఈ గుణాలు కలిగిన వాడికి చావు లేదు. అతడు నిత్యుడు, అమరుడు. అతని దేహం నశించినా ఆత్మ జీవిస్తుంది. కీర్తి ప్రకాశిస్తుంది. ఇట్లాంటి గంభీరమైన విషయాలు ఎవరో చెప్పడం కాదు యథేచ్ఛగా, సొంతంగా ఆలోచించి అర్థం చేసుకో అని సూచిస్తున్నాడు వేమన. విచ్చలవిడి అంటే స్వతంత్రంగా అని (విచ్చలు + విడి); *"యినాళ్లరీతిగాదింత నుండేమియు మీరు విచ్చలవిడి మెలగరాదు"* అనిప్రయోగం.

**చచ్చె చచ్చెననుచు చావుకు వగచెదు**
**దీన నరుల వెర్రి తెలుపరాదు**
**ప్రాణమునకు మృత్యుబంధంబులుండునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తమ వారికి మరణం సంభవిస్తే ఆ వియోగంతో జనులు దుఃఖిస్తారు. ఇంతకన్న అజ్ఞానం ఏముంటుంది? ప్రాణానికి చావులేదనీ, గతించింది దేహమేనని తెలుసుకోరేమి అంటున్నాడు వేమన.

ఇది ఒక యౌగిక స్థాయిలో చెప్పిన పద్యం. అసలు తత్వం తెలిస్తే దుఃఖం తగ్గిపోతుందని భావం. ఇంతకూ ప్రాణమంటే ఏమిటి? వేదాంతపరిభాషలో చెప్పాలంటే ప్రాణం ఆత్మనుండి ఉద్భవించిన శక్తి. సంకోచ వ్యాకోచాత్మకమైన ప్రజ్ఞ నుండి గాలిరూపంలో పుట్టిన జీవశక్తే ప్రాణమంటే. ఇది శరీరాన్ని నీడలా ఆవరించి వుంటుంది గాని దీనికో ప్రత్యేకమైన రూపం ఉండదు. నిజానికి జీవాత్మకు చావు పుట్టుకలు లేవు. అది నిత్యం, సత్యం. నిర్మలజ్ఞానికి జన్మలు చెందవు అని సారాంశం.

వగచు అంటే చింతించు, విచారించు, దుఃఖించు, ఆలోచించు అని అర్థాలు. '*నీ పోవు తెరువున బోవు వారు గాగ బూనియున్న, వారికెల్ల నేను వగచెద*' అని ప్రయోగం. దీనుడు అంటే దయనీయుడు, జాలిగొలిపేవాడు, దర్పముడిగినవాడు, దుఃఖ పడేవాడు. మృత్యుబంధాలు అంటే దుష్ప్రవర్తన, అజ్ఞానం కామక్రోధాదులైన దోషాలు. ఇవి దేహానికే గాని ఆత్మకు ఉండవు అని సారాంశం.

**చదవ చదవ చదవ సభలందు రంజిల్లు**
**పెనగ పెనగ సతికి ప్రేమ పుట్టు**
**వినగ వినగ మాట విశ్వాసమై యుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

చదివే కొద్ది దానికి సభల్లో రాణింపు వస్తుంది. కలిసి జీవించేకొద్ది సతికి ప్రేమ కలిగి ఆ మాధుర్యం అనుభవంలోకి వస్తుంది. చెప్పింది విని, పూటకోమాట మాట్లాడకుండా ఎప్పుడూ సత్యమే పలికితే ఆ మాటపైన నమ్మకం కలుగుతుంది.

పాతకాలంలో ఒకరు చదవగా అనేకమంది వినే పద్ధతి ఉండేది. పురాణ శ్రవణం అనేవారు. చదవడం అంటే గట్టిగా పైకి చదవడం, ప్రకాశ పఠనం అన్నమాట. అంతేకాదు చదివేవాడికి చదివేది అర్థమైనా కాకున్నా నోటికి రావడం గొప్ప. మను చరిత్రం వాడికి కంఠతావచ్చు అంటే అదో బడాయి. కాని అటువంటి వారికి విద్వత్ గౌరవం ఉండేది. వారికి సభల్లో రాణింపు ఉంటుంది. రంజిల్లు అంటే ఇక్కడ వెలుగు అని. ఒకటి రెండుసార్లు విజయం సాధించలేకపోయినా పదే పదే ప్రయత్నిస్తే ప్రకాశించడం తథ్యం. అందుకే 'చదవ'ను మూడు సార్లు ఆవృత్తం చేశాడు. పదాల ఆవృత్తంవల్ల అనేక వేమన పద్యాలకు శోభ చేకూరటమే కాకుండా నిర్మాణపరమైన సౌష్టవం సిద్ధించింది. కొన్ని అసమాపక క్రియలను పునరుక్తం చెయ్యటం ద్వారా కాలాధిక్యాన్నీ క్రియాధిక్యాన్నీ సూచించవచ్చు, "చెప్పి చెప్పి విసుగొచ్చింది. తినక తినక తిన్నాడు, చెప్తూ చెప్తూ ఆగిపోయాడు" ఇలాంటివి.

పెనగ పెనగ అంటే సంభోగించేకొద్దీ అని అర్థం. వినగ వినగ అంటే చెప్పిన మాట విని దానిని ఆచరిస్తే ఆ మాటపైన విశ్వాసం కలుగుతుంది అని అర్థం.

**చదువు చదువ నేల సన్యాసి గానేల**
**షణ్మతముల చిక్కి చావనేల?**
**అతని భజన జేసి ఆత్మలో తెలియుడీ**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఆత్మ స్వరూపుడిని తనలో దర్శించాలి గాని శాస్త్రాదులను వల్లించడం, సన్యాసాన్ని స్వీకరించడం, ఆరుమతాల మధ్యన వాద వివాదాల్లో కొట్టుమిట్టాడటం వ్యర్థమంటున్నాడు వేమన.

మతాల హెచ్చుతగ్గులను గురించి వాదులాడుకొనడం, తాత్త్విక చర్చల్లో మునిగి తేలడం; ఇదంతా క్లిష్టమార్గం. వీటి కన్న సులభమార్గం, నిరాకారమైన అమేయస్వరూపుడు ఆత్మలోనే ఉన్నాడని తెలుసుకుంటే చాలదా అని సారాంశం.

షణ్మతాలు అంటే ఆరుమతాలు. అవి శైవం, వైష్ణవం, శాక్తం, గాణాపత్యం, సౌరం, కాపాళికం. వీటిలో శైవం, వైష్ణవం, సౌరం సాత్త్వికమైనవి. మిగిలినవి తాంత్రిక పరమైనవి. అంటే ఉపాసనలు, పంచమకారాలతో కూడినవి.

ఇక్కడ అతడు అంటే పరమాత్మ, ఈశ్వరుడు. విశిష్టాద్వైతం ప్రకారం ఆత్మదేహంకన్న భిన్నమైంది. గత కర్మల వల్ల అది దేహప్రవేశం చేస్తున్నది. దీనివల్లనే భవబంధా లేర్పడుతున్నాయి. ఇవి పోవాలంటే ఆత్మ పరమాత్మల ఐక్యం జరగాలి. అప్పుడే ఆత్మలో పరమాత్మ సాక్షాత్కారం జరుగుతుంది. ఇవన్నీ ఉపాసనల వల్లనే సాధ్యమౌతాయి కాని గ్రంథాలు చదివితే తెలియవంటున్నాడు వేమన.

**చదువులందు, రాజ్య పదవులందును, పాడి**
**మొదవులందు, స్త్రీల పెదవులందు**
**ఆశలుడుగినట్టి అయ్యలు ముక్తులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కోరుకున్న వారందరికీ ముక్తి లభిస్తుందా? వారు గురువులైనా సరే, లభించదు. మరెలా? ఆశలు వదులుకుంటే లభిస్తుంది. ఏమిటా ఆశలు? వేటిపైన? గొప్ప విద్యలనబడే వాటిపైన, అధికారస్థానం పైన, పాడి ఆవులపైన, స్త్రీలతో భోగజీవితం పైన.

మోక్షం ఆకాశం నుంచి రాలిపడేది కాదు. ఒక్కొక్క కోరికా నువ్వు వదిలేస్తుంటే అది ఒక్కొక్క అడుగే నీకు దగ్గరవుతుంది అని ప్రవచిస్తున్నాడు వేమన.

చదువు అంటే ఇప్పటి చదువు కాదు. విద్య అనే విశాలమైన అర్థంలో వాడుతున్నాడు వేమన. చదువు అంటే అభ్యసించేది, వేదపాఠం. అర్థం తెలియకున్నా పైకి చదివే పద్ధతి ఒకటుండేది. దానిని పవిత్రమని నమ్మేవారు. దశమం వచ్చు, విజయ విలాసం వచ్చు, మను చరిత్రం వచ్చు అనే భట్టి విక్రమార్కులు పండితులుగా చెలామణి అయ్యేవారు. ఇటువంటి వారిని చదువుల పులుగులు అనేవారు. పులుగు అంటే పక్షి. ఇక్కడ చిలుక. చిలుకపలుకలే సార్థకమైన విద్య కాదు. దానివల్ల ఏం ప్రయోజనం? అని వేమన ప్రశ్న. రాజ్యపదవి అంటే ఉన్నతస్థితి, ఉద్యోగ హోదాలని అప్పటి అర్థాలు. ఇప్పుడూ అంతే! అధికార పీఠానికి దగ్గరగా ఉండాలని తాపత్రయాలు ఇప్పుడూ వున్నాయి. పాడి అంటే పాలు. మొదవు అంటే తొలిచూలు ఆవు, పాలిచ్చే ఆవు అని కూడా. పాడిచేయడం అంటే పశువుల పాలుతీసి పెరుగూ మొదలైనవి చెయ్యడం. స్త్రీల పెదవులు అంటే స్త్రీ సౌందర్యాస్వాదనం. కింది పెదవిని అధరం అంటారు. ఇది రసభావానుగుణంగా చలిస్తుంది. అందుకే ‘అధరం మధురం’ అన్నాడు కవి. ఆశ అంటే మరేమీలేదు, కోరికే. ఆశ పాశం లాంటిది. బంధం లాంటిది, దానిని తెంపుకోవడమే ఉత్తమం. ముక్తులు అంటే ముక్తి పొందినవారవుతారు. వేటి నుంచి ముక్తి? సంసారబంధాలు, లేదా భవబంధాలనుంచి ముక్తి.

విద్యవల్ల వచ్చే దార్ష్టికాన్నీ, పదవివల్ల వచ్చే అధికారాన్నీ, పాడివల్ల వచ్చే సంపదనీ, స్త్రీల వల్ల వచ్చే అనుభోగాన్నీ వదులుకుంటావా? వదులుకుంటే ముక్తి నీ ముంగిట

నిలుస్తుంది. ముంగిట కాదు నీ అనుభవంలో ప్రవేశించి నిన్ను ముక్తుణ్ని చేస్తుందని ప్రబోధిస్తున్నాడు వేమన. సముద్రమంత గంభీరమైన విషయాన్ని కుండలో నింపి చెప్పడం వేమనకు మాత్రమే చేతనైన విద్య.

నడక దృష్ట్యా ఇది ఎంతో చురుకైన పద్యం. చదువులు, పదవులు, మొదవులు, పెదవులు వంటి ప్రాసయతులే కాక, 'దు రాజ్య, నుపాడి, దుస్త్రీల', వంటి చోట్ల జగణస్ఫూర్తి వల్ల పద్యం కదం తొక్కే గుర్రంలా పరుగెత్తుతుంది.

**చదువులందు లేదు శాస్త్రంబులను లేదు**
**వాదములను దైవ భేదములను**
**బయట నున్న ముక్తి పాటించలేరయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ముక్తి కేవలం చదువుల్లో లేదు. వేదాంతాది శాస్త్రాల్లో లేదు. తర్కవాదాల్లో లేదు. శివకేశవాది దైవభేదాల్లో లేదు. మరి ఎక్కడుంది? వీటన్నింటికి బయట అంటే అతీతంగా వుంది. కాబట్టి దానిని లక్ష్యంగా చేసుకోరేమిటి? అంటున్నాడు వేమన.

బయట, బయలు అనే మాటలను వేమన్న తరచుగా వాడతాడు. ఇక్కడ బయట అంటే విద్యాది బాహ్యవిషయాలకు బయట అని. బయలు అంటే, వీరశైవులు పరమసత్యంతో ఐక్యం చెందే అనుభవాన్ని బయలు అని పిలుస్తారు. కొందకచో పరమసత్యమే బయలు. బయలుకు ఆకాశం, శూన్యం, సందు, వట్టిచోటు, ఆవరణలేని స్థలం అని నైఘంటికార్థాలు.

బ్రహ్మజ్ఞానం కోసం కేవలం చదువులనే నమ్ముకుంటే లాభం లేదు. ప్రహ్లాదుడు ఏమి చదివి ముక్తి పొందాడు. *'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ'* అంటే బాహ్య విషయాలకు అతీతమైన బయలుతత్త్వాన్ని బోధించే నిజమైన చదువు. మర్మమంటే అదే. పాటించడం అంటే ఆ మార్గంలో ఆచరించడం అని అర్థం.

దైవభేదములు అంటే శివుడనీ, విష్ణువనీ ఒకరికన్న మరొకరు గొప్పవారనీ ఇటువంటి వాదాలు అనవసరం. వెలుపలి చిహ్నాలకు అతీతమైనదే ముక్తి అని సారాంశం.

**చదువులన్ని చదివి చాల వివేకింప**
**కపటికెన్ననేల కలుగుముక్తి?**
**దాలి గుంట కుక్క దలచిన చందము**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

అతడు బాగా చదువుకున్నవాడే, విచక్షణ జ్ఞానం సాధించినవాడే కాని కపట ప్రవర్తన వల్ల ముక్తికి దగ్గర కాలేకపొయ్యాడు. ఇదెలా వుందంటే దాలిగుంటలో పడుకున్న కుక్క రేపటినుంచి చెడ్డపనులు చెయ్యొద్దని భావించి, లేచిన వెంటనే దానిని మర్చిపోయినట్టు.

ఎన్ని విద్యలు నేరిస్తే నేమి? ఎన్ని శాస్త్రాలు అభ్యసిస్తే నేమి? వాటివల్ల వస్తు స్వరూపజ్ఞానాన్ని గురించి ఎంత ఆలోచిస్తే నేమి? దేహానికీ ఆత్మకూమధ్య ఉండే సంబంధాన్ని గురించి ఎంత చింతన చేస్తేనేమి? ఎంత తర్కసామర్థ్యం అలవర్చుకుంటే నేమి? త్రికరణశుద్ధి లేనప్పుడు ముక్తి లభిస్తుందా. ఆచరణలోకి రాని ఎంతటి గొప్ప జ్ఞానమైనా అది వ్యర్థమే అంటున్నాడు వేమన. గ్రంథాలు అధ్యయనం చేస్తున్నప్పుడు అనిపిస్తుంది. ఆ విద్యను తప్పకుండా ఆచరించాలని. కాని అది ఎప్పటికీ ఆచరణలోకి రాదు. దానివల్ల ఏం లాభం? అటువంటి వాడిని దాలిగుంటలోని కుక్కతో పోలుస్తున్నాడు వేమన. వేమనే మరోచోట ఇలా అన్నాడు. *"వినువివేకమనెడు వింత గొడ్డలి చేత / అలయవిద్యయనెడు అడవి నరుక"* అవిద్య అనే అడవిని నరకడమనే ఆచరణకు పూనుకోవాలి మరి!

ఇంతకూ దాలిగుంట అంటే ఏమిటో చూద్దాం. పాలు మొదలైనవి కాచుకోడానికి తవ్వినగుంటను దాలిగుంట అంటారు. పిడకలు పేర్చిచేసే నిప్పులగుంట అన్నమాట. దాలి అంటే  పిడకలు. దాలిగుంట చల్లారినప్పుడు వెచ్చగా వుంటుంది కదా అని కుక్కదానిలో పడుకుంటుంది. పడుకుని ఏమనుకుంటుందంటే రేపటి నుంచి దొంగతనం చెయ్యొద్దని. దానిలోంచి లేచిన తర్వాత వెంటనే దొంగతనానికి ఇండ్లలో దూరుతుంది. పైన చెప్పిన 'చాలవివేకి' ఇలాంటి వాడే అని వెక్కిరిస్తున్నాడు వేమన.

ఈ పద్యంలోని నీతి ఏమిటంటే బుద్ధి నిలకడలేని వ్యక్తికి ముక్తి లేదు. అలాగే శక్తికి మించిన ఊహాలు చేయరాదు.

**చమురు గలుగు దివ్వె సరవితో మండును**
**చమురు లేని దివ్వె సమసిపోవు**
**తనువు తీరెనని తలపుతోడనె తీరు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

నూనె ఉన్నదీపం ఎడతెగకుండా వెలుగుతుంది. నూనె అయిపోయిన దీపం ఆరిపోతుంది. శరీరమూ అంతే ఆయుస్సు తీరితే మరణిస్తుంది. మరణంతో పాటు జీవితాన్ని గురించిన ఆలోచనలూ ఆగిపోతాయి.

ఈ పద్యంలో మూడు పదార్థాలున్నాయి. ఒకటి వత్తి, రెండు నూనె, మూడు వెలుగు. వీటిలో వత్తి లేకపోతే నూనె మరియు వెలుగుల ప్రసక్తే లేదు. ఇక్కడ వత్తి శరీరం, నూనె జీవం, వెలుగు ఆత్మ. ఆత్మవాదులు భౌతికత లేదంటారు. భౌతికవాదులు ఆత్మను నిర్లక్ష్యం చేస్తారు. ఇద్దరూ అసంపూర్ణమే. రెండూ కలిస్తేనే పరిపూర్ణత సిద్ధిస్తుందంటున్నాడు వేమన.

తనువూ జీవాత్మల గురించి ఎంతో మీమాంస జరిగింది. ఉపనిషత్తుల ప్రకారం శరీరం ఆత్మా వేరు వేరు. శరీరం మరణిస్తుంది. కాని ఆత్మ ఎప్పటికీ ఉంటుంది. అయితే వేదకాలం నుండీ దీనికి భిన్నమైన వాదాలున్నాయి. చార్వాకులు శరీరమే ఆత్మ అన్నారు. వారి దృష్టిలో ఆత్మకు రూపం వుంది. అది నాలుగు భూతాల్తో నిర్మించబడింది. అది తల్లిదండ్రులనుంచి ఉద్భవిస్తుంది. శరీరంతో పాటే అది నశిస్తుంది. ఈ పద్యంలో వేమన 'తలపుతోడనె తీరు' అంటున్నాడు. అంటే మనిషి మరణించినప్పుడు ఆ వెంటనే అద్భుతం, ఉగ్రం, దివ్యం, పవిత్రం అయినటువంటి అనుభూతులన్నీ నశిస్తాయి. భయం, ఆశ్చర్యం, విషాదం వంటి ఉద్వేగాలు కూడా.

చమురు అంటే తేమ, నెయ్యి, కొవ్వు, జిగురు అనే అర్థాలున్నాయి గాని ఇక్కడ నూనె. చమిరి అంటే రాయటం, పుయ్యటం అని అర్థాలు. చమురుకునేది చమురు. "సరవితో" అంటే క్రమంగా, వరుసగా అని. "*సరవితో స్వస్తి వాచకములు చదువ, సరవితో వర్షించె సస్యముల్ వ్రేళ్ల గొల్చుగ విర్రవీగి పండె*" అని ప్రయోగాలు. దివ్వె అంటే దీపం. దివె, దివియ, దివ్వటి అనే రూపాలు కూడా ఉన్నాయి. సమసిపోవుట అంటే నశించడం, చావడం, అయిపోవడం. ఇక్కడ అయిపోవడమే. "*సర్వధనంబులు సమయంగనంత*" అని ప్రయోగం. తెలంగాణాలో వొడిశిపోయింది అంటారు. తీరు అంటే ఇక్కడ పద్ధతి అని అర్థం కాదు, తీరిపోవుట అంటే ఇక్కడ ఆయుస్సు తీరిపోవుట అని అర్థం.

*చమురు గలుగు దివ్వె సంప్రకాశితమగు* (డి. 1723–282) అనే పాఠం వేమన శైలికి దూరం. 'చమురు ఉన్న దివ్వె సంతోషమున వెల్గు (డి. 1724, 164) ఈ పాఠాన్ని గురించి ఆలోచించాలి. ధనముదీర వలపు దానితో తీరు రా (డి. 1723–282, ఇటువంటి పాఠ చర్చలు ముందు ముందు పాఠ నిర్ణయానికి తోడ్పడతాయి.

**చాకి కోకలుతికి చీకాకు పడజేసి**
**మైలదీసి లెస్స మడుపు జేయు;**
**బుద్ధి చెప్పువాడు గుద్దితేనేమయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రజకుడు బట్టలుతికేటప్పుడు వాటిని మొరటుగా ఉతుకుతాడు. దానివల్ల మాలిన్యం పోతుంది. ఆ తర్వాత చక్కగా మడతపెడతాడు. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని మేలుకోరి చెప్పేటప్పుడు కొంత కఠినంగా ఉన్నా తప్పు లేదంటున్నాడు వేమన.

వేమన పద్యాల్లో ఇది చాలా ప్రసిద్ధమైనది. మందలించేటప్పుడు సున్నితంగా చెప్పాలనేది ఇప్పటివాదన. కాని ఈ మంత్రం అన్నివేళలా అందరికీ పని చెయ్యదు. అయితే కోపానికీ బాధ్యతకు మధ్య సంతులనం ఉండటం అవసరం.

చాకి అంటే బట్టలుతికే కులానికి చెందినది. స్త్రీలింగం కూడ. చాకిరేవు అంటే కాలువ పక్కన బట్టలుతికే స్థలం. కోక అంటే ఒకప్పుడు వస్త్రవిశేషం. ఇప్పుడు చీరె. ధోతి కూడా. ఇక్కడ బట్టలనే.

చీకాకు అనే మాటకు వ్యుత్పత్త్యర్థం చీకిపోయిన ఆకు. కలత, క్షోభ, శ్రమ, ఆయాసం, విసుగు అనేవి వివిధఛాయలు. ఇక్కడ గట్టిగా అని అర్థం. మైల అంటే మురికి, అశుచిత్వం. మడుపు అంటే మడత. అప్పుడే ఉతికిన బట్టను మడతపెడితే అది మడుపు.

బుద్ధి చెప్పడమంటే మంచిమార్గం వైపు దృష్టి మళ్లించడం. గుద్దుట, కొట్టుట అంటే ఏమిటి అనే మీమాంస కంటే ధృఢంగా చెప్పటం అనేది సారాంశం.

ముద్దు ముద్దుగా ఉతికితే బట్టల మురికి పోనట్టే సున్నితంగా చెప్తే మనిషిలో పరివర్తన రాకపోవచ్చు. బుజ్జగింపుతో పిల్లలు వింటారు గాని ముదురు సరుకులకు కాస్త కాఠిన్యం అవసరం అనేది వేమన్న లోకానుభవసత్యం.

**చావు వచ్చినపుడు సన్యసించేదెట్లు**
**కడకు మొదటి కులము చెడినయట్లు**
**పాపమొకటి గలదు ఫలమేమి లేదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అవసాన దశకు చేరుకొన్నప్పుడు సన్యాసం స్వీకరిస్తున్నావా? అంటే పూర్వాశ్రమంలో చేసినవన్నీ తప్పులన్నట్టేగా. గతంలో జరిగిన పాపం ఎటూ పోదు. దాని ఫలితం అనుభవించక తప్పదు. సన్యసిస్తే మంచి ఫలితం వస్తుందను కుంటున్నావా? అదంతా వొట్టిది అంటున్నాడు వేమన.

"సంప్రాప్తే సన్నిహితేకాలే నహినహి రక్షతి డుకృజ్‌కరణే" అన్నాడు శంకరా చార్యులు 'భజగోవిందం' స్తోత్రంలో: మృత్యువు నిన్ను సమీపించినప్పుడు లౌకికమైన వ్యాకరణ సూత్రాలు వల్లించి లాభం లేదు దైవధ్యానం చేసుకో! అంటే గోవిందుణ్ణి భజించు అని సూచిస్తున్నాడు. ధాతుపాఠంలో డుకృజ్‌కరణే అంటే చేయుట అని. ఈ సూత్రాన్ని పదే పదే అనటం కాదు ఆధ్యాత్మిక జ్ఞానం ముఖ్యం అని సారాంశం. 'భజగోవిందం' స్తోత్రాన్ని గానకోకిల సుబ్బలక్ష్మి ఆలపిస్తుంటే కలిగే వైరాగ్య స్ఫూర్తి అంతా ఇంతా కాదు.

ఇక్కడ వేమన్న చెప్తున్న సన్నివేశం దాదాపు ఇట్లాంటిదే. "సన్యసించేదెట్లు" అంటున్నాడు. ఇంతకూ సన్యాసమంటే ఏమిటి? సన్యాసమంటే త్యాగపూర్వకమైన జ్ఞాన యోగాన్ని అవలంబించడం. కోరికలకు సంబంధించిన పనులను వదిలెయ్యటం. ఏవో కారణాల వల్ల సన్యసించడం కాకుండా ఆధ్యాత్మిక జ్ఞానం కోసం స్వీకరిస్తే అది నిజమైన సన్యాసమవుతుంది.

చావుభయంతో చేసే సన్యాసం వల్ల ప్రయోజనం లేదు. దానివల్ల గత పాపాలు పోవు, పాపమంటే ఏమిటి? పాపమంటే అధర్మకృతం. దీనినుంచి తాత్కాలికంగా తప్పించుకోవచ్చునేమో గాని చివరకది శిక్షించక మానదంటున్నాడు వేమన. కాబట్టి పాపం చేసేముందే కాస్త జాగ్రత్తగా ఉండడం మేలు అనేది వేమన్న సందేశం.

**చిక్కియున్న వేళ సింహంబునైనను**
**బక్కకుక్కచేరి బాధసేయు**
**బలిమిలేని వేళ పంతంబు చెల్లదు**
**విశ్వదాభిరామ వినురవేమ**

అనగనగా ఒక సింహం. ఒకప్పుడు దానికెదురులేదు. అడవికి రాజు.ఇప్పుడు వేటగాళ్లకు చిక్కింది. బోనులో పెట్టారు. ఇక చూస్కోండి. ఇప్పుడది బక్కకుక్కకు కూడా లోకువే. అది సింహాన్ని సతాయించగలదు, భయపెట్టగలదు కూడా. కాలం అనుకూలించనప్పుడు గర్జించి మాత్రం ఏం లాభం అంటున్నాడు వేమన.

'*స్థాన బలిమి గాని తన బలిమి కాదయా*' అన్నాడు వేమనే ఒకచోట. అలాగే 'కాలబలిమి గాని తన బలిమి గాదయా' అనే అర్థాన్ని ఈ పద్యంలో ధ్వనిస్తున్నాడు.

'చిక్కియున్నవేళ' అంటున్నాడు. చిక్కిన అంటే అర్థచ్ఛాయలు చాలానే వున్నాయి. చీకాకుపడటం, చీదర, దిగ్భ్రమ, సంకటం, భ్రమ, గందరగోళం, తత్తరపాటు, తబ్బిబ్బు, వైకల్యం, వ్యాకులం ఇలా ఎన్నో! అయితే చిక్కడం అంటే బక్కచిక్కడం అని కూడా చెప్పుకోవచ్చు. బక్కచిక్కినప్పుడు అంటే బలం ఉడిగినప్పుడు కుక్కలాంటి అల్పజంతువు కూడా బాధించగలదు. కుక్కే కాదు బక్క కుక్క కూడా.

వేమన పద్యాల్లో ఉండేవి చిన్నమాటలే. కాని అర్థదృష్టితో అవి చిన్నవి కాదు. బోలెడంత లోకానుభవాన్ని గర్భీకరించుకున్నవి. ఒక్కోమాటను పొరలు పొరలుగా విడదీస్తూపోతే ఎన్నో సందర్భాలు బయటపడతాయి. 'బలిమి' అనే మాట చూడండి. దీనికి బలం, శక్తి, దార్ఢ్యం, పటుత్వం, అధికారం, పుష్టి, వేగం, బలాత్కారం, నిర్బంధం, క్రౌర్యం, కాఠిన్యం, ఖండితం; వీటిలో వేమన దేనిని తన పద్యంలో ఉద్దేశించాడో చూసుకుంటే అది చక్కగా విశదమవుతుంది. అంతేకాదు ఆ వంకతో ఇతర పదాల కథాకమామిషును కూడా ఆకళింపు చేసుకోవచ్చు.

పంతం అంటే ప్రతిజ్ఞ, శపథం అనే అర్థాలున్నాయి కాని ఇక్కడ పౌరుషం సరిపోతుంది. బంధనాల్లో ఉన్నప్పుడు పౌరుషాన్ని విడనాడమని కాదు. కాలాను గుణంగా కొంత అణచుకొమ్మని. కాలాన్ని తెలుసుకోవడమంటే కాలానికి లొంగిపోవడం కాదని వేమన లోకజ్ఞ దృష్టి.

**చిత్తమనెడు వేరు శిథిలమైనప్పుడె**
**ప్రకృతి యనెడు చెట్టు పడును పిదప**
**కోర్కులనెడు పెద్ద కొమ్మలెండును గదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

*'ఎన్నగమనసే కారణ / మన్నిటికిని చూడ చూడ నాత్ముడుతానౌ'* అన్నాడు వేమనే మరోచోట. చిత్తమంటే మనస్సే. ఇది సంస్కారాలను దాచివుంచే మనఃప్రకృతి. ఇది గడిచిపోయిన వాటి గురించి రాబోయేవాటి గురించి ఆలోచిస్తూ వుంటుంది.

బ్రహ్మజ్ఞానాన్ని పొందే క్రమంలో మనస్సు పెద్ద అడ్డంకి. అదే మూలం. అందుకే దానిని వేరుతో పోలుస్తున్నాడు వేమన. ఆ వేరు నాశనమైతే తప్ప దాని మీద మొలిచిన చెట్టు పడిపోదు. ఏమిచెట్టు అది? ప్రకృతి అనే చెట్టు. ప్రకృతి అంటే ఏమిటి? సృష్టిలో అతిశయించి ఉండేది ప్రకృతి. అంటే మనస్సు, బుద్ధి ఇంద్రియ వికారాలు. సత్త్వరజస్తమో గుణాలు ఇవన్నీ ప్రకృతి.

చిత్తం అనే వేరును నరికివేస్తే దానికి సంబంధించిన ప్రకృతి అనే చెట్టు కూలి పోతుంది. అప్పుడేం జరుగుతుంది? ఏం జరుగుతుందంటే కోరికలు, భ్రాంతులు, ఆశలు, అహం అనే కొమ్మలు ఎండిపోతాయి. అప్పుడు చెట్టు యొక్క విధ్వంసం పూర్తవుతుంది. ఆత్మ దర్శనానికి దారి సుగమమవుతుంది. ఎప్పుడైతే ఆత్మజ్ఞానం కలుగుతుందో పరమాత్మ జ్ఞానానికి సాధన మొదలవుతుంది. ముక్తి ప్రాప్తికి మార్గమిదే అంటున్నాడు వేమన.

జటిలమైన తాత్త్విక విషయాన్ని కవితామయంగా చెప్తున్నాడు వేమన. వేరు, చెట్టు, కొమ్మలు అనే దృశ్యమాన వస్తువుల ద్వారా అమూర్తమైన ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరిస్తున్నాడు.

*చెట్టు భస్మమౌను* (డి.1723-900); *కోర్కెలెల్ల వట్టి కొమ్మలైయూడును'* (డి.1725-205) అనేవి పాఠాంతరాలు.

**చిత్తము గల యోగి శివుని వలెనె యుండు**
**మిథ్యయోగి యుండు మిడతవలెను**
**నిత్యుడైన యోగి నీవలెనుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో మూడు రకాల యోగులను గురించి చెప్తున్నాడు వేమన ఈ పద్యంలో. ఒకడు జ్ఞాని, రెండోవాడు వేషధారి, మూడోవాడు తన్మయుడు.

'చిత్తము గలయోగి' అంటున్నాడు. చిత్తము అంటే సంస్కారాలను దాచివుంచే ప్రకృతి. అంటే సర్వాన్నీ స్వయంగా ప్రకాశింపజేసే జ్ఞానం. ఇటువంటి యోగి శివుడిలాగే వందనీయుడు, మంగళకరుడు.

ఇక మిథ్యాయోగి. మిథ్య అంటే భ్రాంతి. ఇది సత్యాన్ని చూడనివ్వదు (False knowledge). ఇతనికి ఇహలోకంపైనే దృష్టి. ఇతన్ని మిడతతో పోలుస్తున్నాడు వేమన. మిడత అంటే ఒకరకం ఎగిరే పురుగు. పొడవైన మిడతకాళ్లు ఉండి ఒకచోట నుండి మరో చోటికి గంతేస్తుంది. శలభం అని కూడా అంటారు. మిడత పోలికవల్ల ఇంద్రియాగ్నిలో దగ్ధమయ్యేవాడు అని ధ్వని. ఇతడు కపటి, తత్త్వం తెలియదు. అనాచారి కూడా.

మూడోవాడు నిజమైన యోగి. ఇతడు నిత్యుడు. అదే ఇది, వేరేలేదు అనే జ్ఞానం కలవాడు నిత్యుడైన యోగి. ఇతడు నిశ్చలుడు, హృదయంలో బ్రహ్మంలాగ నిలకడగా ఉంటాడు. అన్నింటికీ అతీతంగా వుంటాడు, ముఖ్యంగా లోకహితాన్ని కాంక్షిస్తాడు. యోగి అని వేరుపెట్టుకున్నంత మాత్రాన అందరూ యోగులవుతారా? కారు అని వేమన్న ఉవాచ.

**చిప్పలోన బడ్డ చినుకు ముత్యంబాయె**
**నీళ్లబడ్డ చినుకు నీళ్ల గలిసె**
**ప్రాప్తముగల చోట ఫలమేల తప్పునో**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

స్వాతికార్తెలో కురిసే వానచినుకు ముత్యపు చిప్పలో పడిందా ముత్యంగా మారుతుంది. సముద్రం నీళ్లలో పడితే తన అస్తిత్వం కోల్పోయి సముద్రంలో భాగమైపోతుంది. ఏదైనా అంతే! పొందదగిన దానిని పొందకమానదు. అదే దానికి దక్కిన ఫలం.

స్వాతిచినుకులు కోటానుకోట్లు కురుస్తాయి. కాని ముత్యపు చిప్పలోపడ్డ ఒక్కచినుకే ముత్యమౌతుంది. మిగిలినవన్నీ అపార జలరాశిలో కలిసి అనామకమౌతాయి. ఇది కొందరిదృష్టిలో కవిసమయం. విశ్వాసం కూడా. అయితేనేమి, దొరికిన అవకాశాన్ని వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయనేదే దీనిలోని సందేశం. స్వాతిచిప్ప కూడ తనలో కురిసే చినుకుకోసం ఎదురుచూస్తుంది.

చిప్ప అంటే పెంకు. కొబ్బరి కుడుకను కూడ చిప్ప అంటారు. సముద్రంలో రసాయనిక ప్రక్రియలో రూపొందేది స్వాతి చిప్ప. శంఖాలు కూడా అలాగే తయారౌతాయి. శంఖంలో పురుగు వుండి కొన్నాళ్లకు చనిపోతుంది. పెంకు (shell) మిగుల్తుంది. బయటి ప్రపంచంలో మట్టిచిప్పనే చిప్ప అంటారు. లోహపాత్రను అనరు. ముత్యాలు సముద్రంలోనే తయారవుతాయంటారు. రత్నాలు కూడా. అందుకే సముద్రానికి రత్నాకరం అని పేరు. కొండల్లో కూడా రత్నాలు దొరకుతాయి. ఇప్పుడు సముద్రం ఉప్పుతో కృత్రిమంగా రత్నాలు పండిస్తున్నారట. అది వేరే సంగతి.

స్వాతి అనేది ఒక నక్షత్రం పేరు. చంద్రుడి ఒక భార్య పేరు కూడా స్వాతే.

ప్రాప్తం అంటే ఇక్కడ దొరికిన చోటు. అంటే స్థలం. దాని అదృష్టాన్ని ఒక త్రుటికాలం నిర్ణయించింది. అంటే కాలం. స్థల కాలాల మహిమ ఒక చినుకు జీవితాన్ని మార్చేసి ముత్యంగా ఆవిష్కరించింది.

ఏది ఏమైనా ఒక సాధారణ లోకసత్యం వేమనదృష్టిలో పడి ఒక అనర్ఘ పద్యమౌక్తికంగా పరిణమించి ప్రకాశిస్తున్నది.

**చీమ కుట్టెనేని చివుకు మనిపించును**
**చీమ యెంత దాని జీవమెంత?**
**చీమ వంటి వారి సృష్టిలో నెరుగరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చీమ కుడితే వెంటనే దాని మంట తెలుస్తుంది. ఆలోచిస్తే పరిమాణంలో చీమ ఎంతచిన్నదో, దానిప్రాణం ఎంత స్వల్పమైనదో తెలుస్తుంది. తెలియని దేమిటంటే, అంత చిన్న చీమలో ఎంతో ప్రపంచం ఇమిడి ఉంది!, సృష్టిలో దాని విలక్షణ స్థానం ఏమిటి అనేది. చివుకు అంటే శిథిలం కావడం, కుళ్లిపోవడం అని అర్థాలున్నాయి కాని ఇక్కడది కాదు. హాటాత్తుగా నొప్పి కలిగించడమనేది ఇక్కడి విషయం. చీమ ఎంతటిది? అని వేమన అనటం లేదు. మనం అనుకుంటున్నాం. పైగా చీమ అంటే ఏమిటో కొంచెం లోతుగా ఆలోచించి గ్రహించమంటున్నాడు వేమన.

చీమలు చిన్నవే కావొచ్చు, కాని చీమల లోకం చిన్నది కాదు. చీమల జీవన వ్యవస్థ మనుష్యుల వ్యవస్థను మించిపోయినట్టిది. చీమల్లో రాజు, రాణి, శ్రామిక వర్గాలు అని మూడురకాలుంటాయి. రాజు గొప్ప ఏమీ ఉండదు. అవసరాన్ని బట్టి, పనిని బట్టి విలువగాని ఇతర గొప్పలు ఏమీ ఉండవు. చీమలు ఇతర కాలాల్లో శ్రమించి ఆహారం నిల్వ చేసుకుంటాయి. వర్షాకాలంలో కూచొని తింటాయి.

చీమలు చిన్నవంటావా? అయితే చీమల శక్తి మాత్రం చిన్నది కాదు. ఒక చీమ తన బరువుకంటె యాభై రెండు రెట్ల బరువును మోస్తుంది. సుమతి శతకం రాసిన బద్దెన కవి 'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె' అన్నాడు. అలాగే చీమ శరీరానికి అనేక స్థితిగతులను భరించే శక్తి వుంటుంది. గాలిలో ప్రాణవాయువు కొంతకాలం లేకున్నా చీమలు బతుకుతాయి. మనిషైతే!? చచ్చి ఊరుకుంటాడు. "దాని జీవమెంత?" అని వేమన అనటంలో ఇంత అంతరార్థముంది. "లోనెరుగరా" అంటే పైపైన చూడటం కాదు లోతుగా అర్థం చేసుకోవాలనేది తాత్పర్యం. 'సృష్టి' అంటే సంస్కృతి అనే అర్థం కూడా వుంది. నిఖిల సృష్టితో పాటు, చీమల జీవన విధానం అని కూడా గ్రహించాలి.

సారాంశమేమిటంటే మనిషి ఆకారాన్ని బట్టి అంచనా కట్టొద్దు. ఆ మనిషి శక్తి యుక్తులను అర్థం చేసుకోవాలని. వేమన పద్యం కూడా పైకి చిన్నదిగా కనిపిస్తుంది. కాని చదవగా చదవగా తెలుస్తుంది దాని వైశాల్య గాఢత లెంతో.

**చూలు వలన పుట్టు సుఖదుఃఖములు రెండు**
**పతికి సతికి పుట్టు పరగసుతుడు**
**సతికి సుతుని వలన సౌఖ్యంబు కలుగును**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

గర్భం ధరించి ప్రసవించటం వల్ల స్త్రీకి ఎంతో బాధ కలుగుతుంది, ఆ తర్వాత సంతోషమూ కలుగుతుంది. సంతానాన్ని కనటంలో భార్యా భర్తల ఇద్దరి ప్రమేయమున్నప్పటికీ ఆమెకు మాత్రం సంతానం వల్ల కలిగే ఆనందం అమితమైంది.

సంతానధర్మంలో తల్లిదే మొదటి స్థానం. మాతృదేవోభవ పితృదేవోభవ అన్నప్పుడు కూడా తండ్రిది రెండో స్థానమే. ఎందుకంటే తల్లిది పేగు సంబంధం, రక్తసంబంధం. లోకంలో తల్లికి కొడుకుపైన, తండ్రికి కూతురుపైన ఎక్కువ ప్రేమ ఉంటుందంటారు. ఇది యథార్థం కాదు. అసలు తన సంతానం పట్ల తండ్రి కంటె తల్లికే మమకారం అధికం, అది సహజం; లింగ ప్రసక్తి కిక్కడ తావు లేదు, ఈ పద్యంలో సుతుడనే కాదు అది ఉభయ సంతాన వాచకం. చూలు అంటే కడుపు, పిండం అని కూడా. చూలాలు అంటే గర్భవతి. చూలు చేయు అంటే గర్భవతిని చేయు అని అర్థం. చూలు చేసే వాడికి బాధ్యత ఉండొచ్చు గాని తల్లి మమత దానికన్నా పెద్దది. పరగ అంటే ఒప్పునట్లుగా అని. సౌఖ్యం అంటే హాయి, ఆనందం, ఆరోగ్యం కూడా.

*సౌఖ్యంబు కలుగునా?* (డి.1726) అనేది పాఠాంతరం.

**చెట్టు చేమ గొట్టి చుట్టు గోడలు బెట్టి**
**ఇట్టునట్టు పెద్ద యిల్లు గట్టి**
**మిట్టిపడును నరుడు మీది చేటెరుగక**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇల్లుకట్టుకోవడానికి ఏం కావాలి? కప్పు కోసం కలప కావాలి. గోడల కోసం మట్టి కావాలి. ఇటువైపు నుంచి అటువైపు దాకా అతడో విశాలమైన ఇల్లు కట్టించాడు. బాగానే వుంది. మరి దానిని చూసుకొని అదే శాశ్వతమనుకొని విర్ర వీగుతాడేమిటి? అది శిథిలం కాకుండా వుంటుందా? అంతెందుకు దాని కన్న ముందు అతడే నశిస్తాడు కదా! ఇటువంటి మనిషి నిజంగా అజ్ఞాని అని జాలిపడుతున్నాడు వేమన.

ఇల్లు అంటే నివాస స్థలం. ఉనికిపట్టు. ఇది దేశీయపదం. మూలద్రావిడంలో 'ఇల్' అంటారు. తమిళంలోనూ ఇల్. మలయాళంలో ఇల్లమ్. ఇల్లంటే కుటుంబమని కూడా. మనుషులు నివసించేదే ఇల్లు. వదిలేసిన దాన్ని భూతగృహం అంటారు.

చెట్టుచేమ అంటే చెట్టూ దానిచుట్టూ ఉండే తుప్పలు మొదలైనవి. చేమ అంటే ఒకరకమైన శాకభేదం కూడా. మిట్టిపడటమంటే మిడిసిపడటం, గర్వించటం. మీద అంటే పైన, తర్వాత అని కూడ. ఇక్కడ తర్వాత. రేపు ఏం జరుగుతుందో ఆలోచించకుండా అహంకరిస్తే ఇక అంతే! అనేది సారాంశం. చేటు అంటే చెడు, హాని.

ఇల్లు అనేది ఉభయ లోకతారకం కాదు. ఈ లోకంలో ఒక మజిలి. మనుషులు జీవచైతన్యంతో నివసించేదే ఇల్లు. సత్కార్యాలు జరిగేదే ఇల్లు అని గ్రహించ మంటున్నాడు వేమన. పెట్టి కానలేక మిట్టిపడును జనులు(డి.1769-286) అనేది పాఠాంతరం.

**చెట్టు మీద నీడ చెలగి యింతయు లేదు**
**చెట్టు మునిగి నీరు చేరలేదు**
**చెట్టురీతి నుండె చెట్టేల చచ్చెనో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొన్నివేమన పద్యాలు తాత్విక పేటికలు. తాళపు చెవి దొరికితే తప్ప వాటిని తెరవలేము. సాధకులకు (insiders) మాత్రమే తెలిసే ప్రతీకలు ఎన్నో వుంటాయి వీటిలో. ఒకరకంగా ఇది వేదాంత పరిభాష. లౌకిక పాండిత్యం సరిహద్దుల దాక మాత్రమే వెళ్లి ఆగిపోతుంది. మనకు ప్రస్తుతానికి గత్యంతరం లేదు. అప్పటిదాకా ఆగలేం కదా!

సి.పి. బ్రౌన్ ఈ పద్యానికి అర్థం చెప్పే ప్రయత్నం చేశాడు (verses of Vemana క్రీ.శ.1829) చెట్టును పరబ్రహ్మం అన్నాడు. పరబ్రహ్మం అంటే సత్యమే. ఎటువంటి సత్యమది? నిజానికి ఈ పద్యంలోని చెట్టు సంసారవృక్షం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దేహం. ఈ దేహం మరో మహాదేహం (పరబ్రహ్మం) లోని భాగమే. అజ్ఞానంవల్ల ఇది తాను విడిగా ఉన్నాననుకుంటుంది. దీనికి ఆశలుంటాయి, భ్రాంతులుంటాయి. అహంకారముంటుంది. అవే నీడలు. ఆ నీడలు తొలగిపోతే పరబ్రహ్మ సాక్షాత్కారమౌతుంది. 'చెట్టుమీద' అంటే ఇక్కడ చెట్టుకింద అనే. 'ఇంతయు లేదు' అంటే ఏమర్థం మిగల్లేదు, అంతా ప్రకాశమే అని అర్థం. ఇక నీరు అంటే జీవతత్వం. కర్మబంధాలన్నీ దీనిలోని బాగాలే. ఇక్కడ చెట్టు వాటిలో మునిగిపోలేదు. చెట్టు చెట్టులాగే వుంది. నశించలేదు, మరో పరమవృక్షంలో భాగమైపోయింది. కాబట్టి అది చచ్చిందనుకోవడం అజ్ఞానం అంటున్నాడు వేమన.

**చెట్టు మొదలె లేదు చెలగు కొమ్మలు నాల్గు**
**బట్ట బైటనుండు పండు బండు**
**తిన్నను చవిలేదు తీపుల బుట్టించు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అది సృష్టి అనే చెట్టు. దాని వేళ్లు ఎక్కడో తెలియదు. దానికి నాలుగు కొమ్మలు. అవి అండజాలు. పిండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు. అందరికి తెలిసిపోతూనే ఆ చెట్టుకు ఒక పండు పండుతుంది. అదే జీవుడు. ఆ జీవఫలానికి రుచి ఉండదు కాని దాని తీపి ఘనం అంటున్నాడు వేమన.

ఇది పొడుపు కథలాంటి పద్యం. ప్రతీకల మయం. ఇటువంటి పద్యాలకు బ్రౌన్ మార్మిక పద్యాలు అని పేరు పెట్టాడు. పరిష్కరించేటప్పుడు వీటికి తోచిన అర్థం రాయవద్దని తన దగ్గర పనిచేసే పండితులను ఆయన కట్టడి చేసేవాడు. అది ఆయన నిజాయితికి నిదర్శనం.

అండజాలు అంటే పక్షులు. పిండజాలంటే జంతుజాలం (మనుషులు కూడా), స్వేదజాలు క్రిమి కీటకాలు, అలాగే ఉద్భిజాలంటే చెట్టు చేమలు. చూశారా సృష్టి అంటే ఇదే. "నేను ఒక్కణ్నే, బహుధా విస్తరించాను" అనే భగవద్వాక్యానికి అర్థం ఇదే. శాస్త్రీయంగా చూస్తే కూడా ఏకకణజీవి అమీబా నుంచే ఇంత ప్రాణ జనాభా ఏర్పడిందని గ్రహించవచ్చు.

ఇంతకు జీవుడు అంటే ఎవరు? ప్రాణాన్ని ధరించినవాడు జీవుడు. (జీవఃప్రాణ ధారణే); ప్రాణమంటే చైతన్యం. ప్రాణానికి దేహం కల్పించబడినప్పుడే దానికి రూపం ఏర్పడుతుంది.

'తిన్నను చవి లేదు' అంటున్నాడు వేమన. జీవుని అనుభవం భౌతికమైన రుచికాదు. అదో ఆధ్యాత్మిక స్థాయి. అర్థం కావడానికి ఇలా చెప్పుకోవచ్చు. ముద్దు ఉందనుకోండి దానికి పై పై రుచి ఉండకపోవచ్చు. మోహాతిశయమే దాని తీపి.

**చెడ్డవాని మిగుల చెరుచును దైవంబు**
**అడ్డపడడు వానికాపదైన**
**చెడిన చేను జూచి ఒడయడు మెచ్చునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు స్వభావతః చెడ్డవాడు. దేవుడు కూడా అతనికి చెరుపే చేస్తాడు. చెరుపు చేస్తాడన్నప్పుడు ఆపదలో అతణ్ని ఆదుకోడు అని వేరే చెప్పాలా? అలాగే పొలం తనదే కావొచ్చుగాక అంతమాత్రాన దాని యజమాని, సారం కోల్పోయినప్పుడు దానిని ఆదరిస్తాడా? ఆదరించడని తాత్పర్యం. సద్బుద్ధి కలవాడికే విలువ వుంటుంది కాని దుర్బుద్ధికి కాదు అని సారాంశం.

చెడ్డ అంటే పాడైన, దారుణమైన, క్రూరమైన అని అర్థాలు. చెడ్డచేను అంటే ఫలితమివ్వనిదని. తెగులుపడ్డ పంట మొక్కలు కలదని.

అడ్డపడడు అంటే రక్షణకు రాడు అని. ఇక్కడ ఆటంకం కల్పించేవాడనే అర్థం పొసగదు. 'నేను అడ్డపడకపోతే వాళ్లు చచ్చి ఉండేవాళ్లు' అని అన్నప్పుడు రక్షణ అనే.

'ఒడయడు'కు రాజు, భర్త, సేనాపతి, స్వామి, అధికారి, యజమాని అని అర్థాలు. కన్నడంలో ఒడెయ అంటే రాజు ఒడయరు అంటే రాజుగారు. దాస సాహిత్యంలో ఒడయ అంటే దేవుడు. కర్ణాటకలో ఒడయార్ లున్నారు. క్షత్రియులు వీళ్లు. మైసూర్ రాజా ఒడయారే. తనవాడయినా పరాయివాడైనా చెడ్డవాడు చెడ్డవాడే. వర్జితుడన్నమాట. అలాగే పనికిరాని మొక్కలు నిండిన చేనును రైతు కాల్చేస్తాడు.

*'చెడ్డచేనికింత రెడ్డితనంబేల?'* (డి.1723-354) అనేది పాఠాంతరం.

**చెరకులోన నైన చెడ్డగుణంబున్న**
**తీసివేయకున్న తినగ పొసగ**
**దంతిపురము ద్రోహి యాతడెట్లుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎంత తియ్యటి చెరుకుగడలో నైనా ఏదైనా తెగులు వుంటే దానిని తొలగిస్తే గాని తినడానికి యోగ్యం కాదు. రాజాంతఃపురంలో ద్రోహచింతన మొలకెత్తిందను కోండి. వాటిని గుర్తించి శిక్షిస్తే తప్ప మిగతావారికి క్షేమం కలగదు.

చెడ్డగుణం అంటే తెగులు. చెరుకు కాండపు ఎర్రకుళ్లు తెగులు అని దానిపేరు. ఒకరకమైన శిలీంద్రం వల్ల ఇది వస్తుంది. పల్లెటూరి వాడుకలో గండమాల వ్యాధి అంటారు. తెగులుపడితే ఏమౌతుంది? చెరుకు నాణ్యత తగ్గిపోతుంది. దానినుండి తయారుచేసే బెల్లానికి మంచి పాకం రాదు.

కొందరు గొప్పవారి నాశ్రయిస్తే తమకు ఎదురు లేదనుకుంటారు. చెలరేగిపోతారు. రాజాంతఃపురాల్లో చొరవ కల్పించుకొని ద్రోహబుద్ధితో వర్తిస్తారు. కాలం మూడినప్పుడు అంతా బట్టబయలవుతుంది. అలాగే చెరుకుగడలో పుచ్చువుంటే రుచి చెడకపోవచ్చు గాని ఆ భాగాన్ని తీసెయ్యకపోతే మొదటికే మోసం వస్తుందని సారాంశం. *'తీసివేసిగాని తినగరాదు* (డి. 1723–361); *అంతరంగద్రోహి నతడెట్టు యేలురా* (డి. 1725–719); అనేవి పాఠాంతరాలు.

**చేటు వచ్చెనేని చెడనాడు దైవంబు**
**మేలు వచ్చెనేని మెచ్చుదన్ను**
**చేటు మేలుదలప చేసిన కర్మముల్**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు నిజంగా మూర్ఖుడే. ఎందుకంటే తనకేదయినా జరగగూడనిది జరిగితే దానికి దేవుడిని బాధ్యుణ్ని చేసి నిందిస్తాడు. పోనీ మంచే జరిగిందనుకోండి. అది తన ప్రయోజకత్వం అని చంకలెగరేస్తాడు. మంచి చెడులనేవి తానుచేసిన కర్మలను బట్టి సత్–దుష్ ఫలితాలనిస్తాయి అని తెలుసుకుంటే మంచిది అంటున్నాడు వేమన.

చేటు అంటే దురదృష్టం, హాని, ఉపద్రవం; చెడనాడుట అంటే తిట్టటం. కేవలం దేవుడికి బాధ్యతను ఆపాదించి ఊరుకోడు. తీవ్రంగా దుర్భాషలాడతాడు. మేలు అంటే గొప్పతనం, వరం, ఉపకారం, పుణ్యం, సుఖం, లాభం, శుభం, న్యాయం, అందం, సారం, జాగ్రత్త, శ్రేష్ఠం, బాగు, మంచి ఇలా అనేక అర్థచ్ఛాయ లున్నాయి. సందర్భాన్ని బట్టి అన్వయించుకోవాలి.

అజ్ఞాని తనకు కీడు జరిగినప్పుడు భగవంతుడు దానిని ఆపలేకపోయాడని భావించి దైవదూషణ చేస్తాడు. ఒక్కక్షణం ఆగి ఆలోచిస్తే అది అలా ఎందుకు జరిగింది? తను చేసిన పనులవల్లనే ఈ పర్యవసానం కలిగిందా అనే ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. మేలు కూడా అంతే. కాని అది తన నిర్వాకం వల్లనే సాధ్యమయిందనుకుంటే ఎలా? పైగా దీనికోసం తనపైనే ప్రశంసాప్రకటన. అక్కడ దైవదూషణ ఎంత తప్పో ఇక్కడ ఆత్మభూషణ కూడా అంతే తప్పు. మేలు, కీడులు వెలుగునీడల్లాంటివి. సహజమైనవి. కర్మవశాన ఒకదాని తర్వాత ఒకటి వచ్చి పోతుంటాయని తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

**జనుడు తెలివినొంద చంచలింపదు మది**
**దైవమును దెలసిన తగులుబుద్ధి**
**తివురు భానుజూచి తిమిరంబు నిలుచునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనిషి తన శక్తియుక్తులను తెలుసుకొని మెలిగితే మనస్సు నిశ్చలమవుతుంది. దైవాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే జ్ఞానం అతని సొంతమవుతుంది. అలాగే ప్రకాశించే సూర్యుడి ముందు చీకటి నిలుస్తుందా? లేదు పారిపోతుంది అంటున్నాడు వేమన.

'ఎన్నగ మనసే కారణమన్నిటికిని' అన్నాడు వేమనే మరోచోట. మనస్సు ఊరికే చలిస్తుంటుంది. ఒకచోట నిలవదు, చెప్పినట్టు వినదు. అది తాను చెప్పినట్టు వినాలంటే మనిషి శక్తిని సమకూర్చుకోవాలి. ఆ శక్తి దయా, ధర్మం, నీతి వంటి వాటి వల్ల సిద్ధిస్తుంది. దానినే తెలివి అంటారు. అదే ఎరుక, అదే జ్ఞానం. తెలివి అంటే నిర్మలత్వం, వికాసం, జాగరూకత. మూర్ఛనుండి తేరుకోవటం కూడా తెలివే. అజ్ఞానం అనేది మూర్ఛలాంటిదే అని అంతరార్థం. తివురు అంటే అతిశయించు అని అర్థం. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు' అంటే ప్రయత్నించి అని. భానుడు అంటే సూర్యుడే అంటే కిరణాలు గలవాడు. భానువు అంటే కిరణం. తిమిరం అంటే చీకటి. 'తిమిరంతో సమరం' అనే కవిత రాశాడు దాశరథి. తిమిరాన్ని పారదోలాలంటే నువ్వు స్వయంగా ప్రకాశమానుడివి కావాలనేది సారాంశం.

**జాణలైన యట్టి చపలాయతాక్షుల**
**వలపులరసి చూచి భ్రమయనేల?**
**బయలిరూపులెల్ల పరికింపగా నేల**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ముందే వారు మోహింపజెయ్యటంలో నేర్పరులు. పైగా విశాలమైన కదిలే కన్నులున్న సొగసు కత్తెలు. వారి వాంఛలను చూసి భ్రమల్లో పడటమెందుకు? బాహ్యారూపాలను చూసి మోసపోరాదు, అంతఃసౌందర్యం ముఖ్యం అంటున్నాడు వేమన.

జాణ అంటే నిపుణురాలు, సమర్థురాలు, తెలివిగలది అని అర్థాలు. ఇది తెలుగుమాట. ద్రావిడపదమన్నమాట! కన్నడంలో జాణ, జాణె అంటారు. శాణ నుంచి జాణ వచ్చి వుంటుంది. శాణ అంటే పదును పెట్టే రాయి, ఒరిపిడి రాయి, నికషోపలం. శాణ యే సాన. జాణ అంటే చురుకైంది అని అర్థం. నెరజాణ అంటే చాలా నేర్పుగలదని. నెల్లూరి నెరజాణ అంటారు. *"మనోభవుని పట్టము గట్టికొనంగజాలు జాణని మగనిగవుంగిట ననారతముంగొనియాడు నెచ్చెలీ!"* అనేది ప్రయోగం.

'చపలాయతాక్షులు'; చపలం అంటే చంచలం, నిలకడలేని అని అర్థం. ఆయతం అంటే నిడుపైన, విశాలమైన అని. దానికి బ్రౌన్ Roguish swimming eyes అని అర్థం చెప్పాడు. మోహింపజేస్తూ ఈదులాడే కళ్లు. ఈదులాడే అంటే చేపలాంటి అని. శఫరనేత్ర అంటారు. శఫరం అంటే ఎగిసి పడేచేప. ఎంతందమో చూడండి! ఇక వలచక చస్తాడా? వలపు అంటే కామించడం, కోరటం, అపేక్షించటం, వలపు కూడా దేశీయపదమే. తమిళంలో ఒల్, కన్నడంలో ఒల్లు అంటారు. వలరాజు అంటే మన్మథుడు.

నువ్వు చూస్తున్నది పై పై మెరుగులే. వారి వలపు నిజమైన వలపు కాదు, అది నీ భ్రమ. అందగత్తెల హోయలు చూసి అది నిజమైన సౌందర్యమనుకోకు. మానసిక సౌందర్యమే నిజమైన సౌందర్యం అనేది వేమన్న సారాంశం.

'*మురికితోలు కింత కరువు గొన్నారయా*' (డి.1723, 155) *తలపులరసి చూచి తలచె గాక* (డి. 1724, 103)

**జాతిమతము విడిచి చని యోగిగా మేలు**
**జాతితోనె యున్న నీతులేల?**
**మతము బట్టి జాతి మానకుంట కొరత**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యోగి కాదల్చుకున్నవాడు జాతి, మతం, కులం లాంటి ప్రాపంచిక వాసనలను వదులుకోవడం మంచిది. యోగజ్ఞానం దాకా వెళ్లిన వాడి జాతి ఇంకా అతడి దగ్గరే ఉంటే ఇతరులకు చెప్పగలిగిన ప్రబోధం మాత్రం ఏముంటుంది? మతాన్ని పట్టుకొని వేలాడుతూ, జాతిని పట్టుకొని పాకులాడుతూ ఉండేవాడు యోగి మాత్రుడవుతాడు. నిజమైన యోగం అతనికందదు అంటున్నాడు వేమన.

నువ్వు యోగివయ్యావు, గొప్ప ఆధ్యాత్మిక స్థాయికి చేరుకున్నావు. ఇంకా పూర్వాశ్రమంలో ఫలానా వాడు అనిపించుకోవాలనే తాపత్రయమెందుకు? జాతి అంటే వంశం లేదా కులం. మతమంటే మతమే గాని మాధ్వ, స్మార్తంలాంటి శాఖలు కూడా మతాలే. పెద్దమతాలైన వైష్ణవం, శైవం, శాక్తం, గాణాపత్యం, సౌరం, కాపాలికం వంటి షణ్మతాలను వదులుకుంటే ఆ యోగం నిర్మలంగా వుంటుంది. విడిచి చని అంటే విడవటమే కాదు వాటికి దూరంగా వెళ్లిపోయి అని అర్థం. యోగిగామేలు అంటే యోగికాన్–కావడం మంచిది అని. నీతి అంటే సరైనది. న్యాయమైనది. 'ఇది నీతియె' అంటే ఇది సరైనదేనా అని. నీతి చెప్పడం అంటే సలహా చెప్పడమని. నువ్వే సామాజిక హోదాను వదులుకోకపోతే ఇతరులకేం దారి చూపిస్తావు అని వేమన మందలింపు. జాతివారు అంటే మేలుజాతి వారని వాడుక. జాతికస్తూరి, జాతివజ్రం ఇలా. వేమన్న కాలానికి ఆంగ్లేయులను జాతివాండ్లు అని వ్యవహరించేవారు.

**జాతులందు నెట్టి జాతి ముఖ్యము చూడ**
**ఎరుక లేక తిరుగనేమి గలదు?**
**ఎరుక గలుగు మనుజుడే జాతి గలవాడు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

కులాలు అనేకమున్నాయి. వాటిలో ఫలానా కులం గొప్పదని చెప్పగలమా? ఇవన్నీ బ్రహ్మజ్ఞానం లేనప్పుడు కనపడే భేదాలు. ఇదంతా వ్యర్థప్రయాస. నిజానికి ఆత్మజ్ఞాన సంపన్నుడే గొప్ప కులస్తుడు, పూజనీయుడు. అతణ్ని అందరు ఆదర్శంగా తీసుకోవాలి అని వేమన్న ఉవాచ.

కుల వ్యవస్థను సామాజికంగా కాక ఆధ్మాత్మిక దృష్టితో ఖండించిన వైనమిది. 17వ శతాబ్దంనాటి తెలుగు భక్తి ఉద్యమ కవులందరు ఈ పని చేశారు. భూస్వామ్య వ్యవస్థ బీటలు వారడం ప్రారంభించిన కాలమది. అంతకుముందు పండితారాధ్యుడు కులభేదాలను నిరసించాడు గాని కులవ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించలేదు. ఈయన వర్ణవ్యవస్థకూ భక్తికీ కొంత రాజీ చెయ్యాలని ప్రయత్నించాడు. వీరశైవులు కుల వ్యవస్థను వ్యతిరేకించారు గాని రాచరిక వ్యవస్థను సమర్థించారు. కుల నిర్మూలనకు బయల్దేరిన వీరశైవులు ఉన్న కులాలకు అదనంగా లింగాయుతులు, జంగములు, బలిజలు, ఆరాధ్యులు వంటి కొత్త కులాలను చేర్చారు. కులవ్యవస్థ ఎంత మొండిదో దీనివల్ల అర్థమౌతుంది. అందుకేనేమో వేమనలాంటి వారు జ్ఞానాన్ని బట్టి ఉత్తమ కులాన్ని నిర్ణయించాలన్నారు. ఎరుక అంటే సామాన్యార్థంలో తెలివి. ఎరుక, బయలు వంటి మాటలు అచల సంప్రదాయంలో ముఖ్యమైనవి. దీనిలో ఎరుకే అన్నిటికి మూలం. కాని దానికి మాత్రం మూలం లేదు. సృష్టికి కారణవస్తువుగా ఏ బ్రహ్మమును ప్రతిపాదించారో అదే ఎరుక.

ఇక మనవారు 18 జాతులను లెక్కవేశారు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, వ్యావహారిక, గోరక్ష, శిల్పక, పంచాణ, కుంభకార, తంతువాయ, క్షౌరక, రజక, వస్త్రచ్ఛేదక, చర్మకార, తిలఘాత, లుబ్ధక, చండాల, మాతంగ. ఇవన్నీ సంస్కృతంలో ఉన్నాయి. తెలుగులో పేర్లు మారుతాయి.

*'కులము కన్న మిగుల గుణము ప్రధానంబు'* అన్న భావాన్నే ఆధ్మాత్మిక సందర్భంలో చెప్తున్నాడీ పద్యంలో వేమన.

*"జాతులందు మిగుల జాతి యేదెక్కువో / ఎరుకలేక తిరుగనేమి ఫలము / ఎరుక గలుగువాడె హెచ్చైన కులజుడు".* (డి.1726-128) అనేది పాఠాంతరం.

**జీవిజీవి జంపి జీవికి వేయగా**
**జీవి వలన నేమి చిక్కియుండె**
**జీవి హింసకులకు చిక్కునా మోక్షంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సర్వమతాల సారాన్ని తర్కదృష్టితో తరచి చూసిన వేమనను జైన మతంలోని దయ, అహింస ఆకర్షించి వుంటాయి. జీవహింస ఏ రూపంలోనైనా ఖండనార్హమేనని వేమన భావించాడు. ఆంధ్రదేశంలో బౌద్ధానికన్న జైనమే ముందుగా ప్రవేశించింది. వేమనకు ముందే రాయలసీమలో 24 జైన స్థావరాలను ఆరుద్ర గుర్తించారు.

ఈ పద్యంలో వేమన్న ఏమంటున్నాడు? ఏమంటున్నాడంటే ఒక జీవి మరో జీవిని చంపి ఇంకోజీవికి పెట్టడం వల్ల తినేది బలుస్తుందే తప్ప దానికి ప్రయోజనం లేదు. హింసించే వారికి కబళించే వారికి పాపమే గాని మోక్షం లేదు అని.

మాంసభుక్కుల వల్ల హింస ఎక్కువగా జరుగుతుంది. బ్రాహ్మణేతరులు మాత్రమే కాదు, బ్రాహ్మణులలో ఒకప్పుడు యజ్ఞయాగాదులు చేసే వాళ్లు కూడా మాంస భక్షకులే. కాబట్టి సాత్త్వికమైన ఆహారవిహారాల వల్లనే మోక్షం సిద్ధిస్తుంది గాని రజోగుణ ప్రధానమైన ఆచరణ వల్ల కాదని వేమన్న ఉవాచ.

జీవి అంటే ప్రాణి. జీవహింస మానాలని వేమన్న ఉద్బోధ.

**జీవభావ మెరుగ చెడదెన్నటికి మతి**
**దైవమును నెరుంగ తనరు బుద్ధి**
**తేజముదయ మంది తిమిరంబు నిలువదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జీవ స్వభావాన్నీ భావమర్మాన్నీ అర్థం చేసుకున్నవాడికి విచక్షణ ఎప్పటికీ నశించదు. అట్లాగే దైవాన్ని అనుభవంలోకి తెచ్చుకున్నవాడికి నిర్ణయశక్తి పెరుగుతుంది. సూర్యకాంతి సోకగానే చీకటి వెళ్లిపోదా? అట్లాగే ఇవన్నీ.

ఈ పద్యంలో వేమన జీవం, భావం, మతి, బుద్ధి అనే మాటలు వాడాడు. ఇవి ఆలవోకగా వాడిన వాడుక మాటలు కావు. జీవమంటే ప్రాణమే కావొచ్చు కాని ఇక్కడ ప్రాణరహస్యం. భావమంటే ఏమిటి? భావమంటే ఒక విషయాన్ని గ్రహించటంలో ప్రకాశితమయ్యే మానసిక వైఖరి. మరిమతి? ఆలోచనాశక్తి. బుద్ధి అంటే ఏమిటి? 'బుధ్యతే అనయేతి బుద్ధిః' అంటే బోధచేత ప్రకాశించేది బుద్ధి అని అర్థం. పద్యార్థంలో నిర్ణయాత్మక జ్ఞానమే బుద్ధి అని. దీనినే విజ్ఞాన మయకోశమని కూడా అంటారు.

జీవ, భావాల గురించి తెలియకుంటే మతి చెడిపోతుంది. దేవుడు అర్థమైతే మనసు మరింత ఆరి తేరుతుంది. తనరు అంటే పెరగటం.

ఏమీ లేదు. పైకి చిన్నమాటల్లా కనిపించే ఈ పెద్దమాటలకు అర్థం తెలిస్తే, జీవుడు దేవుడు లాంటి వాటి మధ్య సంబంధాన్ని గురించిన అవగాహన ఏర్పడుతుంది. ఆ అవగాహన వెలుగులో అహంకారం, భ్రాంతిలాంటి అవస్థలు తొలిగిపోతాయనేది వేమన్న ఉవాచ.

**జీవభేదమెరిగి చెడిపోనివారికి**
**భావిజనుల చెలిమి పట్టుబడదు**
**నీరు ముత్తెమైన నీరుగా బోవునా**
**విశ్వదాభిరామ వినురవేమ**

జీవానికీ పరమాత్మకు మధ్యగల సంబంధం తెలియక కొందరు మెట్టవేదాంతులు చెడిపోతుంటారు. అట్లా చెడిపోని జ్ఞానులకు రేపటితరం పట్ల మమకార లంపటాలుండవు. అంటే మళ్లీ వాటిలో తగుల్కోరు. ముత్యంగా గడ్డకట్టిన నీరెక్కడైనా మళ్లీ నీరుగా మారుతుందా? మారదు అంటున్నాడు వేమన.

జీవం అంటే ప్రాణం. ప్రాణానికీ పరమాత్మకూ నిజానికి భేదం లేదు. భేదం లేదని తెలుసుకోవడమే జ్ఞానం. స్థూలమైన పదార్థాల మధ్య మాత్రమే భేదం కనిపిస్తుంది. ఒక చెట్టు ఉందనుకోండి. దానికి కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు వేరు వేరుగా ఉంటాయి. ఇది ఒకరకమైన భేదం. కాని చెట్టు ఒకటే. అట్లాగే మామిడి, నిమ్మ, చింత, వేప అని వేరు వేరు చెట్లుంటాయి. కాని చెట్ల జాతి ఒకటే. ఇది మరోరకమైన భేదం. ఇక వృక్షాలకూ జంతువులకూ ఉండేది ఇది ఇంకోరకమైన భేదం. కాని భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు కాబట్టి ఆయనకూ జీవుడికీ మధ్య భేదముండదు. ప్రాణానికి ఆకారం ఉండదు కదా! ప్రాణధారి అయిన దేహానికే రూపం ఉంటుంది. జీవుడూ దేవుడు ఒకటే అని అభేదస్థితికి చేరుకున్న వాడు మళ్లీ వెనక్కి వచ్చి పామరుడౌతాడా? సంసారబంధాల్లో చిక్కుకుంటాడా?

ముత్యపు చిప్పలోని నీరు గట్టిపడి ముత్యంగా మారిన తరువాత అది మళ్లీ నీరుగా మారదు కదా అంటున్నాడు వేమన. ముత్యం ప్రసక్తి ఒక కవి సమయం. కవిసమయాలు మానవుని భావుకతకు, ఊహాశక్తికి నిదర్శనాలు. శాస్త్రీయదృష్టితో వాటిని కొట్టి పారెయ్యడం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదు. ఇక్కడ అదొక అందమైన దృష్టాంతం.

భావిజనులు అంటే రేపు రేపు పుట్టేవాళ్లు. సంతానం, చెలిమి అంటే మమకారం. మమకారం వదులుకున్నప్పుడే బ్రహ్మజ్ఞానం కలుగుతుందనేది వేమన్న ఉవాచ.

**జీవ, లింగ పూజ సేసిన వారికి**
**శిలల రూప మందు చింతయేల?**
**చెలగి మధువు గ్రోల చేదు రుచించునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

జీవుడు, లింగంల అభేద స్థాయికి చేరుకున్నవాడికి ఇతర రాతి లింగాల బాహ్య పూజ గురించి ఆలోచన లెందుకు? తేనెలాంటి తియ్యటి పదార్థాన్ని గ్రోలిన తర్వాత చేదు దినుసులు రుచిస్తాయా అంటున్నాడు వేమన.

వీరశైవంలో లింగారాధన చేసే జీవుడిని అంగం అంటారు. అతన్ని ఉపాసకుడంటారు. ఆరాధకుడని కూడా. ఎవరీ జీవుడు? శక్తి చేత పరిమితత్వాన్ని పొందిన శివుడే ఈ జీవుడు. అంగరూపంలో వున్న జీవుడు సంసారిక దుఃఖం నుండి విముక్తుడు కావటానికి తపస్సు చేస్తాడు. జీవునికి ఆ తపస్సు చేసే సామర్థ్యం 'శక్తి' నుండి లభిస్తుంది. ఒకరకంగా భక్తీ శక్తులు రెండూ ఒకటే అని సారాంశం.

వీరశైవంలో మరొక విలక్షణ కల్పనం ఏమిటంటే మానవశరీరంతో అభేదాన్ని కల్పించడం. దీనిని బట్టి పరమదైవమైన లింగానికి, పరిమితజీవుడైన అంగానికి అభేదం సూచించబడుతుంది. ఈ అంగం లేదా జీవుడు తన అవధులన్నింటిని నిర్మూలించుకొని, తనలో తానే ఒక నిరవధికమైన మహాతత్త్వాన్ని సాక్షాత్కరింప జేసుకుంటాడు. అదే ముక్తి అంటే! ఒక మహోన్నత స్థితికి చేరుకున్నవాడు మళ్లీ కిందికి వచ్చి శిలల రూపంలో రూప పూజకు పాల్పడటం విడ్డూరం అంటున్నాడు వేమన. మధువు అంటే తియ్యటి ద్రవం, అమృతం అని అర్థాలు. ఇప్పపూలతో చేసిన సారాకూడా మధువే. ఇక్కడ తేనె.

*'జీవలింగపూజ జితమైన వారలకు, చెలగి చెక్కర తిన్న చేదు మనసొగ్గునా'* (డి.1735-661) అనేవి పాఠాంతరాలు.

**జీవిలోన నుండు స్థిరమును కానక**
**తిరుగు నస్థిరంబు వరుసనమ్మి**
**స్థిరము నస్థిరమును తెలియజీవికి ముక్తి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేహంలో శాశ్వతమైన ఒక ఆత్మ ఉందని గమనించక అశాశ్వతమైన దేహాన్నే నమ్ముకుంటే ఏం లాభం? దీనివల్ల ముక్తి లభించదు. ముక్తి అంటే మరేమో కాదు. ఏది శాశ్వతమో ఏది అశాశ్వతమో తెలుసుకోవడమే ముక్తికి మార్గం.

జీవి అంటే ప్రాణంతో కూడిన దేహి. ప్రాణం, ఆత్మా ఒకటేనా వేరు వేరా అనేచర్చ తర్వాత. జీవం కలది జీవి అయినప్పుడు దాని జీవరూపమే శరీరం. ఈ శరీరం స్థిరమైంది కాదు. జన్మల వల్ల శరీరాలు మారుతుంటాయి. ప్రకృతిలాగే ప్రకృతిలో భాగమైన శరీరం అస్థిరం. మరి స్థిరమైంది ఏది? ఆత్మ. ఆత్మ ఎటువంటిది? ఆత్మకు పాపం, భయం ఉండవు, ముసలితనం, మరణం ఉండవు, శోకం, ఆకలి దప్పులుండవు. అది నిత్యం, సత్యం. శరీరం ఆత్మకాజాలదు. ఎందుకంటే శరీరానికి అలంకారం, నిరలంకారం, అంధత్వం తదితర దోషాలుంటాయి. అన్నిటిని మించి మరణముంటుంది. కాబట్టి అది అస్థిరం, దానిలోని ఆత్మ స్థిరం. దీనిని తెలుసుకుంటే ముక్తి లభిస్తుంది. ముక్తి అంటే ఏమిటి? అమృతత్వం. నదులు సముద్రంలో కలిసి తమ నామరూపాలను ఎలా కోల్పోతాయో అలాగే జీవి బ్రహ్మంలో లీనమై తానే బ్రహ్మమై ఇహబంధాలనుంచి ముక్తిని పొందుతాడు అని సారాంశం.

ఎంత గహనమైన తాత్త్విక విషయాన్నైనా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టుగా చెప్పాడు వేమన. ఇదెలా సాధ్యం? అంటే అనుభవయోగులకు ఏదైనా సాధ్యమే అనేది జవాబు.

**తండ్రికన్న సుగుణి తనయుండు కల్గెనా**
**పిన్న పెద్దతనము లెన్నతగదు**
**వాసుదేవు విడిచి వసుదేవునెంతురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తండ్రి పెద్దవాడే అయినా కొడుకు అతని కన్న గుణవంతుడైతే ఆ కొడుకును మెచ్చుకోకుండా ఉండగలమా! ఈ విషయంలో పెద్దా చిన్నా అనే తారతమ్యానికి తావు లేదు. అదెట్లాగంటే వసుదేవుడు తండ్రి అయినప్పటికీ వాసుదేవుడైన కృష్ణుని విస్మరించి అతనిని మాత్రమే ప్రశంసించం కదా!

వసుదేవుడు కృష్ణుని కన్నతండ్రి. కారాగారంలో పుట్టిన శిశువుని క్షేమ ప్రదేశానికి చేర్చినవాడు. అయితే అనంతరకాలంలో ఆ కుమారుడు జగత్ప్రసిద్ధుడైనప్పుడు ఆ తండ్రికి కలిగేది ఆనందమే కదా! మరి వసు, వాసుదేవుల మధ్య పోటీ ఎందుకేర్పడింది? వేమన దానిని ఎందుకు ఖండిస్తున్నాడు? ఎందుకంటే జైనమతస్థులు వాసుదేవుణ్ని విడిచి వసుదేవుణ్ని కీర్తించారు. జైన కావ్యాల్లో 'వసుదేవహిండి' అనే గ్రంథం వసుదేవుని చరిత్రను కీర్తిస్తుందని ఆరుద్రగారు పేర్కొన్నారు. హిండి అంటే వ్యాప్తి. వేమన్న కాలానికి రాయలసీమలో జైనమతం ఉందా? లేదు. కనీసం దాని అవశేషాలు మిగిలి ఉన్నాయా? ఉండొచ్చు. కనీసం వసుదేవుని కీర్తించేవారు అక్కడక్కడ ఉన్నారేమో. అలా తనకు తటస్థపడిన వారిని వేమన ఎద్దేవా చేస్తున్న పద్యమిది. ఈ పద్యం చాలా ప్రతుల్లో వుంది. బ్రౌన్ 1829 నాటి ముద్రణంలో కూడా వుంది. చారిత్రక కారణాలేవయినా తండ్రిని మించిన కొడుకు తండ్రికే వన్నె తెస్తాడు గాని వారిమధ్య పోటీ ఉండదని సారాంశం.

**తగిన కులజుడైన తనయెత్తు ధనమైన**
**పరపురుషుని ఏల పట్టనెంచు?**
**పరమ సాధ్విచూడ పరులనంటదు సుమీ!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆమె పద్ధతే అంత, అతడు పెద్దకులం వాడైనా తనకులం వాడైనా కన్నెత్తి చూడదు. తన ఎత్తు ద్రవ్యం పోసి ఆశ చూపించినా ధనవంతుడికి వశం కాదు. పరపురుషుని పైకి ఆమె మనసు పోదు. భర్తే ఆమెకు సర్వస్వం. ఇటువంటి సాధ్వికి ఇహపరాలు లభిస్తాయని ఈ పద్యంలోని ధ్వని.

సాధ్వి అంటే పతివ్రత, శీలవతి. ఆమె పవిత్రురాలు. శారీరకంగానే కాదు మానసికంగా కూడా. ఆమెపైన మనస్సుపడి ఆమెను లోబరచుకోవడానికి చేసే ప్రయత్నాలేవీ ఫలించవు. అతడు ఉత్తమ వంశ సంజాతుడు కానీ, తనకోసం అపారమైన సంపదలు ధారబోయడానికి సిద్ధమయ్యే శ్రీమంతుడు కానీ కనీసం అతణ్ని తేరిపార చూడదు. ఆమెకు పరపురుషుని తలంపే రాదు. పరపురుషుడు అంటే భర్తకానివాడు.

స్త్రీ పురుష సంబంధాలు పునర్మూల్యాంకణానికి గురవుతున్న నేటి సన్నివేశంలో ఉన్నాం. భర్త పరమ దుర్మార్గుడైతే స్త్రీ యొక్క పాతివ్రత్యానికి అర్థంలేదు. భార్యా భర్తలమధ్య సంబంధం, స్త్రీ వ్యక్తిత్వం, కుటుంబ మూల్యాల మధ్య ఒకరకమైన సంఘర్షణకు ఎప్పుడూ గురవుతూనే ఉంటుంది. ఉమ్మడికుటుంబంమైనా వ్యష్టి కుటుంబమైనా పాతివ్రత్యమనేది ఒక విలువ. ఆ మాటకున్న పదార్థము నచ్చకపోతే సతీపతుల మధ్య ఉండవలసిన పరస్పర నిష్టను ఒక శాశ్వతమైన విలువగా భావించవచ్చు. పరస్పర నిష్ట ఉన్నప్పుడు స్త్రీకి గాని పురుషుడికి గాని 'పర' చింతనకు ఆస్కారం ఉండదు.

పట్టనెంచు అంటే చేపట్టబోవు అని. అంటు అంటే ముట్టుకోవడం.

"భాగ్యపురుషునేల పట్టనెంచు" (డి.1721-510) అనేది పాఠాంతరం.

**తత్వము తిరమైన తావుల వెదకుచు**
**తాను తత్వమగును తత్వయోగి**
**తలపులన్ని యుడుగ తానెపో తత్వంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎక్కడ స్థిరమైన తత్వజ్ఞానం ఉంటుందో ఆయా ప్రదేశాల్లో అన్వేషిస్తాడు. ఆ అన్వేషణలో తానే ఒక తాత్వికుడౌతాడు. ఇలా క్రమంగా బ్రహ్మజ్ఞుడై యోగిస్థాయికి చేరుకుంటాడు. ఇంతకూ తానూ తత్వం ఒక్కటి కావాలంటే ఏం చెయ్యాలి? ఏం లేదు కోరికలన్నింటిని నశింప జేసుకోవాలి అంటున్నాడు వేమన.

తిరం అనేది సంస్కృతంలోని స్థిరమే. నిలకడగా ఉండటం, నిబ్బరంగా ఉండటం అని అర్థాలు.

*'అరిగరమున నేదాల్చిన*
*నరిగరము నగేంద్ర ధీరుడైనం జెడడే*
*యరిదిరమై నన్నడుగుట*
*యరిదిరమైకాభిలాషులగు నృపతులకున్'* అనేది ప్రయోగం

ఈ పద్యాన్ని మరింత ఆధ్యాత్మికంగా వ్యాఖ్యానించాలంటే ఇట్లా చెప్పొచ్చు. 'తత్వంతిరమైన తావులు' అంటే భ్రుకుటి, నాభి, సహస్రారం లాంటి కేంద్రాలు. వీటిని గుర్తించి ప్రాణాయామం ద్వారా, ధ్యానం ద్వారా తత్వానుభూతిని పొందడం. తలపులు అంటే అహంకారం, భ్రాంతులు వగయిరాలు. నిజానికి వీటిని వివరించే అధికారం నాకు లేదు. నేను పండితుణ్ని, కొంత పరిశోధకుణ్ని కూడా. ఆధ్యాత్మిక సాధకుణ్ని కాదు. సగటు భారతీయుడికుండే సాధారణ జ్ఞానంతో నేనీ వివరణకు పూనుకున్నాను. కొంత నాకన్నా ఎక్కువ తెలిసిన వాడినడిగి సమన్వయం చేసి చెప్తున్నాను. పూర్వులకంటే కూడా ఇప్పటి యువతమీద నాకెక్కువ దృష్టి. వారికి నాకు తెలిసినంత తెలిసినా చాలునని నా తాపత్రయం.

**తత్వమెరుగువాడు దైవంబు నెరుగును**
**సర్వసారములను చంపజేయు**
**కదళిమింగు వాడు గరళంబు మింగునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సత్యం అంటే ఏమిటో తెలిసిన వాడికి దైవం అంటే ఏమిటో అర్థమౌతుంది. ఆ ఎరుక సకల ప్రపంచ వాసనలను నశింపజేస్తుంది. తియ్యటి అరటిపండు తిన్నవాడికి చేదువిషం సయిస్తుందా అంటున్నాడు వేమన. తత్వం దాకా వెళ్లిన వాడికి క్షుద్రమైన ప్రాపంచిక విషయాలు రుచించవు అని తాత్పర్యం.

తత్వజ్ఞానం అంటే పరమాత్మను గురించిన ఎరుక. తత్ అంటే అది. తనలాంటిది, తనలాంటిది కానిది, పేరులేనిది, రూపం లేనిది. సృష్టికి ముందూ తర్వాతా ఒకేలాగ వుండేదీ, అదీ తత్వమంటే! తత్వం తెలిస్తే దేవుడి గురించిన అనుభూతి సుగమమౌతుంది. దేవుడంటే ఎవరు? దేవుడంటే తేజస్వరూపుడై స్థూల నేత్రాలకు కనిపించక ప్రవర్తించేవాడు. దేవ సంబంధమైనవాడే దైవం. తత్వం అనే మాటకు దాని భావం, బ్రహ్మం అనే అర్థాలతో పాటు లౌకిక దృష్టితో యదార్థం, స్వభావం, వేదాంతం అనే ఛాయలు కూడా ఉన్నాయి. ఇంద్రియ సుఖభ్రాంతులను, అహంకారాన్నీ దరిజేరనీయని ముక్తస్థితిని తత్వమంటారు.

సారం అంటే రసం. ప్రాపంచిక రుచి తత్వాన్ని ఎరిగినవాడికి లౌకిక చింతన నశిస్తుంది. నశిస్తేనే అది నిజమైన తత్వజ్ఞానం. అదే దైవానికి మార్గం అంటున్నాడు వేమన. తత్వస్థాయికి ఎదిగినవాడు మళ్లీ కిందకి వస్తాడా? రాడు. ఎట్లాగంటే మధురమైన అరటిపండును రుచి చూసినవాడు తిక్తమైన విషాన్ని ఇష్టపడతాడా? 'చేదు విషం జీవఫలం' అన్నాడు శ్రీశ్రీ. దాని సందర్భం వేరనుకోండి. గరళం అంటే విషం, సర్పవిషమన్నమాట! ఇంద్రియ లోలత్వం అనేది సర్ప పరిష్వంగం లాంటిది అని ధ్వని.

**తత్వహీనులుంద్రు తరచుగా భువిలోన**
**తత్వమెరుగువారు తరచులేరు**
**కలిగిరేని వారు కన్పింప రారయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో తత్వం తెలియనివారే ఎక్కువగా వుంటారు. తత్వం తెలిసిన యోగిపుంగవులు చాలా తక్కువ సంఖ్యలో వుంటారు. ఉంటారు గాని వారు సామాన్యులకు కనిపించరు. ఎక్కడో ఏకాంతికులై తమ లోకంలో తాముంటారు తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

సామాన్యార్థంలో తత్వం అంటే 'దాని భావం' అని గతంలో చెప్పుకున్నాం. ఆధ్మాత్మిక దృష్టితో తత్వాలు మూడు. 1.ఈశ్వరుడు 2. జీవుడు 3. ప్రకృతి. ఈశ్వరుడు అంటే బ్రహ్మం, జీవుడేమో చిత్ స్వరూపం కలిగినవాడు, జీవులు అసంఖ్యాకులు; ప్రకృతి సత్వ రజస్తమోగుణ భరితమైంది. నిజానికి అసలు తత్వనిర్ణయం అంత సులభం కాదు. పైమూడింటి తత్వాల పరస్పర సంబంధాల నిర్ధారణలో ప్రమాణం శబ్దం. శబ్దమంటే వేదం. వేదమంటే వాక్యం. ఈ వాక్యాలు కొన్ని అద్వైతపరంగా, మరికొన్ని ద్వైతపరంగా ఉండటం వల్ల పైకి ఇవి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. ఒకరకంగా వీటి సమన్వయమే తత్వం.

వేమన, వీరబ్రహ్మం వంటి వారి బోధనలు భక్తి ఉద్యమంలో భాగమే. ఈ ఉద్యమం ఉత్తరభారతంలో 12 శతాబ్దంలో ప్రారంభమైనా చారిత్రక క్రమంలో దక్షిణాదిన 17వ శతాబ్దం వరకు కొనసాగింది. నిజానికి భక్తి ఉద్యమమనే మాట విచిత్రమైనది. భక్తి అనేది వైయక్తిక చైతన్యానికి సంబంధించినది. ఉద్యమం ఒక భావాన్ని ప్రజాబాహుళ్యం వైపు నడిపించే సామూహిక ప్రయత్నం. ఈ రెండు కలిసేవి కావు. కానీ కలిశాయి. అదే భక్తి ఉద్యమం అని వి.చెంచయ్యగారు చక్కగా విశ్లేషించారు. గహనమైన తత్వాన్నీ, వేదాంతపరిభాషనూ ప్రజల దగ్గరికి తీసికెళ్లిన ఘనత వేమన, వీరబ్రహ్మం, అన్నమయ్య, రామదాసు వంటి భక్తి ఉద్యమకవులదే. వీరు తమ వ్యక్తిగత భక్తితత్వాన్ని ప్రజల్లోకి తీసికెళ్లారు. ప్రజాపరం చేశారు. జ్ఞానాన్ని కిందికి దించటం సాధ్యమేనని నిరూపించారు. వీరు తత్వానుభవాన్ని పొందినవారే. అయితే తత్వం తెలియని తత్వశూన్యులు అనేకులుంటారు. వారిని నమ్మరాదని హెచ్చరిస్తున్నాడు వేమన. అయితే ఎవరితోనూ

కలవక ఏకాంత ప్రదేశాల్లో సాధన చేసే వారి పట్ల ఆయనకు అగౌరవం లేదు. పైగా వారి సంఖ్య చాలా తక్కువ అని కూడా చెప్తున్నాడు.

ఉన్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానానుభవంతో లౌకికసమాజంలోని వివక్షా మూల్యాలు బలహీనపడటానికి విశేషకృషి చేసిన విశిష్ట ప్రజాయోగి కవి వేమన. ఆయన తెలుగువాడు కావటం మనకు గర్వకారణం.

**తనకు గల్గు పెక్కు తప్పులు ఉండగా**
**ఓగు నేరమెంచు ఒరుల గాంచి**
**చక్కిలంబుగాంచి జంతిక నగినట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు' అన్నాడు వేమన్నే మరోచోట. మరో రమణీయమైన ఆలంకారిక అభివ్యక్తితో అదే భావాన్ని మరోరకంగా చెప్తున్నాడు.

చెడ్డవాడు తనలోనే బోలెడన్ని తప్పులు పెట్టుకొని ఎదుటివారిలో తప్పులను వెతికే ప్రయత్నం చేస్తాడు. ఇదెట్లా వుంటుందంటే తనకన్నా పెద్దదైన చక్కిలాన్ని చూసి జంతిక ఎగతాళిగా నవ్వినట్టు అంటున్నాడు వేమన.

ఓగు అంటే దుష్టుడు, దుష్టత్వమని కూడా. బాగోగులు లోని ఓగు ఇదే అని ఇదివరకు చెప్పుకున్నాము. ఒరులు అంటే తాను కాని వారు. అంటే ఇతరులు. పోలికలు చెప్పటంలో వేమనను మించిన వాడు లేడు. పైగా అవి లోకవ్యవహారంలో ప్రతివారి అనుభవంలో ఉండేవి.

చక్కిలం అంటే పిండిని మెలిపెట్టి చేసే గుండ్రని భక్ష్యవిశేషం. తెలంగాణాలో సకినం అంటారు. 'కమ్మని చకిలాలొకచోట గట్టి దవడ లింకొక చోట' అన్నాడు కాళోజి. ఇది సంస్కృతంలో శష్కులి. ప్రాకృతంలో సక్కులి. అక్కడి అర్థం మధుర పదార్థమని. అలాగే కన్నడంలో చక్కిలి, తమిళంలో అక్కులి. చక్కిలం అంటే బ్రౌన్‌కు తెలుసు. Biscuits of twisted rings of paste without sugar అని పాశ్చాత్య దృష్టితో అర్థం చెప్పాడు.

జంతిక అంటే కోస్తాలో చక్రాలంటారు. తెలంగాణాలో మురుకులు, చేబిళ్లలు. మరీ సన్నగా చేస్తే కారప్పూస అంటారు. 'జంతికలాగ చుట్టిన చుట్లు' అని ప్రయోగం. జిలేబికూడా జంతికే. అయితే అది తీపి.

చక్కిలాన్ని చూసి జంతిక నవ్వడం హాస్యాస్పదం, అర్థరహితం అంటున్నాడు వేమన. చక్కిలానికి మూడు చుట్లుంటాయి. జంతికకు అనేకం. తనకే బోలెడన్ని వంకరలున్నాయి. అట్లాంటప్పుడు తక్కువచుట్లున్న చక్కిలాన్ని చూసి నవ్వట మెందుకు? అని వేమన్న చురక.

ఒరుల నెరుసులెన్ను ఓగుయెపుడు' (డి.1723-357); అనేది పాఠాంతరం.

**తనకు ప్రాప్తిలేక దాతలివ్వరటంచు**
**దోషబుద్ధిచేత దూరుటెల్ల**
**ముక్కువంకజూచి ముకురంబు దూరుట**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దాత తనకు ద్రవ్యసహాయం చెయ్యటంలేదనే ఆక్రోశంతో అతన్ని నిందించటం అవివేకం. నిజానికి తనకా అదృష్టం ఉందా లేదా అని ఆలోచించాలి. ఇలా ఆలోచించకపోవడం ఎట్లా ఉంటుందంటే తన ముక్కువంకరగా ఉందని మర్చిపోయి అద్దమే దానిని వంకరచేసి చూపించిందని తూలనాడినట్టు అంటున్నాడు వేమన.

వేమన ఇంతకుముందు అనేక పద్యాల్లో దానగుణంలేని వారిని ఈసడించుకున్నాడు. పిసినారులను నోరారా ఎగతాళి చేశాడు. ఇక్కడ అర్థించేవారికి సంబంధించిన కొత్తకోణాన్ని ఆవిష్కరిస్తున్నాడు. దాతను కోరేటప్పుడే నువ్వు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. నీ 'ప్రాప్తి' అంటే గ్రహచారం ఎట్లుందో విచారించు కోవాలి. సమృద్ధిగా పండ్లున్న చెట్టుకింద నిలబడి అవి కిందరాలి పడుతున్నాయని, నీ ఒడిలో పడటం లేదని అంగలారిస్తే ఎలా. నీ కర్మ ఫలాన్ని గురించి ఆలోచించ నక్కరలేదా? అణిమాది అష్టసిద్ధుల్లో ప్రాప్తి కూడా ఒకటి. అలాగే అడిగినప్పుడల్లా ఇవ్వటం లేదనే కోపంతో దాతను తిట్టడం అది నీ 'దోషబుద్ధి' వల్లనే జరుగుతుంది. దోషం అంటే తప్పు. ఎదుటివారిని తప్పుపట్టే ద్వేష మానసికత.

**తనకు లేని నాడు దైవము దూరును**
**తనకు కలిగె నేని దైవమేల?**
**తనకు దైవమునకు తగులాటమే శాంతి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు మూర్ఖుడు కాక మరేమిటి? తాను దారిద్ర్యంలో మగ్గుతున్నప్పుడు దానికి కారణం దైవమే అని భావించి దూషిస్తాడు కూడా. సంపద కలిగినప్పుడు మాత్రం దేవుడొద్దు దయ్యమొద్దు. అంతా తనదే నిర్వాకం అనుకుంటాడు. ఇది తప్పు! తనకూ దేవుడికీ ఎగతెగని బంధమేర్పడినప్పుడే నిజమైన మనశ్శాంతి లభిస్తుందని తెలుసుకొమ్మంటున్నాడు వేమన. శమమే మోక్షానికి మార్గం అని సారాంశం.

'కలిగెనేని' అనేది చక్కటి నుడికారం. సంపద కలిగెనేని అని అర్థం. తగులాటం అంటే బంధం, కలయిక, సంఘటన. ఇది దేశిపదం. శాంతి అంటే ఏమిటి? కామక్రోధాది రాహిత్యమే శాంతి. అంటే వికారాలు లేని ఒక ఊరటస్థితి. రాగద్వేషాలు లేని బతుకును శాంతిమార్గం అంటారు. ఇది మోక్షసాధనకు అనువైనది. కీడు తొలగటానికి చేసే హోమాదికృత్యాలను శాంతి చేయడం అంటారు. ఉపశమింప చేయటాన్ని కూడా శాంతి అంటారు. ఋతుశాంతి, రోగశాంతి, తాపశాంతి, దాహశాంతి ఇట్లాంటివి.

**తనదు దానమవని తన కూతురి సమంబు**
**తండ్రి దానమెల్ల తనకు తోడు**
**అన్యులిచ్చు దానమది తల్లివంటిది**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తాను ఇవాళ చేసే దానం రేపు తన కూతురికో కొడుక్కో పనికి రావొచ్చు. తన తండ్రి చేసిన దానధర్మాల వల్ల వచ్చి ఆయన మంచికీర్తి తనకు జీవితంలో తోడు పడొచ్చు. మరి అన్యులిచ్చే దానమేమిటి? ఆడపిల్లలు లేని తండ్రి వేరేవారి బిడ్డను కన్యాదానం చేస్తాడు. ఇది మాతృసమానమైనది అంటే పవిత్రమైనది అని సారాంశం.

*'స్వదత్తా పుత్రికా ధాత్రీ, పితృదత్తా సహోదరీ*
*అన్య దత్తా స్వయం మాతా, విప్రదత్తా వసుంధరా'* అనిశ్లోకం

తాను మంచి స్థితిలో వున్నప్పుడు ఇతరులకు చేసిన సాయం, అది తన చివరిదశలో ఆదుకోవచ్చు. ఎలా? తన సంతానంలాగ. మరి కూతురిలాగ అంటున్నాడే వేమన? తల్లిదండ్రుల పట్ల కొడుకు కన్న కూతురికి ప్రేమ ఎక్కువుంటుంది అనేది సాధారణ లోకసత్యం. అపవాదాలుండొచ్చు. అలాగే తన తండ్రి చేసిన ధర్మకార్యాల సత్ఫలితాలు తనకు తోబుట్టువుల్లా తోడు రావొచ్చు. ఈ రెండు సంగతుల్లో కూడ రక్తసంబంధమనే వ్యాజమన్నావుంది. కాని మూడోది కేవలం భావనాత్మకం, మానవీయం.

కన్యాదానం చేసేటప్పుడు సంకల్పం చెప్తారు. కన్యాదానం వల్ల అటు పదితరాలకు, ఇటు పదితరాలకు శాశ్వతంగా విష్ణులోకం సిద్ధిస్తుందని. రెండు కుటుంబాల్లో వంశోద్ధరణ జరిగి ఉభయ తారక మవుతుందని.

దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది. అది సత్వరం ప్రాణాలను నిలబెడుతుంది. కన్యాదానం జీవితాలను స్థిరపరుస్తుంది అంటున్నాడు వేమన. *'తనదు దానమవని తన తల్లివంటిది'* (డి.1726-126) అనేది పాఠాంతరం.

**తనదు నీడ శిశువు తా జూచుచున్నట్లు,**
**తనదు నీడ జూచి తన్నుమరచు**
**పతిని యనుచు నొదువు భ్రాంతుల నేమందు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పసిపాప తన నీడను చూసి కేరింతలుకొడ్తూ ఆనందిస్తుంది. ఒకరకంగా ఇది చిన్నారి భ్రమ. కాని ఒక మూర్ఖుడు తాను రాజును కాబట్టి తనకు ఎదురులేదని తన్ను తాను మరిచిపోయి అహంకరిస్తాడు. ఇది మాత్రం నిజంగా దుర్భ్రమ.

నీడ అంటే మారురూపం, ప్రతిబింబం. నీడ అంటే ఎండ లేకపోవటం కూడా. కన్నడంలో నెరల్, తమిళంలో నిటిల్.

భ్రాంతి అంటే ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా అనిపించేది. గిరగిర తిరగడం కూడా భ్రమే. పసిపాప భ్రమ సహజభ్రాంతి. అది అజ్ఞానజనితం కాదు. లోకాన్ని తెలుసుకునే క్రమంలో లోనయ్యే విభ్రమం. రాజు అట్లాకాదు. తాను పేద్ద రాజుననీ తన ప్రమేయం లేకుండా ఏదీ జరుగదని, జరుగరాదనీ భావిస్తాడు. నిజానికి అతడు మనిషి. రాజు అనేది అతని నీడ. అదే నిజమనుకుంటాడు. కర్మబద్ధుడై మసలుతుంటాడు. నిజానికీ నీడకూ మధ్య రేఖను తెలుసుకునే విచక్షణను కోల్పోతాడు.

నొడువు అంటే చెప్పటం. ఇది నుడువుకు రూపాంతరం. "కళావతీ నీవు నొడికారపు *మాటలం బ్రోడవని విందు*" అని ప్రయోగం.

*'తనదు నీడ శివుని తాజూచుచున్నట్లు / తనదు నీడ జూచి తాను భ్రమసి /పరులు తామనియెదు భ్రాంతుల నేమందు'* (డి. 1723-981) అనేవి పాఠాంతరాలు.

**తనదు భ్రాతలెల్ల దానంబు సేయంగ**
**తనకు ఫలమటంచు మిణుకరాదు**
**తనకు కాలుగోయ తన తమ్ముడేడ్చునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎవరో పుణ్యం చేస్తే దాని ఫలం నీకు చెందుతుందనుకోవడం భ్రమ. నువ్వు చేసేదే నీకు చెందుతుంది.

అతడొక అజ్ఞాని. తన సోదరులందరూ దాన గుణసంపన్నులనీ వారి పనుల సత్ఫలితాలు తనకు కూడా సంక్రమిస్తాయని మురిసిపోతాడు. కాని అది నిజంకాదు. అతని కాలు కోసుకపోతే బాధ అతని తమ్మునికి కలుగుతుందా పిచ్చిగాని అని జాలి పడుతున్నాడు వేమన.

వంశ గౌరవాన్ని తలుచుకోవడం మన సంప్రదాయం. 'మావాళ్ళు నలుగురికి అన్నం పెట్టారు. ఆ పుణ్యమే నాకిప్పుడు దక్కింది' అనేది ఒక అందమైన నమ్మకం. కాని ఆ నమ్మకం దగ్గరే ఆగిపోకూడదు. వాళ్లను ఆదర్శంగా తీసుకొని నడవాలి గాని నిర్వీర్యంగా ఉండిపోగూడదు.

భ్రాత అంటే తోడబుట్టినవాడు. సోదరుడు, అన్న కావొచ్చు తమ్ముడు కావొచ్చు. భ్రాతృ శబ్దం మంచి భ్రాత. మాతృ, పితృలాగ. అగస్త్యభ్రాత అంటారు. అతని పేరు ఎవరికీ తెలియదు. అందుకే అగస్త్యునిపరంగా చెప్తారు. నిగమశర్మ అక్క కూడా అంతే. నిగమశర్మ మహా ప్రసిద్ధుడు కదా!

మిణుకు అంటే ఇక్కడ పలకడం. మామూలుగానైతే వెలిగీ వెలగనట్లు ఆగి ఆగి వెలగటాన్ని మిణుకు అంటారు.

ఎవరికర్మ ఫలం వారిదే. మరొకరిది నీకు రాదు. నీకు కాలు తెగితే ఆ బాధను నువ్వే అనుభవించాలి. నీ తమ్ముడు కాదు. 'ఎవడికి కడుపు నొప్పి లేస్తే వాడే వాము తినాలి' అని సామెత.

పాత గొప్పల దగ్గరే ఆగిపోకు నీ భావితరాలకోసం నువ్వు కూడా ఏదైనా సత్కార్యాన్ని ఆచరించు అని వేమన్న ఉవాచ.

"తనకు *గలదటంచుమనగరాదు*" అనేది పాఠాంతరం.

**తనువు ఎవరిసొమ్ము తనదని పోషింప**
**ధనము ఎవరి సొమ్ము దాచుకొనగ**
**ప్రాణమెవరి సొమ్ము పాయకుండగ నిల్వ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈ దేహం నీదే కదూ! అందుకే అంత మక్కువతో కాపాడుకుంటున్నావు. ఈ సంపద నీదే కదూ! అందుకే శాశ్వతమనుకొని తరతరాలకోసం దాచుకుంటున్నావు. ఈ ఊపిరి నీదేకదూ అందుకే ఎప్పటికీ ఆగిపోదన్నంత ధీమాగా వున్నావు. ఎంత అజ్ఞానం! అని జాలిపడుతున్నాడు వేమన.

తనువు అంటే శరీరం. దీన్ని నువ్వే వెంట తెచ్చుకున్నావా? నీ తల్లిదండ్రులు ప్రసాదించారా? ప్రకృతి ప్రసాదించలేదా! జీవివి కదా నువ్వు! జీవికి దేహం వుంటుందా? ఉందనుకో అది నీ సొంత ఆస్తి అనుకుంటున్నావా? అందుకే దానిపట్ల అంత మమకారం పెంచుకున్నావు కాబోలు!

ఇక డబ్బు! నిజంగా అది నీదేనా? స్వార్జితమేనా? న్యాయార్జితమేనా? సరే! అనుభవించవేమిటి? నలుగురికి పంచవేమిటి? పక్కనున్న వారిని ఆదుకోవేమిటి? దాచి పెడుతున్నావా? ఎవరికోసం? తనువే నీది కానప్పుడు ధనం నీదెట్లా అవుతుంది?

ప్రాణానికి ఢోకా లేదనుకుంటున్నావా? ఊపిరి ఎప్పుడు తెగిపోతుందో తెలుసా నీకు?

ఏదీ నీది కాదని తెలుసుకుంటే అంతా నీదేనని అర్థమవుతుందనేది వేమన్న సారాంశం.

తనువు అంటే శరీరం. ప్రాణం అంటే ఆత్మ అని బ్రౌన్ రాశాడు కాని అది ఆత్మకాదు. ప్రాణం అంటే గాలి. ఊపిరి. అదే జీవం. జీవం ఉన్నంతసేపే జీవి. ఆత్మ అలాకాదు. ఆత్మనుద్దేశించి శ్రీశ్రీ "శరీర పరివృతుడా" అన్నాడు. ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం అనేవి పంచ ప్రాణాలు. ములాధారంలోని వాయువే జీవుడు. తనువు అంటే చిన్నదని. దీనిని పెద్దగా ఊహించుకోవద్దని భావం. ఇక ప్రాణముందే, సంకోచ వ్యాకోచాలతో కూడిన ప్రజ్ఞనుండి గాలి రూపంలో పుట్టే శక్తి ప్రాణం. ఇది శరీరాన్ని నీడలా ఆవరించి వుంటుంది. అయినా దీనికో ప్రత్యేకమైన స్వరూపం లేదు.

స్వస్వరూప జ్ఞానమే నిజమైన జ్ఞానం అంటున్నాడు వేమన.

*'ద్రవ్యమెవరి సొమ్ము దాచుకొనగ / ప్రాణమెవరి సొమ్ము పడకుండ నిలుపంగ'* (డి.1723–430) అనేవి పాఠాంతరాలు.

**తనువునందు అగ్ని దరికొని కాల్పంగ**
**కాల్చుకొనుటయేమి కర్మమునకు**
**కాల్చుకొన్నయంత ఘనుడాతడాయెనా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మానవ శరీరంలోనే జ్ఞానాగ్ని మండుతూ వుంటే మళ్లీ దానిని చక్రాంకితాలతో కాల్చుకోవడం వల్ల ప్రయోజనమేముంటుంది? అలా తప్తముద్రలు వేసుకున్నంత మాత్రాన అతడు యోగ్యుడవుతాడా? అని సరదాగా ప్రశ్నిస్తున్నాడు వేమన. శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని తీసుకొని తాత్విక స్థాయిలో వ్యాఖ్యానించటాన్ని ఈ పద్యంలో గమనించవచ్చు.

శ్రీవైష్ణవుల్లో చక్రాంకితాలు వెయ్యటం అనే ప్రక్రియ ఉంటుంది. చక్రాంకితాలు అంటే శంఖం, చక్రం. ఇవి విష్ణువు ఆయుధాలు. ఇవి చిన్న ఇత్తడి ముద్రలు. వీటికి పిడిలాంటివి వుంటాయి. వీటిని వేడిచేసి ఎడమ భుజం పైన శంఖం, కుడిభుజం మీద చక్రం ముద్రిస్తారు. గురూపదేశం పొంది ప్రపన్నులైన వారికి వీటిని వేస్తారు. రాయలసీమలో వీటిని తాతాచార్ల ముద్రలు అనేవారు. తెలంగాణాలో మరింగంటి వారి ముద్రలు. ఇస్లాంలోకి మత పరివర్తనను ఆపటానికి నిమ్నకులాలవారికి వైష్ణవం ఇప్పించటానికి వీటిని బలవంతంగా వేసేవారు. అందుకనే "మరింగంటివారి ముద్రకు భుజం తప్పినా వీపు తప్పదు." అనే సామెత ఏర్పడింది. అయినవారికీ కానివారికీ ఇలా ముద్రలు వేయటాన్ని వేమన్న ఈ పద్యంలో వెక్కిరిస్తున్నాడనుకోవాలి.

జ్ఞానాగ్నిదగ్ధ కర్ములైన పండితులకు చక్రాంకితాలు శోభిస్తాయిగాని జఠరాగ్ని మండితులకు ఇవి కేవలం వాతలే అని వేమన భావించినట్టున్నాడు. దరికొని అంటే రగుల్కొని అర్థం.

వేమన పద్యాల్లోని ఇట్లాంటి అంశాలు నాటి సాంఘికచరిత్రను చెప్పటానికీ, అప్పటి చరిత్ర పొరలను విప్పటానికి తోడ్పడతాయనటంలో సందేహం లేదు.

**తనువులస్థిరమని ధనములస్థిరమని**
**తెలుపగలడు తాను తెలియలేడు**
**చెప్పవచ్చు పనులు చేయుట కష్టమౌ**
**విశ్వదాభి రామ వినుర వేమ.**

చెప్పింది చెయ్యని దొంగవేదాంతులను గురించి చెప్పిన పద్యమిది.

శరీరాలు శాశ్వతం కావు. సంపదలు ఎల్లకాలం ఉండవు. కాబట్టి బతికి ఉండగానే దానం చెయ్యి అని ఇతరులకు చెప్తాడు కాని తాను తెలుసుకోడు. చెప్పడం సులభం, ఆచరించడం కష్టం అంటున్నాడు వేమన.

అన్నిరంగాల్లోనూ కల్ల గురువులుంటారు. వేదాంతమార్గం అందుకు అపవాదం కాదు. నిజమైన వేదాంతులెప్పుడూ తాము అవలంబించేదే ఇతరులకు బోధిస్తారు. వంచకులను నమ్మరాదు అని వేమన్న హెచ్చరిక.

తనువు అంటే దేహం. చర్మమని కూడా మరో అర్థం. తనూజ అంటే కూతురు. తనూజుడు, లేదా తనూభవుడు అంటే కుమారుడు. తనువు నుంచి పుట్టిన వారని.

అస్థిరం అంటే స్థిరంకానిది. కదిలేది, అశాశ్వతమైంది, అనిశ్చితమైంది అని అర్థాలు. చెప్పిన విషయం మంచిదేగాని దాని ఉద్దేశంలో రుజుత్వం లేదు. 'నువ్వు దానం చెయ్యి' అంటే 'నాకే చెయ్యి' అనే మతలబు దీనిలో వుంది.

**తనువులోన జీవతత్త్వమెరుంగక**
**వేరె కలదటంచు వెదుక నేల**
**భానుడుండ దివ్వె బట్టి వెదుకురీతి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తనువులోనే ఒక జీవం, దానికోతత్వం ఉన్నప్పుడు దానికోసం శరీరం బయట వెతకడమేమిటి? ఇదెలా వుందంటే ఫెళ్లున ఎండకాస్తుంటే దీపం వెలిగించి వెతికినట్టుగా లేదూ! అంటున్నాడు వేమన్న. దేనికోసం వెతుకుతున్నాడు? జీవం కోసం. జీవమంటే ఆత్మే.

లోకాయతిక సిద్ధాంతం ప్రకారంగాని జైనసిద్ధాంతం ప్రకారం గాని, ఆత్మా దేహం వేరు కాదు. వేమన్నకాలానికి కూడా ఇవి ప్రచారంలో ఉండి వుంటాయి. సహజంగా తర్కశీలి అయిన వేమన్నను ఈ వాదాలన్ని ఆకర్షించకుండా ఉంటాయా? శంకరాచార్యులు దేహవాదాన్ని ఖండించినా సమాంతరంగా ఆ వాదాలు సజీవంగా ఉండనే ఉన్నాయి.

జైనం ప్రకారం జీవమే ఆత్మ. ఇది జ్ఞానం కన్న భిన్నమైందేమీకాదు. దీనికి పరిణామం కూడా వుంటుంది. చీమలోని ఆత్మ చీమ శరీరమంతే వుంటుంది. వేమన్నే మరోపద్యంలో "చీమయెంత దాని జీవమెంత" అన్నాడు. అలాగే ఏనుగులోని ఆత్మ ఏనుగు శరీరమంత వుంటుంది. దీపం వెలుగు ఎంత గదిలో వుంటే అంతగా వ్యాపిస్తుంది. చిన్నగదిలోనైతే సంకోచిస్తుంది. ఆత్మకూడా తాను ఆశ్రయించిన శరీరాన్నిబట్టి పెరుగుతూ తరుగుతూ వుంటుంది. వేమన్న తెలుసుకొమ్మంటున్న జీవతత్త్వమిదే. వేమన్న వేదాంతాన్ని అప్పటి కాల, సందర్భాలు తెలిస్తే మరింత బాగా అర్థం చేసుకోవచ్చు. తర్కం అనే శూలాన్ని చేపట్టి సత్యాన్వేషణ చేసిన జ్ఞాన వీరుడు వేమన్న.

**తన్ను తానెరుగడు తానెవ్వరికి నేర్పు**
**పాలుమాలి తిరుగు పశువు కొడుకు!**
**కాసులకొరకైతె కర్మముల్ గట్టురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అంతా వొట్టిది! అతడో వేషధారి, కపటి, నీచుడు. తన గురించి తనకే తెలియదు. ఇతరులకు పరమార్థం ఉపదేశిస్తానని బయల్దేరాడు. ఏపనీ చెయ్యక దిశానిర్దేశం లేకుండా ఎక్కడబడితే అక్కడ మేసే జంతువులా సంచరిస్తున్నాడు. ఇదంతా కడుపుకోసమే, అబద్ధాలు చెప్పి దండుకునే డబ్బుల కోసమే. అతడే బహుకర్మ బద్ధుడు. ఇతరులనెట్లా కర్మ విముక్తం గావిస్తాడు? కొత్త కర్మబంధాలను కల్పిస్తాడు గాని. ఇటువంటి వారితో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు వేమన.

ఇట్లాంటి కల్లగురువుల గురించి వేమన అనేకపద్యాలు చెప్పాడు. 'పాలుమాలుట' అంటే కక్కుర్తిపడటం, ఆశపడటం, సోమరిపోతుగా ఉండటం అని అర్థాలు. పాలుమాలిక అంటే శ్లేష సిద్ధించడానికి కక్కుర్తిగా పదాలను చొప్పించడం అనే కావ్య దోషం కూడ. పాలు అంటే వంతు, దాయభాగం. పాలు మాలినవాడు అంటే తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించని వాడన్నమాట. ఇటువంటి వాడు 'పశువు కొడుకవుతాడు' అంటే జంతు సమానుడు, పశుప్రాయుడు, తుచ్ఛుడవుతాడు.

అతడు ఆత్మజ్ఞాన శూన్యుడు. అటువంటప్పుడు ఇతరులకు జ్ఞాన బోధ ఏం చేస్తాడు? ఇతరులకర్మ బంధాలను ఊడగొట్టడానికి బదులుగా కొత్త కర్మలతో కట్టేస్తాడు. ఇతడు కర్మయోగికాదు, నిత్యకర్మ కాండలకు కుహనా వాఖ్యానాలు చెప్పి నాలుగు డబ్బులు సంపాదించి ఉదరపోషణ చేసుకునే పరాన్నభుక్కు.

నమ్ముకుంటే ముక్తిమార్గం చూపే సద్గురువును నమ్ముకోవాలి గాని ఇట్లాంటి దొంగ గురువులను కాదని వేమన్న హెచ్చరిక! 'ముక్తి' అనే మాటకు సి.పి.బ్రౌన్ Holy liberation అని చక్కటి అనువాదం చేశాడు.

'*పనికిమాలి తిరుగు పనస కొడుకు* (డి.1721–439); *పాలుమాలి తిరుగు పంజకొడుకు* (డి.1723–29); *కాసువీసములకు కట్టుబోలింగంబు* (డి.1725–235); *పాలుమాలి తిరుగు భ్రాంతి జెంది*' (డి.1736–89) అనేవి పాఠాంతరాలు.

**తప్పు రూపుగట్టి ధరలోన తిరిగెడు**
**సేతలెల్ల మిత్తిచేరు విధము**
**కడుపునిండనింత కష్టంబులేలరా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తప్పుడు వేషాలు వేసుకొని లోకంలో సంచరిస్తుంటారు. ఇటువంటి పిచ్చిపనుల వల్ల చావు తప్పుతుందా? కేవలం కడుపు నింపుకోడానికే అయితే ఇన్ని పాట్లు పడటం అవసరమా అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

తప్పుడు వేషాలు కట్టడమెందుకు? ఇంకెందుకు ఇతరులను వంచించేందుకు. దంభ జీవితంలో పడరాని పాట్లు పడి, చేయరాని పనులు చేసి బావుకునేదేమిటి? చివరకు మిగిలేది; దర్శనమిచ్చేది మృత్యుదేవతే కదా! కడుపు కోసమే అయితే ఇన్నికష్టాలెందుకు? అత్యాశవల్లే ఇవన్నీ జరుగుతాయి.

సేతలంటే చేష్టలు. మిత్తి అంటే మృత్యువు. మిత్తి కూడు అంటే చచ్చిన వారినుద్దేశించి పెట్టే ఆహారం. మిత్తికూళ్ల దొంగ అంటే ప్రేతాలకు పెట్టే అన్నం దొంగిలించేవాడు. కష్టం అంటే శ్రమ, దుఃఖం, కీడు, బాధ, పాపం ఇలా ఎన్నో ఛాయలు.

కడుపు నిండడం కోసమే అయితే వెధవ వేషాలెయ్యనక్కరలేదు. అతి స్వార్థంతో ఎంత సంపాదించినా చివరకు మృత్యువు ఎదురు రాక తప్పదు. ఈ సత్యాన్ని తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

**తప్పులెన్నువారు తండోపతండంబు**
**ఉర్విజనుల కెల్ల నుండు తప్పు**
**తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎదుటివారిలో తప్పులు మాత్రమే చూసేవారు అసంఖ్యాకంగా వుంటారు. మరి ఆ తప్పులు కొందరిలోనే వుంటాయా? కాదు. భూమిపైన నివసించే జనులందరి లోనూ తప్పులుంటాయి. మరి పరిస్థితి అట్లా వుంటే తమలోని తప్పుల్ని గ్రహించుకోకుండా ఇతరుల్లోనే వెతుకుతారెందుకు అని ఆశ్చర్యపడుతున్నాడు వేమన.

'తప్పులేనివారు ధరణిలో లేరు' అనే సామెత కూడా వుంది. ఇంతకూ తప్పంటే ఏమిటి? ఏది తప్పు, ఎవరికి తప్పు, ఎప్పుడు తప్పు ఇలా తప్పు గురించి చెప్తూపోతే తప్పుల తడకంత చాటభారతమవుతుంది. ఇక్కడ తప్పుకు అర్థం చెప్పడం కంటే తప్పును మాత్రమే లెక్కలోకి తీసుకునే దోషైకదృష్టిని తప్పుపడుతున్నాడు వేమన. తప్పొప్పులు రెండూ వుంటాయి. తప్పును మాత్రమే ఏరుకొని ఒప్పును పారేస్తే ఎలా?

తండం అంటే గుంపు. తండోపతండం అంటే గుంపుల మీద గుంపులు అని. తొడ తొక్కిడిగా వున్న గుంపులని. ఎక్కువమంది అని. తండతండముల్ అనే మరో మాటుంది. అంటే కుప్పలు తెప్పలుగా అని. తండం నుంచే తండా వచ్చింది. తండా అంటే లంబాడీల గుంపు. అవిప్పుడు చిన్న చిన్న గ్రామాలుగా రూపొందాయి.

కదిల్తేచాలు తప్పు పట్టేవారికి తక్కువ లేదు. ఆ తప్పేదో వివిధ రూపాల్లో అందరికీ వుంటుంది. ఒకవేళ తప్పు కలిగినా దానిని మరిచిపోవటం మంచిది. తప్పులను సాగదీసి శత్రుత్వాల దాకా దారి తియ్యటం అనవసరం.

వ్యక్తుల మధ్య అయినా వ్యవస్థలోనైనా సామరస్యం, సానుభూతి లోపించినప్పుడు దోషారోపణం మొలకెత్తుతుంది. వైవిధ్యభరితమైన ఏ సమాజానికైనా సామరస్యమే శ్రీరామరక్ష.

**తరచు చదువు చదువ తర్కవాదమె కాని**
**దివ్య జ్ఞానమునకు తేటపడదు**
**పసిరికాయపురుగు పగిడిని చెడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అమితంగా చదవడం వల్ల మేధస్సు పెరిగి అది భౌతికవాదాలవైపు దారితీస్తుంది గాని అంతకన్న ఉన్నతమైన అతీంద్రియ జ్ఞానంవైపు వెళ్లదు. అదెట్లాగంటే పట్టుపురుగు తానే అల్లుకున్న పసిరికాయలో చిక్కుపడిపోయినట్టు.

చదివిన సమస్త విద్యలు వాదించడం, కలహించడం దగ్గరే ఆగిపోతే అవి జ్ఞాన సాధకాలుగా ఎలా ఉపయోగపడతాయి? మీమాంసాశాస్త్రం, వ్యాకరణం తర్కంలోకే వస్తాయి. ఎంతసేపూ తర్కాన్నే పట్టుకొని వేలాడితే ఆత్మజ్ఞానం ఎప్పుడు దొరుకుతుంది? ఆత్మజ్ఞానం లేకపోతే మోక్షం సాధ్యం కాదుగదా అంటున్నాడు వేమన. అమూర్తమైన ఒక అధ్యాత్మిక భావనను తేటతెల్లం చెయ్యడానికి వేమన మనచుట్టూ రోజూ కనిపించే పోలికలనే ఎన్నుకుంటాడు.

పసిరికాయపురుగు అంటే పట్టుపురుగు. దానిచుట్టూ అల్లుకున్న గూడును పసిరికాయ అంటారు. పట్టుపురుగు సంగతి తెలుసుగదా! సిల్క్‌వామ్ అంటారు ఇంగ్లీషులో. దీని నోట్లోంచి వచ్చేదారంతో పట్టువస్త్రాలు తయారు చేస్తారు. ఈ పురుగు జీవితంలో మూడు దశలుంటాయి. 1. పురుగుదశ 2. గూడును తయారు చేసుకొని దానిలో ఉండి పోవడం. 3. గూడును చీల్చుకొని, మొలిచిన రెక్కలతో బయటికి ఎగిరిపోవడం. ఇది శ్రేష్టమైనదశ.

ఈ గూడును పట్టుగూడు అని కూడా అంటారు. పట్టుగూడు పురుగు ఉమ్మితో తయారవుతుంది. సిల్కు రైతులు పురుగుతో సహా ఆగూడు ఉండలను మరిగించి దారాన్ని సిద్ధం చేస్తారు. ఇది వికృతులైన మనుషుల సంగతి. ఇక్కడది అనవసరం.

వేమన్న ఏమంటున్నాడంటే పట్టుపురుగు రెండోదశ దగ్గరే ఆగిపోయింది. అంటే గూడులోనే ఇరుక్కుపోయింది. అంటే చెడిపోయింది. మూడో దశలోని రెక్కలు, స్వేచ్ఛా, పునరుత్పత్తి సామర్థ్యాన్ని అది కోల్పోయింది. అలాగే తర్క పండితుడు కూడా అక్కడే ఆగిపోయి, తన భావజాలంలో తానే బందీ అయిపోయి అలౌకిక జ్ఞానానుభవాన్ని పొందలేకపోతున్నాడు.

'తరచు చదువు' అంటే నిరంతర పఠనం. పగిది అంటే వలె. ఎంత గంభీరమైన విషయాన్నైనా వేమన ఆలవోకగా చెప్తాడనడానికి ఇటువంటి పద్యాలు ఒక ఉదాహరణ.

**తరుణి యొరుల సొమ్ము ధనము లంజల సొమ్ము**
**తనువు ధరణి సొమ్ము మనసు నెంచ**
**తాను సేయునట్టి ధర్మమే తన సొమ్ము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

భార్య పరాయివాడితో వెళ్లిపోవొచ్చు. అప్పుడు అతని సంపాదన అంతా వేశ్యల పాలు కావొచ్చు. చివరకు చనిపోయిన అతని శరీరం మట్టి పాలు కావొచ్చు. కాబట్టి ఆలోచించి చూస్తే అతడు చేసిన మంచిపనులే అతని పేరును నిలబెడతాయి అంటున్నాడు వేమన.

'తరుణి' అనే మాటను ఎప్పటిలాగే వేమన సాభిప్రాయంగా వాడాడు. తరుణి అంటే యౌవనవతి. ఒరులు అంటే ఇతరులు. సొమ్ము అంటే ధనం. 'సొమ్ము' అనే మాటను వేమన ఈ పద్యంలో నాలుగుసార్లు వాడాడు. మొదటి సొమ్ముకు అధీనమని అర్థం. రెండోది ఆస్తి. మూడోదానికి రూపాంతరం. నాలుగోది శాశ్వతమైన సంపద. "*సింహము పాలి సొమ్ము గోమాయువు గోరుచందమున*" అనేది ప్రయోగం. ధరణి అంటే భూమి, ఇక్కడ మట్టి. ధర్మం అనేది పెద్ద మాటే గాని ఇక్కడ దానధర్మాలు అనే అర్థం సరిపోతుంది. ధర్మం అంటే పుణ్యం, న్యాయం, దానం లాంటి లౌకికార్థాలే ప్రస్తుతం. దానధర్మాలు చేస్తే ఆ ప్రయోజనం పొందినవారు ఎక్కువకాలం గుర్తుంచుకుంటారు. నలుగురికి పనికొచ్చే పనులు అంటే సత్రాలు, వైద్యశాలలు కట్టించడం, నీటివసతులు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తే చనిపోయిన తర్వాత స్వర్గప్రాప్తి కలుగుతుందని ఒక విశ్వాసం. కాబట్టి ఇవే మిగుల్తాయని తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

**తరుణి సొగసు గన్న తనయల గన్నను**
**మరుని కళల మించి మనము బారు**
**పాపజాతి మనము పట్టంగ రాదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏం మనిషండీ ఇతడు! యౌవనవతి అయిన తన భార్య అందాన్ని అనుభవించాడు. ఇప్పుడు కూతుళ్లు పుట్టి యుక్తవయస్కలయ్యారు. అయినా అతనిలో మన్మథభావాలు ఉప్పొంగటం మానలేదు. ఈ మనస్సు ఉందే ఇది పరమపాపి. దీనిని అదుపుచెయ్యటం బహుకష్టం! అని నిట్టూరుస్తున్నాడు వేమన.

'ఏనైవ *ఆలింగితా కాంతా*
*తేనైవ ఆలింగితా సుతా*' *అని లోకోక్తి.*

అంటే ప్రియురాలిని కౌగిలించుకున్నప్పుడూ కూతురుని అక్కున చేర్చుకున్నప్పుడు కలిగే భావాలు వేరు వేరు. శృంగారభావాలు ఎదుటి మనిషిని బట్టి సందర్భాన్ని బట్టి ఉంటాయి. కాని మన ఈ పద్యనాయకుడున్నాడే ఇతని కామవాంఛ జీవితంలోని వివిధ దశలనుబట్టి అన్వర్తనం చెందలేదు. వావివరుసల మధ్యగీతలు ఏర్పడలేదు.

తరుణి అంటే తారుణ్యం కలది. యౌవనవతి అన్నమాట. 'తరుణి' అనే మాటను వేమన అనేకసార్లు సాభిప్రాయంగా వాడాడు. 'తనయలగన్నను' అంటే వయసొచ్చిన కూతుళ్లను చూసినా ఇతనిలో ఒక మన్మథ భావ వీచిక కదుల్తుందన్నమాట! తాళపత్ర గ్రంథాల్లో లేఖక ప్రమాదం వల్ల "తనయులగన్నను" అన్న పాఠాన్నిబట్టి బ్రౌన్ "on his sons" అని పొరబడ్డాడు. వావిళ్లవారిది మరీ విడ్డూరం! అతనిపరంగా కాక స్త్రీ పరంగా అర్థం చెప్పి ఆమెకు చక్కనైన తన కుమారుల పట్ల కూడా మోహం జనిస్తుందని రాశారు. ఇది పూర్తిగా అనౌచిత్యం.

మరుడు అంటే మన్మథుడు. మన్మథ యుద్ధము అంటే రతి. కళ అనే మాట చాలా పెద్దది. కళ అంటే చంద్రునిలో పదహారవ భాగం. చంద్రకళలు పదహారు. వ్యాకరణంలో ద్రుతప్రకృతికములు కాని పదాలను కళలంటారు. (ద్రుతమంటే జారిపొయ్యేది. నకారపొల్లు "న్") తాత్త్విక పరిభాషలో నాద, బిందు, కళలు అని ఉంటాయి. నాదమంటే శబ్దం యొక్క సూక్ష్మరూపం. ఇది స్వయంగా ధ్వనిస్తుంది. ఈ ధ్వనిరూపం పూర్తిగా ఉచ్చరించటానికి సాధ్యం కానిది. ఓంకారాన్ని పలికిన తర్వాత కలిసిపోయే అతి చిన్న

ధ్వని. శబ్దప్రవాహాన్ని నాదమంటారు. బిందువు అంటే విభజనకందని సూక్ష్మాతిసూక్ష్మమైన గుర్తు (Point). ఇక కళ. వ్యష్టిగాగాని, సమిష్టిగా గాని వ్యక్తమైన సంకేతాన్ని కళ అంటారు. ఐదు రకాల కళలుంటాయి గాని ఇక్కడ ఆపేసి మరుని కళలలోకి వద్దాం. మామూలుగా అయితే కళ అంటే కాంతి. ముఖకళ అట్లాంటిదే. ఈ పద్యంలో మాత్రం కళ అంటే స్త్రీరజస్సు. దీనిని ఇంతకంటే వివరించను.

మనము అంటే మనస్సే. మనము అంటే మన్మథక్రీడలను మీరిన ఊహలు చేసే మనసు. పారు అంటే ఎక్కడికో వెళ్లిపోతుందని.

వావివరుసలు దప్పిన సామాజిక వ్యక్తులను చూసి ఆశ్చర్యపడుతున్న వేమన, మనస్సు యొక్క చంచలత్వాన్ని ఒక ఆధ్యాత్మిక నిర్లిప్తతతో వ్యాఖ్యానిస్తున్నాడనుకోవాలి ఈ పద్యంలో.

**తరువ తరువ పుట్టు తరువున అనలంబు**
**తరువ తరువ పుట్టు దధిని ఘృతము**
**తలప తలప పుట్టు తనువున తత్త్వంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రాపిడి పడేకొద్ది చెట్టులోనుంచి అగ్గి పుడుతుంది. పాలను వేడిచేసి తోడు పెడితే పెరుగవుతుంది, ఆ పెరుగును చిలికే కొద్ది దానిలోంచి వెన్నపుడుతుంది, ఆ వెన్నను వేడిచేస్తే నెయ్యిలభిస్తుంది. అలాగే అదేపనిగా ధ్యానం చెయ్యడం వల్ల సత్యానుభూతి కలుగుతుంది.

పద్యంలోని మొదటి రెండు పాదాల్లో 'తరువ' అనే మాట రెండేసి మార్లు వచ్చింది. మొదటి తరువ కు రాపిడిపడటం అని అర్థమైతే రెండో పాదంలోని తరువ కు కవ్వంతో చిలకడం అని అర్థం. నిర్మాణం దృష్ట్యా ఇది విలక్షణమైన పద్యం. ప్రతిపాదంలో క్రియ–ఫలితం–ఫలితార్థం అనే క్రమం కనిపిస్తుంది. మొదటి ఫలితార్థం అనలం, అంటే నిప్పు. రెండోది ఘృతం. ఘృతం అంటే నెయ్యి. దధి అంటే పెరుగు. పెరుగులోంచి అంటే ఆ తరువాతి దశ అయిన వెన్నలోంచి వచ్చిన నెయ్యి అన్నమాట.

'తరువ తరువ, తలప తలప' అనే పునరావృత్తివల్ల అదేపనిగా, ఫలితం సిద్ధించేదాకా అని అర్థం చెప్పుకోవాలి. తరువ అంటే ఏమిటి? 'తరచు' అనే క్రియనుంచి తరచ అనే అర్థంలోనే ఈ తరువ అనేరూపం ఉంది. ఇక తలపుకు క్రియారూపమే తలప. దీనికి అనేక అర్థచ్ఛాయలున్నాయి. తలపు అంటే అభిప్రాయం ఆలోచన, చింత, ధ్యానం, వలపు, మోహం, తెలివి, జ్ఞానం, కోరిక, మనస్సు, హృదయం.

మూలపదార్థం ఒక్కటే అయినా ఒక విశిష్టమైన కార్యసరళివల్ల దాని రూపం, ధర్మం మారటం అనే గొప్ప ప్రక్రియను ఈ పద్యంలో ప్రదర్శిస్తున్నాడు వేమన.

చెట్టును కాల్చే అగ్ని చెట్టులోంచే పుడుతుంది. అగ్ని చెట్టులో అంతకు ముందే ఉందా? రాపిడిలో ఉందా? రాపిడి ఫలితంలో వుంది. పెరుగు స్వరూపమే మిగలని నెయ్యి పెరుగులోంచే కదా పుట్టింది! శరీరానికి అతీతమైన మహానుభావం పుట్టింది శరీరంలోంచే కదా! కనిపించే పదార్థాల కనిపించని తత్త్వం నిరంతర సాధనవల్లనే అవగతమవుతుందంటున్నాడు వేమన.

**తలను పాగ, పైని తగు పచ్చడము, బొజ్జ**
**చెవుల పోగులరసి చేరునర్థి**
**శుద్ధపశువులౌట బుద్ధిలో నెరుగక**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తలకు పాగా చుట్టుకొని, పైన ఉత్తరీయం వేసుకొని, చెవులకు బంగారు పోగులు తగిలించుకొని బాగా బలిసిన పొట్టతో ఉన్న సంపన్నుని దాతగా భ్రమించి యాచకులు అర్థించటానికి వెళ్తారుగాని అతడొట్టి పిసినిగొట్టు అని వారికి తెలియదు అంటున్నాడు వేమన. పై పై వేషాన్ని చూసి మోసపోవద్దు, లోపల దయార్ద్ర హృదయం ఉందా అని ఆలోచించాలని వేమన్న హితవు. కావ్యప్రబంధాల ఆధారంగా 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' రచించిన సురవరం ప్రతాపరెడ్డి 17వ శతాబ్దం నాటి ధనవంతుల వేషధారణ గురించి రాస్తూ ఈ పద్యాన్ని ఉదాహరించాడు.

పాగ అంటే తలగుడ్డ. తెలంగాణాలో రుమాల్ అంటారు. సంస్కృతంలో ఉష్ణీషం, శిరోవేష్టనం. పాగాను చుట్టుకుంటారు. 'కోటలో పాగా వేశాడు' అంటారు. అంటే కోటలో స్థానం సంపాదించాడని. తగుపచ్చడం. పచ్చడం అంటే అంగవస్త్రం. తగు అంటే స్థోమతకు తగిన అని. *"కటిమండలమున, నీర్కావి దోవతి మీద పట్టుపచ్చడం బలవు మిగుల'* అని *ప్రయోగం. 'వెన్నెల వెల్లపచ్చడము విచ్చిన యంబర శయ్యమీద"* అని మరో ప్రయోగం. బొజ్జ అంటే కడుపే గాని ఇక్కడ పెద్ద కడుపు. పెద్ద కడుపువాణ్ని పిచండిలుడు అంటారు సంస్కృతంలో. 'బొజ్జ చూసి బొట్టుపెట్టు' అని సామెత. అంటే పదవులూ భాగ్యాలు చూసి గౌరవించాలని. బొజ్జ కొందరికి హోదాకు చిహ్నం. అటువంటివారు డాక్టర్లు పొట్ట తగ్గించుకొమ్మన్నా వినరు. వీరికి బొజ్జమడుపులు ఏర్పడతాయి. అంటే కొవ్వుమడతలు. పోగు అంటే మామూలుగానైతే దారం. చెవికో ముక్కుకో పెట్టుకునే ఒక నగ. ఇక్కడ పురుష కర్ణాభరణమే.

ధనవంతుని వేషం ఉన్నంత మాత్రాన దయాగుణవంతుడు కావాలని ఏముంది? కాబట్టి అతని గురించి పూర్తిగా తెలుసుకొని అర్థులు ముందుకు సాగాలని వేమన్న లోకజ్ఞానాన్ని నూరిపోస్తున్నాడు. *"అతడు పామరుడని అర్థియేమెరుగురా"* (డి.1769, 742) అనేది పాఠాంతరం.

**తల్లికెదురుకొనుట తండ్రికెదురు కొంట**
**అన్నకెదురుకొనుట అరయమూడు**
**పాతకములనెరిగి వర్తింపగావలె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తల్లి మాట వినకపోవటం, తండ్రికి ఎదురు తిరగటం, తనకన్న పెద్దవాడైన అన్నను ధిక్కరించటం ఈ మూడు పనులూ పాపాలకిందే లెక్క. నరకంలో ఫలితాలను అనుభవించేంత పెద్ద కర్మలివ్వి. కాబట్టి కాస్త వెనకాముందు గమనించి మసులుకుంటే మంచిది అంటున్నాడు వేమన.

'మాతృదేవోభవ, పితృదేవోభవ, అతిథి దేవోభవ, ఆచార్య దేవోభవ' అని ఉపనిషత్తులు చెప్తున్నాయి. తల్లిదండ్రులు, అతిథి, గురువు వీరే ఈ లోకంలో ప్రత్యక్షదైవాలు. దైవానికి వందనమే తప్ప నింద ఉండదు. తల్లి నవమాసాలు మోసి నిన్ను కన్నది. తన శరీరంలో శరీరంగా, ప్రాణంలో ప్రాణంగా నిన్ను సాకింది. నీ శ్రేయస్సే ధ్యేయంగా జీవించే మమతామూర్తి ఆమె. ఆమె ఏది చెప్పినా నీ మంచికోసమే చెప్తుంది. ఆమె చెప్పేది పెడచెవిన పెట్టడం నీ దుర్జనత్వమే అవుతుంది. అలాగే తండ్రి నీ జన్మ కారకుడు, రక్షకుడు, పోషకుడు. ఆయన వంశాంకురానివి నువ్వు. ఆయనను ఖాతరు చెయ్యకపోవడం అమానుషం. అలాగే అగ్రజుడు తండ్రి తరువాత అంతటివాడు. వదిన కూడా తల్లిలాంటిదే. అటువంటి అన్నను ఎదిరించటం కుటుంబ వ్యవస్థకు చేటు. ఈ మూడింటిని పాతకాలంటున్నాడు వేమన. పాతకం అంటే పాపం. పాపం అన్నప్పుడు నరకలోకంలో వాటి దుష్ఫలితాలను అనుభవించక తప్పదు. ఈ ఫలితాల గురించి ధర్మశాస్త్రంలో చెప్పారు. మొత్తం ఇరవయ్యొక్క నరకాలున్నాయి. వాటిలో 'కృమిభక్ష్యం' అనేది ఒకటి. పైన చెప్పిన పాపకర్ముడు ఆ నరకంలో బాధ అనుభవిస్తాడు అని హెచ్చరిక.

తల్లి, తండ్రి, అన్న అనేవి దేశీయ పదాలు. తల్లి అంటే మొదటిదైన, ముఖ్యమైన అని అర్థాలు. వాత్సల్యార్థకం కూడ. 'తల్' మూలద్రావిడ పదం. తమిళంలో తళ్ళై, మలయాళంలో తళ్ళ. తల్లికడవ అంటే పెళ్లిలో వాడే పెద్దపాత్ర, తల్లి కడుపు అంటే సూర్యుడు అస్తమించే చోటు, తల్లి కాలువ అంటే పిల్లకాలువలకు మూలమైన పెద్ద కాలువ. తల్లిచాలు అంటే కొండ్ర వేసే మొదటి చాలు, తల్లి వేరు అంటే ముఖ్యమైన వేరు. చూశారా! ఈ మాట ఈ మాట ఎంత లోతైనదో, విస్తృతమైనదో!

తండ్రి అంటే కన్నవాడు, జనకుడు. వాత్సల్యం, భక్తి సందర్భాల్లో కూడా దీనిని ఉపయోగిస్తారు (తండ్రీ!) కన్నడ, తమిళ, మలయాళాల్లో వరుసగా తండె, తంత్తై, తంత అంటారు. అన్న సంగతి సరే ప్రార్థణార్థకాల్లో పురుషులను ఉద్దేశించే క్రియలకు అను ప్రయుక్తమౌతుంది. (తిక్కన్న, పోతన్న). అణ్ అనేది మూలద్రావిడం, కన్నడంలో అణ, అణ్ణ, తమిళంలో అణ్ణా, అణ్ణన్, మలయాళంలో కూడా అణ్ణన్.

'అమ్మ' కూడా గొప్పమాట. పూజ్య స్త్రీవాచకం. సాధారణంగా స్త్రీ నామాల చివర ప్రత్యాయంగా చేరుతుంది. (కమలమ్మ, గంగమ్మ). కన్నడంలో అమ, తమిళంలో అమ్మన్, అమ్మళ్. అమ్మపదానికి సన్నిహిత రూపంలో ఉండే పదాలు ప్రపంచభాషల్లో అనేకం కనిపిస్తాయి.

ఇంతకూ తల్లిదండ్రులను, అన్నదమ్ములను ప్రేమించటం ఉమ్మడి కుటుంబ మూల్యాలా? మానవ మూల్యాలు కావా? ఏమో! ఆధునిక కాలంలో విలువలన్ని తారుమారవుతున్నాయి. సమీకరణాలకు అతీతంగా ఉండవలిసిన రక్తసంబంధాలు రిక్తసంబంధాలుగా మారిపోతున్నాయి. తల్లిదండ్రాదులు స్వభావతః చెడ్డవాళ్లయితే అది వేరే సంగతి.

వీరిని నిర్లక్ష్యం చేసి ఎవరైనా బావుకునేదేమిటి? వీరిని కాదని నువ్వు కోరుకునే సౌఖ్యంలో మనశ్శాంతి వుంటుందా? తల్లిదండ్రులను ప్రేమించేదే సహజమైన జీవితం అని తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

**తల్లి గర్భమందు తాబుట్టినప్పుడు**
**మొదల బట్ట లేదు తుదను లేదు**
**నడుమబట్టగట్ట నగుబాటు గాదకో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎంత సన్యసించినా ఇంకా ప్రాపంచిక వాసనలు వదులుకోలేని యోగుల నుద్దేశించి చెప్పిన పద్యమిది.

జీవుడు మాతృగర్భం నుండి బయటకు వచ్చేటప్పుడు వస్త్రాలు ధరించి వచ్చాడా? అట్లాగే చనిపోయినతర్వాత శవానికి కూడా బట్టలుండటం లేదు కదా! మరి పుట్టుగిట్టుల నడిమికాలంలో బట్టలు కట్టుకొని కులకడం సిగ్గుచేటు కాదా! ఆలోచించమంటున్నాడు వేమన.

శరీరంలోని వికారాలను దాచుకోటానికీ, వాతావరణం నుంచి కాపాడు కోటానికీ బట్టలు పుట్టాయి. కాని కాలక్రమంలో అవి వేషధారణకి గుర్తుగా మారాయి. బాహ్యాలంకారానికి గుర్తుగా మారాయి.

'నడుమ బట్టకట్టటం నగుబాటు' అన్నాడంటే దిగంబరంగా తిరగాలని వేమన్న ఉద్బోధ కాదు. జీవుడికి తొడుగులుండవు, దేహానికే వుంటాయి. పై తొడుగుల ఆధారంగా జ్ఞానికి గుర్తింపు రాదని సారాంశం. ఈ పద్యాన్ని బట్టే నగ్నంగా తిరిగాడనే వాడుకలు పుట్టివుంటాయి. వేమన బొమ్మ కూడా దీని ఆధారంగానే పుట్టి వుంటుంది. ఈ బొమ్మ లేకుండా వేమన మూర్తిమత్వాన్ని ఊహించగలమా? నగ్నత్వమే చిరునామాగా మారిన జ్ఞానయోగి వేమన.

అంతేకాదు బట్టలు లేకుండా తిరిగే సంప్రదాయం ఆనాడూ ఈనాడూ కూడ అక్కడక్కడ వుంది. వీరశైవంలో కూడా ఉన్నట్టు దాఖాలాలున్నాయి. జైనమతంలో దిగంబర శాఖే వుంది. కాని వేమన ఈ ప్రభావాలతోనే ఈ పద్యం చెప్పాడని నిరూపించడం కష్టం.

**తల్లిదండ్రి చావ తనయుడు తానేడ్చు**
**మగడు చావ నాలు వగచుచుండు**
**కార్యవశమె కాని కలుగదు మోహంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తల్లిదండ్రులు మరణిస్తే కొడుకు ఎంతో ఏడుస్తాడు. భర్త చనిపోతే అతని భార్య చాలా దుఃఖిస్తుంది. ఇదంతా ఎందుకు? ఎందుకంటే వారి చావువల్ల తాము ఒంటరివాళ్లమైనామనే గానీ చనిపోయిన వారి మీద ప్రేమ వల్ల కాదు అంటున్నాడు వేమన.

వేమన్న ఇంత కఠినమైన తీర్పు చెప్తున్నాడే అనిపిస్తుంది. అనుబంధం వల్లనే కదా ఎవరైనా దుఃఖించేది. కావొచ్చు కాస్త తాత్వికంగా ఆలోచిస్తే తమ కోసమే అని తెలుస్తుంది. తాము దిక్కులేని వారమయ్యామనే. అవును! పోయినవారి జ్ఞాపకాలు ఎంతో బాధిస్తాయి వారు మంచివారైతే. పోయినవారు చెడ్డవారైతే లోకం కోసం ఏడుస్తారు. ఇది నిజమైన దుఃఖం కాదంటున్నాడు వేమన.

తనయుడు అంటే కొడుకు. మగడు అంటే పురుషుడు, రాజు అని అర్థాలున్నాయి గాని, ఇక్కడ పెనిమిటి. '*మగువలు మిగలని యెరుగడు, మృగముల కోరసిల దేమి మిడిమేల మితం, దగపడునని తలచితిమే*' అని ప్రయోగం. ఆలు అంటే స్త్రీ, ఇక్కడ భార్య. 'ఆలివంక వారు' అని వేమనే వాడాడు మరోచోట. కార్యవశం అంటే తమ స్వార్థం కోసమని. కార్యం అంటే పని, హేతువు అనే అర్థాలున్నా ఇక్కడ ప్రయోజనం, అక్కర అనేవి సరిపోతాయి. '*ఫలముల యెడ బ్రహ్మార్పణం, కలన పరుండగుచు గార్యకర్మము నడపన్, వలయున్*' అని ప్రయోగం.

వగచు అంటే మనస్సులో దుఃఖించడం, పదే పదే తలచుకోవడం. 'నోరు నిలవక వదరిన భూసురు పగిది వగతువు సుమ్మీ' అని ప్రయోగం. మోహం అంటే ఇక్కడ బంధం. మోహపాశం తెగిపోయినప్పుడు బాధ కలగడం సహజం, కాని క్రమంగా అది తగ్గిపోతుంది. అది కాలధర్మం.

'కార్యవశమెగాని కలుగదు మోక్షంబు' (డి.1769–642) అనేది పాఠాంతరం.

**తల్లినెరుగువాడు దైవంబు నెరుగును**
**మన్ను నెరుగువాడు మిన్ను నెరుగు**
**మిన్ను మన్నెరిగిన తన్ను తానెరుగురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తల్లిని గురించి తెలుసుకున్న వాడికి దైవమంటే ఏమిటో అనుభూతమౌతుంది. భూమితత్వాన్ని గురించి తెలుసుకున్న వాడికి ఆకాశమంటె ఏమిటో అర్థమౌతుంది. అలాగే భూమ్యాకాశాల పరస్పర సంబంధం అవగతమైన వాడికి ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది అని యావత్ సృష్టికీ మనిషికీ గల అనుబంధాన్ని తేలికైన మాటల్లో చెప్తున్నాడు వేమన. గహనమైన వేదాంతసారాన్ని సరళమైన భావధారతో ప్రవచిస్తున్నాడు.

"*నమాతుః పరదైవతం*" అని సూక్తి. అంటే తల్లికన్న పరదైవం లేదు. తల్లే ఎదుట కనిపించే దైవం. కనిపించని పరదైవం ఈమె ద్వారానే తెలుస్తుంది అని తాత్పర్యం. మనిషికి తల్లితోనే తొలి అనుబంధం. తల్లి అనే మాటకు మొదటిది అని అర్థం. రక్తంలో రక్తమై, నీటిలో నీరై, ఆహారంలో ఆహారమై, శ్వాసలో శ్వాసై అన్నీ అమ్మే. తండ్రి వీర్యదాత. తల్లిదండ్రుల మధ్య కలిగే అనుబంధ ఫలం సంతానం. తల్లికి కన్నబిడ్డల పట్ల ఎంతో ఓపిక. అందుకే 'క్షమయాధరిత్రి' అన్నారు. అందుకే అమ్మ అనేమాట ఎంతో మధురం. "*స్ఫురితంబులమ్మయిన దేనియలొల్కెడి జిల్గుపాటతో*" అని ప్రయోగం.

'అమ్మ' అంటే స్తనం అనే అర్థం కూడా వుంది. మాట్లాడేటప్పుడు ఆశ్చర్యార్థకాల్లో, వాత్సల్య సూచకాల్లో, ప్రేమాదర వ్యక్తీకరణల్లో 'అమ్మ' అనే మాట రాక తప్పదు. అమ్మ అంటే పూజ్య స్త్రీ అని కూడ. అందుకే పేరుకు ఉత్తరపదంగా 'అమ్మ' శబ్దం వస్తుంది. లక్ష్మమ్మ, సీతమ్మ మొ॥నవి. అమ్మను అవ్వ అని కూడా అంటారు. ఇప్పటికీ కరీంనగర్ జిల్లాలో అమ్మను అవ్వ అంటారు. సంస్కృతంలో అంబ.

ఇక్కడ తల్లినెరిగిన వాడు అంటే మాతృభావనను అర్థం చేసుకున్న వాడని భావం. తన తల్లి ద్వారా విశ్వమాతను దర్శించిన వాడికి దైవం తెలుస్తుంది. దేవీతత్వమే దైవ స్వరూపం.

ఇక తల్లీ దేవతల సంబంధం లాంటిదే భూమ్యాకాశాల సంబంధం, భూమ్మీద నిలబడ్డ వాడికే ఆకాశం ప్రసక్తి వస్తుంది. భూమి పంచభూతాల్లో ఒకటి. మహాభూతం. ఇది కాఠిన్యం వహించి ప్రాణుల ఉనికికి ఆధారమౌతుంది. దీనికి శబ్దం, స్పర్శ, రూపం,

రసం, వాసన అనే ధర్మాలుంటాయి. ఆకాశానికి కూడా శబ్దం ప్రధాన గుణం. దీనికి రూపం లేదు. దీనికి వ్యాపన గుణముంటుంది. ఇది కూడా పంచభూతాల్లో ఒకటి. భూమ్యాకాశాల మధ్య గల రోదసిని (Space) బయలు అంటారు. అచల వేదాంతులు దీని గురించి విపులంగా చర్చించారు.

తనకు మూలమైన తల్లి గురించీ, తల్లి లాంటి భూమి గురించీ, భూమికి ఆధారమైన ఆకాశం గురించీ, ఈ మూడింటి ఆంతరిక, తాత్త్విక సంబంధాల గురించి తెలుసుకుంటే వీటి మధ్య తన అస్తిత్వం ఏమిటో అవగతమౌతుంది. అంటే తనకు ఆత్మ సాక్షాత్కరిస్తుంది అని వేమన్న ఉవాచ.

తమకు సమస్తం ప్రసాదించిన తల్లిని తనయులు వృద్ధాప్యంలో ఎలా మరిచిపోతారో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. జీవన చక్ర భ్రమణంలో ఫలానా సమయంలో తల్లి విలువ తెలిసినా ప్రయోజనం ఏముంటుంది? పనికిరాని పశ్చాత్తాపాలు తప్ప.

**తాటికల్లు కేల తాలిమి నడవడి**
**కూడికింత యేల గురుతు జూడ**
**కాటిమట్టికింత కాయంబు యేలరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కల్లుతాగి మత్తెక్కిన వాడికి మర్యాద పరిధిలో ప్రవర్తించవలసిన పనేముంది? ఆకలి మిక్కుటమై కూడు సంపాదించుకోవాలనుకునేవాడికి వేషభాషల పట్ల శ్రద్ధ ఎందుకుంటుంది? ఎప్పటికైనా శ్మశానం చేరుకునేవాడికి ఈ దేహంపట్ల అలవిమాలిన మమకారం ఎందుకుండాలి అని వేమన మూడు లోకసత్యాలను లోకం మీదికి విసిరి ఆలోచించమంటున్నాడు.

తాటికల్లు అంటే తాటిచెట్టు నుంచి తీసే ద్రవం. ఒకరకమైన మద్యం. ఇది దేశీయపదం. కన్నడంలో కళ్ళు, తమిళంలో కళ్, మలయాళంలో కూడా కళ్. కల్లు తాగితే మత్తు, ఒకరకమైన ఉత్సాహం, ఉద్వేగం, మదం కలుగుతాయి. కాబట్టి ఆ సమయంలో సహనం కోల్పోయే అవకాశముంటుంది. తాలిమి అంటే ఓర్పు "తాలిమి తన్నుకాచును యెదిరినీ కాచును" అని సామెత.

కూడు కుడుచు నుంచి వచ్చి ఉంటుంది. కూడు అంటే అన్నం. అలాగే కాడు అంటే వల్లకాడు, అంటే స్మశానం. కన్నడంలో కాడు అంటే అడవి. తమిళంలో కాటు. ఒకప్పుడు ఊరి వెలుపలి అడవిలో అంత్యక్రియలు జరిగి అక్కడ స్మశానాలు ఏర్పడి ఉంటాయి. ఆ తాటి కల్లుతెచ్చి తాళకంబున వండ, కాటిలోన మన్ను కనకంబు సేయరా" (డి.1723–689) అనేవి పాఠాంతరాలు.

**తాను కుడువ లేక తగవేది ఆప్తుల**
**చేరనివ్వడట్టి చెనటిగోవు**
**చేనులోన బొమ్మచేసి కట్టినయట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తాను తినడు, యుక్తతను మాని తనకు అయినవారిని దగ్గరికి రానివ్వడు, తిననివ్వడు. ఇట్లాంటి వాడు నీచమైన పశువు కాక మరేమిటి? ఇదెట్లా వుంటుందంటే బాగా పండిన చేనుకు దిష్టిబొమ్మను చేసి నిలబెట్టినట్టు అంటున్నాడు వేమన.

వాడు కఠిన చిత్తుడు. తన సంపదను తాను అనుభవించలేడు. కుడుచు అంటే భుజించడం. *'పళ్లెరంబుల కుడ్చు బ్రాహ్మణులు'* అని ప్రయోగం. కుడుచు అంటే స్తన్యం త్రాగనిచ్చు అని కూడా. తాను కుడువడు, ఇతరులకు కుడువబెట్టడు. తగవేది అంటే తగవుమాలి. తగవు అంటే తగి ఉండడం. యుక్తత, న్యాయం, జగడం, తీర్పు, నిర్ణయం, శుభకార్యాల్లో ఇచ్చే కానుక.

*'తనుమాలు ధర్మమేలా?*
*తన గురుతెరుంగలేని తనువది యేలా?*
*తనబుద్ధికానిదేలా? /*
తను తనకేగాక యున్న తగవది యేలా' అని ప్రయోగం.

ఆప్తులు అంటే స్నేహితులు కావచ్చు, సన్నిహిత బంధువులు కావచ్చు. సంపాదిస్తాడు గాని దగ్గరివారిని దరి చేరనీయడు. అందుకే ఎవరు చెప్పినా వినని చెనటి గోవు అయ్యాడు. చెనటి అంటే కఠినం, క్రూరం, శూన్యం, వ్యర్థం, కుత్సితం, దుష్టం అని అనేకార్థాలు. 'అని భయంకరముగా నమ్మహామునులు చెనటి ప్రతిజ్ఞలు చేసిన; మంచి వారినెల్ల మనిచి చెనటుల నడచి; హేయమైన యిచ్చెనటి శరీరమున్ విడిచి' అని ప్రయోగాలు. బొమ్మ అంటే దిష్టిబొమ్మ. చేనులోని పంటమీద చెడ్డ చూపు పడకుండా కట్టే బొమ్మ. మనవాడు దిష్టిబొమ్మతో సమానుడు. పరమ పిసినారి. దిష్టి బొమ్మలే కాకుండా చేన్లలో బెదురు బొమ్మలు కూడా కడతారు, పశు పక్ష్యాదులు వచ్చి పంటను పాడు చెయ్యకుండా.

సద్వినియోగం చేసినప్పుడే లోకంలో ఏ సంపదకైనా సార్థకత అనేది ఈ పద్యంలోని సందేశం –

*'తాను గుడువలేడు ధరలోని అన్యుల / చేరనియ్యలేడు చెనటివోగు (డి. 1723–304); తాను గుడువలేడు తగవేది ఆత్మల'* (డి. 1759–736) అనేవి పాఠాంతరాలు.

**తాను విమలుడైన తన గుణమంతయు**
**శివుని కీని గురువు చెడుగు గురువు**
**గుడ్డి గుఱ్ఱమెక్కి గుడి తిర్గినట్లౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు నిర్మలమైన వాడే. కాని తన సకల సద్గుణ సంపత్తిని శివార్పణం చెయ్యడు. ఇట్లాంటి వాడు మంచి గురువు కాలేడు. ఇటువంటి గురువును ఆశ్రయించడం గుడ్డి గుఱ్ఱాన్నెక్కి గుడిచుట్టూ ప్రదక్షిణంచెయ్యడం లాంటిది అంటున్నాడు వేమన.

తనకే శివ సాక్షాత్కారం కలగ లేదు. నీకేం చూపిస్తాడు? అతడు కల్ల గురువు కాకపోవచ్చు. చిత్తశుద్ధి కలవాడే కావచ్చు. కాని అతనిలో ఫలత్యాగ బుద్ధిలేదు. జ్ఞానం అంతంత మాత్రమే. అర్పణ గుణం లేనివాడు గురుస్థానంలో ఉన్నా గురువు కాలేడు. అయితేగియితే చెడ్డ గురువవుతాడు.

ఏకాగ్ర చిత్తానికి సాధనాలై యోగనియమాలకోసం బ్రహ్మజ్ఞాని అయిన యోగిని ఆశ్రయిస్తుంటారు. గురూపదేశం లేకుండా సాధకుడు తరించలేడు. స్వయంకృషివల్ల ఆధ్యాత్మిక రహస్యాలు తెలియడం కష్టం. అందుకే గురువు కావాలి. ఆ గురువు ఎలాంటి వాడై ఉండాలంటే ఆధ్యాత్మిక విషయబోధకుడై ఉండాలి. వేదాంతాది శాస్త్రవిదుడై ఉండాలి. పాపరహితుడై ఉండాలి. కామక్రోధాదులను జయించిన వాడై ఉండాలి. అన్నిటిని మించి శిష్యుల సందేహాలను తీర్చే సామర్థ్యం గలిగినవాడై ఉండాలి. అతడే నిజమైన గురువు.

వేమన చెప్తున్న గురువు మంచివాడే కాని తనను తాను 'శివుని కీనివాడు' అంటే ఇవ్వనివాడు. పూర్ణమైన శివయోగి కావటానికి ఇతనికి ఇంక కొంత సమయముంది. వీరశైవ దార్శనిక సిద్ధాంతం శివవిశిష్టాద్వైతం. శివుడే పరతత్త్వమని వారి విశ్వాసం. ఈ భౌతిక జగత్తును శివుడే సృష్టించాడు. ఈ సృష్టి కాలక్షేపానికి చేసింది కాదు. ఒక ప్రయోజన దృష్టితోనే అది సాగింది. వివిధ జీవుల అనుభవాలకు దోహదం చెయ్యడానికీ పరమాత్మతో తుల్యానుభూతిని సాధించేట్టు చెయ్యడానికీ జగత్తు పరికల్పితమయ్యింది. ఇలా తుల్యానుభూతిని సాధించటాన్ని 'సమరస' అంటారు. విడి జీవులు పరమాత్మ యొక్క వివిధ రూపాలే! వారు మాయాశక్తివల్ల పరిమితత్వాన్ని పొందిన శివరూపులు. ఒకే తత్త్వం యొక్క పరాకోటి శివుడైతే అథఃకొటి జీవుడు ఇక్కడి దాకా చేరి తత్త్వం తెలిసినవాడు మంచి గురువు అవుతాడని వేమన్న ఉవాచ.

*'గుడ్డి గుఱ్ఱం'* పోలిక వేమన లోకజ్ఞతకు నిదర్శనం. అది అలవాటు చొప్పున గుడి చుట్టు తిరగొచ్చు గాని గుడిలోపలి దైవాన్ని దర్శించటానికి తోడ్పడేది కాదు. తత్త్వం తెలియని గురువు గుడ్డి గుఱ్ఱం లాంటివాడని తాత్పర్యం. "తాను నిర్మలుడయి, చెయ్యలేని *గురుడు* చెడుగురుండు, (డి.1723-22), శిష్యుకీని *గురుడు* (డి.1725-545) అని పాఠాంతరాలు.

**తామసించి సేయ తగదెట్టి కార్యంబు**
**వేగిరింపనదియు విషమమగును**
**పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఏ పనైనా తగినతరుణంలో జరిగితేనే దానికి సార్థకత అంటున్నాడు వేమన. సకాలంలో చెయ్యవలిసిన పనిని ఆలస్యంగా చెయ్యకూడదు. అట్లాగని తొందరపడి చేస్తే గడ్డు పరిస్థితి ఎదురు కావొచ్చు. పచ్చికాయను తీసుకొచ్చి మక్కబెడితే అది పండవుతుందా? కాదు. అయినా అది సహజ ఫలం కాదు.

నేర్పు లేకుండా క్రమరహితంగా చేసే పనులు సత్ఫలితాల నివ్వవు. ఇవాళ చెయ్యాల్సిన పనిని రేపుచేస్తే ఏమవుతుంది? ఆలస్యం కావడం వల్ల అన్నిసార్లూ అమృతం రాదు, విషమవుతుంది. ఉత్తరాది వేమన కబీరు ఏమన్నాడు? ఏమన్నాడంటే *"రేపు చెయ్యాల్సిన పనిని ఇవ్వాళే చెయ్యి / ఇవ్వాళ చెయ్యాల్సిన పని ఇప్పుడే / ఎందుకంటే మరుక్షణంలో ప్రళయం రావొచ్చు నువ్వు చెయ్యాల్సిన పని ఎప్పటికీ చెయ్యలేక పోవచ్చు"* ఇక్కడ ప్రళయం ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే కబీరు నివసించే కాశీ గంగానది ఒడ్డున వుంది" అదెప్పుడు కాశీని ముంచేస్తుందో తెలియదు అనేది నేపథ్యం. కాని వేమన చెప్పే నీతి సర్వసామాన్యకాలానికి చెందింది.

తామసించి అంటే ఆలస్యం చేసి అని అర్థం. వేగిరం అంటే సంభ్రమం, వేగంలో ఉత్సాహం, ఉద్రేకం ఉంటాయి గాని వేగిరంలో అవసరాన్ని మించిన తొందర. *"వినిపొమ్మా కొమ్మ! ఇంత వేగిరమేలా?"* అనేది ప్రయోగం, విషమం అంటే ఎక్కువ తక్కువ కావడం. సమత్వం దెబ్బతినడం. బేసి అనికూడా. ఒకటి, మూడు, ఐదు, ఏడు బేసి సంఖ్యలు. మన్మథుడు విషమశరుడు, అంటే పంచబాణుడన్నమాట!

పచ్చి కాయను కక్కుర్తిపడి మాగబెడితే అది పండు కాదు. పడవేయ అంటే మాగబెట్టడం. దోరకాయను మక్కబెడితే పరవాలేదు గాని పచ్చికాయ వల్ల ప్రయోజనం లేదని తాత్పర్యం.

తామసుడు అంటే మొండిపట్టుదల కల వాడని కూడా. అనుకున్న పనిని అనువైన సమయంలో ప్రారంభించకపోవడం అవివేకం, అలాగే అనుకున్నదే తడవుగా హడావిడి చెయ్యడం కూడా అజ్ఞానమేనని వేమన్న సారాంశం.

*'తగనట్టి కార్యంబు, బుడమకాయ చేదు ముదిరిన ఫలమిచ్చు'* (డి.1723, 314) అనేవి పాఠాంతరాలు. పద్యంలోని పాఠమే యుక్తి యుక్తంగా వుంది.

**తారకంబు జూచు దారి వేరే కల్డు**
**సమముగాను చూడచక్కబడును**
**వెఱ్ఱిగానుచూడ వెలుగెల్ల బారురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పరబ్రహ్మాన్ని దర్శించాలంటే తరింపజేసే సాధనం ద్వారా చూడాలి. దానికి ప్రత్యేకమైన పద్ధతి ఉంది. స్థిరమైన దృష్టితో చూస్తేనే సాక్షాత్కారం కలుగుతుంది. చంచలదృష్టితో తిలకిస్తే చూపునకు దగ్గరగా వచ్చిన వెలుగు అదృశ్యమైపోతుంది. అట్లా జరిగితే సందర్శనం ఎప్పటికీ సాధ్యం కాదు.

సాధారణంగా తారకమంటే తరింపజేసేది, దాటించేది అని అర్థం. తారకమంత్రం, తారకరాముడు అనేవి ఇట్లాంటివే. ఆధ్యాత్మికంగా అయితే మహాభయాల నుండి తరింపజేసేది తారకం. ఏమిటా మహాభయాలు? గర్భ, జన్మ, జరా, మరణ, సంసారాలనేవి మహాభయాలు! *"నాతరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా!"* అన్నాడు రామదాసు. ఆ భవసాగరం ఇవే.

ఈ పద్యంలో తారకం అంటే కన్ను. చిత్‌నేత్రం. అదే దాటిస్తుంది. దాటించాలంటే దానికి దారి తెలియాలి గదా! తెలియాలంటే దారిని ముందుగా చూసుకోవాలి. ఎలా చూడాలి అంటే సమంగా చూడాలి. అంటే ఎత్తుపల్లాలు లేకుండా వంకరటింకరలు లేకుండా చూడగలగాలి. అంటే చూపులో స్థిరత్వముండాలి. కొంచెం తేడావచ్చినా చూపుకు దగ్గరగా వచ్చిన వెలుగు అదృశ్యమైపోతుంది. అట్లా జరిగితే బ్రహ్మసాక్షాత్కారం సాధ్యం కాదనేది సారాంశం.

వెఱ్ఱిగా చూడటమంటే చంచల చిత్తంతో చూడటం. అట్లా చూస్తే జ్ఞానదీప్తి గోచరించదు, అది వెళ్లిపోతుంది అంటున్నాడు వేమన.

"చూరుకింది కాకి చూచిన చందమౌ (డి. 1723-902) అనేది పాఠాంతరం.

**తావసించుచోట తగనల్జడాయెనా**
**సౌఖ్యముగల భూమి జరుగ వలయు**
**కొలకులింకెనేని కొంగలందుండునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

మడుగుల్లో నీళ్లు ఇంకిపోయి ఆహారం దొరక్కపోతే కొంగలు ఏంచేస్తాయి? నీళ్లున్న మరోచోటికి వలసపోతాయి. అట్లాగే ఎవరైనా తాను ఉన్న ఊరిలో ఆపదలు, బాధలు ఎదురైతే ప్రశాంతతగల మరోఊరికి తరలిపోవడం మంచిది అని సూచిస్తున్నాడు వేమన.

వేమన పద్యాలు కేవలం వైయక్తిక అనుభవాలు మాత్రమే కాదు. అవి చాలావరకు నాటి పరిస్థితులను కూడా ప్రతిబింబిస్తాయి. విజయనగర సామ్రాజ్యం చాలాకాలం కొన ఊపరితోనే కొట్టుమిట్టాడింది. పాలెగాండ్లు కేంద్రాధికారాన్ని సాగనివ్వలేదు. పాలెగార్ల మూకుమ్మడి దాడులతో గ్రామాలు తల్లడిల్లాయి. శాంతికరువైన పల్లెలనుండి వలసలు మొదలైనాయి. బహుశా అట్లాంటి సందర్భాన్ని ఈ పద్యం ప్రతిబింబిస్తున్నదనుకోవాలి.

రాజకీయంగా గానీ, సాంఘికంగా గానీ ఆర్థికంగా గానీ శాంతి లేకపోతే ఎక్కడైనా జీవనోపాది కరువౌతుంది. భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. అటువంటప్పుడు మరోచోటికి వలసపోవాల్సిన ఆగత్యం ఏర్పడుతుంది.

తా – అంటే తాను. వ్యక్తి, వసించు చోటు అంటే నివసించే ఊరు. అలజడి (అల్జడి) అంటే అశాంతి, ఆపద, బాధ అని అర్థాలు. ఇది దేశీయ పదం. కన్నడంలో అలసికె అంటారు. అంటే అలసట. తమిళంలో అలచటి, అలైచటి అంటే విసుగు. మలయాళంలో అలసల్, అలశల్ అంటే కలత. ఇంచుమించు అన్నింటి అర్థమొక్కటే, ఇవన్నీ ఛాయాభేదాలు. "*నృపతికి లేవలజళ్లు భయలోక లీలలయందున్*" అని ప్రయోగం. సౌఖ్యం అంటే వెసులుబాటు, హాయి. ఈ ఇంట్లో నాకు సౌఖ్యంగా లేదు అంటే సౌకర్యంగా లేదని. భూమి అంటే ఇక్కడ మరోచోటు. "జరుగవలయు" అంటే వెళ్లిపోవాలని. చోటు మార్పు అన్నమాట. ఇది నుడికారం. 'అతడు జరిగిపోయినాడు' అంటే చనిపోయాడని. 'ఇక్కడ జరుగుబాటు లేదు' అంటే గడవటం లేదని.

కొలకు అంటే అడవిలో ఉండే నీటిమడుగు, కొలను. కొలకులు అనేది కొలనుకు బహువచనం. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రష్యాలోని సైబీరియా నుండి మన కొల్లేరుకు కొంగలు వలసవస్తాయి. కొల్లేటి కొంగలని పేరు వీటికి. ఆ సమయంలో ఇక్కడి చిన్నచేపలు,

తుంగ గడ్డి, రెల్లుగడ్డి, చిగుళ్లు వాటికి ఆహారం. సైబీరియాలో వాటికి ఈ సమయం ప్రతికూలం కావొచ్చు. వేలాదిమైళ్లు ఎగుర్తూ రావడం విశేషం. ఒక్కసారి అవి వచ్చేటప్పుడు అది రమణీయదృశ్యమని ఆకాశంలో తెల్లటి మేఘాలు కమ్మినట్లుందని అక్కడి వారు చెప్తారు. అయితే అప్పటివరకు కొల్లేటి పరిసరాల్లో ఉండే పిట్టలు వీటిధాటికి పారిపోతాయంటారు. ఈనాటి మన కలుషిత పరాక్రమానికి కొంగలు కూడా ముఖం చాటేస్తున్నాయంటున్నారు.

మొదటి పాదంలోని 'తగ' తరచుగా పాదపురాణమే. సరిపోయినట్లుగా అని అర్థం. తగుట నుంచి వచ్చిందే తగ.

**తిట్టికొట్టి రేని తిరిగి మరాడక**
**ఊరకున్నజూడ ఉర్వీమీద**
**వాడగు పరమాత్మ వర్ణింప శక్యమా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు అత్యంత సాధుమూర్తి. లోకంలోని మూర్ఖులు అతన్ని అర్థం చేసుకోలేక నిందించినా, భౌతికంగా బాధించినా ప్రతిస్పందించడు, అట్లా ఊరకుండిపోతాడు. అతడు తత్వానందస్థితికి చేరుకున్న యోగి. అతని ఘనతను తెలుసుకోవడం సామాన్యులకు సాధ్యంకాదు అంటున్నాడు వేమన.

అట్లాంటి మౌనులజోలికి వెళ్లటం మహాపాపం అని హెచ్చరిక.

ఇంకా ఇట్లాంటి పద్యాలు కొన్ని వేమన్న గతంలో చెప్పాడు. మచ్చుకు ఒకటి.

*"గోచి ఊడెననుచు కోతియాటాడించి*
*వెర్రియోగి నూరు వెడలమంద్రు*
*ఎవరి గోచులూడ వీ పొద్దుగుంకిన ॥విశ్వ॥*

రాత్రిపడ్డాక మీ భార్యలతో రమించడానికి మీగోచులూడవా అంటున్నారు వేమన్న. నాలుక ఊరుకోదుగదా! ఇటువంటి సంఘటనలు వేమన్న చూసినవీ కావొచ్చు లేక స్వానుభవమూ కావొచ్చు. స్వానుభవం ఎందుకంటే ఆయన దిగంబరయోగి అనే వాడుక లోకంలో వుంది. దిగంబరత్వాన్ని ఒక తాత్విక స్థాయిలో సమర్థించాడు కూడా,

*"పుట్టు బిత్తలివలె పోవు బిత్తలివలె*
*తిరుగు బిత్తలివలె దేహిధరణి"*

లాంటి పద్యాలు చెప్పాడు. వేమన తన గురించి చెప్పినట్టున్న పద్యాలు ఓ పది దాకా లభిస్తున్నాయి. బహుశా అవి అతని శిష్యులు చెప్పి వుంటారు. మచ్చుకు ఒకటి

*"వేమననగ యోగి వెలసె లోకములోన*
*పూజలిడుడు పుణ్య పురుషులార*
*పూజలిడినయంత భుక్తి ముక్తులనిచ్చు ॥విశ్వ॥*

యోగుల గొప్పతనాన్ని తెలుసుకొని మెలగాలనే సందేశం ఇట్లాంటి పద్యాల్లో ఉంటుంది.

యోగి అనేవాడు నిందాస్తుతులకు అతీతంగా ఉంటాడని పద్యంలోని సందర్భం. అట్లాంటి వాడిని స్థితప్రజ్ఞుడు అంటారు. స్థితప్రజ్ఞుడంటే బుద్ధిని ఆత్మయందు స్థిరపరచినవాడు అని భావం, ఆత్మజ్ఞాని అన్నమాట. ఇటువంటి వాడు కోరికలను పూర్తిగా జయించినవాడై వుంటాడు. కష్టసుఖాల్లో నిర్వికారాన్నీ, నిరాసక్తతనీ సాధించిన వాడై వుంటాడు. నిర్మలమైన మనస్సునీ, నిశ్చలమైన వైరాగ్యాన్నీ అలవరచుకున్న వాడై వుంటాడు. నిరంతరం ఒక గొప్ప సంతృప్తిని పొందినవాడై వుంటాడు. అతనికి పొయ్యేదేమీ లేదు కాబట్టి భయరహితుడై వుంటాడు.

స్వపరభేదం పాటించక సదా ఆత్మానందంలో ఉండే ఇటువంటి జ్ఞానిని, వికారాలకు లోనుకాని ఆత్మ సంతోషిని అర్థం చేసుకోవడం ఎలాగూ సాధ్యం కాదు గానీ అటువంటి వారిని తక్కువగా భావించరాదనేది వేమన్న సారాంశం.

"తిట్టి కొట బోగ (డి.1725-166), తిరిగి మాటాడక (డి.1721-186)" అనేవి పాఠాంతరాలు.

**తీపిలోన తీపి తెలియంగ ప్రాణంబు**
**ప్రాణ వితతికన్న పసిడితీపి**
**పసిడి కన్న మిగుల పడతి మాటలు తీపి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

మనుషులకు అన్నింటికన్న ఇష్టమైన దేది? ప్రాణం. అట్లాంటి ప్రాణం కన్న ప్రియమైనదేది? బంగారం. బంగారం కన్నా కూడా మనోహరమైనవి పరవశింప జేసేవి ఏవి? పడుచుదాని పలుకులు.

రసాయనిక శాస్త్రం ప్రకారం చక్కెరపదార్థం కలిస్తే వచ్చే రుచిని తీపి అంటారు. ఇది నాలుక అనే ఇంద్రియానికి సంబంధించింది. మరి ప్రాణం? ఇది ఒక సజీవ పరిస్థితి. ప్రాణంతో ఉండడం కన్న ముఖ్యమైన అపేక్ష మరేముంటుంది మనిషికి? కాని ప్రాణంపోయినా సరే బంగారముంటే చాలు అనేది అత్యాశ. అయితే ఈ రెంటిని మించిన మనోజ్ఞ భావన ప్రియురాలి మాటల్లో ఉంటుంది అంటున్నాడు వేమన. వేమన్నే ఓ పద్యంలో ఇలా అన్నాడు

*"తేనె పంచదార తియ్యమామిడి పండు*
*తిన్నగాని తీపి తెలియరాదు*
*కన్న నింపుబుట్టు కామిని అధరంబు" అని.*

చుంబనం సంగతి తర్వాత, చూసిన మరుక్షణంలోనే స్త్రీ పెదవి తియ్యటి భావనను కలిగిస్తుందని భావం. బంగారం కోసం ప్రాణాలైనా లెక్కచెయ్యనివాడు వనిత వ్యామోహంలో పడి విచక్షణను కోల్పోతాడు. దీనికీ గతంలో ఓ పద్యం చెప్పాడు వేమన.

*"కనకమృగము భువిని కలదు లేదనకను*
*తరుణి విడిచి పోయె దాశరథియు*
*చేటు కాలమునకు చెడుబుద్ధి పుట్టును"*

ఇక్కడ 'తరుణి' అనేది కీలకమైన మాట. అదే వృద్ధపత్ని అయి ఉంటే ఆమె కోరికను తీర్చేవాడా? ఆమె కోరకపోయి కూడా ఉండొచ్చనుకోండి, అది వేరే సంగతి. బంగారం, భామిని వీటిలో ఏదెక్కువ అంటే సందర్భాన్ని బట్టి ప్రాధాన్యాలు మారుతాయి. అందుకే కాంతా కనకాలు అన్నారు. మామూలుగా సుభాషితాలను పసిడిమాటలుగా పరిగణిస్తారు. కాని ఇక్కడ పడతి మాటలు బంగారాన్ని మించిపొయ్యాయి.

ఇంతకూ ప్రాణమంటే ఏమిటి? గాలి, ప్రాణవాయువు. ఇంగ్లీషులో ఆక్సిజన్ అంటాము. ఇది శరీరంలో ఉద్భవించే జీవశక్తి. ఇది శరీరాన్ని నీడలా ఆవరించివుంటుంది గాని దీనికో ప్రత్యేక రూపమంటూ వుండదు. ప్రాణం నుంచి పుట్టిందే ప్రాణవాయువు. ఇదే ఊపిరి లేదా శ్వాస. తెలంగాణ పల్లెల్లో ఒంట్లో బాగుండక పోతే "పాణం బాగలేదు" అంటారు అంటే దేహంలో గాలిదోషం ఉందన్నమాట. 'ప్రాణవితతి' అంటున్నాడు వేమన. వితతి అంటే సమూహం. అయిదు రకాల ప్రాణాలున్నాయి. పంచప్రాణాలంటారు. అవి 1.ప్రాణం 2. అపానం 3.వ్యానం 4.ఉదానం 5.సమానం. మొదటిది ఎక్కువగా శ్వాసాదులను బయటపెడుతుంది. రెండోది శరీరంలోని కిందిభాగంలో ఉన్న మలాదులను పోగొడుతుంది. మూడోది శరీరంలోని ఊర్ధ్వ ప్రదేశంలో వుంటుంది. దీనివల్లనే బ్రతుకుతాం. మాటలు, పాటలు అన్నీ దీని ఆధారంగానే, ఇక చివరిది సమానం. సమానం లెస్సగా బతికిస్తుంది. అంటే సమన్వయ పరుస్తుంది. ఇక్కడ పువ్వుకంటె తొడిమ బరువైనట్టు వ్యాఖ్యానం ఎక్కువైనట్టుంది. ఇక ఆపుతాను.

ఐహిక వ్యామోహాలను కాస్త కట్టడి చేసుకుంటే మంచిదని ఈ పద్యంలోని సారాంశం.

**తిరుమలకును బోవ తురక దాసరిగాడు**
**కాశిబోవ పంది గజము గాదు**
**కుక్క సింహమగునె గోదావరికి బోవ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తిరుమల కొండపైన వేంకటేశ్వరున్ని దర్శించినంతమాత్రాన మహమ్మదీయుడు మాల దాసరి అవుతాడా? అలాగే కాశీయాత్ర చేసినంత మాత్రాన అపవిత్రమైన పంది ఏనుగుతో సమానమౌతుందా? అదేవిధంగా గోదావరి పుష్కరాల్లో స్నానమాడినంత మాత్రాన నీచబుద్ధి గల కుక్కను మృగరాజైన సింహంతో పోల్చగలమా? క్షేత్ర సందర్శనం, తీర్థయాత్రలు చేసినంత మాత్రాన యోగ్యతలేని వారికి యోగ్యత సిద్ధించదు కదా! అని తాత్పర్యం.

తిరుమల అంటే ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని ఒక వైష్ణవ పుణ్యక్షేత్రం అని చెప్పొచ్చు గాని అదెప్పుడో ఆ పరిధులు దాటిపోయి ప్రపంచ ప్రసిద్ధి కెక్కింది. తిరు అంటే తమిళంలో శుభకరమైన, పవిత్రమైన అని అర్థాలు. మన శ్రీతో సమానం. తమిళంలో తిరుమలై అంటే పవిత్ర పర్వతం. కన్నడంలో తిరుమలె. మల అంటే కొండ.

తురక అంటే మహమ్మదీయుడు. మొట్టమొదట మనదేశం పైకి దండెత్తి వచ్చినవారు టర్కీదేశం వారు. కాబట్టి తర్వాత ముస్లింలు ఎవరొచ్చినా తురకలు అనేపదం రూఢిగా మారింది. దాసరి అంటే విష్ణుభక్తుడు. మాల దాసరులు దాసరులలో ఒక తెగ. శ్రీ వైష్ణవులకు అనుయాయులుగా ఉండేవారు. ఇప్పటికీ తిరుమలలో భజనబృందాలు, కోలాటబృందాలు ఉంటాయి. అవి దాసరి బృందాలే. శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యదలో మాలదాసరిని ఆదర్శభక్తుడిగా చిత్రించాడు. "*దాసరివా జంగమవా అంటే, ముందరి ఊరిని బట్టి అన్నాడట*" అనేది ఓ సరదా సామెత. మరి తురకల ప్రసక్తి ఎందుకు తెచ్చాడు వేమన? అప్పటికి తురకదాసర్లు కూడా ఉండేవారా? 17వ శతాబ్దం నాటికే దక్షిణభారతదేశంలో మహమ్మదీయ పాలకుల ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. వేంకటేశ్వరస్వామికి ముస్లింలు కూడా కైంకర్యం చేశారని చారిత్రికాధారాలు ఉన్నాయి. బీబీ నాంచారి ఔరంగజేబు కూతురని చెప్పేకథ ఒకటి ప్రచారంలో వుంది. దీనిని ఆనాటి మతసామరస్యానికి ప్రతీకగా భావించవచ్చు. తురకదాసరులు తిరుమలేశుని సేవించటం ఇష్టం లేని ఒక వర్గం ఆనాటికే ఉండేదని ఈ పద్యం వల్ల ఊహించవచ్చు.

ఇక కాశీకి వెళ్లినా ఏదిబడితే అది తినే అశుభ్రజంతువైన పంది అందరూ గౌరవించే ఏనుగుగా మారదు. ఏనుగు పెద్దది, బలమైనది కూడా *"ఏనుగు పడుకొన్నా గుర్రమంత ఎత్తు, ఏనుగు దాహానికి చూరునీళ్లా?"* అని సామెతలు.

ఇక మూడోపాదం కుక్క సింహమగునె గోదావరికి బోవ అనేది. సాధారణంగా "కుక్కతోక బట్టి గోదావరీదునా" అనే సామెత ఉంది. "కుక్కతోక బట్టి గోదావరీదితే కోటిపల్లి కాడ తేలేనయా' అని ఓ పల్లీయ గీతం. అంటే లోతట్టుకు ప్రవహించే నీటిని నిభాయించుకునే శక్తి కుక్కలాంటి బలహీనమైన జంతువుకు ఉండదని. ఇప్పటికీ లంకగ్రామాల వాళ్లు ఎద్దుతోకలు పట్టుకొని నదిని దాటడం కనిపిస్తుంది. మరి ఇక్కడ సింహం ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే సింహంది ఉదాత్తమైన బుద్ధి. నిలవ ఉన్న మాంసాన్ని తినదు. క్రొన్నెత్తురు మాంసం కావాలి. కుక్కది నీచబుద్ధి, కుళ్లిన పదార్థాలను కూడా తింటుంది.

*కాశిబోవ లంజ గరిత గాదు* (డి.1721–242) అనేది పాఠాంతరం.

**తి(ౖరివాని మిగుల దీవించగా రాదు**
**వె(ౖరివాని మాట వినగరాదు**
**వె(ౖరికుక్క బట్టి వేటాడవచ్చునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నువ్వెంతటి దయామయుడివైనా నీచుడిని ఆశీర్వదించకు. దానివల్ల వాడి నీచత్వం పోదు. నువ్వెంతటి సహనశీలివైనా అవివేకి చెప్పేదాన్ని అదేపనిగా వినకు. దానివల్ల వాడి ప్రవర్తన మారదు. నువ్వెంతటి పరాక్రమ వంతుడివైనా వేటకు పిచ్చి కుక్కను వెంట తీసికెళ్లకు. సాయం చెయ్యకపోగా అది నీకే ఎదురు తిరగవచ్చు. అపాత్రులతో వ్యవహరించాల్సిన పద్ధతిని బోధిస్తున్నాడీ పద్యంలో వేమన.

తి(ౖరి అంటే అనాగరికుడు, తుచ్ఛుడు. చేపలు పట్టేవాడు అనే అర్థముంది గాని అదిక్కడ పొసగదు. వె(ౖరివాడు అంటే ఉన్మత్తుడు, తెలివిలేని వాడు అని అర్థాలు. అడ్డదిడ్డంగా ప్రవర్తించేవాడు. ఇది దేశీయపదం. కన్నడంలో వెఱి అంటారు. క్రోధావేశం, రౌద్రం అన్నమాట. వె(ౖరి కుట్టి అంటే ఏమీ తెలియని అమ్మాయి అని. ఇది ప్రేమతో అనేమాట. అన్నట్టు కల్లు, మద్యాన్ని వె(ౖరినీళ్లు అంటారు తెలుసా?

కుక్కకు ఒకరకమైన వైరస్ వల్లనే పిచ్చి పడుతుంది. అప్పుడు దానికి విచక్షణా జ్ఞానం వుండదు. యజమానినే కరవొచ్చు. తస్మాత్ జాగ్రత్త! అని హెచ్చరిక.

*'తి(ౖరివాని మిగుల తిప్పించగా రాదు'* (డి.1725–150) అనేది పాఠాంతరం.

**తుంట వింటి వాని తూపుల ఘాతకు**
**మింటి మంటి నడుమ మిడుక తరమె?**
**ఇంటి యాలి విడిచి యెట్లుండ వచ్చురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కుటుంబ వ్యవస్థలోపలగాని, బయటగాని విరహం విరహమే. ఈ భూమ్యాకాశాల మధ్య విరహమంతటి దుస్తరబాధ లేదని అంటున్నాడు వేమన. వేమన జీవితంలోని పరిణామాన్ని ఈ పద్యం సూచిస్తుందేమో తెలియదు. గతంలో భర్తతో సయోధ్యలేని భార్య గురించి అనేక పద్యాలు చెప్పాడు వేమన. వేశ్యాజీవితాలను గురించి చెప్పాడు. కాని వేశ్యరికాన్ని వాచ్యంగా ఎక్కడా సమర్థించినట్టు లేదు. స్త్రీ పురుష సంబంధాలను గురించి వేమన్న అభిప్రాయాలను ఒక్కచోట పరచుకొని చూస్తే వాటిని మానవ జీవన ప్రయాణంలోని కొన్ని దశలుగా గుర్తించవచ్చు. అయితే వేమన తన వ్యక్తిగత విషయాల గురించి స్పష్టంగా చెప్పలేదు కాబట్టి వాడుక కథలే ఒక ఆధారం.

ఇది వేమన గృహస్థాశ్రమంలో చెప్పిన పద్యంగా కనిపిస్తుంది. చెరుకు విల్లులోంచి మన్మథుడు వదిలే బాణాల దెబ్బకు కలిగే మోహం ఇంతింతకాదు. ఆ విరహవేదనకు పైన ఆకాశం, కింద భూమి సాక్ష్యం. ఎవరికోసమీ బాధ? ఇంకెవరికోసం ఇల్లాలి కోసం. ఆమె ఇంట్లో లేదు. బహుశా తల్లిగారింటికి వెళ్లి ఉంటుంది. ఇటువంటివి సంసారులందరికీ అనుభవంలో ఉండేవే. దీనిని ఒక్క పురుషులకే కాకుండా స్త్రీలకు కూడా వర్తింపజేయవచ్చు. తుంటవింటివాడు అంటే మన్మథుడు. తుంట అంటే తునక, ముక్క. ఇక్కడ చెరుకుగడ. అందుకే తుంటవిల్కాడు అంటారు. తూపు అంటే బాణం. మిడుకతరమె – మిడుకుట అంటే దుఃఖపడటం. గుర్తుందా సుమతి పద్యం? "*అడిగిన జీతంబియ్యని/మిడి మేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్ / వడి గల యెద్దులగట్టుక / మడి దున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ!*" ఘాత అంటే దెబ్బ. ఇంటియాలు అంటే గృహిణి. ఈమాట ఉమ్మడి కుటుంబ చిహ్నం. ఆలుమగల మధ్య విరహముందంటే వారిది అన్యోన్య దాంపత్యం కిందే లెక్క. అది మూడు విరహాలు ఆరు సంయోగాలుగా వర్ధిల్లితే ఈ లోకం ఇంతకన్నా అందంగా ఉండే అవకాశం వుంది.

**తుమ్మ చెట్ల ముండ్లు తోడనె పుట్టును**
**విత్తులోన నుంచి వెడలినట్లు**
**మూర్ఖునకును బుద్ధి ముందుగా పుట్టునో**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తుమ్మ గింజలోంచి తుమ్మ మొక్కతో పాటు తుమ్మ ముల్లుకూడా కలిసే పుడుతుంది. అంటే రెండూ ఒకేసారి పుడతాయి. కాని మూర్ఖుడి విషయం వేరు. ముందు మూర్ఖత్వం పుట్టి తరువాత వాడు పుడతాడు, ప్రశ్నే లేదు పక్కా మూర్ఖుడన్నమాట!

చెట్టూ ముల్లూ కలిసి పుట్టడమే కాదు. గమనించండి తుమ్మముల్లు రెండు ముండ్లు ఒకటిగా అతుక్కున్నట్టుగా వుంటుంది. తుమ్మముల్లు గుచ్చుకుంటే ప్రాణాంతకం. అది శరీరంలో విరిగితే లోపల రక్తంతో పాటు ప్రయాణించి ఓ పట్టాన  దొరకదు.

ముళ్లవల్లనే తుమ్మచెట్టుకు భయపడతారు గాని స్వతహాగా తుమ్మచెట్టు పరోపకారే. తుమ్మ కలప ఎంత ఉపయోగం! తుమ్మబంక, లేదా గోందు సంగతి తెలిసిందే. తుమ్మ బెరడు పొడి కాలిన గాయాలకు పనిచేస్తుంది. పళ్లపొడిలో కూడ వాడతారు. తుమ్మకంపను కుమ్మరి ఆములో కాల్చడానికి ఉపయోగిస్తారు. తుమ్మకాయ గొలుసులను పిల్లలు కాలి ఆభరణాలుగా తగిలించుకుని వినోదిస్తారు. అది పల్లెటూరి బాల్యం.

ఇన్నివున్నా పాపం! తుమ్మ, ముళ్లవల్ల చెడ్డపేరు తెచ్చుకుంది. 'ఏమిటి నీ ముఖం తుమ్మలలో పొద్దుగుంకినట్టుంది' అంటే కళావిహీనంగా వుందని. "పుడుకు మ్రాన్పలి తావి పువ్వు దేనియలాను మగతేటి తుమ్మకొమ్మలకు" అని ప్రయోగం. ఇంతకూ తుమ్మకు ముళ్లెందుకు? ఎందుకంటే తుమ్మ జలాభావ పరిస్థితులను తట్టుకునే చెట్టు. ఆకు లెక్కువగా వుంటే బాష్పోత్సేకం వల్ల నీరు పోతుంది. అందుకే  ముళ్ళ పుట్టుక. ముళ్లకు అంత నీరు అక్కర్లేదు. పైగా అవి ఆకులకు రక్షణనిస్తాయి. ఎంత రక్షణ నిచ్చినా మేకలు ముళ్లు తగలకుండా ఆకులను హాయిగా ఆరగిస్తాయి. సృష్టి విచిత్రమంటే ఇదే!

పైన చెప్పిందంతా ప్రకృతి. కాని మూర్ఖుడు ప్రకృతికి విరుద్ధమైనవాడు, అవివేకి. మూర్ఖత్వం అతనికి జన్మతః వచ్చిన గుణం కాదు, జన్మకు ముందే పుట్టి వాడి కోసం కాచుక్కూచున్నది అని వేమన్న చమత్కారం.

**తేనె పంచదార తియ్యమామిడి పండు**
**తిన్నగాని తీపి తెలియరాదు**
**కన్ననింపు బుట్టు కామిని అధరంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తేనె, చక్కెర, మామిడిపండు వీటిని తింటే మాత్రమే తీపి తెలుస్తుంది. కాని కోరికమీదున్న స్త్రీ పెదవిని చూసినంత మాత్రాన్నే అది తియ్యటి అనుభూతిని కలిగిస్తుంది.

వేమన కవితాశక్తికి ఈ పద్యం ఓ మచ్చు తునక. సామాజిక విశ్లేషకుడికి రసహృదయం ఉండదనేది ఓ భ్రమ. ఆ భ్రమ దీనివల్ల పోతుంది.

తేనె తియ్యనిది, పంచదార తియ్యనిది, మామిడి పండు సరే, అయితే వీటి మాధుర్యం తెలియాలంటే వీటిని తినాలి. తింటే నాలిక ద్వారా వాటి తీపి అనుభవం లోకి వస్తుంది. మరి అందమైన స్త్రీ, పెదవిని స్పర్శా, చుంబనం దాకో కూడా అక్కర్లేదు. కనీసం చూస్తేచాలు మధురమోహనమైన శృంగార రసభావం కలుగుతుంది అంటున్నాడు వేమన.

పంచదార అనే మాట వాడాడు వేమన. ఆయుర్వేదంలో పంచదార అంటే పంచసారం అని అర్థం. సారమంటే రససారమనే. అవి 1.మధురం 2.లవణం 3.కటువు 4.తిక్తం 5.ఆమ్లం. కటువంటే కారం, తిక్తం అంటే చేదు, ఆమ్లమంటే పులుపు. పంచదార వాత, పిత్త సంబంధమైన జబ్బులను నయం చేస్తుంది. పై ఐదురుచుల్లో తీపి కొట్టొచ్చినట్టుగా వుంటుంది. మరి మామిడిపండు ఎందుకు? ఎందుకంటే ఆమ్లంలాగ అది తినేకొద్దీ తియ్యనవుతుందన్నమాట. చక్కెరను హిందీలో చీనీ అంటారు. చైనా నుంచి వ్యాపించిందని. చైనీస్‌లో 'షా' అంటే ఇసుక 'చే' అంటే చక్కెర. "షా-చే" అంటే ఇసుకలాగ రేణువులుగా మారిన స్ఫటిక చక్కెర అని. అలాగే అరబిక్‌లో అల్‌షక్కర్, స్పానిష్‌లో అజుక్కర్, జర్మనీలో జుక్కర్ అని, అలాగే ఇంగ్లీషులో షుగర్. చక్కరే సంస్కృతంలో శర్కరగా మారివుంటుంది.

'ఇంపుబుట్టు' అంటున్నాడు వేమన. ఇంపు అంటే తృప్తి, కాంక్ష, ఇష్టం అనే అర్థాల్తో పాటు తీపి అని కూడా వుంది. ఇక్కడ తీపే. అయితే మామూలు తీపి కాదు. పై మూడింటికన్న అతీతమైంది. 'కామిని' అనే మాటను యధాలాపంగా వాడలేదు వేమన. కామిని అంటే వొట్టి స్త్రీ కాదు. అభిలషించేది, వలచేది, మోహించేది అని అప్పుడేగా ఆమె అధరం మధురంగా వుండేది. అధరం అంటే కింది పెదవి. శృంగారంలో కిందిపెదవే కదా కదిలేది కదిలించేది. అందుకే అధరోష్ట్యం అని కూడా అని అంటారు. తియ్యమామిడి పండు అన్నాడు వేమన. 'తియ్య' అనే మాటను యతి కోసం వాడింది కాదు. పుల్లమామిడి పండు కాదని. నాలుకా, కళ్లు పంచేంద్రియాల్లోనివే అయినా దృశ్యం నుండి రసనానుభవాన్ని పంచి ఇచ్చే అపురూప పద్యంగా దీనిని మలిచాడు వేమన.

**తొత్తు తోటి పొందు తొర్రి పెసలమూట**
**ముచ్చుతోటి పొందు వచ్చునింద**
**తలవరింటి పొందు తలతోటి తీరురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చెయ్యగూడని వారితో స్నేహం చేస్తే అది నష్టానికి దారి తీస్తుంది. అదెట్లాగంటే వేశ్యతో సంబంధం పెట్టుకున్నావనుకో దానివల్ల రంధ్రంపడ్డ పెసర్ల మూటలోంచి పెసర్లు రాలిపోయినట్టు నీ ఆస్తి హరించుకపోతుంది. దొంగతో స్నేహం చేశావనుకో నీకూ దొంగ పేరే వస్తుంది. రాత్రి పూట గస్తీ తిరిగే దండనాధికారితో దోస్తీ చేశావనుకో ఒకనాటికి వాడు నిన్ను దోషిగా నిలబెట్టి తలతీయించే కార్యక్రమం చేపట్టవచ్చు. అందుకే తస్మాత్ జాగ్రత్త! అంటున్నాడు వేమన్న.

తొత్తు అంటే దాసి, బానిస, వేశ్య అని అర్థాలు. ఇక్కడ వేశ్య. తొర్రి అంటే ముందరిపండ్లు లేని నోరు, రంధ్రం అని అర్థాలు. ఇక్కడ రంధ్రం అంటే మూటకుండే చిరుగు అని. పెసలు అంటే నున్నగా ఉండే పప్పుధాన్యం. పెసలు నున్నగా వుంటాయి కాబట్టే తెలియకుండా రాలిపోతాయి.

ముచ్చు అంటే మోసగాడు, కుత్సితుడు, దొంగ అని అర్థాలు. ఇక్కడ దొంగ. గొఱ్రెముచ్చు. నాలి ముచ్చు అని లోకంలో వాడుకలున్నాయి. నాలిముచ్చు అంటే మనసులోని మాటను దాచుకొని పైకి మాట్లాడకుండా ఉండేవాణ్ని నాలిముచ్చు అంటారు. ముచ్చుమొగం అంటే లోపలి క్రౌర్యాన్ని బైటికి పొంగనివ్వకుండా ఉండేవాడు. దొంగముఖమన్నమాట. పైకి కనపడకుండా మోసగించేవాడని.

ఇక తలవరి అంటే రాత్రిపూట దొంగతనం మొదలైనవి జరగకుండా గస్తీ తిరిగేవాడు, నగరపాలకుడు, దొంగలను బంధించి దండించేవాడు. తలారి అని కూడా అంటారు. '*.....డాగబోయిన తలారిల్లయ్యె నేడేడకున్, బోనౌ...*' అని ప్రయోగం. తలారి కాబట్టి వాడితో సంబంధం తలతీసేదాకా రావొచ్చు. ఇప్పటికీ పోలీసులతో స్నేహం చెయ్యొద్దు అని అంటుంటారు.

ఈ పద్యంలో 'పొందు' అనే మాటను మూడుసార్లు వాడాడు వేమన. వీటికి వరుసగా సంగమం, సంబంధం, స్నేహం, పరిచయం అని అర్థాలు చెప్పుకోవచ్చు. కూడివుండటం అనేది సారాంశం. 'రాలపొందెరింగి రాల గూర్చిన భంగి / లోను పొందెరింగి లోను పరిచి' అన్నాడు వేమనే మరోచోట.

**తోటకూరకైన దొగ్గలికైనను**
**తవిటి కుడుముకైన తవిటికైప**
**కావ్యములను చెప్పు గండ్యాలు ఘనమైరి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కవులు రెండు రకాలు. డబ్బుకోసం ఏ రాజుల కోసమో పాళెగాండ్రకోసమో, స్థానిక అధికారుల కోసమో కవిత్వం చెప్పేవారు మొదటిరకం. అట్లాకాక స్వతంత్రబుద్ధితో లోకకళ్యాణం కోసం నిర్వ్యాజమైన రీతిలో చెప్పేవారు రెండోరకం. త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య, వేమన, శతకకవులు ఈ కోవకు చెందుతారు. ఈ పద్యంలో వేమన మొదటి రకం కవులపై విరుచుకపడుతున్నాడు.

వాళ్లు చవకబారు కవులు. పొట్టకోసం పిచ్చి వేషాలేస్తారు. పెద్ద బహుమానాల కోసం కాదు. చివరకు తోటకూర, దొగ్గలి ఆకు, తవుడు రొట్టె, తవిటి కూడు లాంటి సామాన్య పదార్థాలకోసం కూడా కావ్యాలు రచించి పారేస్తారు. సమాజంలో ప్రశస్థమైన కవులుగా చలామణి అవుతారు అంటూ అటువంటివారిని ఈసడించు కుంటున్నాడు వేమన.

దొగ్గలి కూర అంటే తోటకూరే. దానిలోనే మరోరకం. దొగ్గలాకులు తోటకూర కన్న పెద్ద ఆకులతో వుంటాయి. కొన్ని ప్రాంతాల్లో చిర్రికూర అని కూడా అంటారు. ఇదే మొక్కల కుటుంబంలోని మరో మొక్కను కలేగూర అంటారు. దీని ఆకులు మరీ చిన్నవి. అయితే దీనిని పండించరు. కలుపుమొక్క.

తవిటి కుడుము అంటే తవుడుతో చేసిన రొట్టె. కొన్ని ప్రాంతాల్లో పూర్ణం రూపంలో ఉండే భక్ష్యవిశేషం. వీటిని ఆవిరిలో ఉడికిస్తారు. తవుడు అంటే బియ్యంమీది మెత్తని పొట్టు. తవుడుతో రొట్టెలు చేస్తారా? మామూలుగా అయితే చెయ్యరు. కాని కరువు కాలాల్లో పేదలు తవుడు రొట్టెలు తిని కాలం వెళ్లబుచ్చేవారని విన్నాను. రాయలసీమలో కూడా నందన కరువు (1832), ధాతకరువు (1878)లు వచ్చాయి. అతి భయంకరమైనవి. వీటిలో లక్షలాదిమంది ఆకలితో చనిపోయారు.

ఇక గండ్యాలు – గండోలి అంటే వికృత వేషధారి, నవ్వించేవాడు. దీని బహువచనమే గండ్యాలు. ఇది నిఘంటువుల్లో దొరికే పదం కాదు.

*'తవుడుకైన తాలు తప్పకైన; 'తమిదపిండికైన తవిటికైన'* అని పాఠాంతరాలు (డి. 1723; 599) కాని పద్యంలోని పాఠమే తర్కసహంగా వుంది.

**తోలు కడుపులోన దొడ్డవాడుండగ**
**రాతి గుళ్లలోన రాశిబోయ**
**రాళ్లు దేవులైన రాసులు మింగవా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇది విగ్రహారాధనను నిరసించే పద్యం. చర్మంతో కప్పబడిన మానవదేహంలోనే ఆత్మస్వరూపమైన దైవముండగా రాతిగుళ్లలో అన్నపురాసులు పోసి నైవేద్యంగా సమర్పించడమెందుకు? నిజంగా రాళ్లే దేవుళ్లయిఉంటే నైవేద్య రాసులను అవే మింగి ఉండేవి కదా! ఎంత అజ్ఞానం! అంటున్నాడు వేమన.

తోలు అంటే చర్మం. కడుపు అంటే పొట్ట, ఉదరం, గర్భాశయం అని అర్థాలున్నా ఇక్కడ శరీరానికి ప్రతీక. వాడి పొట్టనిండా పుట్టెడు బుద్ధులు అన్నప్పుడు వాడి మనసునిండా అనే, అది నుడికారపు సొంపు. కడుపు అనకుండా నేరుగా దేహమే అనొచ్చుకదా! అనొచ్చు కాని తర్వాత అన్నం ప్రసక్తి వచ్చింది కాబట్టి ఇక్కడ సాభిప్రాయం. వాడి కడుపు అంటుకపోయింది అన్నప్పుడు ఆకలితో తిండిలేక కడుపు వెన్నుకు అంటుకపోయిందని. దేవుడి పేరుతో రాతివిగ్రహాలకు ఆహారం పెట్టడం, పూజాది క్రియలను ఆచరించడం అనవసరం. రాళ్లకు ప్రాణం లేదు, ఆకలి లేదు. ఈ రెండూ మనుష్యులకున్నాయి. కాబట్టి మనుషుల గురించి ఆలోచించాలంటున్నాడు వేమన.

ఆత్మ స్వరూపుడైన పరమాత్మ నీలోనే ఉన్నప్పుడు బాహ్యప్రక్రియలవల్ల ప్రయోజనంలేదు. అంతర్ముఖుడవు కా! అని సారాంశం. దొడ్డ అంటే గొప్పదైన, శ్రేష్ఠమైన అని అర్థం.

**ధనము లేకయున్న ధైర్యంబు నిలువదు**
**ధైర్యమొదవ దేని ధనము లేదు**
**ధనము ధైర్యమరయ దగు భూమిపతులకు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చేతిలో నుంచి ధనం వెళ్లిపోతే దానితోపాటు ధైర్యమూ వెళ్లిపోతుంది. అలాగే ధైర్య సాహసాలు లేని వాని వద్ద ధనం నిలిచే ప్రసక్తి లేదు. కాబట్టి ధనం, ధైర్యం పరస్పర దోహదకారులు. ఎవరికి? భూమిపతులకు. అంటే రాజులకు. భూమి పతులకే కాదు భూమి జనులకు కూడా అని తాత్పర్యం.

ధనం అంటే నిధి, ఆస్తి, సంపద, వనరు. పశు సంపద కూడా ధనమే. ధనాన్ని కాపాడాలన్నా, నిర్వహించాలన్నా, ధర్మబద్ధంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నా ధైర్యముండాలి. ధైర్యమంటే ధీరత్వం, దృఢత్వం, గాంభీర్యం, నిర్వికార చిత్తత అని అర్థాలు. ధైర్యముంటే ఉన్నధనాన్ని రక్షించుకోవటమే కాదు కోల్పోయిన ధనాన్ని కూడా సంపాదించుకోవచ్చు. అందుకే "ధైర్యే సాహసే లక్ష్మీః" అన్నారు.

ఒదవుట అంటే దొరకు, సిద్ధించు అని అర్థాలు. "*దైవయత్నము బలవంతంబైన నెల్ల పనులొదవు*" అని ప్రయోగం.

**ధనము లేమి యనెడి దావానలంబది**
**తన్ను చెరుచు మీరి దాపు చెరుచు**
**ధనము లేమి చూడ తలపనే పాపంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

డబ్బు లేక పోవడమనేది కార్చిచ్చు లాంటిది. అది దరిద్రాన్ని అనుభవించే వాడితోపాటు పరిసరాల్ని కూడా పాడు చేస్తుంది. ఆలోచిస్తే ధనరాహిత్య మనే భావనే దుర్భరమైనది అంటున్నాడు వేమన.

దావానలము అంటే అడవిలో పుట్టిన అగ్ని. దీనికి అడవి చిచ్చు, అద్రిజాతము, కారగ్గి, కారుచిచ్చు, దావకీల, విపినకీలి అనే ప్రయోగాలు కూడా వున్నాయి. అడవిలో చెట్టూ చెట్టూ రాచుకుంటే పుట్టేది దావాగ్ని. ఇది పుట్టిన చోటుతోపాటు అడివంతటిని దహించి వేస్తుంది. దాపు అంటే సమీపం, చేరువ, ఆధారం, అవలంబం అని అర్థాలు. *"మా మనోగతము నిర్భర హర్షము నొందె నింక నెప్పట్టున నేము ధన్యులము ప్రాపును దాపును నీవు గల్గినన్"* అనేది ప్రయోగం. ఇక్కడ ఆధారం అని అర్థం. పాపం అనేది ఇంగ్లీషులో సిన్, క్రైమ్, ఈవిల్ లాంటి మాటలకు సమానార్థకమైనా సందర్భాన్ని బట్టి ఛాయలు మారుతాయి. పాపపుణ్యాలు అంటే మంచి చెడులు అని. పాపంపు దైవమా! అంటే దయలేని దేవుడా! అని. పాపం! అంటే అయ్యో అని కూడా.

వేమన్న పేదరికాన్ని సంఘ విధ్వంసకశక్తిగా అభివర్ణిస్తున్నాడు. పేదరికం వల్ల అనేక దుర్గుణాలు సంక్రమిస్తాయి. వ్యక్తి భౌతికంగానే కాక మానసికంగా కూడా పతనమౌతాడు. మనిషి శీలానికి చీడ పుడుతుంది. నాలుక మీది సత్యవాక్కులు మాయమైపోతాయి. మనిషి దగాకోరుగా, దొంగగా మారవచ్చు. అతడు చేసే పాపాలు సంఘశాంతిని భగ్నం చేయ్యవచ్చు. కాబట్టి అందరికీ సమానంగా ధనం ఉండవలసిన సమాజంలో కొందరికి ధనం లేకపోవటాన్ని తలుచుకోవటమే పాపం. పేదరికం ఒక వ్యక్తినే కాక యావత్ సమాజాన్నీ చెరుస్తుందని హెచ్చరిస్తున్నాడు వేమన.

*'ధనము లేమెవరికి తాళికై ఉండదు', ధనము లేమి ఘనత దప్పు వేమ'* లాంటి పాఠాంతరాలు కనపడుతున్నాయి. పద్యంలోని పాఠమే బాగుంది 'లేమి' అంటేనే పేదరికం కదా మరి 'ధనము లేమి' అనటం ఎందుకు? ఎందుకంటే మరింత బలంగా నొక్కిచెప్పటం కోసం.

**ధనము లేమి సుతులు తప్పుల బెడుదురు**
**ధనము లేమి పత్ని తాకరాదు**
**ధనములేమెవరికి తాళికై యుండదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చేతిలో డబ్బు లేకపోతే ఒక కష్టమని కాదు. కన్నబిడ్డలు కూడా ప్రతి చిన్న విషయానికీ తప్పులు పడతారు. జేబులో పైసా లేని భర్తను భార్య దగ్గరకు రానివ్వదు. కనీసం తాకనివ్వదు. అయ్యో! ధనరాహిత్యం ఎవరికైనా భరించలేనిది కదా! అని నిట్టూరుస్తున్నాడు వేమన.

తాళిక అంటే ఓర్పు, సహనం, తాలిమి, క్షమ, నిదానం అని అర్థాలున్నాయి. *'ఎవరికి తాళికై ఉండదు'* అంటే అనుభవించేవాడికి కావొచ్చు, ధనహీనుడిని చులకనగా చూసేవారికీ కావొచ్చు. ఈ ధనహీనుడు మూలకు పడి లేవలేని వృద్ధుడు కాదు. ఇంకా పత్నిని తాకగలిగిన స్థితిలో ఉన్నాడు. అయినా సరే ధనాభావం వల్ల ప్రాధాన్యాన్ని కోల్పోయాడు. ఈ పద్యంలో వేమన్న సందేశం, ధనం లేకపోతే ఇన్ని పర్యవసానాలున్నాయి కాబట్టి ధనాన్ని కాపాడుకో అని మాత్రమే కాదు. కుటుంబ ప్రేమలన్నీ కేవలం ధనాధారితాలైనాయేమిటి అనే ఆవేదన కూడా దీనిలో కనిపిస్తుంది. ఇట్లాంటి లోకం పోకడకు విస్తుపోతున్నాడు వేమన.

ఇటువంటి అర్థం వచ్చే మరికొన్ని పద్యాలను వేమన చాలాచోట్ల చెప్పాడు. మచ్చుకు ఒకటి. *"కలిగిన మనుజుండు కాముడు సోముడు; విత్తహీనుడెంత రిత్తయైపోవును?"* డబ్బున్నవాడిని మన్మథుడంటారు, చంద్రుడంటారు. డబ్బు లేకపోతే సున్నాలా చూస్తారు. రిత్త అంటే రిక్తకు రూపాంతరం శూన్యమన్నమాట.

డబ్బు ముఖ్యమైనదే కాని అది లేనివాడు పనికిరాని వాడనే దృష్టి మంచిది కాదంటున్నాడు వేమన.

**ధర్మ కంటకుండు ధనముచే గర్వించి**
**సకల సంపదలను చాల పొరలి**
**కడకు తాను మేలు గానక చెడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు ధర్మానికి హాని కలిగించేవాడు. ఎందుకంటే ఎక్కువ ధనంతో మదమెక్కి ఉన్నాడు. అంతేకాదు, అనేక రకాల ఇంద్రియ సుఖాల అనుభవాల్తో మత్తెక్కి ఉన్నాడు. చివరికేం మిగిలింది? తాను డబ్బు వలన చెయ్యగలిగిన మంచి పనులు చెయ్యకపోవడం వల్ల వాటి సత్ఫలితాలు తనకు రావు. రాకపోగా నాశనమైపోతాడు అని వేమన్న ఉవాచ.

అతడు ధర్మకంటకుడు. అంటే ధర్మానికి ముల్లులాంటి వాడు. కంటకం అంటే ముల్లు. ముల్లులా బాధించేవాడన్నమాట. ముల్లు ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే ధర్మం అరటాకులా సున్నితమైనది. ముల్లు గుచ్చుకుంటే చిరిగిపోతుంది. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అన్నారు. అంటే ధర్మాన్ని నువ్వు రక్షించు, అది నిన్ను రక్షిస్తుంది అని.

ఇంతకూ ధర్మమంటే ఏమిటి? కల్పితమైన సర్వాన్ని ధరించి ఉండేది అని మూలార్థం. ధర్మమంటే వేదాదుల్లో చెప్పిన విధి నిషేధాలు. అందరూ ఆచరించేవి కొన్ని, కొందరే చెయ్యాల్సినవి కొన్ని. సన్యాస ధర్మాన్ని కొందరే ఆచరించాలి. చాలా ధర్మాలుంటాయి. వివాహధర్మం, కులధర్మం, పండిత ధర్మం వగయిరా. ధర్మానికి లక్షణాలున్నాయా? ఎందుకు లేవు పది రకాలున్నాయి. ధైర్యం, ఓర్పు, కోరికలను అణచివేయడం, నిజాయితీగా ఉండటం, సదాచారం, ఇంద్రియాల కట్టడి, బుద్ధిబలం, విద్వత్తు, సత్యం, అతి ఉద్రేకం లేకుండా ఉండడం ఇవన్నీ ధర్మపరుని జీవనమూల్యాలు. మానవ స్వభావాన్ని కూడా ధర్మమంటారు. వస్తుగుణమని కూడా, ఆ సందర్భాలు వేరు.

అతడు ధర్మమార్గానికి విఘాతం కలిగించడానికి కారణం అతని భోగజీవితం. సంపద అంటే ఐశ్వర్యం, కలిమి అనే కాకుండా భోగానుభవం కూడా. "*ఇంద్రియములును పాటవ సంపద బొందె; చర్మంబు గోరును సరవితోడుత శీతమృదుల సంస్పర్శ సంపదలనెపుడు; చన్నుగవరీతి సంపద, కొన్నాళ్లకు వ్రేగు జూపి గొబ్బున వ్రేలున్*" అని ప్రయోగాలు.

ఉపయోగకరమైన పనులు చేస్తే డబ్బు ఇతరులకూ మంచి చేస్తుంది తనకూ మంచి పేరు తెస్తుంది. అలా కానప్పుడు ఇతరుల సంగతేమో కాని తనకు మాత్రం కీడు చేస్తుంది. ఎలా? భోగలాలసత వల్ల. దానివల్ల జీవితం పాడైపోతుంది జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాడు వేమన. "*కడపలందు మంచి గానక చెడిపోవు*" (డి. 1773-3-13) అనేది పాఠాంతరం.

**ధర్మమన్న వినరు తను నమ్మి భూనరుల్**
**యముని వారు వచ్చి అడల జేసి**
**చొచ్చి కొట్టి తరుముచో పారగలరకో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దానధర్మాలు చెయ్యండి అంటే వినిపించుకోరు. ఎందుకంటే తమ దేహాలు శాశ్వతమనుకొని విర్రవీగుతారు. ఎవరు? భూలోకంలో జీవించే మనుష్యులు. మూర్ఖత్వం కాకపోతే అవసానదశలో యమకింకరులు వచ్చి భయపెట్టి వెంటబడి తరుముతుంటే ఎక్కడికని పారిపోతారు? అప్పుడెవరు రక్షిస్తారు? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

ధర్మం అంటే కల్పితమైన సర్వాన్ని ధరించేది అన్న పెద్ద అర్థం ఇక్కడ అక్కర్లేదు. సామాన్య ధర్మాలు, విశేష ధర్మాల ప్రసక్తి కూడా అవసరం లేదు. కనీసధర్మం, అంటే పక్కవాడికి సాయపడితే చాలు. అదే నిన్ను రక్షిస్తుంది. నువ్వు పోయినా ఈ లోకంలో చిరయశస్సును కల్పిస్తుంది. ఇదంతా ఎవరు చెప్తారు? గురువులు. గురువుల మాట వింటే ఇంతదాకా ఎందుకొస్తుంది. యముడు అనే మాటకు సర్వాన్ని నియమించేవాడు అనే అర్థముంది గాని ఇక్కడ నరకలోకపు రాజు అంటే చాలు. నువ్వు ధర్మాన్ని ఆచరించి వుంటే యముడు నీ జోలికెందుకొస్తాడు? అన్నట్టు ఇంగ్లీషువారికి కూడా యముడున్నాడు. Pluto అంటారతన్ని. యమభటులు వచ్చి హాయిగా పువ్వులా తీసుకపోరు, భయపెడతారు, పాశం వేసి పట్టబోతారు. ప్రాణభయానికి గురిచేస్తారు. ఎందుకొచ్చిన తిప్పలివన్ని, బుద్ధిగా మంచి పనులు చేస్తే పోదా అంటున్నాడు వేమన. తను-తనువు అంటే శరీరం, అడలు అంటే భయం. "*నను నిముసంబు గానకయున్న యూరెల్ల నరయు మజ్జనకు డెంతడలునొక్కొ*" అని ప్రయోగం.

**ధర్మ మరసి పూని ధర్మరాజాదులు**
**నిర్మలంపు ప్రౌఢి నిలుపుకొనిరి**
**ధర్మమే నృపులకు తారకయోగంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ధర్మ రక్షణకు సంకల్పించి ధర్మరాజూ అతని తమ్ములు మచ్చలేని వీరులుగా శాశ్వత కీర్తిని పొందారు. కాబట్టి రాజులకు ధర్మం ముఖ్యం. అదే వారిని తరింపజేసి పుణ్యగతులకు చేరుస్తుంది అంటున్నాడు వేమన.

ధర్మం అనేది కూడా చాలా పెద్దమాట. సందర్భాన్నిబట్టి అనేక ఛాయలు. పుణ్యం, న్యాయం, ఆచారం, స్వభావం, గుణం, యజ్ఞం, వేదాంతం, దానం, సామ్యం, శ్రుతి స్మృత్యాది విహితకృత్యం ఇలా ఎన్నో! దీనికోసం ధర్మశాస్త్రమే వుంది. ఒకప్పుడు ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుందనేవారు. కృతయుగంలో నాలుగు పాదాలు, త్రేతాయుగంలో మూడు, ద్వాపరయుగంలో రెండు, కలియుగంలో ఒకటి. ఒక్కొక్క పాదమే తగ్గుతూ ఇప్పుడు ధర్మం ఒంటికాలిపై నడుస్తుందన్నమాట.

ధర్మరాజు పాండురాజు పెద్దకొడుకు. ఉత్తముడు. న్యాయబుద్ధి కలవాడు. ధర్మరాజాదులు అంటే ధర్మరాజు నాయకత్వంలోని తక్కిన పాండవులని. వీళ్లేం చేశారు? ధర్మమరసి ధర్మము+అరసి చూశారు. అరయు అంటే పరీక్షించటం, పాలించటం, విమర్శ చేయటం అని అర్థాలు. ప్రౌఢి అంటే గొప్పతనం దిట్టతనం, ఉత్సాహం. ఇట్లా ధర్మాన్ని నిలిపిన రాజులకు ఏం జరుగుతుంది? నిర్మలమైన కీర్తి కలుగుతుంది. అంతేకాదు వారికి తారకయోగం సిద్ధిస్తుంది. తారకం అంటే దాటించేది. భయాల నుండి భయరాహిత్యంలోకి తరింపజేసేది. మనిషికి ఐదు రకాల భయాలుంటాయి. గర్భ, జన్మ, జరా, మరణ, సంసార అని. ఇవి వొట్టి భయాలు కాదు మహాభయాలు. మొదటిది గర్భవాసాది దుఃఖం, రెండోది పుట్టిన దగ్గరి నుంచీ పరిణామ దుఃఖమే. ఇందులో అనేక జన్మలు కూడా ఉండొచ్చు. జరా తెలిసిందే ముసలితనం, మరణం సరే, ఐదవది సంసారం. సాహచర్యం వల్ల కలిగే తాపత్రయాలు. సంసారమనేది ఓ పెద్ద సముద్రం అయితే ఆపదలు దానిలోని అలలు. దానిని దాటించే నావ కావాలి. అదే భగవంతుడు అన్నారు వేదాంతకవులు. ధర్మాన్ని రక్షించే మంచి రాజులు ఉత్తమ గతులు పొందుతారని సారాంశం.

**ధర్మసత్యములను తప్పక చేయని**
**కర్మజీవి మేలు కానలేడు**
**నిర్మల హృదయుండు నీ రూపమున నుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అతడు చెయ్యవలిసిన పనులు చెయ్యడు. చెయ్యగూడని పనులు చేస్తాడు. అందుకే వొట్టి కర్మజీవి. అంటే విద్యుక్త కర్మలను విస్మరిస్తాడు. కాబట్టి వాటిని బట్టే వాటి ఫలితాలు కూడా వుంటాయి. ఇక అట్లాంటి వాడు ధర్మాన్ని ఏం ఆచరిస్తాడు? సత్యాన్ని ఎలా పాటిస్తాడు? అతడు దోషరహితుడు కాడు. ఓ దేవా! రాగద్వేషాలు లేని పవిత్రుడే నీ రూపాన్ని పొందగలడు. అంటే నువ్వే తానుగా మారగలడు అంటూ లౌకికా లౌకికాల మధ్య సంబంధాన్ని విడమర్చి చెప్తున్నాడు వేమన.

ధర్మం అంటే పుణ్యం. వేదోక్త విధి. ఇక్కడ స్వభావం కాదు. సర్వాన్ని ధరించేది ధర్మమని వ్యుత్పత్తి. విద్యుక్త ధర్మాలను ఆచరించని వాడు ధార్మికుడు కాలేడు.

ఇక సత్యం. సత్యమంటే యథార్థమైంది. చూసినదాన్నీ విన్నదాన్నీ తెలుసుకున్న దాన్నీ ఉన్నదున్నట్లుగా చెప్పేది సత్యం. మాయారహితమైన శుద్ధ చైతన్యాన్ని సత్యమంటారు. ఇది అన్నికాలాల్లో ఉండేది. *(త్రికాలాఽ బాధ్యమైంది)* సత్యం అనేమాటకు అమరత్వాన్నీ, మర్త్యాన్నీ ఈ రెంటినీ నియమించేది అని అర్థం (సత్+తి+యం); సత్యవచస్కుడు రుషిలాంటివాడు.

సత్యధర్మాలను ఆచరించేవాడు స్వచ్ఛహృదయుడై ఉంటాడు. అట్లాంటి వాడికే నీ సాక్షాత్కారం, నీతో మమేకం లభిస్తుంది అంటున్నాడు వేమన. ఇక కర్మఫలం గురించి వేమనే మరో పద్యంలో చెప్పాడు వినండి.

**"చెటు వచ్చెనేని చెడనాడు దైవంబు**
**మేలు వచ్చెనేని మెచ్చుతన్ను**
**చేటు మేలు తలప చేసిన కర్మంబు"**

అలాగే *"నిర్మల హృదయుండు నిజరూపమున నుండు"* (డి.1773-3-138) అనేది పాఠాంతరం.

**దాచిన ధనమునకు తానును కొడుకును**
**వాంఛ పడుటె గాని వట్టి భ్రమలు**
**భాగ్యహీనునకును ఫలము లభించునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అతడు లంకెబిందెల్లో ధనాన్ని నింపి భూమిలో పాతి దాచిపెడతాడు. తానుగాని తరువాతి తరంవారైన తన కుమారుడు గాని అనుభవించాలని కోరుకుంటాడు. కాని అది జరుగుతుందో లేదో!? దురదృష్టవంతునికి ఆశించిన ఫలితం లభించడం మన చేతుల్లో లేదు అంటున్నాడు వేమన.

సంపద మాత్రమే కాదు దానిని అనుభవించే యోగం కూడా ఉండాలి. అసలు డబ్బును దాచి పెట్టుకోవడమే తప్పు. దానితో నలుగురికి సాయం చేస్తే ఆ కీర్తి వెలుగులన్నా మిగిలేవి గదా! దాచిన ధనం తరతరాలుగా ఉంటుందను కోవడంలోనే అజ్ఞానం ఉంది. వాంఛ అంటే కోరిక. భ్రమ అంటే భ్రాంతి. ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా కనిపించడమే భ్రాంతి. భ్రమ అంటే తిరగడం అని కూడ. భ్రమణం అన్నమాట.

ఈ పద్యంలో మూడో పాదం కీలకమైనది. భాగ్యం అంటే అదృష్టం. 'నా భాగ్యమెట్టున్నదో' అంటుంది రుక్మిణి భాగవతంలో. భజ్ ధాతువు నుంచి భాగ్యం. పొందదగినది అని అర్థం. పూర్వ జన్మార్జితమైన శుభాశుభకర్మ భాగ్యం. భాగ్యం, భాగదేయం అంటే విభజింపబడేదని కూడా. శుభాశుభకర్మలు విభజింపబడతాయన్న మాట. భాగ్యరేఖ అంటే అరచేతిలో ఉండే అదృష్టరేఖ. ఇక్కడ ధనరేఖ. ఇవాళ ధనాన్ని భూమిలో పూడ్చిపెడుతున్నావు. దాన్ని ఎవరు అనుభవిస్తారో నీకు తెలుసా? ఇప్పుడు నువ్వు భాగ్యవంతుడివే, సంపదకలవాడివే. కాని రేపు భాగ్యవిహీనుడ వైనప్పుడు అంటే అదృష్టంలేనప్పుడు సత్ఫలితం రాక పోవచ్చు. దుష్ఫలితం రావొచ్చు. అనుభవం లలాట లిఖితం అని వేమన్న ఉవాచ. ఉర్దూలో ఒక సామెత ఉంది. 'దానే దానే పర్ లిఖా ఖానే వాలే కా నామ్' ప్రతి ధాన్యపు గింజ పైన తినేవారి పేరు రాసిపెట్టి ఉంటుంది అని అర్థం.

ప్రాచీన కాలంలో బ్యాంకులు లేవు కదా! లంకెబిందెల్లో ధనం నింపి భూమిలో పాతిపెట్టేవారు. లంకె అంటె రెండు, జంట. జోడు బిందెలన్నమాట. ఒక్క బిందెను పాతిపెట్టరు. లంకె అంటే రెండింటిని కలిపి కట్టేకట్టు. వ్యవసాయ సంస్కృతిలో మంచి ఎద్దును దొంగ ఎద్దును కలిపి కట్టే కట్టును కూడా లంకె అంటారు.

'దాచు సొమ్మునకును *తానేడ కొడుకేడ?* (డి.1773-4-1242) అనేది పాఠాంతరం.

**దాతగాని వాని తరచుగా వేడిన**
**వాడు దాతయగునె వసుధలోన**
**అవురు దర్భయగునె అబ్ధిలో ముంచిన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో దానగుణం లేనివాడిని ఎన్నిసార్లు అర్థించినా అతడు దాతగా మారడు. అట్లాగే అవురుగడ్డిని తెచ్చి సముద్రంలో కడిగితే అది శుభకర్మల్లో వాడే దర్భగడ్డిగా మారుతుందా అంటున్నాడు వేమన. మౌలిక స్వభావం మారదని తాత్పర్యం.

కఠిన చిత్తుడు కఠినచిత్తుడే, ఎన్ని పర్యాయాలు ప్రార్థించినా కరగడు. అది అతని నైజం. తరచుగా అంటే మాటిమాటికి అని. అవురు అనేది ఒక జాతి గడ్డి. కాశెగడ్డి అంటారు, కామంచి గడ్డి అని కూడా. దీనికి తెల్లని పూలు పూస్తాయి. దీనితో చీపుర్లు చేస్తారు. కాశెపొరకలు, కామంచి పొరకలు అంటారు. కాశెగడ్డితో ఇండ్లు కూడా కప్పుతారు. *"హాలికులెన్నడుందెగని యౌరుల చేలును"* అని ఆముక్తమాల్యదలో ప్రయోగం. వృక్షశాస్త్ర పరిభాషలో ఆండ్రోపోగాన్ అంటారు.

ఇక దర్భ. ఇదీ ఒక తృణవిశేషమే. పవిత్రమైన తృణం. దర్భ, స్త్రీ దర్భ, పుందర్భ, నపుంసక దర్భ అని మూడు రకాలు. మొదట లావుగా ఉంటే స్త్రీ దర్భ, చివరన లావుగా వుంటే పుందర్భ, మధ్యలో లావుగా ఉంటే నపుంసక దర్భ. దర్భకు ఒక తెల్లని చార వుంటుంది. దర్భను కోయడం కష్టం. దీనిని కుశ అని కూడా అంటారు. కుశలుడు, కుశాగ్రబుద్ధి అనేవి దీనినుంచి వచ్చినవే. శుభకర్మల్లో దీనిని మొలతాడుగా ఉంగరంలాంటి వేలుముడిగా వాడతారు. ఈ ముడిని పవిత్రం అంటారు. దర్భ ఎందుకు పవిత్ర తృణమయ్యింది? దీనికి అద్భుత స్పర్శ సోకడం వల్ల పవిత్రమైందని భారతంలో ఓ కథవుంది.

అబ్ధి అంటే సముద్రం. అపారమైన సముద్రంలో ముంచినా కాశెగడ్డి దర్భగడ్డిగా మారదంటున్నాడు వేమన. రైతు బిడ్డ కాబట్టి ఇట్లాంటి పోలికలు వాడటం వేమనకు కరతలామలకం –

దాతగాని వాని తానెంత వేడినా / ఆతు దర్భయగునె అబ్దిలో ముంచినా (డి.1723, 294; డి.1769, 139); *దాతయగునె వాడు ధరణిలోన* (డి.1735, 294) అనేవి పాఠాంతరాలు.

**దానధర్మములను, దయయు, సత్యము నీతి**
**వినయ ధైర్యధుర్య వితరణములు**
**రాజు పాలిటికవి రాజయోగంబులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రాజుకు తప్పకుండా ఉండవలసిన గుణాలు కొన్ని వున్నాయి. అవి దానం, ధర్మం, దయ, సత్యం, నీతి, వినయం, ధైర్యం, సామర్థ్యం, ఉదారత్వం. ఇవి ఉన్నవాడే రాజు అనే మాటకు పాత్రుడవుతాడు అని వేమన్న నిష్కర్షగా చెప్తున్నాడు.

రాజయోగమనే మాట గడుసుగా వాడబడిందిక్కడ. రాజయ్యే యోగమున్నవాడు రాజవుతాడు. తర్వాత పైన చెప్పిన ఉత్తమ గుణాలు అవశ్యంగా ఉండితీరాలి. అయితే ఆధ్యాత్మిక దృష్టితో రాజయోగం అంటే భగవత్సాక్షాత్కార సాధనాల్లో ఒక యోగం. పతంజలి చెప్పినట్టు ప్రాణాయమం మొదలైన వాటి ద్వారా చిత్తవృత్తిని నిరోధించి భగవంతునిపై లగ్నం చేసే విధానమే రాజయోగం. అలా చేసేవాడిని రాజయోగి అంటారు. సాత్త్వికమైన భావనా విశేషంతో సాధన చేసేవాడు రాజయోగి. అయితే రాజనేవాడు ఇవన్నీ చెయ్యనక్కరలేదు. దానధర్మాది సాత్త్విక కార్యాలను ఆచరిస్తే చాలు. అప్పుడతడు రాజయోగికిందే లెక్క అని సారాంశం.

దానం చెయ్యాలి గాని తగినవాడికి చెయ్యాలి. 'క్షేత్రమెరిగి విత్తనం, పాత్రమెరిగి దానం' అని సామెత. అలాగే ధర్మం, తన్నుమాలిన ధర్మం ఉండకూడదు. 'శ్రేయాన్ స్వధర్మో విగుణః' అన్నట్లు అప్పటి రాజులు కులధర్మాలను రక్షించేవారు. ఇప్పుడా విలువలు మారిపోయినై. ధర్మం నాలుగు పాదాల్తో నడవాలి అంటారు, కుంటకూడదు. రాజుకు దయ, ఆర్ద్రత కూడా ఉండాలి. సత్యమంటే యథార్థం, నిశ్చయం అని అర్థాలు. నీతి అంటే ఒక పద్ధతి. రాజు నీతిపరుడుగా ఉండాలి. రాజుకు అణుకువ ఉండాలి. అలాగే సాహసం, సామర్థ్యం లేనివాడు అసలు రాజేకాడు. 'ధుర్య' అంటే మోయగలిగిన శక్తి.

వితరణ అంటే ఔదార్యం, త్యాగం, దాతృత్వం అని అర్థాలు. "*కలిమి గల లోభికన్నను, విలసితముగ పేదమేలు వితరణయైతే*" అని ప్రయోగం. "*పండిన తరువుపై పక్షులు చనునట్లు వితరణి కడకేగు విద్యలెల్ల*" అని మరో ప్రయోగం.

రాజులకు ఇన్ని గుణాలుండాలని ఆనాడే చెప్పాడు వేమన్న. ఇప్పుడుంటే మన రాజకీయ నేతలకు ఏం బోధించేవాడో!

**దానములను సేయ ధర చేతులాడక**
**బహుధనంబు గూర్చి పాతిపెట్టి**
**తుదను దండుగనిడి మొదలు చెడు నరుడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈ మనిషి ఉన్నాడే అపారధనరాసులను సంపాదిస్తాడు. కాని చిత్రమేమిటంటే దానధర్మాలరూపంలో ఒక్కపైసయినా విదిల్చడు. పైగా వాటిని భూమిలో పాతిపెడతాడు. ఇది ఎవరికోసం? దీని గురించి వేమన్న ఏమంటున్నాడంటే ఇతడు దానాలు చెయ్యక అపరాధం చేశాడు. అపరాధికి ద్రవ్యశిక్ష తప్పదు. అతని మరణానంతరం అది అధికారులపాలో రాజులపాలో అవుతుంది. అది అతడు చెల్లించిన దండుగ. అంతేకాదు పుణ్యం మిగలని అతని జీవితం నిర్మూలమైపోయింది. కాబట్టి సంపాదించిన దానిలో కొంతైనా నలుగురి సాయానికి వెచ్చించడం మంచిది అని వేమన్న సందేశం.

చేతులాడక అంటే మనసొప్పక అని. ఇది మంచి నుడికారం. దండుగ అంటే వృధా. కాని ఇక్కడ జరిమానా. నేరం చేసినవారికి చెల్లించాలని విధించే సొమ్ము. అపరాధి నుండి అపరాధ పరిహారంగా అధికారి తీసుకునే దండుగ గురించి హనుమకొండశాసనం (క్రీ.శ. 1079)లో వుంది. ఈ దండుగను రాజులు ధనవంతుల నుంచి బలాత్కారంగా తీసుకునేవారు. ఎవరినైనా బాధిస్తే దండుగ ఈనాం లని కూడా ఇచ్చేవారు అంటే అనవసరంగా బాధించినందుకు ప్రతిఫలంగా ఇచ్చే భూమి. "*కలవారి గని దండుగలు వెట్టెనృపుడు*" అని ప్రయోగం.

పాతిపెట్టిన ధనంతో తనకూ సుఖం లేదు. మరణిస్తే గుప్తంగా వ్యర్థంగా భూమిలోనే వుండిపోతుంది. ఈ రకంగా కూడా ఇది దండుగే.

తుదను అంటే అవసానవేళ, 'మొదలు చెడు' అంటే వేళ్లూ కొమ్మలూ లేని చెట్టులా నామరూపాలు లేకుండా పోతాడని.

**దిక్కులేని రోగి దీనత బాపిన**
**పురుషుడిహము నందు పూజ్యుడగును**
**పరమునందు వాని భాగ్యమేమనవచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎవరి అండా లేని ఒక వ్యాధిగ్రస్తుని బాధను పోగొట్టగలిగితే, అట్లాంటి మనిషి ఈ లోకంలో ఎంతో గౌరవింపబడతాడు. అంతేకాదు మరణాంతరం పరలోకంలో కూడా సుకృతాన్ని పొందుతాడు. కాబట్టి దుర్బల స్థితిలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవ కర్తవ్యం అని వేమన్న సందేశం.

'దిక్కులేనివాడికి దేవుడే దిక్కు' అంటారు. అంటే మనిషి దిక్కులేని వాడన్నమాట. దిక్కు అంటే దిశ అయినా ఇక్కడ శరణు. దేవుడే దిక్కు అనటానికి సిగ్గులేదా? నువ్వున్నావు గదా! దీనత అంటే దరిద్రం. దరిద్రం చెట్టుకు పుట్టే ఆకులే దైన్యం, భయం మొదలైనవి.

అతడు నిర్భాగ్యుడు, అనాథ, నిలువ నీడలేని వాడు పైగా రోగి అతన్ని చూస్తే నీ హృదయం కరగదా? ధార్మికుల హృదయమైతే కరుగుతుంది. ఏదో ఒకటి చేస్తారు వాళ్లు. అట్లాంటి దయాశీలురవల్లే ఈ లోకం నడుస్తుంది. ఇహం అంటే ఇక్కడ కనిపించే లోకం, ఈ లోకం. పరలోకం అంటే కనిపించని పరలోకం. అది అన్నిటికన్నా శ్రేష్టమైనది అని భావన. *"భూవిభుడు ప్రజకు రక్షణము సేయ నిహము బరంబుగల్గు"* అని ప్రయోగం. ఈ సందర్భంగా కరుణామయి మదర్ థెరిసా గుర్తుకు రాక మానదు.

పురుషుడు అంటే దేవుడని అర్థముందిగాని మానవార్థంలో వంశంలో పుట్టిన ఒకతరం వాడిని పురుషుడంటారు.

దుష్టుడు ఎవరినీ రక్షించడు. పైగా వీలయితే కష్టపెడతాడు. ఎదుటివాడు రోగి అయితే వీడు భవరోగి. ఇటువంటివాడికి ఇహంలో గౌరవం దొరకదు. పరం సంగతి దేవుడెరుగు!

*'జీవి నరయునట్టి జీవుడు శివుడురా'* (డి.1773-3-1493) అనేది పాఠాంతరం.

**దేవపూజలందు దేవాలయములందు**
**దేవుడంట జెప్పి తెరువు జూపె**
**తెలియ విశ్వమెల్ల దేవాధిదేవుడే**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేవుని గుళ్లలోని అర్చనల ద్వారా దేవుడంటే ఏమిటో అర్థం కావటానికి ఆయనే ఓ దారి చూపించాడు. అది అర్థం అయితే విశ్వమంతా ఆవరించిన పరమాత్మ అంటే ఏమిటో తెలుస్తుంది అంటున్నాడు వేమన.

దేవాలయాలకు ఎందుకు వెళ్లాలో ఆ భావాన్ని గురించి చెప్తున్నాడు వేమన. ధర్మమూలం తెలిసిన వారికే ఆత్మమూలం తెలుస్తుందనేది భావం. భక్తి జ్ఞాన వైరాగ్యాలనే సోపానాలు మీదుగా ప్రత్యక్ష దేవాలయం ద్వారా మనో దేవాలయం చేరాలనేది సారాంశం. సామాన్యులు విగ్రహారాధన ద్వారానే తాత్త్విక స్థాయికి వెళ్లగలరని వేమన్న గమనిక.

దేవుడు జ్యోతిర్మయుడు. అంటే ఆయనో వెలుగు. స్థూల నేత్రాలకు కనిపించక ప్రవర్తించే తేజస్వరూపుడే దేవుడు. పూజ అంటే గౌరవం, సపర్య, కొలవడం అనే అర్థాలు కూడా ఉన్నాయి. దేవాలయం అంటే గుడి. ఒక స్థాయిలో స్వర్గం. తెరుగు అంటే మార్గం, పద్ధతి, సాధనం, ఉపాయం అని అర్థాలు. ఇక్కడ ధర్మ మార్గమని. విశ్వం అంటే లోకం, జగత్తు అనే అర్థాలున్నా ఇక్కడ సమస్త సృష్టి. దేవాధిదేవుడు అంటే ఇంద్రుడని అర్థమున్నా ఇక్కడ మాత్రం దేవుళ్లకు దేవుడు అని అర్థం. అధిదేవుడు అంటే అధిష్టించి ఉండే దైవమని. ఇది విరాట్ పురుషుని స్వభావం.

సగుణోపాసన ద్వారా నిర్గుణోపాసన సుగమమౌతుందని చెప్తున్నాడు వేమన ఈ పద్యంలో.

"తెలియ విశ్వకర్మ దేవాధి దేవుడే (డి.1723-1081), తెలియ బ్రహ్మమెల్ల దేవాదిదేవుడు (డి.1725-622)" అనేవి పాఠాంతరాలు.

**దేవపూజ సేయ దివ్యభోగము కల్గు**
**తత్త్వమెరిగెనేని దైవసముడె**
**ఏమిలేని నరున కేగతి లేదురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేవుడిని పూజించగా పూజించగా దేవతాసంబంధమైన అనుభవం కలుగుతుంది, అదొక మెట్టు. ఆ తర్వాత పరమాత్మ సంబంధమైన జ్ఞానం ప్రాప్తిస్తుంది. అప్పుడతడు దైవంతో సమానమైన స్థాయికి చేరుకుంటాడు. ఈ ప్రస్థానాన్నే గతి అంటారు. ఇట్లా ఏ ప్రయత్నమూ చెయ్యనివాడికి పరమలక్ష్యమైన ముక్తి దూరంగానే వుంటుంది అని వేమన్న ఉవాచ.

అతడు విద్వాంసుడేగాని దేవపూజ చెయ్యడు. చేసి ఉంటే ఇహపర సౌఖ్యాలు అతని సొత్తయ్యేవి. అంతేకాదు మోక్షపదం దాకా వెళ్లి దైవసముడిగా భావించబడే వాడు. దివ్యం అంటే దేవతాసంబంధమైన అని అర్థం. దేవుడంటే వెలుగే, జ్యోతిర్మయుడని భావం. భోగం అంటే అనుభవం, సుఖానుభవం. ఆనందమే. “ఇంక పుణ్యంబు భోగింప నేగుదెమ్ము” అని ప్రయోగం. తత్వం అంటే దేవుడికి సంబంధిం చిన ఎరుక. ‘దైవసముడు అంటే ఇంకా అభేద స్థితికి చేరలేదు గాని దాదాపు సమాన స్థితికి చేరుకున్నాడని. గతి అంటే ప్రాప్యస్థానం, ఆధారం అని అర్థాలు. ఈ గతిలో అంటే ఈ పయనంలో పుణ్యప్రాప్తిలేదు అని సారాంశం. ఇక్కడ గతి అంటే పర్యవసానమని కూడా.

ఎవరికైనా ముక్తి అనేది పరమలక్ష్యం. దానిని సాధించాలంటే అనేక స్థాయిలలో సాధన చెయ్యాలి అంటున్నాడు వేమన.

**దేశదేశములను గాసిలి తిరుగంగ**
**ఆత్మయందు ధ్యానమంటు కొనునె**
**కాసులకును దిరుగ కలుగునా మోక్షంబు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎన్ని ప్రాంతాలు తిరిగినా అలిసిపోవటమే తప్ప ఏకాగ్రతలేని ధ్యానం వల్ల జీవుని తత్వం బోధపడుతుందా? డబ్బువేటలో పడ్డవాడికి ముక్తి లభిస్తుందా వెర్రిగాని, అని దొంగ గురువులను నిలదీస్తున్నాడు వేమన.

యాత్రికులు గాని, మఠాధిపతులు గాని, కల్లయోగులు గాని, దేశదేశాలు సంచరిస్తారు. తమలో లేనిది ఇతరులకు బోధిస్తారు. తమలోకి చూసుకోరు. ధ్యానయోగంతో సాధనచేస్తే ఆత్మసాక్షాత్కారం ఎప్పుడో అయివుండేది.

దేశం అంటే వేమన్ననాటికి ఇప్పటి దేశం కాదు. అంటే కంట్రీకాదు. ప్రాంతం, రాజ్యం ఏదైనా కావొచ్చు. నగరానికి వలసపోయినవాడికి దేశం అంటే వాడి పల్లెటూరె. దేశభాష అంటే మాండలికం. 'దేశభాషలందు తెలుగు లెస్స' అంటే కృష్ణదేవరాయలు ఉద్దేశించిన అర్థం తన రాజ్యంలో ఉన్న కన్నడ, తమిళ భాషల మాండలికాల కంటే శ్రావ్యమైనది అని. ఇప్పటి అఖిల భారతీయ భాషల సన్నివేశంలో గొప్పదని కాదు. దేశభాష అంటే అప్పట్లో సంస్కృతం కానిది అని. వాడుక భాష అని. గాసిలు అంటే కష్టపడు, శ్రమపడు, సొమ్మసిల్లు అని కూడా అర్థాలు.

కాసు అంటే డబ్బుకు సాధారణ వాచకమైనా కనిష్టమైన, బంగారు, వెండి, రాగి నాణాలకు వాడేవారు. ఇంగ్లీషులో పెన్నీ లాంటిది. పాత కాలంలో దమ్మిడి, దుగ్గాణి, దుడ్డు ఇట్లాంటివి. విలువల్లో చిన్న చిన్న తేడాలుండేవి. వస్తుమార్పిడి పోయి డబ్బుల వ్యవస్థ వచ్చి అమాయకులు మోసపోయేవారు. ఇప్పుడు నోట్లు వచ్చాయి. అంటే రశీదులు.

మోక్షం బయట తిరిగితే రాదు. అంతర్ముఖత్వమే ముక్తికి మార్గం అంటున్నాడు వేమన.

**దేశ వేషములను తేటసేయక దేవు**
**డాత్మలోన నుండు అణగిపెనగి**
**వేషమరసి చూడ గ్రాసంబు కొరకయో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేవుడు లోకుల దేశాటనాలను, వేషధారితనాన్ని పట్టించుకోడు. వాటి ద్వారా దొరకడు. ఆత్మలోనే పాములా చుట్టుకొని ఉంటాడు. ఆమాత్రం తెలుసుకోకుండా రూపాలు మార్చుకొని దొంగ వేషాలతో తిరగడమెందుకు? ఎందుకంటే పొట్టకూటికోసం అని సమాధానం.

వారు కల్లయోగులు. అనేక ప్రాంతాల్లో సంచారాలు చేస్తుంటారు. భగవంతుడిని సేవించటానికని చెప్తారు. భక్తులను తరింపజేస్తామని నమ్మిస్తారు. వారి ధనాన్ని దోచుకుంటారు. పరమాత్ముడు ఆత్మలోనే ఉంటాడని చెప్పరు. అది వారికే తెలియదు. ఆత్మ పైపై వేషాలకు అందేదికాదు. ఆత్మ అంటే తత్వం. అది ధ్యానశీలికే దొరుకుతుంది. ప్రణవతేజంగా పరిఢవిల్లుతుంది, సత్యజ్ఞానమై వెలుగుతుంది. యోగసాధకుడికే ఇట్లాంటి అనుభవాలు సాధ్యం.

దేశం అంటే వేమన్న నాటికి ఇప్పటి దేశం కాదని చెప్పుకున్నాం. కొన్ని రాష్ట్రాలు కలిసి స్వతంత్రంగా ఏర్పడిన ప్రాంతాన్ని ఇప్పుడు దేశమంటున్నాం. సాధారణంగా దేశమంటే స్థానం, ప్రదేశం అని అర్థాలు. రాజుల కాలంలో రాజ్యం. వేషం అంటే వస్త్రాలతో ఆభరణాలతో మతచిహ్నాలతో అలంకరించుకున్న మారువేషం. తేటసేయక అంటే స్పష్టం చెయ్యక అని అర్థం. అణగిపెనగి అనేది నుడికారం. రెండు పాములు మెలివేసుకొని చుట్టుకొని ఉండటాన్ని అణగి పెనగి అంటారు. పెనగి అంటే పెనుగులాడటం. అణగి ఉంటే అదిమినట్టు ఉండటం. ఇది ఆత్మలో ఉన్న దేవుడి స్థితి. ఊహిస్తే ఒక విలక్షణ రూపభంగిమ. *"పడతి యీ ముడినేమి ముడిచితే యేదేది విడుమంచు నునుపోక ముడికి పెనగు"* అని ప్రయోగం. వేమన్నే మరోచోట *"పెనగ పెనగ పుట్టు ప్రేమ సతికి"* అన్నాడు. పెనగ పెనగ అంటే సంభోగించేకొద్ది అని అర్థం. గ్రాసం అంటే కబళం, అన్నం, ముద్ద, మింగడం.

ఈ దేశాలు, వేషాలు అన్నీ తిండికోసం, నిజమైన జ్ఞానం కోసం కాదు. దేవుడు బయట దొరకడు. నీలోనే ఉన్నాడు తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

....తేట సేయునె శివుడు (డి.1725–770) అనేది పాఠాంతరం.

**దేహగుణములెల్ల తెలిసిన శివయోగి**
**మోహమందు చిక్కి మోసపోదు**
**ఇంద్రజాలకుండు ఎందుకు చిక్కురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శరీరానికి కొన్ని సాధారణ గుణాలుంటాయి. ఇంద్రియ లౌల్యం, అస్థిరత్వం, రోగబాధలు మొదలైనవి. వీటి గురించి తెలిసిన శివోపాసకుడైన యోగి తానే వదిలేసిన మోహంలో మళ్లీ చిక్కుకోడు. ఎట్లాగైతే ఇంద్రజాలికుడు తాను కల్పించిన మాయా వస్తువుల్లో తానే చిక్కుకోడో అట్లాగ. ఎందుకంటే అవి తన కల్పనలే అని అతనికి తెలుసు.

వేమన్న వీరశైవం లోని వెలుగునీడల గురించి ఎన్నోపద్యాలు చెప్పాడు. దీన్నిబట్టి బండారు తమ్మయ్యవంటివారు ఆయనను శైవుడని నిరూపించే ప్రయత్నం చేశారు. లంభికా శివయోగి వేమన్నకు గురువు అనే వాడుక కూడా లోకంలో వుంది. ఏది ఏమైనా వేమన్నకు వీరశైవదర్శనంలోని పలు అంశాలు కరతలామలకం అని ఆయన పద్యాల వల్ల గ్రహించవచ్చు.

ఇక శివయోగి గురించి చూద్దాం. వీరశైవ దర్శనంలో స్థలం, లింగం, అంగం అనేవి చాలా ముఖ్యమైన మాటలు. స్థలం అంటే ఆధారభూమి, అంటే పరమతత్వం. లింగం అంటే లింగరూపం, అంటే ఉపాస్యదేవత. ఇక అంగం, లింగాన్ని ఆరాధించే జీవున్ని అంగం అంటారు. అతడే ఉపాసకుడు. అతడు సాంసారిక దుఃఖం నుండి విముక్తం కావడానికి తపస్సు చేస్తాడు. అట్లా తపస్సు చేసే సామర్థ్యం అతనికి శక్తి నుంచి లభిస్తుంది. అతడే శివయోగి.

శివయోగి స్థాయి దాకా చేరుకున్నవాడు మళ్లీ వెనక్కివచ్చి మోహంలో చిక్కుకుంటాడా అంటున్నాడు వేమన. మోహం అంటే వస్తువు యొక్క యధార్థతను తెలుసుకోలేకపోవడం. అంటే మిథ్యాజ్ఞానం.

ఇంద్రజాలం అంటే లేనిది ఉన్నట్టుగా చూపే కనుకట్టు విద్య. ఇంద్రజాలికునికి తాను కల్పించిన వస్తువు నిజం కాదని తెలుసు. అది తన హస్తలాఘవం వల్ల ఏర్పడిందనీ తెలుసు. అటువంటప్పుడు అది నిజమని భ్రమ పడతాడా? పడడు అంటున్నాడు వేమన.

పై స్థాయికి వెళ్లిన వాడు మళ్లీ కిందకి రావడం సాధారణంగా జరగదు. జరిగితే అది పతనం కిందే లెక్క అనేది సారాంశం.

*మోహమందు జిక్కి మునిగిపోడు* (డి. 1736–111), *ఇంద్ర జాలికుండు ఎంద్రైన భ్రమయునా* (డి. 1723–441) అనేది పాఠాంతరాలు.

**దొంగతనము రంకు దొరసియుండు జగతి**
**రంకులాడికింట శంకబుట్టు**
**దొంగకెన్న రేవెలుంగొప్పుకానట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

లోకంలో దొంగతనం, రంకుతనం రెండూ ఒక్కలాంటివే. రంకులాడికి ఇంటి వాతావరణంలో భయం. దొంగకేమో వెన్నెలరాత్రులు అడ్డు, దొరికిపోతానని. ఎవరి బాధలు వారివి అని జాలి పడుతున్నాడు వేమన. భయపడే పనులు చెయ్యడమెందుకు? అని సందేశం.

రంకు అంటే జారత్వం. 'రంకుటెలతీగబోణులు' అనేది ప్రయోగం. రంకులాడి అంటే జారిణి. దొరయుట అంటే సరిపోలడం, సమానమవడం అని అర్థాలు. *"గగన వాహిని రొంపి గాడి కొండొక దోచు కమలాప్త రథరథాంగంబు దొరసి"* అని ప్రయోగం. శంక అంటే సందేహం, లేదా భయం. దొంగతనం, వ్యభిచారం చాటుగా చేసే పనులు, అందుకనే భయం. రంకులాడికి సంసారం పట్ల గౌరవం ఉండదు. దానికి అనేక సాంఘిక, వైయక్తిక కారణాలు ఉండొచ్చు. ఇక శంక ఎందుకంటే ప్రియుడితో సమాగమం వీలవుతుందో లేదోనని. అన్యమనస్కత కూడా దీని మరో ప్రధాన లక్షణం.

ఇక దొంగ. పాతకాలంలో దొంగలు రాత్రిపూట అందరూ పడుకున్న తర్వాత చీకట్లో దొంగతనానికి బయల్దేరేవారు. వెన్నెలకు భయపడేవారు నలుగురి కంట పడతామేమోనని. రేవెలుగు అంటే వెన్నెల. ఈకాలం దొంగలకు రాత్రీ పగలు అనే భేదం లేదు. సూర్యుడన్నా భయంలేదు. ఇప్పటి దొంగ ఎవరైనా అడ్డొస్తే హింసకు కూడా పాల్పడతాడు. ఆనాటి పేదదొంగలకు భయముండేది. నేటి ఘరానా దొంగలకు ఆ సమస్యలేదు.

రంకు అనేది ఆడవాళ్లకే కాదు పురుషులకూ వర్తిస్తుంది. అట్లాంటి పురుషుణ్ని రంకుబోతు అంటారు.

**దొంగ తెలివి చేత దొరుకునా మోక్షంబు**
**చేతగాని పనుల చేయరాదు**
**గురుడనంగ వలదు గుణహీనుడనవలె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మోక్షం వైపు దారి చూపడం అతనికి చేతకాదు. మోక్షమంటే ఏమిటో అతనికే తెలియదు. కాని వేషధారితనంతో ప్రజలను వంచించటంలో మాత్రం ఘనుడు. అటువంటి వాడిని గురువు అనడం ఏమిటి? అతడొక దుర్గుణాల పుట్ట.

17వ శతాబ్దం చారిత్రకంగా చీకటి శతాబ్దం. బలమైన రాజ్యం లేదు. తత్వాలు నశించి మతాలు మిగిలి జ్ఞాన మూల్యాలు తారుమారయిన పరిస్థితి. వేమన రెండు రకాల గురువులను పేర్కొన్నాడు. జ్ఞాన గురువులు, కల్లగురువులు. వేదాంతసారంలో నిజ గురువులను గురించి గొప్పగా చెప్పారు. జ్ఞానఖడ్గంతో పాపాలను నరికేసేవాడు గురువు. శిష్యులను కన్నబిడ్డల్లా కాపాడి దయామృతాన్ని కురిపిస్తాడు. ఇనుపముక్కకూ పసిడి ముద్దకూ ఒకేరకమైన విలువనిస్తాడు. బోధించేవన్నీ ముందు తన ఆచరణలో చూపుతాడు. క్షేత్ర సందర్శనం చేస్తాడు. చతుర్వేదాలు, జ్యోతిష్యం, వైద్యం, ధర్మం మొదలైన శాస్త్రాలు, అష్టాదశపురాణాలు, కావ్యనాటకాలు, చుతుష్షష్టి కళలు మొదలైనవన్నీ చదువుకొని వుంటాడు.

మరి దొంగ గురువో!? వేమన్నకాలానికి 'గురువు' అనే పదానికి 'యజమాని' అన్న అర్థం వచ్చి చేరింది. ఆధ్యాత్మిక విలువలపరంగా కాకుండా సంఘంలో హోదా సంపత్తులవల్ల కూడా గురువులైనారు. జ్ఞానం లేనప్పటికీ వారసత్వంగా గురువులైనారు. పారిభాషిక పదాలతో సామాన్య ప్రజలను హడలగొట్టేవారు. కులబహిష్కరణవంటి శిక్షలు అమలు చేసేవారు. వారు ఏది యిస్తే అదే మహా ప్రసాదం! వారి పాదోదకం, చివరకు వారు పుక్కిలించిన నీరు కూడా తీర్థమే. గురువు శపిస్తే నాశనమైపోతారని భయపెట్టేవారు. ఏనుగులపై ఊరేగేవారు. జబర్దస్తీగా డబ్బులు వసూలు చేసేవారు. వీరి బ్రహ్మచర్యం నేతిబీరకాయ చందంగానే వుండేది. వీరెప్పుడూ ఒకరిద్దరు స్త్రీలను వంటలక్కలుగా నియమించుకునేవారు. సామాన్యులకు విధించే కట్టుబాట్లు తమకు వర్తించనట్టుగానే ప్రవర్తించేవారు. ఇలాంటి గురువులను ప్రజలు లోలోపల అసహ్యించుకునేవారు.

వేమన్న వర్ణించే గురువు 'గుణవిహీనుడు' అంటే ఒక్క మంచి లక్షణం కూడా లేని వాడు. వొట్టి దాంబికుడు. ఇటువంటి వారిని నమ్మరాదని వేమన్న హెచ్చరిక!

'*దొంగ మాటలాడ దొరుకునా మోక్షంబు / చేతగాని కూత చెల్లదెపుడు / గురువు పద్దుగాదు గుణహీనమది గాని*' (డి.1722-83) అనేది పాఠాంతర పద్యం.

**దోసకారియైన దూసరికాడైన**
**పతితుడైన వేదబాహ్యుడైన**
**ధనికునెల్ల వారు కనియింపుచుందురు**
**విశ్వదాభిరామ వినురవేమ**

ఏం మనుషులండీ వీళ్లు? ధనవంతుడు ఎట్లాంటివాడైనా పరవాలేదా? ప్రశంసిస్తూనే వుంటారు. అతడు తప్పులు చేసేవాడు కానీ, చెడ్డనోరు కలవాడు కానీ పాపాలు చేసిన వాడు కానీ, వేద పఠనానికి అనర్హమైనవాడు కానీ ధనవంతుడైతే చాలు ఏ సూత్రాలూ పని చెయ్యవు. ఇదేం పద్ధతి అని ఛీత్కరిస్తున్నాడు వేమన.

దోసకారి (దోషకారి) అంటే అపరాధి. దూసరి కాడు అంటే మత్సరగ్రస్తుడు, అందరిని నిందించేవాడు, తిట్టేవాడు. కొందరు భావిస్తున్నట్లు దూసరి అంటే తృణవిశేషం కాదు, అంటే దూసరి తీగ కాదు. మరికొందరు చెప్తున్నట్టు సంస్కృతపదమైన 'ధూసర' కాదు. అది ధూళిధూసరం జంటలోనిమాట.

పతితుడు అంటే ఉన్నస్థానం నుండి కిందికి పడిపోయినవారు. నీచత్వం పొందినవాడు. ఇక 'వేదబాహ్యుడు'. వేదబాహ్యులు రెండు రకాలు. ఒకటి, వైదిక కర్మలను అపవిత్రంగా నిర్వహించేవారు. రెండు, వేదం చదవడానికి అర్హత లేని బ్రాహ్మణేతరులు. బ్రాహ్మణేతరులకు అర్హతలేదని స్మృతుల్లోనే వుంటుంది. శ్రుతుల్లో అంటే వేదాల్లో ఉండదు. వేదాలు సార్వజనీనమైనవని దీనివల్ల తెలుస్తుంది.

ధనాన్నిబట్టి కాక మనిషి యోగ్యతను బట్టే విలువనివ్వాలని వేమన్న సందేశం. 'వట్టిలేని వాని పేదవాని కీ దగు నీవి" (డి.1721-197) అనేది పాఠాంతరం.

**నిజము లాడువాని నిందించు జగమెల్ల**
**నిజములాడరాదు నీచుతోను**
**నిజ మహాత్మగూడి నిజమాడవలయురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఉన్నదున్నట్టుగా నిజం మాట్లాడే వాడిని లోకం మెచ్చదు. అలాగే తక్కువస్థాయి వాని ముందు నిజం మాట్లాడితే ప్రమాదం కూడా. మరి నిజం మాట్లాడనే రాదా? ఎందుకు మాట్లాడరాదు, గొప్పవాడితో మాట్లాడొచ్చు. అతడైతే సరిగ్గా అర్థం చేసుకుంటాడు.

ఈ పద్యంలో మూడు రకాల వాళ్లున్నారు. ఒకరు లోకులు. అంటే సామాన్యజనం. వీరు నిజమంటే ఉలిక్కిపడతారు. ఎందుకంటే ఎదుటివాడు నిజం మాట్లాడితే తమ అపమార్గాలన్నీ బయట పడతాయని భయం. రెండోకోవకు చెందినవాడు నీచుడు. నీచుడంటే అల్పుడు, హీనుడు, అధముడు, ధూర్తుడు, చెడ్డవాడు, మూర్ఖుడు అని ఛాయలు. మూడోవాడు మహాత్ముడు. అంటే ఉదార స్వభావుడు, పుణ్యాత్ముడు, గొప్పవ్యక్తి అన్నమాట. ఇతడు మంచిచెడ్డల సారమెరిగిన వాడు.

'యథార్థవాదీ లోక విరోధీ, నిజమాడితే నిష్ఠూరము' అనే సామెతలున్నాయి. నిజం నిలకడ మీద తెలుస్తుంది గాని ఈ లోపల జరగవలసిన నష్టం జరిగిపోతుంది. అందుకే ఇంగ్లీషులో కూడా అని Truth is bitter food అంటారు. ఇష్టం లేని ఆహారమన్నమాట. ఆహారమే గాని సయించదు 'Truth is the daughter of time' అని మరో సామెత.

ఎదుటివారికి ఇష్టం ఉండదన్నంత మాత్రాన నిజం చెప్పకూడదా? ఏమంటున్నాడు వేమన, ఏమంటున్నాడంటే నిజం చెప్పేముందు సమయ సందర్భాలు చూసుకో! నీ సత్యసంధతకు సరైన ఫలితం వచ్చేచోట నిజం చెప్పు. ఉదాత్తులు నిన్ను అర్థం చేసుకుంటారు. అర్థం చేసుకోవడమే కాదు. దానిని ఎప్పుడు, ఎలా, ఎవరిపైన ప్రయోగించాలో నిజమహాత్ములు నిర్దేశిస్తారు అని వేమన్న భావన. 'నిజము ఆప్తులను *గూడి నిజమాడవలయురా*' (డి.1725, 840) అనేది పాఠాంతరం.

**నిన్ను చూచుచుండ నిండును తత్వంబు**
**తన్ను చూచుచుండ తగులు మాయ**
**నిన్ను ఎరిగినపుడె తన్ను తానెరుగును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఓ పరమాత్మా! అతడు నిన్ను దర్శించగలిగితే అతని తత్వం పరిపూర్ణమౌతుంది. తన దేహమే నిజమనుకొని భ్రాంతి, అహంకారాలకు లోనయితే అంతే! మాయకు దొరికిపోతాడు. కాబట్టి నిన్ను తెలుసుకోవటమే తన్ను తెలుసుకోవటానికి దారి తీస్తుందని అతనికి తెలియాలి.

నిన్ను, తన్ను, తత్వం, మాయలాంటి చిన్నమాటలతో ఈ పద్యం ఎంత సరళంగా వుందో అనిపిస్తుంది. అట్లా అనిపిస్తే అది వేమన గొప్పతనమే. కాని ఈ పద్యంలో వేదాంతసారమంతా నిక్షిప్తమై వుంది. పరమాత్మ జ్ఞానం లభిస్తే అతనికి తన నిజస్వరూపమైన ఆత్మ అంటే ఏమిటో తెలుస్తుంది. అప్పుడే భ్రాంతి, అహంకారం లాంటివి నశిస్తాయి. అదే తత్వమంటే! తత్+త్వం+అసి=తత్=బ్రహ్మమే, త్వం=నీవు, అసి-అయివున్నావు. అంటే జ్ఞానరూపమైన ఆత్మయే నువ్వు అని అర్థం.

మాయ అంటే ఏమిటి? ఈ మాయ అనే మాట కూడా పెద్దమాయ. సందర్భాన్ని బట్టే అర్థం. ఒకే రూపంలో ఉన్న ఆత్మను బహురూపాలు కలదిగా బావించడమే మాయ. అంతేకాదు దేని ద్వారా వస్తువులు కొలువబడతాయో అది మాయ. పరస్పర విరుద్ధ ధర్మాలతో తోచేది మాయ.

ఆత్మ తత్వాన్ని తెలుసుకోవటమే బ్రహ్మం. అది నీలోనే కనిపిస్తుంది. అది పూర్తిగా నీ అనుభవంలోకి వస్తే అదే మోక్షస్థితి అని వేమన్న ఉవాచ.

*నిన్ను చూచుచుండ తన్ను తానెరుగడు* (డి.1723, 916); *తన్ను జూచునంత తనదు మాయ / నిన్నెరిగినవాడు నిత్యముక్తుండురా* (డి.1725, 185) అనేవి పాఠాంతరాలు.

**నీటిలోని వ్రాత నిలువకయున్నట్లు**
**పాటిజగతి లేదు పరము లేదు**
**మాటమాటకెల్ల మనసు గోరుచునుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏం మనసు ఇది! ఏమాటపైనా నిలబడదు. మాటి మాటికి మాటలు మారుస్తుంది. నీటిపైన రాసే రాతలాగ స్థిరంగా ఉండదు. కనిపించే జగత్తును ప్రమాణంగా తీసుకోదు. అలాగని పరలోకాన్ని గురించీ ఆలోచించదు. ఏ విషయాన్నీ దృఢపరుచుకోదు. కర్మబంధాలను పెంచుకొని అహంకారంతో బాధపడుతుంది. మూర్ఖత్వమంటే ఇదే అని జాలిపడుతున్నాడు వేమన.

నీటిలో రాసే రాత రాసినంతసేపు కూడా ఉండదు. అస్థిరం. దానివల్ల ప్రయోజనం లేదు. వ్రాత అంటే లిపి, చేతులతో రాసేది. పాటి అంటే దృష్టాంతం. "పదుగురాడుమాట పాటియై ధరజెల్లు" అన్నాడు వేమన్నే మరోచోట. పరము అంటే ఇహపరాల్లోని పరము. 'మాటమాటకెల్ల మనసుగోరుచునుండు' అంటే ఒక్క మాటపై నిలబడదని, అబద్ధం ఆడుతుందని. అబద్ధం నిబద్ధానికి వ్యతిరేకపదం. రిక్తవచనాలతో డొల్లగా మిగుల్తుందని సారాంశం. "నీటిలోని వ్రాలు నిర్నామమైనట్లు (డి. 1723–753), మాట మాటకెల్ల తేటపడును తానె (డి. 1735–753) అనేవి పాఠాంతరాలు.

**నీరు కారమాయె కారంబు నీరాయె**
**కారమైన నీరు కారమాయె**
**కారమందు నీరు కడు రమ్యమైయుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆయుర్వేదంలోని సూరేకారాన్ని శుద్ధి చేసే ప్రక్రియ ఆధారంగా జీవాత్మ, పరమాత్మల సంబంధాన్ని చెప్పే అద్భుతమైన పద్యమిది.

వేడి చెయ్యకుండానే సూరేకారం నీటిలో కరుగుతుంది. అప్పుడు నీటికి క్షారగుణం క్షారానికి నీటిగుణం అబ్బుతాయి. వేడి చేస్తే నీరు పైకి తేలి స్ఫటికాలు అడుగున పేరుకొని శుద్ధి అవుతాయి. క్షారం పైన తేలిన తేటనీరు ఎంతో అందంగా వుంటుంది అంటున్నాడు వేమన. శుద్ధి అంటే మలినాలను తొలగించడం.

జీవాత్మ పరమాత్మలో లీనమైతే అది పరమాత్మగా మారుతుంది. పరమాత్మ తత్వం జీవాత్మలో కలిస్తే అది పరమాత్మే. జీవాత్మలో ప్రకాశించే పరమాత్మ పరమ రమ్యంగా ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు సుదీర్ఘమైన సాధనా, సంసిద్ధతా కావాలి. ఒక రసాయనిక క్రియను పోలికగా తీసుకొని వేమన గొప్ప ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరించాడు ఈ పద్యంలో.

సూరేకారాన్ని సురాక్షారం అంటారు సంస్కృతంలో. ఇంగ్లీషులో సాల్ట్‌పిట్రే. వాడుకభాషలో పెట్లుప్పు. ఆధునిక రసాయనికశాస్త్ర పరిభాషలో సోడియం నైట్రేట్. సూరేకారాన్ని తుపాకిమందులోనూ, మాంసం నిలువ ఉంచడానికీ, ఔషధాల్లో ఉపయోగిస్తారు. పెట్లుప్పుద్రావకాన్ని నైట్రస్ యాసిడ్ అంటారు. కారం అంటే ఉప్పే. ఇది క్షారాల్లో ఒకటి – పర్ర ఉప్పు, చవిటి ఉప్పు, రాతి ఉప్పు అని అనేక రకాలు. కారం అంటే మిర్చికారమని కాదు. లవణం. దీని రుచి కటువు. షడ్రుచుల్లో ఇదొకటి. నూలును తడిపే ఒకానొక ద్రవ్య విశేషం ఇదే. బిడ్డలకు పోసే మందులో కూడా దీన్ని వాడతారు.

"*అంబరమున పుట్టినట్టి మలపంకము కారములోన నద్దగా, విరిసినయట్లు; పసిందహతహ పెట్ట మసలెడి కార్చిచ్చు కారంపు మందుగా నారగించి*' అనేవి ప్రయోగాలు. '*నీటిలోన నుండు నిఖిల బ్రహ్మాండముల్*' (డి.1723–958) అనేది పాఠాంతరం.

**నీళ్లమీద బుగ్గ నిలిచినయప్పుడు**
**తళ్లు వేగవచ్చి తాకుగాక**
**విడెడు కుండ కింత విభ్రాంతి పడుదురు!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీటిపైన బుడగ తేలి నీటుగా మెరుస్తుంది. ఆ మెరుపు శాశ్వతమనుకుంటుంది. కాని వేగంగా వచ్చిన అలల తాకిడికి పగిలిపోతుంది. మానవ శరీరమూ అంతే, అది కుండలాంటిది. ఎప్పుడు విచ్చుకపోతుందో తెలియదు. దానికోసం భ్రమ ఏల? ఆతురత ఏల? అని వేమన్న ప్రశ్న.

జీవితం క్షణభంగురం అది తెలియక దానిపట్ల మమకారం పెంచుకుంటూ పోవడం కాలాన్ని వ్యర్థపుచ్చడమే అవుతుంది. అది భ్రాంతి. భ్రాంతివల్ల మాయ ఏర్పడుతుంది. మాయ అడ్డుగా ఉన్నప్పుడు ఆత్మయోగం సిద్ధించదు. మోక్షమంటే మరేదోకాదు దేహంపై ఆశను వదులుకోవడమే అని వేమన చెప్పదలిచిన అంతరార్థం.

బుగ్గ అంటే చిమ్నీ, విద్యుత్ బల్బు, గాలినింపిన బుడగ అని అర్థాలున్నాయి. నీటి ఊట పుట్టే చోటును కూడ బుగ్గ అంటారు. కాశిబుగ్గ అట్లాంటిదే. కాని ఇక్కడ బుగ్గ అంటే నీటిబుడగ. సంస్కృతంలో బుద్బుదం అంటారు. జీవితం బుద్బుదప్రాయం అనేదందుకే. తడ అంటే అల. తడ–తడలు–తళ్లు అంటే అలలు. నిజానికి తడ అంటే అడ్డుకునేది, ఆటంకం కలిగించేది, నిరోధించేది అని అర్థం. అల అంతే కదా! అల నీటిబుడగ కోసమే రాలేదు. అలా వెళ్తుంటే బుడగ చిక్కింది. ఆ మాత్రానికే బుడగ చిట్లిపోయింది. అంత యాదృచ్ఛికం జీవితం కూడా అని తాత్పర్యం.

విడెడుకుండ – విడెడు అంటే విచ్చుట, వీడిపోవుట అని కూడా. పగిలిన కుండ వీడిపోయినట్టే కదా! ఇక్కడ కుండ ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే వేదాంతులు దేహాన్ని ఘటంతో పోలుస్తారు. ఘటవిసర్జన చేశాడు? అంటే శరీరాన్ని వదిలేశాడని. అంటే మరణించాడని. విభ్రాంతి అంటే తొట్రుపాటు.

ఏదీ శాశ్వతమనుకోకుండా ఉన్న సమయంలోనే మనిషి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ జ్ఞానిగా మెలగాలని వేమన్న ప్రబోధం.

'ధారవేగవచ్చి తాకుగాక (డి. 1721–73) అనేది పాఠాంతరం.

**నీళ్ల మునుగనేల నిధుల మెట్టగనేల**
**మొనసి వేల్పులకును మ్రొక్క నేల**
**కపట కల్మషములు కడుపులో నుండగా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనసులో మోసం, మురికీ పెట్టుకొని తీర్థయాత్రలకు వెళ్లి పవిత్రస్నానాలు ఆచరిస్తే ఏం లాభం? దేవాలయాల మెట్లు ఎక్కిదిగితే ఏం లాభం? అదేపనిగా దేవుండ్లకు మొక్కితే ఏం లాభం? ముందు మనస్సును నిర్మలంగా ఉంచుకో అప్పుడే మిగతాపనులు సార్థకతను పొందుతాయి అని వేమన్న ప్రబోధం.

తీర్థస్థలాల్లో కొలనుల్లో, నదుల్లో స్నానం చేస్తావా? చెయ్యి. పై మురికే పోతుంది. మరి లోపలి కల్మషం సంగతి? నిధులు అంటే ఇక్కడ దేవాలయాలు. సన్నిధి, పెన్నిధి అనే మాటలను కూడా దేవాలయాలకు వాడుతారు. ఎందుకు? ఎందుకంటే ధనాధిపతి అయిన కుభేరుడికి నవనిధులు అంటే తొమ్మిది నిధులు ఉంటాయి. పద్మ, మహాపద్మ, శంఖ, మకర, కచ్ఛప, ముకుంద, నంద, నీల, ఖర్వ అంటారు ఆ నిధుల ప్రతినిధులు. వీరిలో పద్ముడు, శంఖుడు అనేవారి విగ్రహాలు గుడి గడపకు ముందు భాగాన కుడిఎడమల్లో చెక్కి వుంటాయి. ఇవి పొట్టి విగ్రహాలు. నిధులను సందర్శిస్తే దేవుడు నిధులను ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. *'నిధి చాల సుఖమా?'* అన్నాడు త్యాగయ్య. నిధి అంటే కోశాగారం, బొక్కసం, పాతర అనే అర్థాలున్నాయి గాని పౌరాణికార్థాన్నే వేమన్న ఇక్కడ ఉద్దేశించాడు. ఇక మొనసి అంటే అదేపనిగా, మాటిమాటికి అని అర్థం. వేమన ఈ మాటను తరచుగా వాడుతాడు. వేల్పు అంటే దేవుడు. ఇక్కడ ఇలవేల్పు అని. ఇల అంటే భూమి. ఇల ఇల్లుగా మారి ఇంటివేల్పు అయ్యాడు. ఇలురేడు అంటే ఇంటి యజమాని కూడా.

కపటం, కల్మషం కడుపులో ఉన్నాయంటున్నాడు వేమన. తెలుగులో కడుపు అనేమాట నుడికారాల పుట్ట. కడుపు అంటే గర్భం, కడుపు కాలింది అంటే సంతానాన్ని కోల్పోవటం, వాడికి కడుపుబ్బరం అంటే అసూయ అని. వాడి కడుపులోని మాట అంటే మనసులోని మాట అని.

మనసులో పాపచింతన కలవాడు పైకి ఎన్ని పుణ్యకార్యాలు చేసినా వాటివల్ల ప్రయోజనం కలగదు అంటున్నాడు వేమన.

**నీళ్లలోన మొసలి నిగిడి ఏనుగుబట్టు**
**బైట కుక్కచేత భంగపడును**
**స్థానబలిమిగాని తన బలిమి కాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీరే నివాసమైన మొసలి ఒడ్డున ఉన్న ఏనుగును సైతం అవలీలగా పట్టుకుంటుంది. అదే నీటి బయట అంటే నేలమీదికి వచ్చిందా కుక్కకు కూడా లోకువౌతుంది. ఆ బలంగాని ఈ బలహీనతగాని స్థానం వల్ల వచ్చినవే గాని తన సొంతంకాదని వేమన్న ఉవాచ.

నిగిడి అంటే నిగిడించి; సాగదీసి పెరిగి, చెలరేగి, వ్యాపించి అనేవి అర్థాలు. భంగపడటం అంటే అవమానపడటం. తలవంపు, పరాభవం, ఆటంకం, అంతరాయం, చుక్కెదురు ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. భంగం మరో అర్థం అల, కెరటం. భంగపాటు అంటే సముద్రంలో అలవిరిగిపడ్డట్టుగా అని అర్థం.

వేమన ప్రధానంగా స్థానబలిమినే ఉద్దేశించినప్పటికీ దీనిలో తన బలిమికూడా కొంత అంతర్గతంగా వుంటుంది. ఒక చోట నేర్పరి అయినవాడు మరోచోట ఎందుకూ కొరగాకపోవచ్చు. మనరంగంలో మన ప్రావీణ్యం ఉన్నంతమాత్రాన ప్రవేశంలేని పనుల్లో తలదూరిస్తే రాణించడం కష్టం. ఈ పద్యానికి పాఠాంతరం కూడా వుంది.

*నీళ్లలోన మొసలి నిగిడి తిన్నగ పాకు*
*బైట మూరడైన పాకలేదు*
*నెలవు దప్పుచోట నేర్పరి కొరగాడు;*

ఈ పాఠం కూడా పరవాలేదు కాని మొదటి పద్యం మరింత అర్థసమృద్ధంగా వుంది.

**నీళ్లలోని చేప నెరిమాంసమాశకు**
**గాలమందు చిక్కి కూలినట్లు**
**ఆశబుట్టి మనుజుడారీతి చెడిపోవు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చేప మాంసం మీది ఆశతో గాలానికి చిక్కి నశిస్తుంది. దేహం మీది వ్యామోహం వల్ల మనుష్యుడూ అంతే.

నెరి అంటే అందం అనే అర్థం వుంది గాని ఇక్కడ ఉత్సాహం, పరాక్రమం, సాహసం అనే అర్థాలు సరిపోతాయి. *"నెరి నురక వైరి వీరులు"* అని, *"పల్కునతని తాల్మికి మనమున నెరివిరిగి"* అని ప్రయోగాలు. ఆశకుడు అంటే తినేవాడు, భోగించేవాడు అని అర్థాలు. 'నెరిమాంసమాశ' అంటే చేపలు పట్టేవాడి 'ఎర'ను అసలు మాంసంగా ఆశ పెట్టడం అన్నమాట. *"ఆశలేని కూటికి ఆకలి లేదు"* అని సామెత. నిజానికి ఆకలి వుంటేనే ఆశకు ఆస్కారం కలుగుతుంది.

మనిషి కూడా అంతే! ఆశ అంటే కోరిక కదా! విషయాసక్తి అన్నమాట. కాంతపైనా, కనకంపైనా, పదవిపైనా, కీర్తిపైనా కాంక్షాబద్ధులైనవారు దుఃఖాలపాలవుతారు అంటున్నాడు. ఇక్కడ ఆశ అంటే దురాశ. దురాశ దుఃఖం చేటు అని మనవారు ఊరకనే అనలేదు.

*నీళ్లలోని మీను;*
*ఆశ తగిలి నరుడు ఆలాగు చెడిపోవు (డి.1723, 449);*
*...... నిమిషంబు నాశకు (డి.1769, 682)*
*అంటే క్షణకాల ప్రలోభం కోసమని;*

అయితే ఈ తేడాలు ఓ లెక్కలోనివి కాదు.

**నీళ్లు బోసి కడిగి నిత్యంబు శోధించి**
**కూడు బెట్టి మీద కోకగట్టి**
**ఏమి పాట్లు పడదురీ దేహమునకిల!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అశాశ్వతమైన ఈ శరీరం పైన ఏమి వ్యామోహం! నీళ్లతో కడుక్కుంటారు, ప్రతిరోజూ స్నానంతో శుభ్రపరచుకుంటారు, దీనికి రుచికరమైన తిండి తినిపిస్తారు, అందమైన వస్త్రధారణ చేసుకుంటారు. ఎన్ని కష్టాలో! పరమార్థాన్ని మరిచి ఇహమే ప్రధానమనుకుంటారు. ఎంత అజ్ఞానం! అని జాలి పడుతున్నాడు వేమన.

తన తనువే సర్వస్వమనుకునేవాడిలో తత్త్వం తనువును దాటదు. ఇంద్రియ సౌఖ్యమే సత్యమనే భ్రాంతిలో ఉంటాడు. మోహపాశానికి బద్ధుడైపోతాడు, ముక్తివైపు మనసే పోదు. అటువంటివాడికి కొంత వైరాగ్యశోభ కూడా ఉండాలని వేమన్న ఉవాచ.

శోధించడమంటే శుద్ధి చెయ్యడం, ఇక్కడ వెతకడమని కాదు. కోక అంటే స్త్రీపరంగా చీర. పురుషపరంగా ధోతి. ఇక్కడ కోక అంటే ఉభయ సామాన్య వస్త్రం. "కులటలగూడదు తొలగనీయదు పైట మీగాళ్లపై గోక మెలగనీదు" అని ప్రయోగం. "అపుడు గురుభామ చిత్రాంగి యలమి బలిమి, నొడిసి పట్టిన బైకోక విడిచి చనియె" అని మరో ప్రయోగం.

దేహం సరే, దేహయాత్ర అంటే బతుకుతెరువు. మరణమని కూడా. దేహశుద్ధి అంటే పద్యంలోని 'శోధించి' అనే అర్థం కాదు. చితగ్గొట్టడం. ఇల అంటే ఈ లోకం.

దేహం మీది తీపితో, దుర్దశ వచ్చినా బతకాలనే ఆశతో పరచింతనను నిర్లక్ష్యం చేయవద్దని వేమన్న సారాంశం.

**నీవు కలుగుచోటు నెలవు తెలియువాడు**
**వసుధయందు త్రోవ వదలదెపుడు**
**కాలు కదలనీక గ్రక్కున జేరునో**
**విశ్వదాభిరామ వినరువేమ.**

లోకంలో నువ్వెక్కడుంటావో ఆ ప్రదేశం అతనికి తెలుసు. తెలియటమే కాదు అక్కడిదాక తనదైన ఒక దారిని ఏర్పరచుకుంటాడు. అతడు ఆ దారిన తప్ప మరో భౌతికమైన మార్గంలో వెళ్లడు, తనదారిని వదలడు. అందుకే కాలు కదలకుండా ఒకచోట కూచొని తన గమ్యానికి వెంటనే చేరుకోగలడు. అది అతని ప్రత్యేకత.

నీ కోసం అడవులు, కొండలూ గాలించనక్కరలేదు, నదులను దాటనక్కర లేదు. గురువులకోసం నిరీక్షించనక్కరలేదు. అతనిలోనే ఒక తత్వముంది. పోనీ ఆత్మ అందాం. నీలో లీనమైన ఆ ఆత్మకు అన్నీ తెలుస్తాయి. ఉదాహరణకు ఒక మట్టి ముద్ద గురించి తెలిస్తే మట్టి పదార్థాలన్నింటి గురించి తెలుస్తుంది. కాని మట్టితనం గురించి తెలియటమే సత్యం. అది పైకి కనిపించదు. పోనీ ఓ పండును పగులగొట్టి చూస్తే చిన్న చిన్న గింజలుంటాయి. వాటిని పగులగొట్టి చూస్తే ఏమీ ఉండదు. ఉండదా? ఉంటుంది గాని అతనికి కనిపించదు. కనిపించని దాని కోసం కనిపించే దారులుండవు. లోపలి మార్గమే వుంటుంది. తత్వాన్వేషి ఆ దారినే నమ్ముకుంటాడు, దానిని వదలడు అంటున్నాడు వేమన. అట్లా వదలని వాడు తాను అనుకున్న మరుక్షణంలోనే నిన్ను చేరుకుంటాడు అని సారాంశం.

కలుగు అంటే ఉండటం. దీనికి ఛాయ పుట్టడం. పిల్లలు కలగటం అంటే పిల్లలు పుట్టడం. నెలవు అంటే చోటు. పరిచయమైన ప్రదేశాన్ని, అలవాటయిన చోటును నెలవు అంటారు. ఇక్కడ ఇది తెలిసినచోటు కాదు. కొత్తది. అతనిలోనే ఉంది, బయటలేదు. వసుధ అంటే భూమి, భూభాగం. వసు అంటే ధనం, రత్నం, కిరణం, జలం అని అర్థాలు. 'కాలు కదలకుండ' అంటే స్థిరంగా అని. గ్రక్కున అంటే మరుక్షణంలో అని.

**నేరనన్నవాడు నెరజాణ మహిలోన**
**నేర్తునన్నవాడు వార్తకాడు**
**ఊరకున్నవాడె ఉత్తమోత్తముడెందు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో మూడురకాల వ్యక్తులంటారు. ఒకడు తనకే పని చెప్పినా తెలియదని తప్పించుకుంటాడు. వాడు ఉపాయశాలి. రెండోవాడు ప్రతిదీ తనకే తెలుసంటాడు. వీడు మాటకారి. మూడవవాడు మౌనంగా పనులు చేసుకపోతాడు. మూడోవానిని ఉత్తముడని మెచ్చుకుంటున్నాడు వేమన.

'నేరను' అంటే నాకు తెలియదు అని. 'రానేరను' అంటే రాలేదు అని. 'చూడనేర్తునే' అంటే చూడగలనా, చూసి తట్టుకోగలనా అని. 'నేరక చేశాను' అంటే తెలియక చేశాను అని. నేరమి అంటే అజ్ఞానం. ఇక నెరజాణ. నెర అంటే గొప్ప. జాణ అంటే తెలివైనది, నేర్పరి, సమర్థురాలు, రసికురాలు అనే మంచి అర్థాలతోపాటు వగలాడి, జిత్తులమారి, మాయలాడి అనే అర్థాలు కూడా వున్నాయి. వార్త అంటే మాట, సంభాషణ అని అర్థాలు. వార్తకాడు అంటే మాటకారి, వాగుడుకాయ.

'తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ' అన్నాడు శతకకవి. ఈ పద్యంలోని మొదటివాడు అలాంటివాడు. వీడి తెలివి పని చెయ్యటంలోకన్నా తప్పించుకోవటంలో వుంది. రెండవవాడు అది చేస్తాను ఇది చేస్తాను అని కోతలు కోస్తాడు. వీడి మాటలు కోటలు దాటుతాయి గాని, కాళ్లు తంగెళ్లు దాటవు. ఇక మూడోవాడికి మాటలపై నమ్మకం లేదు. మౌనంగా పనులు చేసుకపోతాడు, నిజమైన క్రియాశీలి ఇతడు.

వేమన్న అపారమైన లోకానుభవాన్ని తెలియజేస్తుందీ పద్యం.

**నోటి పుప్పికెల్ల నొప్పి లేకుండగా**
**ఆకు పోక సున్నమౌషధంబు**
**పెట్టకుండె నేని పెనురోత వేయురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

నోటిలోని పన్ను పురుగుపట్టి పుచ్చిపోయిందా? నొప్పి ఎక్కువయ్యిందా? మరేం పరవాలేదు. తాంబూలం వేసుకో. అదే సరైనమందు. అలా కానట్టయితే అసహ్యంగా తయారై మరింత ఇబ్బందికి దారితీస్తుంది అంటున్నాడు వేమన.

అనవసరమైన జర్దాలాంటి పదార్థాలు కలిసి తాంబూలం ఇప్పుడు వ్యసనమయ్యింది గాని ఒకప్పుడు ఆరోగ్యానికి పనికొచ్చేదే. అంతెందుకు? తమలపాకుతో కట్టిన విడెం నోటి అనారోగ్యాన్ని సరిచేస్తుందని దాని ఔషధగుణాన్ని చెప్తున్నాడు వేమన. తాంబూలంలో ఏయే పదార్థాలు వాడుతారు? ఒకటి ఆకు. అంటే తమలపాకు. నాగవల్లి అనే తీగకు ఇవి వేస్తాయి. పాశ్చాత్యుడైన బ్రౌన్‌కు ఇది ఎలా కనపడిందంటే "The fragrant spicy leaf eaten by the Hindus" అన్నాడు. హిందువులే ఏమిటి ముసల్‌మానులు కూడా తింటారు. బ్రౌన్ దృష్టికి వచ్చినట్టులేదు. పోక అంటే వక్క, గింజ విశేషం. పోకంత అన్నం అంటే కొంచెమని అర్థం. ఇక సున్నం, సున్నం సున్నమే. సుధ. "సౌధ సుధాప్రభా ధవళిత" అన్నాడు అల్లసాని పెద్దన. మరి ఆరోజుల్లో తాంబూలం లోకి ఏం సున్నం వాడేవారో? గవ్వసున్నం అంటే గోడలకు వేసేది. ప్రవాళభస్మం కూడా సున్నమే. పగడాన్ని భస్మం చేస్తే ఏర్పడేది. విడెంలోవాడే ఈ మూడు పదార్థాలకూ ఔషధ గుణముంది కాబట్టి పంటివ్యాధులకు తాంబూలం బాగా పని చేస్తుందంటున్నాడు వేమన.

పుప్పి అంటే పుప్పిపురుగు. నుసి పురుగు అని కూడా అంటారు. కట్టెను తొలిచి నుసి రాల్చే పురుగు అన్నమాట. ఈ పురుగు వల్ల పళ్లు పుచ్చిపోయి చెడిపోతాయి. నొప్పి – పంటినొప్పి ఎంత దుర్భరమో అందరికీ తెలిసిందే. నోటి బాధకు ఏవో పిచ్చిమందులు వాడి ప్రాణం మీదికి తెచ్చుకోవద్దు. మన సంప్రదాయంలో తాంబూలముంది కదా! అదే మంచి దేశీయవైద్యం అని వేమన్న సూచన.

తాంబూలాన్ని ఆరోగ్యానికే కాక రసికతకు కూడా చిహ్నంగా భావించేవారు. మంచి కవిత్వ రచనకు "కప్పుర విడెం" కూడా కావాలన్నాడు పెద్దన. (విడెమే సంస్కృతంలో వీటీ, వీటిక). సుమతికారుడు తాంబూలానికి ఎంత పెద్ద స్థానాన్నిచ్చాడో చూడండి.

*"తమలము వేయని నోరును
రమణుల చనుమొనల మీద రాయని మేనున్
కమలములు లేని కొలకును
హిమధాముడు లేని రాత్రి హీనము సుమతీ!"*

*ఏవో నీతి పద్యాలు చెప్పాడనుకున్నాం గానీ సుమతికారుడు కూడా రసికుడే.*

తాంబూలానికి శుభకార్యాల్లో ఉన్న ప్రమేయం కూడా ముఖ్యమైందే. తాంబూలాలిచ్చారు అంటే పెళ్లికి నిశ్చితార్థం చేసుకున్నారని. 'తాంబూలాలిచ్చాను తన్నుకు చావండి' అన్నాడు అగ్నిహోత్రావధాన్లు కన్యాశుల్కంలో. "పిదప లేకయున్న పెనురోత వేయురా (డి. 1726–144)" అనేది పాఠాంతరం.

**పంది పిల్లలీను పదియు నైదింటిని**
**కుంజరంబు యీను కొదమనొకటి**
**ఉత్తమ పురుషుండు ఒక్కడు చాలడా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ప్రభుత్వ కుటుంబ సంక్షేమశాఖ వారికి ఈ పద్యం పైన ఎందుకు దృష్టిపడలేదో! పడితే ఊరుకునేవారా? కొన్ని సార్వకాలిక సత్యాలను వర్తమాన పరిస్థితులకు ఉపయోగించుకోవడంలో తప్పులేదు.

ఈ పద్యంలో వేమన్న ఏమంటున్నాడు? పంది ఐదు, పది పిల్లలనైనా పెట్టగలదు. కాని ఏనుగు ఒక్కటే. ఒక్కటైనంత మాత్రాన కొదవేమిటి? బలమైన సంతానాన్నే కన్నది. సంఖ్య కాదు, రాణింపు ముఖ్యం. తెలివిహీనుల మంద కంటే ఉత్తముడైనవాడు ఒక్కడైనా అతడు బహుసంతానంతో సమానం అంటున్నాడు వేమన. అంతేకాదు అట్లాంటి పుత్రున్నికన్న తల్లిదండ్రులు ధన్యులు.

పంది అంటే అడవిపంది, ముండ్లపంది ఊరపంది అని ఉంటాయి. ఇక్కడ వేమన రోజూ కనపడే ఊరపందినే ఉద్దేశించాడనుకోవాలి. ఈనుట–కనడం వేరు, ఈనడం వేరు. జంతువులు పిల్లలు పెట్టడాన్నే ఈనడం అంటారు. నుడికారంగా కూడా దీనిని వాడతారు. *"నేల యీనిన చందమున"* అని జనసమ్మర్థాన్ని వర్ణిస్తారు. పంటకోతకు సిద్ధమైనప్పుడు కూడా ఈనింది అంటారు. ఏనుగుతో పోలిస్తే పంది ప్రశస్థమైన జంతువేం కాదు. పైగా అది మురికిలో మసలడంవల్ల చులకనకు గురవుతుంది. *'పందికేమి తెలుసు పన్నీటి వాసన'* అనే సామెత ఇందుకే వచ్చి వుంటుంది. ఏనుగంటే ఏమిటి? నాలుగు కాళ్లు, దళసరి చర్మం, పొడవైన తొండం, వక్రదంతాలు గల పెద్ద జంతువు అని చెప్పాల్సిన కాలం ఇంకా రాలేదు. అడవుల్లో క్రమంగా జంతు సంతతి తగ్గిపోతున్న దశలో ఉన్నాం. అయితే మన పిల్లలు వీటిని కామిక్స్‌లో చూస్తున్నారు కాబట్టి కొంత ఊరట. ఏనుగు పెద్ద జంతువు. *"ఏనుగు పడుకొన్నా గుఱ్రమంత ఎత్తు'* అని సామెత.

కొదమ అంటే బలమైన, దృఢమైన పిల్ల జంతువు. కొదమసింగం అంటారు.

'నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు' అని వేమనే అన్నట్టు ఇక్కడ కూడా అదే అన్వయం. *'ఉత్తముడగు పుత్రుడొక్కడు చాలడా'* (డి.1735–41) అనేది పాఠాంతరం.

**పగలు రేయి మరచి భావంబును మరచి**
**తాను నేననియెడి తలపు మరచి**
**ఉండువాని నెంచు ఉత్తమయోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎవరయ్యా ఉత్తమయోగి? సర్వదా ధ్యాననిష్ఠుడై ఉండేవాడు యోగి. అంతేకాదు అతడు జ్ఞానామృతంలో మునిగి ఉన్నప్పుడు పగలూ రాత్రి అనే తేడాను మరిచిపోతాడు. నేను వేరు, దైవం వేరు అనే ఆలోచనలుండవు. అటువంటి నిర్వికార మౌనస్థితికి చేరినవాడే ఉత్తమయోగి, యోగీశ్వరుడు అంటున్నాడు వేమనయోగి.

కేవలం యోగం అభ్యసించే వాడు మాత్రమే కాదు యోగి. అతడు ఆధ్యాత్మిక అనుభూతిలో ఉన్నతస్థితి నందుకొని మాయకు అతీతంగా ఉంటాడు. కాలానికి అతీతంగా వర్తిస్తాడు. సుఖదుఃఖాలు, వెలుగునీడలు లాంటి ద్వంద్వాలు అతనికి భేదహేతువుగా వుండవు. ఇది కేవలం నేర్చుకున్న యోగం కాదు.

"పుట్టుయోగులము కాము భువికరిదాసులము, నట్టనడిమి దొరలు నాకీయవలెనా" అని అన్నమాచార్యుల కీర్తన. సర్వసంగ పరిత్యాగులకు ఒకరిచ్చే దేమిటి? రాజుల అహంకారాన్ని ప్రశ్నిస్తున్నాడు అన్నమయ్య. శివయోగులకు కూడ ఇట్లాంటి లక్షణాలు చెప్తారు.

"…. *భావంబులోపల*" (డి.1736, 211) అనేది పాఠాంతరం.

**పచ్చేజూచువారు పచ్చేమెచ్చెడు వారు**
**పచ్చే మీద వాంఛ పడినవారు**
**పచ్చే విడుచు వాని ప్రభువుగా జూతురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ధనం వైపు దృష్టి సారించే వాళ్లు, ధనాన్ని గొప్పగా భావించే వాళ్లు, ధనం పట్ల కోరిక పెంచుకునేవాళ్లు అలా తేలిపోతుంటారు గాని ధనాన్ని తృణప్రాయంగా తలచి త్యజించినవాడిని గురువుగా తత్త్వాధినేతగా భావించి పూజిస్తారు అంటున్నాడు వేమన.

సంపదపట్ల క్రమక్రమ వ్యామోహాన్ని పెంచుకునే వారికన్న బంగారాన్నీ మట్టినీ ఒకేలాగ చూసే నిర్మోహి ఎంతో గొప్పవాడు అని సారాంశం.

పచ్చే అంటే సామాన్యార్థంలో ఆకుపచ్చ. పసుపుపచ్చే రంగులని అర్థం. కాని ధనసంబంధమైన అర్థం కూడా వుంది. పచ్చే అంటే గరుడ పచ్చ అంటే మరకతమణి. పచ్చ అంటే బంగారం కూడా.

వాంఛ అంటే ఇచ్ఛ, కోరిక, అపేక్ష, మనోరథం అని అర్థాలు. "ద్వీపమేలెడు వాడు తేజస్వియై మహీవలయ మెల్లను నేల వాంఛచేయు" అని ప్రయోగం. ఈ వాంఛక్రమంగా పెరిగేదే కాని తరిగేది కాదు. కాని ధనాకాంక్ష లేని వాడి ముందు అది విరిగిపోవలిసిందే.

**పచ్చవిల్తుచేత గ్రచ్చర జనులెల్ల**
**తచ్చనాడబడిరి ధరణిలోన**
**కులజుడెవ్వడిందు కులహీనుడెవ్వడు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

జనులు మన్మథుని పూలబాణాలకు గురౌతూ కామమోహితులై లోకంలో పరిహాసాల పాలవుతున్నారు. ఇట్లాంటి వారిలో పెద్దకులంవాడు చిన్న కులంవాడు అనే తేడా ఉండదు. ఇద్దరూ గుణహీనులే అంటున్నాడు వేమన.

పచ్చనివిల్తుడు అంటే పచ్చని విల్లుగలవాడు. అంటే చెరుకుగడను విల్లుగా ధరించినవాడు. అంటే మన్మథుడు. మన్మథుడు ప్రేమ దేవుడు. రోమనులకు, గ్రీకులకు కూడా ప్రణయ దేవతలున్నారు. క్యూపిడ్, ఈరోస్‌లని. రెక్కలున్న బాలుని రూపంలో కామార్తులపైన బాణాలు వేస్తుంటారు. మన మన్మథునిది చెరుకువిల్లు. దానికి తుమ్మెదల బారు అల్లెతాడుగా వుంటుంది. అతడు చిలుక రథం మీద బయల్దేరి పూలబాణాలు వేస్తూ కాముకులను రాచిరంపాన పెడుతుంటాడు. వసంతుడు అతని మిత్రుడు రతీదేవి భార్య. అతని ఐదు బాణాలు సువాసన కలిగిన పువ్వులే. అవి 1.అరవిందం అంటే తామరపువ్వు, 2.అశోకం అంటే పొగడపువ్వు ఇప్పపూల ఆకృతిలో ఉండే తెల్లని పువ్వు. భలే పరిమళం! 3.చూతం అంటే మామిడిపూత 4.నవమల్లిక అంటే విరజాజి. 5.నీలోత్పలం అంటే నల్లకలువ. మన్మథుడు బహు ప్రమాదకారి. ఇంత అందమైన సంబారమున్నవాడు ప్రేమ భావం కలిగించక మానుతాడా? అతని ధనుస్సు చెరుకుగడ తియ్యనిది. బాణాలు, పువ్వులు పరిమళ భరితాలు. ఇలాంటి మన్మథుని కన్నుపడితే రక్తమాంసాలతో కూడిన పంచ భూతాత్మకుడైన ఈ మానవ ప్రాణి కామభావానికి లోనుగాక చస్తాడా!

గ్రచ్చర అంటే వెంటనే, శీఘ్రముగా అని. ఆలస్యమనే ముచ్చటేలేదు. అట్లా కామ విమోహితులై సమాజంలో చిన్నచూపునకూ, వేళాకోళానికీ గురవుతున్నారు అంటున్నాడు వేమన. తచ్చనాడబడిరి అంటే గేలిచేయబడుతున్నారని. అదేమిటి? ప్రేమ, కామం మంచివి కావా? సహజమైనవి కాదా! తేలిగ్గా చూడటమెందుకు? నిజమే కాని అవి విచ్చలవిడిగా ధర్మబాహ్యంగా ఉండరాదనేది ఇక్కడి సందేశం. అంతేకాదు ఇట్లాంటి నిరంతర కాముకుడికి కులీనుడు, కులహీనుడు అనే భేదం ఉండదు. ధర్మమార్గంలో వెళ్లేవాడే కులజుడు. దాన్ని తప్పిన వాడెవడైనా కులహీనుడు అని సారాంశం.

మూడున్నర శతాబ్దాల కిందట చెప్పిన ఈ వేమన పద్యం ఇప్పటికీ ప్రాసంగికమే, సందర్భోచితమే. వావి వరుసలు మరిచి, పసిపిల్లలూ పెద్దవారని చూడక నేరప్రవృత్తితో పశువాంఛలకు పాల్పడే వారిని మనం వర్తమాన సమాజంలో చూస్తున్నాం. కామం సహజమైందే. ప్రేమ పవిత్రమైందే కాని అవి సవ్యమార్గంలో వెళ్లినప్పుడే మంచి ఫలితాలుంటాయనీ, కానప్పుడు లోకంలో నవ్వులపాలు కావలిసి వస్తుందని వేమన్న సారాంశం.

**పట్ట నేర్చుపాము పడగ ఓరగ జేయు**
**చెరుప జూచువాడు చెలిమి జేసు**
**చంపదలచు రాజు చనువిచ్చు చుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కాటు వేయదల్చుకున్న పాము ముందుగా పడగను ఒక పక్కకు వంచుతుంది. హాని చేయదల్చుకున్న దుర్జనుడు ముందుగా స్నేహం నటిస్తాడు. చంపదల్చుకున్న రాజు సాన్నిహిత్యాన్ని అనుమతిస్తాడు అని వేమన ఒక గొప్ప లోకసత్యాన్ని ప్రవచిస్తున్నాడు.

ఓరగ అంటే ఒక పక్కకు అని అర్థం. 'తలుపు ఓరగా వెయ్యి' అంటే కొంచెం తెరిచి ఉండేట్టుగా వెయ్యమని. ఇక్కడ కొంచెమనే అర్థం. చనువు అంటే దగ్గరితనం, చెరుపు అంటే నష్టం, నాశనం, ఆటంకం అనే అర్థాలు కూడ ఉన్నాయి. చెలిమి (చెలి+ఇమి)కి ఒద్దిక; నెయ్యం, నేస్తం, మైత్రి, సహవాసం, సాహచర్యం అనే పర్యాయ పదాలున్నాయి.

రాజులను వర్ణించేటప్పుడు వేమన్న తరచుగా రెండు పోలికలను వాడతాడు. 1. పాములు, 2. కోతులు. ఈ పోలికల మీద వేమన్నకున్న మక్కువ ఆయన లోకానుభవం నుండి పుట్టిందే. క్రమంగా ఇవి క్రౌర్యానికీ, చపలచిత్తానికీ బలమైన సంకేతాలయ్యాయి.

కరవబోయే పాము పడగను పక్కకు వంచి నమ్మిస్తుంది. అట్లాగే చెడగొట్టదల్చుకున్నవాడు స్నేహాన్ని అభినయిస్తాడు. వీళ్లిద్దరిలాగే, చంపదల్చుకున్న రాజు ముందు చనువుగా వుంటాడు. రాజులిచ్చే చనువు ప్రమాదకరంగా, చివరికి ప్రాణాంతకంగా పరిణమిస్తుందని బోధించే కథలు మన సంప్రదాయంలో చాలా ఉన్నాయి. ఆ రోజుల్లో రాయలసీమలోని ఏ అమర నాయకులనో, చిల్లర దొరలనో దృష్టిలో పెట్టుకొని చెప్పిన పద్యం కావచ్చునిది. వారితో వేమన్న స్వానుభవం కూడా కావచ్చును.

**పట్టు గొమ్మలేక పలు పాటుపడువారు**
**పెట్టిపొయ్య లేక తిట్టువారు**
**ముట్టి శివుని పూజ మొదలె సేయరు వారు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తమకెవరూ అండలేక అనేక బాధలు పడుతుంటారు కొందరు. అలాగే కోరి చేరిన వారికి తిండి పెట్టే శక్తి లేక విదిలించి కొట్టేవారు మరికొందరు. అటు పైనున్న వారి ఆధారం లేక ఇటుకింది వారికి ఆధారం కాలేక అంగలార్చడం కంటే అందరికన్న పైవాడు శివుడు, అతన్ని ముందే నమ్ముకోవచ్చుగదా! లింగాన్ని తాకి పూజ చెయ్యొచ్చు కదా అని సూచన చేస్తున్నాడు వేమన.

పట్టుగొమ్మ, పెట్టి పొయ్యడం అనేవి జాతీయాలు. నుడికారాలు, పలుకుబళ్లు అనికూడా అంటారు. ఇంగ్లీషులో idium. ఒక జాతికే ప్రత్యేకమైన వ్యక్తీకరణ లన్నమాట.

పట్టుగొమ్మ అంటే ఆశ్రయం. చెట్టుపెకెక్కినవాడు పడకుండా పట్టుకునే కొమ్మను పట్టుగొమ్మ అంటారు. అట్లాగే పెట్టిపొయ్యడం అంటే పోషించడం.

ఇక్కడ శివున్ని నమ్ముకోవడమంటే ఆయన అనుగ్రహంతో తనని తాను నమ్ముకోవడం అని సారాంశం.

**పట్టు పట్టరాదు పట్టి విడువరాదు**
**పట్టెనేని బిగియ పట్టవలయు**
**పట్టువిడుట కన్న పడిచచ్చుటే మేలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏ పనినైనా ప్రారంభించే ముందు దాని లోతుపాతుల గురించి ఆలోచించాలి. ఒక్కసారి ప్రారంభించిన తర్వాత మధ్యలో వదిలెయ్యకూడదు. వదిలెయ్యకపోవడమే కాదు మరింత గట్టిగా దానికి అంకితమైపోవాలి. పూనుకున్న కార్యాన్ని విరమించుకోవడం మరణం కన్న హీనం అంటున్నాడు వేమన.

దేంట్లోనైనా సరే దిగేముందు ముందు వెనుకలు చూసుకోవాలి. పట్టుచూసి పట్టుకోవాలి. పట్టుకొని చూసి పట్టు దొరకలేదని చాలించుకోకూడదు. పట్టుకున్నదాన్ని గట్టిగా నమ్ముకోవాలి. పట్టిన పట్టు విడవటం కన్న ఆత్మహత్యే మేలు.

నడిచేదారిలో ముళ్లూ రాళ్లూ ఎదురైతే తోక ముడిచే వాడు పిరికివాడు. కష్టాలు పద్మవ్యూహమై చుట్టుముడితే రాజీపడేవాడు అవకాశవాది. అవకాశవాది కార్యదీక్షను హత్య చేస్తాడు. అది ఆత్మహత్యతో సమానం.

'పట్టు' అనే మాటకు లెక్కలేనన్ని అర్థాలున్నాయి. పట్టుదల, ఉనికి, ధైర్యం విషయం, సందర్భం, అవకాశం, సమయం, పరిమితి, పొందడం, ఊత, ఇల్లు, బంధుత్వం, గ్రహించు, ఆక్రమించు, అవలంబించు, ఒత్తు, పిసుకు, అదుము, ధారణ చేయు, బిగదీయు, లాగు వాటిలో కొన్ని. ఈ పద్యంలో మాత్రం ఆరంభించు అని అర్థం.

**పతిని విడువరాదు పదివేలకైనను**
**పెట్టి చెప్పరాదు పేదకైన**
**పతిని దిట్టరాదు సతిరూపవతియైన**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈ పద్యంలో మూడు నిషేధాలున్నాయి. అంటే చెయ్యగూడని పనులు. ఏమిటవి? కారణాలెన్నున్నా సరే భర్తను అమ్ముకోగూడదనేది ఒకటి. అలా చెయ్యడం వల్ల భార్యకూ భర్తకూ ఇద్దరికీ యిబ్బందే. రెండోది, పెద్దవాడికి చేసిన సాయమైనా పేదవాడికి చేసిన దానమైనా కీర్తికోసం వాటిని లోకానికి బహిర్గతం చెయ్యగూడదు. ఇక మూడోది. భార్య తాను అందమైన దాన్నని, భర్త కురూపి అని, తనకు తగినవాడు కాడని అతన్ని మాటి మాటికి చులకన చెయ్యగూడదు. అది వివాహధర్మానికి విరుద్ధం అంటున్నాడు వేమన.

పతి అంటే భర్త, ప్రభువు, యజమాని అని అర్థాలున్నాయి. సి.పి. బ్రౌన్ ప్రభువుగానే ఊహించాడు. (Desert not thy king, even for a thousand others) దీనివల్ల కారణాలెన్నున్నా ఆశ్రయించుకున్న యజమానిని వదిలిపెట్టరాదు అది ద్రోహం అనే అర్థం వస్తుంది. మరి యజమాని దుర్మార్గుడైతే ఎలా? పడిఉండాలా? కాబట్టి దీని గురించి ఆలోచించాలి. భార్యభర్తలపరంగా ఆలోచిస్తే చరిత్రలో భర్తను అమ్మివేసిన దృష్టాంతాలు ఉన్నాయా? పరిశోధించాలి. భర్తృవిక్రయమన్నమాట! 'పదివేలకైనను' అంటే ఇక్కడ డబ్బుకాదు. పదివేలు అంటే అనేకం, చాలా అని. "పదివేలసార్లు చెప్పినా వాడు వినలేదు. అంటే ఎన్నోసార్లు అని. 'పదివేలకైనా వాన్ని నమ్మొచ్చు' అంటే అన్నివిధాలా అని. 'వెయ్యేల, వేయిమాటలేల' అంటే ఒక్కమాటలో చెప్తే అని. మొన్నమొన్నటి దాకా సాగిన వెట్టిచాకిరి ఇలాంటిదే. అప్పు తీర్చలేక దొర దగ్గర వెట్టికి పెట్టడం అమ్ముకోవటం లాంటిదే. అయితే భర్తృవిక్రయానికి సంబంధించిన చరిత్రను గురించి పరిశోధించవలసి వుంది.

రెండోపాదంలో దానం గొప్పకోసం చెయ్యకూడదు. మానవతాదృష్టితో చెయ్యాలి. అది గుప్తదానంగా వుంటే అది నీ సంస్కారానికి తార్కాణంగా వుంటుంది. మూడోపాదం "భార్యారూపవతీ శత్రుః" అనే లోకోక్తికి ఉదాహరణగా వుంది. తాను సౌందర్యవతిననీ భర్త అంతంతమాత్రమే అనుకునే వనిత పప్పులో కాలేసినట్లే. మానసిక సౌందర్యం తెలియనివారే పై మెరుగులకు మిడిసిపడతారు అని వేమన్నభావం. ఆ లోకోక్తి సందర్భమేమిటంటే సుందరియైన భార్యతో వీధిలో వెళ్తుంటే లోకుల కళ్లన్నీ ఆమె మీదే. అది అతనికీ యిబ్బందే. ఇక ఆమె కూడా అతన్ని తక్కువచేసి తూలనాడితే అది ఆమె దురహంకారమవుతుంది. వేమన్న దర్శించిన సామాజిక నీతికి నిదర్శనంగా ఉందీ పద్యం.

**పనస తొనలకన్న పంచదారల కన్న**
**జుంటి తేనె కన్న జున్నుకన్న**
**చెరుకురసము కన్న చెలిమాట తీపిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సృష్టిలోని తీపి పదార్థాలన్నింటి కంటే వలచిన చెలి పలుకులు ప్రియుడికి మరింత తియ్యగా ఉంటాయంటున్నాడు వేమన. ఏమిటా పదార్థాలు? అవి పనసపండులో ఉండే తొనలు, చక్కెర, జుంటి తేనె అనే ఒకరకం తేనె, జున్నుగడ్డ, చెరుకురసం.

పైవన్నీ తీపి వస్తువులే గాని ఒక్కొక్క దానిది ఒక్కో ప్రత్యేకత. పనస తొనలు అంటే పనసపండులో గుజ్జును ఇముడ్చుకున్న అరలు. ప్రతి తొనలో ఒక గింజ వుంటుంది. గింజను తీసి తొనను నోట్లో వేసుకుంటే అదో మజా! పంచదారలు అంటే చక్కెరే గాని అయుర్వేదంలో ఐదు రసాలు. తీపి, ఉప్పు, కారం, చేదు, పులుపు. చక్కెరలో ఐదు రుచులు ఉన్నా తీపిదే పైచేయి. పెదవిలో ఎన్ని రుచులున్నా ఆస్వాదించే కొద్ది తియ్యనవుతుందన్నమాట.

జుంటితేనె అంటే జుంటి ఈగ పెట్టిన తేనె. ఇది ఒక రకం తేనెటీగ. జుంటీగ అనికూడా అంటారు. జుంటి తేనె కాక ముసురు తేనె, పుట్టతేనె, పెరతేనె, కర్రతేనె, కురుజు తేనె అని అనేక రకాలున్నాయి. జున్ను అంటే ఆవు లేదా గేదె మొదలైనవి యీనిన రెండు మూడు రోజుల్లో పితికిన పాలు; వాటిని ఆవిరి మీద కాచితే ఏర్పడే గడ్డను జున్నుగడ్డ అంటారు. చెరుకురసం సంగతి తెలిసిందే. వేమనదే ఇంకోపద్యం "తేనె పంచదార" లాంటిదే ఇది కూడా. ఇక్కడ పెదవి ప్రసక్తి లేదు. పెదవుల్లోంచి వొలికే చెలిమాటలు. వాటి తీపి అనుభవైక వేద్యం. అపూర్వమైన దానిని అనుభవించిన తర్వాత సామాన్యమైన వాటిపైన మనసుపోదని సారాంశం.

**పని తొడవులు వేరు బంగారమొక్కటి**
**పరగ ఘటలు వేరు ప్రాణమొకటి**
**అరయతిండ్లు వేరు ఆకలియొక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చెక్కిన ఆభరణాలు రకరకాలుగా కనిపించవచ్చు కాని వాటికి వాడిన బంగారమొక్కటే. శరీరాలు విడివిడిగా ఉండొచ్చు కాని వాటిలో ఊపిరి పీల్చే ప్రాణమొక్కటే. వంటపదార్థాలు అనేకం కావొచ్చు. కాని వాటిని కోరే ఆకలి ఒకటే. పైకి భిన్నంగా కనిపించే వాటి అంతరార్థం తెలిసినవాడే నిజమైన జ్ఞాని అని వేమన్న అభిప్రాయం.

పని తొడవులు అంటే చేతి నైపుణ్యంతో రూపొందే నగలు. మెరుగు పెట్టడం వల్ల భూషణాలు పలుకాంతులతో కనిపిస్తాయిగాని అవి తయారయ్యేది ఒక్క బంగారంలోంచే. 'చేతులకు తొడవుదానము' అని ప్రయోగం.

ఘటలు అంటే కుండలు. ఘటం దేహానికి సంకేతం. 'ఘటవత్ జీవనం' అన్నాడు శంకరాచార్యులు. కుండతో ఎందుకు పోలుస్తారు? భగ్నమౌతుంది కాబట్టి, అంటే పగిలిపోతుంది. అలాగే మర్త్యుడు. మర్త్యుడు అంటే మృతిగలవాడు. కుండా అంతే! 'ఘటవిసర్జన చేశాడు' అంటే చనిపోయాడని. మన పల్లెల్లో 'ఈ ఘట మున్నన్నాళ్లు ఇట్లా జరగాలె' అంటారు. 'ఘటస్ఫోటనం చేశాడు' అంటే భార్యకు విడాకులిచ్చాడని. అంటే కుండ పగులగొట్టాడని. 'ఘటికుడు' అనే మాటుంది. అది కూడా కుండ సంబంధమే. ఘటికుడు అంటే సమర్థుడని. నీటిమీద కుండను బోర్లించి దానిపై తేలుతూ ఏరుదాటేవాడు ఘటికుడు.

పైకి దేహాలు వేరుగా కనిపించినా వాటిలో ఉన్న ప్రాణమొకటే, చైతన్యమొకటే, ఆత్మ ఒకటే అని వేమన్న సారాంశం, ఘటమంటే యోగపరంగా కుంభకం అనే ప్రాణాయామ భేదం కూడా. ప్రాణం అంటే ప్రాణవాయువు, ఆక్సిజన్. ఈ అర్థం కూడా బాగుంది.

అలాగే 'గేగు కొరికినా కేకు నమిలినా ఆకలి మంటలు అర్పుటకే కద' అన్నాడు కాళోజీ. నాలుక కొస నుంచి గొంతువరకే రుచులు. గొంతు దాటిందా ఏ ఆహారమైనా ఆకలికి ఆజ్యం.

ఇట్లాంటి మంచి మూసపద్యాలు వేమనలో మరికొన్ని కనిపిస్తాయి.

పరగబొందులు వేరు (డి.1721, 181) అనేది పాఠాంతరం.

**పరగచెట్ట బట్టి పాలింపకుండెనా**
**వెలుగు దాటి వీడు వెళ్లబారు**
**ఆడువారి చిత్తమటువలెనుండురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆమెను సలక్షణంగా పెండ్లి చేసుకున్నావు. కాని ఆమెను సరిగ్గా చూసుకోలేదనుకో అప్పుడు ఏమవుతుంది? ఏమవుతుందంటే ఆమె హద్దుదాటి ఇల్లు విడిచి ఊరినించే వెళ్లిపోవచ్చు. కాబట్టి స్త్రీలను బాధిస్తే వారి మనస్సు విరిగిపోతుంది జాగ్రత్త! అని పురుషులను హెచ్చరిస్తున్నాడు వేమన.

చెట్టబట్టడమంటే పెండ్లి చేసుకోవడం. చెట్ట అంటే చెయ్యి. ప్రాణిగ్రహణం అన్న మాట. "చెట్టపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడవవలెనోయ్" అన్నాడు గురజాడ. చెట్టపట్టాల్ (పట్టలు) అంటే అన్యోన్యంగా ఒకరి చేతులు ఒకరు పట్టుకోవడం. ఇప్పుడు దేశం నిండా చేతులు ఎలా కలిసి పోతున్నాయో చెప్పాలా!

పాలించడం అంటే పోషించడం, రక్షించడం అనే అర్థాలున్నా ఇక్కడ మనసెరిగి ఏలుకోవడం.

వెలుగు అంటే కంచె. పశువులు మొదలైనవి చొరబడకుండా చేనిచుట్టూ కంపతో ఏర్పరిచే ఆవరణను వెలుగు అంటారు. వెనుగు అని కూడా అంటారు. తెలంగాణాలో ఎనుగు. ఇది పక్కా దేశీయ పదం. తమిళంలో వేలీ, మలయాళంలో వెలి అంటారు. వెలుగు అంటే ఇక్కడ కాంతి కాదు.

> "*ఘటకుడు పంపగా నరిగి కంపవెలుంగు తలంగ ద్రోచియు*
> *ద్భట గతి బుద్ధి సారుడటు తారున గర్కరికా పలాళిజూ*
> *పుటయు*" అనేది ప్రయోగం.

వీడు అంటే ఊరు, పట్టణం. దండు విడిసే చోటును కూడా వీడు అనేవారు. వీడుకోవడం అంటే సెలవు తీసుకోవడం బహుశా వీడు నుంచే వచ్చి వుంటుంది. వీడుకొలుపటం అంటే పోయిరమ్మని సెలవివ్వటం. "మంత్రులాప్తులు దొరలు సంబంధిజనులు/వీడు చదివించి రెంతము వేడ్కమెరయ" అనేది ప్రయోగం. వెళ్లబారటం అంటే వెళ్లిపోవడం. ఇక్కడ శాశ్వతంగా వెళ్లిపోవటం.

ఈ పద్యంలో వేమన ఉదారంగానే వున్నాడు. మిగతా విషయాల్లో వేమన ప్రగతివాదే కాని, స్త్రీల విషయంలో అందరిలాంటివాడే అని అంటారు. వేమనను గుడ్డిగా పొగడనక్కరలేదు గాని 17 వ శతాబ్దం నాటి పరిమితుల్లో అతణ్ని చూడటానికి కూడా నిరాకరించనక్కర్లేదు అని నా అభిప్రాయం. ఈ పద్యం దగ్గర బ్రౌన్ ఓ ఆసక్తికరమైన వ్యాఖ్య చేశాడు చూడండి.

"Verses containing illibernt notions regarding the female sex are but too frequent in Vemana and other Hindu authors. See one subject colbrook's Digest of Hindu Law".

"వెలుగు దాటి తీగె వెళ్లబారు, ఆడువారి గుణం లాలాగె కాదకో! (డి.1723-402); వృద్ధి గనక చెడును విశ్వమందు, జ్ఞానమిచ్చగించి సద్గురు వొందదు (డి.1773-1-511) అనేవి పాఠాంతరాలు.

**పరగ తామెసగక పరులు చెప్పినసైన**
**ఇవ్వజాలక విధినెసగువాడు**
**పొట్టుదినెడి లండి బువ్వలు పెట్టునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడొక పరమలోభి, తాను తినడు, ఇతరులకివ్వడు. దానం చెయ్యాలని ఎవరు చెప్పినా వినడు. అది అతనికొక నియమమైపోయింది. ఎక్కడైనా ధాన్యం పొట్టుతినే మూర్ఖుడు పరులకు అన్నపెడతాడా? దృష్టాంత సహితంగా వెక్కిరిస్తున్నాడు వేమన.

వేమన పిసినారుల గురించి ఎన్నో పద్యాలు చెప్పాడు. ఆ వరుసలో ఇతనొకడు. దానం చెయ్యకపోవడం ఇతనికలవాటు. దానిని 'విధి'గా పెట్టుకున్నాడు.

పరగ అంటే ప్రవర్తిల్లు అని అర్థం. ఇక్కడ ఉత్సాహంతో అని. కొన్నిచోట్ల ఇది ఖాళీ పూరణ పదం, ఇక్కడ కాదు. *"ఎల్లలోకములు మహోద్ధతింబరగె, పన్నగపతులు సంతసముల బరగిరపుడు"* అని ప్రయోగాలు. ఇతరులు హితవు చెప్పినా ఇవ్వడు, కాదు ఇవ్వజాలడు, అంటే ఇవ్వలేడు, మనసొప్పదు. అది అతనినైజం.

ఎసగుట అంటే ప్రకటితం కావడం. ఎసగువాడు అంటే విధిప్రకారం నడుచుకునే వాడని 'ఎసగ' అనేది తరచుగా క్రియావిశేషణంగా వస్తుంది. ఉదాహరణకు కోపమెసగ, అంటే కోపం ప్రకటితం కాగా అని. అలాగే సంతసమెసగ, వైభవమెసగ, మరులెసగ.

వడ్లు, అరికెలు, కొర్రలు, చామలు, వరిగెలు లాంటివి పొట్టుధాన్యాలు. *"గట్టి విడిచిపెట్టి పొట్టుకు పోరాడుతావా?, మీది తోలు పొట్టు పొట్టుగా రాలిపోయినది"* అనేవి కొన్ని లోకవాడుకలు. లండి అంటే మూర్ఖుడు.

ఇక బువ్వ అంటే అన్నమే. అన్నం నాగరీకమైపోయినా బువ్వ పల్లెల్లో ఇంకా సజీవంగానే వుంది. బువ్వ ఒకప్పుడు గౌరవనీయ పదమే. బువ్వకడుపు అంటే అన్నప్రాశనం. బువ్వమ్మ అంటే అన్నపూర్ణాదేవి. బువ్వకు అర్థం చెప్తూ బ్రౌన్ ఫుడ్‌కిది 'చైల్డిష్ వర్డ్' అన్నాడు. పసిపిల్లలకు తినిపించేటప్పుడు బుజ్జగింపుల్లో విన్నాడేమో. శ్రీనాథుడు వర్ణించిన బువ్వపు బంతిని మనం కడుపారా ఆనందించలేదా!

దేశీయ పదాలతో నిండిన గాదెలు వేమన పద్యాలు. మట్టిలోంచి తీసిన మాణిక్యాలు. చిన్న చిన్న మాటలను రసగుళికలుగా మార్చిన అక్షర వైద్య మాంత్రికుడు వేమన.

*"పరగతానొసగక,* (డి.1721-103) అనేది పాఠాంతరం.

**పరగ బొమ్మ గుడ్డు పరికించి చూచిన**
**కులములన్ని యందు గూడపుట్టె**
**అందరొకట గలయ అన్నదమ్ములె గదా!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఆలోచించి చూస్తే ఇప్పుడు వేరువేరుగా కనిపించే కులాలు, జాతులన్నీ తొలుత ఒకే బ్రహ్మాండం నుంచి జన్మించాయి. అందరినీ ఒకే గాట కడితే వారంతా అన్నదమ్ములని అర్థమవుతుంది.

కులాలు సహజమైనవి కాదు. కాలక్రమంలో ఏర్పడినవి. మనుషులందరిలో పుట్టుకతో వచ్చిన మానవ గుణమొక్కటే. మూలంలో లేని శాఖలు, తెగలు నిరర్థకమని సారాంశం.

పరగ అంటే ఒప్పునట్లుగా అని. సరైన పద్ధతిలో పరికించి చూస్తే అని. కాబట్టి పరగ ఇక్కడ పాదపూరణం కాదు.

బొమ్మ అంటే బ్రహ్మ. బొమ్మగుడ్డు బ్రహ్మాండానికి వేమన్న తెలుగుసేత. పద్మవ్యూహానికి తిక్కన తమ్మిమొగ్గరం లాగ. కూడపుట్టె అంటే కలిసి పుట్టడం. 'సాను జాతమయ్యె సకల కులము' అన్నాడు వేమనే మరోచోట.

**పరగ రాతిగుండు పగులగొట్టగవచ్చు**
**కొండలన్ని పిండి గొట్టవచ్చు**
**కఠిన చిత్తు మనసు కరిగింపగా రాదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కర్కశమైన రాతిగుండును ఒడుపుతో పగులగొట్టవచ్చు. పరిమాణంలో ఎంతో పెద్దవైన కొండలనుకూడ నుగ్గునుగ్గు చెయ్యొచ్చు. కాని కఠినమైన మనస్సు గలవానిని కరిగించడం అసాధ్యం అంటున్నాడు వేమన. రాతిని దానికన్న గట్టిదైన సుత్తెతో ముక్కలు చెయ్యొచ్చు. మందుగుండు సామగ్రిని దట్టించి పెద్ద పెద్ద కొండల్ని సైతం పొడి పొడి చెయ్యొచ్చు. కాని ఆర్ద్రత లేని హృదయాన్ని కదిలించలేం.

చిత్తమంటే intellect, హేతువుకు సంబంధించింది. కాని వ్యవహారంలో చిత్తమన్నా మనస్సన్నా హృదయమనే అర్థంలో వాడుతున్నాం. కాని వేమన ఇక్కడ 'కఠినచిత్తుడు' అని సమాసం చేశాడు. ఈ చిత్తం స్వభావానికి సంబంధించింది. కఠిన స్వభావుడన్నమాట. సంతోషచిత్తుడు, క్రూరచిత్తుడు, శాంతచిత్తుడు అనే మాటలు ఇట్లాంటివే. చిత్తం అనే మాటకు కూడా ఛాయిలున్నాయి. *'మీ చిత్తం'* అంటే మీ ఇష్టం అని అర్థం. *'మీ చిత్తానికి తేవాలి'* అంటే మీ దృష్టికి తేవాలి అని. *'చిత్తగించండి'* అంటే వినండి అని. కఠినచిత్తం గలవాడు చిత్తగించమన్నా చిత్తగించడు. చిత్తానుసారంగా ప్రవర్తిస్తాడు. మనస్సులో అనుభూతి, ఆర్ద్రత, ఇష్టం లేనివాడిని మనమేం చెయ్యలేం అంటున్నాడు వేమన. మనసు అనే మాటలో కూడా 'ఇష్టం' అనే మాట గర్భితంగా వుంది. *'నా మనస్సెట్లా ఒప్పింది?'* అంటే నీకెలా ఇష్టమయ్యింది? అని *'మనసైనవాడు'* అంటే ఇష్టమైనవాడు అని. కోమలత్వం, సౌకుమార్యం అనే మాటలు పక్కనపెట్టు. ఇవి వాడి నిఘంటువులో లేవు. వాడు కఠినచిత్తుడు. వాడి మనస్సు దుర్భేద్యము కాదు అభేద్యం.

అవసరం వచ్చినప్పుడు వేమన ఎంత పెళుసుగా మాట్లాడుతాడో అంతర్గతంగా మనిషిపైన అంతకన్న ఎక్కువ కరుణ చూపిస్తాడు. కరగవలసిన సన్నివేశంలో కరగని వాడు అసలు మనిషేనా అని వేమన్న ఈసడింపు.

పరగలేమి చేత బంధువుల్ పగవారు
పరగలేమిచేత పరము దప్పు
పరగలేమి చేత పరపతి దప్పురా
విశ్వదాభిరామ వినురవేమ.

పరగ అనే మాటను వేమన తన పద్యాల్లో తరచుగా వాడతాడు. ఈ పద్యంలోనే మూడు పాదాల ప్రారంభంలో మూడుసార్లు వాడాడు. ప్రాచీన కవుల్లో కొందరు దీనిని వ్యర్థపదం (స్పేస్ ఫిల్లర్)గా వాడటం గమనించవచ్చు. వ్యర్థపదమనటం ఇష్టం లేక కొందరు వీటిని శబ్దాలంకారాలన్నారు. కాని వేమన వీటిని భావాలంకారాలుగానే వాడాడు, అంటే అర్థయుక్తంగానే ప్రయోగించాడు. 'పరగ' అనేది మూడు లఘువుల ముచ్చటైన సూర్యగణం. వేమన తన పద్య నిర్మాణ వ్యూహంలో నడక కోసం ఈ గణాన్ని చక్కగా వాడుకున్నాడు. ఆ చర్చ మరోసారి.

ఇక పద్యాన్నిచూద్దాం. మనదగ్గర డబ్బు లేకపోతే అయినవారే కాని వారవుతారు, అంటే శత్రువైఖరి నవలంభిస్తారు. డబ్బు లేకపోతే పుణ్యకార్యాలు చెయ్యడంవీలుకాక పరలోక ప్రయత్నాలకు విఘాతం ఏర్పడుతుంది. డబ్బులేకపోతే పలుకుబడి తగ్గిపోయి అప్పిచ్చేవాడు ఇవ్వడు. ఎంత విడ్డూరం! కావొచ్చు, కాని ఇది లోకంలో ఉన్నదే. పరగ అంటే ఉండటం, ప్రవర్తిల్లటం అని అర్థాలు.

లేమి అంటే లేకపోవడం *"జనకుడు లేమికింగడు విషాదమునొందె"* అని ప్రయోగం. లేమి అంటే శబ్దపరంగా లేకపోవడం అని సాధారణార్థమున్నా ధనం లేకపోవడం, (దారిద్ర్యం) అన్న అర్థమే రూఢికెక్కింది.

బంధువులు శత్రువులు కావడమేమిటి? అవును! నువ్వు బీదవాడివైతే చుట్టాలు స్నేహభావం వదిలేస్తారు. నీ ఇంటికి రారు, తమ ఇళ్లకు పిలవరు, అప్పుడుగు తావేమోనని ముఖం చాటేస్తారు అంటున్నాడు వేమన. మరి 'పరము' ఏమిటి? అంటే పరలోకం. చనిపోయిన తర్వాత ప్రాప్తించే పుణ్యగతులు. అవి రావాలంటే మంచిపనులు చెయ్యాలి, అంటే దానధర్మాలు వగయిరా. డబ్బులేకుంటే ఇవి సాధ్యం కావు. అలాగే డబ్బు లేకపోతే పరపతి ఉండదు. అంటే సమాజంలో నమ్మకం తగ్గిపోతుంది. పరపతి అనేమాట పరపత్తెం నుంచి వచ్చింది. పరపత్తెం అంటే ఇతరుల వద్ద చేబదులుగా డబ్బు తీసుకోవటం. ఇప్పుడది బంద్!

ఈ పద్యంలో వేమన ఇచ్చే సందేశమేమిటి? లేమి దాపురించినప్పుడు లోకరీతి తెలుస్తుందనా? ధనవంతుడివి కమ్మనా? ధనమార్జించక తప్పదనా? ఏదేమైనా కష్టపడి సంపాదించాలనే సారాంశాన్ని ఈ పద్యం ద్వారా గ్రహిస్తే మంచిది. 'పరపతి హానిరా' (డి. 1721–90) అనేది పాఠాంతరం.

**పరబలంబు చూచి ప్రాణరక్షణమున**
**కురికి పారిపోవు పిరికి నరుడు**
**యముడు కుపితుడైన అడ్డంబు ఎవరయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శత్రువులను చూసి తోటియోధులను వదిలేసి స్వీయరక్షణ కోసం పరిగెత్తుతున్నాడు అంటే పారిపోతున్నాడు. ఎవడువాడు? పిరికివాడు. చెలరేగిన శత్రువుని చూసి ఉడాయిస్తున్నాడే ఇక కోపంతో యముడే ఎదురైతే వాడికెవరు రక్షణ? అని ఈసడించుకుంటున్నాడు వేమన.

ఉరకడం అంటే వేగంగా పరిగెత్తడం, కుపితుడు అంటే కోపం వచ్చినవాడు. అడ్డం అంటే సాధారణంగా ఆటంకమని. అడ్డం అంటే చాటు అని కూడ. 'అడ్డంగా పోతే' అంటే పక్కదారి అని. 'అడ్డమైన పని చెప్తున్నాడు' అంటే ఏ పనిపడితే ఆ పని అని. ఈ పద్యంలో మాత్రం 'అడ్డం' అంటే రక్షణ అని అర్థం. 'నీకెవడు అడ్డం వస్తాడో చూస్తా'లో లాగ.

17వ శతాబ్దం యుద్ధాలకాలం. ఈ శతాబ్దం మధ్యనాటికే (1645) గండికోట, నంద్యాల, కర్నూలులను ఆక్రమించుకోటానికి మీర్‌జుమ్లా చేసిన యుద్ధాలు; బీజాపూర్ పైకి ఔరంగజేబ్ చేసిన (1657) దండయాత్ర; గుత్తి, తాడిపత్రి, అదోని, ఆలూరు, ధర్మవరం ప్రాంతాల్లో మొగలు గుర్రాల రణధూళి ఎగయటం; బీజాపూర్ సుల్తానులకు, గోలకొండ నవాబులకు ఒక్కొక్కప్రాంతమే కోల్పోతూ తిరిగి చేజిక్కించుకుంటూ దినదినగండంగా విజయనగరం చేసిన కొన ఊపిరియుద్ధాలూ... ఇట్లాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో పాలెగాళ్ల దుండగాలకు అంతులేదు. ప్రజలకు భద్రత కరువైంది. వేమనకాలంలో చిన్న చిన్న పాలకులు ప్రజలకు కనీస రక్షణనందించలేని అసమర్థులైనప్పుడు, పరసైన్యాలు గుర్రాలపై వచ్చి ప్రజలను హింసించి ఊళ్లను వల్లకాడులుగా మార్చి వెళ్ళేవి. అప్పుడు ప్రజలను కాపాడవలసిన అధికారులు పలాయనం చిత్తగించేవారు. శత్రుసైన్యాలు రాకముందే పారిపోయిన వారు కొందరైతే కదనరంగం దాకా వెళ్లి కాళ్లకు బుద్ధిచెప్పినవారు మరి కొందరు.

సొంత ప్రాణరక్షణ కోసం పరిగెత్తే వాడికి యముడే ఎదురైతే!? పలాయనం కంటే ప్రజారక్షణలో వీరస్వర్గం గొప్పదని వేమన్న ఉవాచ.

**పరమహంస ననుచు పరవగట్టుక భూమి**
**పరధనముల కాస పడెడువాడు**
**పరమహంసగాడు పరమహింసయండ్రు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

తాను పరమహంసనని చాటుకుంటాడు. లోకాన్ని మోసగించటానికి వేషధారిగా మారుతాడు. ఇంతకూ ఇతడు చేసే పని ఏమిటి? ఇతరుల సంపదలపైన కన్నువేయటం. ఇతడిని పరమహంస అని ఎవరంటారు? ఇతరులను బాధించే పరమహింసకుడు అనటం సబబు అని నిరసిస్తున్నాడు వేమన.

పరమహంస అంటే ఉత్తమపదం పొందిన సన్యాసి. 'పరమహంస స్త్రిదండం చ రజ్జుం గోవాలనిర్మితమ్ / శిఖాం యజ్ఞోపవీతం చ నిత్యం కర్మ పరిత్యజేత్' ఇది పరమహంస లక్షణాన్ని చెప్పే శ్లోకం.

పరమహంస త్రిదండి అంటే ఆవుతోక వెంట్రుకలతో తయారు చేసిన తాడుతో కట్టిన మూడు కర్రలు ధరించేవాడు. ఏకదండి, ద్విదండి కాదన్నమాట. జుట్టుండదు, యజ్ఞోపవీతం అక్కర్లేదు, సంధ్యావందనం లాంటి నిత్యకర్మలు చెయ్యకున్నా చెల్లుతుంది. ఈ మూడింటికి అతీతమైనవాడే పరమహంస.

మరి మన వేషాల మారి తాను పరమహంసగా చెప్పుకోవడం ఎంత విడ్డూరం! ఇతనికి ప్రణవ రహస్యం తెలియదు. పరబ్రహ్మ తత్వమా? ఆమడదూరం. వేదవేత్తా? వాడి మొహం, సద్గురువా? గాడిదగుడ్డు. పరవ అంటే పరద, అంటే వేషం. మాయమాటలతో పరుల ధనం ఎలా కొల్లగొట్టాలా అనేదే చింత.

జీవులను మోసగించడం, హింసించడం, పీడించడం ఇతని నిత్యకృత్యం. కాబట్టి ఇతనిని పరమహింస అనడం ఉచితం అంటున్నాడు వేమన.

17వ శతాబ్దంలో రాయలసీమలో సంచరించే కొందరు దొంగ సన్యాసుల బండారం ఈ పద్యంలో బయటబడింది.

**పరసమినుము సోకి బంగారమైనట్లు**
**కప్పురంబు జ్యోతి గలసినట్లు**
**పుష్పమందు తావి పొసగి నట్లగు ముక్తి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

స్పర్శవేదిశిల తాకడం వల్ల ఇనుము బంగారంగా మారినట్టుగా, హారతి కర్పూరం మంటలో కలిసి తానేమంటగా మారినట్టుగా, పువ్వులో సువాసన ఇమిడిపోయినట్టుగా బ్రహ్మంలో ఐక్యమైన వాడికి మోక్షం లభిస్తుందని అర్థం.

ముక్తి ప్రాప్తికి సంబంధించి అందమైన ఉపమానాలతో రూపొందిన పద్యమిది. పరసము అంటే స్పర్శవేది. ఇనుమును బంగారం చేసే ఒక రసశిలను స్పర్శవేది అంటారు. పరసవేది అని కూడా. ఈ రసశిలను స్పర్శమణి, చింతామణి అని కూడా అంటారు.

పరసం సోకటం వల్ల తక్కువ జాతి లోహమైన ఇనుము కూడా పసిడితనాన్ని పొందుతుంది. కర్పూరం తాను కాలిపోయి తన అస్తిత్వాన్ని కోలుపోయి జ్యోతిగా వెలుగుతుంది. అలాగే పరిమళం పువ్వులో లీనమై దానితో అభేదాన్ని పొందుతుంది. మానవుడు ముక్తి పొందటం కూడా ఇలాంటిదే.

ఇంతకూ ముక్తి అంటే ఏమిటి? విడుదల, అంటే సంసారులైన జీవులు చనిపోతూ మళ్లీ పుడుతూ వుంటారు. వీరు కర్మ అనే ఆవరణతో కప్పబడి ఉంటారు. అటువంటప్పుడు తపస్సు, యమదమాదుల చేత కర్మావరణాన్ని ఛేదించుకుంటే అది ముక్తి. దీనికే మోక్షమని పేరు. సమస్త కర్మల క్షయమే మోక్షం. మోక్షంలో జీవులు అనంతజ్ఞానంతో, అనంత సుఖంతో దేదీప్యమానంగా వెలుగుతారు. ఒక్కమాటలో చెప్పాలంటే జీవులు తమ నిజస్వరూపాన్ని పొందుతారు. ముక్తులైన వారు ఇతర జీవుల మంచికోసం పాటుపడతారు అని సారాంశం. లోకానికి జ్ఞానామృతాన్ని పంచిన వేమన అచ్చంగా ఇలాంటివాడే.

స్పర్శవేది ఒక రకంగా రసవాద (ఆల్కెమీ) సంబంధమైంది. ఇతర లోహాలను బంగారంగా మార్చడం క్రీస్తుపూర్వం నుండి గ్రీకు, ల్యాటిన్, ఫ్రెంచి, జర్మన్ సాహిత్యాల్లో కూడా కనిపిస్తుంది. అందుకే స్పర్శవేదిని ఫిలాసఫర్స్ స్టోన్ అంటారు. జ్ఞానం పట్ల ఆసక్తి కలవాడు ఫిలాసఫర్. నీచలోహాలను బంగారంగా మార్చడాన్ని ఒక తాత్త్విక స్థాయికి తీసికెళ్లినట్టు దీనివల్ల భావించవచ్చు. 'పుష్పవాసనవలె పొసగును మోక్షంబు' (డి.1770-10) అనేది పాఠాంతరం.

**పరుల మోసపుచ్చి పరధనమార్జించి**
**కడుపు నింపుకొనుట కాని పద్దు**
**ఋణము సేయు మనుజుడెక్కువకెక్కునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇతరులను దగాచేసి వారి డబ్బును దండుకొని నీ కడుపు నింపుకోవటం అనేది ఉందే అది చెయ్యగూడని పని. ఎదుటివారి వద్ద అప్పులు చేసి కుప్పలు పోసుకునే ధనంతో బాగుపడేది కల్ల అంటున్నాడు వేమన.

ఇతరులను మోసగించి నీ కడుపు నింపుకోవటం దుర్మార్గం దానివల్ల నువ్వు పైకి రావు అని శపిస్తున్నాడు.

పరుడు అంటే అపరిచితుడు కావొచ్చు. పొరుగు వాడు కావొచ్చు, చివరకు శత్రువైనా కావచ్చు. అయితే నీతిపరుడు, అత్యాశాపరుడు అనే మాటల్లోని పరుడు అంకితమైనవాడు అంటే ఛాయలు మారిపోతాయి.

మోసం అంటే తెలియనిదేముంది? వంచన. చెప్పేదొకటి చేసేది మరొకటి. 'మొదటికే మోసం' అంటే ప్రమాదం అని మరో అర్థం కూడా వుంది.

'ఆర్జించి' అనే మాటలో చమత్కారముంది. మామూలుగా అయితే సంపాదించి అని. మరి మనవాడి ఆర్జన కష్టార్జితం కాదు. ఇతర మార్గాల్లో కూడబెట్టుకున్నది అని. పరధనాన్ని ఆర్జించుకోవడమేమిటి? పక్కదారుల్లో దక్కించుకున్నదన్నమాట.

కాని పద్దు. కాని 'అవుట'కు వ్యతిరేకం. కాని పని అంటే అవ్వనిపని అని. కొరగానిదని, పనికిమాలినదని. కాని ఇక్కడ కాకూడనిదని, చెయ్యగూడనిదని అర్థం. విశేణంగా ఉంటూ మరికొన్ని ఛాయలు. కానిగుణం అంటే చెడ్డ స్వభావం, కానివారు అంటే శత్రువులు (అయిన వారు అంటే బంధువులు అయినట్టు).

పద్దు అంటే ప్రతిజ్ఞ అనే అర్థముందిగాని ఇక్కడ ముందుగా చేసుకున్న వాగ్దానం తప్పటం అని. కాని అంటే పూర్తికాని అని. అసాధ్యమైన అనీ. ఇంగ్లీషులోని but లాంటి అర్థాలున్నాయి. ఇక్కడ 'కాని'ని వేమన అనుచితం అనే జాతీయార్థంలోనే వాడాడు. అప్పులిచ్చేవాడు అమాయకులను మోసం చేసే పద్ధతిని వర్ణిస్తున్నాడు వేమన ఈ పద్యంలో.

**పర్వత వనవాసి పరిణామ వర్తన**
**కూపవాసికెట్లు గురుతుపడును**
**బ్రహ్మనిష్ఠవెంట ప్రాకృతుండరుగునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇద్దరూ కొండల్లో, అడవుల్లోనే నివసిస్తారు. ఒకడు తత్త్వాన్వేషి. రెండోవాడు ఆటవికుడు. దైవచింతనతో క్షణక్షణం పరిణతి చెందే జ్ఞాని ప్రవర్తన చిన్న పరిధిలో కొట్టుమిట్టాడే అజ్ఞానికెట్లా బోధపడుతుంది? నిత్యం బ్రహ్మైక దృష్టితో అలరారే ఆ మహనీయుని గొప్పతనం అల్పవిషయజ్ఞుడైన ఈ పామరుడికి ఎప్పటికైనా అందుతుందా? అందదు అని వేమన్న తీర్మానం.

అరణ్యాల్లో పర్వతాల్లో సంచరిస్తూ, పక్వఫలాలను భక్షిస్తూ తత్వసుఖాన్ని అనుభవిస్తూ బ్రహ్మజ్ఞుడు పొందే విశిష్ట స్థానం జ్ఞానపరంగా కింద ఉన్న నీచుడికి ఎప్పటికీ దొరకదు. అతడు కూపవాసి, అంటే బావిలో కప్పలాంటి వాడు. కూపం అంటే బావి. బావిలో కప్ప దానినే ప్రపంచమను కుంటుంది. 'అందుకే కూపస్థ మండూకం' అని సామెత. ఆటవికుడి పరిస్థితీ అంతే. నివసించే గుహ, వేట ప్రాంతమే అతని ప్రపంచం. అందులో మార్పు లేదు కాని నిత్యం సరికొత్తగా ఏర్పడే మానసిక స్థితితో లోపలి, బయటి లోకాలను దర్శించే సాధకుడు పరిణామం చెందుతుంటాడు. పరిణామం అనేది పెద్దమాట. నిన్న ఉన్నట్టు ఇవాళ ఉండకపోవడమే పరిణామం. శరీరం జీర్ణదశకు చేరుతుంది. వార్ధక్యం సమీపిస్తుంది. కాని వయఃపరిపాకం వల్ల అపూర్వ కాంతి మత్వం సమకూరుతుంది. ఇదే పరిణామమంటే. మరణం కూడా పరిణామమే. ప్రాకృతుడు అంటే సంస్కారం లేనివాడు. ఇది ఒక్క రోజులో ఏర్పడేది కాదు అని సారాంశం. .... పర్వత గుహవాసి (డి.1723–575) అనేది పాఠాంతరం.

**పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనములు వేరు దైవంబు ఒక్కటి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆవు మొదలైన పశువులు వేరు వేరు రంగుల్లో ఉండొచ్చు. కాని అవి ఇచ్చే పాలరంగు ఒకటే, అదే తెలుపు. ఎన్ని రకాల పువ్వులో! కాని వాటి ఉద్దేశం ఒకటే. అదే పూజ. భక్తుడు చూసే చూపులు ఎన్నెన్నో!! కాని వాటి లక్ష్యం ఒకటే. అదే దైవం.

'వన్నె' వర్ణం నుంచి వచ్చిందే. వర్ణం అంటే రంగు. వన్నె అంటే కాంతి, గౌరవం అనే అర్థాలు కూడా వున్నాయి. పదారు వన్నె బంగారం లేదూ! (క్యారెట్స్) అలాగ.

దర్శనం అంటే చూడటం, దృశ్యం. చూడటం వల్ల కనిపించేది దృశ్యం. దర్శనములు అంటున్నాడు వేమన. విష్ణువనీ, శివుడనీ, దేవి అనీ వేరు వేరుగా చూస్తూ కలహించుకోవడం అనవసరం. అంతా ఒక్కటే, అదే శక్తి.

మన సంప్రదాయంలో దర్శనాలు అని ప్రత్యేకంగా వున్నాయి. అవి ఆస్తిక దర్శనాలు, నాస్తిక దర్శనాలు అని రెండు రకాలు. రెండూ ఆరేసి చొప్పున ఉంటాయి. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించేవి ఆస్తిక దర్శనాలు. అవి సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస. ఉత్తర మీమాంసను వేదాంతమని కూడా అంటారు. ఇక వేద ప్రామణ్యాన్ని అంగీకరించనివి నాస్తిక దర్శనాలు. వీటికి కూడ ఆస్తిక దర్శనాలతో సమాన స్థాయిని ఇవ్వడం మన ప్రత్యేకత. దర్శనములు అనే మాటను వేమన కేవలం అలవోకగా వాడి ఉండడు. అన్నిరకాల దర్శనాలను ఔపోసన పట్టిన అనుభవయోగి వేమన. అందుకే ఆయన పద్యరత్నాలు సమన్వయ కాంతులను వెదజల్లుతున్నాయి.

పసుల వన్నెవేరు అన్నాడు. మరి మనుష్యులూ అంతే కదా! రక్తవర్ణం ఎరుపు ఒకటే కదా! అక్షరాలు అంటే వర్ణమాలలోని వర్ణాలు, వాటి ఉచ్చారణ వేరువేరుగా ఉండొచ్చు. కాని అది పలికే భాషంతా ఒకటే కదా!

వేమన పద్యాలు చిన్ని చెలిమెల లాంటివి మట్టితీస్తూ పోతుంటే లోతుల్లో మరింత పుష్కలంగా జీవజలం లభిస్తుంది.

**పక్షిమీద నొక్క వృక్షము పుట్టెను**
**వృక్షము పదమూడు విత్తులయ్యె**
**విత్తులందునుండు వృక్షమాలించు మీ!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పక్షి కారణంగా ఒక చెట్టు పుట్టి పెద్ద వృక్షమయ్యింది. ఆ వృక్షానికి అనేకమైన విత్తులు ఏర్పడ్డాయి. గమనిస్తే ఇక ఆ విత్తులు ప్రతిదానిలో ఒక్కో వృక్షం సుప్తావస్థలో వుంటుంది. ఏమైనా అర్థమయ్యిందా? ఒకరకంగా ఇది పొడుపుకథలాంటి పద్యం. లౌకికార్థంలో దీనిని విప్పడం కష్టమే. రెక్కలు గలదానిని పక్షి అంటారు అంటే సరిపోదు. ఒక తాత్త్వికార్థానికి పక్షి, వృక్షం, విత్తు అనేవి ప్రతీకలనుకుంటే కొంత ప్రయత్నించవచ్చు.

పక్షి అంటే సృష్టి. వృక్షం అంటే శరీరం. పదమూడు విత్తులేమో శరీరంలోని త్రయోదశ తత్త్వాలు. సృష్టిమూలకమైన మానవదేహంలో పదమూడు రకాల అంశాలున్నా యంటున్నాడు వేమన. అవి. వాక్కు, మనస్సు, సంకల్పం, చిత్తం, ధ్యానం, విజ్ఞానం, అన్నం, జలం, తేజస్సు, అగ్ని, ఆకాశం, మన్మథుడు, ఆశ. వీటన్నింటికి మూలం ప్రాణం.

వాక్కు వ్యక్తీకరిస్తుంది. మనస్సు ఆలోచిస్తుంది. సంకల్పం స్థిరంగా ఉంచుతుంది. చిత్తం చపలంగా ఉంటుంది. ధ్యానం ఏకాగ్రతను ప్రసాదిస్తుంది. విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. అన్నం, జలం శరీరాన్ని పోషిస్తాయి. తేజస్సు అంటే అగ్ని, జఠరాగ్ని లాంటివి. ఆకాశం శబ్ద స్వభావం గలది, మన్మథుడు కోరికలు కలిగిస్తాడు. ఆశ చూసిందెల్లా కావాలంటుంది. ఇంక అనేక రకాలుగా వీటికి అర్థాలు చెప్పుకోవచ్చు. గహనమైన వేదాంత విషయాలు కూడా వేమన్న చేతిలో క్రీడలాగ భాసిస్తాయి అని దీనివల్ల భావించవచ్చు.

**ప్రజ యొనర్చు చెడ్డ ప్రభునకు వచ్చును**
**ప్రభువు మంచి కొంత ప్రజకు సగము**
**ప్రభువొనర్చు చెడ్డ ప్రజకేల రాదురా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రాజ్యంలో ప్రజలు చేసే అకృత్యాలు రాజుకు చెడ్డపేరు తెచ్చిపెడతాయి. కాని విచిత్రంగా రాజు చేసే మంచి పనులు ప్రజలకు సగమే అందుతాయి. అయితే రాజు చేసే పాపాలు మాత్రం ప్రజలకు తప్పకుండా హాని చేస్తాయి అని ఒక రాజనీతి వేత్తలా సెలవిస్తున్నాడు వేమన.

ప్రభువంటే రాజే కానక్కర లేదు, అధికారి కావొచ్చు, రక్షకుడు కావొచ్చు. గురువు కావొచ్చు, యజమాని కావొచ్చు. పైవాడు ఎవడైనా కావొచ్చు. కాబట్టి పైవాడు జాగరూకతతో పాలన చెయ్యాలి. సదాచారం, త్యాగం, దానం, ధీరత్వం, సాధ్యమైనంత వరకు అహింస ఇవి మంచి రాజుకు లక్షణాలు. ప్రజల్లో దుర్వర్తనులూ వుంటారు. వారిలో మంచిని పెంచే దార్శనికుడై వుండాలి రాజంటే.

'యథారాజా తథా ప్రజా' అనేది నిజమే కాని స్వార్థపూరితులైన ప్రజల ప్రవర్తనవల్ల రాజు కూడా తన మంచితనాన్ని కోల్పోవచ్చు. 18వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో జరిగిన 'సామాజిక ఒడంబడిక' సిద్ధాంతం ప్రకారం ప్రజల ఆదాయంలో 1/6 వంతు రాజుకు కప్పంగా చెల్లించాలి. చిన్న చిన్న శాతాల తేడాతో ప్రపంచమంతా ఇది అమలయ్యింది. ప్రజల ఆదాయం సక్రమమైనది కాకపోతే రాజుకు చెడ్డపేరు వస్తుంది. మరి ప్రభువు మంచితనం ప్రజలకు సగమే రావడమేమిటి? ఏమిటంటే రాజులు మంచి ఉద్దేశంతో ప్రజల శ్రేయస్సు కోసం వెచ్చించే ధనం కిందికి చేరి సగమే అందుతుంది. మిగతాసగం!? యంత్రాంగంలోకి ఇంకి పోతుంది. మొన్న వరదల్లో చూడలేదూ? బాధితులకు అందిందెంత? అదే విధంగా రాజు చేసే పాపాలు జనానికి సూటిగా కీడు చేస్తా యంటున్నాడు వేమన. రాజు చేసే పాపాలు అంటే వ్యక్తిగత స్వార్థం, ఆశ్రిత పక్షపాతం, అధికార దుర్వినియోగం ఇట్లాంటివి. పూర్వకాలం కథల్లో రాజు ప్రజలను కన్నబిడ్డల్లా పాలించేవాడు అనేవారు. ప్రభువు అంటే గృహ యజమాని అనే అర్థం కూడా వుంది. చెడ్డ రాజుపై ప్రజలు తిరుగుబాటు చేసి తొలగించిన సంఘటనలు కూడా చరిత్రలో వున్నాయి. ఇప్పుడూ చూస్తున్నాము.

**ప్రభువు కోతియైన ప్రగడలు పందులు!**
**సైనికుండు పక్కి, సేన పసులు**
**ఏన్గులశ్వచయము లెలుకలు, పిల్లులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పాలనా వ్యవస్థలో రాజు శిరస్సు లాంటి వాడు. ఆ శిరస్సులోని పదార్థం సరిగ్గా పని చేయకపోతే కింది యంత్రాంగాలు తమ నిజలక్షణాలను కోల్పోతాయి.

ఆ మహారాజు కోతి, అంటే చపల చిత్తుడు. ఎప్పుడు ఏ నిర్ణయం చేస్తాడో మారుస్తాడో అతనికే తెలియదు. అటువంటి వాడి కింద పనిచేసే మంత్రులకు బుద్ధికి పని చెప్పాల్సిన అవసరం లేకుండా పోతుంది. కాబట్టి పని వుండదు. పనిలేనివాడు పందిలా తిండిపోతవుతాడు. ఇక సైన్యాధిపతి? పక్షిలాగ తిరుగుబోతవుతాడు. తనకే క్రమశిక్షణ వుండదు. ఇక సైన్యాన్ని ఎలా అదుపులో వుంచుతాడు? అందుకే సైనికులు పశువుల్లా మేతకు లంఘించుకుంటారు. అంతెందుకు ఏనుగులు, గుర్రాల లాంటి మేలుజాతి యుద్ధజంతువులు కూడా ఎలుకలు, పిల్లుల్లా పనికిమాలిన స్థాయికి దిగజారిపోతాయి.

తెలుగువారి చరిత్రలో మునుపెన్నడూ లేనంత సుదీర్ఘకాలం నిలకడగా చెలరేగిన రాజకీయ సంక్షోభం 17వ శతాబ్దంలో దాపురించింది. 19వ శతాబ్దం దాకా ఆ మంటలు చల్లారలేదు. దక్షిణ దేశపటం క్షణక్షణం మారుతుండిన అస్థిరకాలమది. ఆ కాలంలోని చిల్లర రాజుల ఆగడాలను వేమన అనేక పద్యాల్లో వర్ణించాడు. '*తరచుకల్లలాడు ధరణీశు*'లను తూర్పారబట్టాడు. 'భూపతి కృపలు నమ్మి' దెబ్బతిన్న వారికి, ప్రజల ఉసురు తాకి రాజులు నశిస్తారు అని భరోసా యిచ్చాడు. అటువంటి సవాలక్ష రాజుల్లో మన పద్య నాయకుడొకడు.

ప్రెగడ, ప్రెగ్గడలకు రూపాంతరం ప్రగడ అంటే మంత్రి. (పేరు+కడ=ప్రెగ్గడ). పక్కి అంటే పక్షి.

'*ప్రగడలు మందులు* (డి.1721-55) అనేది పాఠాంతరం.

**ప్రస్తుతంపు వేళ పద్యంబు చదివిన**
**తప్పు గలిగియున్న నొప్పియుండు**
**వెలది సురతవేళ బిత్తలైయుండదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దేనికైనా సందర్భం ముఖ్యం! అందరూ కోరుకున్నప్పుడు చదివే పద్యమో, పాడే పాటో అక్కడక్కడ లోపాలు దొర్లినా అవి కమ్ముకపోతాయి. పట్టించుకోరు. ఎట్లాగంటే ప్రేమ ఉన్నప్పుడు సంయోగ సమయంలో చక్కని భార్య నగ్నంగా ఉన్నప్పుడు వస్త్ర ప్రసక్తి ఉచితానుచితాల ప్రసక్తి మనస్సులో కొస్తాయా? అట్లాగ.

కోరుకున్నప్పుడు తప్పులైనా ఒప్పులే. పరస్పర ప్రేమానురాగాల ముందు ఏదైనా ఇష్టమే. ఇష్టమంటే ఏదీ కష్టం కాదు. ప్రస్తుతమంటే శుభకరమైన ప్రస్తుతమనే. ఆహ్వానించదగింది. అట్లాంటి సన్నివేశంలో ఈ పద్యంలో యతి తప్పిందా, అలంకారం లేదా వంటివాటిని పట్టించుకోక సారాంశ స్వీకరణకు సిద్ధంగా వుంటారు. అవధానాల్లో అప్రస్తుత ప్రసంగమని పెడతారు. వినడానికది వెకిలిగా వున్నా పోలికవల్ల మిగతా ప్రస్తుతాంశాలను అది వెలిగిస్తుంది.

వెలది అంటే అందమైన స్త్రీ, తెల్లనిది, తళతళలాడేది, ప్రసన్నం, శ్రేష్ఠురాలైన ఆడది అనే అర్థాలున్నాయి. సన్నివేశాన్ని బట్టి ఇక్కడ భార్య. సురతము అంటే రతి, సంగమం, సంయోగం అని అర్థాలు. సురతం అంటే ఇద్దరికీ ఇష్టమైందన్నమాట. బిత్తలి అంటే నగ్న స్త్రీ.

జగన్నాథుని ప్రసంగరత్నావళిలో ఇట్లాంటి అర్థం వచ్చేదే ఓ శ్లోకం వుంది. సందర్భం కాబట్టి వినండి.

**'అవసర పఠితావాణి**
**గుణ గణ రహితాపి వహతి పరిమోదం**
**రతిసమయే యువతీనాం**
**భూషాహా నిశ్చ భూషణం భవతి'**

(తగిన సమయంలో చెప్పబడిన వాక్కు గుణాలు లేకున్నా ఆనందాన్ని కలుగజేస్తుంది. రతిసమయలో స్త్రీలకు ఆభరణాలు లేకపోయినా ఉన్నట్టే)

ఈ శ్లోకానిగ్గానీ, వేమన పద్యాలగ్గానీ మూలం సమాజ జీవనం. జాతి రక్తంలో కలిసిపోయి జవాన్నీ, జీవాన్నీ నిలుపుకున్న అనేకానేక సూక్తులూ, సామెతలూ వీటికాధారం. వీటికో కాలమని ఉండదు, పరంపరాగతాలు. సంస్కృత కావ్యాల్లో సాధారణంగా కనిపించే విశ్వ సత్యాల్లాంటి సూక్తులకు సమానార్థకంగా కనిపించే సామెతలు మనకు చాలా వున్నాయి, ఇతర భాషల్లోనూ వుండొచ్చు. జాతి సంప్రదాయంలో వున్న సమానాంశాలే ఈ పోలికలకు కారణం.

**పాప పుణ్యములను పసికాపె రుంగునా**
**ధరను పరమయోగి యెరుగుగాక**
**లోని పొందికె గని లోహముల్ గూర్పరో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పాపపుణ్యాల వింగడింపు పసుల కాపరికెలా తెలుస్తుంది? అది ఉత్తమస్థాయిని పొందిన యోగికే సాధ్యం. లోహాల లోపలి స్వభావం తెలిస్తేనే గదా వాటిని ఒకదానితో మరొకదాన్ని అతకగలిగేది అని అంటున్నాడు వేమన.

పశువుల కాపరిని ఇంతగా తీసి పారేశాడే వేమన! తీసి పారేయడం కాదు. అతనికి లోకజ్ఞానం తక్కువని, నిరక్షరాస్యుడు కదా! 'విద్యా విహీనః పశు' అన్నాడు భర్తృహరి. 'విద్యనెరుంగని వాడు మర్త్యుడే' అని గొప్పగా అనువాదం చేశాడు ఏనుగు లక్ష్మణ కవి. విద్య మాత్రమే కాదు పశువులకాపరి ఉదయం అడవికెళ్తే సాయంత్రానికే ఊరు చేరేది, పశువులతోనే సంబంధం. రోజంతా ఊళ్లో జరిగే పాప పుణ్యాల గురించి అతనికి తెలిసే అవకాశం లేదు అని అంతరార్థం.

ఇక పాపం, పుణ్యం అంటే ఏమిటి? పాపం అంటే కీడు, దుష్కృతం; మరి పుణ్యం? పుణ్యమంటే సత్కర్మ, సుకృతం. ఇవన్నీ ఎందుకు? ఓ ప్రసిద్ధ శ్లోకంలో పాపపుణ్యాలను ఒక్కమాటలో తేల్చి పారేశాడు. 'పరోపకారఃపుణ్యాయ పాపాయ పరపీడనం'. అయితే పాప పుణ్యాలు పైకి ఇంత స్పష్టంగా గోచరించవు. మనకు పుణ్యంగా కనపడేది నిజానికి పుణ్యం కాకపోవచ్చు. అలాగే పాపం కూడా. మరెట్లా గుర్తించాలి? దానికి అంతర్దర్శనం కలిగిన యోగిపుంగవుని సాయం అవసరం. ధర్మసూక్ష్మం తెలిసిన ఆయనే ఈ చిక్కు విప్పగలడు.

అలాగే రెండు లోహాలను అతకాలన్నప్పుడు ఆ రెంటి ధర్మాలు తెలిసిన లోహకారుడే సమర్థుడు. లోహం అంటే ఎర్రనిది, రాగి, ఇనుము, ఉక్కు, బంగారం అని అర్థాలు. ఉదాహరణకు బంగారంలో రాగీ వెండి కలుపుతారు. రాగివల్ల గట్టితనం, వెండివల్ల ప్రకాశం వస్తాయి. బంగారాన్ని అతుకు పెట్టడానికి వాడే పదార్థాన్ని 'రవ్వ' అంటారు. వెండి, సత్తు, ఇత్తడిని కలిపి దీనిని తయారు చేస్తారు. ఇది అతికిస్తుంది పెవికోల్ లాగ. పొందిక అంటే యిమిడిక, కలయిక. రెండు లోహాలకు సహవాసం కుదురుతుందని తెలిసినవాడే వాటిని అతకగలడని సారాంశం. "జక్కువలకిట్టి యెడ లేని పొందిక లెప్పుడున్న" అని ప్రయోగం.

పాపపుణ్యాలు, కష్టసుఖాలు లాంటి ద్వంద్వాలు పైకి కనిపించేంత విడివిడిగా వుండవు. వాటి మధ్యన గల ఆంతరిక సంబంధాల అల్లిక ఎంతో అవగాహన వల్లగాని అర్థం కాదు. అందుకే తొందరపడి పాప పుణ్యాలను నిర్ణయించరాదు అని వేమన్న ఉవాచ.

**పాపమనగ వేరె పరదేశమున లేదు**
**తనదు కర్మములను తగిలియుండు**
**కర్మతంత్రిగాక కనుకని యుంటొప్పు**
**విశ్వదాభిరామ వినురవేమ**

పాపం ఎక్కడో మరోదేశం నుండి రాదు. తాను చేసే పనుల ఫలితంగానే వస్తుంది. దుష్ఫలితాలు కలిగిన తర్వాత కర్మకాండలు, మంత్రతంత్రాలను ఆశ్రయించటం వ్యర్థం. దాని కన్న ముందే అప్రమత్తంగా ఉండటం క్షేమం అని హితవు చెప్తున్నాడు వేమన.

పాపం అంటే ఇక్కడ పాపఫలం అని అర్థం. పరదేశం అంటే వేరేదేశం, తనదికానిది అన్నమాట. ఇది లౌకిక దృష్టి. పారలౌకిక దృష్టితో పరము అంటే ఇహపరములలోని పరమన్నమాట. పరలోకగతుడు అంటే చనిపోయినవాడు. పరలోకక్రియలు అంటే చనిపోయినతర్వాత ఆత్మశాంతి కోసం చేసే అనంతర కాండలు.

ఇక 'తనదు కర్మములను' అంటున్నాడు వేమన. 'కర్మము' ఒక్కమాటలో చెప్పాలంటే పనే. అంతేకాక ప్రక్షాళనం, అదృష్టం, పూర్వజన్మ దుష్కృతం, వృత్తి లాంటి అనేకమైన అర్థాలకు చోటిచ్చే పుష్పక విమానం లాంటిదీమాట. నువ్వు చేసిన చెడ్డపనే నీకు ఎదురుకొడుతుందనేది ఇక్కడి అర్థం. ఇదే అర్థాన్ని వేమన మరోపద్యంలో మరింత స్పష్టంగా చెప్పాడు. వినండి.

*"చేటు వచ్చెనేని చెడనాడు దైవంబు*
*మేలు వచ్చెనేని మెచ్చుదన్ను*
*చేటు మేలు తలప చేసిన కర్మంబు".*

'తగిలియుండు' అంటే చేస్తున్న పనిని అనుకునే దాని ఫలితం వుంటుంది. తగులుట అంటే సంభవించటం, తగిలి అంటే దొరకటం. 'లాటరీ తగిలింది' అంటే దొరికింది అనే. 'రోగాన్ని తగిలించుకున్నాడు' అంటే అంటించుకున్నాడు అని.

దుష్ఫలితాలు వచ్చిన తర్వాత శాంతి క్రియలు, మంత్రతంత్రాల వంటి నివారణ చర్యల కంటే ముందే కళ్లు తెరుచుకొని జాగ్రత్తగా ఉంటే మంచిది కదా అని హెచ్చరిస్తున్నాడు వేమన. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం కంటే కాల్చుకోకుండా ఉండటమే వివేక లక్షణం.

**పాముకన్న లేదు పాపిష్టమగు జీవి**
**అట్టి పాము చెప్పినట్లు వినును**
**యిలను మోహిదెల్ప ఎవ్వరి తరమయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లోకంలో పామును మించిన విషజంతువు లేదు. కాని అట్లాంటి దుష్టజీవిని కూడా మనిషి నాదస్వరం ఊది దారికి తెచ్చుకోవచ్చు. కాని ఈ చిత్త వైకల్యమున్న మూర్ఖుడున్నాడే ఇతన్ని సక్రమమార్గంలోకి తెచ్చుకోవడం అసాధ్యం అంటున్నాడు వేమన.

మోహి అంటే వంచకుడు. కాని ఇక్కడ మూర్ఖుడే. మోహం అంటే వలపు. మోహపరమైన అర్థం ఇక్కడ పొసగదు. ఇతడి మూర్ఖత్వం జీవితాలను నిలువునా నాశనం చేస్తుంది. ఇతని కన్న పామే నయం. అది చురుగ్గా చరిస్తుంది, క్రోధాన్ని ప్రదర్శిస్తుంది, మనిషిని చూసి పారిపోతుంది. పట్టుబడితే చెప్పినట్టు వింటుంది.

ఇక్కడ పాము అంటే నీటి పాములాంటి సాధారణమైన పాముకాదు. తాచుపాము. ఇది విషపూరితమైంది. కోడెతాచు అంటే ఇదే. పోర్చుగీస్ భాషలో కోబ్రా అంటారు. పాము విషాన్ని న్యూరోటాక్సిన్ (Neuro Toxin) అంటారు. ఇది కాటుతిన్న జీవి నాడీమండలం పై పనిచేసి చంపేస్తుంది.

పాపిష్టం అంటే ఎక్కువ పాపం చేసిన అని అర్థం. దాని పాపమల్లా విషమే, అది ప్రాణాంతకం కావటం వల్ల ఆ తిట్టు. ఒకరకంగా చూస్తే మూర్ఖుడే పాముకన్న ప్రమాదకారి. అతడు ఎప్పుడు ఏం చేస్తాడో అతనికే తెలియదు. పాము అకారణంగా ఎవరినీ కాటెయ్యదు. సహజంగానే చిన్న చిన్న జంతువుల్ని, పక్షుల్ని వేటాడి తినడం దాని అలవాటు. ఎవరైనా కాలితో తొక్కడమో, ఇతరత్రా హాని చేస్తారని భావించినప్పుడే అది పడగవిప్పుతుంది...

పాము నాదస్వరాన్ని బట్టి ఆడుతుందా? ఆడుతుందంటే ఆడుతుంది. కాని దాని సంగీతాన్ని విని కాదు. మనలాగ దానికి బయటి చెవులుండవు. కనపడని ఆంతర, మధ్య చెవులుంటాయి. అవి భూమికి ఆనుకున్నప్పుడే దాని ద్వారా వచ్చే శబ్దాలను వింటాయి. మరి నాదస్వరానికి అనుగుణంగా కదుల్తాయే? కదుల్తాయి గాని విని కాదు చూసి. చంపటానికి వచ్చాడనుకొని అతని విన్యాసాలకు అనుగుణంగా వ్యూహాత్మకంగా కదుల్తాయి.

పాము పగ అంటారు అది నిజమేనా? పూర్తిగా నిజం కాదు. పాము reptiles అనే

ఒక బల్లి జాతికి చెందిన జంతువు. దీనికి గ్రహణ గ్రాహిక (Jacobson organ) అని వుంటుంది. దాని కొంత జ్ఞాపక శక్తి వుంటుంది. కాని ప్రతీకారం తీర్చుకొనే వరకు మర్చిపోనంత ఉండదు. పాము వాసన ఆధారంగా ముందుకు సాగుతుంది. దాని వల్లనే పాము పగ రూఢికెక్కింది. కాని మూర్ఖుడు హాని చేస్తేనే కాదు మేలుచేసినా కీడుచేస్తాడు అని సారాంశం.

**పాలనీడిగింట గ్రోలుచు నుండెనా**
**మనుజులెల్ల గూడి మద్యమండ్రు**
**నిలువదగనిచోట నిలువ నిందలు వచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గవండ్లవాని పంచలో కూచొని పాలు తాగుతున్నా చూసేవారు కల్లు తాగుతున్నావనే అనుకుంటారు. అదేమిటి అది నిజం కాదుగదా? కాకపోవచ్చు. నువ్వు కూచున్న చోటు అలాంటిది. నిలువకూడని చోట నిలిస్తే అపవాదు తప్పదు అంటున్నాడు వేమన.

ఈడిగ అంటే కల్లుగీత కార్మికుడు. అంటే తాటిచెట్టెక్కి కల్లుగీసేవాడు. ఆయాప్రాంతాల్లో గౌండ్ల, గమళ్ల అని కూడా అంటారు. ఈడిగిల్లు అంటే ఇంటిలోపల అని కాదు ఇంటి చావిడి కావచ్చు. కల్లంగడి కావచ్చు. మద్యం అంటే ఇక్కడ సారాయికాదు, కల్లు. 'తాటిచెట్టుకింద కూచొని పాలుతాగుతున్నానన్నట్టు' అని సామెత.

ఏ పనికైనా స్థలశుద్ధి కూడా ముఖ్యమే. ఉండగూడని చోట ఉంటే నీలాపనిందలు వస్తాయి. నీలాపనిందలు అంటే ఆధారం లేని అపనిందలు, అకారణంగా వచ్చే నిందలు. కాని ఇక్కడ ఆధారం ఉంది. ఈడిగింట కూచొని పాలు తాగుతున్నానంటే ఎవరు నమ్ముతారు? వాడుకలో నీలాపనిందలు అయ్యిందిగాని నిజానికది నీరాపనిందలు. నిర్+అపనింద. నిర్ అంటే పూర్తిగా అనే అర్థాన్నిచ్చే నిపాతం. సూత్రానికి వ్యతిరేకంగా అన్యసూత్రంలో ప్రయోగించే శబ్ద రూపాన్ని నిపాతం అంటారు. ఇది అవ్యయం కూడా. అంటే వ్యాకరణంలో సాధారణ సూత్రాల ద్వారా నిర్వచించడానికి వీలుకాని శబ్దరూపాలను విశేష సూత్రాల ద్వారా నిర్వచించడమన్నమాట.

పల్లెటూరి జీవితం తెలిసినవారికి ఈ పద్యంలోని స్వారస్యం బోధపడుతుంది.

**పాలలోన పులుసు లీలతో కలిసిన**
**విరిగి తునక లగును విరివిగాను**
**తెలివి మనములోన దివ్యతత్వము తేట**
**విశ్వదాభిరామ వినురవేమ**

పాలలో చింతపులుసు కొంచెం కలిసినా ఆ పాలు విరిగిపోతాయి. అలాగే మనస్సులోని లౌకిక వ్యామోహం వల్ల అతీంద్రియ జ్ఞానం అడుగున చేరి పైన శుష్కమైన తేట మిగులుతుంది అంటున్నాడు వేమన.

పదార్థాలమధ్య రసాయనిక క్రియ పర్యవసానం లాంటిదే మనిషిలో దివ్య, అదివ్య తత్త్వాల కలయిక కూడా అని తాత్పర్యం. మనిషిలోని సద్గుణాలు జ్ఞానుల సంపర్కం వల్ల మరింత వికాసం చెందుతాయి. మరి దుస్సాంగత్యం వల్ల? అవి చెల్లాచెదురై పనికి రాకుండా పోతాయి అని సారాంశం.

పాలు–పాలంటే తెలియనిదెవరికి? అమ్మపాల రుచి ఎవరూ మరచిపోరు కదా. కాస్త శాస్త్ర భాషలో చెప్పాలంటే సంతాన పోషణకోసం ఆడ క్షీరదాలనుండి స్రవించే తెల్లనిద్రవం పాలు. దీనిలో బలవర్ధకమైన మాంసకృత్తులుంటాయి (ప్రొటీన్లు). మరి పులుసు? శాస్త్రభాషలో దీనిని టార్టారిక్ ఆమ్లం అంటారు. ఇది కలవగానే పాలలోని మాంసకృత్తులు విచ్ఛిన్నమైపోయి ముద్దగా మారి అడుగుకు వెళ్లిపోతాయి. పైన తేట పేరుకుంటుంది. పాలు పారదర్శకం కాదు. మాంసకృత్తులను కోల్పోయి అవి నీళ్లుగా మారుతాయి. పాలు ఎంత గొప్పవి! పాలవంటి మనసు అంటే నిష్కల్మషమైన అని. పాల్గారు మోము అంటే కాంతివంతమైనది అని. పులుసువల్ల ఇప్పుడదంతా పోయింది.

పులుసు అంటే పుల్లనిరసం, షడ్రుచుల్లో ఒకటి. లీలగా అంటే చూచాయగా, తెలిసీ తెలియనట్టుగా అని అర్థం. తునక అంటే ముక్క. ఎంత దేశీయమైన మాట వాడాడు వేమన! విరివిగా అంటే లోక సాధారణంగా అని. పులుసు కలవటం వల్ల పాలు సారవిహీనమై పోయాయి. పైరు పాలు తాగుతుంది అంటారు. అంటే ఏమిటి? కంకిలోని గింజ గట్టిపడక ముందు ఆ గింజలో ఏర్పడే సారాన్నే పాలు తాగడం అంటారు. విడిగా పులుసు మంచిదే కావొచ్చు కాని పాలలో కలిసి చెడ్డదైపోయింది అనేది ఇక్కడి భావం.

'తెలివి మనము కట్ట (అట్ల–ఆ విధంగా) .....(డి.1725, 579) అనేది పాఠాంతరం.

**పాలసాగరమున పవ్వళించిన సామి**
**గొల్లయిండ్ల పాలు గోరనేల?**
**ఎదుటివారి సొమ్ము ఎల్లవారికి తీపి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

సమాజంలోని అవకతవకల పట్ల వేమనకు ఎప్పుడూ కోపమేనా? అప్పుడప్పుడైనా నవ్వడా? ఎందుకు నవ్వడు, నవ్వడమే కాదు నవ్విస్తాడు కూడా. వేమనలోని సామాజిక వ్యంగ్యం కత్తిలా గాయపర్చదు, గోరులా గిల్లుతుంది అంతే! ఈ పద్యం అలాంటిదే.

పాల సముద్రంలో శేషతల్పంపైన పడుకున్న విష్ణువు ద్వాపరయుగం నాటి కృష్ణావతారంలో గొల్లవారి ఇళ్లల్లో పాలూ వెన్నెలకోసం ఎగబడ్డాడేమిటి? ఓ అదా! ఎదుటివారి సొమ్ముకదా అందుకే ఆ ఆశ అంటూ వేమన హాస్యవిలసనం.

విష్ణువు ఉండేదే పాల సముద్రమాయె *(పవళించటమంటే శయనించటమే కాదు, ఉండటం కూడా)* మరి ద్వాపరయుగంలోని కృష్ణావతారంలో బుద్ధిమారిందా? పురాణాల ప్రకారం యుగాలు నాలుగు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. ఈ యుగాలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. కృతలో ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందని. త్రేతలో మూడుపాదాలతో. ద్వాపరలో రెండుకాళ్లే. మరి కలి? కలి ఇంకా ప్రారంభం కాలేదని కొందరు. అయ్యిందని కొందరు. ఈ మధ్య వార్తల్లోకి ఎక్కుతున్న నకిలీ కల్క్యావతారులు ఏ కోవకు చెందుతారో! వీరభోగ వసంతరాయలు వచ్చాడా? బ్రహ్మంగారు కనిపిస్తే అడగాలి. కలియుగంలో ఏం జరుగుతుంది? పంచభూతాలు నశించిపోతాయి. అయితే కలి మొదలైనట్టే వుంది. మనవారి నిర్వాకానికి దాఖలాలు కనపడుతూనే వున్నాయి.

తీపి అంటే తియ్యదనమే కాదు. ఇష్టం, ప్రేమ, మనోజ్ఞత, కోరిక, అపేక్ష అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఇక్కడ కోరిక సరిపోతుంది.

ఒక పౌరాణిక సత్యాన్ని తీసుకొని 'పొరుగింటి పుల్లకూర రుచి' అనే సామెతను గుర్తుచేస్తూ అపారమైన పాలకడలి స్వాధీనంలో ఉన్నా ముంతెడు పాలకోసం కొంటె పనులు చేశాడే కృష్ణుడు!? అంటే దానికి వేమన తన సొమ్ము భద్రంగానే వుంది కదా, ఎదుటివారి సొమ్ము కాబట్టే ఆ మాత్రం అపేక్ష అంటూ హాస్యోక్తిని మెరిపిస్తున్నాడు.

**పాలు నీరు క్రమము పరగహంస యెరుంగు**
**నీరు పాలక్రమము నెమలికేల?**
**అజ్ఞుడైనవాడు అల శివునెరుగునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

హంస మాత్రమే పాలనూ పాలలోని నీటిని వేరుచేస్తుంది. హంసలాగే శ్రేష్ఠ పక్షి అయి కూడా నెమలి ఆ పని చేయ్యలేదు. అలాగే బ్రహ్మవిద్య తెలియని మూఢునికి పరమేశ్వర తత్త్వం తెలియదంటున్నాడు వేమన.

హంస పాలనూ నీటినీ వేరుచేస్తుందంటే పాలనుతాగి నీటిని విడిచిపెడ్తుందని అర్థం. యోగి కూడా అంతే పరమజ్ఞానాన్ని గ్రహించి ఇహాన్ని వదిలివేస్తాడు. అందుకే పరమహంస అంటారు కాబోలు. అసలు హంస అనే పక్షి ఉందా? లేదన్నాడు సురవరం ప్రతాపరెడ్డి. కాని ప్రపంచంలోని అన్ని సాహిత్యాల్లోనూ హంస ప్రసక్తి వుంది. అందమైన తెల్లని పక్షి, పొడుగు మెడగల బాతు జాతికి చెందిందంటారు. "పాలును నీరు వేరుపరపన్ కలశక్తి విధాతయిచ్చె" అని ప్రయోగం. హంసను గురించి భర్తృహరి ఓ చక్కని పద్యం చెప్పాడు వినండి. (ఏనుగు లక్ష్మణ కవి అనువాదం)

*"వనజభువుండు కోపమున వాహనమైన మరాళ భర్తకున్*
*వనజ వనీవిహారకలనంబు తొలంగగ చేయు గాని, గుం*
*ఫనమున దుఃఖ జీవన విభాగ విధాన నిరూఢనైపుణీ*
*జనిత మహాయశోవిభవసారము హంసకు మాన్పజాలునే"*

హంసకు గల దుఃఖాన్నీ జీవనాన్ని వేరుచేసే శక్తి బ్రహ్మకూడా తొలగించలేడు అంటున్నాడు భర్తృహరి. ఇక్కడ దుఃఖం అంటే పాలు, జీవనం అంటే నీరు.

పాలు ఒక గొప్ప సమగ్ర ఆహారం. దీనిలో మాంసకృత్తులు, చక్కెర పదార్థాలు, కొవ్వు, విటమిన్లు, ఖనిజాలు, కాల్షియం లాంటివి ఉంటాయి. పాలలోని నీటిలోంచి వీటిని వేరు చేయడం రసాయనిక శాస్త్ర విధానంలో సాధ్యమే. కోవామిఠాయి తయారీలో కూడా ఈ ప్రక్రియ వుంటుంది.

హంసకెన్ని గొప్ప గుణాలున్నాయి! ఇది లేకుంటే సాహిత్యమే కొల్లబోతుంది. అతిధావళ్యయుతమైన దివ్య పక్షి హంస. థేమ్స్ నదీతీరంలో హంసకూ హంసకూ మధ్య తేడాను గుర్తించడానికి సంవత్సరానికోసారి గుర్తులు వేసి వదల్తారట! హంసాంకనం

అన్నమాట. హంసగమన అంటే హంసలానడిచే వనిత. హంసను ఎక్కివచ్చే దాన్ని కూడా హంసగమన అంటారు. హంసగీతం అనేమాట విన్నారా? మరణించడానికి ముందు హంస పాడే చివరి పాటను హంస గీతం అంటారని ఒక నమ్మకం. ఇక హంసతూలికతల్పం సంగతి చెప్పనే అక్కరలేదు. మెత్తని హంస ఈకలు పెట్టికుట్టిన పరుపు. పడుకుంటే ఎంత బాగుంటుందో! అజ్ఞుడు అంటే అజ్ఞాని. వేమన కూడా జ్ఞానాన్నీ అజ్ఞానాన్నీ వేరుచేసే హంసలాంటివాడే, పరమహంస. పరమహింస అనేది పాఠాంతరం (డి.1721–157) కాని ఇక్కడ పొసగదు.

**పాలు పంచదార పాపరపండ్లలో**
**చాలబోసి వండ చవికిరావు**
**కుటిల మానవునకు గుణమేల కలుగురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వెర్రి పుచ్చకాయల్లో పాలూచక్కెర ఎంతపోసి మరిగించినా దాని స్వాభావికమైన చేదుపోదు. అంటే పాలూ చక్కెరల తీపి వాటికి రాదు. వక్రబుద్ధిగలవాడికీ అంతే! ఎన్ని సద్గుణాలు నూరిపోసినా అతనిలో కుత్సితత్వం నశించదు.

పాలు, పంచదారలు కలవటం వల్ల వెర్రిపుచ్చకాయల చేదుపోదు సరికదా ఆ చేదు వాటికే అంటుకుంటుంది. పాపరపండును వెర్రిపుచ్చకాయతోపాటు ఇంద్రాయణ ఫలమని కూడా అంటారు. వృక్షశాస్త్ర పరిభాషలో సింథస్ సిట్రులస్ అంటారు. వెర్రి పుచ్చకాయ చిన్నదోసకాయ పరిమాణంలో వుంటుంది. గుర్తుందా తెనాలి రామకృష్ణుని చాటుపద్యం? అల్లసాని పెద్దన 'అమావాస్య నిశి'ని 'అమవస నిసి' అని లఘువుల్లో చెప్పాడని ఆక్షేపిస్తూ ఓ పేరడీ పద్యం చెప్పాడు వినండి.

*"ఎమితిని సెపితివి కపితము*
*బ్రమపడి వెరిపుచ్చకయ వడిదిని సెపితో*
*ఉమెతఃకయ తినిసెపితో*
*అమవసనిసి అన్నమాట నలసనిపెదనా"*

వెర్రిపుచ్చకాయ తింటే పాండిత్యం వికటిస్తుందన్నమాట! వెర్రి పుచ్చకాయను ఆయుర్వేద వైద్యంలో వాడతారు.

చాలబోసి అంటే కొంచెం కాదు, ఎంత దండిగా పోసినా అని. చవి అంటే రుచి. ఇక్కడ తీపి అని. ఛాయలు కూడా ఉన్నాయి. చవిగాని మాటలు అంటే నచ్చని మాటలని. ఆమె చవి మరిగి అంటే ఆమె అందానికి అలవాటై అని.

కుటిలుడు అంటే దుష్టుడు, కపటి అని అర్థాలు. వంకరబుద్ధిగలవాడని. కుటిలం అంటే వంకర. అయితే ముంగురులకు కుటిలత్వం మంచిదే, అందుకే కుటిలాలకములు, కుటిలకుంతల అని ప్రాచీన కవులు ప్రయోగించారు.

దుష్టుడిని మంచివాణ్ని చేయడానికి ఎంత ప్రయత్నించినా అతడు దుష్టుడే అవుతాడు. సద్గుణాలు బోధించినా అంటవని సారాంశం.

**పాలు పెరుగు వెన్న పాయసాన్నము నెయ్యి**
**జున్ను నెన్నియైన చూడపాలు**
**పాలవంటి కులము బ్రహ్మంబు గానరో!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పాలు, పెరుగు, వెన్న అంటూ పేర్లలో తేడాలున్నా, ఆయా పదార్థ ధర్మాల్లో భేదం ఏర్పడ్డా వాటి మూల వస్తువు మాత్రం ఒక్కటే. అదే పాలు. అట్లాగే వివిధ రూపాల్లో దర్శించినా, అభిరుచులను బట్టి సాధన చేసినా మౌలికతత్త్వం ఒక్కటే. అదే బ్రహ్మం అంటూ ఎంత హాయిగా చెప్తున్నాడో చూడండి వేమన!

పాలంటే తెలియనిదెవరికి? మనుషులకైనా జంతువులకైనా స్తన్యంగా వచ్చేది. సృష్టిలో దీనంత గొప్ప పదార్థం మరిలేదు. పెరుగు కూడా తెలిసిందే. పాలు తోడుకొని గట్టిపడే పదార్థం పెరుగు. ఇక వెన్న పెరుగును చిలికి తీసే తెల్లని మెత్తని ముద్ద. వెన్నపూస అనికూడా అంటారు. కృష్ణుడు రేపల్లెలో వెన్నముద్దలు దొంగిలించేవాడు. నెయ్యి అంటే వెన్నను కాచగా వచ్చే పదార్థం. పాయసం అంటే పరమాన్నం. క్షీరసంబంధమైనది. తెలంగాణాలో పాశం అంటారు. జున్ను అంటే ఆవు, గేదె మొదలైనవి ఈనిన తరువాత రెండు మూడు రోజుల్లో పితికిన పాలు కాస్తే వచ్చిన గడ్డ.

పాలు ఎంత గొప్పవి! రూపాలు మార్చుకుంటాయి. పేర్లు మార్చుకుంటాయి. ధర్మాలు మారతాయి. అయినా మౌలికంగా పాలే. పాలు బలవర్ధకమైన ఆహారం. వాటిలో మాంసకృత్తులు, కాల్షియం, విటమిన్లు, గ్లూకోజు వెంటనే లభిస్తాయి. నీళ్ల సంగతి చెప్పనక్కరలేదు. తోడుపెట్టడం వల్ల అదనపు పదార్థలతో పెరుగు తయారౌతుంది. వెన్నలో ఇతర పదార్థాలతోపాటు కొవ్వు శాతం ఎక్కువ. నెయ్యిని కాచినప్పుడు కొన్ని పోషక పదార్థాలు పోతాయి గాని ఇది పూర్తిగా కొవ్వు పదార్థం, ప్రసవించిన తల్లిపాలలో కొలస్ట్రం వుంటుంది. అది చాలా మంచిది. ఆ పాలను గడ్డకట్టిస్తే జున్ను తయారవుతుంది. వీటన్నింటిలో ఇతర గుణాలతోపాటు ప్రాథమికంగా క్షీరత్వమే వుండటం విశేషం.

అట్లాగే మనుషుల రూపాలు వేరయినా, స్వభావాలు వేరయినా, సాధకుల లభిరుచులను బట్టి దర్శనాలు వేరయినా అవన్నీ ఒకే మూలతత్త్వంలోని భాగాలే అంటున్నాడు వేమన. దానిపేరే బ్రహ్మం. కులం అంటే వంశం, జాతితో పాటు దేహం అని కూడా అర్థముంది. ఇక్కడ దేహమే. దేహానికి కూడా పాలకున్నంత వైవిధ్యం ఉంది అని తాత్పర్యం. రోజూ కనిపించే వస్తువుల ఆధారంగా వేమన ఎంతటి తత్త్వమైనా పిండగలడనడానికి ఈ పద్యం ఒక తార్కాణం. 'పాయసంబును చల్ల' (డి.1723, 917) అనేది పాఠాంతరం.

**పిండములను జేసి పితరుల దలపోసి**
**కాకులకును బెట్టు గాడ్దెలార!**
**పియ్యిదినెడి కాకి పితరుడెట్లాయెరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చనిపోయిన పితృదేవతలకోసం అన్నపుముద్దలు చేసి వారిపేరు మీద కాకులకు పెడ్తారు గదా! మరి అశుద్ధం తినేకాకి నీతండ్రి ఎలా అవుతుందో చెప్పు అని మూఢాచార సంపన్నుల్ని గద్దిస్తున్నాడు వేమన.

మామూలుగా పిండం అంటే తల్లిగర్భంలో ఇంకా పూర్ణరూపం ఏర్పడని శిశువు. 'ఈ గండం గడిచి పిండం బయటపడితే చాలు' అంటే ఈ అర్థమే. 'వాడు ఉద్దండ పిండం' అంటే వీరాధివీరుడని. ఈ పద్యంలోని అర్థాలివికావు. 'నాకు పిండం లేక చస్తున్నాను' అంటే అన్నంముద్దయినా లేక బాధపడ్తున్నాను అనే అర్థం ఇక్కడ సరిపోతుంది. పిండం అంటే గోళం, గుండ్రని వస్తువు అని అర్థాలు. ఇక్కడ అన్నం ముద్ద.

స్మశానంలో పిండాలను పెట్టి పితృదేవతలను స్మరిస్తే వారు కాకుల రూపంలో వచ్చి తింటారని నమ్మకం. ఇక్కడే వేమనకు మండిపోయింది. తల్లిదండ్రులు బతికి ఉన్నప్పుడు నువ్వు వారి బరువు బాధ్యతలను మొయ్యలేదు. ఇప్పుడేమో శ్రద్ధగా పిండాకూడు పెడుతున్నావు. బతికి ఉన్నప్పుడు కనీసం వారికి కూడు కూడా పడెయ్యలేదు. ఇప్పుడేమో వారి పేరుమీద పెంట దినే కాకులకు అన్నం వేస్తున్నావు. ఇదేం పద్ధతి? అటువంటివారిని గాడ్దెలార అని తిడుతున్నాడు వేమన. 'గాడ్దెలార' ఎందుకు? 'కుక్కలార' అని అనొచ్చుగా. ఇంతకు ముందు తల్లిదండ్రుల బరువు మొయ్యని గాడిదలు. ఇప్పుడేమో మూడనమ్మకాల బరువు మోస్తున్న గాడిదలు అని అంతరార్థం. వేమన కోపమెక్కడంటే తల్లిదండ్రులు బతికి ఉన్నప్పుడు చెయ్యవలసిన పనులు చచ్చాక చేస్తున్నారని. ఆయనే మరో పద్యంలో ఇలా అన్నాడు.

*"జీవిపోకముందె జీవ వస్తువులిచ్చి*
*జీవి నిలుప వలయు జీవనముగ*
*జీవి తొలగు వెనుక జీవ వస్తువు లేల?"*

ఉమ్మడి కుటుంబం భగ్నమై పోతున్న నేటికాలంలో తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారు. ఇది మంచిది కాదు, ఒకరకంగా ఇదే మంచిది అని రెండు రకాల వాదాలు పొడసూపుతున్న సంధిదశలో మనమున్నాం. పాపం! తల్లిదండ్రులు.

**పికము వనములోన విలసిల్ల పలికిన**
**భంగి ప్రాజ్ఞజనుల పలుకుగులుకు**
**కాకి కూతబోలు కర్మబద్ధుల కూత**
**విశ్వదాభిరామ వినురవేమ.**

బుద్ధిమంతుల మాటలు తోటలోని కోకిల స్వరం లాగ మనోహరంగా ఉంటాయి. కాని అల్పబుద్ధుల మాటలు అట్లాకాదు. కాకి కూతల్లా కర్ణకఠోరంగా ఉంటాయంటున్నాడు వేమన.

ప్రాజ్ఞుడు అంటే పండితుడు. అతడు కర్మదూరుడు. అంటే కర్మల్లో చిక్కుపడనివాడు. కోకిల లాగ మధురంగా మాట్లాడుతాడు. రెండోవాడు కర్మబద్ధుడు. కర్మలు కాయక, వాచక, మానసిక అని మూడురకాలుగా ఉంటాయి. విహితకర్మలను అంటే విధించబడిన కర్మలను ఆచరించేవాడు బుద్ధిమంతుడు. ఇతడలా కాదు నిషేధ కర్మల్లో చిక్కుకపోయినవాడు. కాబట్టి ఇతని వాక్యాలు శ్రుతి కఠినమే కాకుండా నిరాదరణకు కూడా గురి అవుతాయి.

రెండు రకాల వ్యక్తులను తీసుకొని వేమన కోకిల, కాకులతో పోలుస్తున్నాడు. కోకిల ఎక్కడో దూరంగా అడవిలో ఉన్నా దాని పలుకు చెవులకు ఇంపుగా ఉండి ఆనందాన్ని కలిగిస్తుంది. కాకి మన ఇళ్లముందే తచ్చాడుతున్నా దాని కూత శ్రుతికర్కశంగా ఉండి ఇష్టమనిపించదు.

**పిసినివాని యింట పీనుగు వెడలిన**
**కట్టెకోలలకును కాసులిచ్చి**
**వెచ్చమాయెననుచు వెక్కి వెక్కేడ్చురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏ ఇంట్లోనైనా చనిపోయిన వారికోసం అందరూ ఏడుస్తారు. అంత్యక్రియల కోసం డబ్బు ఖర్చుచేసిన లోభికూడా ఏడుస్తాడు. పాపం! అతడు కూడా దుఃఖిస్తున్నాడన్నమాట! కాదు కాదు అతడు దుఃఖించేది చచ్చిన వారి మీద ప్రేమతో కాదు. చచ్చినందుకు బాధతోనూ కాదు. దహనానికి కట్టెలకు డబ్బు ఖర్చయ్యిందని మొత్తుకుంటున్నాడు. పిసినారుల జాబితాలో వీడు పరాకాష్ట. వేమన హాస్యచాతురికి ఈ పద్యం ఒక నిదర్శనం.

పిసినివాడు అంటే పిసినారి. పీనుగ అంటే శవం, ప్రాణం పోయిన బొంది. కోల అంటె కర్ర, బెత్తం, పుల్ల, ఇనుపసలాక అని అర్థాలు. కట్టెలకే కాదు కోలలకు కూడా ఖర్చయ్యిందని బాధ. వెచ్చం అంటే ఖర్చు. ఇక్కడయితే అంగడిలో తెచ్చుకునే చిల్లర సరుకుల అప్పు. *'అంగడి వెచ్చము లాడకు/వెంగలితో* చెలిమి వలదు వినరా సుమతీ' అని ప్రయోగం. ఇక్కడ ఖర్చుచెయ్యకు అనడం కంటె అప్పు చెయ్యకు అనేదే సరిపోతుంది.

**ప్రియము లేని విందు పిండి వంటల చేటు**
**భక్తి లేని పూజ పత్రిచేటు**
**పాత్ర మెరుగనీవి బంగారు చేటు రా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ప్రేమ లేకుండా పెట్టిన భోజనంలో ఎన్ని పిండివంటలు పెట్టినా అవి వ్యర్థమే. భక్తి విశ్వాసాలు లేకుండా ఎంత పత్రపూజ చేసినా ఆ పూజకు ఉపయోగించిన ఆకులన్నీ నిరర్థకం. ఎదుటివాడి యోగ్యతను గమనించకుండా ఇచ్చే కానుకల్లోని బంగారం వృథా! వృథా!! అంటున్నాడు వేమన.

ఏదో మతలబు కోసం కాదు, నిర్వ్యాజంగా ఇష్టంతో పెట్టాలి. అట్లా కానప్పుడు ఎంతటిరుచికరమైన పిండి పదార్థాలైనా ఒంటికి పట్టవు. ఇష్టంతో పెట్టినప్పుడే తినేవాడు సంతోషంగా తింటాడు. కంటికి ఇంపుసరే మనసుకు ఇంపు అయినప్పుడే కడుపునకు ఇంపు అవుతుంది. అతిథికి సంతృప్తి కలిగితే ఆతిథ్యానికి సార్థకత. పత్రి అంటే పూజలో ఉపయోగించే ఆకులు. శైవులు ఎక్కువగా పత్రిపూజ చేస్తారు. చేస్తారుగాని భక్తీ శ్రద్ధా లేనప్పుడు ఆ ఆకులు ఒట్టి ప్రదర్శనగా మిగిలిపోతాయి. పాత్ర అంటే పాత్రత, అర్హత. నీ బహుమతులకు ఎదుటివాడు తగినవాడై వుండాలి. కళింగాంధ్ర ప్రాంతాల్లో కొందరిపేర్లకు చివర పాత్రుడు అనే మాట వస్తుంది. భోగన్న పాత్రడు, వీరన్న పాత్రుడు, అయ్యన్నపాత్రుడు ఇలా. యోగ్యతా వాచకమన్నమాట! పాత్రతకు యోగ్యమైనవాడే కాదు, పాత్రతను గుర్తించేవాడు కూడా పాత్రుడే. ప్రాప్తిలేని యీవి బంగారు చేటురా (డి.1773, 150); పరగ పూజ కంటె భక్తియే ఫలమురా (డి.1725-431) అనేవి పాఠాంతరాలు.

**పుట్టు దుఃఖముననుు, పొరలు దుఃఖముననుు**
**గిట్టు దుఃఖముననుు, క్రిందజనును**
**మనుజ దుఃఖమువలె మరిలేదు దుఃఖంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనిషి దుఃఖంతో పుడతాడు. దుఃఖంతో జీవిస్తాడు. దుఃఖంతో మరణిస్తాడు. దుఃఖ వాతావరణంలోనే సమాధిలోకి వెళ్లిపోతాడు. ఈ మనుషుల దుఃఖం ఉందే ఇది మరే జీవికి ఉండదు అంటున్నాడు వేమన.

జీవితం దుఃఖభాజనమైనదని వేదాంతులు చెప్తారు. సకల దుఃఖములకు మూలకారణం కోరిక అన్నాడు బుద్ధుడు. సాంఖ్యదర్శనంలో మూడు రకాల దుఃఖాల గురించి చెప్పారు. 1.ఆధ్యాత్మిక దుఃఖం, 2.ఆధిభౌతిక దుఃఖం. 3.ఆధి దైవిక దుఃఖం. మొదటిది శారీరక అనారోగ్యం, మానసికంగా వియోగం వల్ల కలిగేది. తన ప్రమేయం లేకుండా ఇతరుల వల్ల కలిగేది రెండోది. పాముకాటు, దొంగలు పడటం లాంటివి. మూడోది శీతోష్ణ ప్రకోపాలు, గాలివానలు, పిడుగుపాటు వల్ల కలిగేది.

అసలు దుఃఖం అంటే ఏమిటి? దీనియందు ఇంద్రియాలు దుష్టమౌతాయి కాబట్టి అది దుఃఖం అన్నారు. దుష్టంగా ఖేదపెడ్తుంది కాబట్టి దుఃఖం అని మరో అర్థం. దుఃఖమంటే తీవ్రమైన బాధ.

దుఃఖానికి తొమ్మిది రకాల ఛాయలున్నాయి. 1.పీడ, 2.బాధ. బాధ అంటే కలియబెట్టడం వల్ల కలిగేది. 3. వ్యథ. వ్యథ అంటే భయపెట్టేది. 4. దుఃఖం సరే, 5. ఆమనస్యం. మనస్సునందు ఒప్పేది మానస్యం. దానికి విరుద్ధమైంది అంటే ఒప్పనిది ఆమనస్యం. మనస్సుకు సుఖంగా ఉండనిదన్నమాట! 6. ప్రసూతిజం. స్త్రీలకు కాన్పువల్ల కలిగే బాధ. 7.కృచ్ఛ్రం అంటే ఛేదించేది. 8. కష్టం అంటే హింసింపజేసేది. 9. అభీలం అంటే అంతటా భయాన్ని కలిగించేది.

శోకం అనేది చిన్నది. దుఃఖానికి శోకం ఒక వ్యక్తీకరణ. దుఃఖం పెద్దది. అది శారీరకం. మానసికంగా కూడా హింసపెడుతుంది.

దుఃఖానికి నివారణలు, ఉపశమనాలుంటాయి గాని శాశ్వతంగా దుఃఖం పొయ్యేది కాదు. జీవిత పరిణామంలోనే ప్రతి మలుపులో దుఃఖముంటుంది.

మనిషి పూర్తి దుఃఖాన్ని తట్టుకోలేడు. అలాగే సుఖాన్ని కూడా. అందుకే సుఖదుఃఖాలను సమంగా స్వీకరించాలని సూచన.

మనుషుల దుఃఖం లాంటిది లేదు అంటున్నాడు వేమన. పశుపక్ష్యాదులకు సహజాతాలు ఉన్నాయి కాని మానవ దుఃఖంలాంటిది వాటికి లేదు. అని వేమన్న ఉవాచ.

**పుట్టు బిత్తలి వలె పోవు బిత్తలి వలె**
**తిరుగు బిత్తలి వలె దేహి ధరణి**
**ఉన్ననాటికైన ఉపకారి కాలేడు**
**విశ్వదాభి రామ వినురవేమ.**

మనిషికి పుట్టేటప్పుడు బట్టలు లేవు, చనిపోయినప్పుడూ అంతే. బతికి ఉన్నప్పుడు తీస్తే పొయ్యేవే కాబట్టి ఉన్నాలేనట్టే. బతికి ఉన్నప్పుడు వేషధారణ లెక్కకురాదు. అతడు చేసిన మేలు కీర్లే మిగుల్తాయంటున్నాడు వేమన. కాబట్టి నలుగురికి మేలు చెయ్యాలనే ఉద్దేశం ఉంటేనే అతడు ఉపకారి అవుతాడు, లేకపోతే కాలేడు అని తాత్పర్యం.

బిత్తల అంటే దిసమొల. 'అత్తరి బిత్తలై' అని ప్రయోగం. బిత్తలి (బిత్తల+ఇ) అంటే దిగంబరుడు. దిక్కులే అంబరముగా అంటే వస్త్రంగా గలవాడు. అంటే ఏమీ ధరించని వాడని. బ్రౌన్ గాలిని వేషంగా ధరించినవాడు అని అర్థమిచ్చాడు (having air as a robe) గాలి అంటే శూన్యమని. తెలంగాణాలో బత్తల అంటారు. బరిబత్తల అని కూడ. బరి అన్నా నగ్నత్వమే, నొక్కి చెప్పడం కోసం. దిగంబరానికి ఆచ్ఛాదన లేకపోవడమేకాక చీకటి అనే అర్థం కూడా వుంది. దేహి అంటే దేహం కలవాడు, జీవుడు. ఉపకారం అంటే మేలు. 'ఉప' అనేది సమాసపూర్వంగా ఉండి అర్థాలను మారుస్తుంటుంది.

దేహం అంటే వృద్ధినొందింపబడినది అని అర్థం (దిహ ఉపచయే ధాతు నిష్పన్నమ్) దేహదృష్టితో ఉండకు, అవయవాలతో కూడిన దేహానికి ప్రాధాన్యమిస్తూ ఇతరుల శ్రేయస్సును మరిచిపోవద్దు అని సారాంశం. లౌకికులకు దేహబుద్ధి వుంటుంది. దేహబుద్ధి అంటే దేహం పట్ల అమితాసక్తిని కలిగి వుండడం. యోగులకు కూడ దేహబుద్ధి వుంటుంది. కాని ఇక్కడ అర్థం దేహాన్నే ఆత్మగా భావించడం.

వస్త్రాలు స్వతహాగా వచ్చినవి కాదు. సమాజం కోసం, సభ్యత కోసం మధ్యలో వచ్చినవి. యోగులకు దేహస్పృహ వుండదు. అంతెందుకు సాక్షాత్తు శివుడే దిగంబరుడు. ఒక తెగ బౌద్ధులూ దిగంబరులే. జైనుల సంగతి తెలిసిందే. త్రైలింగస్వామి అనే తెలుగు యోగి కాశీలో వుండేవాడు. ఆయనా దిగంబరుడే 287 సంవత్సరాలు జీవించాడట. ఈయనను సహజ సన్యాసి అనేవారు. రమణ మహర్షి ఆమాత్రం కౌపీనం కూడా లోకం కోసమే ఉంచుకున్నాడు.

దేహాన్ని భోగసాధనంగా భావించడం మానేసి తాత్విక దృష్టిని అలవరచుకొని నలుగురికి మేలు చెయ్యాలని వేమన్న ఉవాచ. 'తేరబిత్తలి తను తెలియలేక (డి.1723, 207); తిరుగచిత్తరించి దేహిధరణి (డి.1724, 176) అనేవి పాఠాంతరాలు.

**పుత్తడి గలవాని పృష్ఠంబు పుండైతె**
**వసుధలోన చాల వార్తకెక్కు**
**పేదవాని యింట పెండ్లైన నెరుగరు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

డబ్బున్నవాడి పిర్రకు పుండయినా లోకంలో అదో పెద్దవార్తగా గణనకెక్కుతుంది. అదే పేదవాడి ఇంటిలో పెండ్లిలాంటి పెద్ద శుభకార్యమైనా పక్కవీధి వాడు కూడా పట్టించుకోడు. ఇదండీ లోకరీతి! ద్వంద్వ విలువలంటే ఇవే అని నివ్వెరపోతున్నాడు వేమన.

పుత్తడి అంటే బంగారం. పసిడి నాణాలు గల సంపన్నుడతడు. పృష్ఠం అంటే దేహానికి వెనకపక్క అని అర్థం. వీపు, వెన్నుభాగం కూడా. పుస్తకంలోని పుటను కూడా పృష్ఠం అంటారు. పృష్ఠభూమి అంటే నేపథ్యం. కాని ఇక్కడ దేహసంబంధమే. పిర్రలాంటి రహస్య ప్రదేశంలో పుండయినా ఆ వృత్తాంతానికి బోలెడంత దండోరా. ఎందుకు? ధనవంతుడు కదా అందుకు!

వసుధ అంటే భూమి, నేల. వసు అంటే సంపద. వసును ధరించేది వసుధ. వసుంధర కూడా అంతే. ఈ రెండు మాటల్లోని 'ధ'కు ధరించటమనే అర్థం. ఇక్కడ వేమన వసుధ అని ఎందుకంటున్నాడు? ధరణి అనొచ్చుగా. సంపన్నుడికి సంబంధించిన స్వల్పకారణమైనా ధనమండలిలో అదో పెద్ద సమాచారం. ఇటువంటిదానిని సాభిప్రాయ ప్రయోగమంటారు. అంటే ఉద్దేశపూర్వకంగా చేసేది. దీనివల్ల అర్థస్వారస్యం పెరుగుతుంది.

వార్తకెక్కు అంటే ప్రసిద్ధికెక్కు అని. వార్త అంటే నీతి, లోకోక్తి, ప్రసిద్ధి, ఉనికి, వృత్తాంతం, కృషి, సమాచారం, సేద్యం, జీవిక అని అర్థాలు. వార్తకాడు అంటే మాటకారి, వార్తలాడు అంటే ముచ్చటించడం, నీలివార్త అంటే అసత్య సమాచారమని. వర్తమాన సంబంధమైనది వార్త. అంటే న్యూస్ అనే. "వార్తయందు జగము వర్తిల్లుచున్నది' అని నన్నయ భారతంలో సమాచారార్థమే. "గువ్వకొరకు మేను గోసిచ్చి శిబిరాజు/వార్త కెక్కి చాల వన్నెకెక్కె" అన్నాడు వేమనే మరోచోట. ఇక్కడా పై అర్థమే. 'వార్తకొలది గాని వరమీడు దైవంబు' అనే మరో వేమన పద్యంలో మాత్రం కృషి అనే అర్థంలో కనిపిస్తుంది.

ఎవరైనా సరే డబ్బున్నవాడి చుట్టుకప్పల్లాగ, ఈగల్లాగ మూగుతారు. సానుభూతి వర్షం కురిపిస్తారు. ఏ చిన్న రోగమొచ్చినా ఘనత వహించిన వైద్యులు దిగుతారు. పేదవాడి ఇంటిలో పెండ్లే కాదు చావు కూడా లెక్కకు రాదంటున్నాడు వేమన.

**పురహరునకు నేత పురువు తానేసిన**
**స్థిరము గల్గు జ్ఞాన జీవమయ్యె**
**నేతకేమి వచ్చె నిజశక్తి హేతువు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కాళహస్తిలో శివుడికి వస్త్రం నేయటం వల్ల మామూలు సాలె పురుగు కూడా చక్కని జ్ఞానజీవిగా రూపొందింది. ఇది దాని నేతనైపుణ్యం వల్ల అనుకునేరు. అది సరే గాని దానికి అసలైన కారణం దాని అచంచల భక్తి అని గ్రహించమంటున్నాడు వేమన.

శ్రీ కాళహస్త్రీశ్వర శతకంలో ఈ పద్యం గుర్తుందా వినండి.

*"ఏ వేదంబు పఠించెలూత భుజగంబే శాస్త్రముల్ చూచె తా*
*నే విద్యాభ్యసనం బొనర్చెకరి చెంచే మంత్ర మూహించె బో*
*ధావిర్భావ నిదానముల్ చదువులయ్యాకావు నీ పూజ సం*
*సేవాసక్తియె గాని జంతుతతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా!"*

శ్రీ అంటే సాలెపురుగు, కాళ అంటే త్రాచుపాము, హస్తి–ఏనుగుకు ముక్తినిచ్చినవాడా శ్రీ కాళహస్తీశ్వడా! అంతే కాదు చెంచు అయిన కన్నప్పకు కూడా.

దీని కథేమిటంటే విశ్వకర్మ కుమారుడైన ఊర్ణనాభుడు అనేవాడు సృష్టికి ప్రతిసృష్టి చేస్తానని విర్రవీగుతాడు. బ్రహ్మకు కోపమొచ్చి నువ్వు పురుగుగా మారి భూలోకంలోని గజారణ్యంలో బిల్వవృక్షాలపై సంచరింతువుగాక అని శపిస్తాడు. సాలెపురుగు రూపంలో ఉన్న అతడు తన బొడ్డులోంచి వచ్చే దారంతో అక్కడే శివలింగానికి గుడిగోపురాలు సిద్ధంచేస్తుంటాడు. చేస్తుంటాడు గాని అవి గాలికెగిరి పోతుంటాయి. అయినా విసుగుచెందక మళ్లీ మళ్లీ నిర్మిస్తాడు. శివుడు అతడి భక్తిని పరీక్షించదలచి ఆ దారం గూడును దీపంతో కాల్చేస్తాడు. ఊర్ణనాభుడు ఆ దీపాన్నే మింగబోతాడు. శివుడు అతని భక్తికి మెచ్చి అతనికి సాయుజ్యాన్ని ప్రసాదిస్తాడు. సాయుజ్యమంటే పెద్దది. సాలోక్యం, సామీప్యం, సారూప్యం, చివరిది సాయుజ్యం. సాయుజ్యమంటే శివుడిలో ఐక్యం చెందడం.

పురహరుడు అంటే త్రిపురాంతకుడు. మూడు పట్టణాలు ధ్వంసం చేసినవాడు. శివుడే. కర్నూలు జిల్లాలో త్రిపురాంతకాలయం వుంది. నేత పురువు అంటే 8కాళ్ల సాలెపురుగు. దీనిలోంచి వచ్చే జిగట పదార్థం దారంగా మారి దాని చుట్టూ గూడు అల్లుకుంటుంది. సాలెగూడు అంటారు దీన్ని. గూట్లో చిక్కిన కీటకాల్ని తిని బతుకుతుంది. ఒకనాటికి

కదలలేక దాని గూట్లో అదే చిక్కుకుని మరణిస్తుంది. దీని నేత నైపుణ్యం గురించి గుర్రం జాషువా అద్భుతమైన పద్యాలు రాశాడు. వేమన్న ఏమంటున్నాడంటే దాని నేత కంటె దాని స్థిరమైన భక్తి హేతువు వల్లనే దానికి మోక్షం లభించిందని. ఒక పురుగు శివున్ని నమ్ముకోవడం వల్ల జ్ఞానజీవిగా రూపాంతరం చెందిందంటున్నాడు వేమన.

"స్థిరముగల్గు జ్ఞాన దీపమయ్యె (డి.1721–150) అనేది పాఠాంతరం.

**పురుషుడెన్ని గతుల పుట్టింది మొదలుగ**
**పాపచింత జేయు పామరమున**
**మదిని కుంటి కుక్క మాంసము దిన్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మానవుడు ఎన్నిసార్లు పునర్జన్మించినా పుట్టినప్పటినుంచి పాపపుటాలోచనలే చేస్తాడేమి? ఇది మూర్ఖత్వం కాదా? ఇదెట్లా వుంటుందంటే లేవలేని కుంటి కుక్క కూడా మాంసం తింటున్నట్టుగా ఊహించుకుంటుంది అంటున్నాడు వేమన.

పురుషుడంటే సాధారణార్థంలో మగవాడు. ఇక్కడ మనుష్యుడు. పరమాత్మ కూడా పురుషుడే, కాదు పురుషోత్తముడు.

'పుట్టింది మొదలుగ' అంటున్నాడు వేమన. ఇది శుద్ధమైన గ్రామ్యపదం. పుట్టుక అనే మాట గురించి రాస్తూ బ్రౌన్ ఇది గ్రాంథిక' పదం అన్నాడు. గ్రాంథికం అనే మాట అప్పటికే వుంది. కాని బ్రౌన్ అర్థం వేరు. ఆయన దృష్టిలో గ్రాంథికం అంటే Poetical అని. పుట్టింది మొదలుగా అంటే పుట్టిన మరుక్షణం నుంచి అని.

పాపం అంటే ధర్మాన్ని అతిక్రమించిన పని. అధర్మకృత్యమన్నమాట! పాపపు పనులవల్ల జనం తమను తాము తాత్కాలికంగా రక్షించుకోవచ్చు గాని చివరన ఆ పాపం శిక్షించక మానదు. పాపం చెయ్యడానికి చేతగాని స్థితిలో కూడ పాపం చెయ్యాలనుకుంటాడు. ఎవడు. ఇంకెవడు? పామరుడు. పామరుడంటే తెలివి లేనివాడు, దుష్టుడు, నీచుడు. పామరుడంటే మమకారం వదులుకోలేనివాడు. "దాని మీది పామరము వాడికి ఇంకా వదలలేదు" అంటారు. అంటే ఆ స్త్రీ మీది వ్యామోహం అని అర్థం. పద్యంలో ఈ అర్థమే ఎక్కువగా పొసగుతుంది. కుక్కను చూడండి. దానికి కాలు విరిగింది. లేచి తిరగడం కష్టం. చిన్న జంతువులను కూడా వేటాడలేదు. అయినా అలవాటయిన మాంసాహారం పైనే దాని మనసంతా. మదిని అంటే ఆలోచనల్లో అని. మాంసం దొరకకున్నా తింటున్నట్టు ఊహించుకుంటుంది. అసలా ఆలోచనే మానొచ్చుగా. మానదు. పాపపుచింత కూడా అలాంటిదే అంటున్నాడు వేమన. పాపమెల్లచెందు పాటిగాక (డి.1723, 159) అనేది పాఠాంతరం.

**పురుషుడెరుగజంపు భూపతి వినచేటు**
**అఖిల నిందకెల్ల నాలయంబు**
**పరపురుష గమనము ప్రత్యక్ష నరకము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వైయక్తికంగా సామాజికంగా ఇది ఆసక్తికరమైన పద్యం. మూడున్నర శతాబ్దాల నాటి ఈ పద్యాన్ని, మారుతున్న సామాజిక విలువల నేపథ్యంలో వివరించడం కొంచెం కష్టమే. అయినా ప్రయత్నిద్దాం.

ఒక స్త్రీ పరాయి మగవాడితో సంబంధం పెట్టుకుంటే భర్తకు తెలిస్తే చంపేస్తాడు. రాజుకు తెలిస్తే శిక్షిస్తాడు. జీవితం అన్నిరకాల అపవాదులకు ఆలవాలమౌతుంది. కాబట్టి అతిక్రమణ సంబంధం ఈ లోకంలోనే నరకాన్ని చవిచూపిస్తుంది జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నాడు వేమన.

పురుషుడు అంటే ఇక్కడ భర్త. భార్య ప్రవర్తన వల్ల కుటుంబపరంగా అగౌరవం రావడంతో పాటు అతడు వ్యక్తిగతంగా కోపంతో ద్వేషంతో రగిలిపోతాడు. రాజుకు చంపే అధికారం ఉండదు గాని శిక్షించే అవకాశముంది. అంతే కాకుండా లోకనిందవల్ల బతుకు నరకసదృశమౌతుంది. 'ప్రత్యక్షనరకం' అంటే చనిపోయి ఎప్పుడో ప్రాప్తించే రౌరవాది నరకాల సంగతి తరువాత, ముందు ఇక్కడే బతికున్నప్పుడే అమిత బాధను పొందవలసి వస్తుంది.

ఇది వరకే వేమనకు పురుష పక్షపాతి అనే ముద్ర కొంత పడింది. కాని ఈ పద్యానికి పూర్తి విరుద్ధమైన పాఠాంతరం కనిపిస్తుంది. "పరసతిని గవయుట" (డి.1773-30) అని. మూడోపాదంలో మొదటి భాగంగా, ఉన్న ఈ పాఠం పురుషపరంగా ఉంది. 'నాతిచరామి' అన్న పెళ్ళినాటి ప్రమాణానికి పురుషుడు కట్టుబడి ఉంటే అనేక అనర్థాలకు అడ్డుకట్ట వెయ్యవచ్చు.

వ్యభిచార దోషం అనేది స్త్రీకైనా పురుషుడికైనా సమానమే కదా! కవయుట అంటే కూడుట, రమించుట అని అర్థాలు.

బ్రౌన్‌ది మరీ విడ్డూరం! ఆయనకీ పద్యం స్త్రీ మనోగతంగా అర్థమైంది. చూడండి! "If my husband knows it, he will kill me; If the king hears it, it will be terrible" అని అర్థమిచ్చాడు.

ఏది ఏమైనా చంపడం, శిక్షించడం అనేవి ఆటవిక పద్ధతి. బయటి ప్రపంచం వెర్రితలలు వేస్తున్నప్పుడు కుటుంబం ప్రమాదంలో పడుతుంది. ప్రేమ అనేది భార్యాభర్తలిద్దరికీ సమానమైనప్పుడు వారిని ఏ శక్తీ ఏమీ చేయలేదు. "ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును – ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును" అన్నాడు వేమనంతటివాడైన గురజాడ. కాలానికీ కాలానికీ సామాజిక కెరటాలు మారొచ్చుగాని మౌలికమైన మానవీయ మూల్యాలు అట్లాగే వుంటాయి.

**పుస్తకములు, చదలు, పులితోలు, బెత్తంబు**
**కక్షపాలలు పదిలక్షలైన**
**మోతచేటుగాని మోక్షంబు లేదయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'చిత్తశుద్ధిలేని శివపూజలేలరా' అన్నాడు వేమన్నే ఓ పద్యంలో. తంతు ఎక్కువై తత్త్వంపైన దృష్టిలేని శివయోగులగురించిన పద్యమిది.

తాళపత్రగ్రంథాలు, వాటికి పట్టిన చెదలు, కట్టుకోడానికి పులిచర్మం, చేతిలో బెత్తం, చంకజోలె ఇట్లాంటివి ఎన్నైనా వీటిని మోసుకొని తిరగటమే గాని మోక్షం రావాలంటే మాత్రం ఇవి చాలవు. కఠోరమైన శివధ్యానం వల్లనే అది సాధ్యం అంటున్నాడు వేమన.

ఆ రోజుల్లో పుస్తకం అంటే ఇప్పటిలా కాగితం పుస్తకం కాదు. తాటాకుల కట్ట. తెలంగాణాలో పుస్తకాన్ని వహీ (వొయ్యి) అనేవారు. ఇది పర్షియన్ మాట. ఉర్దూ మరాటీల్లోకి కూడా వెళ్లింది. వహీఖాతా అంటారు, అంటే పుస్తకంలో రాసే పద్దు అని. తంజావూరు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఇప్పటికీ వహీబండల్స్ అని ఓ విభాగముంది. ఆధ్యాత్మిక గ్రంథాలు చదివి గూట్లో పెడితే అవి చెదల పాలవుతాయి. చెదలు అంటే చెద పురగులు (white ants). చదలు అని రాస్తారు గాని ఉచ్చారణలో చెదలే. చెదపురుగులేం చేస్తాయి? అవి కలపను తొలిచి తింటూ దాని విసర్జన పదార్థంతోనే పొరలాంటి గూడును నిర్మించుకుంటాయి రక్షణకోసం. పుస్తకం కూడా కలపనుండి తయారయ్యిందే కదా! అక్షరం శాశ్వతం కావచ్చుగాని అక్షరాలను ధరించిన పుస్తకం ఒకనాటికి నశిస్తుంది. తాటాకు పుస్తకం తనను రక్షించమని మనల్ని ఇలా కోరుతుంది. ఏమని? 'అగ్నేరక్ష జలాద్రక్ష రక్షమాం శ్లథబంధనాత్ పునశ్చయాచకాద్రక్ష...' అగ్నినుంచి, వానవరదల నుండీ, కుట్లు ఊడి పోవడం నుండి, అడుక్కొని తీసికెళ్లి వాపసు చెయ్యని వారి నుండి రక్షించమని వేడుకుంటుంది పుస్తకం. పాపం! చెదల్ని మర్చిపొయ్యింది.

ఇక పులితోలు శైవచిహ్నమే. శివుడు వ్యాఘ్రాజినం ధరిస్తాడు. మృగ చర్మాంబరధారి అన్నమాట. బెత్తం అంటే పొడుగాటి కట్టె. బెత్తమే సంస్కృతంలో వేత్రం. 'బెత్తమంచనగను వేత్రమలరు' బెత్తులవాడు అంటే వేత్రధరుడు. కక్షపాలము అంటే చంకసంచి. దీనిలో శంఖం, విబూది మొదలైనవి ఉంచుకుంటారు. మనుచరిత్రలో మాయాప్రవరుని వేషాన్ని వర్ణిస్తూ "*కటపాల కేదార కటక ముద్రిత పాణి ముడిచిన ఒంటికెంజడమూయ ముప్పన్నె*

మెకముతోలు *కిరీటముగ ధరించె"* అని అన్నాడు అల్లసాని పెద్దన. 'అక్షపాల సువస్తుల కక్షపాల' అని నైఘంటికార్థం. కక్షపాలలు పది లక్షలైన అంటే లక్షలని కాదు. అది నుడికారం. మనం సవాలక్ష అనమా, అట్లాగ.

వేషధారులై తత్త్వాన్ని మరిచిపోయిన ఇటువంటి కల్లయోగుల వల్ల ముక్తి లభించదని, వారిని నమ్మి మోసపోవద్దని వేమన్న హెచ్చరిక!

**పృథివి కుదకమేగె పృథివిపై మొలకెత్తె**
**మొలక పృథివికేగె మగడె సుతుడు**
**ధరణి జనులకెల్ల తల్లియు పెండ్లాము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీరు భూమిలోకి ఇంకిపోతుంది. ఆ నీటివల్ల భూమి ఉపరితలాన్ని చీల్చుకొని చిగురు బయటికొస్తుంది. భూమి సంపర్కంతో భూమిపై నిలబడ్డ మొక్క భూమికి భర్త అవుతుంది. ఆ తర్వాత ఫలసాయం వల్ల తానే సంతానమవుతుంది. లోకంలో కూడా పృథివీరూపమైన స్త్రీకి పురుషుడు తాను జన్మించి, అదేరూపమైన స్త్రీ సంగమంతో ఆమెకు కొడుకై పుడతాడు.

మట్టికీ నీటికీ వున్న సంబంధంలోని ఇంద్రజాలం రైతుకే బాగా తెలుస్తుంది. వేమన్న ఈ పద్యంలో అచ్చమైన రైతు బిడ్డగా దర్శనమిస్తున్నాడు. పృథివి అంటే భూమి. విశాలమైనది అని వ్యుత్పత్తి. స్త్రీ అని కూడా మరో అర్థం. భూమి ఎప్పుడూ కొత్తగా వుంటుంది, పునర్నవ. ఉదకం అంటే నీరు. ఏగు–అంటే వెళ్లటం. లోపలికీ వెళ్లొచ్చు, వెలుపలికీ వెళ్లొచ్చు. వేమన ఈ రెండర్థాల్లో వాడాడు. ఏగు అంటే కదచు, నడచు, వెళ్లు, పోవు అని ఛాయలు. ఇది దేశీయ పదం. మూలద్రావిడంలో 'ఏక్' అని. తమిళంలో ఏకు అంటే పోవుటతో పాటు జారిపోవు అని కూడా. మలయాళంలో ఎక్కక – అంటే తిన్నగా కదులు అని. మొలక అంటే అంకురం. మొలకెత్తిన విత్తు అన్నమాట. ఎంతలేతగా వుంటుందో! ధరణి అంటే ధరించేది (ధారయతి యితి).

జగత్తులో ఏ చెట్టయినా తొలిచెట్టు నుంచే విస్తరిస్తుంది. అదే కార్యం, ఫలనం కూడా. స్త్రీకి భర్త తాను కొడుకుగా జన్మిస్తాడు. ఆ రకంగా చూస్తే భార్యభర్తకు తల్లి అవుతుంది అని తాత్త్విక ధోరణిలో చెప్తున్నాడు వేమన. భూమిపై నుంచి కాక భూమిలోపలికి వెళ్లి చెప్తే వాస్తవం ఇలా వుంటుంది.

**పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు**
**మాటకన్న నెంచ మనసు దృఢము**
**కులము కన్న మిగుల గుణమె ప్రధానంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గురికుదరని పైపై పూజ కంటె నిశ్చలమైన జ్ఞానం ముఖ్యం. మారే మాటల కంటే అచంచలమైన మనస్సు ప్రధానం. సామాజికంగా ఏర్పడిన కులం కంటె స్వభావతః ఏర్పడిన లక్షణం ఎన్నదగినది. బాహ్యంగా చేసే పనులు సరే, వాటికి మూలాలు లోపల ఉన్నాయా లేదా అని చూసుకొమ్మంటున్నాడు వేమన. పాతమాటే, దేనికైనా త్రికరణ శుద్ధి అవసరం. ఇది పాతపాటే కావచ్చు, కాని ఎప్పటికీ పాతవడని మాట అని గుర్తుంచుకోవాలి.

పూజ అంటే తెలియనిదెవరికి? అర్చన, దేవుడిని కొలవడం. బుద్ధి అంటే బోధ చేత ప్రకాశించేది. భోధ అంటే జ్ఞానం, అంటే వస్తువు యొక్క యదార్థగుణాన్ని తెలిపేది. నిదానం అంటే నెమ్మది, ఓపిక అనే అర్థాలున్నా ఇక్కడ కారణం, మూలహేతువు.

అలాగే మాట అంటే పైకి చెప్పేది. మనస్సు అంటే చిత్తం. ఇది జీవాత్మకంటే భిన్నమైంది. జ్ఞానం పుట్టేది దీనిలోంచే. పైకి చెప్పే మాటకు పునాది మనస్సులో ఉంటే ఆ మాటకు కాంతి ఉంటుంది. మనసులో పుట్టిన జ్ఞానం స్థిరమైనది అని సారాంశం.

ఇక కులం, ఇది మనిషి పుట్టిన తర్వాత వచ్చిందే. సామాజికంగా దీనిలో ఎక్కువ తక్కువలు ఉండొచ్చు. కాని మౌలికంగా మనిషి గుణమే గొప్పది. ఈ అర్థం వచ్చే పద్యాలు వేమన్న కొల్లలుగా చెప్పాడు.

**పూతగడ్డి కేల పుట్టించె వాసన**
**కనకము తనకేమి కల్ల జేసె;**
**బ్రహ్మచేత లెల్ల పాడైన చేతలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

బ్రహ్మదేవుడు ఆయా వస్తువుల యోగ్యతను బట్టి వాటి గుణ గుణాలను సృష్టిస్తాడంటారే మరి ఇలా చేశాడేమిటి? అందంగాలేని పూతగడ్డికి మంచి సువాసననిచ్చి సుందరమైన బంగారానికి మాత్రం తావిని సమకూర్చలేదు. అది చేసిన చెడ్డ ఏమిటి? బ్రహ్మచేసే పనులన్నీ ఇలాగే వుంటాయి, బాగాలేవు అంటున్నాడు వేమన.

పూతగడ్డి అంటే వట్టివేళ్లగడ్డి. ఈ గడ్డి వేళ్లకు అద్భుతమైన సువాసన వుంటుంది. ఈ వేళ్లను తలకు రాసుకునే ఆయుర్వేదం సుగంధతైలాల్లో వాడుతారు. వృక్షశాస్త్రం ప్రకారం పోయిసీ అనే గడ్డి కుటుంబానికి చెందిన మొక్క ఇది. దీని చివరన పూత వుంటుంది కాబట్టి పూతగడ్డి అంటారు. వరి కూడా గడ్డే.

కనకం అంటే బంగారం. బంగారానికి తావి అబ్బినట్లు అనేది తెలుగు కవులు తరచుగా వాడేమాట. అందమైన బంగారానికి సువాసన కూడా ఉంటే దాని పుట్టుక పరిపూర్ణమయ్యేది కదా అని ఆకాంక్ష. అయితే సృష్టిలో ఏదో లోటు మిగిలిపోతూనే వుంటుంది. వేమన దీనికి సృష్టికర్త అయిన బ్రహ్మను తప్పు పడుతున్నాడు. "*బ్రహ్మ ఆలితాడు బండిరేవున తెంప*" అని మరోచోట అన్నాడు. కాని సృష్టిలో దేని ప్రత్యేకత దానిదే. వట్టివేళ్లను గడ్డి అని తోసివేద్దామంటే దానికి అపురూపమైన సుగంధాన్ని పెట్టాడు. రూపానికి లేని విలువ గుణం వల్ల సమకూరింది. అలాగే విలువైన బంగారానికి మంచి వాసన కూడా వుండి వుంటే ఎలా వుండేదో అనేది ఒక ఆలోచన.

**పూర్ణమైన తనదు భుజ బల్మిజూచుక**
**భువిని చెడుగుతోటి పోరరాదు**
**పాలకుండచెంత పగులును ఆ రాయి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

బాహుబలం నిండుగా ఉంది గదా అని కేవలం దాని ఆధారంగానే దుర్మార్గం పైన సత్వరం యుద్ధానికి దిగడం మంచిది కాదు. కొంత ఓపిక అవసరం. దాలిగుంటలోని పాలకుండ వేడికి పక్కన ఉన్న దాలిరాయి పగుళ్లువారదా, అలాగ!

భుజబలమే కాదు బుద్ధిబలం కూడా వుండాలి. భుజబలం పూర్ణమైనదైనా సరే; పూర్ణమంటే శక్తివంతమని. నువ్వు ఎదుర్కోబోయే చెడుగు నీకన్నా బలమైంది కావొచ్చు. అప్పుడు నువ్వు దెబ్బ తింటావు. అయితే దానిని వదిలెయ్యాలా? వదిలెయ్యొద్దు. నీ వ్యతిరేకతలోని శక్తికి అది నశించి తీరుతుంది. ఎలాగంటే దాలిగుంటలోని పాలకుండ యొక్క అనవరత ఉష్ణానికి పక్కన ఉన్న రాయి క్రమంగా పగుళ్లువారి తీరుతుంది అని వేమన్న గమనింపు. అకస్మాత్ ప్రతిఘటన కన్న సాత్త్వికమైన ధర్మాగ్రం మేలు అనేది సారాంశం.

చెడుగు అంటే క్రూరత్వం, దుష్టత్వం, ధూర్తత్వం, దుష్ప్రవర్తన, అవినీతి ఏదైనా కావొచ్చు.

దాలి అంటే పిడకలు పేర్చి చేసే నిప్పుల గుంట. పొయ్యిలాగ  అది వెంటనే చల్లారిపోదు. ఎప్పుడూ వెచ్చగా వుంటుంది. దాని వేడికి పక్కనే ఉన్న దాలిరాయి కూడా పగుళ్లు బారుతుంది. దాలిరాయి అంటే కూర గిన్నెల్లాంటివి పెట్టుకునే రాయి. దాలి అంటే పిడకలపోగు. ఎప్పుడూ వెచ్చగా ఉండే దాలిగుంటలో కుక్క మంచి ఆలోచనలు చేస్తుందని వాడుక. బయటికి వచ్చిన తర్వాత మళ్లీ మామూలే. ఇదంతా పూర్వకాలంలో గ్రామాల్లోని వంటింటి పరిభాష. ఇప్పుడు గ్యాసుపొయ్యిని 'సిమ్'లో పెడ్తున్నారు. లోకంలోని దృష్టాంతాలను సొగసుగా వాడుకున్న గొప్ప కవి వేమన కాక మరెవ్వరు?

**పూర్వజన్మమందు పుణ్యంబు సేయని**
**పాపి ధనము కాశపడుటయెల్ల**
**విత్త మరచి కోయ వెదకిన చందంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు పాపి. పూర్వజన్మలో ఏమాత్రం మంచి పనులు చెయ్యడు. కృషి చెయ్యడు. కాని ఈ జన్మలో ధనం కోసం వెంపర్లాడుతాడు. ఇదెట్లా వుంటుందంటే పొలంలో విత్తనాలు చల్లడం మరచిపోయి కోతకాలం వచ్చినప్పుడు కోయటానికి పైరును వెతికినట్టు. ఎంత అజ్ఞానం! అని జాలిపడుతున్నాడు వేమన.

గతజన్మలో పుణ్యం చెయ్యడు. పుణ్యం అంటే పరోపకారం. పైగా పాపాలు చేస్తాడు పాపం అంటే పరపీడనం. అయినా ప్రస్తుత జన్మలో సత్ఫలితాన్ని ఆశిస్తాడు. అంటే ధనమే. ఇదెట్లా వీలవుతుంది? పంట పండించాలంటే విత్తనాల కాలంలో విత్తనాలు చల్లాలికదా! విత్తనాల కాలమంటే వర్షాకాలంలో తొలకరి చినుకులు పడ్డ తర్వాత భూములు దున్ని విత్తనాలు వేస్తారు. ఆషాఢమాసమన్నమాట! దీనిని ఏరువాక పున్నమి అని అంటారు. దాదాపు నాలుగు నెలలకు పైరు కోతకొస్తుంది. కార్తీక పున్నమి నాటికి అంటే దసరా వెళ్లిన తర్వాత. అప్పటికి దీపావళి కూడా దగ్గరికొస్తుంది. ఇదంతా చెయ్యకుండా కోతకుమాత్రం సిద్ధమైతే మిగిలేది శూన్యమే.

మానవుడు తన కర్మఫలాలను అనుభవించక తప్పదు. గతజన్మలోనైనా ఈ జన్మలోనైనా అతడు తన ప్రయత్నం వల్లనే ఉన్నతస్థితినిగానీ అధోగతిని గానీ పొందుతాడు. తన శక్తిని వినియోగించకుండా అంతా దైవాధీనం అంటే అది నిరాశావాదం. కాబట్టి మంచి చెయ్యడమే సాధనం అని వేమన్న సారాంశం. 'పాపకర్ముడాసపడిన ధనము' (డి. 1724, 159); విత్తని మడిగోయ వెదకిన చందమో (డి. 1725-578) అనేవి పాఠాంతరాలు.

**పూర్వ వాసన గల పుణ్యాత్ముని కలిమి**
**ఊట చెలమరీతి నూరు నెపుడు**
**ఎందరికి నొసంగ ఎప్పటియట్లుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అకస్మాత్తుగా ఈ జన్మలోనే ఊడిపడ్డ సంపద కాదది. జన్మజన్మాలుగా ఆ ధర్మాత్ముని ఇంటిలో ఊట నీటిలా ఊరుతూ వృద్ధి చెందుతుంటుంది. ఎందరికి పంచిపెట్టినా తరగకుండా ఎప్పటిలాగే వుంటుంది.

అది నడమంత్రపు సిరికాదు. తరతరాలుగా వచ్చి చేరుతున్నది. మరి ఖర్చుయిపోవటం లేదా? అవుతున్నది, దానధర్మాలకు పోతున్నది. అయినా అది తగ్గటం లేదు. కారణం? అది మంచిపనికాబట్టి. దాన గుణం అలవర్చుకోవాలని ధనవంతులకు వేమన్న సందేశమిది.

పూర్వ వాసనలు అంటున్నాడు. అంటే పూర్వజన్మ వాసనలు. వాసనలు అంటే అంతః కరణంలో నిక్షిప్తమైన ఉండే పూర్వజన్మ సంస్కారాలు. గతజన్మల్లో అనుభవించిన దాని తాలూకు ఇంద్రియార్థాల జ్ఞాపకాలు. Tendencies అంటారు ఇంగ్లీషులో. పర్యవసానాలంటారు. వాసనలు మూడు రకాలు. ఒకటి లోక వాసనలు, అంటే కాంతా కనకాలపై ఆశ. రెండు దేహవాసనలు, శరీరం రూపం వాటి పోషణపై ప్రత్యేక శ్రద్ధ. స్వాభిమానమన్నమాట. శాస్త్ర వాసనలు మూడు. పఠన, పాఠన, అనుష్టానాల పట్ల శ్రద్ధ. తాత్వికంగా చూస్తే ఈ మూడు వాసనలూ జ్ఞానానికి అవరోధాలు, ముక్తికి ఆటంకాలు. కాని ఇక్కడి సందర్భం వేరు. ఈ దానపరుని సంపద సంచితంగా ఏర్పడినట్టది. సంచితం అంటే అనేక జన్మల్లో కూడబెట్టబడిన కర్మఫలం. కాబట్టి దాని సద్వినియోగం వల్ల దానికి క్షయం లేదని సారాంశం –

ఊట అంటే ఊరే నీళ్లు, పైకి చిమ్మే నీళ్లు. చెలమ అంటే మంచి నీటి గొయ్యి. ఏటి ఇసుక మొదలైన వాటిలో తీసే మంచినీటి గుంట.

'.... పుణ్యాత్ముకవియెపుడు (డి.1721, 118), పుణ్యాత్ముని ధనంబు (డి.1773, IV, 1528) అనేవి పాఠాంతరాలు.

**పెట్టినంత ఫలము పెక్కండ్ర కుపహతి**
**చేయకున్న తాను చెరుపకున్న**
**పెండ్లి చేయునట్టి పెద్ద ఫలంబురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

పెట్టకపోయినా పెట్టినంత ఫలమొస్తుంది. ఎప్పుడు? ఇతరులకు అపకారం చెయ్యనప్పుడు. అంతేకాదు వారి పనులు చెడగొట్టకపోతే వారింట్లో పెండ్లి జరిపించి నంత పుణ్యం ప్రాప్తిస్తోంది అని అంటున్నాడు వేమన.

ఉపహతి అంటే దెబ్బ, నాశనం, ఆపద, ఉపద్రవం, చెడగొట్టడం అని అర్థాలు. గుర్తుందా మనుచరిత్రలోని అల్లసాని పెద్దన పద్యం? "నిరుపహతి స్థలంబు, రమణీప్రియ దూతిక తెచ్చియిచ్చుకప్పుర విడెం" ఇక్కడ నిరుపహతి స్థలం అంటే ఎవరూ ధ్యానభంగం చెయ్యని చోటు. ఏకాంత వాసమన్న మాట!

'పెట్టి పొయ్యనమ్మ కొట్టి పొమ్మన్నదట' అని సామెత. తినడానికి తిండి పెట్టదు. తాగడానికి నీళ్లివ్వదు. పైగా దౌర్జన్యంగా వెళ్లగొడ్తుంది. ఏం మనిషి? పోనీ నువ్వు పెట్టవు. ఎవరో పెడ్తుంటే దానికి అడ్డొస్తావేమి? ఇది మరో రకం. వాళ్లేదో పిల్లపెళ్లికోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అబద్ధాలతో పెళ్లిని భగ్నం చెయ్యాలని చూడకు. నువ్వు వారి జోలికి వెళ్లకపోతేనే నయం పెండ్లి చేసినంత పుణ్యం వస్తుంది అని సారాంశం. 'పెండ్లి సేయుకన్న పెద్ద ఫలంబుపో! (డి.1735, 764) అనేది పాఠాంతరం.

**పెద్దలనుటెగాని బుద్ధి యింతయు లేదు**
**కలహమొంది యుండ్రు కానిపద్దు**
**ముచ్చు, వెన్నెలైన మదమొంద నట్లెబో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పెద్దవారి హితవులను వల్లెవేస్తారు గాని బుద్ధికెక్కించుకోరు. పైగా నిత్యం పోట్లాడుకుంటారు. ఇది తప్పు. ఇదెట్లా వుంటుందంటే దొంగ వెన్నెల రాత్రులను ఆనందించలేడు గదా అట్లా.

పెద్దలేమంటారు? అందరినీ కలిసి ఉండమంటారు. వింటారు, కాదు విన్నట్టు నటిస్తారు. పెద్దల సుభాషితాలు అర్థం కావాలంటే బుద్ధి ఉండాలి. బుద్ధి అంటే ఇక్కడ ఇష్టం. 'వాడికి బుద్ధి పుట్టలేదు' అంటే ఇష్టం కాలేదు అని. బుద్ధికి ఎన్నో ఛాయలు. 'బుద్ధివచ్చింది' అంటే పాఠం నేర్చుకున్నామని. 'బుద్ధిపూర్వకంగా' అంటే కావాలని. 'బుద్ధి ఎరిగిన నాటినుంచి' అంటే ఊహ తెలిసే వయస్సునాటి నుంచి అని. 'బుద్ధి చెప్పు' అంటే మంచి నడవడిక బోధించడం, నీతులు చెప్పడం. కాని నీతులు ఎవరు వింటారు?

ముచ్చు అంటే దొంగ, మోసగాడు. మనస్సులోని మాటను దాచుకొని మాట్లాడకుండా ఉండేవాడూ ముచ్చే. పెద్దలు చెప్పింది వినని వారి గురించి వేమన ఎంత చక్కటి పోలిక తెచ్చాడో చూడండి. ఇట్లాంటివి వేమన కవితాత్మకతకు నిదర్శనంగా వుంటాయి. వాడు దొంగ, అందుకే వెన్నెలలో ఆహ్లాదం కలుగదు అంటున్నాడు. దొంగకూ వెన్నెలకూ ఏమిటి సంబంధం? ఏమిటంటే వెన్నెల వెలుగులో దొంగ ఎవరో తెలిసిపోతుంది. దొంగకు చీకటే నయం. ముచ్చుపొద్దు అంటారు అందుకే. అంటే అర్ధరాత్రి. దొంగలు తిరిగేవేళ అన్నమాట.

"నీ ముచ్చు విద్యలు నెరయంగనెపుడు, మామూక యెరుంగుగా మలయంగరాదు" అనేది ప్రయోగం.

**పెద్దల వచనములు ప్రేమతో జూచి తా**
**నటుల నడువబోవ ననువు పడదు**
**పులిని జూచి నక్కపూత పూసినయట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పెద్దవాళ్లంటే ఎవరికైనా ప్రేమా, గౌరవం ఉంటాయి. వాటిని పురస్కరించుకొని వాళ్లు చెప్పిందెల్లా, ప్రామాణికంగా భావించి అనుసరించాలనుకోవడం కుదరదు. అదెట్లా వుంటుందంటే పులిని చూసి నక్క వాత పెట్టుకోదలచినట్టు. కూడదంటున్నాడు వేమన.

అదేమిటి? పెద్దలమాట వింటే మంచిదే కదా! పెద్దలు వారి అపారమైన అనుభవంతో చెప్తారు. ఆ అనుభవం మనకు పనికొస్తుంది గదా. అందుకే, పెద్దల మాట పెన్నిధిమూట' లాంటి సామెతలు కూడా పుట్టాయి.

దీనికి వేమన ఆలోచన వేరుగా వుంది. పెద్దలంటే గౌరవం ఉండాలి గాని వారు చెప్పే ప్రతి మాటా అనుసరణీయం కాదు. నిజమే! పెద్దల అభిప్రాయాలు వారి అనుభవజనితాలే. కాని వాటిలో అన్ని కాలాలకు పనికిరానివి కూడా ఉంటాయి. తరాల అంతరాలు ఉండనే ఉంటాయి. "మహాకవి శ్రీశ్రీ" కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు... నాన్నగారి, తాతగారి భావాలకు దాసులు/నేటి నిజం చూడలేని కీటక సన్నాసులు' అన్నాడు.

పెద్దలు అంటే ఇంట్లో పెద్దలే కాక పూర్వులు, గ్రామపెద్దలు కూడా కావొచ్చు. వచనములు అంటే ధర్మశాస్త్రంలోని ప్రమాణ వాక్యాలు అనే అర్థం ఉంది. ముఖవచనం అంటే ముఖతః విన్నమాటలని. అలాగే పెద్దలు కూడా ప్రతిదీ తాము చెప్పిందే వేదం అని అనుకోగూడదు. మారుతున్న కాలం నాడిని తెలుసుకొని కొన్ని అభిప్రాయాలను పునస్సమీక్షించుకోవడం ఉచితమని వేమన్న బావం. వేమన ప్రగతిశీల ఆలోచనకీ పద్యం తార్కాణంగా వుంది.

**పొంకమునను మనసు పోనీక సర్వేశు**
**వంక నిల్పువాడు వంశవరుడు**
**వంకనిల్పకున్న వచ్చునా పదవులు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనస్సును అటూ ఇటూ పోనివ్వక చక్కగా అన్నింటికీ మూలమైన దేవుడివైపుకి మళ్లించేవాడు ఉత్తముడవుతాడు. అట్లా దేవుడి పట్ల ఏకాగ్రత లేనట్లయితే ఆధ్యాత్మికంగా ఉన్నతస్థితి లభించదు అని వేమన్న ఉవాచ.

పొంకం అంటే పొంగు, గర్వం అని అర్థాలు. ఇక్కడ మంచిదైన అని. పోనీక అంటే చెదిరిపోనీక అని. సర్వేశుడంటే ఒక దేవుడని కాదు. అసలు సర్వం అంటే నీరు. "ఆప ఏవ సర్వం", అంతా అని. అంతటా వ్యాపించి ఉంది నీరు కాబట్టి విష్ణువని కాక బ్రహ్మం అనే అర్థం తీసుకోవడమే సబబు.

వంక అంటే పక్క, దిక్కు. దీనికీ ఎన్నో ఛాయలు. వంక అంటే వల్ల, వంక పెట్టడం అంటే నెపం. వంకర, సెలయేరు ఇంకెన్నో! "క్రతువు వంక కలుగునా మోక్షంబు" అని అన్నాడు వేమనే మరోచోట, ఇక్కడ వలన అని అర్థం. వంశవరుడు అంటే వంశంలో శ్రేష్ఠుడు. వంశం అంటే పరంపర, సంతతి అని అర్థాలు. తండ్రి, తాత మొదలైన వారి వారసత్వమన్నమాట. పదవి అంటే సంపద, అదృష్టం, ప్రదేశం అని అర్థాలు. పదవి అంటే ఇక్కడ మోక్షపదవి అనే అర్థం.

**పొట్లకాయ రాయి పొడుగుతాటను గట్ట**
**లీల తోడ వంక లేక పెరుగు**
**కుక్కతోక గట్ట కుదురునా చక్కగా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎంత ప్రయత్నించినా మూర్ఖుని బుద్ధిని సరిదిద్దడం కష్టం. అదే గుణవంతుడి విషయంలోనైతే మంచి ఫలితాలు రావొచ్చు. ఎట్లాగంటే పాదుకు కాసిన పొట్లకాయకు రాతిని వేలాడగడితే వంకరటింకరలు లేకుండా నిడుపుగా పెరుగుతుంది. అదే కుక్క ఉందనుకోండి. పుట్టుకతోనే దాని తోక వంకర. ఆ తోకను వెదరుబద్దలతో ఎంత కుదురుగా కట్టినా విప్పిన తర్వాత అది మళ్లీ వంకర.

'లీలతోడ' అంటే అవలీలగా, హాయిగా అని అర్థాలు. విధం, విలాసం, క్రియ అని కూడా. స్త్రీల హావభావ భేదాన్ని కూడా లీల అంటారు. ఇక్కడ తెలిసీ తెలియనట్లుగా అనేది సరిపోతుంది దాని వంకర సహజంగానే కుదురుతుంది కాని అది పైకి తెలియదు.

కుదురునా అంటే ఇక్కడ సంస్కరింపబడుతుందా అని అర్థం. మారుతుందా అని కూడా. 'కుదురుట'కు కూడా ఎన్నో ఛాయలు. 'మనసుకుదిరింది' అంటే నీపైన అని. 'వ్రాత కుదిరింది' అంటే ఒద్దికగా అని. 'అంతా బాగా కుదిరింది' అంటే చక్కగా జరిగింది అని. 'పద్యంలో గణాలు కుదరలేదు' అంటే గణభంగం జరిగిందని. 'కోర్టులో వ్యాజం కుదిరింది' అంటే తగాదా పరిష్కారమయ్యిందని. సందర్భానుసారంగా అర్థాలు.

**బంగరు పొడగన్న భామల పొడగన్న**
**చిత్తమునను చింత సేయదేని**
**వాడె పరమయోగి వర్ణింప జగమందు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు బంగారాన్ని చూశాడా? అందమైన వనితలను తిలకించాడా? అయినా అతని మనస్సు చెదిరిపోలేదా, అదేపనిగా తలపులు ముసరలేదా అయితే అతడు పూర్ణ మానవుడై వుంటాడు. లోకంలో అతన్ని యోగి అని కీర్తించినా తప్పులేదు అంటున్నాడు వేమన.

యోగి అంటే సర్వాన్ని త్యజించి అడవిలో ముక్కుమూసుకొని తపస్సు చేసేవాడు మాత్రమే కాదు. జనం మధ్యలో వుండి, వ్యామోహాలకు లోను గాక, ప్రలోభాలను జయించినవాడు కూడా సామాన్యుడు కాదు, అసామాన్యుడు. అతడు యోగి కన్నా తక్కువా అంటున్నాడు వేమన.

పొడ అంటే జాడ, ఆకారం, వానిపొడ గిట్టదు అంటారు. బంగారం కనపడగానే వాడి కళ్లు విస్ఫారితమౌతాయి. భామ అంటే స్త్రీ. తొందరగా కోపానికి వచ్చే స్త్రీని భామ అంటారు. సత్యభామలాగ స్త్రీ కోపం కూడా సౌందర్య హేతువే. అందుకే కృష్ణుడు ముప్పుతిప్పులు పడ్డాడు. చిత్తం అంటే మనసు. చింత అంటే ఆలోచన, దుఃఖం కూడ. ఈ చింత ఉందే ఇది చాలా చెడ్డది. ధనం గురించి, వనిత గురించి తలపోస్తూ తలపోస్తూ అవి లభ్యం కానప్పుడు దుఃఖిస్తూ అబ్బో! అదో నరకం. ఈ శ్లోకాన్ని చిత్తగించండి.

*'చితాచింతాద్వయోర్మధ్యే చింతానామగరీయసి*
*చితాదహతి నిర్జీవమ్ చింతా ప్రాణయుతంవపుః'*

చితినీ చింతనూ పోల్చిచూస్తే చింత అతి దారుణమైనది. చితి ప్రాణంలేని శవాన్ని మాత్రమే కాల్చేస్తుంది. మరి చింత? సజీవంగా ఉన్నప్పుడే కాల్చుకు తింటుంది. చితికీ చింతకూ అనుస్వారమే తేడా అయితే అర్థంలో ఎంత విరుద్ధం!

చింతను జయించినవాడే యోగి అని సారాంశం.

*....పడతుల పొడగన్న*
*చెంచలింపకున్నచిత్తమందు*
*వాడె పరమజ్ఞాని*

(డి. 1723, 92) అనేవి పాఠాంతరాలు.

**బండమీద చెలమ పాటించి తవ్విన**
**అలయికెక్కుడౌను ఆశలేదు**
**గుంట పట్టు చెలమ కులముద్ధరించురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నీటి జాలు లేని రాతిని ఎంత తవ్వినా నీరు పడదు. పడకపోగా అలసట ఎక్కువౌతుంది. నీ జలతృష్ణ తీరనే తీరదు. మరేం చెయ్యాలి? ఏం చెయ్యాలంటే పల్లపు ప్రదేశంలో తవ్వాలి. అప్పుడు చెలిమె గుంటలోంచి నీరు ఉబుకుతుంది. అది నీ ఊరి అవసరాలకు సరిపోతుంది.

నీటికోసం చెలమ తవ్వాల్సింది మట్టిలోనే గాని రాతిలో కాదు అని తాత్పర్యం. కాని విషయం ఇంత సులభమైతే వేమన ఈ పద్యం చెప్పడమెందుకు? అసలు బండమీద తవ్వే ప్రసక్తి ఎందుకొచ్చింది? రాళ్లలో నీళ్లుంటాయా? ఉంటాయి. కొన్ని రకాల రాళ్లు వాతావరణం వల్ల గుల్లలుగా మారిపోయి, ముక్కలై కాలువల్లో నదుల్లో పల్లానికి కొట్టుకపోయి ఒండ్రుగా మారి గట్టిపడి మళ్లీ శిలలుగా మారిపోతాయి. ఆ రాళ్లలో కణానికీ కణానికీ మధ్య ఖాళీ ఉండి నీరు నిక్షిప్తమౌతుంది. ఈ రాళ్లను ఇసుకరాళ్లు అంటారు. వాటిలో తవ్వితే అర్థముంది గాని అగ్నిశిలలను తవ్వితే సుఖమేముంది అంటున్నాడు వేమన. అగ్నిశిలలు లావాలోంచి, రాతిద్రవంలోంచి ఏర్పడతాయి. వీటిలో నీళ్లుండవు. వేమన చెప్పే బండ ఇదే.

చెలమ అంటే ఇసుక మొదలైన వాటిలో తీసే మంచినీటి గుంట. దీనికే చెలమ, చెలిమె అనేవి రూపాలు. బండను తవ్వితే అది బండచాకిరవుతుంది. ఎంత చేసినా తరగని పనిని బండచాకిరి అంటారు. గుంట, కుంట అనేవి కూడా రూపాంతరాలే. అలయిక అంటే బడలిక "అలయక చదివిన అర్థితో వినిన' అనేది ప్రయోగం. పాటించి అంటే ఆచరించి అని అర్థం. ఇక్కడ కులం అంటే కుటుంబం, లేదా తెగ అని చెప్పుకోవచ్చు.

వేమన భూగర్భ పరిజ్ఞానానికి ఈ పద్యం ఓ మచ్చుతునక.

అలతబుట్టుగాని (డి.1723, 295) అనేది పాఠాంతరం.

**బందె తాళ్ళ దెచ్చి బంధించి కట్టంగ**
**లింగడేమి దొంగిలించినాడొ**
**ఆత్మలింగమేల నర్పించి చూడరో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లింగాన్ని కట్టుకున్నారేమి? అరె! కట్టుతాళ్లతో గుచ్చి దొంగలాగ బంధించి మెడలో కట్టుకున్నారేమి? లింగడు (అంటే శివుడు) ఏం దొంగతనం చేశాడని! బాహ్యలింగాన్ని పట్టుకోవడం మాని భావలింగాన్ని ఆరాధించడం మంచిది కదా! అని ఆనాటి ఆరాధ్య శైవులను వెక్కిరిస్తున్నాడు వేమన.

సాధారణ శిలాలింగమైతే ఎప్పుడో ఒకప్పుడు తెగిపోవచ్చు. ఆత్మలింగమైతే ఎడబాయకుండా తనతోనే వుంటుందని తాత్పర్యం.

వీరశైవం శైవం నుంచి వచ్చిన ఒక శాఖ. పండితారాధ్యుడు స్థాపించిన ఆరాధ్య సంప్రదాయం వీరశైవంలోని మరో అవాంతరశాఖ. ఆరాధ్యులు మెడలో లింగకాయ ధరించినా వీరశైవుల్లో వర్ణాశ్రమ ధర్మాన్ని నిరాకరించారు. వీరశైవులు దర్శనపరంగా శివవిశిష్టాద్వైతులు. అయితే మాయావాదాన్ని అంగీకరించరు. వీరశైవంలో స్థలం, లింగం, అంగం అనేవి ముఖ్యమైన మాటలు. లింగం అంటే జీవులపట్ల జాలితో లింగరూపం ధరించిన ఉపాస్యదేవత. అంగం అంటే జీవుడు. లింగం కూడా మూడు రకాలు. 1.ప్రాణలింగం. దీనికి రూపం ఉంటుంది 2.ప్రాణలింగం. ఇది అర్చించుకునే సౌకర్యాన్ని కలిగిస్తుంది. 3. ఇక భావలింగం ఆంతర దృష్టికి మాత్రమే కనిపిస్తుంది. వేమన్న మాట్లాడుతున్నది దీని గురించే.

వీరశైవంలో మానవశరీరంతో లింగానికి అభేదాన్ని కల్పించారు. అంటే అంగానికీ లింగానికీ అద్వైతం సూచించబడింది. జీవుడు తన అవధులన్నింటినీ తొలగించుకొని తనలోనే ఒక నిరవధిక మహాతత్వాన్ని సాక్షాత్కరింప జేసుకోవాలంటున్నాడు వేమన.

**బడుగు నెరుగలేని ప్రాభవంబదియేల**
**ప్రోదియిడని బంధుభూతి యేల**
**వ్యాధి తెలియలేని వైద్యుడు మరియేల**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పేదవాడిని పట్టించుకోని ప్రభుత్వమెందుకు? ఆపదలో ఆదుకోని అయినవారి సంపద ఎందుకు? వ్యాధిని కనిపెట్టలేని వైద్యుడి పరిజ్ఞానమెందుకు అని నిలదీసి అడుగుతున్నాడు వేమన.

బడుగు అంటే శవం అనే మరో అర్థముంది కాని ఇక్కడది కాదు. బడుగు అంటే బహు పేదవాడు. బక్కజీవి, చర్మం ఎముకలు మాత్రమే మిగిలిన కృషీభూతుడు. ప్రాభవం అంటే దొరతనం, ఆధిక్యం. బక్కవాడిని రక్షించలేని నీ ఎక్కువతనం నిజానికి తక్కువతనమే. ప్రోది అంటే రక్షణ, సహాయం. వేమనే మరోపద్యంలో ఇలా అన్నాడు. 'రామణీయ మందిరా రామదేశముల/ పూవు తీగెలకును ప్రోదిసేయు'; భూతి అంటే సంపద, బూడిద; భూతిగడ్డ అంటే విభూతి ఉండ. ఇక్కడ సంపదే.

పేదవాడిని ఆదుకోని నీ అధికారం ఎందుకు? దండగ కాకపోతే. అండగా నిలబడని బంధువుల ఆస్తిపాస్తులు చూపెట్టుకోవడానికే కాని అవి ఉన్నా లేనట్టే. వ్యాధి ఏమిటో కనుక్కొని తగిన మందివ్వలేని వైద్యుని శాస్త్ర పాండిత్యం అనుభవరాహిత్యం ముందు నిరర్థకమైనదే.

అధికారం ఉండి దయా, ఆర్ద్రతా లేనివాడు బండరాయిలాంటివాడు. కష్టాల్లో వెలివేయక, సాయంగా వచ్చి వాటిని కడతేర్చేవాడే నిజమైన బంధువు. వ్యాధి ఒకటయితే, మందు మరోటి ఇచ్చే మిడి మిడి జ్ఞాన సంపన్నుడైన వైద్యుడు హంతకుడితో సమానం.

**బ్రహ్మమున్న చోటు పరగంగ తెలియక**
**ఎందువెదుక బ్రహ్మమేల కలుగు?**
**అంజనంబు లేక ఆ సొమ్ము దొరుకునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అన్నింటికీ మూలకారణమైన పరతత్వమే బ్రహ్మము. అది అంతటా వుంటుంది. ఇంద్రియాలకు ఆయా శక్తులను ప్రసాదిస్తుంది. అట్లాంటి బ్రహ్మము ఎక్కడుందో తెలియక ఎక్కడెక్కడో వెతికితే ఆత్మజ్ఞానం ఎలా దొరుకుతుంది? పోయిన సొమ్ము ఎక్కడుందో కనుక్కోవాలంటే మంత్రసహితమైన అంజనం అనే ప్రక్రియను ఆశ్రయించాలి గదా! అంటున్నాడు వేమన.

పల్లెటూళ్లలో పశువులు తప్పిపోయినా ఇంట్లోని నగలను దొంగలు దోచుకపోయినా మంత్రగాన్ని పిలిపించి అంజనం వేయించేవారు. అంజనం అంటే కాటుక. గుర్తుందా 'అంజనరేఖ వాల్గనుల అంచుల' అనే కరుణశ్రీ పద్యం. అరచేతికి కాటుకపూసి మంత్రోచ్చాటనలతో దానిలోకి చూస్తే తప్పిపోయిన చోటు కనిపిస్తుందని ఓ నమ్మకం. నా చిన్నతనంలో మా ఊళ్లో నేనీ తతంగాన్ని చూశాను. కొన్ని ప్రాంతాల్లో కాటుకను కుడిచేతి వేలుకుగానీ, గోటికి గానీ రాస్తారు.

అంజనం ద్వారా సొమ్ము ఉన్న చోటు తెలిసినట్లే ఆత్మ ద్వారా పరమాత్మను దర్శించవచ్చు అని తాత్పర్యం. పల్లె జీవనంలోని ప్రతి వస్తువూ ప్రక్రియా వేమన పద్యాల్లో ఉపమా సౌభాగ్యాన్ని పొందడమో, దృష్టాంత రామణీయకాన్ని సంతరించుకోవడమో జరుగుతుందనడానికి ఈ పద్యం ఒక తార్కాణం. మిల్టన్ రచించిన ఆంగ్ల మహాకావ్యం 'ప్యారడైజ్‌లాస్ట్'లో అంజనం ప్రస్తావన ఉందని బ్రౌన్ గుర్తుకు తెచ్చుకున్నాడు.

అంజనం అంటే కాటుక అని మాత్రమే కాక దీపం కొడి, పూత సిరా అనే అర్థాలున్నాయి. అంజనకాడు అంటే మాంత్రికుడు. తమిళంలో అంచణక్కారణ్ అంటారు.

**భాగ్యహీనునకును పరుసవేది దొరుక**
**అదియు నిల్వదపుడె వదలుగాక**
**వానతోడవచ్చు వడగండ్లు నిల్చునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

దురదృష్టవంతునికి పరుసవేది దొరికినా లాభంలేదు. అది వాడి చేతిలో నిలవదు. పరుసవేది అంటే ఇనుమును బంగారంగా మార్చే ఒక రసశిల. ఇదెట్లా వుంటుందంటే వానతోపాటు కురిసే వడగండ్లు ఎంతసేపుంటాయి? కరిగిపోతాయి అంటున్నాడు వేమన.

భాగ్యం అంటే సంపద అనే అర్థమున్నా ఇక్కడ అదృష్టమనే అర్థం. సంపద గలవాడికి పరుసవేది ఎందుకు? భాగ్యశాలి కానివాడికీ, చేతిలో భాగ్యరేఖ లేనివాడికీ ఏది ముట్టినా అది వొట్టిదే.

పరుసవేది అంటే రసశిల అనుకున్నాం. రాయి అన్నమాట. స్పర్శమణి, స్పర్శవేడి అని కూడా అంటారు. రసశిల అంటే రసవాదసంబంధమైన శిల. రసవాదం అంటే లోహాలను బంగారంగా మార్చే విద్య. పరుసవేదితో దేనిని తాకినా అది బంగారంగా మారిపోతుంది. అయినా దరిద్రుడు దరిద్రుడుగానే వున్నాడు. వాడి చేతిలో ఏది నిలవదంటున్నాడు. నిలువదా? నిలుపుకోడా? కారణమేదైనా సత్యమిది.

వడగండ్లు అంటే వానకురిసేటప్పుడు పడే చిన్న చిన్న మంచుగడ్డలు. వడ+కల్లు+లు. కల్లు అంటే రాయి. వడ అంటే మంచు. సందర్భాన్ని బట్టి వేడి, తాపం అనే అర్థాలుకూడా వున్నాయి. వడగాలిలాగ. ఇక్కడైతే మంచు.

ఆకాశంలోని మేఘాలు రకరకాల శీతోష్ణ పరిస్థితుల్లో ప్రయాణిస్తుంటాయి. సున్న నుండి 5 డిగ్రీలమధ్య మేఘం ఒక మంచుపర్వతంగా గడ్డకడుతుంది. కిందికి వచ్చేసరికి అక్కడి వేడికి అది ముక్కలు ముక్కలైపోతుంది. వానతోపాటు ఆ ముక్కలూ కురుస్తాయి. ఆ ముక్కను వానరాయి అంటారు. మీరు గమనించండి వానచుక్క మన నీటి చుక్కకంటే చల్లగా వుంటుంది. 'వడగండ్లు నిలుచునా' అన్నాడు. నిలువవు. ఏమౌతాయి మళ్లీ నీళ్లుగా కరిగిపోతాయి. పాతిక చినుకుల్తో ఓ వడకల్లు ఏర్పడితే అది మళ్లీ నీళ్లుగా మారిపోతుంది. దురదృష్టవంతుని అవకాశమూ అంతే అది ఆకాశంలా శూన్యంగా మారిపోతుందంటున్నాడు వేమన.

పరుసవేదిని ఇంగ్లీషులో 'ఫిలాసఫర్స్ స్టోన్' అంటారు. మనవాడి దురదృష్టంలో వున్న ఫిలాసఫీ ఏమిటో వేమన విప్పి చెప్తే బాగుండేది.

**బుద్ధియుతునికేల పొసగని సఖ్యంబు**
**కార్యవాదికేల కడు చలంబు**
**కుత్సితునకు నేల గురుదేవతా భక్తి?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మంచివాడికి నీచులతో స్నేహమెందుకు? అది కుదిరేపనేనా? ఒక లక్ష్యం పెట్టుకొని పనిచేసే కార్యసాధకుడు అతి పట్టుదలకు పోయి దానిని చెడగొట్టుకోవడమెందుకు? ఇలా ఉత్తములైన వారు ఇక్కడ తొందర పడుతుంటే అక్కడ కపటి తన స్వభావానికి విరుద్ధమైన, గురుభక్తినీ, దైవభక్తినీ నటిస్తున్నాడు, గమనించమంటున్నాడు వేమన.

బుద్ధిమంతునికి ధూర్తులతో అతిస్నేహం పనికిరాదు. దానివలన అతనికి చెడ్డపేరు వస్తుంది. సఖ్యం అంటే స్నేహం, చెలిమి, మైత్రి అని అర్థాలు. పొసగుట అంటే సరిపడటం, ఇమిడిపోవటం. వేమనే "పొసగ మేలుచేసి పొమ్మనుటె చావు' అన్నాడు మరోచోట. 'వాడికీ నాకు పొసగదు' అని వాడుక. 'పొసగ వజ్రంపు పాపట బొట్టుపెట్టి' అని ప్రయోగం.

అలాగే ఓ మంచి పనిపెట్టుకున్నవాడు ఓర్పును కోల్పోకూడదు. చంచలమనస్కతతో తెగేదాకా లాగకూడదు. చలం అంటే హటం, పట్టుదల అని అర్థాలు.

ఇదంతా బాగానే వుంది కాని, ఇద్దరు మంచి వాళ్లగురించి చెప్పి ఇప్పుడు చెడ్డవాడి ప్రసక్తి ఎందుకు? ఎందుకంటే మంచివారు గీతదాటితే జరిగే అనర్థాల గురించి చెప్తూనే మోసగాడు చేసే సత్ప్రవర్తన నాటకం ఎక్కువకాలం నిలువదు అని హెచ్చరిస్తున్నాడు వేమన. 'పొసగకపోవటం' అనేది ఈ పద్యంలో ముఖ్యమైన భావాంశం. కుత్సితుడు అంటే నికృష్టుడు, మాత్సర్యం కలవాడు అని అర్థం. కుత్స అంటే తిట్టు లేక నింద.

ఆధ్యాత్మిక విషయాల్లో వేమనకు ఎంత అనుభూతి వుందో లౌకిక, సామాజిక విషయాల పట్ల కూడా అంతే అవగాహన ఉందని చెప్పటానికి ఈ పద్యం ఒక ఉదాహరణ.

**భూతి దేహమందు పూసితే నాయనా**
**నిష్ఠ శివుని యందు నిలుప వలయు**
**కాక భస్మమందు గాడిద పొర్లదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏ మతమైనా వెర్రితలలు వేసినప్పుడు వేషధారితనంవైపు మళ్లుతుంది అని ఆక్షేపిస్తున్నాడు వేమన. బూడిద పూసుకొని 'శివోహం శివోహం' అని ముక్తి పొందామని అరిచే వీరశైవ గుంపులను ఉద్దేశిస్తూ వేమన ఈ పద్యం చెప్పివుంటాడు. ఏమంటున్నాడు?

దేహం నిండా బూడిద పూతలు రాసుకొని ఊరేగితే చాలా? శివుడికీ జీవుడికీ మధ్య ఆభేదాన్ని సాధించడానికి శివుడి కోసం తపస్సు చెయ్యాలి కదా! కేవలం బూడిద పూతలే ప్రమాణమైతే బూడిదలో పొర్లాడే గాడిదకు కూడా కైవల్యం సిద్ధిస్తుంది. 'పూసితే నాయనా' అంటే పూసుకుంటే సరిపోతుందా అని.

వీరశైవం శైవం నుండి వచ్చిన ఒక శాఖ. దీనిని లింగాయతమని కూడా అంటారు. వీరశైవుల దార్శనిక సిద్ధాంతం శివవిశిష్టాద్వైతం. దీని ప్రకారం శివుడే పరతత్త్వం. ఆ శివుడు శక్తి విశిష్టుడు. అతడు స్థితికారకుడు, లయకారకుడు కూడా. వీరశైవులు మాయావాదాన్ని అంగీకరించరు. వీరశైవ దర్శనంలో స్థలం, లింగం, అంగం అనే మూడు ముఖ్యమైన మాటలున్నాయి. స్థలమంటే ప్రదేశం అనే అర్థంలో వాడబడే ఆధారభూమి. ఘనలింగమంటారు దీన్ని. లింగమంటే జీవులపైన జాలితో ఉపాస్యదేవతగా మారినది. ఇక అంగం? లింగారాధన చేసే జీవుడే అంగం. శివుడూ జీవుడే. వ్యవహారంలో లింగమే అంగం.

అంగరూపంలో వున్న జీవుడు సాంసారిక దుఃఖం నుండి విముక్తుడు కావటానికి తపస్సు చెయ్యాలి. ఆ తపస్సు చేసే సామర్థ్యం జీవునికి 'శక్తి' నుండి లభిస్తుంది. అంటే భక్తి, శక్తులు రెండూ ఒక్కటే అని సారాంశం. ఇంత గొడవుంటే దాంభిక జీవితం వల్ల ముక్తి లభిస్తుందని భ్రమింపజేస్తే ఎలా అంటున్నాడు వేమన.

భూతి అంటే ఐశ్వర్యం, సంపద, సత్త, పుట్టుక అనే అర్థాలున్నా ఇక్కడ భస్మం. భస్మం అంటే ఏదైనా కాలితే తెల్లగా ఏర్పడే పొడి, బూడిద. నిష్ఠ అంటే స్థూలంగా ఏకాగ్రత.

**భూపతి దయ నమ్మి భూమి చెరచు వాడు**
**ప్రజల ఉసురుతాకి పడును పిదప**
**ఎగురవేయు బంతి ఎందాక నిలుచురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రాజు ఆసరా చూసుకొని, రైతులను బాధించి భూములను పాడు పెట్టడానికైనా వెనుదీయని అధికారులకు ప్రజల ఉసురు తప్పకుండా తగుల్తుంది. అలా తగిలినవాడు ఎత్తులనుంచి కిందికి పడిపోతాడు. ఎట్లా? ఎట్లాగంటే పైకి ఎగరేసిన బంతి వెంటనే కిందపడ్డట్టు. బంతిని ఎగరేస్తే పైన శూన్యంలో ఆగిపోదుకదా!

దీని నేపథ్యమేమిటంటే పాలకులు వ్యవసాయానికి తరచుగా పన్నులు పెంచేవారు. 14వ శతాబ్దం నాటికే ధనరూపంలో చెల్లించాలనే ఒత్తిడి మొదలయ్యింది. దీనితో రైతుల ఆర్థిక పరిస్థితుల్లో సమూలమైన మార్పులు మొదలయినాయి. ఉన్న భూములమ్మి పన్ను చెల్లించి ఊరు విడిచి వలసల పాలయ్యేవారు. మరోచోట కౌలుకు చేసినా ఇదే పరిస్థితి.

ధనరూపేణా చెలామణి వచ్చిన తర్వాత కాపులు ఎప్పుడూ భూస్వామికి రుణపడి ఉండేవారు. రుణం మోయలేని వారిని తొలగించి వేరేవారికి కౌలుకిచ్చే వారు భూస్వాములు. రైతులు క్రమంగా వ్యవసాయ బానిసలుగా మారిపొయ్యేవారు. ఒకనికింద ఎప్పుడూ పొలం ఉంచని వాన్ని రైతులు తిట్టుకునేవారు. ఇటువంటి పరిస్థితి వలన రైతుల్లో అసంతృప్తి ప్రబలింది. ఫలితంగా నిస్పృహతో భూములను వదిలేసి వలసపోయే వారు. రైతులు భూములను వదిలేసి వెళ్లడం వంటి ఇటువంటి తిరుగుబాట్లను అధికారులు నిర్దాక్షిణ్యంగా అణచివేసిన సంఘటనలు చరిత్రలో వున్నాయి.

గ్రామాలు నిర్లక్ష్యం చేయబడి రాజధానికి ప్రాధాన్యం హెచ్చుతున్న రోజులవి. మండలాధిపతికి వివిధ వృత్తులవారిని సలహామండలిగా నియమించుకోవడం పద్ధతిగా వుండేది. రాను రాను వీరికి ప్రాధాన్యం తగ్గి మండలాధిపతి వద్ద భూస్వాముల ప్రాబల్యం మొదలయ్యింది. సముద్ర సుంకాలు, సంత సుంకాలు భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు వసూలు చేసేవారు. రాజధాని విదేశీ యాత్రికుల ఆకర్షణ కేంద్రంగా మారింది. దీనివల్ల గ్రామాల మీద ఒత్తిడి పెరిగింది. పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ రాతల ప్రకారం అప్పట్లో దిగుబడిలో పదింట తొమ్మిది వంతులు రైతులు అధికారులకు పన్నులు చెల్లించేవారు. ఆ పన్నుల కోరల్లో చిక్కిన వారి ఉసురు ఊరికే పోతుందా అంటున్నాడు వేమన.

ఉసురంటే ఏమిటి? ఉసురంటే దుఃఖం. 'నా ఉసురు నీకు తగుల్తుంది' అంటే నన్ను బాధించిన దాని దుష్ఫలితం నీకు ముడుతుందని. సందర్భాన్ని బట్టి శ్వాస, నిట్టూర్పు అనే అర్థాలు కూడా వున్నాయి.

'ప్రజల గోడు తాకి ప్రబల బోడు' (డి. 1721, 170) అనే పాఠముంది గాని దీనికన్న పద్యంలోని పాఠమే మెరుగు.

**భూమిలోన పుట్టు భూసారమెల్లను**
**తనువులోన పుట్టు తత్త్వమెల్ల**
**శ్రమములోన పుట్టు సర్వము తానౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సాగు చేయగా చేయగా భూమి సారవంతమై పంటలనిస్తుంది. చింతన చేయగా చేయగా శరీరంలోని మనసులోంచే సత్యం పుడుతుంది. అలాగే సమస్త ఉత్పత్తి ప్రపంచం శ్రమశక్తిలోంచే పుడుతుంది. ఒక విషయం భౌతికం కానివ్వండి, ఆధ్యాత్మికం కానివ్వండి, వాటి మధ్యలోని క్లిష్టమైన ఆంతరిక సంబంధాలు కానివ్వండి వేమన్న ఆలవోకగా చెప్తాడనటానికి ఈ పద్యం ఒక ఉదాహరణ.

సారం అంటే శ్రేష్టమైనది, సర్వోత్తమమైనది, నిగ్గు, ఆయువుపట్టు అని అర్థాలు. భూమిలోని సారమే విత్తనానికి ఆయువుపోస్తుంది. ఈనాడు సంప్రదాయ ఎరువులను నాశనం చేసి రైతులను రసాయనిక ఎరువుల చక్రబంధంలో ఇరికించారు. వాటికోసం కూడా ఉద్యమాలు! ఈనాటి భూసారం దైవాధీన ప్రక్రియలో భాగమైపోయింది. తత్త్వం అనేది పెద్దమాట. అక్షయ పాత్రలాంటిది. తత్త్వమంటే ప్రకృతి, స్వభావం, మూలకం, అస్తిత్వం, ఉనికి, సారం, మనసు, మేధ, సత్యం, పూర్ణత్వం, ఆధ్యాత్మికత, వేదాంతం. ఇంకా ఆయా సందర్భాలను బట్టి మరెన్నో! శ్రమ అంటే స్థూలంగా పని. ఛాయలను బట్టి అలసట, ప్రయాస, కష్టం. శ్రమపెట్టుట అంటే బాధించుట అని అర్థం.

సకల సంపదలకు మూలం భూసారమే. పరమజ్ఞానానికి నిలయం శరీరమే. శరీరం అంటే శరీరం లోని మనసూ ఆత్మలన్నమాట! విరాట్ స్వరూపమైన విశ్వసత్యంలో ఇవీ భాగాలే.

అక్కడ భూమిలోంచి పంటలు రావాలన్నా ఇక్కడ తనువులో తత్త్వం పండాలన్నా కావలిసిందేమిటి? శ్రమ. పనితోనే వీటిని సాధించాలి. వ్యవసాయంలో రెక్కలు ముక్కలు చేసుకుంటేనే ఫలసాయం. నిరంతర మననం, ధ్యానం చేస్తేనే తత్త్వజ్ఞానం.

మానవసమాజ పురోగతి శ్రమశక్తి మీద ఆధారపడి ఉందన్న సాంఘిక యథార్థాన్ని వేమన్న ఆనాడే గుర్తించాడు. అదే ఆయన ప్రత్యేకత.

**భూమిలోన పుణ్యపురుషులు లేకున్న**
**జగములేల నిలుచు పొగులు గాక**
**అంత తరచు దొరకరాద నాడనుగాని**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

భూమి నిండ అంతటా దుర్మార్గులేనా? మంచి వాళ్లు లేరా? లేకేమి, ఉన్నారు. వారే లేకుంటే ఈ లోకాలన్నీ కాలి నుసైపోయి ఉండేవి గదా! అయితే ఒకటి. ఇటువంటి సజ్జనులు ఎక్కువగా ఉండరు. అక్కడక్కడ తక్కువ సంఖ్యలో వుంటారు అంటున్నాడు వేమన.

లోకమంతా నాశనమౌతుందని నిరాశపడుతున్న కాలంలో ఈ పద్యం ద్వారా ఆశాదీపం వెలిగిస్తున్నాడు వేమన. భూమిపైన పాపులేకాదు పుణ్యులు కూడా ఉన్నారు. కాని వారు అరుదు. అరుదు అన్నంతమాత్రాన వారి శక్తి తక్కువదని కాదు. వారి వల్లనే ఈ లోకం తూకం తప్పకుండా నడుస్తుంది. తొలిపాదంలో 'భూమిలోన' అంటూ రెండోపాదంలో 'జగములు' అంటున్నాడు కవి. జగం అంటే ప్రపంచంతో పాటు ప్రదేశం అనే అర్థం కూడా వుంది. అనేక లోకాలుగావున్న ఈ మహాలోకం కూడా మంచి వాళ్లు లేనట్టయితే 'పొగులుగాక' అంటే పొగిలిపోయి ఉండేది. పొగులుట అంటే దుఃఖం చేత తపించడం, దగ్ధమైపోవడం అని అర్థాలు. కాని వీరు తరచుగా కనిపించరు. తరచుగా అంటే ఏమిటి? మాటి మాటికి అని. భౌతిక శాస్త్రంలో తరచుదనానికి పౌనఃపున్యం అని ఒకమాట ఉంది. ఇంగ్లీషులో దీన్ని ఫ్రీక్వెన్సీ అంటారు. ట్యూనింగ్ ఫోర్కును కొడితే అది ప్రకంపనాలను సృష్టిస్తుంది. ట్యూనింగ్ ఫోర్కును మనవారు ఏనాడో శ్రుతిదండం అని చక్కగా అనువాదం చేసిపెట్టారు. మరి ఈనాడు తెలుగుమీడియంను ఎత్తివేస్తూ మరోసారి తమ ఆంగ్ల వ్యామోహాన్ని చాటుకుంటున్నారు మనవాళ్లు. శ్రుతిదండం యొక్క పౌనఃపున్యాన్ని కంపన సంఖ్యతో కొలుస్తారు. వేమన ఈ అర్థంలోనే వాడుతున్నాడా? కాదు. తరచుగా దొరకరు అంటే తడవ తడవకని కాదు. అక్కడక్కడ అని. తరచుగా వచ్చారు అంటె గుంపులుగా వచ్చారని. వేమన్న వాడే 'తరచు' స్థలవాచకమే కాని కాలవాచకం కాదు. ఆడనాడను (ఆడన్+ఆడన్) అంటే అక్కడక్కడ అని. ఆడ అంటే అక్కడ, స్త్రీ వాచకం కాదు. గ్రామాల్లో ఈ మాట ఇప్పటికీ సజీవంగా వుంది.

ఏ వ్యవస్థలోని వారైనా అందరూ ధూర్తులే, పాపులే అని నిర్ణయానికి రావటం తొందరపాటే అవుతుంది. అక్కడక్కడ ద్వీపాల్లాగ మహానుభావులుంటారు. వారిసంఖ్య నాటి అధర్మస్థితిని ఎదుర్కోగలిగినంతగా ఉండకపోవచ్చు. కాని అధర్మం వారికి భయపడుతుంది. ఇంతకూ లోకంలో వేమన లాంటి వారు ఎందరున్నారు? ఇదీ అంతే!

**బొంది ఎవరి సొమ్ము పోషింప పలుమారు**
**ప్రాణమెవరి సొమ్ము భక్తి సేయ**
**ధనము ఎవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇవాళ నీది అనుకుంటున్నదేదీ నీది కాదు అంటే ఎప్పటికీ నీతో ఉండేది కాదు అని చెప్తున్నాడీ పద్యంలో వేమన. శరీరం పట్ల అంత శ్రద్ధ తీసుకుంటున్నా వెందుకు? అది ఎప్పుడూ ఇలాగే వుంటుందా? జరా దుఃఖం ఉండనే వుంది కదా! ప్రాణమూ అంతే! ఊపిరి ఎప్పుడు ఆగిపోతుందో తెలియదు. భక్తిని కలిగి ఉండటమే చాలనుకుంటున్నావా? అది కాలయాపన కదా! జ్ఞానయోగం ముఖ్యం. నువ్వు ఇప్పుడు ఆచరిస్తున్న వేవీ శాశ్వతం కాదు, ధనమూ అంతే! అది స్వార్జితమేనా? అది నీ చేతిలో ఎంతకాలముంటుందంటావు. ధర్మమొక్కటే నువ్వు పోయినా మిగిలి ఉండేది తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

బొంది అంటే దేహం. దీనికి బాల్యం, యౌవనం, వృద్ధాప్యం చివరికి మరణం అనే పరిణామముంది. కాబట్టి నువ్వు దానికి చేసే పోషణ తాత్కాలికమే. బొందితో కైలాసం వెళ్తారంటారు, అంటే సశరీర ముక్తి. అది నీకు సాధ్యమయ్యే పనేనా? బొంది దేశీయ పదం. కన్నడంలో కూడా బొంది. తమిళంలో పొంది.

ప్రాణం అంటే ఆత్మనుండి ఉద్భవించిన జీవశక్తి. అది మళ్లీ ఆత్మలోకే వెళ్లిపోతుంది. భక్తి సేయ అంటే భక్తిని చూపడం, ఆచరించడం. భక్తి అంటే అంకితభావం. ధనం కలకాలం ఉంటుందనుకోవడంలోనే నీ అజ్ఞానం ఇమిడి ఉంది. దానిని దానధర్మాలకు వెచ్చించడమే వివేకం.

ధర్మాన్ని గురించి గతంలో అనేకసార్లు ప్రస్తావించడం జరిగింది. “తనువు ఎవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము (డి.1735–431)” అనేది పాఠాంతరం.

**మంచి రుచులగోరు మంచి స్త్రీలను గోరు**
**మనుజుడెంత చెడ్డ మనసుచూడ**
**ఇంచుకంతయైన 'ఏల'ని విడువడు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

అతనికి జిహ్వాచాపల్యం ఎక్కువ. నిత్యం ఇష్టమైన రుచులతో వంటకాలు కావాలి. అతనికి స్త్రీ లోలత్వం మెండు. తరచుగా సుందరీమణుల పొందుకై ఆరాటపడతాడు. ఆలోచిస్తే అతని మనస్సు ఇంత చంచలమా అని ఆశ్చర్యం వేస్తుంది. అరె! వీటి వల్ల ఏం ప్రయోజనం! అని కొంచెం కూడా ఆలోచించడేమిటి ఇట్లాంటి వాడికి మోక్షమెలా సాధ్యం అని జాలి పడుతున్నాడు వేమన.

అతడు ఇంద్రియ కర్మబద్ధుడు. వాటివల్ల కలతలు తప్ప ఒరిగేదేముంటుంది. పైగా అహంకారం, భ్రాంతి తోడవుతాయి. ఇంతటి మాయా పరివృతుడు జ్ఞాన మార్గానికి మళ్లటం అయ్యేపని కాదని సారాంశం.

'మంచి' అనేది పెద్దమాట. ఎవరికి మంచి? తనకా, అందరికా? ఇక్కడ తన మంచే. మంచి రుచులు అంటే తనకు ప్రియమైనవని. మంచి అంటే మనోజ్ఞమైన, ఇంపైన వంటి అర్థాలతో పాటు ప్రశస్తమైన, శ్రేష్ఠమైన, స్వచ్ఛమైన, అధికమైన అనే ఛాయలు కూడా ఉన్నాయి. మంచి గంధం అంటే సానమీద తీసిన గంధం, మంచి బంగారం అంటే కల్తీలేని బంగారం, మంచి ముత్యం అంటే అకృత్రిమమైన ముత్యం, మంచి వాన అంటే పెద్ద వర్షం, మంచివాడు అంటే సజ్జనుడు ఇలా.

రుచి అంటే నాలుకకు ఇష్టమైందని. ప్రకాశమని కూడా మరో అర్థం. చెడ్డ అంటే తప్పు. దుష్టమైన అని కూడ. అతడు మంచి స్త్రీలను కోరుకుంటాడు. చెడ్డస్త్రీలను కాదు అంటే కులటలను కాదు. తాను మాత్రం చెడ్డ పనులు అంటే కాని పనులు చెయ్యటానికి సిద్ధం.

ఇంచుక అంటే కొంచెం. ఇంచుకంత అంటే కొంచెమైనా అని. ఏల? అంటే ఎందుకు? అనవసరం అని. ఇంద్రియసుఖాలు అనవసరం అనుకున్నప్పుడే జ్ఞానమార్గం యొక్క అవసరం తెలుస్తుందని వేమన్న ఉవాచ.

'మనసుదెంత చెడ్డ మతము చూడు, ఇంతకంతయైన ఎడబాయునివ్వడు (డి.1725-507) అనేది పాఠాంతరం.

**మంచివారు లేరు మహిమీద వెదకిన**
**కష్టులెందరైన కలరు భువిని**
**పసిడిలేదు గాని పదడెంత లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కల్మషం లేనివారు లోకమంతా వెతికినా దొరకరు. కాని నీచులకు కొదువ లేదు. బంగారం లభించడం కష్టం గాని దుమ్మూధూళీ ఎక్కడ పడితే అక్కడ వుంటాయి.

మంచివారు అంటే ఉదాత్తులు, స్నేహశీలం గల వారు అని చెప్పొచ్చు. మంచి అనేది సాపేక్షకం. ఏది మంచి ఎవరికి మంచి ఏ పరిస్థితుల్లో మంచి అనే ప్రశ్నలు వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఎదుటివాడికి మేలు చేసేది, కనీసం హాని చెయ్యనిది మంచి అని చెప్పాలి. మంచికి ఎన్నో ఛాయలు. మంచినీళ్లు అంటే తాగేనీళ్లు, మంచి నిద్ర అంటే గాఢనిద్ర వాటిలో కొన్ని.

'మంచివారులేరు' అంటే అసలే లేరని కాదు. అరుదు అనే అర్థం తెలుసుకోవాలి.

కష్టుడు అంటే నీచుడు. కష్టాత్ముడు అంటే పాపాత్ముడు. వేమన్న ఈ మాటను తరచుగా వాడతాడు. మంచి వాళ్లెంత స్థిరమైనవాళ్లో కష్టులంత చంచలమైనవాళ్లు. పసిడి అంటే బంగారం, బంగారం బరువైంది, పచ్చటి ప్రకాశంతో కళ్లకు హాయి గొలిపేది. పదడు అంటే దుమ్ము. దుమ్ము తేలికైంది. పదడు పదర్ అనే తమిళపదం నుంచి వచ్చింది. దుమ్ము కళ్లలో పడి దృష్టినడ్డగిస్తుంది. "పదడు చేపట్టెడు పసిడియై వెలుగ; పదడు చేపట్టుడు పసిడియై చనదె" అని ప్రయోగాలు.

మంచివాళ్లు బంగారమంత విలువైన వారు, అరుదైనవారు. మంచివారి స్నేహాన్ని పొందాలంటే భూమిలోంచి బంగారాన్ని వెలికి తీయటమంత కష్టపడాలి అనేది వేమన్న సారాంశం.

**మంట, లోహమందు, మాకుల, శిలలందు**
**పటము గోడలందు ప్రతిమలందు**
**తన్ను దెలుసు కొరకు తగలదా పరమాత్మ!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పరమాత్మ అన్నింటా వున్నాడు. మట్టిలో వున్నాడు. లోహంలో వున్నాడు. చెట్లలో, రాళ్లలో వున్నాడు. గోడలకు తగిలించిన చిత్తరువుల్లో ఉన్నాడు. సమస్త విగ్రహాల్లో ఉన్నాడు. అంతెందుకు నిన్ను నువ్వు తెలుసుకునే క్రమంలో నీకే గోచరిస్తాడు గ్రహించు అని ఉపదేశిస్తున్నాడు వేమన.

సగుణ నిర్గుణోపాసనలకు సంబంధించిన పద్యమిది. ఒక పరమ చైతన్యం అన్ని వస్తువుల్లోనూ వుంది. అలాగే నీలోనూ వుంది అనేది సారాంశం. పరబ్రహ్మం సర్వవ్యాపి. అదే సర్వం కూడా. మట్టి వస్తువుల్లో లేదా? మంట అంటే మట్టిలో అని. మంటికి సప్తమీ విభక్తి రూపం మంట. చెట్లు రూపొందిన విశేషాకృతుల్లో లేదా? మ్రాకు అంటే చెట్టు. ఇది దేశీయపదం. మూలద్రావిడపదం 'మర్'. కన్నడంలో మర అంటారు. శిలలన్నీ విగ్రహాలే. పటం అంటే చిత్తరువులు రాసే వస్త్రాదికం. ఇవన్నీ పరమాత్మకు ప్రతిబింబాలు. కాని వీటి బింబం నీలోనే వుంది. దర్శించడమే నీ పని అని భావం. 'తన్ను దెలుసు కొరకు' అంటే నిన్ను నువ్వు తెలుసుకునే క్రమంలో అని అర్థం. 'పటము గోడలందు పరగయిసుక, నంటి కొరతకందు నందు పరమాత్ముని (డి.1769-270) అనేవి పాఠాంతరాలు.

**మంటికుండ వంటి మాయ శరీరంబు**
**చచ్చునెన్నడైన చావదాత్మ**
**ఘటము లెన్నియైన గగనంబు యేకమే**
**విశ్వదాభిరామ వినురవేమ.**

గుణాలతో మలినమైపోయిన మానవ శరీరం మట్టితో చేసిన కుండలాంటిది. దానికి చావు వుంటుంది గాని దానితోపాటు ఉండే జీవాత్మకు మరణం లేదు. ఎట్లాగంటే కుండలెన్ని ఉన్నా అవి కుండలుగా వున్నా పగిలి ముక్కలైపోయినా వాటిలో ఉండే ఆకాశం మాత్రం ఒక్కటే అంటున్నాడు వేమన.

కుండ నీటిలో ఆకాశం ప్రతిఫలిస్తుంది. అది ఆకాశ ప్రతిబింబం. కుండపగిలితే ప్రతిబింబం నశిస్తుంది గాని దానికి కారణమైన ఆకాశం నశించదు అని సారాంశం.

అంతేకాదు అస్థిరమైన ఈ శరీరం మాయశరీరం. మాయ అంటే ఏమిటి? పరస్పర విరుద్ధధర్మాలతో కనిపించేదే మాయ. అంటే!? జడత్వమూ వుంటుంది చైతన్యమూ వుంటుంది. అలాగే ఆనందమూ ఆనందరాహిత్యమూ రెండూ.

మన్ను అంటే భూమి, నేల అని అర్థాలు. తమిళంలో మణ్, కన్నడంలో మణ్ణు. మన్నుకు 'ఇ' చేరి ఔపవిభక్తిక రూపం 'టి' వచ్చి షష్ఠ్యర్థంలో మట్టి, మంటి అయ్యాయి. తెలంగాణాలో 'మంటి' రూపానికి వాడుక ఎక్కువ. మంట అంటే మంటిలో అనే సప్తమీ విభక్త్యర్థకం.

ఘటాన్ని వేదాంత పరిభాషలో దేహానికి సంకేతంగా వాడతారు ఇక్కడ కుండే. గగనం అంటే ఆకాశం. కుండ నీటిలో ప్రతిఫలించే ఆకాశాన్ని ఘటాకాశం అంటారు. ఆత్మస్వరూపమైన మహాకాశంలో ఇదోభాగం. ఇది నశిస్తుంది. అది నశించదు.

ఆత్మ యొక్క స్థిరత్వాన్ని తెలిపే పద్యమిది. దేహం అస్థిరత్వాన్ని కూడా.

'ఘటము వ్రక్కలైన గగనంబు వ్రక్కలా (డి.1723–652) అనేది పాఠాంతరం.

**మంత్రమెల్ల మరచి మధురాధరము దల్చు**
**ఏ విధమున భక్తుడెరుగు నిన్ను**
**యోనిజూచి పరమయోగంబు మరతురా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'ఓ దేవా! ఎన్ని దివ్యమంత్రోపదేశాలు చేసినా స్త్రీ సంబంధమైన శృంగార భావాలను వదులుకోడు. ఏం భక్తుడితడు? ఇట్లా అయితే నిన్నెలా తెలుసుకుంటాడు? ఎక్కడైనా తుచ్ఛమైన మన్మథ స్థానం కోసం అత్యున్నతమైన యోగస్థానాన్ని మరిచి పోతారా? ఎంత అజ్ఞానం! అంటున్నాడు వేమన.

మంత్రం అంటే మననం చేసేది. ఇది వాక్కు రూపంలో ఉండే దేవత. మననం చేసేవాణ్ని ఇది రక్షిస్తుంది. గురువు ఉపదేశించిన మంత్రాన్ని గుర్తుంచుకుంటాడు గాని అది మగువను చూడనంత వరకే. చూడగానే మంత్రాన్ని మర్చిపోతాడు. మధురాధరము అంటే తియ్యని పెదవి. ఇటువంటి చంచలమనస్కుడైన భక్తుడు భగవంతుణ్ని ఎలా చేరుకుంటాడు?

అసలు భక్తుడంటే ఎవరు? దేవుని యందు విశ్వాసం, అంకితభావం, సేవానిరతి గలవాణ్ని భక్తుడంటారు. భక్తి అనేక రూపాల్లో వ్యక్తమౌతుంది. వాత్సల్యం, ఆసక్తి, పూజ, భజన, నిగర్వం, భగవంతుని కథా శ్రవణం, నిరంతరస్మరణ, మాంసాహార విసర్జన, భూతదయ వీటి ద్వారా భక్తి వ్యక్తమౌతుంది. మరి ఈ భక్తుడు మధ్యలో పక్కదారి పడుతున్నాడు. ఇక అతనికి దేవుడెలా చిక్కుతాడు?

కొందరు యోగులు కూడా ఇంతే. పైగా పరమయోగులు! పరమ అంటే ఉత్తమ స్థితికి చేరుకున్నవారు. ఇంతకూ యోగమంటే ఏమిటి? ఒక్కమాటలో చెప్పాలంటే కలయిక. జీవాత్మ పరమాత్మల ఐక్యమన్నమాట. యోగం వల్ల ఏం కలగాలి? ఇంద్రియనిగ్రహం అలవడాలి, చిత్త నిరోధక శక్తి రావాలి, అనాత్మభావ నివృత్తి ఏర్పడాలి. కాని ఇక్కడ ఏం జరుగుతుంది? చిత్తవృత్తి నిరోధం చిత్త చాంచల్యానికి దారి తీసింది. స్త్రీని చూడగానే అన్నీ పటాపంచలవుతున్నాయి. అంటే పునాదులు సరిగ్గా పడలేదన్న మాట. జన్మస్థానంగా చూడవలసిన స్త్రీని మన్మథస్థానంగా చూస్తున్నాడన్నమాట. ఇక ఆ యోగం ఎందుకు పనికొస్తుంది? "నీదు యొడలెల్ల యొక వేయు యోనులై యుండ యెడమంచు శపియింప యింద్రుడెంతయును" అని ప్రయోగం.

ఎంతో సాధనతో ఒక స్థితికి చేరుకున్నవాడు అల్పమైన వాటికోసం కిందికి పడిపోరాదు అని వేమన్న ఉవాచ.

**మక్కకు జననేల మగుడతా రానేల?**
**ఏకమైన కర్తయిందు లేడొ!**
**అన్నిట పరిపూర్ణుడల్లా మహమ్మదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎక్కడో సముద్రాల కవతల ఉన్న మక్కాకు ప్రయాసపడి తీర్థయాత్రగా వెళ్లడమెందుకు? అంతే కష్టపడి తిరిగి రావడమెందుకు? అక్కడా ఇక్కడా ఉన్న దేవుడు ఒక్కడే కదా! దేవదూత అయిన మహమ్మదు గానీ, దేవుడైన అల్లాగాని అవిభాజ్యంకాని పరిపూర్ణులని గ్రహించమంటున్నాడు వేమన.

వేమన యోగి కవి. 17వ శతాబ్దం నాటి తెలుగు భక్తి ఉద్యమ కవుల్లో అగ్రగణ్యుడు. ఉత్తర భారతం లోని కబీరులాంటి 'సంత్' కవులు కూడా ఈ కోవకు చెందిన వారే. ముస్లిందేశాల్లోని సూఫీ కవులూ అంతే. వీరు భగవంతుడితో ప్రత్యక్ష సంబంధం పెట్టుకున్న తాత్వికులు. మతాచారాలు సత్యానికి అడ్డుపడితే వాటిని విమర్శించడానికైనా వెనుదీయని వారు. ఇక్కడ వేమన్న మనవారిని విమర్శించినట్టే ఇతరుల్నీ వదిలిపెట్టలేదు.

మక్కానగరం ముస్లింల పవిత్రమైన తీర్థ స్థలం. ఇది ప్రస్తుత సౌదీ అరబ్ దేశంలో వుంది. మక్కాలోని మసీదులో చతురస్రాకారంలో ఉన్న నల్లరాతి బండను దర్శించి తరిస్తున్నామని భావిస్తారు. దానినే కాబా అంటారు. మక్కాయాత్రను హజ్ అనీ యాత్రికుడిని హాజీ అని పిలుస్తారు.

అల్లా అంటే దేవుడు. మహమ్మదు దేవుడు స్వర్గం నుండి పంపించిన చివరి ప్రవక్త. అల్లాకు రూపం లేదు. ఇస్లాం విగ్రహారాధనకు విరుద్ధం. కాని వేల సంవత్సరాల క్రితం ఈ మసీదులో ఆలయాలు, విగ్రహాలు ఉండేవి. అయితే అప్పటి ప్రవక్త అబ్రహం కాలంలో అవి తొలగించబడ్డాయి. కాని అవి అనంతరకాలంలో పునరుద్ధరించబడ్డాయి. అయితే మహమ్మదు కాలంలో మళ్లీ అవి పూర్తిగా తొలగించబడ్డాయి. అప్పటి నుంచి ఇస్లాం పూర్తిగా నిరాకార మతం. హిందూ జీవన విధానంలో విగ్రహారాధన ఇప్పటికీ సజీవంగా ఉంది. తాత్విక చింతనతోపాటు. కబీరు హిందూ, ముస్లిం ఆచారాలను సమానంగా విమర్శించాడు. వినండి.

*'కాకర్‌పాతర్ జోడ్కైకె మస్జిద్‌లయ్ ఓ బనాయ్*
*తాపే ముల్లా బాంగ్‌దే. క్యా బహరాహు ఆ ఖుదాయ్' (అవధీభాష);*

(రాళ్లూ కంకరను కలిపి మసీదును నిర్మించావు. వాటి మీదెక్కి ముల్లా గట్టిగా అరుస్తున్నాడు. ఏమిటి దేవుడికేమన్నా చెవుడా?)

తీర్థయాత్రలను ఖండించిన వేమన మక్కా యాత్ర కూడా అనవసర మంటున్నాడు. అయితే దీనిలో ఓ మానవీయకోణం కూడా వుంది. మక్కాయాత్రకు అప్పుచేసి పోగూడదు. జబ్బు చేస్తే వెళ్లగూడదు. ఆడపిల్ల పెళ్లిలాంటి బాధ్యతలున్నప్పుడు ఈ ప్రయాణం పెట్టుకోగూడదు. అన్నీ బాగుండి సమృద్ధిగా డబ్బులున్నప్పుడే వెళ్లాలి. కాబట్టి వేమన పేదవారి గురించి కూడా ఆలోచిస్తున్నా డనుకోవాలి.

మక్కాలాగే క్యాథలిక్ క్రైస్తవులకు రోమ్‌లోని వాటికన్ సిటీ వుంది. యూదులకు, క్రైస్తవులకు, మహమ్మదీయులకు పాలస్తీనా జెరూసలేం పవిత్రస్థలాలుగా ఉన్నాయి.

మక్కాకు పోనేల మళ్లి తారానేల (డి.1725-366) అనేది పాఠాంతరం.

**మతము భేదముగల మాయ సంసారియై**
**దారి తెలియలేదు తమకమొంది**
**దారి తెలియునతడు ధన్యుడు కాడొకో**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తాను ఒక మతానికి చెంది ఇతరుల మతం దానికంటే భిన్నమైందని భావించేవాడు మాయలో చిక్కుకున్న సంసారి వంటివాడు. అతడు తన మోహావేశంలో దారితప్పాడు. అట్లా దారి తప్పి దిక్కుతోచక పరిభ్రమించేవాడెప్పుడూ అనుకున్నది సాధించలేడు. అతడనుకున్నదేమిటి? తత్వం. తత్వం తెలియనివాడికి సర్వ సమత్వం సిద్ధించదు అంటున్నాడు వేమన.

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడోమాట చెప్పుకోవాలి. పాశ్చాత్య విద్వాంసుడైన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమనపద్యాలపైన ఎంతో కృషి చేశాడు. వేమనను 'నా కవీ' అని కూడా అన్నాడు. అయితే వేమన బ్రౌన్‌కు ప్రీతిపాత్రం కావడానికి కేవల యాదృచ్ఛిక ఘటన మాత్రమే కారణం కాదు. బ్రౌన్ పాశ్చాత్యుడు. యూరోపీయ మానసిక జీవితాన్ని అవగతం చేసుకున్నవాడు. గ్రీకు దర్శనం దానినెట్లా ప్రభావితం చేసిందో ఎరిగినవాడు. గ్రీకు తాత్వికులు మానవ స్వభావాన్నీ, సంస్థల్నీ, నీతుల్నీ, ఆచారాల్నీ నిష్పాక్షికంగా వివేచించినవారు. తరచుగా మతాన్ని దర్శనం నుండి వేరుచేసి చూపించారు. కాబట్టి వారిది స్వతంత్ర దృష్టి. కొంతవరకు మన వేమన అట్లాంటివాడు. అందుకే వేమన ఆంగ్లేయులకు సులభంగా అర్థమౌతాడని బ్రౌన్ భావించాడు. వేమనను గ్రీకు కవి లూషియన్‌తో పోల్చాడు. యాదృచ్ఛికం కాదన్నంత మాత్రాన బ్రౌన్ ప్రభ ఏమాత్రం తగ్గదు. ఆయన అప్పటికీ ఇప్పటికీ తెలుగు సూర్యుడే. ఇక భారత దర్శన ప్రస్థానాలన్నీ శ్రుతి పైన ఆధారపడ్డాయి. తీర్థంకరుల వచనాలను ప్రమాణంగా గ్రహించాయి. కాని మతాలను అంటిపెట్టుకోవటంవల్ల వాటి చింతనారీతులకు లభించిన స్వేచ్ఛ అంతంత మాత్రమే. అటు గ్రీకుల తత్వధార హేతువుపైన మానవుని తార్కికబుద్ధిపైన, ఇంద్రియానుభవంపైన ఆధారపడే ప్రయత్నం చేసింది. మనకు ఆత్మ చరమ గమ్యం. వారికి జ్ఞానం పరమావధి. "మతములన్నియు మాసి పోవును/జ్ఞానమన్నది నిలిచి వెలుగును" అన్న గురజాడ గేయానికి ప్రేరణ పాశ్చాత్యమే కావచ్చును. వేమన తన స్వతంత్రదృష్టివల్లా, మౌలిక విచారధార వల్లా కర్మకాండలు మొదలైన వాటిని ఖండించాడు. దాని వల్ల ఒక వర్గంవారి అపార్థానికి గురయ్యాడు. ఇది చరిత్ర. అయితే తాత్విక దృష్టితో

చూసినప్పుడు భారతదేశంలోని ఏ యోగి పుంగవునికీ వేమన తీసిపోడని ఇందువల్ల అర్థమౌతుంది.

పై పద్యంలో వేమన మతభేదాల కన్న తత్వమే గొప్పదంటున్నాడు. భేదం అనేది తాత్విక స్థాయిలో ఒక మాయ. మాయతో సంసారం ఒక శృంఖల, ఒక చీకటి. ఈ చీకటిలో దారితప్పడం కంటే దారి తెలుసుకొని గమ్యం తెలుసుకోవడం మంచిది. తమకం అంటే విరహం, కోరిక, ఉత్కంఠ అని అర్థాలు. ఉత్కంఠ మాని సరైన దారిలో వెళ్లటమే కర్తవ్యం. అలా వెళ్లగలిగినవాడే ధన్యుడవుతాడు. ధన్యుడు అంటే పుణ్యాత్ముడు, కృతార్థుడు. భేదరాహిత్యాన్ని విడనాడి ఏకత్వాన్ని చేరుకున్నప్పుడే అతనికి సాఫల్యం సిద్ధిస్తుంది అని వేమన్న ఉవాచ.

**మధురసంబు గోరి మక్షికంబులు చేరి**
**చొచ్చి వెడలలేక చొక్కినట్లు**
**మునిగి విడువలేడు మూఢుడు కర్మల**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈగలేం చేస్తాయి? ద్రాక్షరసంపైన వాలుతాయి. వాలి దాని తీపికి మత్తెక్కిపోయి బయటికి రాలేక ఒకరకమైన మూర్ఛస్థితిలో ఉండి పోతాయి. మూర్ఖుడూ అంతే! కర్మబంధాల్లో చిక్కుకొని వాటి సుఖదుఃఖాల్లో మగ్నుడై ముక్తుడు కాకుండా పోతాడు. నిజానికి అతడు తాగాల్సింది ఆత్మజ్ఞానమనే అమృతం, అప్పుడే ముక్తి లభిస్తుంది అని వేమన్న సారాంశం.

మధురసం అంటే ద్రాక్షరసం, తేనెకాదు. మధువు అంటే తేనె. ఈ పద్యానికి కొందరు తేనె పరంగా అర్థం చెప్పారుగాని అది పొసగదు. తేనెటీగలు తేనెను సేకరించి తెట్టెలో దాచుకుంటాయి దానిని తింటాయి కూడా. మరి మనకు లభించే తేనె ఎక్కడిది? అవి తినగా మిగిలిందా? కాదు అవి తినకముందే మనుషులు దోచుకునేది. దొంగలం మనం. 'చొచ్చి' అంటే ప్రవేశించి. 'వెడలలేక' అంటే బయటపడలేక, చొక్కు అంటే మత్తు, నిద్రాస్థితి. మత్తెందుకు అంటే చక్కెర పదార్థం వల్ల. అధిక చక్కెర వల్ల నాడీమండలం మత్తెక్కి ఈగలు పడుకుంటాయి. మనకు కూడా తీపి ఎక్కువ తింటే నిద్రవస్తుంది.

ఈగ తీపికి లోబడినట్లే మనిషి మోహాలకు ఆకర్షితుడైతే బయటపడటం అసాధ్యం. అట్లాంటివాడు మూర్ఖుడు కాక మరేమిటి? అంటున్నాడు వేమన.

'మునిగి వెడలలేడు మోహంబు రాశిలో (డి.1721-488) అనేది పాఠాంతరం.

**మనసు పూనిగెల్చి మనసులో సుఖియించి**
**కడకు మోక్షపదము గనునువాడు**
**చెట్టు బెట్ట ఫలము చేకూరకుండునా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనసులో నిరంతరం జరిగే ప్రక్రియలను జయిస్తే, అంటే అదుపు చేసుకోగలిగితే అది మోక్షమార్గానికి మొదటి మెట్టు అవుతుంది. ఎప్పుడైతే నువ్వు చెట్టును నాటావో అది పుష్పఫలాలను ప్రసాదించకుంటుందా? ప్రయత్నించు అంటున్నాడు వేమన.

శరీరంతో పోల్చుకొని మనస్సు అంటే ఏమిటో కొంత అర్థమౌతుందేమో చూద్దాం. మనస్సూ శరీరం కలిసే వుంటాయి. సహచరులన్నమాట! మానసిక ప్రక్రియల్లో మార్పులు వస్తే తదనుగుణంగా శారీరక ప్రక్రియల్లో కూడా మార్పులు వస్తాయి. ఈ మార్పుల మధ్య కార్యకారణసంబంధాలు ఎవరికీ పూర్తిగా తెలిసినట్టు లేదు. కాని మనిషికి తన అనుభవం వల్ల వీటి ఉనికి తెలిసిపోతూనే వుంటుంది. మనశ్శరీరాలు రెండూ ఒకప్పుడు భిన్నంగా కనిపిస్తాయి. మరోసారి వ్యతిరేకించు కుంటాయి కూడా.

శరీరమే మూలం. మనస్సు దానిలోకి వచ్చిచేరిందని కొందరంటారు. కాదు మనస్సే ముఖ్యం. భౌతిక ప్రపంచం అది కల్పించుకున్నదే అని మరి కొందరు. మనస్సూ శరీరం రెండూ సమానమే అయినా ఒకదాని పరిధిలోకి మరొకటి దూరి జోక్యం చేసుకుంటూ రెండవదానిపై ప్రభావం చూపిస్తాయి అని తాత్పర్యం. ఏది ఏమైనా మనశ్శరీరాల మధ్య సంబంధం యొక్క స్వభావం అర్థమైతే చాలా సమస్యలు పరిష్కారమౌతాయనిపిస్తుంది.

ఇక్కడ వేమన్న ఏమంటున్నాడంటే మనసులోని మార్పుల్ని అరికట్టగలిగితే శరీరమూ దానిని అనుసరిస్తుంది. శరీరజోక్యం లేని మనస్సు సుఖాన్ని పొందుతుంది. అప్పుడది ఉన్నతమైన సాధనకు వేదికగా మారుతుంది.

మనోవికారాలు లేని భూమిలో సాధన అనే చెట్టును నాటితే దానికి కాసే ఫలం మోక్షమే అని సారాంశం. 'మనసు పూని గెల్చి మన్న సుజ్ఞానుల/కరుణ మోక్ష పదవి గన్నవారు' (డి.1736, 81) అనేవి పాఠాంతరాలు.

**మనసులోన నున్న మమతలన్నియు గోసి**
**దృఢము చేసి మనసు తేటపరచి**
**ఘటము నిల్పువాడు ఘనతర యోగిరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనసులోని అహంకారాన్ని తొలగించుకోవాలి. మనసును స్థిరపరచుకోవాలి, శుభ్రపరుచుకోవాలి. అట్లా మనసును ఉంచుకొని దేహాన్ని అదుపు చేసుకోగలిగిన వాడే నిజమైన యోగి అవుతాడు అంటున్నాడు వేమన.

మనసు అంటే చిత్తం, హృదయం అని అర్థాలున్నా తాత్త్వికంగా చెప్పాలంటే ఇది జీవాత్మ కంటె భిన్నమైన జ్ఞాన జనక ద్రవ్యం. దీనికి మనన ధర్మం ఉంటుంది. దీనికో రూపం ఉండదు కాబట్టి ఇంద్రియాల ద్వారానే వ్యక్తమౌతుంది. లోకంలో ప్రేమికులు మనసును పారేసుకున్నామంటారు. ఇది కవితాత్మకంగా చెప్పడం. నిజానికి పారేసుకునేది తలపులనే కాని మనసును కాదు.

మమత అంటే నాది అనే అభిమానం. దీనిని నిర్దాక్షిణ్యంగా తీసేసుకోవాలి. కోసి అనే మాటవాడాడు వేమన. దృఢం చేసి అంటే పటిష్టపరచుకొని అని. తేట అంటే స్వచ్ఛత, నిర్మలత్వం. తేట అంటే ఒక పదార్థం లోని సారం ద్రవపదార్థాలపైన తేలే భాగాన్ని తేట అంటారు. అట్లా పరిశుభ్రమైన మనస్సుతో శరీరాన్ని నిర్వహించుకోవాలి. ఇక ఘటం. ఘటం అంటే కుండ. ఇది దేహానికి సంకేతం. ఘటం అనేది శరీరానికి వేదాంత పరిభాష. ఘటం అంటే కుంభకం అనే ఒక ప్రాణాయామ భేదం కూడ.

ఘనం అంటే దృఢత్వం, దిటవు అని అర్థాలు, గట్టిదైన అని. తోడుకొన్న పెరుగులో పైదీ కిందదీ కాక నడిమి గట్టి భాగాన్ని ఘనం అంటారు. ఘనతరం అంటే మరింత గట్టిదని. యోగసాధనకు ముందుగా కావల్సినవి నిర్మమత్వం, మానసిక నిర్మలత్వం, ఇవి పూజకు ముందు ఇల్లు అలకటం లాంటివి.

"మనసులోన నున్న మర్మమెల్లదెలసి, దిట్టపరచి మనసు తేట జేసి (డి.1773-5-2068) అనేవి పాఠాంతరాలు.

**మన్నును తినుమంటె మండేరు జనులార**
**మంటిలోని మేలు మరువనేల**
**నీళ్లలోని మేలు నిఖిలమైయుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

'నీ నోట్లో మన్నుబడ' అంటే అది తిట్టు. అలా తిడితే ఎవరికైనా మండుతుంది. అంటే కోపం వస్తుంది. మట్టిపట్ల చులకన భావంతో అట్లా అనిపిస్తుంది గాని ఒక్కక్షణం ఆలోచించి చూడండి మట్టి ఎంత గొప్పదో! ఎంత మేలు చేస్తుందో అలాగే నీరు కూడా. రోజూ మనచుట్టూ వుండి మన జీవితంలో భాగమైపోయిన పదార్థాల అంతరార్థాన్ని గమనించమంటున్నాడు వేమన. అలాగే తీవ్రమైన కరువుకాలంలో ఏమి దొరక్కపోతే మనుషులు ఒండ్రుమట్టి తినేవారని చెప్తారు.

అంతా మట్టిలోంచే వచ్చింది అంటాం. మట్టి సర్వధారి. పోషక పదార్థాలన్నింటికీ భూమే ఆధారం. దేహబలం, ఆత్మశక్తీ అన్నీ మట్టి ప్రసాదించినవే. అయితే నీరూ తక్కువదేం కాదు. నీటి తోడ్పాటు లేకపోతే మట్టిలోంచి సృష్టి జరగదు. మనిషి దేహంలో మూడొంతులు నీరే వుంటుంది. భూగోళంపైన కూడా 99 శాతం నీరే. మట్టి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనేవి పంచభూతాలు. మొదటి రెండు జీవి దేహ ధారణకు తోడ్పడితే తరువాతి మూడు జీవికి ప్రాణం పోస్తాయి. ఇది స్థూలంగా పైకి చెప్పేది. కాని అన్నీ కలిస్తేనే జీవి.

మన్ను ద్రావిడభాషాపదం. మూల ద్రావిడంలో మణ్ అంటారు. కన్నడంలో, తమిళంలో మణ్ణు. భూమి, నేల, ఇసుక, దుమ్ము అని అర్థాలు. మంటి అనేది మన్నుకు ఔప విభక్తిక రూపం. తెలంగాణలో మట్టిలో అనడానికి బదులు మంటిలో అంటారు. మంటబెట్టుట అంటే మట్టిలో పూడ్చి పెట్టడమన్నమాట! ఇక్కడ మంట (అగ్ని) ప్రసక్తి కాదు.

'మన్నుదిన్న పాము' అంటారు పల్లెల్లో. ఆహారం దొరకనప్పుడు పాము మట్టి తింటుందని ఒక నమ్మకం. మట్టిని తిని కదలకుండా పడివుంటుందని. అందుకే అది తిట్టు అయ్యింది. 'దానిని తిట్టుగా భావించి బాధపడకండి' పరోక్షంగా వివిధరూపాల్లో జీవులన్నీ మట్టినే తింటున్నాయి గదా అని తత్త్వీకరణ చేస్తున్నాడు వేమన.

**మన్ను మెత్తి కరిగి మరి రూపు గావించి**
**గుంట నింద పూడ్చి గురుతు నిల్పి**
**మనుజులెల్ల గూడి మరి దేవుడందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎవరైనా చనిపోతే ఆ శవాన్ని పాతిపెట్టి ఆ గుంటను పూడ్చేస్తారు. గుర్తుకోసం దానిమీద రాయో రప్పో, చెట్టుకొమ్మో పెడతారు. కొన్నాళ్లకు ఆ స్థానంలో ఆ వ్యక్తి విగ్రహమో, దేవతా విగ్రహమో మరేదైనా చిహ్నమో తయారుచేయించి ప్రతిష్టిస్తారు. దానిని దేవుడిగా కొలుస్తారు అని ఒక ఆచారాన్ని గురించి చెప్తున్నాడు వేమన. ఆ ఆచారంలో పసలేదని వేమన్న అభిప్రాయం కాబోలు.

ఈ పద్యం ఖనన సంప్రదాయాన్ని చెప్తున్నది అంటే చనిపోయిన తర్వాత పాతిపెట్టే ఆచారం. మనలో శైవులకు ఈ పద్ధతి ఉంది. యూదులు, క్రైస్తవులు, మహమ్మదీయులకు కూడా అంతే. చచ్చిపోయిన ప్రాణి అప్పుడప్పుడు వచ్చి తన సమాధిని చూసి పోతుందని ఒక విశ్వాసం. సాంచి, అమరావతి, నాగార్జున కొండ స్థూపాలు బుద్ధుని శారీరక అవశేషాలమీద కట్టినవే.

మొదటిపాదంలో ప్రతిమను తయారుచేసే ప్రక్రియను గురించి చెప్పాడు వేమన. మైనాన్ని (wax) ఒక రూపంగా తయారుచేసి దానికి మట్టిని మెత్తుతారు అంటే పూస్తారు. దాన్ని వేడి చేస్తే లోపలి మైనం కరిగిపోతుంది. అప్పుడా ఖాళీలో కరిగించిన లోహద్రవం పోస్తారు. అప్పుడది పటిష్టమైన విగ్రహంగా రూపొందుతుంది. వేమన్న కాలానికి డొల్ల విగ్రహాలు లేవని దీనివల్ల తెలుస్తుంది. వేమనకు 200 ఏండ్ల తరువాతి వాడైన సి.పి. బ్రౌన్ కూడా లోహద్రవంతో నింపడం గురించిన అర్థం చెప్పాడు. కాని బ్రౌన్ కాలానికి (క్రీ.శ.1829) డొల్ల విగ్రహాలు వచ్చేశాయి. వేమనకు దాదాపు ఒకటిన్నర శతాబ్దం ముందటి వాడైన శ్రీకృష్ణదేవరాయల కాలంలో బృహత్ విగ్రహాలు లేవు. ప్రతిమలు 2,3 అడుగుల్ని మించవు. అప్పటి దేవాలయాలను చూస్తే మనకీ సంగతి తెలుస్తుంది. చనిపోయిన వ్యక్తి శివసాయుజ్యం పొందాడని భావించి అతన్ని దేవుడిగా పరిగణించే సంప్రదాయం వచ్చి ఉంటుంది. దానిని వేమన ఒక తాత్త్విక స్థాయిలో బేరీజు వేస్తున్నాడు. 'గుంటనిండ బూడ్డె గురుతు నునిచి' (డి.1723, 1089) అనేది పాఠాంతరం.

**మాటదిద్దవచ్చు మరి యెగ్గు లేకుండ**
**దిద్దవచ్చు రాయి తిన్నగాను**
**మనసు దిద్దరాదు మహినెంతవారికి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తప్పు మాట్లాడినా పెద్ద ఇబ్బంది లేకుండా దానిని సరిచేసుకోవచ్చు. అలాగే కర్కశమైన శిలను కూడా చెక్కి మనోహరమైన శిల్పంగా మలుచుకోవచ్చు. కాని ఈ మనస్సు ఉందే దీనిని యోగ్యమైన మార్గానికి మళ్లించడం దుర్లభం అంటున్నాడు వేమన.

'ఎన్నగ మనసే కారణమన్నిటికిని' అని అన్నాడు వేమన్నే మరోచోట. అన్నిటికి మూలమైన మనస్సు తనపట్ల నిస్సహాయమైపోతుంది ఎంత విచిత్రం!

దిద్దుట అంటే సింగారించటం, నేర్పటం అనే అర్థాలున్నా ఇక్కడ సరిదిద్దటమే. పొల్లు మాట్లాడినా దానిని తెలుసుకొని మళ్లీ అలాంటిది రాకుండా చూసుకోవడమే విజ్ఞత. ఎగ్గు అంటే కీడు, సిగ్గు అని అర్థాలు. మాటను దిద్దుకుంటే కొంపలేం మునిగిపోవు. కాని దిద్దుకోకుంటే అంటే చేసిన తప్పే చేస్తే మాత్రం తప్పకుండా మునిగిపోతాయి. 'ఎగ్గు' అనే మాటను ప్రయోగిస్తూ సుమతికారుడు ఓ అద్భుతమైన పద్యం చెప్పాడు వినండి.

*దగ్గర కొండెము సెప్పెడు*
*ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుడై మరితా*
*నెగ్గు ప్రజ కాచరించుట*
*బొగ్గులకై కల్పతరువు బొడుచుట సుమతీ!*

'తిన్నగాను' అంటే హాయిగా, సూటిగా, యోగ్యంగా అని అర్థాలు. ఇక్కడ సున్నితంగా అని ఎంత గట్టి రాయైనా ఓపిగ్గా, ఒడుపుగా చెక్కితే అనుకున్న రూపాన్ని రాబట్టుకోవచ్చు.

'మనసు దిద్దటం' అంటే ఏమిటి? మనస్సు క్షణం క్షణం మనో విక్షేపాలకు లోనవుతుంటుంది, విధ్వంసానికి గురవుతుంటుంది, మలినమౌతుంటుంది. దీనిని తెలుసుకున్నప్పుడు మాత్రమే చిత్తానికి ఏకాగ్రత కలుగుతుంది. ఏకాగ్రత కలిగినప్పుడు పైన చెప్పిన వికారాలన్నీ తొలిగిపోతాయి. అదే సరైన సమాధి. దానివల్ల దుఃఖం నశిస్తుంది, మనసు నిర్మలమౌతుంది, వైరాగ్యం దిశగా అభ్యాసానికి ఆయత్తమౌతుంది ముక్తి మార్గమంటే అదే అంటున్నాడు వేమన్న.

**మాటలాడ నేర్చి మనసు కరుగజేసి**
**పరగ ప్రియము పుట్ట పలుకకున్న**
**ఒకరి చేతి సొమ్ము లూరక వచ్చునా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

లోకంలో బతకాలంటే కొంత లౌక్యం కూడా తెలిసి వుండాలి. అతడు నీ యజమాని కావచ్చు లేదా నీతోటి వాడు కావచ్చు. అతనితో నీకు అవసరం పడింది. అప్పుడతనితో నీ ప్రవర్తన ఎలా వుండాలి. చక్కగా మాట్లాడాలి. అతని మనస్సు కరిగేట్టుగా మాట్లాడాలి. అతనికి ఇష్టమయ్యేట్టుగా మాట్లాడాలి. అతని దగ్గర ఉన్న సంపదలోంచి కొంత నీ చేతికి రావాలంటే అది అంత సులభమా? అంటూ లోకధర్మాన్ని వివరిస్తున్నాడు వేమన.

మాటకు ఉన్న శక్తి మారి దేనికి లేదు. "మాట్లాడితే మల్లెలు కాట్లాడితే కందిరీగలు" అని సామెత. "అతని మాటలకు పేదరికము లేదు" అని మరో సామెత. అంటే ఎన్నైనా మాట్లాడతాడు, వాగ్దానాలు చేస్తాడు, కాని పైసా విదిలించడు అని తాత్పర్యం. ఇతరులకు నచ్చేటట్టుగా మాట్లాడాలన్నప్పుడు వారిని ప్రశంసించాలని కాదు, అబద్ధాలాడాలని కాదు, ఆత్మవంచన చేసుకోవాలని కాదు. మృదువుగా కాఠిన్యం లేకుండా, నీ అవసరంలోని సామంజస్యం అతని మనసుకు హత్తుకునే టట్టుగా ఉంటే చాలు అంటున్నాడు వేమన. 'ప్రియము' అంటే ఇష్టమైనది. ప్రియవచనములు చెప్పి దాన్ని తీసుకొని వచ్చినాను" అని జనం లోని వాడుక.

**మాటలాడవచ్చు మనసు నిల్పగరాదు**
**తెలుపవచ్చు తన్ను తెలియరాదు**
**సురియబట్టవచ్చు శూరుడు కారాదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మూర్ఖుడు ఎన్ని మాటలైనా చెప్పొచ్చు, శాస్త్రాలు వల్లించవచ్చు కొంచెం సేపైనా ఏకాగ్ర చిత్తంతో ఉండలేడు. ఎదుటివారికి తెలియజెప్పటానికి ఎంతో ప్రయత్నం చేస్తాడు కాని తననుతాను తెలుసుకోవడానికి ఇసుమంత ప్రయత్నముండదు. ఇదెట్లా ఉంటుందంటే చేతిలో కత్తి పట్టుకున్నంతమాత్రాన శూరుడు అవుతాడా? కాడు.

సురియ అంటే చిన్నకత్తి. చురియ, సూరకత్తి, చూరకత్తి, చూరుకత్తి అని కూడా అంటారు. శూరుడు అంటే వీరుడు, శౌర్యం కలవాడు, వీరత్వం కలవాడని. యుద్ధభయంలేని వాడు శూరుడు.

ఇక్కడ 'సురియ' అనే మాటను వాడటం గమనార్హం. అంటే చిన్న కత్తి కరవాలం కాదు. పట్టిందేమో చిన్న కత్తి చేసేవేమో యుద్ధప్రలాపాలు. అటువంటివాడు శూరుడెలా అవుతాడు?

తన్ను తాను తెలుసుకోలేనివాడు ఎదుటివారికి తెలియజెప్పేది కల్ల అని సారాంశం.

**మాటలాడవేరె మనసు కొలది వేరె**
**ఒడలి గుణము వేరె ఓజ వేరె**
**ఎట్లు గల్గు ముక్తి ఏలాగు తనలాగు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

మాటల్లో పైకి చెప్పేదొకటి, మనసులో ఉండేదొకటి. శరీరం తత్త్వం ఒకటి, అంతః కరణంలో అనిపించేదొకటి. ఇలా అయితే ముక్తి ఎలా లభిస్తుంది? దానికోసం ఏ దారిలో వెళ్తున్నట్టు? అని ప్రశ్నిస్తున్నాడు వేమన.

సత్యం, జ్ఞానం, తపస్సు అనేవి ముక్తికి మార్గాలు. అట్లాంటప్పుడు త్రికరణ శుద్ధి లేకుండా ప్రయత్నిస్తే ఆ మార్గం సరైంది కాదు. దానివల్ల ముక్తి సిద్ధించదు అని వేమన్న ఉవాచ.

మాటకు అర్థం చెప్పడమంటే మాటలా!! ఈపద్యంలో మాట అంటే మాట్లాడేది. దీనికి వాగ్దానం, అభిప్రాయం, ప్రసక్తి వంటి అర్థాలున్నాయి. ఇక సందర్భం మారినప్పుడల్లా మాటకు అర్థం మారుతుంది. వాని మాట కాదు అంటే వాని గురించి కాదని. మాటపడడు అంటే ఆరోపణకు తావివ్వడని. నా మాట దాటకూడదు అంటే నా ఆజ్ఞ మీర రాదని. నా మాట నీమాటా వేరు అంటే అభిప్రాయ భేదముందని. ఇద్దరికీ మాటలు లేవు అంటే సంబంధాలు బెడిసికొట్టాయని. ఇదే చివరిమాట అంటే వ్యాపారంలో బేరమాడే విధం. ఇలా ఎన్నో! 'మాటలు మంచివేగాని మనసు మంచిది కాదు' అనేది సామెత.

ఇంతకు 'మనసు కొలది' అంటే ఏమిటి? కొలది అంటే కొద్ది, కొలత, ప్రమాణం, ఎత్తు, లోతు అని అర్థాలు. 'తలపు కొలది బడదు దైవికమేగాని' అన్నాడు వేమన్నే మరోచోట. సందర్భాన్ని బట్టి మారే అర్థాలు మరి కొన్ని. ఆయన చిత్తం కొలది యెరిగి ప్రవర్తించాలి అన్నప్పుడు ఆయన అభిప్రాయం ప్రకారమని. నోటికొలది అంటే నోటికొచ్చినంత అని. మోకాలి కొలది నీరు అంటే మోకాలి వరకు అని. "గుడ్లకొలదిగ కన్నీరు గ్రుక్కు కొనుచు" అనేది ప్రయోగం.

'ఒడలి గుణం' అంటే ఏమిటి? ఒడలు అంటే ఒళ్ళు, శరీరం. ఒడలు+లు ఒడళ్లు అన్నప్పుడు అవయవాలని. ఇది దేశీయపదం. తమిళంలో ఉడల్, కన్నడంలో ఒడల్ అంటారు. ఒడలి గుణం అంటే శరీర ప్రవృత్తి. శారీరక, మానసిక ప్రవృత్తులు వేరు వేరని చెప్పటం కష్టమేగాని అరిషడ్వర్గాల్లో కొట్టొచ్చినట్టు బహిర్గతమయ్యే కామం, మదం లాంటి ఇంద్రియ ప్రవృత్తులే ఒడలి గుణాలు.

ఓజ అంటే విధం, సన్మార్గం, నీతి, ప్రకృతి వరుస లాంటి ఎన్నో, అర్థాలున్నాయి. ఇక్కడ ఆలోచన, యోచన అనేవి సరిపోతాయి. ఓజకు అర్థం ఇంగ్లీషులో ఇంట్యూషన్ లాంటిది.

త్రికరణాల మధ్య ఐక్యత లేనివాడికి ముక్తి దొరకదని సారాంశం.

**మ్రానులోన అగ్ని మరి ఉండగా వచ్చు**
**అగ్ని నుండ మ్రాను కలవి గాదు**
**మ్రానులోని యగ్ని మర్యాద సంసారి**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

చెట్టులో అంతర్గతంగా నిప్పు వుంటుంది. కాని బాహ్యంగా అదే చెట్టు నిప్పులో పడితే కాలిపోతుంది. చెట్టులో వున్న అగ్ని ఎప్పుడోగాని బయట పడదు. అది హద్దు దాటని గృహస్థులాంటిది. తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

చెట్టులో నిప్పు ఉండటమేమిటి? అడవిలో కార్చిచ్చు పుట్టదా? దావానల మంటారు దాన్ని. గాలికి కదిలి చెట్టూ చెట్టూ రాసుకోవడం వల్ల అగ్గి పుడుతుంది. ఆ అగ్గి చెట్టులోంచి వచ్చిందా రాపిడిలోంచి వచ్చిందా అనేది ఒక మీమాంస. వేమన్నే మరోచోట "తరువ తరువ పుట్టు తరువున అనలంబు" అన్నాడు. 'కారు చిచ్చునకు గాడ్పులు దోడగు చందమొందగన్" అని కావ్య ప్రయోగం.

మ్రాను అంటే చెట్టు అని చెప్పాలా? రా వత్తులేని వాడుక రూపం మాను. 'మానూ మాకును కాను' అన్నాడు ఆత్రేయ ఓ చలన చిత్ర గీతంలో. సహజ సందర్భాల్లో మనిషి కన్న మానే శక్తిమంతం అని ఆయన అనుకొని వుండడు. అయితే అక్కడి సన్నివేశం వేరు. మాను అంటే నిశ్చలమైంది. కదలనిది అని కూడా.

చెట్టు తనలోని అగ్నిని బహిర్గతం చెయ్యనంతవరకు ఇబ్బంది లేదు. ఏ గాడ్పు ప్రమేయంతోనో తోటి చెట్టు ప్రమేయంతోనో నిప్పులు కక్కిందా ఆ నిప్పుల్లోనే అది దహించుకపోతుంది. అందుకే అంటున్నాడు వేమన చెట్టులో ఒదిగివున్న చిచ్చు మర్యాద సంసారి అని. మర్యాద అంటే హద్దు. గౌరవం, సక్రమ ప్రవర్తన, నీతిపద్ధతి లాంటి అర్థాలు కూడా వున్నాయి. సంసారి అంటే గృహస్థుతోపాటు కులస్త్రీ అని కూడా. సంసారం అంటే కుటుంబం, కాపురం, ప్రపంచం అని అర్థాలు. జనన మరణాల పరంపర, విషయభ్రాంతిని కూడా సంసారమంటారు. తాత్త్వికంగా సంసారి అంటే జీవాత్మ, ప్రాణి, జంతువు అని కూడా చెప్పుకోవచ్చు. అట్లాగే చెట్టులోని కార్చిచ్చును ఆత్మలో మనస్సును స్థిరంగా ఉంచడంగా ధ్వనిస్తున్నాడు వేమన.

**మాల మాలగాడు మహిమీద నేప్రొద్దు**
**మాట తిరుగు వాడు మాలగాక**
**వాని మాలయన్న వాడెపో పెనుమాల!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ప్రవర్తనవల్లనే మాల కావాలి గాని జన్మచేత ఎవడూ మాలకాదని వేమన నిశ్చితమైన వాదన. 'మాట తిరుగువాడు' అంటే మాట తప్పేవాడే మాల. అస్పృశ్యతను పాటిస్తూ, శాస్త్రాధారాలు చూపిస్తూ దొంగతర్కాలు చేసేవాడే మాల. వొట్టిమాల కాదు పెనుమాల! అని గద్దిస్తున్నాడు వేమన.

మొదటి రెండు పాదాల్లో ఏదో వాదనకు పూనుకున్న వేమన్న కోపం మూడోపాదంలో తారస్థాయికి చేరుకుంది. కవికి సాత్త్విక గుణం, కోమల హృదయం ఉండాలని భావించేవారు ఈ కోపంలో ఉన్న ధర్మాగ్రహాన్ని గమనించాలి. వేమన్నది స్వార్థంలోంచి పుట్టిన ఆక్రోశం కాదు. మానవుడు మానవుడిగా మనలేకపోతున్నాడే అనే ఆవేదనలోంచి పుట్టిన పొలికేక అది. తోటి మనిషిని అనాదరించేవారు. 'నరపశువులు' అని తిట్టాడు మరోచోట.

ఇట్లాంటి అభిప్రాయాన్నే గురజాడ మరోవిధంగా

**"మంచియన్నది మాల అయితే**
**మాలనేనగుదున్"** అని చెప్పాడు.

**మాలవాని నంటి మరి నీళ్ల మునిగేరు**
**మాలకర్మ చేత మాలడయ్యె**
**ఏల తెలియలేరొ యీ నర పశువులు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వేమన్న దృష్టిలో మాలను ముట్టుకొని నీళ్లలో మునగటమే మాలకర్మ. పశువులు దిగటం వల్ల నీళ్లు మురికి అవుతాయి. నరపశువులు దిగినా అంతే.

కుల వ్యవస్థ ఖండన వేమన్నతోనే పుట్టలేదనీ 4,8 శతాబ్దాల్లోని తంత్ర సంప్రదాయాలు కులాన్ని వ్యతిరేకించాయని చారిత్రక పాండిత్యం ప్రదర్శించవచ్చు. 11,12,13 శతాబ్దాల్లోని ఆధారాలు చూపెట్టవచ్చు. శైవ, వైష్ణవాల కులభేద నిరసనను దృష్టాంతాలుగా పేర్కొనవచ్చు. బ్రహ్మనాయుని 'చాపకూడు'ను ఉదాహరణగా చూపెట్టవచ్చు. కాని ఇవేవీ కులనిర్మూలన కోసం వేదనతో, కోపంతో వేమన్న వేసిన పొలికేక ప్రాధాన్యాన్ని తగ్గించలేవు.

హెచ్చు తగ్గుల్లోని అమానుషత్వాన్ని గుర్తించి తీవ్రమైన భావావేశంతో, అపారమైన మానవతాదృష్టితో చేసిన విమర్శలు వేమనవి. అదే ఆయన ప్రత్యేకత.

**మిరెపు గింజ చూడ మీద నల్లగ నుండు**
**కొరికిచూడ లోన చురుకుమనును**
**సజ్జనులగువారి సారమిట్టుల నుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మిరియం చూడటానికి పైకి నల్లగా ఉంటుంది. కాని కొరికి చూస్తేగాని తెలియదు దాని సారమెంతో. సజ్జనులు కూడా అంతే వారిని పైపైన చూసి విలువ కట్టకూడదు అని వేమన్న ఉవాచ.

ఈ పద్యంలో 'మిరపకాయ' అనే పాఠాన్నే చాలాకాలం నుంచి వాడుతున్నారు. కొన్ని తాటాకు ప్రతుల్లో, చాలా అచ్చు ప్రతుల్లో ఇదే వుంది. ఈ మధ్య మళ్లీ ప్రాచీన ప్రతులు తిరగేస్తుంటే డి.1723 ప్రతిలో 'మిరెపు గింజ' పాఠం కనిపించింది (పద్యం నెం.350) వేమన కాలానికి మిరపకాయలంటే మిరియాలే.

మరి ఇప్పటి మిరపకాయలకు (chilly) ఆ పేరు ఎట్లా వచ్చింది? మిరప పంటను మొదటిసారి ఇండియాకు పోర్చుగీసువారు తెచ్చారు. 1498లో వాస్కోడిగామా కాలికట్‌లో దిగాడు. 16వ శతాబ్దంలో పోర్చుగీసువారు గోవాను పాలనాకేంద్రంగా ఏర్పరచుకున్నారు. మరి మన గుంటూరు జిల్లాకు ఎప్పుడొచ్చిందీ పంట? మార్కొపోలో మోటుపల్లి రేవును సందర్శించిన తర్వాత ఈ పంటకు క్రమంగా ఆ ప్రాంతంలో ప్రాచుర్యం లభించివుంటుంది. కాబట్టి వేమనకు మిరప పంట తెలియదు. మిరప వచ్చిన తర్వాత దానికేం పేరు పెట్టాలి? మిరియంలో కూడ కారం ఉంది కాబట్టి దానికాపేరు పెట్టారు. బ్రౌణ్య నిఘంటువులో కూడా మిరియాలు, మిర్యాలుఅంటే Black pepper అనే అర్థం ఉంది. "అది మొగని తలమీద మిర్యాలు నూరుతున్నది" అనే ప్రయోగం వల్ల మిరపకాదు మిర్యాలనే.

'మిరెపు గింజ చూడ మీద నల్లన నుండు' అంటే చిల్లీ నల్లగా ఉండదు కదా! పోర్చుగీసు వారు ఆ పంటను చిల్లీ దేశం నుంచి తీసుకొచ్చారు. అందుకే దానికాపేరు.

సారం అంటే శ్రేష్ఠమైన అనే అర్థం ఉన్నా చేవ, బలం, సత్తా అనే అర్థాలు ఇక్కడ సరిపోతాయి. సందర్భాన్ని బట్టి సారానికి ఛాయలు మారుతాయి. 'భూసారం' అంటే essence; 'ఇందులో సారం లేదు' అంటే పస లేదని; 'సారం లేని మాటలు' అంటే ఆర్ద్రత లేనివని.

సజ్జనుడు అంటే గౌరవనీయుడు, మంచివాడు అని.

నల్లని శరీరవర్ణం చూసి మనిషిని విలువ కట్టరాదు. తెల్లని మనోగతాన్ని చూడాలి. మిరియం పోలికను మనం ఈనాటి వర్ణ జాత్యహంకారాలకు కూడా అన్వయించుకోవచ్చు. 350 యేళ్లనాటి వేమన దర్శనం ఇప్పటికీ ఎంతటి విశాల రమ్యంగా ఉందో దీనివల్ల తెలుస్తుంది.

**మురియు వాడెవండు మురియని దెవ్వండు?**
**పాటు జేసి చూడ బట్టబయలు**
**సొరది జలఘటమున సూర్యుని చందంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆనందించేది నువ్వా? దుఃఖించేదీ నువ్వు కాదు. జాగ్రత్తగా ఆలోచించి చూస్తే ఆ రెండూ అంతరాత్మకే చెందుతాయి. వాటిని నువ్వే అనుభవిస్తున్నా వనుకోవడం ఎట్లా వుంటుందంటే నీటి కుండలో సూర్యుని ప్రతిఫలనాన్ని చూసి అదే నిజమనుకున్నట్టు.

నీటికుండలో సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ప్రకాశించేది సూర్యుడా? కాదు సూర్యుని ప్రతిబింబం. అయితే సూర్యబింబం స్వయంగా ప్రకాశిస్తున్నదా అంటే కాదు అనేది అనుభవ సత్యం. అట్లాగే సుఖదుఃఖాలను ఈ దేహమే అనుభవిస్తుందని అనుకుంటారు. కాని తరచి చూస్తే దేహంలోని చైతన్యమే వాటిని అనుభవిస్తుందని తెలుస్తుంది. నువ్వే అనుభవిస్తున్నట్టు ఎందుకనుకుంటున్నావు? భ్రాంతి వల్ల, అహంకారం వల్ల. తత్త్వసుందరమైన ఈ పద్యాన్ని వేమన ఎంత ఆలవోకగా చెప్పాడో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మురియుట అంటే ఉల్లాసపడటం, ఆశపడటం ఆనందించటం అని అర్థాలు. "పొన్నగున్నల నీడ కన్నెమావుల జాడ/మురియుచు దాగుడు మూతలాడు" అనేది ప్రయోగం. పాటుచేయు అంటే శ్రద్ధగా పరిశీలించడం. కష్టపడి అని కూడ. బయలు అంటే బ్రహ్మం. అచల సంప్రదాయంలో ఈ మాటను తరచుగా వాడతారు లౌకికార్థంలోనైతే బయలు అంటే బయట, బట్ట బయలు అంటే తేటతెల్లంగా అని.

సొరది అంటే వరుస, క్రమం పంక్తి అనే అర్థాలున్నాయిగాని ఇక్కడ పాదపూరణ స్థితిని మించలేదు. సొరది గురించి రాస్తూ సి.పి.బ్రౌన్ ఇట్లన్నాడు" "యీ శబ్దమును విశ్రమ నిమిత్తముగా ప్రయోగించి యున్నారేగాని యిందుకు విశేషమైన అర్థము కనపడలేదు".

సుఖదుఃఖాలను యోగనిష్టతో చూసినప్పుడు అవి తనవి కావనీ పరబ్రహ్మ స్వరూపమనే అనుభవం కలుగుతుందనీ వేమన్న ఉవాచ. పాటిచేసి (డి. 1722-6) అనేది పాఠాంతరం.

**మెలత నడవి నుంచి మృగము వెంటనె పోయె**
**రామచంద్రుకన్న రసికుడేడి?**
**చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పురాణ పాత్రలను పట్టించుకోవడం ద్వైత ధోరణుల్లో ఒక భాగం. సిద్ధాంతానికే అద్వైతంగాని ఆచరణలో అది సాధ్యం కాదని చాలామంది అనుభవం. అద్వైతంతో విభేదిస్తూ రామానుజుని విశిష్టాద్వైతం. మధ్వాచార్యుని ద్వైతం తలెత్తాయి. ఈ రెండూ కూడా  కొంత భేదంతో శంకరుని మాయావాదాన్ని ఖండించి ప్రపంచం యొక్క వాస్తవికతను అంగీకరించాయి. ఇవి అగాధమైన తాత్త్విక చర్చలను పక్కనబెట్టి వేర్వేరు మోతాదుల్లో భక్తి మార్గాన్ని ప్రచారం చేశాయి. ఆ పరంపరలోనే పురాణ పాత్రలను మానవ జీవన పరిస్థితులకు అన్వయించి, కొండొకచో హాస్యాన్ని పండించిన సందర్భాలు వేమన పద్యాల్లో వున్నాయి.

ఈ పద్యాన్ని చిత్తగించండి. సీతను అడవిలో ఒంటరిగా వదిలేసి బంగారు లేడిని పట్టుకోడానికి పరిగెత్తాడు. రాముడి రసికత తెల్లారినట్టే వుంది. అందమైన పడుచుభార్యను వదిలేసి జంతువు వెంట పడిపోతారా? ఆలోచిస్తే ఆపద రాబోయే ముందు విచక్షణ జ్ఞానం నశిస్తుంది అంటున్నాడు వేమన.

*పాఠాంతరం కాదు గాని ఇట్లాంటిదే మరో పద్యం వుంది.*
*'కనకమృగము భువిని కలదు లేదనడయ్యె*
*రామునంత వెర్రిరాజుగలడె*
*పురము దప్పి పోవ బుద్ధులు నిలువవు" అని.*

ఈ పద్యాన్ని గురించి గతంలో వివరించాను.

మెలత అంటే స్త్రీ, మెలయుట అంటే వర్తించేదని, జాగ్రత్తగా వుండేదని. మెలతకు మెలుత, మెల్త అనేవి రూపాంతరాలు. ఇది దేశీయపదం. తమిళంలో మెల్లి. మెల్లియర్ అంటే బలహీనులు. మృగం అంటే ఇక్కడ ఆడజింక.

'మెలతనింట నుంచి (డి.1773-1-190) అనేది పాఠాంతరం.

**మేక చంక బెట్టి మెలగుచు మందలో**
**భ్రమసి తిరుగు గొల్ల పగిదిగాక**
**దైవ మెర్గక పెరదైవతముల దల్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

తమలోనే ఒక భగవంతుడు నెలవై ఉన్నాడని తెలియక దూరదూర ప్రదేశాలకు యాత్రలు చేస్తూ తీర్థాలనూ క్షేత్రాలనూ సందర్శిస్తూ వివిధ దేవతలను సేవిస్తారు. ఇది నిజంగా అజ్ఞానం. ఇదెలా ఉంటుందంటే గొర్రెల కాపరి మేకను చంకలో పెట్టుకొని అది మందలో తప్పిపోయిందని బయట వెతికినట్టు అంటున్నాడు వేమన.

మెలగుట అంటే సంచరించటం. *"కొంతసేపున కా యిర్రి కొదమలేచి, అల్లనల్లన మెలగుచు నాకటికిని"* అని ప్రయోగం. భ్రమసి అంటే భ్రమ పడటమే, తబ్బిబ్బు కావటం. దేవుడు ఆత్మరూపంలో తనలోనే ఉన్నా దానిని కానక బయట ఉన్నాడని భ్రాంతి పడటం. కాపరీ అంటే మేక చంకలోనే వుంది, అయినా దానిని మరిచిపోయి మందలో వెతకటం ఇదంతా భ్రాంతి. మంద అంటే పశువుల సమూహం. పగిది అంటే విధం, వలె, సాధారణ స్వభావం కూడ. ఉపమాలంకారంలో ఉపమావాచకం. పెర అంటే ఇతర అని. "తన్నుగోరిన పెరవారలన్" అని ప్రయోగం. పెరవారలంటే ఇక్కడ పరపురుషులని.

వేమన తీర్థయాత్రలను, క్షేత్ర పర్యటనలను ఒక తాత్త్విక స్థాయిలో ఖండించాడు. వినటానికి సామాన్యులకు కటువుగా వుంటుంది గాని నిదానంగా ఆలోచిస్తే వేమన జ్ఞాన మార్గాన్ని బోధిస్తున్నాడని అర్థమవుతుంది.

"దైవ మెర్గ కితర దైవాల వెదకుట (డి.1723, 616) మేది నెల్ల తిరిగి, వెతికి తిరుగు గొల్ల వెర్రి రీతి (డి.1725-424) అనేవి పాఠాంతరాలు.

**మేఘమడ్డమైన మిహిరుని చెరచును**
**చిత్తమడ్డమైన స్థిరము చెరచు**
**మరపు లడ్డమైన మరిముక్తి చెరచును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మబ్బులు ముసురుకొని సూర్యకాంతిని అడ్డుకున్నట్టే సంకల్ప వికల్పాలకు లోనయ్యే మనస్సు వల్ల స్థిరత్వం చెడిపోతుంది. అట్లాగే భ్రమల్లో పడితే ముక్తి మార్గం మసక బారుతుంది.

చిత్తమంటే చైతన్యమే. అది నిరంతరం చలిస్తూ వుంటుంది. త్రిగుణాలకు లొంగిపోతుంటుంది. త్రిగుణాలు అంటే సత్వ రజస్తమోగుణాలు. స్థిరత్వం లేదా స్థైర్యం త్రిగుణాలకు అతీతమైంది. త్రిగుణాలను దాటిపోయినవాడు అంటే వాటి మధ్య సంతులనం సాధించినవాడు మాత్రమే స్థిత ప్రజ్ఞుడవుతాడు. మరపు అంటే చైతన్యరాహిత్యం అంటే భ్రమ అంటే పక్కదారి పట్టడం. భ్రమకు లోనైన వాడికి సత్యం స్పష్టంగా కనిపించదు.

మిహిరుడు అంటే సూర్యుడు. చెరచు అంటే భంగపరచు, వ్యర్థం చేయు, పాడు చేయు, తగ్గించు అని అర్థాలు.

ముక్తి సాధన కోసం యోగమార్గంలో ప్రస్థానించేవాడికి కావలిసిన జాగ్రత్తలు ఈ పద్యంలో వున్నాయి. ముక్తి అంటే సత్య సాక్షాత్కారం. చిత్తానికి కారణ ప్రజ్ఞ వుంటుంది గాని దాని అచంచల స్థితి వల్లనే స్థిరత్వం చేకూరుతుంది. సత్యం, చైతన్యం సూర్యుని వంటివి వాటిని చాంచల్యం, మరపు, అంటే పక్కదారి మళ్లడం లాంటివి కప్పివేయ కుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నాడు వేమన.

**మేడమీద నొక్క మెచ్చుల పడుచయ్యె**
**పడచు పలుకుచుండ భావమయ్యె**
**భావమందు పరము పరికించి చూడరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అనగనగా ఒక మేడ. ఆ మేడమీద ఓ అందమైన యువతి. ఆమె అక్కడి నుంచి మాట్లాడే మాటల్లో నాకు ఏదో అర్థం స్ఫురించింది. అది మోక్షానికి మార్గం కాదు గదా! ఆలోచించమంటున్నాడు వేమన.

ఇది కూడా పొడుపుకథ లాంటి పద్యమే. విప్పటం ఆయా సంప్రదాయాలు తెలిసినవారికి (Insiders) సుసాధ్యమౌతుందనుకుంటాను. అప్పటి వరకు బయటవారు కూడా అర్థం చేసుకోడానికి తమ వంతు ప్రయత్నం మానకూడదు.

*వేయి విధముల మర వేమన పద్యముల్*
*అర్థమిచ్చువాని నరసిచూడ*
*చూడ చూడ బుట్టు చోద్యమూ జ్ఞానంబు ॥విశ్వ॥*

ఈ పద్యం వేమన పద్యాల్లో ఉన్నా వేమన పద్యాల గురించి ఇది లోకంలోని వాడుక అయివుంటుంది. బ్రౌన్ కూడా 'వేయి విధములను' Thousand interpretations అన్నాడు. 'చూడ చూడ బుట్టు చోద్యమౌ జ్ఞానంబు" ను If thou think on these , this shall produce refined wisdom in thee అని వ్యాఖ్యానించాడు. ఈ లక్షణం వల్ల వేమన విలక్షణమైన మహాకవిగా విశిష్టమైన ప్రజాయోగిగా విలసిల్లుతున్నాడని భావించవచ్చు.

'మేడపైనా అలపైడి బొమ్మ/ నీడనే చిలకమ్మా' అన్నాడు దేవదాసులో సినీకవి. దీనినిఆ రోజుల్లో తాగుబోతు వ్యక్తావ్యక్తాలాపనగా భావించేవారు. కొందరు వేదాంతార్థాల్ని కూడా వెతికేవారు. తరువాత ఎప్పుడో సీనియర్ సముద్రాల ఎక్కడో మాట్లాడుతూ, 'మేడపైన అల పైడిబొమ్మ' అంటే పార్వతి అనీ, 'నీడలో చిలకమ్మా' అంటే చంద్రముఖి అని కథాపరంగా గుట్టు విప్పాడు. అవాంతర సందర్భంగా ఈ ప్రసక్తిని ఇక్కడ తీసుకొచ్చాను.

ఇక వేమనపద్యంలో 'మేడ' ఏమిటి? మానవ శరీరమా? అయితే 'యెచ్చుల పడుచు' నాలుక కావాలి. నాలుక పలుకునకు ప్రతీక గదా! మంచి వాక్కుల్లో మంచి భావమే ఉంటుంది. ఆ భావమే మోక్షానికి సాధనమౌతుంది.

లేదా మేడ ఆకాశం కావొచ్చు. ఆకాశానికి శబ్దగుణముంటుంది. మేఘ ధ్వని శబ్దమే. దీని గురించి వేదాల్లో కూడా వర్ణన ఉంది. మేఘాల్లోని మెరుపే యెచ్చుల పడుచు. భాషావాఙ్మయమే భావం. ఆ భావం నుండే పరలోకానుభవం కలుగుతుంది.

ఇలా ఒకటి రెండు ప్రయత్నాలు. అప్పటివరకు దీని గురించి అసలు సారాంశం చెప్పగలిగే జ్ఞాని కోసం ఎదురుచూద్దాం.

**మేప రేమెరుంగు మేలైన వస్తువు**
**దేహ మేమెరుంగు దివ్యబోధ**
**విధము తెలిసి మీరు వేదాంతమెర్గుడీ**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎప్పుడూ నోరాడించే తిండిపోతుకేం తెలుస్తుంది ఏది మంచి పదార్థమో ఏది మలినమో! నీటి బుడగలా క్షణికమైన దేహాన్ని భోగసాధనంగా మారిస్తే ఏం తెలుస్తుంది అలౌకికమైన దివ్యజ్ఞానం అంటే ఏమిటో! కాబట్టి పద్ధతి ప్రకారం సాధన చేసి తత్వానుభవం పొందండి అని వేమన్న హితవు.

మేపరి అంటే తినేవాడు, మేత మేసేవాడు అని అర్థం. పశువులను మేపేవాడు అని కాదు. మేత అంటే పశుగ్రాసం, పశుపక్ష్యాదుల ఆహారం. మేపరి అనివాడటంలో వేమన గడుసుతనం కనిపిస్తుంది. వాడు తినడు, భక్షిస్తాడు, మేస్తాడు. తినటంలో ఉచ్ఛనీచాలు చూడడు. ఏదిపడితే అది తింటాడు. పశువుల్ని బయట వదిలేస్తే మేలైనదా కాదా అని ఆలోచించకుండా తినే అవకాశముంది. మేయు అంటే నెమరువేయు, కొంచెం కొంచెం తిను, నోట ఉంచుకొను అని అర్థాలు. ఇవాళ మనిషి మేస్తున్నాడు అంటే లంచం తీసుకుంటున్నాడు అని అర్థం. *'అలకలురులుగాగ యలనాభి చెలమగా మెరుగు దియ్య మోవి మేతగాగ'* అని ప్రయోగం.

ఇక దేహం, వృద్ధి నొందింపబడేది దేహం. భోగసాధనమైన శరీరమే దేహం. శరీరమంటే శిథిలమయ్యేది అని వ్యుత్పత్తి.

వేదాంతం అనే మాటకు వేదాల చివరి భాగాలు అని అర్థం. అంటే ఉపనిషత్తులు. త్రికాలాల చేత బాధింపబడని సత్యాన్ని బోధించేవి ఉపనిషత్తులు. వేదాంతమెర్గుడీ అంటే ఉపనిషత్సారాన్ని తెలుసుకో అని సారాంశం.

దివియకు రూపాంతరం దివ్య. దివియ అంటే దీపం. దివం అంటే ప్రకాశవంతమైంది అని. దివ్య అంటే దేవతాసంబంధంమైన, అతీంద్రియమైన అర్థాలు.

లౌకికమైన వ్యవహారాలవల్ల జ్ఞానం కలగదు దానికి అలౌకిక దిశలో జరిగేసాధన ముఖ్యం అంటున్నాడు వేమన.

**మొండివానికేల ముంజేతి కడియాలు**
**తొ్రి వానికేల కర్రపండ్లు**
**గాడిదెలకు నేల గడ్డముల్ మీసముల్**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

మణికట్టు దాకా చేతులు లేనివాడికి కడియాలు ధరించాలనే కోరిక ఎందుకు? అలాగే దంతాలు రాలిపోయిన సందుల్లో కర్రతో చేసిన పండ్లు పెట్టుకోవాలనుకోవడం నిరుపయోగం. అదేవిధంగా గాడిదలాంటి నిందార్హుడు గడ్డం మీసాలు పెంచితే మాత్రం పెద్దమనిషిగా చెలామని అవుతాడా అని చిరాకుపడుతున్నాడు వేమన.

మొండివాడు అంటే మూర్ఖుడు, హఠం చేసేవాడు అనే అర్థాలు ఇక్కడ కుదరవు. మొండోళ్లు అని మాలమాదిగలను ఆశ్రయించిన ఒక బిక్షుక కులముంది అది కూడా ఇక్కడ పొసగదు. లేని అనే అర్థంలో మొండి మెడ, మొండిగోడలు అని వాడతారు.

తొర్రి అంటే వెలితి, మొర్రి, దంతరాహిత్యం అని అర్థాలు. మరి కర్రపండ్లేమిటి? ప్రాచీన కాలంలో పండ్లు ఊడినప్పుడు వాటి స్థానంలో దుప్పికొమ్ముతో చేసిన దంతాలు పెట్టుకునేవారు. అలాగే వెలితిని తాత్కాలికంగా కప్పిపుచ్చుకోడానికి దంత్యోచ్చారణ కోసం కర్రపండ్లు పెట్టుకునే వారేమో? దంతవైద్యం అభివృద్ధి చెందకముందు ఇలా జరిగేదేమో.

గాడిదలకు సహజంగానే గడ్డం మీసాలుంటాయి. గాడిద ముఖాన్ని నేలకేసి రాస్తుంది. ముండ్లల్లో కూడా మూతిని పెడుతుంది. ఈ కారణంవల్ల గడ్డం గాడిదకు అడ్డం అంటున్నాడా వేమన? సాధారణంగా లోకంలో గాడిద నిందావాచకం. గాడిద ముఖమే బాగుండదు గడ్డం మీసాలు పెంచినంత మాత్రాన అది అందంగా మారుతుందా? అని ఓ విసురు.

ప్రాప్తించిన సహజ స్వరూపాలుండగా వాటిని కప్పిపుచ్చుకోడానికి దుర్బలమైన కృత్రిమ ప్రయత్నాలు అనవసరం అని వేమన్న సారాంశం. '....మోచేతి కడియాలు (డి. 1721, 79) అనేది పాఠాంతరం.

**మొగము జూచినపుడె మోహంబు ఘనమౌను**
**ధనము జూచినపుడె తగులు మనసు**
**కూలినప్పుడరయ కుసులెల్ల విరుగును**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అందమైన యువతి ముఖం చూడగానే అతనిలో కాంక్ష జనించి, ఎక్కువై అలవిగానిదవుతుంది. ధనార్జన మార్గాలు కనపడగానే మనస్సు లోభమనే వలలో చిక్కుపడి కొట్టుకలాడుతుంది. ఎందుకీ తాపత్రయాలు? కర్మగాలి ఉన్నస్థితి నుంచి కిందపడ్డప్పుడు కీళ్లు విరిగి లేవలేకుండా తయారవుతావు. ముందే తెలుసుకుంటే మంచిది అంటున్నాడు వేమన.

ముఖమే అనుకుంటాం, ఏ ముఖంలో ఏముందో? చూపులు కలపకు ఏ చూపులో ఏముందో! దానివల్ల కలవరపాటు కలుగుతుంది. వలపు జనిస్తుంది. ఆ వలపు అక్కడే ఆగిపొయ్యేది కాదు. క్షణక్షణం పెరిగి ఇంగితజ్ఞానం నశించి మూర్ఛస్థితికి చేరుకుంటుంది.

ఇక ధనం, ఇదొక దాహం, తీరని దాహం. ఇదొక వల, బోను. దీనిలో చిక్కుకుంటే బయటపడటం కష్టం. ఇంతా చేస్తే వయస్సు ఖర్చయిపోతుంది, ముసలితనం ముసురుకుంటుంది, కీళ్లు సడలిపోతాయి. అప్పుడు అంగలారిస్తే ప్రయోజనమేముంది? కుసులు అంటే కీళ్లు. కుసి అంటే నున్నగా చెక్కిన మంచం పట్టె చివరి రంధ్రంలో చొప్పించటానికి చెక్కిన కొయ్యకొన ఉండదా అది కుసి. మనకీలు అట్లాంటిదే కదా! కుసులు అనేది క్రియగానైతే దుఃఖపడు అని అర్థం. "వ్రాలిన కుసులును వసులు దూలములు" అని ప్రయోగం.

ఏదైనా అతి వ్యామోహం మంచిది కాదని నీతి.

**మొదట బోయు నీరు మొగి బీజములకెక్కి**
**మొదటి కురుక వేగమొలక లెత్తు**
**మొలక పృథివి పెరిగి వెలయును వృక్షంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఇవాళ మన ఎదుట కనిపించే వృక్షానికి వెనుక బోలెడంత కథ వుంది. భూమిలోని విత్తనం తొలిసారి పోసిన నీళ్లను తాగేస్తుంది. ఆ నీళ్లను తనలోని వేళ్లకు, కాండానికి అందిస్తుంది. దానివల్ల మొలక ఏర్పడుతుంది. ఆ మొలకే మొక్కై, చెట్టై, క్రమేపి వృక్షమవుతుంది.

'నీరే ప్రాణాధారము' అన్నాడు సుమతికారుడు. మొదటిసారి పోసిన నీటిని విత్తనం పీల్చుకుని ఉబ్బుతుంది. ఈ ప్రక్రియను నిప్పానం అంటారు. నీళ్లు పీల్చుకోవటం వల్ల బీజ కవచం చిట్లి దాంట్లోంచి వేరు బయటికొచ్చి అది భూమిలోకి చొచ్చుకపోతుంది. కాండమేమో భూమికి విరుద్ధ దిశలో పైకి చీల్చుకొస్తుంది.

ఒకరకంగా బీజం కడుపులోని పిండం లాంటిది. నీరు పోయక ముందు బీజం లోని జీవప్రక్రియలన్నీ సుప్తావస్థలో వుంటాయి. నీరు తాకగానే చైతన్యవంతమౌతాయి. అప్పుడు కాండం అగ్రభాగాన బీజదళాలు ప్రత్యక్షమౌతాయి.

ఏం చెప్తున్నాడీ పద్యంలో వేమన? వృక్షశాస్త్ర పరిజ్ఞానాన్నా? కాదు దాని ద్వారా ఒక జీవన, ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరిస్తున్నాడు.

ఈ పద్యంలో మొదట నీటి యొక్క పరిణామాన్ని సూచిస్తున్నాడు. దేనికైనా నీరు మూలపదార్థం, జీవపదార్థం. దాని మొదటి దశ జడజీవితం. రెండోది మనస్సు గల దశ. మూడోది విజ్ఞాన దశ. రెండోదాంట్లో జంతువులుంటాయి. వాటికి మనస్సుంటుంది, రాగద్వేషాలుంటాయి. మూడోదానిలో వివేచన, విచక్షణ జ్ఞానం ఉంటాయి. వృక్షం క్రమ పరిణామంలో ఎలా పుష్పభరితం, ఫలవంతం అవుతుందో అదేవిధంగా మనిషి జీవితం కూడా జ్ఞానోన్ముఖం కావాలని వేమన్న ఉవాచ.

మొగి అంటే ముందుగా అని అర్థం. మొదలు అంటే మూలం, వేరు; ఉరుకు అంటే పరుగెత్తు. వాడు ఉరుకుతున్నాడు అంటారు తెలంగాణలో. పృథివి అంటే భూమి.

వేమన్న రైతు నేపథ్యాన్ని సూచించే పద్యమిది.

'మొదట బోయునీరు మోటిదనక ఎక్క' అనేది పాఠాంతరం (డి.1735-482)

**మొనయ సత్యమునను మును హరిశ్చంద్రుండు**
**నిత్యమైన కీర్తి నిలుపుకొనెను**
**సత్యము నృపులకును సర్వదా యోగ్యంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పూర్వం హరిశ్చంద్రుడనే చక్రవర్తి పట్టు వదలకుండా సత్యాన్ని ఆచరించడం వల్ల శాశ్వతమైన కీర్తిని సంపాదించుకున్నాడు. అవును రాజులకు ఎల్లప్పుడు సత్యవాక్పరిపాలనం తగినపని అని తాత్పర్యం.

భూలోకంలో హరిశ్చంద్రుడనే రాజుండేవాడు. అతని భార్యపేరు చంద్రమతి. కొడుకు లోహితాశ్వుడు. అతడు గొప్ప సత్యసంధుడు. ఒకరోజు దేవేంద్రుడు స్వర్గంలో కొలువుదీరి ప్రపంచంలో నిజమైన సత్యవంతుడెవరని మహర్షులను ప్రశ్నిస్తాడు. దానికి వశిష్ఠుడు హరిశ్చంద్రుని పేరు చెప్తాడు. విశ్వామిత్రుడు దానిని ఒప్పుకోక అతనిచేత అబద్ధం అడిస్తానని శపథం చేస్తాడు. చేసి హరిశ్చంద్రున్ని ముప్పుతిప్పలు పెడతాడు. ఎట్లాగంటే మొదట దానం రూపంలో అతని రాజ్యాన్ని లాక్కుంటాడు. అంతేకాదు అంతకుముందు తన యజ్ఞం కోసం ఇస్తానని మాట యిచ్చిన ధనం కోసం ఒత్తిడి పెంచుతాడు. దానికోసం అతని భార్యను అమ్మిస్తాడు. స్మశానంలో నివసించేట్టు చేస్తాడు. కొడుకును పాముతో కరిపించి మరణించేట్టు చేస్తాడు. శిశుహత్యాపాతకాన్ని అతని భార్యకు ఆపాదించి శిక్షపడేట్టు చేస్తాడు. ఏం చేసినా హరిశ్చంద్రుడు సత్యాన్ని వీడకపోవటం వల్ల విశ్వామిత్రుని ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోతాయి. దీనికి దేవతలు మెచ్చి ప్రత్యక్షమై అతని కొడుకును బతికించి పోయిన రాజ్యాన్ని ప్రసాదిస్తారు. విశ్వామిత్రుడు కూడా తన తపస్సువలన సంపాదించిన పుణ్యాన్ని అతనికి ధారపోస్తాడు. సత్యహరిశ్చంద్రుడుగా ప్రసిద్ధి కెక్కమని ఆశీర్వదిస్తాడు ఇదీ కథ. ఇంత పెద్ద కథను వేమన మూడుముక్కల్లో ముచ్చటగా చెప్పాడు.

మొనయ అంటే పూనుకొని అని అర్థం. మొనసి అంటే అదేపనిగా అని. ఈ మాట వేమనకు చాలా ఇష్టమైంది. చాలా పద్యాల్లో వాడతాడు. వ్యర్థపదం కాదు. కొన్ని ప్రయోగాలు చూడండి. *“ముక్కు మోయనల్ల మొనసి త్రావినయట్లు; ముచ్చు యాత్రబోయి ముల్లె విడుచు గాని/ మ్రొక్కప్రొద్దులేదు మొనసి యెపుడు; ముప్పిరిగొనునయ్య మొనసిన మోహంబు; మొనసి ఇంద్రియముల మొదట నిల్పగలేక; అంగయోగములను ఆరు మతంబుల/మూడు యోగములకు మొనయరాదు; మొండి మాటలాడి మొనసి యుండు విరక్తి / యముని గెల్వనెచట నలవి గాదు”*

అలాగే ముసు అంటే పూర్వం. నిత్యమైన అంటే ఎడతెగనిది అని. కీర్తి అంటే మంచిపేరు అనేగాని విరివిగలదీ, మారనిదీ అనేది భావార్థం. 'నిలుపుకొనెను' అంటే విశ్వామిత్రుని పరీక్షల ధాటికి తట్టుకొని హరిశ్చంద్రుడు తన సత్యవ్రతాన్ని చివరిదాకా నిలుపుకున్నాడని, అలాగే జీవితాంతం నిలుపుకున్నాడని కూడా.

పురాణ పాత్రల స్వభావాలను వర్తమాన సమాజానికి అన్వయించడం వేమన్నకు వెన్నతో పెట్టిన విద్య.

**యముడు పాపి యనుచు అందరు అందురు**
**దూషణము నొనర్తు దొడ్డగాను**
**యముని వలన దోషమింతైన నున్నదా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యమధర్మరాజు ప్రాణాలు హరిస్తాడు కాబట్టి పాపి అని అందరూ ఆడిపోసుకుంటారు. అంతేకాదు తరచుగా నిందిస్తారు కూడా. నిజానికి యముని తప్పు ఏమైనా ఉందా అని ఆలోచించరేమి? అంటున్నాడు వేమన.

యముడు మృత్యుదేవుడు. యముడంటే సర్వమును నియమించేవాడు అని అర్థం. ఇతన్ని సమవర్తి అంటారు. అంటే అందరి పట్ల సమానంగా వర్తించేవాడని. ఇతడు నరకలోకానికి రాజు. చిత్రగుప్తుడు, యమభటులు ఇతని పరివారం. ఇతడు దండధరుడు. చేతిలో కాలపాశం కూడా వుంటుంది. దానితో ప్రాణాలు లాగేస్తాడు. దున్నపోతు యముని వాహనం.

యముడు అష్టదిక్పాలకుల్లో మూడోవాడు. ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరుతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు ఈశానుడు అనేవారు అష్టదిక్పాలకులు. యముడు దక్షిణదిక్కును పాలిస్తాడు. ఈ దిక్కును ప్రాణోత్క్రమణ దిశ లేదా యమదిశ అంటారు. అందుకే మరణించిన వారిని దక్షిణ దిక్కున పడుకోబెడతారు.

చనిపోయిన వారు బతికి ఉన్నప్పుడు చేసిన పుణ్యపాపాలకు ఫలంగా స్వర్గనరకాలు లభిస్తాయి. ఎవరిని దేనిలో ప్రవేశపెట్టాలో నిర్ణయించేవాడు. యమధర్మ రాజు అని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి. ఇది ఒక విశ్వాసమే కావొచ్చుగాని దీనిలో ధర్మం రక్షించబడాలనే నైతికాశయం నిక్షిప్తమైవుంది. భారతీయులు దీనిని పరలోక శాస్త్రం అంటారు. (Eschatology); దీని ప్రకారం జీవుడు తాను చేసిన పుణ్య, పాప కర్మల ఫలాన్ని అనుభవించక తప్పదు. దానికోసం అనేక జన్మలను ఎత్తవలసి వుంటుంది. చివరకు కర్మరాహిత్యం సిద్ధించినప్పుడే విముక్తి లభిస్తుంది అనేది సారాంశం. బౌద్ధమతం జన్మాంతరాలను ఒప్పుకుంది. పురాతన హీబ్రూమతంలో ఈ గొడవ ఉన్నట్టు లేదు. మహమ్మదీయమతంలో వ్యక్తి మరణించిన తర్వాత ఇద్దరు దేవతలు అతని శ్రద్ధను పరీక్షిస్తారు. చనిపోయిన వారందరూ అస్–సిరాట్ అనే భయంకరమైన వంతెనను దాటాలి. పుణ్యులు తేలిగ్గా దాటుతారు. పాపులు నరకానికి వెళ్తారు. మన వైతరణీ నది కూడా

అలాంటిదే. ఇది యమలోకానికి వెళ్తుంటే మధ్యలో వస్తుంది. పాపులైతే దీనిలో కూరుకొని పోతారు. పుణ్యులను విష్ణువు దాటిస్తాడు.

ఇంత ప్రక్రియ ఉన్నప్పుడు యమున్ని పాపి అనడం న్యాయమా? అంటున్నాడు వేమన. అసలా పాపమంతా ప్రాణుల్లోనే వుంది. సమవర్తి కావడమే పాపమైతే యముడు పుణ్యశ్లోకుడే అని వేమన్న సారాంశం. ధూషణము అంటేనింద, దోషము అంటే తప్పు. దొడ్డగాను అంటే ఘనంగా, ఎక్కువగా అని అర్థాలు. ఇక్కడ తరచుగా అని.

"యముని వలన దోషమింతైన నున్నదా?" లో య–ఇ లకు యతి కలపడం యతిభంగంలా కనిపిస్తుంది. కాని జానపదోచ్చారణలో ఇది 'యె' (ఎత్వవిశిష్టం). శిష్టోచ్చారణకు కాక జానపదుల ఉచ్చారణకు యతి కలపడం తెలంగాణ ప్రాంతంలో ఉంది. "చెన్నయాచార్యుడాచార్య చక్రవర్తి" వంటి ఉదాహరణలు కొల్లలు. జనకవిత్వ సంప్రదాయం నుంచి వచ్చిన వేమనకు ఇవి గుణాలేకాదు మౌఖికాభరణాలు కూడా.

**రాజవరుల కెపుడు రణరంగముల చింత**
**పరమ మునులకెల్ల  పరము చింత**
**అల్ప నరులకెల్ల అతివల పై చింత**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మనుషుల ఆలోచనలు వారి వారి స్థాయినిబట్టి యోగ్యతను బట్టి ఉంటాయి.

క్షత్రియులైన రాజులకు రాజ్యరక్షణకు సంబంధించిన రాజకీయ యుద్ధ వ్యూహాలపైన విచారణలుంటాయి. గొప్పవారైన ఋషీశ్వరులకు పరమ లక్ష్యమైన మోక్షం వైపే దృష్టి వుంటుంది. నీచులైన మనుషులకు ఎంతసేపూ స్త్రీ సాహచర్యం పైనే తలంపులుంటాయి.

రాజవరులు అంటే రాజశ్రేష్ఠులు అని అర్థం. మంచి రాజు ఎప్పుడూ వ్యక్తిగతమైన వ్యవహారాల్లో మునిగితేలడు. ప్రజాశ్రేయస్సు గురించే ఆలోచిస్తాడు. అది రాజకీయరణం కావచ్చు. రక్తపాత రణం కావచ్చు. అయితే విస్తరణ కాంక్షతో చేసే యుద్ధాలు మాత్రం మంచివి కావు. పరమ మునులు; పరమ అంటే ఉత్కృష్టమైన, గొప్ప అని అర్థాలు. పరమ ముని అంటే పరిపూర్ణమైన ముని అని. ముని అంటే ఋషి. ముని అంటే మౌనంగా ఉండేవాడు, అంటే సదా ధ్యానతత్పరుడు.

అల్పుడు అంటే స్వల్పుడు, నీచుడు, క్షుద్రుడు, చిన్నవాడు అని అర్థాలు. కిందిస్థాయిలో ఆలోచించేవాడి మనసు అనవరతం స్త్రీల చుట్టే పరిభ్రమిస్తుంది. అతివ అంటే స్త్రీతోపాటు భార్య అని కూడా. స్త్రీ అంటే పరస్త్రీయే కానక్కరలేదు.

చింత అంటే కోరిక, తలంపు, దుఃఖం, పదే పదే గుర్తుచేసుకోవడం అని అర్థాలు. ఈ పద్యంలో మూడు చింతలున్నాయి. మొదటిది ఆలోచన, రెండోది ఏకాగ్రచిత్తం, మూడోది మోహం.

వ్యక్తిగత స్వార్థం కోసం చేసే ఆలోచనలు తక్కువ స్థాయివే అని సారాంశం.

**రాతి బసవని గని రంగుగా మొక్కుచు**
**గునుక బసవని గని గుద్దుచుంద్రు**
**బసవభక్తులెల్ల పాపులు తలపోయ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లింగం, నంది శివభక్తుల పూజా హేతువులు. అవి ఎక్కడ కనిపించినా భక్తితో మొక్కుతారు. దాని ఆధారంగానే రూపొందిందీ పద్యం.

ప్రాణంలేని ఎద్దు రాతి ప్రతిమను చూసి దివ్యంగా భావించి నమస్కరిస్తారు. మరి బండికి కట్టిన ప్రాణమున్న ఎద్దు వేగంగా పరిగెత్తటం లేదని హింసిస్తారేమిటి? కాస్త ఆలోచించి చూస్తే ఇటువంటి వారు భక్తులు కాదు పాపులు అంటున్నాడు వేమన.

శిలానందికి భక్తి ప్రపత్తులతో నమస్కరించడం సంప్రదాయం. మరి వ్యవసాయానికీ బండి లాగటానికీ ఉపయోగపడే సాక్షాత్తు సజీవమైన ఎద్దును గుద్దులతో, దెబ్బలతో అదిలిస్తారు. జీవంలేని ఎద్దుకు మొక్కుతూ, బసవని అవతారమైన ఎద్దును హింసించడం పాపం కాదా అని ప్రశ్నిస్తున్నాడు.

బసవడు అంటే ఎద్దు అని అర్థం. బసవ భక్తులు అంటే ఎద్దును పూజించే వాళ్లు. వారు శైవులే కానక్కరలేదు. వీరశైవ మత స్థాపకుని పేరు కూడా బసవడే. రంగుగా అంటే ఘనంగా. గునుక బసవడు అంటే మెల్లగా పరిగెత్తే ఎద్దు అని అర్థం. మెల్లగా పరిగెత్తుతున్నది కాబట్టి, దాని పరిస్థితిని గమనించక, భూతదయను కోల్పోయి కొట్టడం, హింసించడం నిజంగా పాపమే. పాపమంటే పరపీడనం అని అర్థం. పీడించేవాడు భక్తుడెలా అవుతాడు? ఇటువంటివారి ద్వంద్వ వైఖరిని వేమన ఈ పద్యంలో నిలదీస్తున్నాడు.

**రాతిప్రతిమ దెచ్చి రాజసంబున నుంచి**
**పూజ సేయు నరుడు బుద్ధిమాలి**
**భావమందు పరము భావించనేరడో!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఎక్కడో పడివున్న రాయిని తీసుకొచ్చి దానిని విగ్రహంగా మలిచి దానికి హంగునూ పొంగునూ కల్పించి పూజించడం ఉందే ఇది మానవుని తెలివిలేనితనమే. జ్ఞానేంద్రియమైన హృదయంలో ఈశ్వరున్ని దర్శించవచ్చు గదా! అని ఆశ్చర్యపడు తున్నాడు వేమన.

మూర్తి పూజను వ్యతిరేకించే పద్యమిది. కాని ఈశ్వరున్ని భావంలో నిలుపుకునే శక్తి అందరికి ఉండదు. ఇది వేమన్నకూ తెలుసు కానీ బాహ్యలింగ పూజకంటే ఆత్మలింగపూజ ఘనమని ఆయన అభిప్రాయం. అది వేమన్న స్థాయి.

ప్రతిమ అంటే బొమ్మ, ప్రతిబింబం. ఇక రాజసం, ఇది త్రిగుణాల్లో ఒకటి. సాత్వికం కానిది రాజసం. రజోగుణం వల్ల కలిగేది. రాజృ అనేది రాజుకు ధాతువు. రాజృదీప్తౌ అంటే రాజైనవాడు ప్రకాశమానుడై వుంటాడు. ఇది భౌతిక విలువ కాదు మానసిక స్థితే. ఒకరకమైన ఠీవి దీనివల్ల వ్యక్తమౌతుంది. తానే చేసిన ఒక రూపానికి రాజసమైన విలువను కల్పించి దానికి పూజచేస్తున్నాడు. ఇది తెలివి తక్కువతనం అంటున్నాడు వేమన. మరేం చెయ్యాలి? ఏం చెయ్యాలంటే పరమును అంటే ఆ పరమాత్మను భావంలో భావించాలి. భావమంటే ఏమిటి? అంతర్గతమైన ఊహ. 'భావమునందు, బాహ్యమునందు' అన్నాడు అన్నమయ్య. అక్కడ భావము అంటే ధ్యానం. బాహ్యము అంటే భజనం.

సాధకుడైనవాడు ఈశ్వర స్వరూపాన్ని దృఢంగా హృదయంలో నిలుపుకోవటమే నిజమైన పూజ అని తాత్పర్యం.

'ప్రాణులందె శివుని భావింప లేరయా' (డి.1723, 1090) అనేది పాఠాంతరం.

**రామనామ పఠనచే మహి వాల్మీకి**
**పరగబోయడయ్యు బాపడయ్యె**
**కులము ఘనము గాదు గుణము ఘనంబురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

పవిత్రమైన రామనామాన్ని పదే పదే జపించటంవల్ల వేటవృత్తిలో ఉన్న కిరాతుడైన వాల్మీకి బ్రాహ్మణుడైపోయాడు. అంటే బ్రహ్మజ్ఞానం పొందిన వాడయ్యాడు. బ్రహ్మ అంటే వేదం. వేద విజ్ఞానియే నిజమైన బ్రాహ్మణుడన్నమాట! కాబట్టి కులం గొప్పదంటే ఎలా? గుణమే ముఖ్యం అని వేమన్న ఉవాచ.

వాల్మీకి సంస్కృత రామాయణం రచించిన మహర్షి. రుషి కాకముందు ఆయనో బోయవాడు, వేటగాడు. ఒకరోజు ఆయన మరో బోయవాడు ఓ క్రౌంచ పక్షి జంటను బాణంతో కొట్టడం చూశాడు. అందులో మగపక్షి నేలకూలింది. అప్పుడా పక్షులు మోహపరవశంతో వున్నాయి. నేలకూలిన మగపక్షిని చేరి ఆడపక్షి హృదయ విదారకంగా దుఃఖించింది. ఆ దృశ్యం వాల్మీకి హృదయాన్ని కలచి వేసింది. అప్రయత్నంగా ఆయన నోటి నుండి ఓ శ్లోకం వెలువడింది వినండి.

*మానిషాదప్రతిష్ఠాంత్వ మధమః శాశ్వతీస్సమాః*
*యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితమ్*

'ఓ నిషాదుడా! నువ్వు కొట్టిన క్రౌంచ పక్షుల జంటలో ఒక పక్షిపోతే రెండోపక్షి తన కోరికలను పొందలేకపోయింది. కాబట్టి నువ్వు కూడా కీర్తినీ శాశ్వతమైన కోరికలను పొందకుందువుగాక!' అని స్థూలార్థం. ఒకరకంగా ఇది వాల్మీకి ఆ బోయవానికి పెట్టిన శాపం. ఈ శాపానికి మూలం కరుణ. కవిత్వానికి కరుణ ముఖ్యం. శోకః శ్లోకత్వమాగతః అంటే శోకం నుంచి శ్లోకం పుట్టింది అనే సూక్తి దీనిని బట్టే వచ్చింది. ఆ క్షణంలోనే వాల్మీకి రుషి అయివుంటాడు. రుషి కానివాడు కవిత్వం చెప్పలేడు అని లోకంలో వుంది. మానిషాద శ్లోకం రామాయణ బాలకాండ రెండో సర్గలో 15వ శ్లోకం. ఇక్కడ విషాదమేమిటంటే కిరాతుడు రతి పారవశ్యంతో ఉన్న జంటను కొట్టాడు, వాటిని విడదీశాడు. ఏరకంగా చూసినా ఇది దారుణం. ఇది వాల్మీకి హృదయాన్ని బలంగా తాకింది. ఫలితంగా ఒక మహాకవి ఆవిర్భవించాడు. ధర్మశాస్త్రం ప్రకారం కూడా భోజనం వేళ, శయనవేళ శత్రువునైనా సరే కొట్టగూడదు. ఉర్దూలో ఓ వాడుక ఉంది. "ఖానే కే

వక్త్ దోస్త్ ఆతా, సోనేకా వక్త్ దుష్మన్ ఆతా" అని. మానిషాద శ్లోకం ఓ గని లాంటిది. తవ్వి ఎన్ని వజ్రాలైనా తియ్యవచ్చు, తీశారు కూడా. ఇంత గొప్ప శ్లోకం చెప్పి సీతారాముల ఎడబాటు దుఃఖంతో కూడిన రామాయణాన్ని రచించినవాడు బ్రహ్మజ్ఞాని కాకుండా ఎలా వుంటాడు?

క్రౌంచ పక్షిని బెగ్గురు పక్షి అని అంటారు. చాతకమని కొందరు. ఒక జాతి కొంగ అని మరికొందరు. పావురం కన్న కొంచెం చిన్నగా వుంటుందట. ఏది ఏమైనా అది ఒక పక్షి.

'రామ నామ సూక్తి నీమము చేతను/వాల్మీకి యను బోయ బాపడాయె (డి. 1773, 1309, మూడో సంపుటం, బ్రౌన్ రాతప్రతి) అనేది పాఠాంతరం.

**రామ విభుడు పుట్టి రఘు కులంబలరించె**
**కురు విభుండు పుట్టి కులము చెరిచె**
**ఎవరి మంచి చెడ్డ లెంచి చూచిన తేట**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శ్రీరాముడు జన్మించి రఘువంశాన్ని సంతోషపెట్టాడు. దుర్యోధనుడేమో తాను జన్మించిన కురు వంశనాశనానికి కారకుడయ్యాడు. ఇద్దరి మంచి చెడ్డలు లోకానికి తేటతెల్లమే కదా!

దశరథుడికి ముగ్గురు భార్యలుండటం వల్లనే రాముడికి అరణ్యవాసం ప్రాప్తించింది. బహుశా అందుకే ఆయన ఏకపత్నీవ్రతాన్ని లోకానికి ఆదర్శంగా ప్రతిపాదించాడు. పితృవాక్య పరిపాలనను భాతృప్రేమను చాటాడు. దానికారణాన రామునివల్ల రఘువంశం కీర్తికెక్కింది.

దుర్యోధనుడు ధర్మరాజును కాదని తాను రాజు కావటానికి ఎన్నో కుయుక్తులను పన్నాడు. చివరకు కురుక్షేత్ర యుద్ధం సంభవించింది. ఫలితంగా కురువంశం నశించింది.

ఇరువురూ విభులే, రాజులే కాని వారి సత్, దుష్ కర్మల ఫలితాలు వారి వంశాలకు సంక్రమించాయి, గమనించమంటున్నాడు వేమన. మధ్వాచార్యులు స్థాపించిన ద్వైతం ఎక్కువగా పురాణాదులపైన ఆధారపడిందనుకున్నాం. పురాణ పాత్రల ద్వారా తత్వ నిరూపణ చేసే ప్రయత్నం ఇటువంటి పాత్రల్లో జరిగింది.

**రాల పొందెరింగి రాల గూర్చిన భంగి**
**లోను పొందెరింగి లోను పరచి**
**తానె బ్రహ్మమెరిగి తాను బ్రతుకు మీద**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆ కొండ ప్రాంతంలో శిలల కూర్పును గమనించండి. ఒకదానిపై ఒకటి ఎవరో పేర్చినట్టు లేవూ? ఇంత చిన్న రాయిపై అంత పెద్ద రాయి ఎలా ఒదిగి నిలబడిందో చూడండి. కిందికి దొర్లకుండా వేల సంవత్సరాల నుంచి అలాగే వుంది. ఆ శిలాతోరణం ఎవరో శిల్పి చెక్కినట్లుగా ఎంత రమణీయంగా ఉందో!? ఈ పొందికలు, అమరికలు చేసిందెవరు? ఇంకెవరు సృష్టికర్త. ఇలాంటి దృశ్యాలు దక్కన్ పీఠభూమిలో ఎక్కువ.

ఈ పద్యంలో వేమన ఏమంటున్నాడు? రాళ్ల యొక్క ఇమిడికను లేదా అమరికను అర్థం చేసుకొని వాటిని ఎవరో అద్భుతంగా కూర్పు చేసినట్టు అతడు కూడా తనలోని వికారాలు తొలగించుకొని, ధ్యానశక్తిని వశం చేసుకొని తానే బ్రహ్మమనే జ్ఞానంతో సహవాసం ఏర్పరచుకోగలిగితే ఆ బ్రతుకు దివ్యంగా ఉంటుందంటున్నాడు వేమన.

పొందు అంటే పొందిక. *"సీతాకాంత ముని స్త్రీల బొందికలు మరిగి"* అని ప్రయోగం. లోను అంటే అంతర్భాగం, మనసులోను పరచి అంటే లోబరచుకొని అని.

*"లోను పదిల పరచి లోని వికారముల్*
*తలచి మెట్టు వారు తెలియువారు"* అన్నాడు వేమన్నే మరోచోట.

భూగర్భంలో శిలలు కరిగిపోయి పీడనం వల్ల భూమిని చీల్చుకొని పైకి ఎగజిమ్ముతాయి. భూమిపైన వివిధ ఆకృతుల్లో రూపొంది అమరిపోతాయి. మనం ఆశ్చర్యపడేంతగా గురుత్వాకర్షణతో సద్దుకుంటాయి. వాతావరణంలోని మార్పులు కూడా దీనికి తోడ్పడతాయి. భూగర్భమైనా మానవ అంతఃకరణమైనా ఒకటే అని వేమన్న సారాంశం, రోజూ కనిపించే రాతిదృశ్యాలను తీసుకొని ఒక అగాధమైన ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరించడం వేమన ప్రత్యేకత. "లోహపొందికెరిగి లోను జేసి (డి.1769-824) అనేది పాఠాంతరం.

**రోగియైన వాడు రోగి నెరుంగును**
**రోగి నరసి చూచి రూఢి గాను**
**రోగి కిడిన వాని రాగి బంగారౌను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఒక రోగి మరో రోగి యొక్క వ్యాధి బాధను అర్థం చేసుకుంటాడు. ఇక రోగాన్ని కచ్చితంగా కనిపెట్ట గలిగిన వైద్యుడున్నాడే అతడు తామ్రభస్మమిచ్చినా అది స్వర్ణ భస్మమంత బాగా పనిచేస్తుంది. విశ్వాసం వల్ల సగం రోగం నయమౌతుంది అని తాత్పర్యం.

పాత రోగి కొత్త వైద్యుడి కన్నా అనుభవజ్ఞుడు. వైద్యుడు అనేక మందులతో ప్రయోగాలు చేస్తుంటే ఆ ప్రయోగాలను అప్పటికే అనుభవించినవాడు రోగి. అందుకే An old patient is better than a new Doctor అంటారు. అయినా రోగలక్షణాన్ని సరిగ్గా కనిపెట్టి మందిచ్చే వైద్యుడు గురిచూసి కొట్టే విలుకాడిలాంటివాడు. పాతరోగికి తన రోగాన్ని గురించే తెలుస్తుంది. వైద్యుడు సర్వరోగుల విధానం తెలిసినవాడై వుంటాడు. తన శ్రద్ధతో ప్రవర్తనతో వైద్యుడు రోగికి తనపట్ల విశ్వాసం కల్పించాలి. రోగి మానసికత పైన అతనికి పట్టు రావాలి. అప్పుడతడు ఏ ఔషధమిచ్చినా మంచి ఫలితం రావొచ్చు.

వేమన్నకు ఆయుర్వేద వైద్యం తెలుసుననడానికి ఈ పద్యం తార్కాణం.

రోగతత్త్వం తెలిసిన వైద్యుడు తామ్ర భస్మమిచ్చినా అది స్వర్ణ భస్మమంత ఫలితాన్నిస్తుంది అంటున్నాడు వేమన. రాగిని శుద్ధిచేసి అంటే మలినాలు తొలగించి పుటం బెట్టి భస్మీకరణం చెందిస్తారు. అది చర్మవ్యాధుల్లాంటి వాటిని నయం చేస్తుంది. ఇక బంగారం భస్మీకరణం చెందితే అది అమృతతుల్యమౌతుంది, ఇది సర్వ రోగాలకు పనిచేస్తుంది. బంగారం బంగారమే. మంచి వైద్యుడిని గురించి చెప్తూ అతని హస్తవాసి మంచిదంటారు. 'వాడు చేతితో నలిపి మట్టి పెట్టినా అది దివ్యౌషధంలా పనిచేస్తుంది' అంటారు. ఇది మూఢ నమ్మకం కాదు విశ్వాసం. రోగికి శరీరమే కాదు మనస్సు కూడా వుంటుందని గ్రహించాలి.

రోగం అంటే వ్యాధి, తెగులు. రూఢి అంటే నిశ్చయం. రోగలక్షణంపైన వైద్యుడికి ఆత్మ విశ్వాసం వుంటే రోగనివారణ జరుగుతుందనేది సారాంశం. ఈ పద్యాన్ని శరీరరోగాన్ని దాటిచూసి భవరోగానికి కూడా అన్వయించుకుంటే తాత్త్వికార్థం భాసిస్తుంది.

**లంక బోవునాడు లంకాధిపతి రాజ్య**
**మంత కీశ సేన లాక్రమించె**
**చేటు కాలమైన చెరప నల్పుడు చాలు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

లంక నాశనమయ్యే కాలం దాపురించింది. అందుకే అంతటి రావణ బ్రహ్మ లంకారాజ్యాన్ని కూడా చిన్న వానరమూకలు ఆక్రమించేశాయి. అంతే మరి! కాలం ఎదురు తిరిగినప్పుడు అల్పుడు కూడా అధిక నష్టం కలిగించగలడు.

లంక సామాన్యమైన రాజ్యం కాదు. దానిని చేరడానికే సముద్రాన్ని దాటాలి. అంతేకాదు రాక్షసమాయలున్న దుర్గమ ప్రదేశం, అటువంటి రావణ రాజ్యంలో ప్రవేశించి అల్పమైన కోతిమూకలు నాశనం గావించాయి. వినాశకాలం ప్రాప్తించి నప్పుడు చిన్న విషయాలు కూడా పెద్ద బాధకు కారణమౌతాయి.

లంక అంటే రావణాసురుని పట్టణం. సామాన్యార్థంలో లంక అంటే దీవి. ఏటి నడుమ దిబ్బలను లంకలంటారు.

కీశం అంటే కోతి. హైదరాబాద్‌లో కీసరగుట్ట అనే శైవక్షేత్రముంది. అక్కడ కోతులెక్కువ. బహుశా కోతుల వల్లనే దానికాపేరు వచ్చి వుంటుంది.

చేటు అంటే కీడు, అశుభం, చెరుపు, నాశనం, ముప్పు, చావు, నొప్పి అని అర్థాలున్నాయి. చేటు కాలం అంటే ఇక్కడ చెడుకాలం, అంత్యకాలం అని.

**లేని కాలమునకు లేని మనము నొందు**
**ఈనిన పులి రీతి నెరుగకుండు**
**కఠిన బుద్ధి కిట్లు కలిమేమి గల్గురా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

డబ్బు లేక పోవడమనే పరిస్థితి మనిషిని విపరీతంగా ప్రభావితం చేస్తుంది అంటున్నాడు వేమన.

వాడు అసలే కఠిన చిత్తుడు. దరిద్రం ముసిరి నప్పుడు వాడి మనస్సు మరీ బలహీనమై పోతుంది. ఈనిన పులిలాగ అభద్రతా భావంతో ఇతరులపై దాడికి సిద్ధంగా వుంటాడు. కలిమి లేములను స్థితప్రజ్ఞతతో స్వీకరించాలని సందేశం.

బిడ్డలకు జన్మనిచ్చిన పులి చాల అశాంతిగా వుంటుంది. పులిమాత్రమే కాదు జంతువులన్నీ అంతే. మనిషి కూడా. ఎంతో బాధను అనుభవించి కనటం వల్ల శరీరంలో కల్లోల పరిస్థితి నెలకొని వుంటుంది. మిగతా జంతువుల కంటే పులి పరిస్థితి ఏమిటంటే దానికి స్వతహాగా రక్షణావయవాలు వుంటాయి. క్రూరమైన దంతాలు, కరాళదంష్ట్రలు, వాడిగోళ్లు. కాబట్టి దాడి మనస్తత్వం ఎక్కువ.

డబ్బులేని వాడిని ఈనిన పులితో ఎందుకు పోలుస్తున్నాడు వేమన? అభద్రతా భావం వల్ల. పైగా వీడు కఠిన బుద్ధి. గడ్డు పరిస్థితి వల్ల యుక్తాయుక్త విచక్షణ కోల్పోయాడన్నమాట!

లేని మనము అంటే ధన దారిద్ర్యంతోపాటు మనస్సూ దరిద్రమయ్యిందని.

'లేమికాలమందు లేమి మనసు నుండు (డి.1723, 822); తేనెవోలె నుండు దీన వాక్యంబులు (డి.1769-738) అనేవి పాఠాంతరాలు.

**వలపు తీరె నేని వనజాక్షి అధరంబు**
**ములకపంటి గిజరు ముష్టిరసము**
**చింతపండు అగును జీడి సమానమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మోహం కలిగినప్పుడు స్త్రీ అధరం మధురాతి మధురం. అంటే మహా తియ్యన. ఇక ఆ మోహం తీరిందా అది రుచించదు. రుచించకపోవటమే కాదు ఆ చుంబనం ములక్కాయ గుజ్జులాగ వగరుగా వుంటుంది. విషముష్టికాయ రసంలాగ వగరుగా వుంటుంది. చింతపండులాగ పుల్లగా వుంటుంది. జీడిగింజలాగ చప్పగా వుంటుంది. ఇష్టం లేనప్పుడు ఏదయినా వెగటే.

వలపు అంటే కోరిక, మదం, గంధం, సువాసన అని అర్థాలు. మోహం ఎల్లకాలం ఉండదు. ప్రేమ సగతి వేరు. వనజాక్షి అంటే కమలదళాల వంటి కన్నులు కలది. వనజ అంటే నీటిలో పుట్టింది అని.

ములక అంటే ములక్కాయ. ములక పండు అంటున్నాడు వేమన. పసుపు పచ్చబారితే పండు. ములకకు వాకుడు, వార్తాకి, కంటకారికా అని కూడా పేర్లున్నాయి. ములక్కాయకు ఉమ్మెత్తకాయకున్నట్టు ముండ్లుంటాయి. దీనిని ఔషధాల్లో వాడుతారు. ములకతోలును ఉడకబెట్టి తింటే దగ్గు తగ్గుతుందని అంటారు. గిజరు అంటే గుజ్జు, గిజురు అని కూడా అంటారు.

ముష్టి అంటే విషముష్టికాయ, దీనిని కూడా మందుల్లో వాడుతారు. చింతపండు, జీడి సంగతి తెలిసిందే.

'ములకపంటి గిజరు' అంటున్నాడు కవి. పంటి అంటే పండు యొక్క అని. వ్యాకరణ పరిభాషలో 'ఇ,టి,తి' లను ఔపవిభక్తికాలంటారు. వాక్యంలో మరింత స్పష్టత కోసం ఇవి తోడ్పడతాయి. అయితే పండుకు పంటి అని వాడటం అరుదు. వేమన్నకాలంలో జనం వాడుకలో ఉందేమో.

**వాక్కు శుద్ధి లేని వాడు చండాలుడు**
**ప్రేమశుద్ధి లేక పెట్టుటెట్లు?**
**నొసలు భక్తుడైన నోరు తోడేలయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చండాలుడంటే ఎవరు? పుట్టుకతోనే అస్పృశ్యుడనే ముద్రవేసి దూరంగా పెట్టబడినవాడు కాదు. చండాలుడంటే మాటలో స్వచ్ఛత లేనివాడు, స్నేహంలో పవిత్రత లేనివాడు. ఈ రెండూలేక ఎంత దానం చేసినా దాని వల్ల ప్రయోజనం లేదు. ఇట్లాంటి వాడి నొసట భక్తి చిహ్నాలు ఉంటే ఉండవచ్చు గాని నోటికి మాత్రం క్రూరమృగలక్షణాలే ఉంటాయి అంటున్నాడు వేమన. దేనికైనా త్రికరణ శుద్ధి ముఖ్యం అని సారాంశం.

వాక్కు అంటే పలుకు, మాట. తేజోమయంగా ఉంటేనే అది నిజమైన వాక్కు. అది మనస్సులోంచి రావాలి. వచ్చిన తర్వాత అది ఆచరణగా మారాలి. "కీరపోతంబులు పలువాకు మాటలకు బొక్కుచు నంచల బుట్ట దారుచున్" అని ప్రయోగం. శుద్ధి అంటే నిర్మలత్వం, పరిశుభ్రత ఇలా ఎన్నో అర్థాలు. "ఆత్మశుద్ధి లేని ఆచారమేలరా" అన్నాడు వేమన్నే మరోచోట. అలాగే భావశుద్ధి. అంటే తలపోతల్లో మైల ఉండకూడదు. వైదిక కర్మలు చెయ్యడానికి యోగ్యతను సంపాదించడానికి చేసే సంస్కారాన్ని కూడా శుద్ధి అంటారు. హస్తశుద్ధి అంటే చేతి కళల నైపుణ్యం. ఇక దేహశుద్ధి సంగతి అందరికి తెలిసిందే. వాక్శుద్ధి లేని వాడికి దేహశుద్ధే మంచి బహుమతి.

చండాలుడు అనే మాటకు క్రూరకర్ముడు అని అర్థం. కాని ఒక వర్గానికి దీనిని ఆపాదించడంవలన అది ఒక ఘోరమైన సాంఘిక అన్యాయానికి గురవటం వేలయేండ్ల చరిత్ర. వేమన్న పుట్టుకతో చండాలుడనటం తప్పు. అబద్ధీకుడినే చండాలు డనాలంటున్నాడు. జన్మచండాలునికి కాలాంతరంలో మోక్షమన్నా వుంటుందేమో కాని కర్మ చండాలునికి మాత్రం ఎప్పటికీ మోక్షం లభించదు అని లోకంలో వాడుక.

ఇక ప్రేమ. ఈ మాటను ఈ రోజుల్లో ఎక్కువగా స్త్రీ, పురుషుల మధ్య వలపుగా అనురాగంగా వాడుతున్నారు గాని ఇది చాలా పెద్దది. వాత్సల్యం దయ లాంటివి కూడా దీనిలోకి వస్తాయి.

'నొసలు భక్తుడైన' అంటే నుదుటిపైన నామాలు ధరిస్తేనో, బూడిద పూసుకుంటేనే, తిలకం పెట్టుకుంటేనో అంతమాత్రాన్నే భక్తుడవుతాడా? అది బాహ్యవేషం. లోపల కూడా ప్రేమా దయ ఉన్నప్పుడే అది నిజమైన భక్తి. తోడేలు నక్కలాంటి జంతువు, అడవికుక్క అని కూడా అంటారు. క్రూరమైందే. సంస్కృతంలో వృకము, ఈహామృగము అని అంటారు.

**వాడకురికి తిట్టు వలదన్న మొరపెట్టు**
**ముందు మగని దిట్టు ముసుగుబెట్టు**
**గడుసురాలు మగని గంప బెట్టుమ్మురా**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

భర్త ఆమెను అవమానించాడో లేక పేదరికానికి కారణమయ్యాడో తెలియదు గాని అది ఆమె గయ్యాళితనానికి పరాకాష్టగా మారింది. ఎట్లా? ఇంటిలోనే కాదు ఇంటి బయటికి వచ్చి వీధిలోకూడా తిట్లకు లంఘించుకుంటుంది. వద్దని వారించినా వినకుండా ఇతరులకు మొరపెట్టుకుంటుంది. ముందు తానే మగన్ని తిడుతుంది. తరువాత అలక పాన్పు ఎక్కుతుంది. గడుసురాలే!

ఆమె ఎవరినీ లెక్క చెయ్యదు. తనగతికి భర్తే కారణమనుకుందో ఏమో అతన్ని వీధిపాలు చేసింది. కుటుంబంలో శాంతి కరువైంది. దానికి అతడు మెతకవాడైనా కావొచ్చు. లేదా ఆమె దార్ఢ్యవతి కావొచ్చు. దార్ఢ్యం అంటే దిట్టతనం, శక్తి. పైగా గడుసురాలు. ఇక్కడ మేధస్వి అందాం. 'మొగన్ని కొట్టి మొగసాల కెక్కింది' అని సామెత, ఆమె అలాంటిది. గడుసుతనం అంటే కాఠిన్యం, మోటుదనం. "కొండ క్రొవ్వినదైన గడుసురాలైన" అని ప్రయోగం.

'గంప బెట్టమ్మడం' ఏమిటి? ఏమిటంటే పూర్వకాలంలో అంతా వస్తుమార్పిడే గదా! ఏ వస్తువునైనా గంపలో పెట్టి అమ్మేవారు. కుండెడొడ్ల గంప, అడ్డెడొడ్ల గంప అని వుండేవి. దేన్నైనా 'గంప కెత్తడం' అనేది వాడుక. వసుదేవుడు శిశుకృష్ణుడిని గంపలో పెట్టే యమునను దాటిస్తాడు. సోది చెప్పే వనితల దగ్గర సోది గంపలుంటాయి.

మగన్ని గంపలో పెట్టి అమ్మటం ఏమిటి? భార్యను అమ్మిన భర్తలున్నారు గాని ఇదెక్కడా వినలేదే! హరిశ్చంద్రుడు ఒక ఉదాహరణ. అన్నట్టు సత్యభామ కృష్ణుణ్ని అమ్మినంత పనిచేసింది. పాపం! మహానుభావుడు బయటపడ్డాడు.

పల్లీయ జీవనంలోని ఆంతరిక సంబంధాలను ఆపోసనపట్టిన దార్శనికుడుగా కనిపిస్తాడు వేమన మనకీ పద్యంలో.

'మొగని నెత్తిగొట్టి ముసుకుబెట్టు, ఇట్టి దానితోటి ఎట్లు వేగింతురో (డి. 1723-390) అనేవి పాఠాంతరాలు.

**వానరాకడ మరి ప్రాణంబు పోకడ**
**కానపడదు ఘనునికైన గాని**
**కానపడిన మీద కలియిట్లు నడుచునా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వాన ఎప్పుడొస్తుందో ప్రాణం ఎప్పుడు పోతుందో ఎవరికీ ముందు తెలియదు. జ్ఞానికి కూడా. తెలిసినట్టయితే కలియుగం ఇలా సందిగ్ధంగా నడుస్తూ ఉండేదా?

వాన రాకడ ప్రాణం పోకడ తెలియదని సామెత. వీటిని ముందే ఎవరూ ఊహించి చెప్పలేదు. ఇది లోకానుభవం కూడా. కాని భవిష్యద్దర్శన శక్తి ఉన్నవారికి ఇది సాధ్యమౌతుందని ఒక భావన. కాని కలియుగ సంక్షోభం నెలకొన్న నాటి పరిస్థితుల్లో ఇది కష్టం అంటున్నాడు వేమన. కలి అంటే కలియుగం.

పోతులూరి వీరబ్రహ్మంగారి కాలజ్ఞానంలో వీరభోగ వసంతరాయలు ఆవిర్భవించి లోకాన్ని రక్షిస్తాడని ఉంది. అదే కలియుగ ప్రారంభమని, వీరభోగ వసంతరాయలు కల్కి అవతారమని. కల్కి అంటే కళ్లెం. కళ్లెం పట్టుకొని సంక్షోభాన్ని అదుపుచేసే వీరుడొస్తాడని వాడుక. వేమన్న పేరుతో ఉన్న 'నందన సంవత్సర' పద్యంలో ఒక వీరుడు పేర్కొనబడ్డాడు అతడు ఇతడే కావొచ్చు. నందన సంవత్సర కాలం 1652.

కాని యుగాలను లెక్కకట్టేవాళ్లు త్రేతాయుగం 1200 ఏళ్లు, కృతయుగం 2400, ద్వాపర 3800, కలియుగం అయిదు వేల సంవత్సరాలు అని అంటున్నారు. ఈ లెక్కన కలియుగం ముగిసి 282 ఏళ్లు అయ్యిందని ఒక అంచనా. మరి ఇప్పుడు నడుస్తున్నది ఏ యుగమో!? ఏది ఏమైనా వేమన్న పేర్కొన్న కలియుగం కల్లోలభరితంగా రేపు ఏం జరుగుతుందో చెప్పలేని విధంగా ఉన్నదని దీనివల్ల తెలుస్తుంది.

**వారకాంత లెల్ల వలచి యేతెంతురా?**
**పొందు జేసి ధనము పుచ్చుకొరకు,**
**మారకమ్మ జొచ్చి మరి ఇల్లు వెళ్ళునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

పిచ్చి కాకపోతే, వేశ్యలు ఎక్కడైనా మోహించి వస్తారా? సంభోగ సుఖాన్ని అందించి డబ్బు దండుకుంటారు గాని. జీవితంలో వేశ్యా ప్రవేశం మృత్యుదేవత ఇంట్లోకి రావటంలాంటిది. ఒక్కసారి వచ్చిందా తిరిగి ఒంటరిగా వెళ్లదు.

వారకాంత అంటే గణిక, భోగకాంత అని అర్థాలు. వార అంటే పక్క, చాటు అని. వారకాంత అంటే చాటుకాంత. గణిక అంటే ధనంకోసం రమించేది అని. పొందు అంటే సమ్మతి. వేమన ఈ మాటను మరోపద్యంలో వేరే అర్థంలో వాడాడు. "రాల పొందెరింగి రాల గూర్చిన భంగి / లోను పొందెరింగి లోను పరిచి". ఇక్కడ పొందు అంటే అమరిక.

'పుచ్చు' అంటే తీసుకొని, సూటిగా చెప్పాలంటే 'వదిలించి' అని. వేమనే మరో పద్యంలో ఇలా అన్నాడు '*చాకివాడు కోక చీకాకు పడజేసి / మైల బుచ్చి మంచి మడుపుచేయు / బుద్ధి చెప్పువాడు గుద్దితే నేమయా*; మైలబుచ్చి అంటే మురికి వదిలించి అని.

మారకమ్మ ఒక గ్రామ దేవత. మారక అంటే చంపేది. మృత్యుదేవత అన్నమాట. తెలంగాణా రాయలసీమల్లో మారెమ్మ అంటారు. గ్రామ దేవతలైన ఏడుగురు అక్కచెల్లెండ్లలో మారెమ్మ ఒకతి. వారు పోచమ్మ, సవారమ్మ, ఈదెమ్మ, మైశమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ. రాయలసీమలో ఈ వరసా పేర్లూ మారొచ్చు. మారెమ్మ రోగాల దేవత కూడా. బహుమంది చచ్చేరోగాలకు ప్రతీక. ఆ రోజుల్లో మశూచి గత్తర లాంటివికూడా అంటువ్యాధులే. 'ప్రాణులమారి వచ్చెనని' అనేది ప్రయోగం.

వారకాంత మారెమ్మలాంటిది. ఒక్కసారి వచ్చిందా ఇల్లుగుల్ల జేసి, ఒళ్లుకూడా గుల్ల చేసి వెళ్లిపోతుంది. వెళ్తుంది గాని ఒంటరిగా వెళ్లదు మనవాణ్నీ తీసికెళ్తుంది. మారెమ్మ మారి అయితే ఈమె మహమ్మారి అన్నమాట. వలపు అంటే మోహం అని చెప్పుకున్నాం. వలపుల రేడు అంటే మన్మథుడు. ఇతడు కూడా చంపేవాడే. కాకుంటే వలపు బాధతో.

వేశ్యా వ్యవస్థ కుటుంబవ్యవస్థకు విఘాతంగా ఉంటుందని వేమన ఈ పద్యంలో చెప్పదలచుకున్న సందేశం.

**వ్రాత వెంటగాని వరమీడు దైవంబు**
**సేత కొలదిగాని వ్రాత గాదు**
**వ్రాతకజుడు కర్త సేతకు దాకర్త**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

బ్రహ్మ రాసి పెట్టాడు. దానికి విరుద్ధంగా నీకు దైవానుగ్రహం లభించదు. అట్లా అని అంతా రాతే కాదు నువ్వు చేసే పనిమీద కూడా ఫలితం ఆధారపడి వుంటుంది. రాతకు బ్రహ్మ దేవుడు కారణమైతే చేతకు నువ్వు మూలం, ఆలోచించమంటున్నాడు వేమన.

అంతా లలాట లిఖితం కాదు. అట్లాగని అంతా నీ నిర్వాకమే కాదు. రెండూ కలిసే వుంటాయి. బ్రహ్మ రాతే సర్వస్వం కాదు. అట్లా అనుకొని కాళ్లు చాపుకొని నిర్వ్యాపారంగా కూచుంటే లాభం లేదు. అసలు ఆయనేం రాశాడో మనకు తెలియదు. నువ్వు చేసిందీ, చేసేదీ, చెయ్యవలిసిందీ నీకు తెలుసు కదా! అందుకే, లే! నీకు నీ కర్తవ్యం ముఖ్యం. అని వేమన్న సందేశం.

వ్రాత అంటే రాయడం, లిపి. వాడుకలో 'వ' రాలిపోయి 'ర' మిగిలింది (రాత). తలరాత అంటె విధి లిఖితం. *'ఫలమిచ్చునన వ్రాత ఫల మింతెయనుచు, నీతల వ్రాత వాని కాలి వ్రాతకు సమానమా'* అని ప్రయోగం. వెంట అనేది పెద్దమాట. సందర్భాన్ని బట్టి అర్థం మారుతుంది. వీధి వెంట పరిగెత్తాడు అంటే వీధిలో అని. నోటి వెంట వచ్చిన మాటలు అంటే నోటి ద్వారా అని. 'సెలవుల వెంట స్వక్విణుల వెంబడి' అంటే పెదవుల కొసల నుంచి అని. ఏ వెంట అంటే ఏ విధంగా అని. ఈ పద్యంలో వెంట అంటే పని, కర్మ. అజుడు అంటే బ్రహ్మ. అజుడు అంటే విష్ణువు, మన్మథుడు, చంద్రుడు కూడా. అజుడు అనే మాటకు అర్థం పుట్టని వాడు, పుట్టుక లేని వాడని. జీవుడు, పరమాత్మలు కూడా అజులే. దశరథుని తండ్రి అజమహారాజు. అజ ముహూర్తంలో పుట్టిన వాడన్నమాట. వరం అంటే దైవానుగ్రహం, ఆశీస్సు.

విధిరాత అనేది నీ నిర్వీర్యతకు మార్గం కాదు. అలాగే నువ్వు చేసేదంతా నీదే కాదు. కొంత లోకానికి వదిలెయ్యాలి. లోకమే దైవం అని వేమన్న ఉవాచ.

'సేత కొలదిగాదు రాతకొలది (డి.1275, 496) అనేది పాఠాంతరం.

**విటుల కనులకెంత విభ్రమమై యుండు**
**సాటిలేని పొలతి చక్కదనము**
**కంటిలోని పాప కుంటెన కాడయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆ యువతిది ఎవరితో పోల్చలేనంత అతిలోక సౌందర్యం. చూసిన రసికులకు తొట్రుపాటు కలిగించేంత. వారిద్దరికి ప్రేమ రాయబారం నడిపిందెవరు? ఇంకెవరు ఆమె కంటిపాప.

కోరుకునే స్త్రీ పురుషుల మధ్యగానీ ప్రేమికుల మధ్యగానీ ఒక సంధానకర్త ఉంటాడు/ ఉంటుంది. శృంగార నైషధంలో హంస లేదూ అలాగ. ఈ పద్యంలో కనులే సంధానకర్తలు. ఆమె లావణ్యం చూసి పురుషులు చాపల్యానికి లోనయ్యారు. ఇక ఆమె కంటి పాప ఉందే అదే ఆమె శృంగార సందేశం. కంటి పాపలో దృశ్యాలు ప్రతిఫలిస్తాయి. అతడూ, ఆమె రెండు దృశ్యాలు. ఈ రెండు దృశ్యాలను కలిపింది ఆమె కంటిపాప. వేమనను కవి అనడానికి సంశయించే వారి నోటిలో ఈ పద్యం పెట్టాలి.

కుంటెనకాడు అంటే కూర్చేవాడు. కుటుంబవ్యవస్థకు విఘాతంగా వుంటే తార్చేవాడు. కుంటెన అంటే కూర్చడం. కుంటెనకత్తె అంటే సంధానకర్త్రి. 'మనసిజుడిద్దరకును కుంటెనకాని తనంబు చేసెడిన్' అని ప్రయోగం. బసవపురాణంలో కుంటెనకాండ్ల ప్రసక్తి తరచుగా వస్తుంది.

విభ్రమం అంటే భ్రాంతి, ఊహించనిది జరిగినప్పుడు కలిగే ఆశ్చర్యం. వస్త్రాలు నగలు ధరించడం వల్ల కలిగే కాంతి విలాసం, ఒక శృంగార చేష్ట, సంభ్రమం; పొలతి అంటే స్త్రీ.

'కుంటెనకాడు' అంటే సాంఘికంగా మంచి మాట కాదు. విటుడూ అంతే. నచ్చితే ప్రేమికుడు, నచ్చకపోతే విటుడు. ఇదీ లోకరీతి!

**విడువ వలయు నూరు విశ్రాంతి గాకున్న**
**విడువ వలయు నాలి విధము దెలసి**
**విడువ వలయు రాజు వితరణి గాకున్న**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నువ్వు నివసించే ఊరు నీకు ప్రశాంతంగా లేదా? అయితే ఆ ఊరి నుంచి బయటపడు. నీ భార్య నడవడిక నీకు ప్రతికూలంగా ఉందా? అయితే ఆమెను వదిలెయ్యి. మీ ఊరి అధికారి ప్రజలకేమీ చెయ్యడా? అయితే అతని కొలువును విడిచిపెట్టు అని సలహా చెప్తున్నాడు వేమన.

విశ్రాంతి అంటే సాధారణార్థంలో అలసట తీర్చుకోవడం, విరామం. కాని ఇక్కడ కలతలు లేకపోవడం. నీ ఊళ్లో శాంతియుత పరిస్థితులు లేకపోతే, నీకు మనశ్శాంతి కరువైతే అక్కడే వుంటూ బాధపడటమెందుకు? మరో మెరుగైన చోటును చూసుకోవడం మంచిది అంటున్నాడు వేమన. పద్యంలో యతిని కూడా విశ్రాంతి అంటారు.

నీ భార్య భార్యగా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వహించకపోతే, ఒక పద్ధతిలో నడవకపోతే మీరు కలిసి వుండి మాత్రం చేసేదేముంది? రోజూ గొడవపడే బదులు విడిపోవడమే ఉత్తమం. ఈ సలహా పురుషుడికి చెప్తున్నా అతనితో పొసగకపోతే ఆమెకూ వర్తిస్తుంది.

ఇక రాజు. రాజు కావొచ్చు, తన పై అధికారి ఎవరైనా కావచ్చు. అతడు ప్రజాహిత కార్యాలకు ఖర్చుపెట్టకపోతే, పనికి తగిన జీతం ఇవ్వకపోతే, ఆపదలో ఉన్నవారికి పైసా విదిల్చకపోతే ఇంకెందుకు? అతనికి దూరంగా జరగటం మంచిది. వితరణి అంటే దాత. *"పండిన తరువుపై పక్షులు చనునట్లు వితరణి కడకేగు విద్యలెల్ల, లోభికన్నను, విలసితముగ పేదమేలు వితరణియైతే"* అని ప్రయోగాలు. సాధారణ లోకరీతిని చెప్పే పద్యమిది.

విడువ వలెను ఊరు విభ్రమముగా నున్న (డి.1725-641)
'విడువలయు సుతుల విభవమెరిగి' (డి.1759, 764)
'విడువ వలెను సుతుల విధము దెలసి' (డి.1723, 395) అనేవి పాఠాంతరాలు.

**విత్తు మగ్గెనేని వృద్ధి కానేరదు**
**విత్తు మగ్గకున్న వృద్ధియగును**
**విత్తు విశ్వకర్మ వివరించి చూడరా!**
**విశ్వదాభి రామ వినురవేమ.**

విత్తనం చెడిపోతే అది మొలకెత్తదు. చెడిపోనట్టయితే బీజరూపం దాలుస్తుంది. జీవుడూ అంతే సృష్టికర్తలో లీనం కావాలంటే జ్ఞానశుద్ధి అవసరం.

విత్తనం ఎందుకు చెడిపోతుంది? దానికి అనేక కారణాలు. వాతావరణంలో తేమ ఎక్కువకావచ్చు, అలవి మాలిన ఉష్ణోగ్రత కావచ్చు. తేమ ఎక్కువై శిలీంధ్రాలకు దోహదం చెయ్యొచ్చు. హానికారకమైన సూక్ష్మజీవులు కావచ్చు. ఇంకెన్నో!

మగ్గటం అంటే ఉక్కవల్ల చెమ్మగిల్లి చెడిపోవడం. విత్తనం సుప్తావస్థలో ఉండే ఒక చిన్న మొక్క. అది వ్యక్తం కావడానికి బోలెడన్ని అడ్డంకులుంటాయి. అవన్నీ తొలగిపోతేనే అది చెట్టవుతుంది. చెట్టుగా ఎదగాలంటే విత్తనశుద్ధి ముఖ్యం అని తాత్పర్యం.

నిజానికి విత్తు అంటే విశ్వకర్మే. అంటే విశ్వాన్ని చేసినవాడు, సృష్టికర్త. జీవుడు విశ్వకర్మను తెలియాలంటే మాయలో చిక్కుపడకూడదు. పరిణామక్రమంలో ప్రకృతిలోనికి వృద్ధి చెందాలి. ప్రకృతి అంటే పరబ్రహ్మమే.

విశ్వకర్మ అంటే దేవశిల్పి. అతడు సృష్టించే ఆకృతులే జీవులు. 'వివరించి చూస్తే' జీవులు పరబ్రహ్మంలో కలిసి అభేదాకృతి దాల్చటమే మోక్షం అని సారాంశం.

**విత్తు మొదటి గురువు విశ్వంబునకు నెల్ల**
**ప్రణవమంత్రమొకటి పరమ గురువు**
**కర్మగురువు సుమ్ము గాయత్రి మంత్రంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఈ పద్యంలో మూడురకాల గురువులున్నారు. 1. విత్తు అంటె ప్రజ్ఞ 2. ప్రణవం 3. గాయత్రి.

ప్రపంచానికంతటికీ ప్రథమ గురువు జ్ఞానం. ఓంకారంతో ప్రారంభమయ్యే ధ్యానమే పరమగురువు. పరమ గురువు అంటే గురువులకు గురువు. అట్లాగే ఆచరణకు ఉత్తేజపరిచే గాయత్రి మంత్రమే కర్మ గురువు అంటూ సృష్టిమూలక, సృష్టి ప్రవర్తక మంత్ర మహిమలను గురించి ప్రబోధిస్తున్నాడు వేమన.

విత్తు అంటే జ్ఞానం. అతిశయించిన జ్ఞానమే ప్రజ్ఞ. విత్తుడు అంటే బాగా తెలిసిన వాడని అర్థం. ధృతరాష్ట్రుడిని ప్రజ్ఞాచక్షువు అంటారు. చర్మచక్షువులు లేని వాడన్నమాట. *"ఊనము, జడమును, విత్తును/గానిది చైతన్యమెట్లుగా నేర్చునయా/తానే దానికి మూలం"* అని ముకుంద శతకంలో ఓ పద్యం.

ప్రణవం అంటే ఓంకారం. తెలుగు వర్ణమాలలోనైతే ఇది పదకొండో వర్ణం. అర్ధ సంవృతమై తాలవ్యేతరమైన ఓష్ఠ్య దీర్ఘస్వరం. దీనికి బిందువు చేరిస్తే ఓం అయ్యింది. దీనిలో మూడు ధ్వనులున్నాయి (అ+ఉ+ఓ). దీనిని శబ్దబ్రహ్మ అంటారు. ప్రణవాక్షర మనికూడా అంటారు. ఆ పరబ్రహ్మ తనకంటే వేరు కాదనే ఎరుకతో చేసే సాధన ప్రణవోపాసన. ఇది ధ్యానపూరితమైనది. ధ్యానమంటే లౌకిక విషయాల నుంచి ఇంద్రియాలను మళ్లించి, ప్రపంచహేతువైన తత్వంలో ఆత్మను లీనం చేసి ఒకరకమైన నిరంతర శాంతస్థితికి చేరుకోవడం. దానికి ఓంకారం గొప్పసాధనం.

ఒక గాయత్రి మంత్రం. 'గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ'. గానం చేసే వాణ్ని రక్షిస్తుంది కాబట్టి ఇది గాయత్రీ అని అర్థం. గానం చెయ్యడం అంటే జపించడం అన్నమాట. ఉపనయన సమయంలో గురువుల చేత ఉపదేశించబడుతుంది. మూడు వేదాల్లోనూ వుంది. ఆ గొప్ప మంత్రాన్ని వింటారా! వినండి.

"ఓమ్ భూర్భువః స్వః
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్యధీమహి
ధియోయోనః ప్రచోదయాత్" ఓం అనేది ప్రణవం.

భూః, భువః స్వః అనేవి మూడు మహావ్యావృతులు. వ్యావృతులు అంటే కప్పబడినవి, ఆవరించబడినవి అని అర్థాలు. మిగతాది గాయత్రి మంత్రం. దానికి అర్థమేమిటంటే ఆదిత్యాంతర్యామి అయినటువంటి దేవుని యొక్క తేజస్సును ధానిస్తాము. అతడు మా బుద్ధిని ఉత్తేజ పరుచుగాక అని. జ్ఞాన మార్గానికి సరైన మంత్రంగా భావిస్తారు గాయత్రిని. గాయత్రి ఒక ఛందస్సు పేరు. దీనిలో పాదానికి 8 అక్షరాలు గల 3 పాదాలుంటాయి.

**విష్ణు భక్తులెల్ల వెలిబూది పాలైరి**
**వాదమేల మతవిభేదమేల?**
**తెలియలింగధరులు తిరుమంటిపాలైరి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వైష్ణవం, శైవం తాత్వికంగా తేడా వున్న మతాలు. వైష్ణవం విష్ణు పారమ్యాన్నీ, శైవం శివపారమ్యాన్నీ బోధిస్తాయి. ఇవి తాత్విక స్థాయిలోనే విభేదించి ఊరుకుంటే పేచీ లేదు. కాని వ్యవహారస్థాయిలోకూడ అవిరళంగా వివాదపడ్డాయి. శైవులూ వైష్ణవులూ నిరంతరం పోట్లాడుకుంటూ నాటి సంఘశాంతిని కల్లోలపరిచారు.

ఈ రెండు మతాల్లో ఉన్న ఆచారాల ఆధారంగా వేమన ఆ ఇద్దరి అజ్ఞానాన్ని బట్ట బయలు చేస్తున్నాడు. అవేమిటంటే వైష్ణవుడు మరణిస్తే దహనం చేస్తారు. అదే శైవుడైతే ఖననం చేస్తారు, అంటే బొందపెడతారు. విష్ణుభక్తులు, శివభక్తులు గొడవ పడ్తున్నారు కదా! ద్వేషించుకుంటున్నారు కూడ. వైష్ణవులు శివభక్తులనూ, బూడిద పూతల శివుణ్నీ ద్వేషిస్తున్నారు. బాగానే వుంది. బతికి ఉన్నప్పుడు బూడిదను నిరసించిన విష్ణుభక్తులు ఆ బూడిదలోనే దహనమయ్యారు. ఇక లింగధారులైన శైవులు నామధారులైన వైష్ణవులతో వివాదపడ్డారు. వైష్ణవుల నామం, అంటే బొట్టు, తిరుమణి. మణ్ అంటే మన్ను. తిరు అంటే పవిత్రమైన. తిరు అనేది తమిళపదం. ఇక్కడ ఏం జరిగింది? జీవిత కాలమంతా తిరుమన్నును ద్వేషించిన శివభక్తులు చచ్చి ఆ మంటిలోనే కలిసిపోయారు. దీనినే ఇంగ్లీషులో Paradox అంటారు. అంటే అసంబద్ధం, విరుద్ధం అని అర్థం. వారి మధ్య వివాదాలు తర్కసహమైనవి కాదు. వాదవివాదాలు రెండూ శాస్త్రబద్ధమైనవి కాదు. మరి ఇదంతా ఎందుకు? అజ్ఞానం అంటున్నాడు వేమన. ఈ పద్యంలో 1,3 పాదాల్లో 'పాలైరి' అనే భూతకాల క్రియాపదాన్ని వాడాడు. ఇది యాదృచ్ఛికంగా వాడిందికాదు. 'పాలైరి' అని జరిగిన కార్యాన్ని సూచించటంలో ఇదివరకే దుష్ఫలితాల పాలయ్యారు, ఇప్పుడూ ఇకముందు కూడా ఇలాగే జరుగుతుంది అని వేమన్న ధ్వని.

"తన మతమేదో తనదీ, మనమతమసలే పడదోయ్, మనమూ మనమను మాటే అననీయదు తాననదోయ్' అని మిస్సమ్మ సినిమాలో ఓ పాట ఉంది. అయితే ఆ వైరుధ్యం వారి మధ్య ప్రేమ వల్ల నశిస్తుంది. అలాగే మనుష్యుల మధ్య మానవీయ భావన ఉంటే మత మౌఢ్యం తొలగిపోతుందని వేమన్న ఆకాంక్ష.

**వీరుడైన రాదు విద్య నేర్చిన రాదు**
**చదువు నేర్వరాదు సటలరాదు**
**జన్మఫలమె ముక్తి జపియించి నను రాదు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు ఇంద్రియాలను జయించినవాడు కావొచ్చు, విజ్ఞాన ఖని కావొచ్చు, వేద్యాది పాఠాలను వల్లించే వాడు కావొచ్చు, యుక్తిపరుడు కావొచ్చు, అవిరళ జపతత్పరుడు కావొచ్చు అయితే ముక్తిని పొందటానికి ఇవి మాత్రమే చాలవు. దానికి పూర్వజన్మ సంస్కారం ఉండాలి. అంటే ఉన్ముఖమైన స్వభావం దానికి తోడ్పడాలి అని వేమన్న ఉవాచ.

వీరుడంటే ఇక్కడ కత్తిపట్టుకున్న ధైర్యవంతుడని కాదు. స్థిరుడని. వీరం నవరసాల్లో ఒకటి. ఉత్సాహం దీనికి స్థాయీ భావం. విష్ణువును, బుద్ధుడిని కూడా వీరులంటారు. ఇక్కడ జైనముని మహావీరుడిని కూడా చేర్చుకోవచ్చు. జైనుల ప్రకారం సమస్త కర్మల క్షయమే మోక్షం. జీవులు తమ నిజస్వరూపాన్ని తెలుసుకోవటమే ముక్తి. వేమన పద్యాల్లో అక్కడక్కడ జైన ఛాయలు కనపడతాయి. మరి వేమన వీరుడైనా మోక్షం రాదంటున్నాడేమిటి? అంటే అందరూ అంత గొప్ప వీరులు కాకపోవొచ్చు గదా!

విద్య అంటే జ్ఞానం. వివేకంతో యథార్థాన్ని తెలుసుకునే వస్తుజ్ఞానమే విద్య. తాత్వికంగా ఆత్మ సాక్షాత్కారాన్ని కూడా విద్య అంటారు గాని మనవాడు ఇంకా అక్కడికి చేరలేదు గదా!

చదువు విద్యలో ఒక భాగం. పూర్వకాలంలో చదువు అంటే వల్లె వేయటం. పఠనం, భట్టీ పట్టడాన్ని చదువు అనేవారు. 'వాడు వీనికంటే ఏడాకులు ఎక్కువ చదివాడు' అనేవారు. చదువులలో మర్మాన్ని చదివానన్నాడు ప్రహ్లాదుడు. ఆ మర్మం గురువులకు బోధపడలేదు. బ్రౌన్ చదువు గురించి ఆసక్తికరమైన వ్యాఖ్య చేశాడు వినండి. The Hindus fancy that reading a book is a meritorious act; and hearing it read is also beneficial: by the sacredness of the words: even though the meaning is not understood. Most of those who assert that they have perused the Telugu Mahabharat or other venerated books prove on trail, to have read in this worthless manner. పుస్తకాల పురుగు అనేమాట ఇందుకే వచ్చి వుంటుంది. తాటాకుల్లో పుట పుటకు పరుగులు పడతాయి. ఆకులను తినేస్తాయి గాని

విషయాన్ని గ్రహించవు. పుస్తకాల పులుగు అని మరో మాటుంది. పులుగు అంటే పక్షి, చిలుక.

సట అంటే మోసం, అబద్ధపు మాట, యుక్తి అని అర్థాలు. సటలు అంటే జడలు అనే మాట ఇక్కడ సందర్భం కాదు. "*ద్రోహబుద్ధినైన దొంగరికమునైన, సటలనైన సాహసములనైన*" అన్నాడు వేమన్న మరోచోట. జపం అంటే దేవతారూపంలో ఉన్న మంత్రాలను అనేకసార్లు ఆవృత్తి చెయ్యటం.

'జన్మఫలం' అంటున్నాడు వేమన. జన్మ అంటే తాత్వికార్థంలో ఆవరణంతోపాటు లోకంలోకి ప్రవేశించడం. ఆవరణమంటే ఆచ్ఛాదనం, మూత. స్వరూపం తెలియకుండా కప్పి ఉంచేదన్నమాట. ప్రాణులు మోహం వల్ల తమ నిజస్వరూపాన్ని తెలుసుకోవు అని సారాంశం. సర్పరజ్జు భ్రాంతిని కలిగించే మాయ మోహమే. కాబట్టి మాయ తొలగిన స్థితినే జన్మఫలం అంటున్నాడు వేమన.

ముక్తి అనేది అంత అలవోకగా వచ్చేది కాదు దీనికెంతో తతంగముంది అనేది వేమన్న సారాంశం.

"చదువులందు లేదు సభల లేదు డి.1723-834) అనేది పాఠాంతరం.

**వెలది చక్కదనము వెరవైన ఈడును**
**విభుని కరుణలేమి విగతి నుండు**
**నీదు కరుణలేమి నేర్పులు కొరగావు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆమెకు ఎంతటి అందమున్నా, చాతుర్యం కలిగిన వయస్సున్నా జితేంద్రియుడైన భర్త కటాక్షం లేకుంటే అవి వున్నా లేనట్టే. అట్లాగే ఓయి పరాత్పరా! నీ దయ లేనట్టయితే మానవుని ఎటువంటి పాండిత్యాలకూ విలువలేదు అంటున్నాడు వేమన.

ఆదరణా, గుర్తింపూ వున్నప్పుడే దేనికైనా సార్థకత అని తాత్పర్యం.

వెలది అంటే సౌందర్యవతి, తెల్లనిది. ఇక్కడ భార్య. "*కుప్ప తిప్పలు చుట్టుగొండపై గొనలు సాగి/ వెలది వెన్నెల లెల్లడ వెల్లి విరిసె*" అని ప్రయోగం. వెరవు అంటే ఉపాయం, నేర్పు, ఆనుకూల్యం అని అర్థాలు. "*అఖిల మోహనమూర్తిగా నలరుబోడి/ బంచబాణుంబు తాను నిర్మించె గాక/వేద జడుడైన యజునకు వెరవుగలదె.*" అని ప్రయోగం. ఈడు అంటే వయస్సు, యౌవనం. ఈడుజోడు అంటే సమానమని.

విభుడు అంటే ప్రభువు, పాలకుడు, యజమాని, భర్త. ఇక్కడ ఇంద్రియ విముఖుడు. కరుణ అంటే కనికరం. విగతి అంటే నష్టపోయిన స్థితి, విడిచిపోయిన పరిస్థితి, లేనిదని, మసకబారినదని.

భర్త ఆనుకూల్యం లేని భార్య అన్నీ వుండి కూడా ఏదీ లేనట్టవుతుందో అలాగే భగవంతుని దయలేకుంటే సర్వజ్ఞుడనుకున్నా తత్త్వజ్ఞుడు కాలేదు అని సారాంశం.

**వెలయ భూమి తల్లి విత్తనమటు తండ్రి**
**పంటలరయ సుతులు పాడిపరము**
**ధర్మము తనపాలిదైవము సిద్ధము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వ్యవసాయ సమాజంలోంచి లోకాన్ని చూసే పద్యమిది.

భూమి తల్లి లాంటిదైతే బీజావాపనం చేసేవాడు తండ్రి. ఫలితంగా పుట్టినపంటలు సంతానం. పాలుపెరుగులు ఉత్కృష్టమైన ఆహారం. ఇక తాను పాటించే వ్యవసాయ ధర్మమే తనకు ఎదుట కనిపించే దేవుడితో సమానం.

వ్యవసాయ సమాజంలో భూమిని తల్లిగా ఆకాశాన్ని తండ్రిగా భావించే సంప్రదాయముంది. భూమి పంటలను కంటుంది. ఆకాశంలోంచి వర్షాలను కురిపించి విత్తును మొలకెత్తిస్తాడు కాబట్టి ఆకాశం ప్రాణదాత. పంటలు పిల్లలు. పాడి అంటే పాలు, ఆలమంద అనే అర్థాలతోపాటు తీర్పు, న్యాయం ఇతరమైన అనే అర్థాలు కూడా వున్నాయి. ఇక్కడ పాల సంబంధమైన అర్థమే సబబు. ఒకప్పుడు పాడి పంటలు అని వాడుక. గోపాలక సమాజం, వ్యవసాయ సమాజం వేరువేరుగా ఉండేవి. కృష్ణుడు, బలరాముడు వాటికి ప్రతీకలు. వ్యవసాయం నేర్చినవారు గోసం స్కృతిని ఇతరంగా భావించరాదని వేమన్న ఆకాంక్ష. పరము అంటే బండిపైన పరిచే గూడు అనే అర్థం ఉందికాని ఇక్కడది కుదరదు. పరమరసం అంటే పలుచని మజ్జిగ అని అర్థముంది గాని అదికూడా బహు దూరాన్వయం. మోక్షమే సరిపోతుంది. భూమిని నమ్ముకున్నవారికి కృషియే ధర్మం, ప్రత్యక్ష దైవం అంటున్నాడు వేమన. భూములిచ్చినట్లు భూపతులీయగలరా" అని సామెత.

**వెఱ్రిమొద్దుకేల వేద శాస్త్రంబులు**
**ముద్దు లాడికేల ముసలి మగడు**
**సద్ది మిగులనింట సంసారమేలరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

యోగ్యత లేని చోట సద్గుణాలు రాణించవు అని ఈ పద్యంలోని సారాంశం.

అవివేకికి వేదశాస్త్రాలు నేర్పించి ఏమి ప్రయోజనం? చక్కని స్త్రీకి ముసలి మగడు ప్రాప్తిస్తే ఏమానందం? మిగులు కూడులేని ఇంటిలో సంసారం ఏం సుఖం? అంటున్నాడు వేమన.

పిచ్చివాడు, పైగా చురుకుదనం లేనివాడు అటువంటి వాడికి గహనమైన వేదశాస్త్రాది విద్యలు బుర్రకెక్కవు కాబట్టి నిష్ఫలం. వెఱ్రి అంటే బుద్ధి అతిశయించిన వాడు, తెలివిమాలిన వాడు అని కూడా అర్థాలు. మొద్దు అంటే బుద్ధి పదును లేనివాడని. స్థాణువు, మోడు, జడుడు అని ఇతర అర్థాలు.

ముద్దులాడి అంటే ముద్దులొలికే యౌవనవతి, మనోజ్ఞసుందరి. అటువంటి దానికి వయస్సుడిగిన, కీళ్లు సడలిన ముసలి భర్త నిరుపయోగం, దుర్భరం.

ముందు రోజు రాత్రి వండిన అన్నం మిగలని ఇంటిలోని సంసారం దౌర్భాగ్యం. చద్ది అంటే చలిది, చల్లటి బువ్వ.

ఇక వేద శాస్త్రాలు. వేదాన్ని శ్రుతి అని కూడా అంటారు. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం. ఇక శాస్త్రాలు : నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, గణితశాస్త్రం, దోహదశాస్త్రం, ఆయుధ శాస్త్రం, కళాశాస్త్రం, అలంకార శాస్త్రం, యోగ శాస్త్రం. ఆయా విషయాలను సమగ్రంగా చర్చించి తత్త్వాన్ని నిరూపించే నిబంధాన్ని శాస్త్రమంటారు.

**వెఱ్ఱివానికైన వేషధారికినైన**
**రోగికైన పరమ యోగికైన**
**స్త్రీల జూచినపుడు చిత్తంబు రంజిల్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు పిచ్చివాడు కావొచ్చు, సందర్భానికో వేషం మార్చేవాడు కావొచ్చు, వ్యాధిగ్రస్తుడు కావొచ్చు. చివరికి గొప్పయోగి కావొచ్చు. వీరున్నారే, వీరు నలుగురూ స్త్రీలను చూసినప్పుడు మాత్రం ఎంతోకొంత కామ వికారానికి లోనవుతారు అని వేమన లోకానుభవంతో చెప్తున్నమాట. అది కూడదని సందేశం.

ఈ పద్యంలో స్త్రీ సౌందర్య శక్తితో పాటు అన్నిరకాల వారూ స్త్రీ వ్యామోహానికి గురయ్యే లోకరీతిని చూపిస్తున్నాడు వేమన. వాడు ముందే వెఱ్ఱివాడు, ఉన్మత్తుడు, అవివేకి. అయితే మాత్రం ఆడదాన్ని చూడగానే ఆకర్షితుడౌతాడు. అందాన్ని చూసి పిచ్చివాడు మరింత పిచ్చివాడవుతాడన్నమాట! రెండోవాడు వేషధారి. వేషధారి అంటే తన అసలు రూపాన్ని మార్చుకొని మరో వేషాన్ని ధరించేవాడు. ఇటువంటి వాడు స్త్రీలకోసమే బహురూపిగా మారుతున్నాడేమో! ఇక రోగికేం పుట్టింది? ముందే రోగాలతో బాధపడుతున్నాడు. అదంతే! అసలురోగి కాస్త భవరోగిగా మారిపొయ్యాడు. ఆశ్చర్యమేమిటంటే యోగి కూడా, పైగా పరమయోగి! యోగిదేనికీ చలించడు. మనసును నిగ్రహించి ధర్మవర్తనకు ఆదర్శంగా నిలిచేవాడు యోగి. మరి అట్లాంటి వాడికి కూడా స్త్రీల పట్ల మనస్సు చెదిరిందే! ఇదెక్కడి విడ్డూరం! అవును ఈ విడ్డూరం స్త్రీ ఆకర్షణలో వుంది. పురుషుడి బలహీనతలో వుందని వేమన్న ఉవాచ.

వేషధారి అంటే కపటి. చిత్తం అంటే మనస్సు అని చెప్పాలా! రంజిల్లు అంటే సంతోషం కలిగించు అని అర్థం. "*హృదయ కంజమున రంజిల్లు నమందాను రాగరస మకరందంబునన్; మది రంజిల్లగ దెల్పెదన్ వినుము*" అనేవి ప్రయోగాలు.

"... చిత్తంబు చలియించు (డి. 1723-86) "....చిత్తంబు వదలురా" (డి. 1725-775) అనేవి పాఠాంతరాలు.

**వెఱ్ఱిబట్టువాని వినయంబులధికంబు**
**చెడ్డముండ ముసుగు చెలగిపెట్టు**
**చెడిపె కొడుకు మిగుల చేయునాచారంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

నాటి సమాజంలోని విపరీత ప్రవర్తనలను ఎగతాళి చేస్తున్నాడు వేమన ఈ పద్యంలో. పిచ్చిపట్టిన వాడు నానా అల్లరి చెయ్యకుండ ఒద్దిక చూపిస్తున్నాడే! వితంతుధర్మం పాటించక విశృంఖలగా మారిన విధవరాలు బుద్ధిగా ముఖం కనపడకుండా ముసుగుతెర వేసుకుందేమిటి! వేశ్య కుమారుడు సంసారుల్లాగ విజృంభించి ఆచారాలను పాటిస్తున్నాడేమిటి?

వెఱ్ఱిబట్టువాడు అంటే పిచ్చి పట్టినవాడు. వావిళ్ల ప్రతిలో 'వెఱ్ఱిభట్టు' అంటూ భట్రాజుపరంగా అర్థం చెప్పారు గాని అదిక్కడ పూర్తిగా అసంగతం. వెఱ్ఱి అంటే పిచ్చి, ఉన్మత్తత. పిచ్చివాడు అడ్డదిడ్డంగా ప్రవర్తించాలిగాని ఇక్కడ వినయాన్ని, పైగా అతి వినయాన్ని చూపిస్తున్నాడెందుకు? ఎందుకంటే వెఱ్ఱివెయ్యివిధాలు. నా చిన్నతనంలో "వెఱ్ఱి వేయి విధములు" అనే గ్రంథం చదివాను. కాకినాడ సాహిత్య పరిషత్తువారు దానిని ప్రచురించారు. 1925, 30 ల మధ్య అచ్చయినట్టు గుర్తు. జయంతి రామయ్య పంతులుగారు దానికి చక్కని పీఠిక రాసినట్టు గుర్తు. పిచ్చివాడు వివేకహీనుడే కాని అప్పుడప్పుడు మిక్కిలి వివేకాన్ని ప్రదర్శించడం కూడా పిచ్చిలో భాగమే అని గ్రహించాలి.

'చెడ్డముండ' అంటే చెడిపోయిన విధవ. విగత భర్తృకకు సమాజం కొన్ని నియమాలకు విధించింది. ముఖం కనపడకుండా ముసుగు వేసుకోవడం వాటిలో ఒకటి. అవగుంఠనం అంటారు దాన్ని. దుష్యంతుని ఆస్థానానికి వెళ్లిన శకుంతలను 'అవగుంఠనవతి' అని వర్ణించాడు కాళిదాసు. పరాయి పురుషుల కంట పడకుండా చేసిన ఏర్పాటు ఇది, ఇప్పటికీ మనమార్వాడీ స్త్రీలు వేసుకునేది అవగుంఠనమే. చెలగి అంటే చెలరేగి, అతిశయించు అని అర్థాలున్నాయి గాని ఇక్కడ ముసుగును తీసి పెట్టుకోవడం. వితంతు ధర్మాలను ఆచరించకున్నా పాటిస్తున్నట్టు నటించడమన్నమాట!

ఇక మూడోది 'చెడిపె కొడుకు', చెడిపె అంటే కూడా చెడిపోయిన స్త్రీయే, వేశ్య. వేశ్య కుమారునికి తండ్రెవరు? "వెలయగా వేశ్య తనయుడు అబ్బకు పెట్టు తద్దినంబు" అంటూ ఓ వెక్కిరింత ఉంది. చెడిపె అంటే చెడిపోయినదని. చెడిపోయిన దానికి పుట్టినవాడు పెద్ద ఆచారపరుడిగా నటించడం ఆశ్చర్యం అంటున్నాడు వేమన.

నాటి సంఘ ఆచారాలన్నీ మంచివేనా అన్న చర్చను పక్కనపెడితే ఆనాటి కట్టుబాట్ల మధ్య మనుషుల విపరీత ప్రవర్తన ఎట్లాగుండేదో తెలుపుతుందీ పద్యం. వేమన లోపల ఒకటి బయటికొకటి అనే విధానాన్ని ఖండిస్తున్నాడనుకోవాలి.

**వేము పాలుబోసి వెయ్యేండ్లు పెంచిన**
**చేదు విడిచి తీపి చెందనటుల**
**ఓగు గుణము విడిచి ఉచితజ్ఞుడగునెట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

వేపచెట్టు మౌలికంగా చేదు వృక్షం. దాని చేదు విరగాలంటే ఏంచెయ్యాలి? పాలు పోసి పెంచాలి. ఎన్నాళ్లు? వేపచెట్టు దాదాపు నూరేండ్లు బతుకుతుంది. దానికి పదింతల కాలం అంటే వెయ్యేండ్లు పాలు బోసి పెంచినా దాని చేదు తీపిగా మారదు. అదేవిధంగా ఎంత ఉపదేశం చేసినా చెడ్డవాడు తన సహజగుణమైన దుష్టత్వాన్ని వదిలిపెట్టి తగిన విధంగా ప్రవర్తించలేడు అంటున్నాడు వేమన.

ఒకరకంగా వేపచెట్టు మంచిదే. అందుకే మన తెలుగు సంవత్సరాదిని వేపపూల పండుగ అని కూడా అంటారు. వేపగింజల నుంచి తీసిన నూనెను మందుగా వాడతారు. వేపచెట్టులో అజడిరాక్టిన్ అనే రసాయనిక పదార్థముంటుంది. దానివల్ల సూక్ష్మజీవులు (బాక్టీరియా) నశిస్తాయి. వేపలో కిరణజన్య సంయోగక్రియ ఎక్కువగా జరగటం వల్ల ప్రాణవాయువు అధికంగా విడుదలవుతుంది. అలాగే బొగ్గుపులుసు వాయువును ఎక్కువగా పీల్చుకుంటుంది. అలాగే రాత్రిపూట ఈ వాయువును వదుల్తుంది. కాబట్టి అప్పుడు దానికింద పడుకోవద్దంటారు. ఇన్ని సద్గుణాలున్న వేపచెట్టుతో పోలుస్తున్నాడే వేమన!? ఎందుకంటే చెడ్డవాడిలో ఎన్ని మంచి గుణాలున్నా ఒక్కచేదు వల్ల దానికి చెడ్డపేరు వచ్చింది. అలాగే ఒక్కదుర్గుణం వల్ల చెడ్డవాడి ఇతర మంచి గుణాలు కూడా కొట్టుకపోతాయి. ఉచితజ్ఞుడు అంటే ఒప్పిదమైనవాడు, న్యాయశీలి, సమంజసమైనవాడు, మితమైనవాడు అనే అర్థాలున్నాయి. కాబట్టి అన్ని మంచి గుణాలుండి ఒక్కలోపమున్నా దాని ప్రభావం మిగతా వాటిపై వుంటుంది చంద్రునిలో మచ్చలాగ.

**శాంతమానసమున చల్లనై శీతల**
**భాతి నున్నవాడు పరమయోగి**
**అట్టివాడు ముక్తి నతివేగ గైకొను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చల్లని వాతావరణం లాగ శాంతం నిండిన మనస్సుతో ఉన్నవాడు యోగులలో ఉత్తమయోగి స్థాయికి చేరుకుంటాడు. ఇక ముక్తి అంటారా? మిగతా వారికంటె అతడికే అది ముందుగా లభిస్తుంది. కాబట్టి మోక్షానికి మెరుగైన మార్గం శాంతమే అని సూచిస్తున్నాడు వేమన. వాతావరణం అంటే భూమిని ఆవరించి ఉండే వాయుమండలం.

శాంతినొందిన స్థితిని శాంతం అంటారు. అంటే ఉపశమించిన స్థితి. కామక్రోధాదుల రాహిత్యాన్ని శాంతమంటారు. శాంతుడికి ఎలాంటి వికారాలుండవని అర్థం. శాంతాత్ముడు ఇతరుల దూషణ భూషణములకు కలత చెందడు. శోక, మోహాలపట్ల ఒకేలా స్పందిస్తాడు. ప్రేమ, ఓర్పు, అహింస, త్యాగం, తృప్తి, భక్తి, ధర్మం లాంటి గుణాలన్నీ శాంతుడి సొత్తు. ఇతడు వేడిగా వాడిగా కాక చల్లగా మెల్లగా ప్రవర్తిస్తాడు. రాగద్వేషాలు లేని బ్రతుకు సాగిస్తాడు.

'చల్లనై శీతల' అంటూ ఒకే అర్థంలో రెండు మాటలను వాడటం దాని ప్రాముఖ్యతను నొక్కి చెప్పడ కోసమే. భాతి అంటే వలె. ఇది ప్రత్యయం. అలంకారంలో ఉపమావాచకం. *"సత్యంబు భాతి, యాస్థానంబు జ్యోతి; సాక్షాత్కరించిన కోపంబు భాతి"* అనేవి ప్రయోగాలు.

శాంతరసం నవరసాల్లో ఒకటి. శమం దాని స్థాయీ భావం. శమం అంటే కామక్రోధాదులను అణచివేయడం, మనోనిగ్రహమని. మహాభారతంలో ఉన్నది శాంతరసమే. 'శాంతము లేక సౌఖ్యము లేదు' అన్నాడు త్యాగరాజు. అరిషడ్వర్గాలతో క్రిక్కిరిసిన మనస్సు సుఖంగా ఉండదు కదా!

**శిష్యవర్గమునకు శివు జూప నేరక**
**కాని మతములోన కలుపునట్టి**
**గురుని యెరుక నరయ గుడ్డెద్దు జొన్నరా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శిష్యులకు మోక్షమార్గం చూపిస్తానంటూ ఆశపెట్టి వారికి తద్విరుద్ధమైన చెడుమతాల గురించి బోధిస్తాడు. అతడేం గురువు? అతనికే తెలియదు ఇతరులనేం గట్టెక్కిస్తాడు? అతన్ని నమ్మోకోవడం జొన్న చేనులో మేసే గుడ్డెద్దును నమ్ముకోవటం లాంటిదే అంటున్నాడు వేమన.

గురువంటే ఎవరు? శిష్యుల సందేహాలను తీర్చగలిగిన సమర్థుడే గురువు. అతదు వేదాంతాది శాస్త్రాలను చదువుకొని ఉండాలి. ఆధ్యాత్మిక అనుభూతి గురించి తెలిసినవాడై ఉండాలి. అంతేకాదు వ్యక్తిగా పాపరహితుడై ఉండాలి. ఇన్ని యోగ్యతలున్నవాడే సద్గురువు.

ఈ పద్యంలోని గురువు సద్గురువు కాదు. శిష్యులకు శివసాక్షాత్కారం చేయిస్తానంటున్నాడు. అంటే శివుడి ఐక్యం దాకా తీసికెళ్తానంటున్నాడు. దానికి సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం అనే దశలున్నాయి. ఈ మార్గంలో శిష్యులను సమాయత్తం చెయ్యకుండా కానిమతాలవైపు లాక్కెళ్తాడు. కానిమతాలు అంటే గాణాపత్యం, సౌరం, కాపాలికం లాంటి హింసాత్మక మతాలు.

ఇతనికి సాత్త్విక పద్ధతి గురించి తెలియదు. ఒకవేళ తెలిసినా శిష్యులను దగ్గరి దారి వైపుకు పురికొల్పుతాడు. ఏది నోటికొస్తే అది వాడుతాడు. కాబట్టి అట్లాంటి గురువు చేనులో మేసే గుడ్డెద్దు లాంటివాడు. గుడ్డెద్దు చేనిలోబడి ఏది తగిలితే దాన్నిమేస్తుంది. దానికో నిర్దిష్టమైన మేత అంటూ ఉండదు. “గుడ్డి యెద్దు జొన్నచేన పడ్డట్టు” అని సామెత. 18 శతాబ్దంలో తెలుగు సామెతలను సంకలనం చేసి వ్యాఖ్యానించిన Captain M.W.CARR దీని గురించి రాస్తూ "Like a blind bullock going into a field of millet" అంటూ Not able to get much out of it అని తీర్మానించాడు. జొన్నచేనే ఎందుకు? ఏ చేనయినా కావొచ్చు. ఆ రోజుల్లో మెట్టప్రాంతాల్లో ఉండేవి జొన్నచేన్లేకదా. ఇక్కడ కొంత చమత్కారంగా చెప్పుకోవచ్చు. గురువు గుడ్డెద్దు అయితే, దానిని అనుసరించే శిష్యుల దూడలు. “కానని వాని నూతగొని కానని వాడు చరించు భంగి” అనే పోతన పద్యంలాగ వుంటుంది పరిస్థితి. కల్లగురువును వదిలేసి సద్గురువును వెతుక్కోవటం మంచిది అని వేమన్న హితవు.

కానరాని మతము గరిపెనేని (డి. 1735-21); గురుని శిష్యునెరుక గుడ్డెద్దు జొన్నయా (డి. 1770-19) అనేవి పాఠాంతరాలు.

**శుద్ధ దృష్టి దెలసి శుక్రునంతటివాడు**
**పట్టలేక మనసు పారవిడిచి**
**కన్నుబోయి పిదప కాకి చందంబయ్యె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు సంయమనం లేక వివేకాన్ని కోల్పోయి ఒక కన్ను పోగొట్టుకున్నాడ, అయ్యో! చిన్న తప్పిదం వల్ల కాకి లాగ ఆయన దర్శనశక్తి తగ్గిపోయిందే అని జాలిపడుతున్నాడు వేమన.

పురాణకథ ఏమిటంటే విష్ణువు వామనుని రూపంలో వెళ్లి బలి చక్రవర్తిని మూడడుగుల చోటును దానమిమ్మని అడుగుతాడు. బలి సరే అంటాడు. కాని గురువైన శుక్రుడికి విష్ణువు కపట నాటకం తెలుసు కాని బలి వినిపించుకోడు. కమండలం లోని నీటిధారతో వామనుని కోరికను ధారబోయటానికి ఉద్యుక్తుడౌతాడు. ఇది కాదనుకొని శుక్రుడు సూక్ష్మరూపం ధరించి కమండలంలో ప్రవేశించి ధారకు అడ్డుపడతాడు. వామనుడది గ్రహించి ఓ దర్భతో 'మధ్యమం'లో గుచ్చుతాడు. దానితో శుక్రుడి ఓ కన్నుపోతుంది.

'శుద్ధ దృష్టి' అంటున్నాడు. మంచి చూపుగల రెండు కళ్లుండేవి. తొందరపాటు వల్ల మనస్సు స్వాధీనంలో లేకపోవడం వల్ల అంత శక్తి సంపన్నుడూ కన్ను పోగొట్టుకొని కాకిలాగ ఏకాక్షిగా మారిపోయి దాని స్థాయికి దిగజారిపోయాడు.

నిజానికి కాకికి ఒక్కకన్నే ఉంటుందా? ఇది కవి సమయమా? నిజమా? కాదు కాకికి రెండు కళ్లు ఉంటాయి. కాని వాటి పద్ధతి వేరు. దాని కళ్లు పక్కలకు ఉంటాయి. మన చెవులుండేచోట దానికి కళ్లుంటాయి. కుడికన్ను $180^{\circ}$ డిగ్రీల కోణంలో చూస్తుంది. ఎడమకన్నూ అంతే! వెరసి కాకి $360^{\circ}$ డిగ్రీల మేర చూస్తుంది. తన చుట్టూ చూడగలదన్నమాట! అంటే మనకన్న నయం కదా. నయమే కాని మనకు ఒక దృశ్యత్వం ఉంటే దానికి రెండు ఉంటాయి. మనది త్రికోణ్య దృష్టికొలత. (నిడుపు, వెడల్పు, ఎత్తు Three Dimensional ). దానిది అలుక్కుపోయినట్టుండే అస్పష్ట దృష్టి గోచరత్వం. ఇదంతా సైన్సు. ఒక కన్నుపోవడం వల్ల శుక్రాచార్యుడి నేత్ర దృష్టి (Field of vision) యొక్క విస్తీర్ణం తగ్గిపోయింది. దృష్టి పరిమితి విషయంలో శుక్రుడు కాకితో సమానమైనాడనేది సారాంశం.

ఆగ్రహానుగ్రహ సమర్థుడైన శుక్రాచార్యుల వారే నిగ్రహం కోల్పోవడం వల్ల అంగవైకల్యాన్ని కోరి తెచ్చుకున్నాడనీ కావున తొందరపడరాదనీ సందేశం.

**శైవ వైష్ణవాది షణ్మతంబులకెల్ల**
**దేవుడొక్కడనుచు తెలియలేరు**
**తమకు భేదమయిన తత్వంబు భేదమా?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

శైవం, వైష్ణవం మొదలైన ఆరుమతాలు వేరు వేరు కాదనీ వాటిలో వివిధ నామాలతో ఉన్న దేవుడు ఒక్కడే అని తెలుసుకోరేమి? బాహ్యంగా భేదాలు పాటిస్తారు గాని పరమాత్మ సంబంధమైన జ్ఞానంలో తేడా ఏమైనా వుంటుందా అని ప్రశ్నిస్తున్నాడు వేమన. ఉండదు అని సారాంశం.

షణ్మతాలు అంటే ఆరు మతాలు (షట్+మతాలు). అవి, శైవం, వైష్ణవం, శాక్తం, గాణా పత్యం, సౌరం, కాపాలికం. ఇవి హిందూ జీవన విధానంలో కొన్ని శాఖలుగా ఆవిర్భవించాయి. శాఖలు అనడం ఇష్టం లేకపోతే సంప్రదాయాలందాం. వారు వారు కొలిచే దేవతలను బట్టి ఈ సంప్రదాయాలు ఏర్పడ్డాయి. ఒకరకంగా ఇవన్నీ మన దేశంలోని వివిధ రాజకీయ పార్టీల్లాంటివి. వీరికి ఎన్ని వేరు వేరు విధానాలున్నా అత్యధికులైన ప్రజలు ఏ పార్టీకి చెందని వాళ్లేవుంటారు. అట్లాగే ఇక్కడ కూడా తాము ఏ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నప్పటికీ ఇతరుల దేవతలను నిరాకరించరు. కారణం ఏమీ లేదు, వేరు వేరు రంగులు పూసిన అద్దాలు ఉన్నాయనుకోండి, వాటిలోంచి సూర్యుణ్ని చూస్తే ఆయా రంగుల్లోనే కనపడతాడు. కాని సూర్యుడొక్కడే. అట్లాగే తత్వం కూడా అని గ్రహించమంటున్నాడు వేమన.

ఇంతకూ మతాల కథాకమామిషు ఏమిటో చూద్దాం. వేమన్న ఈ పద్యంలో 'మతం' అనే మాట వాడాడు. ఇది పాశ్చాత్యుల religion కాదు. ఇక్కడ మతమంటే ఇష్టమైనది అని అర్థం.

ముందుగా శైవం. దీనిలో ఈశ్వరుణ్ని రుద్రుడు అనే భయంకర దేవుడుగా, శివుడనే మంగళ ప్రదుడుగా ఆరాధిస్తారు. రుద్రుడు సర్పాలు, కపాలాలు, జటాజూటం ధరించి స్మశానంలో సంచరిస్తుంటాడు. శివుడేమో సౌమ్య రూపంతో పార్వతితో కలిసి కైలాసపర్వతం మీద నివసిస్తుంటాడు. ఇతడే నటరాజు, ప్రపంచావిర్భావానికి ప్రతీక. అలాగే ఈశ్వరుడు లింగరూపంలో వుంటాడు. లింగం సృష్టికి ప్రతీక. శివుడు మహాయోగి కూడా. అందుకే శైవమతానికి వైరాగ్యంతో, సన్యాసంతో ఘనిష్టమైన సంబంధం వుంది.

అట్లాగే వైష్ణవులకు విష్ణువు ప్రధానదైవం. విష్ణువు దయామయుడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడు. అవసరమైనప్పుడు భిన్న రూపాలతో, భూలోకంలో అవతరిస్తుంటాడు. ఈ అవతారాల్లో ముఖ్యమైనవి రాముడు, కృష్ణుడు. వైష్ణవ సంప్రదాయాన్ని ముందుగా ప్రచారంలోకి తీసుకొచ్చిన వాడు శ్రీరామానుజాచార్యులు. బ్రహ్మ, విష్ణువు, శివుడు త్రిమూర్తులు. ఒకప్పుడు వీరిలో విష్ణువు కూడా ఒకడు. కాని విష్ణువే ప్రధానమైనవాడనీ మిగతా ఇద్దరు అతనికి కిందివారని వైష్ణవుల విశ్వాసం. దక్షిణాదిన ఎక్కువగా రామభక్తులు ఉత్తరాదిన కృష్ణభక్తులు వున్నారు. వైష్ణవ సంప్రదాయానికి చెందిన ఆళ్వార్ల భావాలతో ఉపనిషత్తులలోని విషయాలను సమన్వయం చేస్తూ శ్రీరామానుజాచార్యులు ఈ సిద్ధాంతానికి కొత్త శక్తిని ఇచ్చారు.

ఇక శాక్తం. శక్తి పారమ్యాన్ని చాటే సంప్రదాయమిది... శివుని భార్యే ఆ శక్తి. ఆమె సర్వ కామ్య ప్రదాయిని. లలిత, దుర్గ, కాళి, పార్వతి మొదలైన పేర్లతో ఆమెను ఆరాధిస్తారు. శాక్తంలో దక్షిణాచారం, వామాచారం అని రెండూ వుంటాయి. వామాచారంలో పంచమకారాలు ఉపయోగిస్తారు. పంచమకారాలు అంటే మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర మైధునం అనేవి. వీరు మద్యం సేవించి, వివిధ రీతులలో స్త్రీ పూజ చేస్తారు. బాహ్య జీవితంలో స్త్రీలను చాలా గౌరవిస్తారు. వేశ్యావృత్తి నిషిద్ధం. దుర్గ, కాళి అనేవి దుష్టసంహారం చేసే భయంకర రూపాలు.

గాణాపత్యం గణపతిని ఆరాధించేది. సౌరం సూర్యుణ్ని పూజించేది. ఇక కాపాలికం. కాపాలికులు ఎముకల దండలు వేసుకొని, కపాలాల్లో తింటూ, మద్యపానం చేస్తూ కొన్ని శక్తులు సంపాదిస్తారు. వీరు కాళీపూజ చేస్తూ బలులు ఇస్తుంటారు.

ఈ సంప్రదాయాలు హిందూ సమాజంలోని సమస్త వైఖరులను ప్రతిబింబిస్తాయి. కాని వాటిలోని అంతస్సూత్రం ఒకటే అని వేమన్న ఉవాచ.

"తమకు భేదమైన దైవంబు భేదమా (డి.1769-848) అనేది పాఠాంతరం.

**సంతబసివి పొందు చలివెంద్ర యుదకంబు**
**తోవ నమ్ముతోడు తొత్తువంట**
**రచ్చబండ నిద్ర రసికులు మెత్తురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

చెయ్యగూడని పనుల గురించి చెప్తున్నాడు వేమన ఈ పద్యంలో.

సంతలో సంచరించే వ్యభిచారిణితో సాంగత్యం అనర్థానికి దారితియ్యొచ్చు. చలివేంద్రాల్లో నీళ్లు తాగితే ఆరోగ్యానికి హాని కలగొచ్చు. దాసి దానిని వంటకు పెట్టుకుంటే ఆ వంటకం నీకు పడకపోవచ్చు. రాత్రిపూట రచ్చబండ పైన పడుకుంటే భద్రతకు ముప్పు రావొచ్చు. కాబట్టి ఇట్లాంటి పనులు రసజ్ఞులైన వారికి అంటే అభిరుచి కలిగిన వారికి నచ్చవు. గమనించి మసలుకొమ్మంటున్నాడు వేమన.

బసివి అనే మాటవల్ల చరిత్ర దృష్టితో ఇది విలువైన పద్యం. బసివి అనేది కన్నడ సంప్రదాయానికి చెందిన దైవసంబంధమైన మాట. సంస్కృతంలోని పశుపికి బసివి వికృతి. పశుపి అంటే శివుడు. పశుపతికి పరిచర్య చెయ్యడానికి బాల్యంలోనే సమర్పించబడిన స్త్రీ బసివి. ఆమెనులింగ బసివి అనేవారు. ఆమె అవివాహితగానే వుంటుంది. గురువులు సాక్షాత్తు దేవుడి అవతారంగా భావించబడే వారు కాబట్టి వారు వీరిని అన్నిరకాలుగా వాడుకోవటంవల్ల జారిణులుగా దిగజార్చబడ్డారు. అందుకే కొన్నాళ్లకు సంతబసివి, వీటి బసివి ఊరబసివి అనే పేర్లతో వీధినపడ్డారు. వీరి గురించి అబేదుబాయ్ అనే ఫ్రెంచి మిషనరీ రాస్తూ "The are generally the unfortunate victims of the immorality of the Jangams or Vaishnavas" అని వర్ణించాడు. వైష్ణవుల్లో కూడా ఈ ఆచారముండేది. వారిని గరుడబసివి అనేవారు. ఇలా ముద్రపడిన కాంతలకు గరుడబసివికైతే ఆమె స్తనాలపైన గద్దబొమ్మను, లింగబసివికి ఆమె తొడమీద లింగం బొమ్మను పచ్చపొడిపించేవారు. వారికి సమాజంలో ఒక నిమ్నస్థానం ఏర్పడేది. కాబట్టి వారిని కూడటం రసికతకు చిహ్నం కాదంటున్నాడు వేమన. '*అతి మనోహర చంద్రశాలాంతరమున, బసివి నెనసెను వెశున్నడింపెసగ రాత్రి*' అని ప్రయోగం. సంత బసివి అంటే సంతలో తిరిగే బసివి అని. సంత అంటే పల్లెల్లో నిర్ణయించబడిన రోజున ఉండే అంగళ్లు. సంతబసివి అంటే బజారు వనితగా మారిన బసివి. కాబట్టి ఆమెతో పొందు ఏ రకంగానూ క్షేమం కాదు. చలివేంద్రం అంటే చలిపందిరి. ఎండాకాలంలో నీడకోసం వేసే పందిరి. దీనికింద దాహార్తులకు తాగడానికి నీళ్లుంచుతారు. లేదా పోస్తారు.

ఉదకం అంటే నీరు. ఆలనాపాలనా లేని చలివేంద్రాల్లో అది కలుష జలమో మంచినీరో తెలియదు. 'తోవనమ్ముతోడు' అంటే దారిన పొయ్యేవాడి తోడును నమ్ముకోవడం. వాడు మధ్యలో తనదారిన తాను ఉడాయిస్తే ఏం చేస్తాం? కాబట్టి జాగ్రత్త! "తొత్తువంట' అంటే వంటమనిషిగా మారిన దాసి. ఆమె నీ మనసెరిగిన సహచరి కాదు గదా కాబట్టి అనవసరం. ఇక రచ్చబండ. ఇది గ్రామాల్లో పెద్ద మనుషులు కూచుండేచోటు. అది ఎవరికీ కాని స్థలం. కాబట్టి అట్లాంటి బయలు ప్రదేశంలో పడుకుంటే క్రూరమృగాలు రావొచ్చు, దోపిడీలు జరగొచ్చు అంటున్నాడు వేమన. 'ఇంటగెలిచి రచ్చ గెలవాలి' అని సామెత. "మెచ్చిరయ్యింతి సొబగు రచ్చల గూర్చున్న రసికులెల్ల" అని ప్రయోగం. రసికులు అంటే శృంగారాది రసాలను ఆస్వాదించటంలో పారీణులు అని అర్థంతో వనమ్ముతోడు తొత్తుమాట' అనేది పాఠాంతరం.

**సకల తీర్థములను సకల యజ్ఞంబుల**
**తలలు గొరుగకున్న ఫలము గలదె;**
**మంత్ర జలము కంటె మంగలి జలమెచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఎన్ని తీర్థయాత్రలకు వెళ్లినా, ఎన్ని యజ్ఞాలు చేసినా ప్రతి తీర్థంలో, ప్రతి యజ్ఞంలో కూడా ప్రాయశ్చిత్తం పేరుతో తలలు కొరిగించు కొమ్మంటారు. ఇది మోసం. ఇదెట్లా వుందంటే మంత్ర పునీత జలం కంటే మంగలి కొరిగేటప్పుడు చల్లే నీటికే ఎక్కువ ప్రాధాన్యం లభించినట్టుందే అంటూ మోసకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు వేమన.

యజ్ఞానంతరం చేసే స్నానాన్ని అవభృథ స్నానం అంటారు. ఆ స్నానం చేసేటప్పుడు 'ఆపోషిష్టామయోభువః' అంటూ మంత్రం చదువుతూ కలశంతో నీళ్లు పోసుకుంటారు. మంత్ర జలమంటే అదే. దానికి ముందు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, గుండు కొరిగించుకోవాలని దాంభికులైనవారు డబ్బు లాగడానికి ప్రయత్నం చేస్తారు. ఈ సందర్భంగా వేమన పవిత్రం చేసేది మంత్రోదకమా? మంగలి నీళ్లా? ఆలోచించమంటున్నాడు.

రోజూ నిత్యశుద్ధికోసం సంధ్యావందనానికి ముందు నెత్తిన నీళ్లు చల్లుకుంటారు. అప్పుడు 'శుచీవోహవ్యా' అనే మంత్రాన్ని చదువుతారు. అదీ మంత్ర జలమే. కాని ఇక్కడి సందర్భం వేరు. తీర్థం అంటే తీర్థయాత్రా స్థలమే అయినా తీర్థమంటే చివరగా మోక్షమని అర్థం. పుణ్యకర్మలన్ని చేసేది మోక్షం కోసమే కదా!

వేమన్న చెప్తున్న మోసాలు కాశీలాంటి క్షేత్రాల్లో ఎక్కువగా జరుగుతాయి.

**సకల శాస్త్రములను చదివియు వ్రాసియు**
**తెలియగలరు చావు తెలియలేరు**
**చావు తెలియలేని చదువులవేలరా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వారు వేదాంతివాది శాస్త్రాలన్నింటినీ అధ్యయనం చేస్తారు. అంతేకాదు వాటికి కొత్త కొత్త వ్యాఖ్యానాలు కూడా రాస్తారు. అన్నీ తెలుసుకున్నామనుకుంటారు. కాని చావు రహస్యాన్ని మాత్రం తెలుసుకోలేరు. ఇంక ఈ చదువులన్నీ ఎందుకు దండుగ అంటున్నాడు వేమన.

చావంటే ఏమిటి? ఎప్పుడొస్తుంది? నరుడు పుట్టినప్పుడు ఏం తీసుకొచ్చాడు? పొయ్యేటప్పుడు ఏం తీసికెళ్తాడు. ఎక్కడినుంచి వచ్చాడు? ఎక్కడికి పోతాడు? ఇట్లాంటి ప్రశ్నలన్నింటికీ దర్శనాలు సమాధానాలు చెప్పడానికి ప్రయత్నించాయి. చచ్చిన వాడు ఉన్నాడని కొందరు, లేడని కొందరంటారు. చచ్చిన తర్వాత శరీరంలో చైతన్యం ఉండదు అదే చావు అని కొందరు. చచ్చిన తర్వాత జీవుడు నిష్క్రమిస్తాడా? అయితే జీవుడు నిర్గమించినా మృత శరీరం బరువు తగ్గదేమి అని మరికొందరు. ఇలా చావు చుట్టూ ఎంతో జిజ్ఞాస అల్లుకొని వుంది. సాక్షాత్తు చచ్చిపోయిన వాడే మళ్లీవచ్చి చెప్తే తప్ప ఈ రహస్యం వీడదు అని సారాంశం.

హిందూ సంప్రదాయం ప్రకారం చావు తర్వాత పంచభూతాలతో తయారైన శరీరం పంచభూతాల్లోనే కలిసిపోతుంది. 'గాలి గాలి గలిసె' అంటూ వేమన్నే ఓ పద్యం చెప్పాడు. చార్వాకుల ప్రకారం భూతాలు నాలుగే. ఆకాశం తర్వాత వచ్చి చేరింది.

శాస్త్రాలంటే వేదాంతం, ధర్మం, యోగం మొదలైనవి. శాస్త్రాలన్నీ చదివి తామే సర్వజ్ఞులమనుకోవడం తప్పు అంటున్నాడు వేమన.

వేమనది స్వతంత్రమైన దార్శనిక పద్ధతి. అంటే స్వయంగా విచారించే పద్ధతి. ఇది పరనియంత్రణను ఒప్పుకోదు. వేమన దర్శనం చింతన నుండి, సాక్షాత్ సంవేదన నుండి ప్రారంభమౌతుంది. ప్రత్యక్ష అనుభవం దానికి మూలం. ప్రతి అంశాన్నీ సంశయించడం, విమర్శించడం దాని ధోరణి. అదే వేమన్న ప్రత్యేకత.

సకల శాస్త్రములను సంపుటమున వ్రాసి (డి.1723, 1041) అనేది పాఠాంతరం. చచ్చిపోయె చదువు చదువంగ నేలరా (డి.1769, 910) అని మరోటి.

**సతికి పతికి నైన సంపద సంపదె?**
**పుత్ర సంపదలును భువిని మేలు**
**సరగ ముదిసి బ్రతుకు సంపద సంపద**
**విశ్వదాభిరామ వినురవేమ.**

భార్యాభర్తల మధ్యన నెలకొన్న అనురాగ భాగ్యమే నిజమైన భాగ్యం. సంతానం వల్ల కలిగే ఆనందమే అసలైన ధనం. వృద్ధాప్యంలో తృప్తి కలిగి లేమి లేకపోవడమే సిసలైన సంపద. ధన రూపంలో వున్నది మాత్రమే సంపద కాదు. ఒకవేళ అది సంపద అయితే ఆనందం దానిని మించిన మహాసంపద.

ధన ధాన్య వాహనాలు, దాసదాసీ జనాలు అష్టైశ్వర్యాల్లోనివారే అయినప్పటికీ బంధుమిత్రులు, పుత్రులే నిక్కమైన సంపద. సరగ అంటే త్వరగా అని. ముదిమి అంటే వృద్ధాప్యం. డబ్బేం చేసుకుంటావు. సుఖం, ఆనందం, ఆరోగ్యం లేనప్పుడు అనేది సారాంశం.

'సరిగ ముదిసి బ్రతుకు (డి.1721–195) అనేది పాఠాంతరం.

**సతుల గవయనేల సుతుల బడయనేల**
**వెతల బడినవాడు వెర్రివాడు**
**నేలనున్నరాయి నెత్తికెత్తిన యట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అది మంచి వర్షపు వాతావరణం. బజారులో తోపుడు బండిమీద కడాయిలో మిరపకాయ బజ్జీలను కాలుస్తున్నారు. నూనెలో సవసవల శబ్దాల్తో ఘుమఘుమల్తో వేగుతున్న ఆ మిరపకాయ బజ్జీలు తినబుద్ధి కానిదెవరికి? కారం చుర్రుమంటుందని తినడం మానేస్తామా? జీవితమూ అంతే! కష్టాలుంటాయని జీవించడం మానేస్తామా? మానెయ్యం. అట్లాగే పెళ్లీ పిల్లలూ వగయిరా.

వేమన్న కష్టసుఖాల సారమెరిగినవాడు. ఇటు యోగాన్నీ అటు సంసార యోగాన్నీ కాచి వడబోసినవాడు. నంసారంతో విసిగిపోయి ఆ జంజాటం నుండి బయటపడదల్చుకున్నాడేమో! అనుభవ మహాపర్వతం మీద పూచిన పువ్వులాంటి పద్యమిది. అవధరించండి.

స్త్రీని పెళ్లి చేసుకోవడమెందుకు? ఫలితంగా పిల్లల్ని కనడమెందుకు? వీటివల్ల కలిగేది బాధే కదా! తెలిసి తెలిసీ వీటిలో పడటం తెలివితక్కువ పనికాదా! ఈ పని ఎట్లాంటిదంటే నేలమీద పడివున్న రాతిగుండును తలపై కెత్తుకొని 'బరువు బరువు' అని అరిచినట్లు అంటున్నాడు వేమన. కాకముందు పెళ్లి ఓ రంగుల కల. సంభోగంవల్ల కలిగేది ఒక సంతాన వాస్తవికత. సతి అంటే గుణవతి అయిన స్త్రీ. సతీ సహగమనంలోని సతికాదు. శివుడి భార్య సతి కూడా కాదు. సాధారణ స్త్రీ. సతులు అనేది ఇక్కడ బహువచనం కాదు. మాటవరసకనే మాట.

'కవయుట' అంటే కలియటం, పెండ్లాడటం అన్నమాట. 'నీరు గవిసి యున్న నిప్పుబోలె" అని ప్రయోగం. బూడిద కిందవున్న నిప్పులాగ అని అర్థం. అలాగే 'పడయుట' అంటే పొందటం. "ధర్మంబు మీకు బడయంగ రాని దేమియును లేదు" అని ప్రయోగం.

వెత అంటే వ్యథ. పైకి వాచ్యంగా కనపడదుగాని మనోదుఃఖ రూపమైన విచారం. వెర్రి అంటే అవివేకి, తలనొప్పి తెచ్చుకునేవాడు.

ఈ పరిస్థితికి వేమన్న అద్భుతమైన దృష్టాంతం చెప్పాడు. రాయిని నెత్తిమీద పెట్టుకుందీ నువ్వే. ఇప్పుడు బరువౌతున్నదని మొత్తుకునేదీ నువ్వే. ఇదంతా వెర్రికాదా అని మందలిస్తున్నాడు.

**సతుల జూచి నరుడు సౌఖ్యంబు గోరును**
**గతుల గానలేడు కర్మమందు**
**గతుల సతుల వలన గానంగ లేరయా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు స్త్రీలకోసం వెంపరలాడుతూ వారి వల్ల ఆనందం కలుగుతుందని భావిస్తాడు. కాని రేపు ఏం జరుగుతుందో తెలియని గుడ్డివాడు. సద్గతులు లేదా మోక్షం కావాలంటే అది స్త్రీ వ్యామోహం వల్ల రాదు. దానికి మార్గం వేరేవుంది అంటున్నాడు వేమన.

సతి అంటే ఇక్కడ సామాన్య స్త్రీ వాచకమే, పతివ్రత అని కాదు. సతులు అంటే ఇక్కడ అందమైన స్త్రీలని. అతడు నరుడు, వొట్టి మనుష్యుడు, రుషి కాడు. కాబట్టి స్త్రీ సాంగత్యమే ఆనందానికి పరమావధి అనుకుంటాడు. సౌఖ్యం అంటే ఆనందాన్ని చేకూర్చేది. మరి ఇక్కడ దొరికేది నిజమైన ఆనందమేనా? అలా అని భ్రమపడతాడు. నిజమైన ఆనందం వేరే ఉంది. దాని పేరు మోక్షం. గతి అంటే మోక్షమే. సద్గతి అన్నమాట. లౌకికార్థంలో గతి అంటే ముందుకు వెళ్లటం దీనికి ఛాయలు కూడా ఉన్నాయి. నా గతి ఏమిటి? అంటే నా అదృష్టమేమిటి? అని. గతిలేనివాడు అంటే నిస్సహాయుడని. దైవగతి ఎట్లుందో అంటే దేవుడేం తలుస్తున్నాడో అని. ముందు ఈ లోకంలో నీ గతిని సరిచూసుకుంటే దైవగతి సంగతి తర్వాత. కర్మ అంటే పాపపుణ్యాల ఫలితంగా ప్రాప్తించేది. నీ స్త్రీలోలత్వం పరమ లౌకికమైనది, అశాశ్వతమైనది, క్షణికమైనది. దాని వల్ల నువ్వు వస్తుందనుకుంటున్న ఆనందం కేవలం చర్మదఘ్నమైంది. హృదయ దఘ్నమైంది కాదు, ఆత్మోపగమ్యం కాదు. కాబట్టి వివేకం తెచ్చుకొని వర్తించు అనేది వేమన్న సందేశం.

**సతుల వలపు జూచి యతులు మోహింతురు**
**లోకనిందకెల్ల లోనుగాను**
**పిట్టదొరికినపుడు పిల్లికి కుశలమౌ**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఏం సన్యాసులండీ వీళ్లు! లోకంలో జితేంద్రియులమని ఊరేగుతారు. పతివ్రతలను మోహించి వెంటబడతారు. సమాజంలో అప్రతిష్టకు కూడ జంకరు గమనిస్తే చిన్న పక్షి లభించినా పట్టుకొని భక్షించి సంతోషపడే పిల్లిలాగుంది వీరి వరస అని కుహనా సన్యాసులను ఈసడించుకుంటున్నాడు వేమన.

రెండు ముఖాలు గల యతులను వేమన చాలాసార్లు విమర్శించాడు. ఆ పరంపరలో ఈ పద్యమొకటి. "ఆశలుడిగినట్టి అయ్యలు గలరకో!" అన్నాడు వేమన్నే మరోచోట. ఆ 'అయ్యలు' ఇట్లాంటివారే.

*"ఆశాపాశము కడున్ నిడుపు లేదంతంబు రాజేంద్ర! వా*
*రాశి ప్రావృత మేది నీ వలయము...." అని భాగవత పద్యం*

ఈ ఆశ స్త్రీ యొక్క ఆకర్షణను బట్టి కూడా ఉంటుంది. సంకుసాల నృసింహకవి 'కవికర్ణరసాయనము' లో "యతి విటుడు గాక పోవుటెట్లు అస్మదీయ కావ్య కలన" అని సవాలు చేశాడు. అలాగే "బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి" అని లోకోక్తి. అంటే ఎంతటి పండితుడైనా ఇంద్రియాలకు వశుడు కావల్సిందే అని అర్థం. ఇంద్రియాలను జయించానని చెప్పుకునే వాడికైనా సరే ఈ చిత్త చాంచల్యం సహజంగా కనిపిస్తుంది.

వలపు అంటే ఇష్టం, మోహం – "చిలువ సుధారసాధరల చెల్వపు పుక్కిటి తావి దియ్యనై వలపుల నంది" అని ప్రయోగం. 'లోనుగాను' అంటే లోబడినప్పటికీ అని. అంటే లోకనిందల పాలైనా లెక్క చెయ్యడని అర్థం. కుశలం అంటే క్షేమమే కాని ఇక్కడ సంతోషం. పిల్లిది గ్రసనం అంటే భక్షణం, యతికి వ్యసనం. రెండూ ఆకలే.

వేమన లోకంలోని మానవ ప్రవత్తిని ఆపోసన పట్టాడనటానికి ఈ పద్యం నిదర్శనం.

**సిగ్గటంచునుండు సిగ్గు యెచ్చోనుండు**
**ఆకలనుచు నుండు ఆకలేడ**
**దాగియుండు నెన్న దాగినచో నుండు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

సిగ్గు సిగ్గు అంటారు. దాని స్థావరమేమిటి? ఆకలి ఆకలి అంటారు. అది దేని నుంచి పుడుతుంది? ఇవి రెండూ మరుగున వుంటాయి; యోగానుభవంతో వాటి తత్వాన్ని తెలుసుకోవడం ఉత్తమం అంటున్నాడు వేమన.

సిగ్గు అంటే తెలియనిదెవరికి, సిగ్గులేనివారికి తప్ప. సిగ్గు అంటే లజ్జ, వ్రీడ, త్రస అనే అర్థాలున్నాయి. అలాగే కన్నడంలో లజ్జె, తమిళంలో ఇలచ్చై. మనస్సంకోచం కూడా సిగ్గే. మందాక్షమని కూడా అంటారు. అంటే సగం మూతపడ్డ కళ్లు అన్నమాట. నిజంగా సిగ్గుపడేవారికి కళ్లు విప్పారవు కదా! ఇంతకూ మనుషులకు కలిగే సిగ్గు దైహికమా? మనోజన్యమా? ఇది దేహధారికి పుట్టిన భావమే అయినా మనోజన్యమే. వస్తుతః సిగ్గు లేదు అది నువ్వు కల్పించుకున్నదే. అహంభావం, పరువులాంటి వాటిని అణచుకున్నప్పుడే లజ్జారాహిత్యం సాధ్యమై జ్ఞానస్థితికి చేరుకోవడం జరుగుతుంది.

ఇక ఆకలి. ఇది జీవలక్షణం. క్షుత్తు, బుభూక్షా అంటారు సంస్కృతంలో. బుభుక్ష అంటే తినాలనే కోరిక. తినాలని బుద్ధి కలిగించేది క్షుత్. ఆకలి అంటే తినవలసిన అవసరం ఇది దైహికం.

మనిషి సిగ్గు, ఆకలికి బద్ధుడు. కాని యోగనిద్రాస్థితికి చేరుకున్నవాడికి ఇవి నశిస్తాయి. ఇవి నీలో దాగివున్నంతవరకు ముక్తి లేదు. ఇవి ఆత్మలో లీనమైనప్పుడే ముక్తి లభిస్తుంది అని సారాంశం. వేమన దిగంబరయోగిగా ప్రసిద్ధుడు. కొందరికి ఆయన అలా ఉండటం ఇష్టం వుండదు. తమ పరువును ఆయనకు వస్త్రంగా కప్పటానికి ప్రయత్నం చేస్తారు. 'మొదల బట్టలేదు తుదనులేదు' అని వేమన్నే స్వయంగా అన్నా వారు వినరు. ఒక తురీయ స్థితికి చేరుకున్న వాడికి ఇవన్నీ పట్టవు. ఈ పద్యంలో కూడా వేమన్న దానినే సెలవిస్తున్నాడు.

**సిద్ధులైన వారి చిత్తము రంజిల్లు**
**ఒడలు మెరుగు లెక్కకిడరుగాన**
**పనసపండు ఘనత పైనేమి గలదురా!**
**విశ్వదాభిరామ వినురవేమ.**

ఆధ్యాత్మిక పరిపూర్ణత్వం పొందిన వారు నిత్యసంతోషులై వుంటారు. అందుకే వారు శరీరం పైన దృష్టి పెట్టకున్నా ఏదో వింత కాంతి వారిలో ఆవరించి వుంటుంది. పనస పండు పైకి పెలుసుగా కనిపించినా లోపలి తొనలు తియ్యగా ఉండవా! అట్లాగే సిద్ధులు కూడా.

ఇంతకూ సిద్ధులంటే ఎవరు? యోగబలం చేత మానవాతీత శక్తిని పొందినవారు సిద్ధులు. వీరుపైకి మిరుమిట్లు గొలిపే దేహాకర్షణతో ఉండకపోవచ్చు. కాని లోపల పరమానందభరితులైవుంటారు. ప్రేమ మూర్తులై వుంటారు. దీనిని గమనించిన వారికే వారు అర్థమౌతారు. వేమన అట్లాంటివాడు.

ఒడలు అంటే శరీరం. కన్నడంలో ఒడల్, ఒడంబి, ఒడండె, పొట్ట అని కూడా. తమిళంలో ఉటల్, మలయాళంలో ఉటల. ఒడలి చూపుల రేడు అంటే ఒడలి నిండా కళ్లుగల రాజు అంటే ఇంద్రుడు. ఒడలెత్తు అంటే జన్మించడం.

మెరుగులెక్కకిడరు. మెరుగులు+ఎక్కక విడువరు. ఎక్కక అంటే ఎక్కునందాక. సిద్ధులు శరీర ప్రదర్శనపైన మనసు పెట్టకున్నా వారిలో ఒక రకమైన తేజస్సు వుంటుంది. వారి యోగశక్తి వల్ల ఓజస్సు మెదడును చేరి స్థిరంగా ప్రకాశిస్తుంది. ఓజస్సు అంటే జీవశక్తి. ఎక్కడం అనేది మట్టి భాష. నీ మనసు కెక్కిందా అంటే అర్థమైందా అని. సిద్ధులు, తమలోని జీవకాంతి శరీరానికి సోకేదాకా వదిలిపెట్టరు అని తాత్పర్యం.

సిద్ధి అంటే నెరవేరడం, వాంఛితప్రాప్తి. ఇష్టసిద్ధి, అభీష్టసిద్ధి, మంత్రసిద్ధి ఇట్లాంటివి. సిద్ధుల విషయంలో సిద్ధి అంటే మోక్షం.

సిద్ధుడిని పనసపండుతో పోల్చడం వేమన కవితాశక్తికి నిదర్శనం. ఏమిటి పనస ప్రత్యేకత? ఇది మామూలు పండు కాదు? సంయుక్తఫలం అంటే ఫలాల యొక్క సముదాయం. మామూలుగా అయితే పుష్పం ఒక అండాశయం నుండి ఫలదీకరణం చెంది ఫలంగా మారుతుంది. పనస విషయంలో ఒకే పుష్పంలో అనేక అండాశయాలుండి అది సంయుక్తఫలంగా మారుతుంది. పనసకు పైన ముళ్లుంటాయి గాని లోపల మధురాతి మధురమైన తొనలుంటాయి. సీతాఫలం కూడా సంయుక్త ఫలమే. సిద్ధి అంటే నిష్పత్తి అనే అర్థం కూడా వుంది. ఎన్ని కలిస్తే ఒక సిద్ధి! ఎన్ని ఫలిస్తే ఒక పనస! ఈ పోలిక అమోఘం. 'ఉపమావేమస్య' అని అనాలనిపిస్తుంది.

**సుతుల చేత పుణ్య సుఖము పొందుదమని**
**మనుజుడుండు కర్మమతము దగిలి**
**ఏనుగు పడియున్న ఎత్తునా మశకంబు?**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కొడుకులు పుడితే తండ్రికి సద్గతులు లభిస్తాయని ఒక నమ్మకం. వేమన దీనిని భ్రమగా కొట్టి పారేస్తున్నాడు. తన కర్మల వల్లనే తనకు ఫలంగాని కొడుకులు వచ్చి దానిని మారుస్తారనేది అజ్ఞానం. ఇది ఎలా వుంటుందంటే బొందలో పడ్డ ఏనుగును చిన్న దోమ బయటికి లాగుతుందని భావించినట్టు.

సుతుల్లేక గతుల్లేవు అని వాడుక. కాని అన్ని సార్లూ అది నిజం కాదు. మమకారాలు ముక్తికి ఆటంకమవుతాయి, తెలుసుకొమ్మంటున్నాడు వేమన.

పున్నామ నరకంలో పడకుండా తండ్రిని కాపాడుతాడు కాబట్టి పుత్రుడు అన్నారు. 'పున్నామోనరకాద్య స్మాత్పితరం త్రాయతే సుతః! తస్మాత్పుత్ర ఇతి ప్రోక్తః'. 'పుత్తు' అనేది ఒక నరకం పేరు. కొడుకులు లేనివారికి సంభవించే నరకం. కూతుళ్లు పుట్టినా లాభం లేదన్నమాట. ఎంత అవివేకం!

ఇదేకాక రకరకాల నరకాలున్నాయి. వాటి సంఖ్య 21. వాటిపేర్లు చిత్తగించండి. తామిస్రం, లోహశంకువు, మహానిరయం, శాల్మలి, రౌరవం, కుంభలం, పూతిమృత్తికం, కాలసూత్రం, సంఘాతం, లోహితోదయ, సవిషం, సంప్రపాతనం, మహానరకం, కాకోలం, సంజీవనం, మహాపథం, అవీచి, అంధతామిస్రం, కుంభీపాకం, అసిపత్రవనం, తాపసం; తామిస్రం చీకటి నరకం, కాలసూత్రం ఇనుపతీగల నరకం, రౌరవం, కుంభీపాకం అతి భయంకరమైన నరకాలు. ఇవన్నీ మనిషి పుట్టుకకు సంబంధించిన నరకాలు. నరకయాతనల గురించి చెప్పి భయపెడితేనైనా మనిషి తప్పులు చెయ్యకుండా వుంటాడని ఒక ఆశ. కాని గౌరవనీయ మానవుడు వింటాడా? పై నరకాల్లో పున్నామ నరకం లేకపోవడం విశేషం.

ఆ కాలానికే వేమన ఎంత ప్రగతిశీలంగా ఆలోచించాడో ఈ పద్యం వల్ల తెలుస్తుంది. పుత్రులు ఏమిటయ్యా పుత్రికలు సరిపోరా అని ధ్వనిస్తున్నాడా? వివక్షను ఖండిస్తున్నాడా?

'కర్మమతం దగిలి' అంటే కర్మబద్ధుడై వుండి అని. మశకం అంటే దోమ. ఏనుగంత నువ్వే నిన్ను ఉద్ధరించుకోలేకపోతే దోమల్లా పుట్టిన కొడుకులు ఎలా ఉద్ధరిస్తారు అని చురక పెడుతున్నాడు వేమన.

**సుతులు సతులు మాయ సుఖ దుఃఖములు మాయ**
**సంసృతియును మాయ జాలిమాయ**
**మాయబ్రతుకు కింత మాయ గల్పిస్తివి**
**విశ్వదాభిరామ వినురవేమ.**

పిల్లలు, భార్య అనేబాంధవ్యాలు అస్థిరమైనవి. సుఖ దుఃఖాల్లాంటి ద్వంద్వాలు భ్రాంతి మూలకమైనవి. సంసారం మోసపూరితమైనది. ప్రేమ చంచలమైనది. జీవితమే అశాశ్వతమైనప్పుడు దానికోసం ఇన్ని మాయలు సృష్టించావేమి దేవుడా! అని ఆశ్చర్యపడుతున్నాడు వేమన.

'మాయ' అనే చేటలో పోసి జీవితాన్ని తూర్పారపడుతున్నాడు వేమన. కేవలం భౌతిక దృష్టి మీద బాంబు వేస్తున్నాడు. మాయే ఆ బాంబు. ఇంతకూ మాయ అంటే ఏమిటి? 'మీయతే అనయా ఇతి మాయా' అంటే దేని ద్వారా వస్తువులు కొలువ బడతాయో అది మాయ. అంటే లౌకిక ప్రమాణాలు. అయితే మాయకానిదేది? జగత్తు మాయాకార్యం కాబట్టి సత్యం కాదు. మరి సత్యమేది? సత్యం బ్రహ్మమే. వేమన బ్రహ్మన్నే అడుగుతున్నాడు. 'నువ్వు మాయకు అతీతుడివై లోకులను మాయలో ముంచుతున్నావేమిటి' అని అంటున్నాడు.

మాయ అంటే నిజంకానిది, లేనిది. ఆ నిజాన్ని చూడాలంటే తోలు కళ్లతో కాదు యోగదృష్టితో చూడాలి. అలా చూడాలంటే అజ్ఞానం, అహంకారాల అడ్డు తొలగిపోవాలి. పరస్పర విరుద్ధ రూపాలతో కనిపించే మాయ. వైరుధ్యాలు తొలగిపోతే మాయ కూడా పోతుంది అని సారాంశం.

'సుతులు, సతులు మాయ' అంటే వరస మారిందేమిటి? ముందు సతులు కదా! రెండూ ఒకే కుటుంబవ్యవస్థలోనివి. దోషం లేదు. 'సతులు, సుతులు' అంటూ వేమన్న మరోచోట వాడాడు. సంసృతి అంటే ప్రపంచం. ఇక్కడ సంసారం. జనన మరణ పరంపర, ప్రవాహం, స్వభావం అనేవి విస్తృతార్థాలు. మూడోపాదానికి సి.పి.బ్రౌన్ 'సంసరణము మాయ జాల్వమాయ' అనే పాఠాంతరాన్ని పేర్కొన్నాడు. సంసరణం అంటే భౌతిక జీవితం. జనన మరణాల చక్రం, రాచబాట అని అర్థాలు. జాల్వ అంటే ఏమిటి? 'జాళువా' అనేది వాడుక రూపంలో ఇలా మారి వుంటుంది. జాళువా అంటే బంగారం. జాలి అంటే దయ, కనికరం, కరుణ అని ప్రసిద్ధార్థాలు ఉన్నా వంత, దుఃఖం, కోరిక, కష్టం, శ్రమ, విచారం, ఆలోచన లాంటి ఛాయలు అనేకం వున్నాయి.

జీవితం శాశ్వతమని అహంకరించకు. తాత్త్వికదృష్టితో చూస్తే అంతా అర్థమౌతుంది. దానివల్ల శాంతి లభిస్తుంది అని వేమన్న ఉవాచ.

మాయ బతుకు కింత మాయ గల్పిస్తివి!

'సుఖదుఃఖములు మాయ సొమ్ము మాయ (డి. 1723, 1056) 'మాయ గెల్చువాడు మర్మజ్ఞుడగు *యోగి'* మాయ తనువు మాయ (డి. 1721–251) అనేవి పాఠాంతరాలు.

**స్వానుభూతి లేక శాస్త్ర వాసనలచే**
**సంశయంబు చెడదు సాధకునకు**
**చిత్రదీపమునను చీకటి చెడనట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ.**

ఆత్మీయ అనుభవం లేకుండా కేవలం తత్వశాస్త్ర గ్రంథాలు చదువుకుంటే సందేహనివృత్తి జరుగుతుందా? ఎవరికి? సాధకుడికి. సాధకుడు అంటే సాధింపదలచిన వాడు, యోగసాధకుడు మొదలైనవారు. ఇదెట్లా ఉంటుందంటే దీపం బొమ్మగీసి చీకటి పోగొట్టదలిచినట్టు. దీనివల్ల చీకటిపోతుందా? పోదు.

అనుభూతి అంటే అనుభవించబడినది అంటే అనుభవగోచరమైనది. దీనికి ఛాయా రూపాలుగా అనుభోగం, ఉపభోగం, ఉపలంభం, పరిభోగం, సంవేదన, స్వాదనం అనే అర్థాలున్నాయి. స్వానుభూతి అంటే సొంత అనుభవజనితమైన ముద్ర. శాస్త్రమంటే వేదాంత శాస్త్రమొక్కటే కాదు. ధర్మ, శిల్ప, అలంకార, సూప, నీతి, గణిత, యోగ శాస్త్రాలున్నాయి. వాసన అంటే గతంలో అనుభవించిన దాని స్మరణం. Recollection from the memory అనొచ్చు. పూర్వ జన్మవాసన అంటారు గదా అలా. 'ఉదరార్భక జన్మ ధురీణ వాసనల్' అని ప్రయోగం. సంశయం అంటే అనుమానం అని కూడా వుంది. ఇక్కడ స్పష్టత ఏర్పడితే తప్ప సంశయం పోయినట్టు కాదు అని తాత్పర్యం.

'అనుభవమే శాస్త్రం మాటలే మంత్రాలు' అనేది సామెత. సంశయం మిగలని స్పష్టత రావాలంటే, సత్యం వెలగాలంటే అనుభవం కావాలి. శాస్త్రజ్ఞానం మంచిదే. కాని అది చాలదు. ఆ జ్ఞానం అనుభవాన్ని బేరీజు వేసుకోడానికి తోడ్పడుతుంది. పైగా శాస్త్రం 'ఇది చెయ్యాలి ఇది చెయ్యొద్దు' అని చెప్తుంది. దానిని గుడ్డిగా అనుసరిస్తే ఎలా? అనుభవాన్ని ఆశ్రయించకుండా శాస్త్రాలమీదే ఆధారపడటంఎలా వుంటుందంటే వెలుతురుకోసం చిత్రం ముందుపెట్టుకోవటం లాంటిది. 'చిత్రదీపం' ఎంత గొప్పగా అన్నాడు వేమన! అంటే కాగితంపైన, పటంలోగాని చిత్రించబడ్డ దీపరూపం అన్నమాట. అది చిత్రదీపమే గాని వాస్తవ దీపం కాదు. అనుభవాన్ని నమ్ముకో, అసలు సత్యం తెలుసుకో అని వేమన్న ప్రబోధం.

**స్థిరముగాని క్షుద్ర పరకూటముల జేసి**
**హెచ్చుతగ్గునొంది హీనమతులు**
**గాడ్దె పిల్లలగుచు గ్రక్కున చెడుదురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

వారు అల్పమైన బుద్ధిగలవారు. అందుకే అశాశ్వతమైన తుచ్ఛమైన పరస్త్రీ శృంగారాన్ని కోరుకొని కిందమీదౌతుంటారు. వారు కోమలమైన గాడిదె పిల్లల్లాంటి వారు. అడ్డమైన పనులవల్ల గాడిదల కోమలత్వం తొందరలోనే మాసిపోదా, అట్లాగే వీరు కూడా అంటున్నాడు వేమన.

స్థిరం కానిది అంటే చంచలమైంది, ఎక్కువ కాలం ఉండనిది అని అర్థం. క్షుద్రమైన అంటే అల్పమైంది, తక్కువ స్థాయిదని. పరకూటమి అంటే పరాయి స్త్రీతో సంగమమని. పర అంటే తనది కానిది, అంటే ఇతరుని భార్య కావచ్చు. కూటమి అంటే కూడిక, కలయిక అని అర్థాలు. రతి అని కూడ. "పేరండము *బోలె వేడి ఘటియింపదె నాకిటువంటి కూటమినిన్*" అని ప్రయోగం. పరకూటమి అంటే రంకు, వ్యభిచారం అని. కూటసాక్ష్యం అంటే దొంగ సాక్ష్యం. 'హెచ్చుతగ్గునొంది' అంటే చిన్నస్థాయిలోనే చెయ్యగూడని పెద్దపనులు చేసి తగ్గిపోవడమన్నమాట! తగ్గిపోవడమంటే కృశించిపోవడం.

మరి ఇటువంటి వారిని గాడిద పిల్లలతో పోలుస్తున్నాడేమిటి వేమన? ఎందుకంటే గాడిదలు పసితనంలో ముద్దుగా ఉంటాయి. "గాడిద పిల్ల కోమలీకం" అని లోకోక్తి. కూటమి వయస్సు రాకముందే రతికోసం ప్రయత్నాలు చేసే పసిగాడిదలు త్వరలోనే వసివాడిపోతాయి. సాధారణంగా జంతువులకు వావివరసలుండవు. గాడిద చాకిరి అంటారు. అంటే ఎక్కువ చాకిరీచేసి దిక్కుమాలిన చావు చచ్చే గాడిదలు తరచుగా కనపడుతుంటాయి.

లోకంలో గాడిద, కాకి, గుడ్లగూబలను చెడు సంప్రదాయాలప్పుడు పేర్కొంటారు. శాస్త్రీయం కాకపోవచ్చుగాని లోకంలో అలాంటి విశ్వాసాలు ఎందుకో ఏర్పడ్డాయి.

ఈ పద్యంలో క్షుద్ర అనే మాట వాడటం వల్ల క్షుద్రవిద్యల పరంగా కూడా చెప్పుకోవచ్చు. అలాగే కూటమి అనే మాట వల్ల తాంత్రిక బృందాలు స్ఫురించవచ్చు. కాపాలికం, శాక్తేయం వంటివి వేమన్న మనసులో ఉన్నాయేమో తెలియదు.

"హెచ్చుతగ్గ నొంది తుచ్ఛమతులు (డ.1773-1-278)" అనేది పాఠాంతరం.

**స్త్రీల మాయచేత చిక్కితా కొన్నాళ్లు**
**తగులు గోరునట్లు తగిలిపోవు**
**తనిసి పొలిసి తాను దైవంబుచే చెడు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

అతడు మూర్ఖుడు. కొన్నాళ్లపాటు స్త్రీల వలలో పడ్డాడు. వారితో సంబంధాలు పెట్టుకొని కోరికల్లో చిక్కుబడి పోయ్యాడు. చివరకు చాలు చాలు అయిపోయి ఫలితంగా ముదిమి వయస్సులో. నాశనమయ్యాడు. అతనికి కావలసిన శిక్షను దేవుడే విధించాడు. కర్మఫలమంటే ఇదే! ఎందుకివన్నీ ముందే బుద్ధి ఉండాలంటున్నాడు వేమన.

మాయ అంటే మోసం, కపటం గారడి అని అర్థాలు. ఇక్కడ అద్వైతమాయ కాదు. లౌకికమాయే. అయితే జీవుణ్ణి బంధించే పాశాల్లో దీనిని కూడా చేర్చుకోవచ్చు. మోసగించే స్త్రీని మాయలాడి అంటారు. 'మాయచేత' అంటున్నాడు. చేత అనేది తృతీయా విభక్తి ప్రత్యయం. ఇది కర్తృ, కరణాద్యర్థాల్లో ఉపయోగించబడుతుంది. కాని వేమన్న చేతను షష్ఠ్యర్థంలో వాడినట్టు కనిపిస్తుంది. తగులు అంటే వెంటబడటం, కోరునట్లు అంటే తాను కోరుకున్న విధంగా అని. తగిలిపోవు అంటే బయటికి రాలేక చిక్కుబడిపోవడం. కొన్నాళ్లు అన్నాడుగాని ఈ భాగోతం చాన్నాళ్లదాకా సాగింది. తనిసి అంటే తృప్తి పడటమే గాని ఇక్కడ ఎక్కువయ్యిందని. పొలిసి అంటే చావడం, నిర్మూలమైపోవడం. ఇక్కడ వృద్ధాప్యం, తదనంతర పరిణామం అని ధ్వని.

ఈ పద్యంలో తగులు, తనియు, పొలిసి అనేవి అచ్చమైన దేశీయ పదాలు. తనియు అనేది మూల ద్రావిడంలో తణ్. కన్నడంలో, తమిళంలో తణి, అలాగే పొలిసి అనేది మూలద్రావిడంలో పొల్. కన్నడంలో పొన్ను, మలయాళంలో పొలిచ్చిర్.

స్త్రీలోలత్వం పర్యవసానం దారుణంగా వుంటుందని వేమన్న హెచ్చరిక.

"గతులు గలిగి మమత కలుగుగాక, తగులు విడుచువాడె దైవాది మూలమౌ (డి.1723-135, డి.1735-135) అనేవి పాఠాంతరాలు.

**స్త్రీల సుఖము జూచి చిత్తంబు నిలుకడ**
**సేయని మనుజుండు చెడు నిజంబు**
**యేటి గట్టు మాను కెప్పుడు చలనంబు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

స్త్రీలతో భోగ జీవితానికి మరిగి మనస్సు స్థిరంగా లేని మనిషి తప్పకుండా చెడిపోతాడు. ఎట్లా? ఎట్లాగంటే యేటి ఒడ్డున ఉండే చెట్టు ఎప్పుడూ గాలికి కదిలిపోతున్నట్టు.

స్త్రీల సుఖం అంటే స్త్రీలయొక్క అనికాదు. స్త్రీ సంబంధంమైన అని. చూచి అంటే అనుభవించి అని అర్థం. చిత్తం అనేమాట ఎందుకు వాడాడంటే నిరోధం లేని చిత్తవృత్తివల్ల నిలకడను కోల్పోతాడని. చెడు అంటే నాశనమౌతాడని. 'వాసి చెడిన వాడు' అంటే కీర్తి కోల్పోయినవాడు, సంశయం చెడును అంటే సందేహనివృత్తి జరిగినవాడని, కన్నులు చెడినవాడు అంటే కళ్లుపోయిన వాడు అని. నిజంబు అంటే తప్పకుండా అని, చెడిపోవడం తథ్యమని.

'యేటి గట్టు మానుకెప్పుడు చలనంబు" ఎంత మంచి ఉపమానం! స్త్రీల పైన లగ్నమైన మనస్సు ఎట్లా అస్థిరమో యేటిగట్టున మానూ అంతే. మొక్క కాదు. మాను అంటున్నాడు. మాను అంటే పెద్దచెట్టు, కాండము కలది. యేటి ఒడ్డున మాను ఎందుకు కదులుతుందంటే నిర్నిరోధమైన విశాలావరణం వల్ల. గాలి ధారాళంగా వీయటం వల్ల. తడిగాలి వల్ల పులకిస్తుందేమో కూడా.

స్త్రీ లౌల్యంతో బతుకును నాశనం చేసుకోవద్దనేది సారాంశం.

**స్త్రీలు గల్గుచోట చెల్లాటములు గలుగు**
**స్త్రీలు లేని చోట చిన్నబోవు**
**స్త్రీల చేత నరులు చిక్కుచున్నారయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**

స్త్రీలు పాల్గొనే సందడుల్లో తగవులు పుడతాయా? పుడతాయంటున్నాడు వేమన. అట్లాని స్త్రీలు లేకపోతే ఎలా? స్త్రీలు లేని సమావేశాల్లో శోభ కొరవడుతుంది. మొత్తం మీద స్త్రీల కారణంగా పురుషులు ఏదోవిధంగా క్రమబద్ధులౌతున్నారు.

స్త్రీల ప్రమేయం ఉన్నచోట వాదాలు ఈర్ష్యలు, శంకలు పుడతాయని కొందరు పురుషుల అభిప్రాయం. చిక్కులొస్తాయని కొందరి భయం. స్త్రీలు లేకపోతే చిక్కులొస్తాయని కొందరి భయం. స్త్రీలు లేకపోతే ఎలా? వారు లేకపోతే అందం లేదు, ఆనందం లేదు, నిండుతనం లోపిస్తుంది. ప్రేమతత్వం వికసించదు. కార్య సాఫల్యానికి ప్రేరణ స్త్రీ అని మరికొందరి భావం. ఈ రెండూ పురుషుల అభిప్రాయాలేనా? స్త్రీలవి కూడానా? స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నినాదం పురుషుల కుట్ర అని స్త్రీ చైతన్యవాదుల అవగాహన. ఇట్లాంటి పరిస్థితులు 'అతి' జరిగినప్పుడే కలుగుతాయని విచక్షణ లోపించినప్పుడే ఇట్లాంటి తీర్పులు వెలువడతాయి. ఆ కారణంగా ఈ పద్యానికి పరిమితి ఉంది. 17వ శతాబ్దానికి చెందిన వేమన నుండి ఇంతకన్నా ఉదార భావాలు ఆశించటం చారిత్రకంగా సాధ్యమయ్యేపని కాదు. పైగా వేమన ఆధ్యాత్మిక చైతన్యంలో స్త్రీ పురుషుని ముక్తి సాధనకు అడ్డు. తమలపాకులో సున్నం వాడకం అనివార్యం, కాని దానిలో సున్నం ఎక్కువైతే ప్రమాదం. తక్కువైతే మజా లేదు. వివిధ ద్రవ్యాల సమతౌల్యంతోనే నోరు పండుతుంది.

చెల్లాటానికి  చెర్లాటం అనే రూపం కూడా వుంది. చెలగాటం కూడా ఇట్లాంటిదే. చిన్నబోవు అంటే కళావిహీనంగా మారటం–

ఈ పద్యం పురుషుని పరంగా అలవాటైన భావజాలానికి సంబంధించింది. స్త్రీ పరంగా విచికిత్సకు దారితీసేది.

స్త్రీల జూచి మరచు చిన్మయ యోగంబు' (డి.1723–134)

స్త్రీల కొరకు నరులు చిక్కుచున్నారయా (డి.1773–24) అనేవి పాఠాంతరాలు.

**స్థూలము కనుగుడ్డు సూక్ష్మంబు కనుపాప**
**కంటి పాప నుండు కారణంబు**
**కారణమున బ్రహ్మకళ నెరుంగవలెను**
**విశ్వదాభిరామ వినురవేమ.**

కంటి గుడ్డు పెద్దది. కంటి పాప చిన్నది. కాని చూడటంలో కంటి పాపదే కీలకపాత్ర. అదేవిధంగా భ్రుకుటి (కనుబొమల మధ్యప్రదేశం)లో ఉండే జ్ఞాన నేత్రంలోని కనుపాపతో బ్రహ్మ స్వరూపాన్ని దర్శించవచ్చు. అని యోగసాధన పద్ధతిని వివరిస్తున్నాడు వేమన.

ఎదుటి దృశ్యాన్ని చూసేది కనుగుడ్డు. చూడటంలో తోడ్పడేది కనుపాప. మానవుని చర్మచక్షువులకు సంబంధించిన శాస్త్ర పరిజ్ఞానమంతా వేమన్నకు తెలుసునంటే ఆశ్చర్యం వేస్తుంది. అంతే కాదు దాని ఆధారంగా ఆధ్మాత్మికమైన జ్ఞాననేత్రానికి దానిని అన్వయించటం.

ముందు మన కన్ను సంగతి చూద్దాం. కన్ను ఎలా చూస్తుంది? దేన్ని చూస్తుంది? ఎలాగంటే కంటి పాప ఒక వస్తువుపైన పడ్డ వెలుగు కిరణాలను స్వీకరించి నరపు పొర (Retina) కు పంపిస్తుంది. దీని నుంచి దృశ్య సంబంధి నరానికి (optic nerve) వెళ్తుంది. ఇది అతి సన్నటి నరాల సంపుటితో ఏర్పటి ఉంటుంది. ఇది తనకందిన సమాచారాన్ని మెదడుకు పంపిస్తుంది. మెదడు దానిని విశ్లేషించి కనుగుడ్డుకు విశ్లేషిత సమాచారాన్ని చేరవేస్తుంది. అప్పుడు కనుగుడ్డు ఎదుటివస్తువును చూస్తుంది. కనుగుడ్డు అంటే చూపే. కనుగుడ్డు దేనిని చూస్తుంది? ఎదుటి వస్తువును లేదా దృశ్యాన్ని. అంటే దాని రంగూ, పరిమాణం, తనకూ దానికీ మధ్యన దూరం ఇవన్నీ కనుగుడ్డు చూస్తుంది. కనుగుడ్డు కార్యం అయితే కనుపాప కారణం. కారణం అంటే జరగటానికి మూలమైంది అన్నమాట! అందుకే 'కనుపాప కరవైన కనులెందుకో' అన్నాడో కవి. పారమార్థికంగా కారణమంటే పరమాత్మ. కంటిపాపలోని కనీనికలో ఒక జ్యోతి వుంది అదే మోక్షసాధకం. ఆ జ్యోతి సాయంతో నిశ్చల చిత్తంతో గనుక చూస్తే బ్రహ్మం దర్శనమౌతుంది అని తాత్పర్యం.

ఇంతకీ కళ ఏమిటి? బ్రహ్మకళ అంటున్నాడు వేమన. కళ అంటే విడిగా గాని, సమిష్టిగా గాని వ్యక్తమయ్యే శక్తి సంకేతం. కళలు ఐదు రకాలు. పంచభూతాలే ఆ కళలు. ఇవి నాదం నుండి ఉద్భవించాయి. నాదమంటే ఏమిటి? నాదమంటే స్వయంగా ధ్వనించేది. శబ్దం యొక్క సూక్ష్మరూపం. సత్యాన్ని వ్యక్తం చేసే ధ్వని విశేషం. పరబ్రహ్మంతో

కూడి ప్రకాశం, విమర్శా ఈ రెండూ స్పష్టం కావడానికి ప్రారంభించిన స్థితే నాదమంటే! ఇది పూర్తిగా ఉచ్చరించటానికి సాధ్యం కాని ధ్వని రూపం. ఓంకారాన్ని ఉచ్చరించిన తరువాత కలిసిపొయ్యే అతి సూక్ష్మమైన శబ్దప్రవాహమే నాదం. బ్రహ్మకళ అంటే బ్రహ్మస్వరూపం.

వేమన జ్ఞాన మార్గపద్యాల్లో తరళ రత్నం లాంటి పద్యమిది. నిర్మలయోగంతో జ్ఞాననేత్రం ద్వారా జ్యోతిని దర్శించాలనేది సారాంశం.

..... సూక్ష్మంబు కన్నాప (డి.1721-88);.... కన్నాపలోనిది (డి.1725, 1015) స్థూలము కనురెప్ప.... (డి.1769, 110) అనేవి పాఠాంతరాలు.

**హీనుడెన్ని విద్య లిల నభ్యసించిన**
**ఘనుడుగాడు హీనజనుడె గాని**
**పరిమళముల గార్ధభము మోయ ఘనమౌనె**
**విశ్వదాభిరామ వినురవేమ.**

బుద్ధిహీనుడైనవాడు ఎన్ని విద్యలు నేర్చినా అతడి అల్పత్వం పోయి గొప్పవాడవుతాడా? ఎక్కడైనా పరిమళద్రవ్యాల మూటలు మోసే గాడిద ప్రశస్థమైన జంతువుగా మారుతుందా? అంటున్నాడు వేమన.

సంస్కారం లేనిచోట చదువు ప్రభావం శూన్యం అంటున్నాడు వేమన. అతడెన్నో విద్యలు నేర్చాడు. శాస్త్రాలు చదివాడు. ఆ విద్యల వల్ల అతడి మనస్తత్వం ఏమాత్రం మారలేదు. ఎందుకంటే అతని స్వభావంలోనే నీచత్వం వుంది. మధ్యలో తెచ్చిపెట్టుకున్న తొడుగులవల్ల అతని మౌలిక స్వరూపం మారదనేది సారాంశం.

హీనుడు అంటే తక్కువవాడు, తుచ్ఛుడు, వర్జితుడు అని అర్థాలు. ఘనుడు అంటే గొప్పవాడు. పరిమళములు అంటే సువాసనలు వెదజల్లే ద్రవ్యాలు. ఇలాచీ, లవంగాలు, జాజికాయ, జాపత్రి, జాఫ్రాన్ మొదలైనవి సుగంధ ద్రవ్యాలు. గాడిద సదరు ద్రవ్యాలమూటమోసినంతమాత్రాన వాటి సుగంధం దాని కంటుతుందా? 'గదేకో జాఫ్రాన్ కా క్యా సువాద్' (స్వాద్) అని ఉర్దూలో సామెత. గాడిదకు జాఫ్రాన్ రుచి ఏం తెలుస్తుంది? అని. జాఫ్రాన్ అంటే కుంకుమపువ్వు. స్వాద్ అంటే రుచి, సువాసన. మధ్య ప్రాచ్యదేశాల్లో ఇప్పటికీ పరిమళద్రవ్యాలను గాడిదలే మోస్తాయి. "గార్ధభము మోయగజమానె" (డి.1735, 344) అనే పాఠం కూడా వుంది. ఏనుగును మదజల సౌరభానికి అన్వయించి కవితాపరంగా వ్యాఖ్యానించవచ్చుగాని ఇక్కడ గార్ధభపరమైన అర్థమే వాస్తవికంగా వుంది. గార్ధభాలుంటాయి, అవి కుంకుమపువ్వును మోసుకొస్తాయి గాని దాని సౌరభం వాటికి తెలియదు.

ఆచరణకు రాని విద్య మెదడుకు భారమే గాడిద మోతలాగ. చతుర్వేద సకల శాస్త్రపారంగతుడికి మానవతాదృష్టి, సరసతా లేకపోతే ఆ వైదుష్యాలన్నీ దండుగే అంటున్నాడు వేమన.

**హృదయమందు నున్న యీశుని తెలియక**
**శిలలకెల్ల మ్రొక్కు జీవులార!**
**శిలలనేమి యుండు జీవులందే కాక**
**విశ్వదాభిరామ వినురవేమ.**

మీలోనే నివసిస్తున్న భగవంతున్ని గుర్తించక బయట వున్న విగ్రహాలను పూజిస్తారేమిటి? చైతన్యపూరితమైన ప్రాణుల్లోనే గాని నిర్జీవమైన రాతిప్రతిమల్లో ఇంతకన్న గొప్ప దేవుడుంటాడా అని నిలదీస్తున్నాడు వేమన.

విగ్రహారాధనను ఖండించే పద్యమిది. దేవుడు నిరాకారుడు, అంటే ఆకృతి లేనివాడు. ఈ ఆకృతులన్నీ మనిషి కల్పించుకున్నవే. నిరాకారుని దర్శించటానికి కావలిసిన ఆధ్యాత్మిక స్థాయి అందరికీ ఉండదు. ఆత్మసాక్షాత్కారం పొందిన వారికే ఇది సాధ్యం. ద్వైతం, అద్వైతాల్లో కూడా ఇదే తంతు. భావనలో అద్వైతి అయినవాడు ఆచరణలో ద్వైతి. అద్వైతమనేది ఒక నిరూపమైన మహా మీమాంస. అందరూ శంకరాచార్యుల స్థాయికి ఎదగలేరుకదా! కాబట్టి సామాన్యులకు ఏకాగ్రత రావాలంటే రూపం అనివార్యం.

అయితే వేమన పద్యంలో విగ్రహారాధనను త్రోసి రాజంటున్న సందర్భం వేరు. పరాత్పరుడిని మనసులో ప్రతిష్టించుకోకుండా కేవలం ప్రతిమలపైన ఆధారపడటం అవివేకం అని వేమన్న సారాంశం. శిలలో ప్రతిరూపాలు మాత్రమే, అసలు రూపాలు కాదు అని తాత్పర్యం. ధ్యానం వల్ల, యోగ నిద్రవల్ల, దర్శనం వల్ల నీకు సాక్షాత్కరించేదే నిజమైన దైవం. విగ్రహం ముందు నిలబడి కళ్ళు మూసుకుంటావేమి? ఎందుకంటే నీలోకి చూసుకోడానికి. విగ్రహం ఒక సాధనం మాత్రమే, అది గమ్యం కాదు. బాహ్యము నందు, భావములోన అన్నప్పుడు భావమే నీ పరమగమ్యం అంటున్నాడు వేమన.

హృదయానికి హృత్ అనేది ధాతువు. హృత్తు అనే దానిలో వుండేది హృదయం. మనసు, స్వాంతం, మానసం ఇవన్నీ హృదయానికి పర్యాయపదాలే. కాని లోకంలో మనసు ఆలోచించేదని, హృదయం స్పందించేది అనే అర్థాల్లో వాడుతారు. ఈశుడు అంటే శివుడని కూడా. లింగరూపుడైన శివుడికీ విగ్రహాలు తప్పలేదు. కాకపోతే లింగమూ రూపమే. కాకపోతే ప్రతీక. విచిత్రమేమిటంటే విగ్రహారాధన వద్దన్న వేమన్నకు విగ్రహాలను పెట్టలేదా మనం? బుద్ధుడి విషయంలోనూ అంతే!

# పద్యార్థ పదసూచి


| | పుట సంఖ్య |
|---|---|
| జ్ఞానం | *1, 66, 121* |
| దైన్యం | *2* |
| ముక్తి | *3, 16, 22* |
| తత్త్వం | *4,116* |
| చెడ్డపనులు | *6* |
| తీర్థయాత్రలు | *7,34,125,198,280,314* |
| వేశ్య | *8, 163* |
| యజ్ఞయాగాదులు | *10* |
| రాజులు | *11* |
| కృషి | *12* |
| మదం | *13, 120* |
| అతి | *14* |
| అపాత్రదానం | *15* |
| అప్పు | *17, 171, 342* |
| కల్లలు | *18* |
| దాత | *19,179* |
| దానగుణం | *20, 103* |
| పిసినారి | *21, 51, 71, 336, 363* |
| ఆడంబరం | *24* |
| ఆచారం | *25* |
| అదృష్టం | *26* |
| కాయసిద్ధి | *27* |
| క్రూరుడు | *28* |
| ఆశలు | *29* |
| భక్తి | *30,180* |
| నిర్మలత్వం | *31* |
| దాంపత్యం | *32* |
| లోకరీతి | *35* |
| సత్యం | *36* |

| | పుట సంఖ్య |
|---|---|
| ఆర్తవిద్యలు | *37* |
| కర్మకాండలు | *38* |
| దాయాదులు | *39* |
| ఆశ | *29,40,41,44,89,113,316,317* |
| గురువు | *42, 142* |
| ఆసనాలు | *45* |
| చెడ్డహాస్యం | *47* |
| అన్నదానం | *48* |
| ఇనుపకచ్చడం | *49* |
| వ్యభిచారం | *50* |
| స్త్రీవ్యామోహం | *52,53,99,169,464, 479, 488, 489* |
| పతిభక్తి | *54* |
| ఇంద్రియాలు | *55* |
| కుటుంబం | *56* |
| దానం | *57* |
| మనస్తాపం | *58* |
| కార్యసాధకుడు | *59* |
| కర్మఫలం | *60, 88* |
| రసవాదం | *62* |
| అంతర్ముఖం | *64, 146* |
| పరోపకారం | *67, 129* |
| వంశోద్ధారకుడు | *68* |
| వేషధారి | *70* |
| పుణ్యపురుషులు | *72* |
| రసవాదం | *74* |
| పరమయోగి | *75* |
| ఉసురు | *76* |
| కొండవీడు | *78* |

| | |
|---|---|
| లోకసంచారం | 80 |
| వైష్ణవం | 81 |
| జాతి | 83, 230 |
| యోగనిద్ర | 84 |
| పరమతత్త్వం | 85 |
| చింత | 86 |
| స్వభావం | 87, 173, 297 |
| మూర్ఖుడు | 90,96,98,284 |
| పంజుసేవ | 91 |
| ఎరుక | 92, 94 |
| శివపూజ | 93 |
| యజమాని | 97 |
| నిజస్వరూపం | 100 |
| లోభి | 101, 108, 158, 195 |
| పుణ్యం | 102 |
| దొంగ గురువు | 104, 253 |
| బాగోగులు | 105 |
| తొత్తు | 106 |
| భోగవాంఛ | 107 |
| వీరశైవం | 109 |
| కుండలిని | 111 |
| కళవళపాటు | 114 |
| సంయమనం | 115 |
| విశిష్టాద్వైతం | 117 |
| సంపద | 118 |
| మమకారం | 119 |
| కోరిక | 122 |
| కామనిగ్రహం | 123 |
| మోహం | 124 |
| ఆత్మజ్యోతి | 126 |
| కలిమిలేములు | 127 |
| విత్తహీనుడు | 128 |
| వరశుల్కం | 130 |
| జ్ఞానమార్గం | 131 |
| అరిషడ్వర్గాలు | 132 |
| జన్మరహస్యం | 134 |
| గ్రామకర్త | 136 |
| తమోగుణం | 138 |
| అష్టసిద్ధులు | 139 |
| తిండి | 140 |
| విటుడు | 143 |
| దైవాధీనం | 144 |
| స్థలశుద్ధి | 147 |
| కరణం | 148 |
| మోక్షకామి | 150 |
| కాలచక్రం | 151 |
| మద్యపానం | 153 |
| కాశీయాత్ర | 154 |
| పరమార్థం | 156 |
| అనారోగ్యం | 157 |
| జంగం | 159 |
| వేషధారి | 160 |
| నడపీనుగ | 161 |
| మాత్సర్యం | 162 |
| అధర్మరాజు | 164 |
| కుల,వర్గాలు | 166 |
| రంకు చదువు | 167 |
| వర్ణవ్యవస్థ | 168 |
| ఉపవాసం | 170 |
| పేదరికం | 172 |
| కుంటెనకాడు | 174 |
| కొండెగాడు | 175 |
| త్రిగుణాలు | 176 |
| స్వైరిణి | 177 |

| | |
|---|---|
| క్రోధం | 178 |
| గండికోట | 181 |
| కర్మబంధాలు | 182 |
| అస్థిరం | 183 |
| జ్ఞానదీపం | 184 |
| ఈడు | 185 |
| పంచభూతాలు | 186 |
| విద్య | 188 |
| గుణహీనుడు | 189 |
| గుణవంతురాలు | 190 |
| మంత్రోపదేశం | 191 |
| అచలగురువు | 192 |
| శివయోగి | 193 |
| నల్లమలకొండలు | 194 |
| మోహం | 196 |
| చపలచిత్తులు | 199 |
| అజ్ఞానం | 201 |
| పుత్రుడు | 202 |
| మరణరాహిత్యం | 204 |
| ప్రాణం | 205 |
| ఆవృత్తం | 206 |
| షణ్మతాలు | 207 |
| ఆశాపాశం | 208 |
| బయలు | 210 |
| దాలిగుంట | 211 |
| జీవాత్మ | 212 |
| బుద్ధిచెప్పుట | 214 |
| అవసానదశ | 215 |
| బలిమి | 216 |
| ఆత్మజ్ఞానం | 217 |
| నిత్యుడు | 218 |
| ప్రాప్తం | 219 |
| సృష్టి | 220 |
| సంతానం | 221 |
| ఇల్లు | 222 |
| సంసారవృక్షం | 223 |
| మార్మికపద్యం | 224 |
| దేవుడు | 225 |
| తెగులు | 226 |
| మేలుకీడులు | 227 |
| స్వయంప్రకాశం | 228 |
| వలపు | 229 |
| జాతిభేదం | 231 |
| జీవహింస | 232 |
| జీవం | 233 |
| భావిజనులు | 234 |
| లింగారాధన | 235 |
| అస్థిరం | 236 |
| వసుదేవుడు | 237 |
| సాధ్వి | 238 |
| సహస్రారం | 239 |
| తత్త్వజ్ఞానం | 240 |
| తత్త్వనిర్ణయం | 241 |
| చక్కిలం | 243 |
| దోషబుద్ధి | 244 |
| శాంతిమార్గం | 245 |
| కన్యాదానం | 246 |
| భ్రాంతి | 247 |
| పుణ్యఫలం | 248 |
| సొమ్ము | 249 |
| చక్రాంకితాలు | 250 |
| దొంగవేదాంతి | 251 |
| జీవతత్త్వం | 252 |
| మిత్తికూడు | 254 |

| | |
|---|---|
| తప్పులు | 255 |
| దివ్యజ్ఞానం | 256 |
| ధర్మం | 257 |
| కళలు | 258 |
| రాపిడి | 260 |
| యాచకులు | 261 |
| పాతకములు | 262 |
| దిగంబరత్వం | 264 |
| కార్యవశం | 265 |
| తల్లి | 266 |
| తాటికల్లు | 268 |
| దిష్టిబొమ్మ | 269 |
| గుడ్డిగుర్రం | 270 |
| తామసం | 272 |
| తారకం | 273 |
| వలస | 274 |
| స్థితప్రజ్ఞుడు | 276 |
| కాంతాకనకాలు | 278 |
| అపాత్రులు | 282 |
| విరహం | 283 |
| దృశ్యానుభూతి | 285 |
| పొందు | 286 |
| గండ్యాలు | 287 |
| విగ్రహారాధన, | 288, 439, 494 |
| ధనరాహిత్యం | 289, 290 |
| ధనములేమి | 291 |
| ధర్మకంటకుడు | 292 |
| యముడు | 293 |
| తారకయోగం | 294 |
| కర్మజీవి | 295 |
| భాగ్యం | 296 |
| రాజయోగం | 298 |
| దండుగ | 299 |
| రోగి | 300 |
| పరమాత్మ | 301 |
| గతి | 302 |
| కల్లగురువు | 303 |
| కల్లయోగి | 304 |
| ఇంద్రజాలికుడు | 305 |
| రంకులాడి | 306 |
| దాంభికుడు | 307 |
| వేదబాహ్యుడు | 308 |
| మహాత్ముడు | 309 |
| మాయ | 310 |
| ప్రమాణం | 311 |
| శుద్ధి ప్రక్రియ | 312 |
| విభ్రాంతి | 313 |
| స్థానబలిమి | 315 |
| దేహచింత | 317 |
| నెలవు | 318 |
| వార్తకాడు | 319 |
| దేశీయవైద్యం | 320 |
| ఉత్తమ పురుషుడు | 322 |
| ఉత్తమయోగి | 323 |
| నిర్మోహి | 324 |
| కామమోహితులు | 325 |
| రాజులతో చనువు | 327 |
| పట్టుగొమ్మ | 328 |
| పట్టుదల | 329 |
| రూపవతి | 330 |
| చెలిమాట | 331 |
| అంతరార్థం | 332 |
| స్త్రీ హృదయం | 333 |
| బొమ్మగుడ్డు | 336 |

| | |
|---|---|
| కఠినచిత్తుడు | 337 |
| లేమి | 338 |
| పిరికివాడు | 339 |
| పరమహంస | 340 |
| స్పర్శవేది | 341 |
| బ్రహ్మజ్ఞుడు | 343 |
| దర్శనములు | 344 |
| ప్రాణమూలం | 345 |
| రాజనీతి | 346 |
| రాచరిక సంక్షోభం | 347 |
| సందర్భం | 348 |
| పాపపుణ్యాలు | 350 |
| అప్రమత్తం | 351 |
| మోహి | 352 |
| అపనిందలు | 354 |
| అతీంద్రియజ్ఞానం | 355 |
| పరులసొమ్ము | 356 |
| పరమహంస | 357 |
| కుటిలుడు | 359 |
| క్షీరపదార్థాలు | 360 |
| పితృదేవతలు | 361 |
| ప్రాజ్ఞుడు | 362 |
| పాత్రత | 364 |
| దుఃఖం | 365 |
| దిగంబరుడు. | 366 |
| వార్తకెక్కు | 367 |
| సాలెపురుగు | 368 |
| పాపచింత | 370 |
| నరకం | 371 |
| కల్లయోగి | 373 |
| పృథివి | 375 |
| గుణం | 376 |
| పూతగడ్డి | 377 |
| దాలిరాయి | 378 |
| పూర్వజన్మ | 379 |
| పూర్వవాసనలు | 380 |
| అపకారం | 381 |
| ముచ్చుపొద్దు | 382 |
| పెద్దలవచనములు | 383 |
| సర్వేశుడు | 384 |
| కుక్కతోక | 385 |
| పరమయోగి | 386 |
| చెలమ | 387 |
| ఆత్మలింగం | 388 |
| బడుగు | 389 |
| అంజనం | 390 |
| పరుసవేది | 391 |
| కుత్సితుడు | 392 |
| భస్మం | 393 |
| ప్రజల ఉసురు | 394 |
| శ్రమము | 396 |
| పుణ్యపురుషులు | 397 |
| ధర్మం | 398 |
| జిహ్వాచాపల్యం | 399 |
| కష్టులు | 400 |
| పరమాత్మ | 401 |
| ఆకాశం | 402 |
| యోని | 403 |
| మక్కాయాత్ర | 404 |
| మతభేదాలు | 406 |
| మూఢుడు | 408 |
| మోక్షపదము | 409 |
| ఘటం | 410 |
| మట్టి | 411 |

| | |
|---|---|
| ఖననం | 412 |
| మనసు దిద్దుట | 413 |
| ప్రియవచనములు | 414 |
| ఏకాగ్రత | 415 |
| త్రికరణశుద్ధి | 416 |
| మర్యాద సంసారి | 418 |
| ధర్మాగ్రహం | 419 |
| మాలకర్మ | 420 |
| సారం | 421 |
| బట్టబయలు | 423 |
| విచక్షణ | 424 |
| పెరదైవతములు | 425 |
| మరపు | 426 |
| భావం | 427 |
| వేదాంతం | 429 |
| నిరుపయోగం | 430 |
| వ్యామోహం | 431 |
| జ్ఞానవృక్షం | 432 |
| నిత్యమైన కీర్తి | 433 |
| యముడు | 435 |
| అల్పనరులు | 437 |
| బసవభక్తులు | 438 |
| కరుణ | 440 |
| మంచిచెడ్డలు | 442 |
| అమరిక | 443 |
| రోగి | 444 |
| వినాశకాలం | 445 |
| దరిద్రుడు | 446 |
| వలపు | 447 |
| ప్రేమశుద్ధి | 448 |
| గడుసురాలు | 449 |
| కలియుగం | 450 |
| మారకమ్మ | 451 |
| బ్రహ్మరాత | 452 |
| కంటిపాప | 453 |
| విశ్వకర్మ | 455 |
| ఓంకారం | 456 |
| మతవైరుధ్యాలు | 458 |
| సంస్కారం | 459, 493 |
| కరుణ | 461 |
| వ్యవసాయధర్మం | 462 |
| రాణింపు | 463 |
| చెడిపె కొడుకు | 465 |
| ఉచితజ్ఞుడు | 467 |
| శాంతమానసం | 468 |
| గుడ్డియెద్దు | 469 |
| శుక్రాచార్యుడు | 470 |
| సంప్రదాయాలు | 471 |
| బసివి | 473 |
| మంత్రజలం | 475 |
| మృత్యురహస్యం | 476 |
| పుత్రసంపద | 477 |
| సంసారయోగం | 478 |
| క్రుహనా సన్యాసులు | 480 |
| సిగ్గు | 481 |
| సిద్ధులు | 482 |
| కర్మబద్ధుడు | 483 |
| సంస్కృతి | 484 |
| చిత్రదీపం | 486 |
| క్షుద్రవిద్యలు | 487 |
| స్త్రీ ప్రాధాన్యం | 490 |
| జ్ఞాననేత్రం | 491 |



VEMANNA VELUGULU
A commentary on the Poetry of Vemana
by Dr. N.Gopi

## వేమనపై గోపి రచించిన
## ఇతర గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. వేమన్నవాదం | (1979) | వ్యాఖ్యానం, (8 మలి ముద్రణలు) |
| 2. ప్రజాకవి వేమన | (1980) | పిహెచ్.డి సిద్ధాంతగ్రంథం, (5 మలిముద్రణలు) |
| 3. వ్యాసనవమి | (1986) | వ్యాససంపుటి |
| 4. వేమనపద్యాలు | (1990) | క్రీ.శ. 1730 నాటి పారిస్ ప్రతి. సముద్ధరణ, పరిష్కరణ, ప్రచురణ |